# పరదేశీ కథలు - 3

కథలు

– లలిత చిట్టే




శ్రీ కౌముది

మీ మునివేళ్ళలో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 222

కౌముది మాసపత్రికలో

ఏప్రిల్ 2019 సంచిక నుంచి డిసెంబర్ 2020 సంచిక వరకూ

వచ్చిన కథలు

## సమీరా ప్రేమకథ

**"మామా..(అమ్మా)** దయచేసి ఈ పెళ్ళికి ఒప్పుకో, తొందరగా బయటికిరా. నన్ను అమితంగా ప్రేమించే నా తల్లివి కదా! ఈ ఒక్కసారికి నా మాట విని నాకోరిక మన్నించు నువ్వు ఎంతో మంచిదానివి కదా" మోకాళ్ళపై కూర్చుని తల్లి ముఖాన్ని తన రెండు చేతులతో పట్టుకుని ప్రాధేయపడుతున్నాడు హసన్.

కోపంగా కొడుకు చేతుల్ని తోసివేసి తన ముఖాన్ని మరోవైపుకు త్రిప్పుకుంది మామా ఫాతిమా. కళ్ళల్లో సుడులు తిరిగే కన్నీరు కొడుక్కి కనిపించకూడదనుకుందేమో తలపైనున్న మేలిముసుగు ముఖం పైకి లాక్కుంది. "మామా నిన్ను బాధపెట్టి వుంటే క్షమించు. నీ అనుమతి లేకుండా ప్రేమించడం, పెళ్ళిచేసుకోవాలనుకోవడం నా తప్పే. నీ మాట విననందుకు నన్ను శిక్షించు కానీ ఇప్పుడు మాత్రం ఈ ఒక్కసారికి నా మాట విని బయటికిరా. అక్కడ అందరూ మనకోసమే ఎదురు చూస్తున్నారు.నిఖాకు సమయమైనదని ముల్లా తొందరపడుతున్నారు. అన్నీ కూడా సిద్ధంగా వున్నాయి. నువు పడకమీద నుండి లేచి బయటికి వస్తే పెళ్ళి సక్రమంగా జరుగుతుంది. లేకపోతే ఈ పెళ్ళి ఆగిపోతుంది. మామాంచి అమ్మవు కదా" అంటూ తల్లి గడ్డాన్ని పట్టుకుని బ్రతిమిలాడుతున్నాడు హసన్.

"ఏంరా నువ్వు చెప్పేది? ఆ హిందీ ఆడదాన్ని, ఇద్దరు పిల్లల తల్లిని, భర్త చనిపోయిన విధవరాలిని పెళ్ళి చేసుకోవాల్సిన ఖర్మ నీకేం పట్టిందిరా? నిన్ను ఎంతో గారాబంగా పెంచాను. నీకు ఇష్టమైన ప్రతి ఒక్కటి అందించి నీ కోరికను తీర్చాను. మన దేశపు కట్టడుల ప్రకారం డిగ్రీ చదివిన యువకులు విధిగా ఆర్మీలోకి వెళ్ళి నాలుగేళ్ళు దేశసేవ చేయాల్సి వచ్చింది కాబట్టి నా కొడుకు ఆర్మీలో ఎంత కష్టపడాలో, ఎన్ని బాధలు పడాలో అని భావించి నిన్ను దూరంగా కువైట్‌కి పంపించాను. నాలుగేళ్ళు అక్కడ తలదాచుకుని తిరిగి వస్తే తరువాత మా అన్న కూతురు జేనబ్‌ను ఇచ్చి అంగరంగ వైభోగంగా నీకు పెళ్ళి చేద్దామని ఆశలు పెట్టుకున్నాను. మరి నువ్వేం చేసావు? చెప్పాపెట్టకుండా ఒక హిందీ ఆడదాన్ని అందులో పిల్లల తల్లిని వెంటబెట్టుకుని మన ఇంటికి తీసుకొని వచ్చావు. నిన్ను నేను ఎలా క్షమించగలను?" ఆవేశంగా పలికింది మామా ఫాతిమా.

"మమ్మా నువ్వే నన్ను క్షమించకపోతే ఎలా? నువ్వు అన్నింటినీ ఒప్పుకుంటావనే ధైర్యంతోనే నేను సమీరాను మనదేశానికి తీసుకుని వచ్చాను. ఇపుడు నువ్వు కాదంటే అంతా వ్యర్థమైపోతుంది. దయచేసి పైకి లేచి రా" అంటూ తల్లి చేతిని పట్టుకున్నాడు హసన్.

అదే చేతితో కొడుకు చెంపపై ఛెళ్ళుమని కొట్టింది మామా ఫాతిమా. నిర్ఘాంతపోయాడు హసన్. పుట్టి బుద్దెరిగినప్పటినుండీ అమ్మ ప్రేమనే రుచి చూసాడుగానీ చెంపదెబ్బలు ఎన్నడూ తినలేదు. అమ్మకు అంత కోపం వస్తుందని ఎన్నడూ ఊహించనేలేదు. ఎంత ప్రాధేయపడినా కరగని తల్లి హృదయాన్ని తలచి చింతించాడు. అయినా తమాయించుకుని జరిగే కార్యక్రమాన్ని ఆపకూడదనే ఉద్దేశ్యంతో వెంటనే మామా ఫాతిమా కాళ్ళపై పడి తల్లి పాదాలను ముద్దులతో నింపుతూ - "మామా అల్లా నిన్ను దయచూస్తారు. నీ మనస్సుకు శాంతిని కలుగజేస్తాడు. నాపైన ఈ కాఠిన్యాన్ని తగ్గించుకుని దయజూపి బయటకురా. లేకపోతే ఇదిగో ఇలా చూడు ఈ కత్తితో నన్ను నేను పొడుచుకుని నీకళ్ళముందే ప్రాణాలు విడుస్తాను" అంటూ ఆవేశంగా ప్రక్కనే ఉన్న పళ్ళుకోసుకునే కత్తిని అందుకున్నాడు హసన్.

కొడుకు కత్తిని తీసుకోవడంతో భయపడిన మామా ఫాతిమా హృదయం కాస్త చలించింది. ఇక గత్యంతరం లేదనీ తను ఒప్పుకోకపోతే కొడుకు ఎంతటి అనర్ధానికైనా ఒడికడతాడని ఆమె భావించింది. కన్నీళ్ళు తుడుచుకుంటూ నల్లబడిన ముఖంపైకి ముసుగును లాక్కుంటూ పైకి లేచి బయట హాల్లోకి నడిచింది. అప్పటికే ఆ హాల్లో పెళ్ళికొడుకు కోసం ఎదురుచూస్తున్నవాళ్ళందరూ లోపల ఏం జరుగుతుందో అని ఊహిస్తూ గుసగుసలు చెప్పుకుంటున్నారు. వచ్చిన ఆహూతులందరికీ ఆ పెళ్ళి ఒక వింతగా ఉంది. తల్లి అలకమాని బయటకి రావడంతో హసన్ ముఖంలోకి వెలుగు వచ్చింది. సంతోషపడుతూ ముల్లా ఎదుటికి వచ్చి నిలబడ్డాడు. హాల్లో చేరివున్న బంధువులంతా ప్రక్కవారి చెవులు కొరుక్కుతింటున్నారు.

"ఇండియా పిల్లంట. అందుకే మామా ఫాతిమాకు ఈ పెళ్ళి ఇష్టంలేదంట అంటోంది ఎదురింటావిడ."

"అహ అదికాదు. ఇది ఇండియా పిల్లకాదు ఇండియా తల్లి అంట. అక్కడ భర్త చనిపోతే ఇద్దరు పిల్లల్ని వదిలి కువైట్‌కి వచ్చిందట. కువైట్‌లో హసన్‌ను బుట్టలో వేసుకుంది. వీడేమో తగుదునమ్మా అనుకుంటూ పిల్లల తల్లిని వెంటబెట్టుకుని కువైట్ నుండి మన ఈజిప్టు దేశానికి తీసుకుని వచ్చి పెళ్ళిచేసుకోవడానికి సిద్ధపడిపోయాడు. అన్నలు, అక్కలు ఒప్పుకున్నా తల్లి హృదయం బాధ పడుతుంది కదా! అందులో తమ్ముడి కూతురు జేనబ్‌ను హసన్‌కు ఇచ్చి పెళ్ళిచేయాలని ఎప్పటినుండో అనుకుంటున్నారు. మరి వీడు ఇండియాదాన్ని, పిల్లల తల్లిని ఏకంగా ఇంటికే తీసుకుని వచ్చి పెళ్ళిచేసుకుంటున్నాడు. పిదపకాలం పిదపబుద్ధులు" మూతి తిప్పింది ప్రక్కింటావిడ.

"అయినా వీళ్ళకేం తక్కువని వీడిని కువైట్‌కి పంపించారు. కువైట్ వెళ్ళేసరికి కళ్ళు నెత్తిమీదకి వచ్చి తల్లిదండ్రుల్ని మరిచిపోతున్నారు ఈ కాలం పిల్లలు" అంది ఇంకో ఆవిడ.

"అయినా మనం అరబ్బులం కదా! మన జాతి ఎంత గొప్పది? మన దేవుడు ఎంత గొప్పవాడు. ఆ ఇండియావాళ్ళు ముక్కోటి దేవతలను పూజిస్తారంట వీడికి ఆ ఇండియా పిల్లే కావాల్సి వచ్చిందా" ఈసడించింది ఎదురింటావిడ.

"ష్. చిన్నగా మాట్లాడు. ఆ ఇండియా పిల్లది మన ఇస్లామ్ మతమేనంట. ఆ పిల్ల ముస్లిమ్ కావడంతో మిగతావాళ్ళు కష్టంగానే అయినా ఒప్పుకున్నారు" అంది ఇంకో ఆవిడ.

"ఓహో. అవునా అయితే సరే ఇక గొడవేమీ లేదులే. ఆ పిల్ల అల్లాను ఆరాధించి, ఖురాన్ చదువుతూ మన ఇస్లామ్ సంప్రదాయాల్ని పాటిస్తే మామా ఫాతిమా హృదయం కూడా తొందరలో కరిగిపోతుందిలే " అంది ఒక ముసలావిడ.

మరోవైపు వివాహపు తంతు జరిగిపోతోంది. ప్రక్కనే భోజనపు ఏర్పాట్లు చేయబడ్డాయి.

ఇంతలో అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చింది ఇరవైరెండేళ్ళ పిల్ల. ఆ హాల్ లోపలికి అడుగుపెట్టి ఒక్క క్షణం నిలబడి చుట్టూ చూసి అక్కడి పరిస్థితిని గమనించింది.

వెంటనే పళ్ళు కొరుకుతూ కోపంతో ముందుకు పరిగెత్తుకుని వచ్చి అక్కడే ఆ హాల్లో మూలగా మేలి ముసుగులో పెళ్ళికూతురిగా కూర్చుని వున్న సమీరా దగ్గరికి చేరుకుంది. బలంకొద్దీ కుడిచెయ్యిని ఎత్తి సమీరా చెంపపై ఛెళ్ళుమని కొట్టింది. అందరూ నిర్ఘాంతపోయారు. ఆమెను పట్టుకుని వారించేలోగా సమీరా రెండు చెంపలనూ వాయించేసింది. ఆ దెబ్బలతో కళ్ళు తిరిగిపోయాయి సమీరాకు. ముందుగా తేరుకున్నది హసనే. వెంటనే ముందుకెళ్ళి ఆ పిల్ల చేతుల్ని పట్టి వెనక్కి లాగాడు.

"హసన్ చిన్నప్పటినుండీ నీపైనే ఆశలు పెట్టుకుని ఉన్నాను. నిన్నే నా భర్తగా ఎంచి జీవితాన్ని నిర్మించుకున్నాను. నా ఆశలని కూల్చివేయకు. దాని బదులు నన్ను పెళ్ళి చేసుకో. నువ్వు ఈ ఇండియా దాన్ని చేసుకుంటే నేను బ్రతకను. ఈ క్షణమే చచ్చిపోతాను" అంటూ రోదించసాగింది ఆ పిల్ల.

"ఆపిల్లే జేనబ్. మామా ఫాతిమా అన్నకూతురు. పుట్టినప్పటినుండీ హసన్‌కు పెళ్ళాం అని పేరు పెట్టేసారు. ఈ పిచ్చిది వీడిపై ఎన్నో ఆశలు పెంచుకుని కలలు కంటోంది. కానీ వీడు ఇండియాదాన్ని ఇంటికే తీసుకొచ్చి ఇంతపని చేసాడు" నిట్టూర్చింది ఒక పెద్దావిడ.

మామా ఫాతిమా తన కుర్చీలోంచి లేచి వచ్చి జేనబ్‌ను పొదవిపట్టుకుని బుజ్జగించసాగింది. "ఏడవకు జేనబ్. నీకంటే ఎక్కువగా నాకు బాధగా వుంది. కానీ ఏం చేద్దాం చెప్పు? వాడి నుదుటన ఆ దరిద్రపుది రాసి పెట్టబడి ఉంది. బంగారపుబొమ్మలా వున్న నిన్నుకాదని వయసులో ఐదేళ్ళు పెద్దది, ఇద్దరు పిల్లల తల్లి అయిన ఆ హిందీదాన్ని వాడు చేసుకుంటున్నాడు. రెండేళ్ళుపోతే ఆ మోజు తీరిపోతుంది. నువ్వు గట్టిమనసు చేసుకో. అల్లా దయచూసి నీకు హసన్ కంటే యోగ్యుడైన మొగుడ్ని జత చేస్తాడు" అంది మామా ఫాతిమా.

"లే.. మాయబి (నాకువద్దు) నాకు హసన్ బావేకావాలి. లేకపోతే నేను చచ్చిపోతాను" తలబాదుకోసాగింది ఆ పిల్ల. కొద్దిమంది ఆడవాళ్ళు పట్టుకుని బలవంతంగా ఆ పిల్లను అక్కడినుండి బయటికి తీసుకుని వెళ్ళారు. చూస్తున్న అందరి హృదయాలు భారమైపోయాయి. సమీరా ఇంకా ఆ షాక్‌లో నుండి తేరుకోలేకపోతోంది.

ముల్లా ఖురాన్ చదివి వినిపిస్తుంటే నిఖా పత్రాలపై హసన్, సమీరాలు సంతకాలు పెట్టి పెళ్ళి అయింది అనిపించారు.

జరిగిన సంఘటనలతో చాలా బాధపడిపోతున్నాడు హసన్. సమీరా ముఖం చూడలేనట్లుగా తలవంచుకునే తిరుగుతున్నాడు. ఇక్కడ ఈజిప్టులోని తన ఇంట్లో ఇన్ని అడ్డంకులు ఎదురవుతాయని అతడు ఊహించలేదు. ఇంతమంది బాధపడతారని తెలిసివుంటే అక్కడే కువైట్‌లోనే నిఖా చేసుకుని వుండేవాడినికదా అనుకుంటున్నాడు హసన్.

సమీరాను బాధపెట్టానేమో అని హసన్ కుమిలిపోతుంటే మరొకవైపు హసన్‌కు నావలన ఇంత బాధ కలిగిందే అని సమీరా బాధపడుతోంది.

ఇంతలో హసన్ వాళ్ళ అన్న కూతురు పధ్నాలుగేళ్ళ హనాన్ సమీరా దగ్గరికి వచ్చి కూర్చుని "ఆంటీ బాధపడుతున్నావా? అని అడిగింది.

"లేదు" అన్నట్లుగా తల అడ్డంగా ఊపింది సమీరా

"బాధపడకు అంతా మంచే జరుగుతుందిలే. సరే కానీ. మా చిన్నాన్న హసన్, నువు కువైట్‌లో ప్రేమలో ఎలా పడ్డారో, మొదట ఎక్కడ కలిసారో ఏం మాట్లాడుకున్నారో నాకు చెప్పవా ప్లీజ్?" అని అడిగింది ఆపిల్ల సమీరా చేతిని పట్టుకుంటూ.

ఆ యింట్లో తనతో మాట్లాడేవాళ్ళు కనిపించడంతో కాస్త ఊరట చెందింది సమీరా. అలాగే అంటూ తమ ప్రేమ కథను గుర్తుచేసుకుంటూ మాటల్లో చెప్పడం మొదలుపెట్టింది సమీరా. శ్రద్ధగా వినసాగింది హనాన్.

"మేముండే ప్రాంతాన్ని సాల్మియా అంటారు. అక్కడ సెంటర్‌లో కబాబ్ రెస్టారెంటు ఒకటి ఉంది. దానిలో మీ చిన్నాన్న అకౌంటెంటుగా పనిచేస్తున్నాడు. దానికి ఎదురుగా ఉన్న బిల్డింగ్‌లోని బ్యూటీపార్లర్‌లో నేను పనిచేస్తున్నాను. ఎపుడైనా పనిలేనపుడు బయటి బాల్కనీలోకి వచ్చి గాలిపీల్చుకుందామని నిలబడితే ఎదురుగా వున్న రెస్టారెంట్‌లోనుండి నావైపే చూస్తూ హసన్ కనిపించేవాడు. ఇదేంటి ఇతనికి పనేమీలేదా? బయటికి వస్తే చాలు నావైపే చూస్తుంటాడు అని విసుక్కునేదాన్ని. ఒకరోజు కబాబ్ కొనుక్కుందామని ఎదురుగా వున్న ఆ రెస్టారెంట్‌లోకి వెళ్ళాను. నన్ను చూసిన వెంటనే కుర్చీలోనుండి లేచి పరిగెత్తుకుని వచ్చి సమీరా సులోనెచ్ (బావున్నావా?) అని సంతోషంగా పలకరించాడు. నేను జవాబు ఏమీ ఇవ్వకుండా ముఖం చిట్లించుకుని కబాబ్ కొనుక్కుని తిరిగి వచ్చేసాను. నా ప్రవర్తనతో

హసన్ ముఖం చిన్నబోయింది. అయినా నావైపు చూడటం మానలేదు. ఈ సమయంలో నా వీసాకు రెండేళ్ళు గడువు ముగియడంతో మరలా రెన్యువల్ చేయించాల్సి వచ్చింది. మరో రెండేళ్ళు పొడిగించడానికి దాదాపు లక్షరూపాయలు (నాలుగువందల యాభై దినార్లు) చెల్లించాల్సివచ్చింది. బంధువు వరుసకు అన్న అయిన కరీం చేతికి పాస్‌పోర్టు, లక్షరూపాయల డబ్బు ఇచ్చి రెన్యువల్ చేయించమని చెప్పాను. వాడు అవన్నీ పట్టుకుని పారిపోయాడు. దాదాపు వారం రోజులు చూసి, వాడికి ఫోన్లు చేసి విసిగిపోయి, జవాబులేక ఏడ్వటం మొదలుపెట్టాను. డబ్బుతో పాటు పాస్‌పోర్టు పోవడంతో ఏం చేయాలో తోచలేదు. బయట బాల్కనీలో కూర్చుని ఏడుస్తూ వుండేదాన్ని. వీసా లేకపోతే కువైట్‌లో ఉండనివ్వరు. పోనీ మరలా లక్షరూపాయలు కూర్చుకుని వీసా చేయించుకుందామంటే అసలు పాస్‌పోర్టే వాడు తీసుకుని పారిపోయాడు. వాడు ఎక్కడ ఏ ఏరియాలో వుంటాడో నాకు తెలియదు. దీంతో చాలా దిగులుపడి ఏడుస్తూ కూర్చునేదాన్ని. ఒకరోజు అలా ఏడుస్తుంటే చూసిన హసన్ నా దగ్గరికి వచ్చేసాడు. 'హబీబ్తి (ప్రియమైనదానా) ఎందుకు ఏడుస్తున్నావు? ఏమయింది?' అని అడిగాడు.

'నీకెందుకు? తెలుసుకుని నువ్వేం చేస్తావు? నా బాధ నాది. నన్ను డిస్టర్బ్ చేయకు' అన్నాను కోపంగా.

అయినా అతడు వెళ్ళిపోలేదు. మోకాళ్ళమీద ఒంగి కూర్చుని 'నీ బాధ, నీ కష్టం నావి. సంగతి చెపితే అన్నీ చేస్తాను నన్ను నమ్ము' అన్నాడు.

ఎందుకో ఆ క్షణం అతడిమాటలకి హృదయం కరిగిపోయింది.

మా బంధువు వీసా వేయిస్తానని డబ్బు, పాస్‌పోర్టు తీసికెళ్ళాడని తరువాత అడ్రస్ లేడని విషయం చెప్పాను. నన్ను కొన్ని ప్రశ్నలు వేసి, మా బంధువు ఫోను నంబరు తీసుకుని 'నేను నీ డబ్బుతో, పాస్‌పోర్టుతో తిరిగి వస్తాను. నువు భయపడకు' అని చెప్పి వెళ్ళిపోయాడు. నేను అతడి మాటలు నమ్మలేదు.

రెండోరోజు నేను పనిలో బిజీగా వుండగా లోపలికి పరిగెత్తుకుని వచ్చి 'సమీరా తొందరగా బయటికిరా' అని పిలిచాడు. చేస్తున్న పని ఆపి నేను కంగారు పడుతూ బయటికి వచ్చాను. అక్కడ నాకు అన్న వరుస అయిన కరీం తలవంచుకుని నిలబడి ఉన్నాడు. వాడిని చూడగానే నాలో ఆవేశం పెల్లుబికి, కోపంగా దగ్గరికి వెళ్ళి 'నా డబ్బు, పాస్‌పోర్టు ఏవి?' అన్నాను.

'ఇదిగో నా దగ్గర వున్నాయి అయితే సగం డబ్బు వీడు తినేసాడు' అన్నాడు హసన్ తన చేతిలో పట్టుకుని చూపిస్తూ.

వెంటనే వాటిని హసన్ చేతిలోనుండి అందుకున్నాను.

'రేయ్ సమీరాకు క్షమాపణ చెప్పు. ఇంకెప్పుడూ ఇలా ఎవరినీ మోసం చేయనని చెప్పు.' ఆవేశంగా వాడి కాలర్ పట్టుకున్నాడు హసన్.

బంధువు అని నమ్మి డబ్బు అప్పగిస్తే నమ్మించి అలా పారిపోయి మోసం చేయడంతో అతడిమీద అసహ్యమేసింది. 'సమీరా నన్ను క్షమించు. ఇంకెపుడూ ఇలా చేయను. నన్ను పోలీసులకు అప్పగించవద్దని హసన్‌తో చెప్పు' అన్నాడు వాడు ప్రాధేయపడుతూ. వాడికి జవాబు చెప్పకుండా లోపలికి వెళ్ళిపోయాను నేను.

మరుసటిరోజు మరలా హసన్ నా దగ్గరికి వచ్చి 'సమీరా ఏదీ నీ పాస్‌పోర్టు ఇటివ్వు అన్నాడు.'

'ఎందుకు' అన్నాను.

'నేను నీకు వీసా వేయిస్తాను' అన్నాడు.

'ఎలా? నా దగ్గర ఇపుడు దానికి సరిపడా డబ్బులు కూడా లేవు అన్నాను దిగులుగా. నువ్వు నీ పాస్‌పోర్టు మాత్రం ఇలా ఇవ్వు. మిగిలింది నేను చూసుకుంటాను' అన్నాడు హసన్.

తిరిగి వచ్చిన ఆ సగం డబ్బులు, పాస్‌పోర్టు హసన్ చేతిలో పెట్టాను. డబ్బు నా చేతిలో వుంచి, పాస్‌పోర్టు మాత్రం తీసుకుని హడావిడిగా వెళ్ళిపోయాడు. కేవలం రెండురోజుల్లో రెండేళ్ళ అక్కామా (రెసిడెన్సీ) కొట్టించి పాస్‌పోర్టును నాకు తిరిగి ఇచ్చాడు. అతడు చేసిన పనికి ఆశ్చర్యంతో నాకు నోటిమాట రాలేదు. అతడు చేసిన సహాయానికి ఏవిధంగా ఋణం తీర్చుకోవాలో అర్థంకాలేదు.

'హసన్ ఎంత డబ్బు ఖర్చయింది?' అని అడిగాను. డబ్బుగురించి అడగకు ఇంకా ఏదైనా పనివుంటే చెప్పు చేస్తాను అన్నాడు నవ్వుతూ.

స్వచ్ఛమైన ఆ నవ్వు నా హృదయంలో నిండిపోయింది. ఆ రోజునుండి మేమిద్దరం మాట్లాడుకుంటూ స్నేహంగా వుండేవాళ్ళం.

నాలుగునెలలు గడిచాక ఒకరోజు పద మా దేశం వెళ్ళి పెళ్ళి చేసుకుందాం అన్నాడు.

'ఏంటీ పెళ్ళా? నాకా? ఇండియాలో ఇంటిదగ్గర ఇద్దరు పిల్లలు వున్నారు తెలుసా? ' అన్నాను.

'అన్నీ తెలుసు. తెలుసుకునే ముందుకు వచ్చాను' అన్నాడు.

'వయసులో నీకంటే నాలుగేళ్ళు పెద్దదాన్ని తెలుసా? ' అన్నాను.

'ఆ సంగతి కూడా తెలుసు. నీ పాస్‌పోర్టు ఆ విషయం తెలిపింది' అన్నాడు బదులుగా.

'నాక్కొంచెం సమయం ఇవ్వు హసన్. నేను ఆలోచించుకోవాలి. ' అన్నాను.

నో - కుదరదు. ఈ నెల ఆఖరులో మనిద్దరికీ ఈజిప్టుకు ఫ్లైట్ టిక్కెట్లు బుక్ చేసాను. పద అక్కడికి వెళ్ళి మా యింట్లో సంప్రదాయం ప్రకారం పెళ్ళిచేసుకుందాం' అన్నాడు హసన్.

'మన పెళ్ళికి మీవాళ్ళు ఒప్పుకుంటారా?' అన్నాను సందేహంగా.

'నేనంటే మా యింట్లో అందరికీ చాలా ఇష్టం. నా మాటను, ఇష్టాన్ని వాళ్ళు ఎన్నడూ కాదనలేదు. ఇపుడు కూడా కాదనరు' అన్నాడు నమ్మకంగా.

ఇక నేనేం మాట్లాడగలను? అప్పటికే హసన్‌పై ప్రేమను హృదయం నిండా నింపుకుని ఉన్నాను. అతడ్ని పొందడం కంటే అదృష్టం ఇంకోటి వుంటుందా?

'సరే' అన్నాను. ఇద్దరం కలిసి ఈజిప్టుకు వచ్చాం. తరువాత కథ నీకు తెలిసిందే" అంది సమీరా ఆ పిల్ల బుగ్గపై ముద్దుపెడుతూ.

"ఓ.. మీ ప్రేమకథ చాలా బాగుంది. మా నానమ్మ ఒక్కటే కాస్త కోపంగా వుంది. మేమందరమూ ఆమె కోపాన్ని చల్లార్చుతాం నువ్వేం వర్రీకాకు" అంది హనాన్ సమీరాకు ధైర్యం చెపుతూ.

నాలుగురోజుల తరువాత సమీరాతోపాటు కువైట్‌కు వచ్చేసాడు హసన్.

ఇద్దరూ ఇల్లు తీసుకుని కాపురం పెట్టారు. రోజులు గడుస్తున్నాయి కానీ మామా ఫాతిమా కోపం మాత్రం తగ్గలేదు. హసన్ తల్లి కోపాన్ని తలుచుకుని దిగులు పడేవాడు. నెలలు గడిచాయి. ఇంతలో సమీరా గర్భవతి అయింది. హసన్ సంతోషానికి అవధులు లేవు. ఈ విషయాన్ని ఈజిప్టుకు ఫోను చేసి చెప్పి ఆనందించాడు. ఈ వార్త విన్న తల్లి కాస్త మెత్తబడింది.

మరి కొద్ది నెలల్లో ముద్దులు మూటగట్టే మగపిల్లవాడికి జన్మనిచ్చింది సమీరా. కొడుకును చూసుకుని మురిసిపోయాడు హసన్. వెంటనే ఈజిప్టు వెళ్ళి కొడుకుని తల్లికి చూపించాలని ఆరాటపడ్డాడు. కానీ సమీరా కోలుకోవడానికి దాదాపు నెలరోజులు పట్టింది.

ఈజిప్టుకు వెళ్ళగానే కైరో ఎయిర్ పోర్టులో విమానం దిగి బయటికి రాగానే అక్కడ మనవడి కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్న మామా ఫాతిమా కనిపించింది. తల్లి హృదయంలోని ప్రేమను గుర్తించిన హసన్ నవ్వుకున్నాడు. సమీరా చేతుల్లోంచి మనవడ్ని తీసుకుని గుండెలకు హత్తుకుని చిరునవ్వు నవ్వింది మామా ఫాతిమా. దేశాలు వేరయితేనేం భాషలు వేరయితేనేం. ప్రేమకు ఇవేవీ అడ్డం కాదని నిరూపించారు హసన్, సమీరాలు.

## ''కడప రంగమ్మ - కాకినాడ కమలమ్మ'' కథ

**కువైట్ సిటీ.** వ్యాపార లావాదేవీలకు, శుక్రవారం సెలవురోజున పరదేశులు వచ్చి కలిసి కొనటానికి తగిన ప్రాంతం అది. దాని పేరు ''మాలియా'' శుక్రవారం మధ్యాహ్నం నాలుగ్గంటలకు అక్కడికి వచ్చి చూసినట్లయితే చీమల బారుల్లాగా జనాలు కనిపిస్తారు. ఇండియా, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, పాకిస్తాన్, ఫిలిప్పీన్ దేశాలవాళ్ళు అక్కడికి వస్తారు. కానీ ముఖ్యంగా చెప్పుకోవాల్సింది మన ఆంధ్రావాళ్ళ గురించి. కడప, తూర్పు పశ్చిమగోదావరి జిల్లాలనుండి సగం పైగా ప్రజలు ఇండియా విడిచి కువైటుకు వచ్చేసారంటే అతిశయోక్తికాదు. శుక్రవారం రోజున మాలియా అనే ఆ ప్రాంతం సిగరెట్ పొగలతోనూ, వక్కాకు ఎంగిళ్ళతోనూ, గుట్కా వాసనలతోనూ నిండివుంటుంది. వీసాలు అమ్ముకునేవాళ్ళు, వడ్డీలకి డబ్బులిచ్చి వసూలు చేసుకునేవాళ్ళు, బంధువుల్ని కలిసి పరామర్శించేవాళ్ళేకాక, అమ్మాయిలకు సైట్ కొడుతూ, కళ్ళతో వాళ్ళ అందాలను తాగేస్తూ వాళ్ళ శరీరాన్ని గూర్చి కామెంట్లు చేసుకుని నవ్వుకునే పోకిరిపిల్లగాళ్ళు కూడా అక్కడే ఉంటారు. ఆ రద్దీలో అటూ ఇటూ తిరుగుతూ ఆడవాళ్ళ వెంటపడుతూ సందు చూసుకుని వాళ్ళకి చేతులు భుజాలు తగిలించి ఆనందాన్ని పొందే మధ్యవయస్కులు మరికొందరు. వీరేకాక వయసు వచ్చినా వెకిలి చేష్టలు చావని కొందరు ముసలివాళ్ళు దారిలో ఒక ప్రక్కగా నిలబడి ఆడవాళ్ళవైపు చూసి నవ్వుతూ సైగలు చేస్తూ అసహ్యంగా ప్రవర్తిస్తుంటారు.

అలాంటి వీధిలో వ్యాపారస్తుల జీవిన విధానం, వారి జీవితాలు ఎలా వున్నాయో ఒకసారి మనం తొంగి చూసి తెలుసుకుందాం.

''ఒసే రంగిదానా నీ చేతులు పడిపోతాయే. ప్రతిరోజూ నీ షాపు ముందర చెత్తంతా నా షాపు ముందరికి చిమ్ముతున్నావే. నీకు బుద్ధి వుందంటనే. చెడిపోయినదానా. ఇంకోసారి నీ చెత్తంతా నా వాకిట్లోకి ఊడ్చావనుకో నీ సంగతి చెప్తా. మంచిగా చెపితే నీకు అర్థం కా వడంలేదు'' - రంగమ్మ షాపు ముందర నిలబడిన కమలమ్మ చేతులు త్రిప్పుతూ గట్టిగా కేకలు వేస్తూ రంగమ్మను తిట్టిపోస్తోంది.

అప్పుడే షాపు తెరిచి చీరలు, బట్టలు అలమారాల్లో సర్దుకుంటున్న రంగమ్మ కమలమ్మ తిట్లకి చేస్తున్న పని ఆపేసి బయటికి వచ్చింది.

రంగమ్మను చూసిన కమలమ్మ ఇంకా రెచ్చిపోయింది.

రంగమ్మేం తక్కువ తినలేదు. వాళ్ళిద్దరూ పోట్లాటకి దిగారంటే పందెంకోళ్ళలా కక్షతో కత్తిపట్టుకున్నట్టే కొట్లాడుకుంటారు.

''ఏమే పుచ్చిపోయిన మొహందానా.. చింపిరి జుట్టుదానా నీకు సిగ్గులేదంటనే పోరంబోకు దానా! ప్రొద్దున్నే నిద్రలేచి షాపులోకి రాంగానే నీకు కొట్లాట కావాలంటనే? ప్రతిదినమూ నాతో కొట్లాడందే నీకు నిద్దరరాదంటనే. ఇరవైనాలుగ్గంటలూ వీధిలో కూర్చుంటావు. నా షాపుకొచ్చే కష్టమర్లనందరినీ పిలిచి నీ షాపులోకి తీసుకుబోతావు. నా బేరాలు, వ్యాపారం జరక్కుండా దెబ్బతీస్తాండావు కదంటనే. నా

నోటికాడ కూడు తీస్తున్నావు గదనే. నీకు కూడు పుట్టదే. అడ్డదారుల్లో సంపాదించి అడ్డంగా బలిసిపోయినావు గదనే'' ఆ వీధిలో ఎదురుగా నిలబడి పోటీపడి తిడుతోంది రంగమ్మ.

''నువ్వేం తక్కువ తిన్నావంటనే కర్రిదానా.. వడ్డీలకు వడ్డీలు చక్రవడ్డీలు వేసి జనాల్ని పీడించి వడ్డీ వ్యాపారంలో పేదవాళ్ళ డబ్బంతా దోచుకున్నావు గదనే. కడపలో ఇల్లు మీద ఇల్లు కట్టి కులుకుతున్నావు గదనే.. పేదవాళ్ళ కడుపులు గొట్టి, వాళ్ళ పాస్‌పోర్టులు కుదువ బెట్టుకుని వేధించి, వాళ్ళని ఏడిపించి కనికరంలేకుండా వడ్డీలు వసూలు చేసి వాళ్ళ రక్తంతో కడుపుకు కూడు తింటున్నావు గదనే నీతిలేనిదానా. నా సంగతి మాట్లాడ్డానికి నీకెంత ధైర్యమే''

''ఎక్కువ మాట్లాడగాకే కిలాడిదానా! నీ బతుకు బయట పెట్టినానంటే సిగ్గుపడి చస్తావే. ఆ రాజంపేట భాషాతో నువు సాగించిన భాగోతం ఎవరికి తెలియదే. కువైటులో ఏ వీధిలోకి వెళ్ళినా నీ గురించే చెప్తారు. వాడిని వల్లో వేసుకుని వాడి డబ్బంతా ఊడ్చేసి వాడ్ని కువైటులో అప్పులు పాలు చేసింది నువు కాదా? వాడి పెళ్ళాం బిడ్డలు రాజం పేటలో తిండికి కూడా డబ్బులు లేక.. మొగుడు ఎందుకు డబ్బు పంపించడం లేదో, ఆరేళ్ళయినా ఎందుకు ఇంటికి రాలేదో అర్ధంకాక ఏడ్చి మొత్తుకుని ఇక్కడ నీ సంగతి తెలుసుకుని నీకు ఫోను చేసి తిట్టలేదా? 'నా మొగుడ్ని వదిలిపెట్టే, నీకు దణ్ణం పెడతాను, నా బిడ్డలు ఇక్కడ తిండి లేక అల్లాడి పోతున్నారే? తండ్రిని చూడాలని ఏడుస్తున్నారే. నీకు కూడా బిడ్డలు వున్నారు కదా నువు కూడా బిడ్డల్ని కన్న తల్లివేకదా, నా మొగుడి ని వదిలి పెట్టి ఇంటికి పంపించవే ' అని అది ప్రాధేయపడలేదా? నీ బ్రతుకు ఎవరికి తెలియదనుకుంటున్నావే? ఛీ నువు కాబట్టి బ్రతుకు తున్నావే. ఇంకెవరన్నా అయితే సిగ్గుతో అదుగో ఆ ఎదురుగా వున్న అరేబియా సముద్రంలో దూకి చచ్చేవాళ్ళు. నాతో కొట్లాడటానికి నీకు సిగ్గు ఉండాలి'' ఊపిరి పీల్చుకోవడానికి ఒక్క నిముషం ఆగింది రంగమ్మ.

వీళ్ళిద్దరి గొడవ విన్న ప్రక్క షాపుల వాళ్ళందరూ వినోదాన్ని చూడటానికి బయటకి వచ్చి నిలబడ్డారు. ఆ వీధిలోకి వచ్చిన కస్టమర్లు కూడా వీళ్ళిద్దరి పోట్లాటను చూస్తూ చుట్టూ అక్కడే నిలబడిపోయారు.

''నాల్రోజులకు ఒకసారి వీళ్ళ కొట్లాట లేకపోతే ఈ వీధిలో సందడే వుండదు మా అందరికీ. ఇదొక వినోదం'' అన్నాడు ప్రక్క షాపులోని రాజస్తానీ అతను నవ్వుతూ తన కస్టమరుతో. ఆ రాజస్తానీ అతను ఆ వీధిలో మొబైల్ షాపు పెట్టుకుని ఉన్నాడు. సెల్‌ఫోను కొనడానికి వచ్చిన ఆ కస్టమరు కూడా నవ్వుతూ ''ఆ ఆడవాళ్ళు ఇద్దరూ తెలుగు వాళ్ళే. మరి మీకు వాళ్ళ మాటలు ఎలా అర్ధ అవుతాయి?'' అని అడిగాడు.

''ఎందుకు అర్ధంకావు? తెలుగు నాకు చాలా బాగా అర్ధం అవుతుంది. 'మాలియా'లోని ఈ వీధిలో మేమందరము దాదాపు ఇరవై ఏళ్ళకు పైగా అంగళ్ళు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాము. నిద్రలేచింది మొదలు రాత్రి పదకొండు గంటలవరకు - మేము గడిపేది ఇక్కడే ఈ వీధిలోని ప్రతిషాపూ.. ప్రతి మనిషి మాకు తెలుసు. ఇక్కడ ఈ వీధిలో మొత్తం మీద ఆంధ్రా వాళ్ళే ఎక్కువగా ఉన్నారు. డివిడి షాపులు, మొబైల్ షాపులు, చీరల షాపులన్నీ వాళ్ళవే. ప్రొద్దుట్నించీ రాత్రి వరకూ వాళ్ళ మాటలూ, తిట్లూ, కొట్లాటలూ వినడం చూడటం, పరిశీలించడం జరుగుతోంది. వాళ్ళతో స్నేహం చేయడం, వ్యాపారాల్ని కొనసాగించడం మా నిత్యజీవితంలో భాగాలు. కాబట్టి నేనే కాదు ఈ వీధిలోని అందరూ కూడా భాష వేరైనా ఎదుటివారి భావాన్ని అర్ధం చేసుకోగలరు. వారి జీవితాల గురించి, జీవన విధానాల గురించి, మార్పుల గురించి, కుటుంబాల గురించీ కూడా బాగానే తెలిసిపోతుంటాయి'' చెప్పాడు రాజస్తానీ అతను.

''ఓహో.. అలాగా. నిజమే కదా! మాలియాలోని ఈ వీధి చాలా పురాతనమైనది. నాకు తెలిసి పదిహేనేళ్ళుగా ఏ వస్తువు కావాలన్నా ఇక్కడికే వచ్చి కొనుక్కుని వెళుతున్నాను. ముఖ్యంగా మన ఆంధ్రా కూరగాయలు, బట్టలు, డివిడిలు ఇక్కడే కదా

దొరుకుతాయి. చింతపండు కావాలంటే ఇక్కడకే రావాలి. అరబ్బీ వాళ్ళు చింతపండు అస్సలువాడరు కదా? అందుకే జమియాల్లో (సూపర్ మార్కెట్) ఎక్కడా చింతపండు దొరకదు" అన్నాడు ఆ కష్టమరు.

ఈ లోపల బయట వీధిలోని ఇద్దరు ఆడవాళ్ళ గొడవ తారాస్థాయికి చేరుకుంది. తన బ్రతుకు సంగతి రంగమ్మ నోట బయటపడేసరికి రెచ్చిపోయి తోక తొక్కిన తాచుపాములాగా బుసలు కొట్టింది కాకినాడ కమలమ్మ.

"నీ వడ్డీవ్యాపారం వల్ల ఎంతమంది బ్రతుకులు నాశనమయ్యాయో నాకు తెలియదా? వడ్డీలకు వడ్డీలు కట్టలేక ఎంతమంది ఏడ్చారో, ఎంతమంది నిన్ను తిట్టిపోసారో నాకు తెలియదా? వంద దినార్లకు పది దినార్లు వడ్డీ వేసి జనాల్ని ముంచేస్తున్నావు గదే? నువు ఈ మాలియాలో చీరల షాపు ఎలా పెట్టావో, దానికి పర్మిషను ఎలా వచ్చిందో ఇక్కడ ఎవరికీ తెలియదా? పెద్ద పతివ్రతలాగా కబుర్లు చెపుతున్నావు. కువైటీ ముసలోడు నీ వగలు చూసి, నీ మాయమాటలు విని నీకు ఈ షాపు పెట్టించాడని మా కందరికీ తెలుసు. చాటుగా మాటుగా ఆ ముసలోడు నిన్ను కార్లో ఎక్కించుకుని బయటికి తీసుకుపోవడం ఎవరూ చూడలేదు అనుకుంటున్నావా? మళ్ళొకసారి నా బ్రతుకు గురించి మాట్లాడావంటే మర్యాద వుండదు. వీధిలో నిలబడి నీ రంగాటం బయట పెడతాను. జాగ్రత్త. నాతో పెట్టుకోవద్దు" చేతులు త్రిప్పుతూ రెండడుగులు ముందుకు వచ్చింది కమలమ్మ.

అడ్డంగా బలిసి బలంగా కనిపించే కమలమ్మ ముందుకు వచ్చేసరికి కాస్త బలహీనంగా వుండే రంగమ్మ మీదపడి కొడుతుందేమొ అని కాస్త భయపడి వెనక్కి తగ్గింది. వీళ్ళ గొడవకి ఎదురుగా వున్న కాసెట్ల షాపులో పనిచేసే వనజ, ఆ ప్రక్కనే టైలరింగ్ పనిచేసుకునే సుశీల చేస్తున్న పనిని ఆపి లేచి బయటికి వచ్చారు.

వాళ్ళని చూసిన రంగమ్మ వారి సహాయం కోరుతూ "చూడండి ఇది ప్రొద్దున్నే నా మీదికి గొడవకు వచ్చి ఎన్ని మాటలు అంటోందో, అడ్డంగా బలిసి అన్యాయానికి తెగబడుతోంది. దీని నోటికి అడ్డూ అదుపు లేకుండా వుంది" అంది.

రంగమ్మ కాస్త భయపడిందని గ్రహించిన కమలమ్మ ఇంకాస్త బెదిరించి వెనక్కి తిరిగేట్లు చేయాలని భావించి ఇంకో అడుగు ముందుకు వచ్చి దారికి అడ్డంగా నిలబడింది.

ఇంతలో వనజ కల్పించుకుని "ఏంటక్కా మీ ఇద్దరూ ఉప్పూ నిప్పులా ఎప్పుడూ కొట్లాడుకుంటూ వుంటారు. ఎందుకొస్తాది మీకు కొట్లాట. మనం అందరం కూడా తెలుగు వాళ్ళమే ఒకే రాష్ట్రం నుండి వచ్చాం. కుటుంబాల్ని పిల్లల్ని వదిలిపెట్టి కూటి కోసం ఇంతదూరం ఈ పరాయిదేశానికి వచ్చాం. వచ్చినందుకు దేవుని దయవలన ఏదో ఒక పనిచేసుకుని అంతో ఇంతో సంపాదించుకుంటున్నాం. మనలో మనమే కొట్లాడుకుంటే ఇతర భాషలవాళ్ళు, వేరే దేశాల వాళ్ళు మనల్ని ఎంత నీచంగా చూస్తారు? ఇప్పటికే ఆంధ్రావాళ్ళంటే ఇక్కడ చాలా చెడ్డ పేరు వుంది. మనవాళ్ళు ఈ దేశానికి వచ్చి వడ్డీ వ్యాపారాలు చేస్తున్నారని, సారాయి కాచి అమ్ముతారనీ, వీసాల కోసం, ఉద్యోగాల కోసం లంచాలు ఇచ్చి పనులు చేయించుకుంటారనీ తెలుగువాళ్ళే కువైటు దేశాన్ని పాడుచేసారని, కువైటీ వాళ్ళకి కూడా లంచాలు ఇచ్చి వారిని చెడిపేస్తున్నారనీ అందరూ అనుకుంటున్నారు.

మీ ఇద్దరూ ఇలా ప్రతిరోజూ కొట్లాడుకుంటుంటే మా అందరికీ కూడా చెడ్డ పేరు వస్తోంది. 'మీ తెలుగువాళ్ళంతా అంతే. ఒకరితో ఒకరికి సఖ్యతలేదు. మీలో స్వార్థం, అసూయా ద్వేషాలు ఓర్వలేనితనం ఎక్కువ. అందుకే ఒకరితో ఒకరు పోట్లాడుకుంటారు' అని బెంగాలీ వాళ్ళు, సిలానీ వాళ్ళు అంటుంటే సిగ్గుతో తలవంచుకోవాల్సి వస్తోంది. 'మేము అలా లేము, అలా చెయ్యము' అంటే వాళ్ళు ఒప్పుకోవడం లేదు. 'అదిగో ఆ కమలను, రంగమ్మను చూసి మీ తెలుగువాళ్ళు ఎలాంటివాళ్ళో బాగా చెప్పగలం, వాళ్ళ పోట్లాట చూస్తే అంతా అర్థమయిపోతుంది' అని మనకంట ఇతర దేశస్తులు మనల్ని హేళన చేసి మాట్లాడుతున్నారు" వారికి నీతి బోధ చేయబోయింది వనజ.

"నువ్వేం నీతులు చెప్పమాకు. నీ నీతులు వినే ఓపిక మాకు లేదు. వెళ్ళి నీ పని చూసుకో" విసురుగా చెప్పింది కమలమ్మ.

"చూడు....చూడు నువు చెప్పే మంచిమాటలు కూడా దానికి రుచించడంలేదు" అంటూ వనజను తనవైపుకు త్రిప్పుకోవడానికి ప్రయత్నిస్తూ సంచిలో వున్న తమలపాకులకు సున్నం పూసి, వక్కను పొగాకును నోట్లోవేసుకుని నమలసాగింది రంగమ్మ.

"నరసాపురం నాయుడు వస్తున్నాడక్కా అందరూ లోపలికి పోదాం పదండి. మన కొట్లాటలని గురించి విన్నాడంటే అసలు ఒప్పుకోడు" అంటూ వనజ మెల్లగా అక్కడినుండి జారుకుంది.

వీధి మొదట్లో కారాపి ఠీవిగా లోపలికి నడిచి వస్తున్న నాయుడిని చూసి అందరూ సైలెంటయిపోయి ఏమీ జరగనట్లుగా అక్కడినుండి షాపుల్లోపలికి నడిచారు. నరసాపురం నాయుడంటే మాలియాలో అందరికీ భయమే. అన్ని వ్యాపారాల్లోనూ ఆయనను మించేవారు ఎవరూ ఆ ఏరియాలో లేరు. వీసాలు అమ్మడం, వడ్డీలకు డబ్బులివ్వడం ఆయనే అందరికీ నేర్పించాడంటారు. కువైట్ వాళ్ళకీ వ్యాపారం గురించి నేర్పించాడట. దాదాపు ఇరవై ఐదేళ్ళుగా 'మాలియా'లో తిరుగుతూ అక్కడవున్న ప్రతిషాపుతోనూ ఏదోవిధంగా వ్యాపార లావాదేవీలను కలిగివుండి వారినందరినీ తన చెప్పుచేతల్లో వుంచుకున్నాడు. ఆయనను ఎదిరించే వారు ఆ ఏరియాలో ఒక్కడు కూడా లేడు. మొదట ఒక కువైటీ ఇంట్లోకి డ్రైవరుగా పనిలోకి వచ్చిన నరసాపురం నాయుడు నాలుగేళ్ళలోనే స్వంతంగా వ్యాపారం చేయగల స్థితిలోకి వచ్చాడు. మరో నాలుగేళ్ళలో ఆ ఏరియానంతటినీ తన అజమాయిషీలోకి తెచ్చుకున్నాడు. కోట్లకు కోట్లు డబ్బును సంపాదించాడు. ఇంటిదగ్గరవున్న ఆస్తులకు లెక్కలేవుట. ఇంటిదగ్గర ఇద్దరు పెళ్ళాలు, వారికి పిల్లలు ఉన్నారంట. ఇక్కడ కువైట్‌లో ఒక పెళ్ళాం వుంది. తెలియకుండా చాటుగా మాటుగా కొనసాగించే సంబంధాలు బోలెడు.

మాలియాలోని ఆ వీధిలో పనిచేసే ప్రతి ఆడది వాడికి లొంగి మాట్లాడాల్సిందే అతడు చెప్పినట్లు వినాల్సిందే లేకపోతే ఆ రోజే తట్టా బుట్టా సర్దుకుని వచ్చిన దారిన తిరిగి ఇండియా ఫ్లయిట్ ఎక్కాల్సిందే కొరివితో తలగోక్కోవడం ఎందుకని అందరూ అతనికి భయపడి అణిగిమణిగి వుంటారు. అతనితోపాటు నలుగురు మనుష్యులు కూడా ఎప్పుడూ వుంటారు.

ఆ వీధిలోకి రాగానే మొదట్లోనే వున్న ఫాన్సీ స్టోరుకు వెళ్ళి కాసేపు కూర్చుని టీ త్రాగి ఆ షాపు ఓనరు అయిన విజయతో కాసేపు పరాచికాలు ఆడి తరువాత మిగతా షాపుల వారినందరినీ తీరుబడిగా పలకరిస్తూ తన పనులు చూసుకుంటాడు.

విజయ అనే ఆవిడకు దాదాపు యాభై ఏళ్ళు వుంటాయి. తూర్పుగోదావరి నుండి వచ్చింది. ఇరవై ఏళ్ళ అమ్మాయిలా కనబడటానికి తెగ తాపత్రయపడిపోతుంటుంది. కనిపించిన ప్రతిమనిషితోనూ మాటలు, నవ్వులు. ముఖ్యంగా మగవారితో ఆమె ప్రవర్తించే తీరు ఆ వీధిలోని వారికి ఎవరికీ నచ్చదు. ఒక స్త్రీకి వుండాల్సిన లక్షణాలు ఆమెలో ఏ ఒక్కటి కూడా కనిపించవు అని సాటి స్త్రీలు చెప్పుకుంటూ వుంటారు. సాధారణంగా ఎవరూ ఆమె జోలికి వెళ్ళరు. ఎందుకంటే ఆమె నోరు మంచిది కాదని అందరికీ భయం. నరసాపురం నాయుడిని చూడగానే విజయలో హుషారు వచ్చేసింది. పోయిన యవ్వనాన్నంతా తిరిగి వంట్లోకి అరువుతెచ్చుకుని, లేని వంపుసొంపుల్ని కష్టపడి ప్రదర్శిస్తూ ఇరవై ఏళ్ళ పిల్లలా మెలికలు తిరిగిపోయింది.

"ఏంటే.. ఇంకా చిన్న పిల్లలా మెలికలు తిరుగుతున్నావు. కాస్త ఆ సినిమాలు సీరియల్సు చూడటం తగ్గించు బాగుపడతావు అన్నాడు" నాయుడు కుర్చీలో కూర్చుంటూ.

"అబ్బే సీరియల్సూ - సినిమాల ప్రభావం కాదండీ బావగారూ వంట్లోని యవ్వనం ఇంకా వీడిపోనంటోందండీ. ఏం చేయను మరి" అంటూ కిలకిలా నవ్వింది విజయ.

"నీ మనవడికి కూడా పదేళ్ళొచ్చాయి. ఇంకా నీకు యవ్వనమేంటే? కోడళ్ళని మించి పోటీపడి వగలు పోతున్నావు వయసయిపోయింది కాస్త తగ్గించుకో. మరి పనులు జరగాలంటే ఈ ప్రపంచంలో బ్రతకాలంటే కాస్త లౌక్యం తెలియాలి కదా" బావగారు అంది టీ అందిస్తూ.

"సరే ఇంతకీ ఈనెల కట్టాల్సిన చీటీ ఏదీ? రెండు వారాలనుండి వాయిదాలు వేస్తున్నావు. మాటలతోనే గడిపేస్తున్నావు" అన్నాడు నాయుడు.

"బావగారూ మీరే అర్థం చేసుకోకపోతే ఎలా? ఇంకో వారం ఆగండి ఇచ్చేస్తాను" అంది.

"అదేం కుదరదు. నీ వాయిదాలు నా దగ్గర కాదు ఈ మధ్య క్రొత్తగా ఫ్లాట్ల బిజినెస్ కూడా మొదలు పెట్టి రూములు అద్దెకిస్తున్నావంట. నా దగ్గర దాచి పెడతావా" అన్నాడు నాయుడూ కాస్త కోపంగా.

"అయ్యో అదేం లేదు. ఏదో చిన్నగా ఒక ఇల్లు బాడుగకు తీసుకుని దాన్ని విడగొట్టి నాలుగు రూములుగా చేసి, పదిమంది బాచిలర్స్‌కు అద్దెకు ఇచ్చాను అంతే. దానిలో వచ్చే లాభంతో నా అద్దె గడిచిపోతుంది. అంతకు మించి పెద్ద సంపాదనేమీ లేదు" అంది దీనంగా చూస్తూ.

ఈ లోపల నాయుడుతో వచ్చిన నలుగురు మనుషులు వెళ్ళి ఆవీధిలోని షాపుల్లోకి వెళ్ళి, చీటీల డబ్బు, ఇళ్ళ బాడుగ డబ్బులు, వడ్డీ డబ్బులు, వీసాల డబ్బులు లాంటివన్నీ వసూలు చేసుకుని వచ్చారు. ఆ రోజు డబ్బు కట్టకుండా తప్పించుకుందామని చూసింది విజయ. కానీ నాయుడు దగ్గర తన ఆటలు సాగక ఇవ్వాల్సినదంతా ఇచ్చేసింది.

దాదాపు నాలుగేళ్ళు గడిచాయి. ఇప్పుడు ఆ వీధిలో రంగమ్మ కమలమ్మల గొడవ అసలు వినబడదు. బ్రెస్ట్ కాన్సర్ రావడంతో కమలమ్మ కువైట్ వదిలిపెట్టి కాకినాడ వెళ్ళిపోయింది. కమలమ్మకు కాన్సర్ అని తెలియగానే రంగమ్మ హృదయం కరిగిపోయింది. కమలమ్మను క్షమించేసి స్నేహాన్ని కలుపుకుంది. కమలమ్మకూడా మునుపటి దురుసుతనాన్ని తగ్గించుకుంది.

విజయ ఎవరో కుర్రోడ్ని నమ్మి పదివేల దినార్లు అప్పుగా ఇచ్చింది. వాడు నిండా ముంచేసి కువైట్ వదిలి పెట్టి అడ్రస్ కూడా ఇవ్వకుండా ఇండియా పారిపోయాడు. వయసొచ్చినా బుద్ధిలేకుండా కుర్రదానిలా కనపడాలని తాపత్రయపడే విజయకు తగిన శాస్తి జరిగిందని మాలియాలో అందరూ చెప్పుకుని నవ్వుకున్నారు.

వీసాల్లో మోసం జరిగిందని ఎవరో కక్షగట్టి నరసాపురం నాయుడ్ని కనిపెట్టి కొట్టారంట. ఇండియాకు వెళ్ళినపుడు రాత్రిపూట బైక్ మీద వస్తుంటే దారికాచి పట్టుకుని బలంగా కొట్టేసరికి తలకి కుట్లు పడ్డాయంట. కాలు విరిగి ఆపరేషను చేయించుకోవాల్సి వచ్చిందంట. అయినా సరే జీవితంలో ఇక ఎప్పటికీ సరిగా నడవడానికి కుదరదంట.

వనజ నాలుగేళ్ళు మాత్రమే ఉండి పదిలక్షలు సంపాదించుకుని ఇకచాలు, భర్తను పిల్లల్ని వదిలి పెట్టి ఈ పరాయి దేశంలో వుండి సంపాదించి ఏం లాభం ఇంటి దగ్గర వుండి బిడ్డల్ని చూసుకుంటూ గంజినీళ్ళు తాగినా సంతోషమే అంటూ కువైట్ వదిలిపెట్టి ఇంటికి వెళ్ళిపోయింది.

రంగమ్మ బిడ్డలు ఆమె ఆస్తులన్నీ రాయించుకుని, కువైటు నుండి ఆమె పంపినదంతా దాచుకుని. ఆమెను ఇంట్లోంచి తరిమేసారంట. అన్ని సంవత్సరాలు ఆమె కువైట్‌లో వున్నా కూడా ఒక్క బ్యాంక్‌లో కూడా అకౌంటు పెట్టుకోలేదు. సంపాదనంతా కొడుకులకు పంపేసింది. ఇప్పుడు వాళ్ళు భార్యల మాట విని బయటకి నెట్టేసారు. ఆమెకెందుకో ఆ సమయంలో కమలమ్మ గుర్తొచ్చి గుర్తొచ్చి కాకినాడకు ట్రైయిన్ ఎక్కింది. కమలమ్మ రంగమ్మను ఆప్యాయంగా కౌగిలించుకుంది. తనతోపాటు అక్కడే వుండిపొమ్మని

చెప్పింది. వాళ్ళిద్దరూ కువైటు లోని తమ గత జీవితం గురించి, మాలియాలోని మనుష్యుల గురించి గుర్తుచేసుకుంటూ, తమ స్నేహితుల గురించి పాత జ్ఞాపకాలన్నీ కలబోసుకుంటూ సంతోషించారు.

మాలియాలోని ఆ వీధిలో పాత తరం వాళ్ళందరూ స్వదేశంలోకి వెళ్ళిపోవడంతో ఆ స్థానంలో కొత్తవాళ్ళు ప్రవేశించారు. ఇప్పటికీ ఆ వీధిలో యధావిధిగా అవే అంగళ్ళు వున్నాయి. వ్యాపారాలు కూడా జరుగుతున్నాయి. కానీ కాలంతోబాటు మనుష్యులు కాస్త మారారు. పాత తరం వాళ్ళలా పోట్లాటలతో కాలం గడపకుండా డబ్బు సంపాదనపై దృష్టి పెట్టారు.

జీవితంలోని ప్రయాణం వయసుతోపాటు ఎన్నో మార్పులు తెస్తుంది. కాలంతోపాటు ఎన్నో మలుపుల్ని తిప్పుతుంది.

శత్రువులు మిత్రులు కావచ్చు నమ్మిన మిత్రులే మోసం చేసి శత్రువులుగా మిగలవచ్చు. అందుకే అంటారు అనుభవజ్ఞులు జీవితమే ఒక నాటకం అని.

## "చింటూ" కథ

"మా అమ్మ కొయేటు నుంచి వస్తోందోచ్. నాకు బోలెడు బొమ్మలు, బట్టలు, చాక్లెట్లు తెస్తుందోచ్" సంతోషంగా మెరిసే కళ్ళతో చెపుతున్నాడు చింటూ. రెండు నెలలు శెలవులు ఇండియాలో గడపడానికి వాళ్ళమ్మ కువైట్ నుండి వస్తోందని వాడికి తెలిసినప్పటినుండీ వాడి ఆనందాన్ని, ఉత్సాహాన్ని ఎవరూ ఆపలేక పోతున్నారు. స్కూల్లో పిల్లలకి, టీచర్లకీ కాక వీధిలో వుండేవారికందరికీ కూడా పదేపదే వాళ్ళమ్మ గురించి చెపుతూ హుషారుగా తిరుగుతున్నాడు. వాడికిప్పుడు ఆరేళ్ళు. దాదాపు మూడేళ్ళ క్రితం ఊహ తెలిసే వయసులో వాళ్ళమ్మ జయలక్ష్మి విమానంలో కూర్చుని ఎగిరి కువైటు దేశానికి వెళ్ళిపోయింది. ఎంతగానో తనని ప్రేమించే అమ్మ, ఎన్నడూ ఒక గంట సేపయినా తనని విడిచి పెట్టని అమ్మ, ఈరోజు తాను ఏడుస్తున్నా వద్దని వారిస్తున్నా.. ఎందుకు అంత దూరం వెళ్ళిపోయిందో వాడికి అర్ధం కాలేదు. వెళ్ళేటపుడు చేతులతో అమ్మ కాళ్ళను చుట్టుకుని దారికి అడ్డం పడుతున్నా కూడా ఆమె తన ప్రయాణాన్నీ ఆపుకోలేదు. తన బాధను ఏడుపును చూసి అమ్మ వెళ్ళకుండా ఆగిపోతుందని వాడు భావించాడు కానీ అలాంటిదేమీ జరగలేదు.

"అమ్మా.. నువు లేకపోతే అన్నం తినలేను, ఆడుకోలేను, చదువుకోలేను, ఏడుస్తాను" అని చెపుతున్నా అమ్మ వినిపించుకోలేదు. వెళ్ళేముందు కాసేపు తనని కౌగిలించుకుని బుగ్గలపై ముద్దులు పెట్టి వెనక్కి తిరిగి చూడకుండా ఎయిర్‌పోర్టు లోపలికి వెళ్ళిపోయింది. తనకేమో ఏడుపు ఆగలేదు. అప్పుడే ఎయిర్ పోర్టులోపలికి వెళ్ళి అమ్మ వెళ్ళే ఫ్లయిట్‌ని పట్టి వెళ్ళకుండా ఆపేయాలనిపించింది. అలాగే అమ్మ వెంటపడి వెనకాల లోపలికి పరిగెత్తుతుంటే అమ్మమ్మ, మామయ్య గట్టిగా పట్టుకుని ఆపేసారు. అమ్మకు తనకంటే కూడా ఆ కువైట్ అంటేనే ఇష్టమని అపుడనిపించింది. రాత్రిళ్ళు నిద్రలో మెలుకువ వచ్చినపుడల్లా "అమ్మా ఎక్కడికెళ్ళావు? " అంటూ పక్కన తడుముకునేవాడు. ఎందుకో తెలియని భయం వేసి ప్రక్కంతా తడిపేసేవాడు. చల్లగా తగిలిన తడికి అమ్మమ్మ లేచి "రేయ్ మూడేళ్ళ పిల్లోడివయ్యావు ఇంకా నిద్రలో ఒంటికి పోస్తావేంట్రా? ' అని విసుక్కునేది. అపుడు అమ్మ గుర్తొచ్చి ఏడిస్తే "రేయ్ ఆపు నీ ఏడుపు. రెండేళ్ళ తరువాత మీ అమ్మ వస్తుందిలే. అపుడు అక్కడ్నించి బ్యాగు నిండా నీకు బొమ్మలు, చాక్లెట్లు తెసుందిలే. మీ అమ్మ వచ్చేంత వరకు నువు బడికెళ్ళి బాగా చదువుకోవాలి. అర్ధమయిందా? లేకపోతే నీకు దెబ్బలు పడతాయి" అంటూ బెదిరించేది.

అమ్మ పెట్టే గోరుముద్దలు తింటూ ఆమె ప్రక్కన పడుకోవాల్సిన తను ఎందుకు అమ్మమ్మ దగ్గర వుండాలో అర్ధమయ్యేదికాదు. అందరికీ అమ్మా నాన్నలు వున్నారు. కానీ తనకు నాన్నకూడా లేడు. తను అమ్మ కడుపులో వుండగానే సారాయి త్రాగి జబ్బుచేసి

తొందరగా చచ్చిపోయాడంట. మరి నాన్నకూడా లేని తనను నిరంకుశంగా వదిలేసి వెళ్ళిపోయిన అమ్మంటే ఆ వయసులోనే కాస్త విముఖత ఏర్పడింది.

మొదట్లో కువైట్‌కి వెళ్ళాక వారానికి రెండుసార్లు ఫోను చేసేది. అక్కడ పని చాలా కష్టంగా వుందని, అక్కడవాళ్ళు మాట్లాడే అరబిక్ భాష ఇంకా తనకు అర్థం కావడం లేదనీ, అవన్నీ నేర్చుకుంటున్నాననీ చెప్పేది. రెండేళ్ళు పూర్తి అవగానే ఇంటికి వచ్చేస్తానని అంతవరకు చింటూ బాగా చదువుకోవాలని చెప్పేది.

ఎంత చెప్పినా, ఎన్ని బొమ్మలు తెస్తానన్నాకూడా.. అమ్మ దగ్గర వుంటే చాలనిపించేది. అవేవీ అక్కరలేదనిపించేది. ఎపుడూ అమ్మను ఆమె చల్లటి నవ్వును ఆ ప్రేమను గుర్తుచేసుకునేవాడు. ఆమె ఒడిలోని వెచ్చదనం కరువయి పోయిందని కలవరపడేవాడు. ఎన్ని వున్నా చుట్టూ ఎందరున్నా అమ్మ దగ్గర లేకపోతే అంతా శూన్యంగా అనిపించేది. అమ్మా నాన్నలతో ఆనందంగా తుళ్ళుతూ గడిపే తోటి పిల్లలను చూస్తే అకారణంగా ద్వేషం కలిగేది. తనుకూడా వారిలాగే అమ్మానాన్నల చేతుల్ని పట్టుకుని గంతులు వేయాలని అనిపించేది. ఎందుకు తనకింత శిక్షో ఆ పసిమనసుకు అర్థం అయేది కాదు. ఎపుడూ అమ్మగురించే ఆలోచిస్తూ దిగులుగా వుండేవాడు. స్కూల్లో కూడా డల్‌గా వుంటున్నాడని ఏదీ నేర్చుకోవడానికి ఆసక్తిని చూపించడంలేదని టీచర్లు అమ్మమ్మకి కంప్లైంట్ చేస్తున్నారు.

ఒక ఆదివారం రోజున ఫోను చేసిన జయలక్ష్మికి వాళ్ళమ్మ ఇలా చెప్పింది. "పిల్లవాడు అమ్మా అమ్మా అని నిన్నే కలవరిస్తున్నాడు. వీడిని బుజ్జగించడం. అన్నం తినిపించి బడికి పంపించడం నావల్ల కావడంలేదు. నా ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే వుంది. నువు వెళ్ళి రెండేళ్ళు దాటింది కదా. ఇక ఇంటికి వచ్చి అందరినీ చూసి మరలా వెళ్ళు. కనీసం వీడు నిన్ను చూసి మాములు మనిషి అవుతాడు అని."

అలాగే ఇదిగో వస్తున్నా.. అదిగో వస్తున్నానంటూ.. మూడేళ్ళకాలం గడిపేసి ఇపుడు వీలు చూసుకుని ఇండియాకు వస్తోంది జయలక్ష్మి.

అమ్మ వచ్చేరోజున ఉత్సాహంగా తయారయి అమ్మమ్మతోపాటు కలిసి ఎయిర్ పోర్టుకు వెళ్ళాడు చింటూ.

ఎయిర్ పోర్టు లోపలినుండి బయటికి వచ్చే అమ్మకోసం వళ్ళంతా కళ్ళు చేసుకుని ఆతృతగా ఎదురుచూస్తున్నాడు వాడు.

నుదుటి పైకి పడేలా కత్తిరించుకున్న వెంట్రుకలను ఓ చేత్తో స్టయిల్‌గా సర్దుకుంటూ భుజానికి హ్యాండ్ బ్యాగు ఒకటి తగిలించుకుని నవ్వుతూ బయటికి వచ్చింది జయలక్ష్మి.

అదిగో అమ్మ.. అమ్మే.. సందేహం లేదు మూడేళ్ళ తరువాత అమ్మను చూడగానే సంతోషం పట్టలేక పరిగెత్తుకుంటూ ముందుకు వెళ్ళి అమ్మ కాళ్ళను పెనవేసుకున్నాడు చింటూ.

"నా బట్టలు నలిగిపోతాయిరా చింటూ. కాస్త దూరంగా నిలబడి మాట్లాడు" అంటూ వాడిని చేత్తో పక్కకు నెట్టింది జయలక్ష్మి. అమ్మ ప్రవర్తనతో వాడి పసిహృదయం చివుక్కుమంది.

ఇంతలో అమ్మమ్మ "సామాన్లు ఎక్కడే? ఎన్ని బ్యాగులు తీసుకొచ్చావు" అని అడిగింది. అదిగో ఆ ట్రాలీలో వున్న మూడు సూట్‌కేసులూ మనవే అంటూ వెనుకగా వున్న ఒక ట్రాలీని చూపించింది.

"అవునా! మంచిది. మరి ఆట్రాలీని తోసుకుంటూ వచ్చిన అతను ఎవరు? " ఆసక్తిగా ప్రశ్నించింది అమ్మమ్మ.

"ఆయనపేరు రాజు. నాకు మంచి ఫ్రెండ్ కువైట్ దేశంలో నేను కష్టంలో వున్నప్పుడు. వీసా, అక్కామాల్లాంటి విషయాల్లో ఎంతో సహాయం చేసాడు నన్ను విడవకుండా కనిపెట్టుకుని వుంటాడు. నా పనులన్నీ ఆయనే చేస్తాడు. " అని చెపుతూ అతనివైపు చూసి నవ్వింది. అపుడు అతడు అక్కడనుంచి కదిలి వచ్చి జయలక్ష్మి పక్కన నిలబడ్డాడు. అందరూ కలిసి ఎయిర్‌పోర్టు బయటికి వచ్చారు.

అమ్మమ్మ చేయి పట్టుకుని ముందుగా చింటూ నడుస్తుంటే.. జయలక్ష్మి అతనూ కలిసి ట్రోలీని, పట్టి తోసుకుంటూ మాటలతో, నవ్వులతో బయటికి వచ్చారు. తరువాత భోజనం చేయడానికి రెస్టారెంటుకు వెళ్ళారు అక్కడ - "రేయ్ చింటూ ఈయన రాజు అంకుల్ నీకోసం చాక్లెట్లు తెచ్చారు. ఆయన్ని నువు అంకుల్ అని పిలవాలి" అంటూ అతన్ని చింటూకు పరిచయం చేసింది జయలక్ష్మి. అలాగే అన్నట్లుగా తలవూపాడు చింటూ. వాళ్ళిద్దరూ కలిసి అటువైపు కూర్చుంటే అమ్మమ్మతో కలిసి ఇటువైపు కూర్చున్నాడు చింటూ. వాడికి అమ్మ ఒడిలో కూర్చుని ఎన్నో కబుర్లు చెప్పాలని వుంది. కానీ ఆమె వీడిని పట్టించుకునే పరిస్థితిలో లేదు. రాజు అంకుల్‌తో మాట్లాడుతూ అతనికి కొసరి కొసరి ఒడ్డిస్తూ వుంది. వాడికి ఏదో జరగరానిది జరుగుతున్నట్లుగా, తెలియని కలవరంగానూ, భయంగానూ అనిపించింది.

గతనెల రోజులుగా అమ్మ వస్తోందని ఎంతగా సంతోషపడ్డాడో, మరెంతగా ఎదురు చూసాడో? కానీ ఇప్పుడు అమ్మ ప్రవర్తన వాడిని చాలా బాధపెడుతోంది. తన అమ్మను ఆ రాజు అంకుల్ లాక్కుని సంతోషాన్ని తననుండి దూరం చేసి అతను ఆ ఆనందాన్ని పొందుతున్నట్లుగా అనిపించి దిగులుపడ్డాడు చింటూ.

భోంచేసాక ఆ అంకుల్ తన బ్యాగును తెరిచి చాక్లెట్లు తీసి చింటూకు ఇవ్వబోతుంటే ఎందుకో అవి చేదుమాత్రల్లా అనిపించి వెంటనే వద్దు అన్నాడు వాడు.

"తప్పు అలా అనకూడదు. అంకుల్ నీకోసం కువైట్ నుండి తీసుకుని వచ్చాడు. ఆయన మనకి పరాయివాడు కాదు. ఆయన ఇచ్చినవి నువు తీసుకోవాలి. ఆయనని అంకుల్ అని నవ్వు పిలవాలి అర్థమయిందా?" కొంచెం కోపంగా చెప్పింది జయలక్ష్మి. ఇక తప్పదన్నట్లుగా అలాగే అంటూ ఇబ్బందిగా ఆ చాక్లెట్లని అందుకున్నాడు వాడు. ఇంటికి వచ్చాక అమ్మ తన హ్యాండు బ్యాగు తెరిచి "అమ్మా.. ఇదిగో ఈ నెక్లెస్ సెట్ చూడు ఎంత బావుందో? మొత్తం చెవి కమ్మలతో కలిసి 80 గ్రాములు. పోయిన నెలలో నా పుట్టిన రోజుకి బహుమతిగా ఆయన ఈసెట్‌ను 'డమాస్' లో నాకు కొన్నాడు. ఇదిగో నీకోసం ఈ జపాన్ చీర కొన్నాడు. చూడు బట్ట ఎంత బావుందో" అంటూ వాళ్ళమ్మకి అందించింది. అమ్మమ్మ వాటినన్నింటినీ చూసి మురిసిపోయింది"

"ఓహో అవునా.. అబ్బ నెక్లెస్ డిజైన్ చాలా బావుంది. మిద్దింటి రాజ్యలక్ష్మి కూడా కొయేటు నుండి నెక్లెస్ తెచ్చుకుంది. కానీ అది దీనంత బాలేదు. పల్చగా రేకులాగా వుంది. అక్కడ కువైట్‌లో అల్లుడు డబ్బు బానే సంపాదిస్తున్నాడనుకుంటా. 80గ్రాముల నెక్లెస్ ఎంతయిందో? బానేకొని పెట్టాడులే" అంది సంతోషంగా అమ్మమ్మ.

"ఈయనకి అక్కడ కువైట్‌లో (కద్దామా) పనిమనుషులను సప్లై చేసే ఆఫీసు వుంది. ఇక్కడి వాళ్ళకి వీసాలు పంపించడం కూడా చేస్తారు. బోలెడు ఆదాయం వుంటుంది. చాలా సంపాదించారు. నాకు ఆయన పరిచయం కలగడం అదృష్టమే" అంది జయలక్ష్మి మెళ్ళో నెక్లెస్‌ను వేసుకుంటూ.

"సరే అల్లుడికి రాత్రికి చికెన్ వండుతాను, ఇంకా ఏమేం కావాలో అడుగు" అంది అమ్మమ్మ.

"వద్దమ్మా. ఆయన ఇపుడే బయలుదేరి వాళ్ళ ఊరికి వెళ్ళిపోతున్నాడు అక్కడ ఇంట్లో భార్య పిల్లలు ఈయన కోసం ఎదురు చూస్తున్నారు కదా? " అంది జయలక్ష్మి.

"అవునా, ఏవూరు అతనిది? ఎంతమంది పిల్లలు?" ఆరాగా అడిగింది అమ్మమ్మ.

"ఇద్దరు పిల్లలు. ఇద్దరూ కూతుర్లే. కొడుకు కావాలని ఈయనకి చాలా కోరిక. కానీ పెళ్ళాం రోగిష్టిది. ఎపుడూ ఏదో ఒక రోగం అని చెప్పి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ వుంటుంది. ఈయన ఆమెకి ఎంత డబ్బు కావాలంటే అంత పంపిస్తావుంటాడు. కడప సెంటర్‌లో షాపింగ్ కాంప్లెక్స్ కట్టారు. నాలుగు ఇళ్ళు, ఐదారు స్థలాలు వున్నాయి. పెళ్ళానికి ఏదీ తక్కువకాకుండా చూసుకుంటారు.

వడ్డాణంతో సహా దాదాపు 2 కేజీల బంగారాన్ని ఆమెకు కొనిపెట్టారు కానీ ఏం లాభం? పెళ్ళాంతో ఈయనకి ఏ సుఖమూ లేదు. ఈయన మొదట నన్ను చూసినపుడు నాకు పెళ్ళే కాలేదని, పిల్లోడు పుట్టలేదని అనుకున్నాడంట. నేను కూడా రెండేళ్ళపాటు ఆ విషయమేమీ చెప్పలేదు. ఇపుడే ఇక్కడికి వచ్చేముందే చింటూ గురించి నిజం చెప్పాను.

'అవునా! నీకు ఆరేళ్ళ కొడుకున్నాడా! నమ్మలేకుండా వున్నాను. నువు ఇంకా పెళ్ళికాని ఇరవై ఏళ్ళ పిల్లలాగే వున్నావే అంటూ ఆశ్చర్యపోయాడు. " పక్కనే ఆరేళ్ళ కొడుకు వున్నాడని తన మాటలన్నీ వింటున్నాడనే ధ్యాస కూడా ఆమెకు లేకపోయింది. మరి ఇవన్నీ ఆ పసిమనసుపై ఏ ప్రభావాన్ని చూపిస్తాయో కాలమే నిర్ణయించాలి.

"ఏమో మగవాళ్ళ మాటల్ని అంత తొందరగా నమ్మమాకు. నీ జాగ్రత్తలో నువు వుండు. ఏ పని చేసినా నీకు లాభం వుండే పని మాత్రమే చెయ్యి. చీరలు, నగలు ఎందుకు గానీ ఇక్కడ నీకోసం ఒక ఇల్లు కట్టించమని మెల్లగా అడిగి చూడు. దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి. తెలిసిందా" అంటూ హితబోధ చేసింది అమ్మమ్మ.

ఊహ తెలిసిన చింటూకి వాళ్ళిద్దరి మాటలూ, ఉద్దేశ్యాలు అర్థమయ్యేసరికి అమ్మ మీద బాగా కోపం వచ్చేసింది. ఆవిడమీదే కాదు ఆమెను ప్రోత్సహిస్తున్న అమ్మమ్మ మీద కూడా.

రాజు అంకుల్ నాల్రోజుల్లో మరలా వస్తానంటూ ఆ సాయంత్రమే వాళ్ళ ఊరికి వెళ్ళాడు. అతను వెళుతుంటే చింటూ సంతోషించాడు. ఇకనైనా అమ్మ తనను దగ్గరకు తీసుకుని కబుర్లు చెపుతూ కాలం గడుపుతుందని వాడు భావించాడు. కానీ అలా జరగలేదు.

ఆ నాలుగు రోజులూ కువైట్ నుండి తెచ్చిన సామాన్లు సర్దుకుంటూ, ఆయన వచ్చాక ఆయనతో కలిసి అక్కడికెళ్ళాలి, ఆ పని చెయ్యాలి, ఆయనకు అది ఇష్టం, ఈ పని ఇష్టం లేదు అని అతని గురించే ఆలోచిస్తూ అతనికి ఇష్టమైనవి సమకూర్చుకుంటూ కాలం గడిపింది. అనుకున్నట్లుగానే నాల్రోజుల్లో రాజు అంకుల్ కడపనుండి వచ్చేసాడు. "లక్ష్మీ వారం రోజులు ఇక్కడే వుంటాను. ఇపుడు మీకు ఇష్టం వచ్చినట్లు వండిపెట్టండి తింటాను" అన్నాడు హాల్లో వున్న నవారు మంచం మీద పడుకుంటూ.

అతను వచ్చినప్పటినుండీ అతని చుట్టూ తిరగడం, ఏంకావాలో అడిగి అందించడం, ప్రక్కన కూర్చుని కబుర్లు చెప్పడం సాయంత్రం పూట బైక్ మీద కూర్చుని షికార్లు తిరిగి రావడం చేస్తోంది జయలక్ష్మి. అమ్మమ్మే చింటూను కాస్త పట్టించుకుంటోంది గానీ జయలక్ష్మికి వాడితో కనీసం కాసేపు మాట్లాడటానికి కూడా టైము దొరకలేదు. ఇరుగు పొరుగు వారు కూడా ఇవన్నీ చూసి చెవులు కొరుక్కోవడం ప్రారంభించారు. ఎదురింటి మంగత్త అయితే దారిన వెళ్ళే చింటూను దగ్గరికి పిలిచి "ఏరా చింటూ మీ ఇంట్లో వుంటూ మీ అమ్మను బైకులో తిప్పుతున్నాడే అతను ఎవరు? మీకు ఏమవుతాడు? మీ అమ్మను గానీ మరలా పెళ్ళిచేసుకుంటాడా ఏమిటి? " అంటూ ప్రశ్నలతో చంపేసింది. చింటూకు ఏం జవాబు చెప్పాలో అర్థంకాలేదు. తెలియని సిగ్గుగా అనిపించింది.

ఆ రోజు అమ్మ, అంకుల్ కలిసి సినిమాకు వెళ్ళాలని బయలుదేరుతున్నారు. జపాన్ సిల్క్ చీర కట్టుకుని ఎత్తు చెప్పులు వేసుకుని సెంటు రాసుకుంటూ హడావిడిగా వుంది జయలక్ష్మి. అదసలే మహేష్ బాబు సినిమా. మహేష్‌బాబంటే వాడికి చాలా ఇష్టం. అమ్మ కువైట్‌నుండి వస్తే టౌనుకెళ్ళి ఆ సినిమా చూడాలని వాడు ఆశగా అమ్మకోసం ఎదురుచూసాడు. ఇపుడు తీరా అమ్మ ఆ అంకుల్‌తో కలిసి బయలుదేరుతుంటే వాడికి ఏడుపు ముంచుకొచ్చింది. ఆ అంకుల్ అనేవాడు లేకపోతే అమ్మ తనని అమితంగా ప్రేమించేది. అంకుల్ వల్లే తాను అమ్మ ప్రేమకు దూరమయ్యాడు అనే సంగతి వాడికి అర్థం అయింది. తలుపు మూలనవున్న కర్రను తీసుకుని ఆ అంకుల్‌ను చితక్కొట్టాలనిపించింది. కోపాన్ని అణచుకోలేక అక్కడే హాల్లో వున్న అలమారలోని గాజుగ్లాసులను క్రిందకి నెట్టేసాడు. గ్లాసులు పగిలిన శబ్దం వినడంతో అమ్మ, అమ్మమ్మ అక్కడికి పరిగెత్తుకొచ్చారు. వారిని చూసిన చింటూగాడు భయపడి ఆ కంగారులో

గాజుపెంకులపై కాలువేసాడు. అంతే వాడి పాదాలు రక్తంతో నిండిపోయాయి. గ్లాసులు పగలగొట్టాడనే కోపంతో వాడిని కొట్టాలని ముందుకు వచ్చింది జయలక్ష్మి. రక్తంతో తడిసిన వాడి పాదాలు చూసిన అమ్మమ్మ కొట్టొద్దని జయలక్ష్మిని వారించింది.

"అయ్యో ఇప్పుడెలా? సినిమాకు వెళ్ళాలని బయలుదేరాం. వీడు వెళ్ళనిచ్చేట్లుగా లేడే బాగా అల్లరి అయ్యాడు. వీడికి భయం పెట్టాలి" అంటూ తలపట్టుకుని సోఫాలో కూర్చుండిపోయింది జయలక్ష్మి.

అంతలో రాజు అంకుల్ కలగజేసుకుని "సరే అయిందేదో అయింది. ముందు వీడిని హాస్పిటల్‌కు తీసుకెళ్ళి డాక్టరుకు చూపించి తరువాత సినిమాకు వెళదాం పద" అంటూ జయలక్ష్మిని చేయిపట్టి పైకి లేవదీసాడు. "అమ్మమ్మ" చింటూ కాళ్ళకి టవల్ చుట్టి జాగ్రత్తగా బైక్ మీద ఇద్దరిమధ్యలో కూర్చుండబెట్టింది. దారంతా జయలక్ష్మి విసుగుతో గొణుక్కుంటూనే వుంది. తన సంతోషాన్ని పాడుచేసిన చింటూను తిడుతూనే వుంది. మొదట డాక్టరు దగ్గరికి వెళ్ళి వాడి పాదాలకు కట్టు కట్టించి తరువాత ముగ్గురూ సినిమాకు బయలుదేరారు.

అమ్మ ఎప్పుడూ ఆ అంకుల్ పక్కలో కూర్చోవడం, అతనితో మాట్లాడుతూ గడపడం చింటూకు ఎంతమాత్రం నచ్చడంలేదు. అందుకే సినిమాలో వారిద్దరి మధ్యలో కూర్చుంటానని మారాం చేసాడు. జయలక్ష్మి ఒప్పుకోలేదు. "అబ్బ నీతో చచ్చిపోతున్నానురా. నా ప్రాణానికి సుఖంలేకుండా పోతోంది" అంటూ వీపు మీద ఒక దెబ్బవేసి తనకు ఇవతలగా వాడిని కూర్చోబెట్టింది. చింటూకు ఉక్రోషం ముంచుకొచ్చింది. కానీ ఏమీ చేయలేని అసహాయతతో కన్నీళ్ళు కార్చుకుంటూ అలాగే కూర్చున్నాడు. కానీ జయలక్ష్మి మాత్రం అవతలవైపున వున్న అంకుల్ భుజం మీదికి ఒరిగిపోయి నవ్వుకుంటూ సినిమా చూస్తోంది. తెరపైన మహేష్‌బాబును చూస్తూ కొద్దిసేపు తన దుఃఖాన్ని మరచిపోయాడు చింటూ.

రెండు నెలల శెలవులు అవగానే తిరిగి కువైట్‌కి వెళ్ళడానికి సిద్ధపడసాగింది జయలక్ష్మి. పాస్‌పోర్టు, టిక్కెట్టులాంటి ముఖ్యమైనవన్నీ తన హాండుబ్యాగులో వుంచుకుంది. పాస్‌పోర్టును చూసిన చింటూకి అదేంటో అర్థం కాలేదు. "అమ్మా ఇదేంటి?" అని అడిగాడు.

"దీన్ని పాస్‌పోర్టు అంటారు. వీసా టిక్కెట్లతోపాటు విదేశాలకు వెళ్ళేవాళ్ళు దీన్ని తమతోపాటు వుంచుకోవాలి. ఇది లేకపోతే ఫ్లయిట్ ఎక్కనివ్వరు. తిరిగి వెనక్కి ఇంటికి పంపేస్తారు" అంటూ వివరించింది జయలక్ష్మి.

"ఓహో అలాగా" అన్నాడు చింటూ. ఎంటనే వాడి చిన్న బుర్రలో ఎన్నో ప్లానులు వచ్చి చేరుకున్నాయి. తనని విడిచి ఆ అంకుల్‌తో వెళ్ళిపోయే అమ్మను ఆపాలంటే అదొక్కటే మార్గం అని తన మనసులో నిశ్చయించుకున్నాడు వాడు.

ఆ మధ్యాహ్నం భోజనాలు చేసి అందరూ కాసేపు కునుకు తీసారు. బయట వెనుకవైపు నీళ్ళు కాచడానికి వెలిగించిన కట్టెల పొయ్యిలో ఇంకా నిప్పులు పూర్తిగా ఆరలేదు.

నిద్రలో వున్న అమ్మను చూసి మెల్లగా ఆమె హ్యాండుబ్యాగులోనుండి పాస్‌పోర్టును చేతిలోకి తీసుకున్నాడు. వెనుకవైపు కెళ్ళి పొయ్యిలోని నిప్పుల్లో పాస్‌పోర్టును వేసి కిందవున్న కట్టెల్ని దానిపైకి ఎగదోసాడు వాడు. నిముషంలో కాలి నల్లగా బూడిదలా మారిపోయింది ఆ పాస్‌పోర్ట్. అది చూసి చాలా సంతోషంగా అనిపించింది చింటూకి. ఇక అమ్మ కొయేటుకి వెళ్ళలేదు. ఇక్కడే తన దగ్గరే వుండిపోతుంది అని లోపల సంతోషిస్తూ వుండిపోయాడు వాడు.

ఆ సాయంత్రానికి అంకుల్ కడపనుండి వచ్చేసాడు. అమ్మ అంకుల్ కలిసి కారులో చెన్నైకి బయలుదేరారు. "చింటూ జాగ్రత్త నాన్నా బాగా చదువుకో. అమ్మమ్మ మాట విని వేళకు అన్నం తిను" అంటూ అమ్మ జాగ్రత్తలు చెపుతుంటే నవ్వుతూ అలాగే అన్నట్లుగా

తల వూగించాడు వాడు. చెన్నై ఎయిర్‌పోర్టు కెళ్ళిన అమ్మ పాస్‌పోర్టు లేకపోవడంతో తిరిగి ఇంటికి వచ్చేస్తుందని వాడికి తెలుసు కాబట్టి అమ్మ వెళ్ళిపోతోందని వాడు బాధపడలేదు. బయలుదేరేముందు బ్యాగులన్నీ కారులో పెడుతూ "అన్నీ సర్దుకున్నావా? మన పాస్‌పోర్టులు, టిక్కెట్లు బ్యాగులో జాగ్రత్తగా పెట్టుకున్నావా?" అంటూ అంకుల్ జయలక్ష్మిని అడిగాడు.

"ఆ.. సర్దేసాను. అన్నీ వున్నాయి" అంటూ జవాబిచ్చింది జయలక్ష్మి.

మరుసటి రోజు ఉదయాన్నే అమ్మకు బదులుగా అంకుల్ ఇంటికి వచ్చాడు. అంకుల్‌ను చూసిన చింటూ ఆశ్చర్యపోయాడు.

"అత్తగారూ నా పాస్‌పోర్టు టిక్కెట్టు మీ అమ్మాయి దగ్గరే వుంచాను. అవన్నీ హ్యాండ్ బ్యాగులో జాగ్రత్తగా సర్దిపెట్టాను అంటోంది. కానీ తీరా ఎయిర్ పోర్టులోకి వెళ్ళాక నా పాస్‌పోర్టు కనబడలేదు. అన్ని బ్యాగులూ వెదికాం. ఎక్కడా లేదు. ఇక వేరే మార్గం లేక జయలక్ష్మిని మాత్రం విమానం ఎక్కించి నేను తిరిగి ఇంటికి వచ్చేసాను. మీరొకసారి ఇల్లంతా వెదికి చూడండి. నా పాస్‌పోర్ట్ ఇక్కడే ఎక్కడో టేబుల్ సొరుగుల్లోనో అలమార్లలోనో వుండేవుంటుంది. దానికి రెక్కలొచ్చి గాల్లో ఎగిరెళ్ళిపోదుకదా. మీరు వెదికి చూడండి. దొరికిన వెంటనే రేపటి ఫ్లయిట్‌కి నేను వేరే టిక్కెట్టు కొనుక్కుని వెళ్ళిపోవాలి. పాపం జయలక్ష్మి చాలా బాధపడుతూ ఒక్కటే ఫ్లయిట్ ఎక్కి వెళ్ళిపోయింది" అంటూ అలసటగా కుర్చీలో కూర్చున్నాడు రాజు.

అంకుల్ మాటలు విన్న అమ్మమ్మ కంగారు పడిపోయింది. వెంటనే నడుం వంచి పాస్‌పోర్టు కోసం ఇల్లంతా వెదకడం మొదలు పెట్టింది. ఆమె కష్టపడి వెదకడం చూసిన చింటూకి అయ్యో పాపం అమ్మమ్మ అనిపించింది. వెంటనే నిజం చెప్పేద్దామా అనిపించింది కానీ కొడతారేమో అని భయపడి నోటిలో కొచ్చిన మాటను బలవంతంగా ఆపుకున్నాడు.

ఎంత వెదికినా పాస్‌పోర్టు దొరకనే లేదు. అసలు అది వుంటేకదా దొరకడానికి. "ఇప్పుడెలా? వెంటనే వెళ్ళకపోతే అక్కడ బిజినెస్ దెబ్బతింటుంది. ఇక్కడ ఎంబసీకి వెళ్ళి క్రొత్త పాస్‌పోర్టుకు అప్లై చేసుకుని తెచ్చుకోవడానికి ఎన్ని రోజులు పడుతుందో" అంటూ తలపట్టుకున్నాడు రాజు అంకుల్.

అతని బాధ చూసిన చింటూ సంతోషపడ్డాడు. మరుసటి రోజు అంకుల్ నిరాశగా వాళ్ళ యింటికి వెళ్ళిపోయాడు. ప్రక్కింటి ఆంటీ వచ్చి "ఏరా చింటూ మీ అమ్మ ఆ రాజుని వుంచుకుందా? పెళ్ళి చేసుకుంటుందా? అతను బాగా డబ్బున్నవాడంట కదా? మీ అమ్మ బాగానే కూడబెడుతుందిలేరా" అంటూ హేళనగా నవ్వేసరికి చింటూకి చాలా అవమానంగా అనిపించింది.

దాదాపు నెలరోజులు పట్టింది రాజుకు క్రొత్త పాస్‌పోర్ట్ రావడానికి, దానిలో మరలా వీసా స్టాంపింగ్లు అన్నీ పడటానికి. అన్ని రోజులూ అక్కడ జయలక్ష్మి, ఇక్కడ రాజు అంకుల్ బాధపడుతూ కాలం గడిపారు. చింటూ ఒక్కడే వీళ్ళకి తగిన శాస్తి జరిగిందని మనసులో ఆనందించాడు. అమ్మ పైనా ఆ రాజు అంకుల్ పైనా ఏదో తెలియని కసి, ద్వేషం ఆ పసిహృదయంలో పేరుకు పోయాయి. పెరిగి పెద్దవాడయితే అమ్మను కాకపోయినా ఆ అంకుల్‌ని బాగా చితగ్గొట్టాలని వాడు మనసులో నిర్ణయించుకున్నాడు.

*"సరోజ" కథ*

**"ఇంతె కాఫిర్?** ఇంతె సును? హిందీ వలె క్రిస్టియన్?" (నువు విగ్రహారాధికురాలివా? నువు ఎవరు? హిందువా లేక క్రిష్టియనా?) గుడ్లురుముతూ ప్రశ్నించింది కువైటీ మామా(మేడమ్)

తన గుట్టు బయట పడటంతో భయపడిపోయింది సరోజ. రాక్షసిలా ఎదురుగా నిలబడి ప్రశ్నిస్తున్న మామాకి ఏం జవాబు చెప్పాలో తెలియక వణికి పోయింది ఆమె.

"నువు క్రిస్టియన్ అని ఆ ఏజెంటు అబద్ధం చెప్పి మాకు అంటగట్టాడు. నువు నీ అలమారాలో మీ దేవుని ఫోటోలు పెట్టుకుని చాటుగా పూజిస్తున్నావు. పూజలే చేస్తున్నావా లేక మా పైన మంత్ర ప్రయోగాలు చేస్తున్నావా? నిజం చెప్పు. లేకపోతే నిన్ను పోలీసులకు అప్పగిస్తాను. నీ అంతు తేలుస్తాను" అంటూ మామా ఆవేశపడింది.

ఇక జవాబు చెప్పకపోతే మీద పడి కొడుతుందని భావించిన సరోజ నిజం చెప్పడమే మంచిదనుకుంది. "మామా ఆన ఆసిఫ్ (నన్ను క్షమించు) నేను హిందువుని. ఈ ఫోటోలు మా దేవుని ప్రతిరూపాలు. కొద్దిసేపు ప్రార్థన చేసుకుంటున్నాను అంతే" అంది వినయంగా సరోజ.

"ఛీ..ఛీ ఈ కాగితపు బొమ్మలు దేవుళ్ళేమిటి? వీటికి నువు పూజలు చేసి ప్రార్థన చేయడం ఏమిటి? తెలివుందా నీకు? మీ హిందువులు ఆవును, పామును, ఎలుకను కూడా పూజిస్తారట కదా?" హేళనగా నవ్వింది మామా. "జంతువులను పూజించడం తప్పుకదా? నిన్నూ, సమస్తాన్ని సృష్టించిన సర్వేశ్వరుని పూజించకుండా కుక్కని, ఏనుగులను పూజిస్తారా?" మరలా మండిపడింది మామా.

కోపంతో వున్న మామాకు హిందూ సాంప్రదాయాల గురించి దేవుళ్ళగురించి వివరించి చెప్పలేక మౌనం వహించింది సరోజ.

అలమారాలో వున్న దేవుని చిత్రపటాల్ని చెత్తబుట్టలోకి విసిరి కొట్టింది మామా. "నువు ఇలాంటి పిచ్చి పనులు చేసావంటే జైల్లో పెట్టిస్తాను. తరువాత నువు తిరిగి ఇండియాకు కూడా వెళ్ళలేవు. తెలిసిందా?" అలాగే అన్నట్లు తల వూగించింది సరోజ.

"దేవుడొక్కడే ఆయనే సర్వసృష్టికర్త అయిన అల్లా. మనుషులతో పాటు జంతువుల్ని, పక్షుల్ని, సముద్ర జీవుల్ని కూడా ఆయనే సృష్టించాడు. మరి సర్వ సృష్టికర్త అయిన దేవుడ్ని పూజించకుండా మీరు సృష్టిని పూజిస్తే ఆయనకు కోపం రాదా? అయినా ఈ పేపర్ ఫోటోలలోనూ. చిత్రపటాల్లోనూ... మనుషులు చేసిన రాతి బొమ్మల్లోనూ దేవుడు వుంటాడా? ఆకాశాన్ని, అంతరిక్షాలను, ఈ భూమిని సృష్టించి పరిపాలించే దేవుడు అల్లా. ఆయన విశ్వమంతటా నిండివుంటాడు తెలుసుకో" అంటూ బెదిరించింది మామా.

సరోజకు బాగా ఏడుపు వచ్చింది. కానీ ఏడిస్తే మామాకు ఇంకా కోపం వస్తుందని భావించి పనిలో పడింది సరోజ. కానీ మనసంతా బాధతో నిండిపోయింది.

ఆ సాయంత్రం బాబా ఇంటికి రాగానే జరిగిందంతా పూసగుచ్చినట్లు ఆవేశంగా చేతులు తిప్పుతూ ఆయనకు వివరించింది మామా.

"ఈ కాఫిర్ మన ఇంట్లో వుండటానికి వీల్లేదు. దీని చేత్తో చేసినవి ఏమీ మనం తినకూడదు. ఇది విగ్రహారాధికురాలు. సర్వేశ్వరుడైన మన అల్లాను పూజించకుండా విగ్రహాలను పూజిస్తోంది. దీన్ని ఇప్పుడే ఏజంటు దగ్గరికి పంపించేద్దాం. క్రిష్టియన్ అని అబద్ధం చెప్పి దీన్ని మనకు అంటగడతాడా? 400 దినార్లు ధారపోసి పనికోసం దీన్ని మనం కొనుక్కున్నాం. అల్లానుకాక అన్య దేవతలను పూజించే ఈ కాఫిర్ మనకు అవసరంలేదు" అంటూ బాబా కూడా ఆవేశపడిపోయి ఏజంటుతో మాట్లాడటానికి ఫోను చేతిలోకి తీసుకున్నాడు.

పది నిమిషాలు ఏజంటుతో మాట్లాడాక బాబా కోపం ఇంకా పెరిగిపోయింది. "ఇది క్రిష్టియన్ కాదంట, హిందువే అంట. ఒక్క క్షణం కూడా ఈ ఇంట్లో ఇది వుండటానికి వీల్లేదు. మనింట్లోనే కాదు కువైట్‌లోనే వుండటానికి వీల్లేదు. వెంటనే ఫ్లయిట్ టిక్కెట్లు కొని దీన్ని పంపించేద్దాం" అన్నాడు బాబా.

"దీనికోసం టిక్కెట్లు కొని డబ్బు వృధా చేయడం ఎందుకు? అనవసర ఖర్చు. అబద్దం చెప్పి మనింట్లో పనికి చేరి చిత్రపటాల్ని దాచిపెట్టి పూజలు చేస్తోంది, క్షుద్రపూజలు చేస్తోందని కేసు పెట్టి దీన్ని పోలీసులకు అప్పగిద్దాం. తిక్క కుదురుతుంది" అంది మామా సలహా ఇస్తున్నట్లుగా.

అలాగే "అదెక్కడ? ఇక్కడికి తీసుకురా" అన్నాడు బాబా.

అంతవరకు గోడచాటుగా నిలబడి వీళ్ళ మాటల్ని వింటున్న సరోజ పరిస్థితి చాలా తీవ్రంగా వుందని ఎంచి భయపడిపోయింది. ఈ సమస్యనుండి తప్పించమని దేవుళ్ళందరినీ మనసులో ప్రార్థించుకోసాగింది. పోలీసులు అనగానే ఆమెలో వణుకు బయలుదేరింది. కువైట్‌లో నేరాలకు వేసే శిక్షలు ఎంత కఠినంగా వుంటాయో ఆమెకు తెలుసు. పోలీసులకు తనను అప్పగిస్తే తిరిగి తను ఇండియా వెళ్ళడం కలలోని మాటే. తన జీవితం ఇక్కడే కటకటాల వెనుక శిథిలమైపోవాల్సిందే పరిపరి విధాల ఆలోచిస్తూ నిస్తేజంగా నిలబడిపోయిన సరోజ దగ్గరికి వచ్చిన మామ రావడంతోనే సరోజ జుట్టును ఎడం చేత్తో పట్టుకుని కుడిచేత్తో చెంపలపైన ఎడాపెడా కొట్టింది.

"ఏమే పాపిష్టిదానా ఇస్లాం మత సాంప్రదాయాలతో నిష్టను పాటించే మా ఇంట్లో చేరి నీ పూజలు చేసి మా యింటిని భ్రష్టు పట్టించావు కదే. గతనెలలో పిల్లవాడికి జ్వరం వచ్చింది. తరువాత నాకు కుడిచెయ్యి నొప్పి పెట్టి బాధపడ్డాను. మొన్న బాబాకు కారు ఏక్సిడెంట్ అయి క్షణంలో తప్పించుకుని ప్రాణాలతో బయటపడ్డారు. ఇవన్నీ ఎందుకు జరిగాయో, ఎలా జరిగాయో అని మేము ఆలోచిస్తున్నాము. కారణం తెలియక బాధపడ్డాము. ఇదిగో ఇపుడు అర్థమయింది. ఇవన్నీ నీ వల్లనే జరిగాయి. మా యింట్లో పనికి చేరి మా మీదే మంత్ర ప్రయోగాలు చేస్తావా?" అంటు ఎడాపెడా ఈడ్చి కొడుతోంది మామా. దెబ్బలకంటే కూడా మామా అంటున్న మాటలు, వేస్తున్న అభాండాలు సరోజకు చాలా వేదన కలిగించాయి.

ఇంతలో బాబా కద్దామా రూము (పనిమనిషి రూము)లోకి వెళ్ళి అలమారాలన్నీ వెతికి కుంకుమ భరిణె చేత్తో పట్టుకుని వచ్చాడు. "ఏంటి ఇది? ఎర్రగా వున్న ఈ పొడి ఏమిటి? దీనితో పూజలు చేసి మనుషుల రక్తాన్ని పీల్చేస్తావా? " అంటూ లాగి కొట్టాడు.

మామా బాబా కొట్టిన దెబ్బలతో స్పృహ తప్పిపోయేంత పనైంది సరోజకు. తట్టుకోలేక నేలమీదికి జారిపోయింది.

"సరే తొందరగా పోలీసులకు ఫోన్ చెయ్యి. పట్టుకుని పోతారు. మనకెందుకు ఈ పీడ" అంది మామా. ఆ పరిస్థితిలో పోలీసుల చేతిలో పడటం అంటే ప్రాణాల మీద, ఇంటిమీద ఆశ వదులుకోవడమే. అయిపోయింది తన జీవితం. ఇంతటితో ఈ కువైట్‌లో ముగిసిపోబోతోంది. ఎన్నెన్ని ఆశలతో కువైట్‌కి వచ్చింది? చేసుకున్న మొగుడు దుర్మార్గుడై కట్నం కోసం వేధిస్తూ హింసలు పెడుతుంటే వాడితో తెగతెంపులు చేసుకుంది. వాడితో సంవత్సరం పాటు చేసిన కాపురానికి గుర్తుగా ఒక ఆడపిల్ల పుడితే ఆ బిడ్డను తల్లికి అప్పగించి కువైట్‌కి వచ్చింది. నాలుగేళ్ళు కష్టపడి నాలుగు లక్షలు సంపాదించుకుంటే బిడ్డ చదువులకు, భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని ఆశపడింది. కువైట్‌కు రావడానికి, వీసాకోసం ఉన్న నగలన్ని అమ్మేసింది. అప్పులు చేసి ఏజంటుకు కమీషను కట్టి, మిగిలిన దానితో టిక్కెట్టు కొనుక్కుంది. ఇన్ని కష్టాలు పడి కువైట్‌కి వస్తే ఇపుడు ఇక్కడ ఇలా వీరి చేతిలో చిక్కిపోయి దెబ్బలు తినే పరిస్థితి ఎదురవుతుందని ఊహించలేదు. వస్తూ వస్తూ తన బట్టలతోపాటుగా దేవుని ఫోటోలు రెండు తెచ్చుకుంది సరోజ. ప్రతిరోజూ తన ఇలవేల్పు అయిన ఈశ్వరునికి పూజ చేయడం అలవాటుగానూ, దినచర్యగానూ మారింది. కానీ కువైటుకి వచ్చాక ఏజంటు చెప్పిన

మాటలు విని భయమేసింది. కువైటు ఇస్లామిక్ దేశమని, ఈ అరబ్బులు అందరూ ఇస్లాం మత సాంప్రదాయాల్ని తూచ తప్పకుండా ఆచరిస్తారని, క్రిష్టియన్స్‌ని మాత్రం చేర్చుకుంటారు కానీ హిందువులను అస్సలు అంగీకరించరని చెప్పాడు.

"మరి ఎలా? నేను హిందూమతానికి చెందిన దాన్నేకదా" అంది సరోజ.

"ఏం ఫరవాలేదు. ఇక్కడ కువైట్‌కి వచ్చిన భారతీయుల్లో 60 శాతం మంది హిందువులే. కాదంటే మనం వాళ్ళకి క్రిష్టియన్స్ అని చిన్న అబద్ధం చెపితే చాలు. వాళ్ళు ఏమీ అనరు. అందరూ అలాగే చెప్పి పనులు చేసుకుని డబ్బు సంపాదిస్తారు. నువు ఆదివారం పూట చర్చికి వెళ్ళాలంటే కూడా వాళ్ళు శెలవు ఇస్తారు. ఇది కూడా ఒకందుకు మంచిదే రెండువారాలకు ఒకసారి లేదా నెలకొకసారి నీకు శెలవు దొరుకుతుంది. బయటికి వచ్చి స్వేచ్ఛగా గాలి పీల్చుకోవచ్చు. నలుగురితో మాట్లాడుకోవచ్చు. కావల్సింది కొనుక్కోవచ్చు. ఇంటికి డబ్బులు పంపించుకోవచ్చు. లేకపోతే ఇరవైనాలుగ్గంటలూ ఇంట్లోనే వుండి ప్రొద్దస్తమానం పని చేసుకుంటూ నాలుగ్గోడల మధ్య ఏళ్ళ తరబడి కాలం గడపాల్సిందే. కాస్తంత స్వేచ్ఛ, స్వతంత్రం లేకపోతే నువు దిగులుపడి ఎక్కువకాలం ఇక్కడవుండి పనిచేయలేవు. కాబట్టి నేను కువైటీ వాళ్ళకు నువు క్రిష్టియన్ అని అబద్ధం చెపుతాను. వాళ్ళు అడిగితే నువు కూడా అవును అని చెప్పు" అన్నాడు ఏజంటు.

పెట్టెలో బట్టల అడుగున వున్న దేవుని ఫోటోలు భారంగా అనిపించాయి. కాస్త భయంగా అనిపించింది. అయినా కూడా ఇక తప్పదని "అలాగే" అంది.

అనుకున్నట్లుగానే ఒక కువైటీ ఇంట్లో పనికి చేరింది సరోజ. ఒక సంవత్సరం పాటు బాగానే జరిగిపోయింది. నెలకోసారి మధ్యాహ్నం పూట సరోజకు కొద్దిగంటలు శెలవు కూడా దొరికింది.

మధ్యాహ్నం మామా, బాబా డ్యూటీలనుండి వచ్చి భోంచేసి విశ్రాంతి తీసుకునే సమయంలో పనులన్నీ పూర్తిచేసి సరోజ చర్చికి వెళుతున్నాను అని చెప్పి కువైట్ సిటీకి వెళ్ళేది. అక్కడ తన ఊరివారితోనూ, బంధువులతోనూ కలిసి, కాసేపు మంచి చెడ్డా మాట్లాడి, నెలలో వచ్చిన జీతాన్ని బ్యాంకు ద్వారా ఇంటికి పంపించేది. తనకు అవసరమైనవి కొనుక్కుని సాయంత్రానికి తిరిగి వచ్చేది. ఇలా కొంతకాలం గడిచింది. కానీ అన్ని కాలాలు మనవి కావు.

ఎలా కనిపెట్టిందో కానీ మామా సరోజ అలమారాలో వున్న దేవుని ఫోటోలను చూసి మండిపడి పరిస్థితిని పోలీసులవరకు తెచ్చింది.

మరి ఇప్పుడు ఏం చెయ్యాలో అర్ధం కాలేదు సరోజకు. భవిష్యత్తు అగమ్యగోచరంగా అనిపించింది. పోలీసులు రాకమునుపే ఏదో ఒకటి చేయాలి. లేకపోతే ఒక్కసారి వాళ్ళ చేతిలో చిక్కితే తరువాత దేవుడు కూడా కాపాడలేడు.

భయంతో వణికిపోయింది సరోజ. వెంటనే లేని ఓపిక తెచ్చుకుని పైకి లేచి మామా కాళ్ళను పట్టుకుంది. " మామా ఆన ఆసిఫ్ (నన్ను క్షమించు). అల్లా కల్లిక్ (అల్లా దయజూస్తాడు) నన్ను పోలీసులకు అప్పచెప్పొద్దు. వాళ్ళు నన్ను చంపేస్తారు. ఇండియాలో నా బిడ్డ దిక్కులేనిది అవుతుంది. మీరు ఏది చెపితే అది చేస్తాను. మీ మాట వింటాను. ఒక్కసారి నాపైన దయజూపండి" అంటూ భోరుమని విలపించసాగింది సరోజ.

"నిన్నెవరు నమ్ముతారే హిందీ... నీ జీవితం ఇక్కడ జైల్లో ముగిసిపోవాల్సిందే" అంటూ కాళ్ళకు చుట్టుకున్న సరోజను తన్ని అవతలకి నెట్టింది మామా.

కనికరమే లేని మామాను విడిచి బాబా అయినా వింటాడేమో, కాస్త జాలిచూపుతాడేమో అని భావించి ఆయన కాళ్ళ దగ్గరికి పాక్కుంటూ వెళ్ళి ప్రాధేయపడింది సరోజ.

బాబా కాస్త ఆలోచనలో పడ్డాడు. ఆయన ధోరణి చూసి సరోజకు జీవితం మీద కాస్త ఆశ చిగురించింది. బాబా క్షమించి తనను వదిలి పెడతాడని భావించి ఊపిరి పీల్చుకుంది.

ఏదో మంచి ఆలోచన కలిగినట్లుగా బాబా ముఖం వెలిగిపోయింది. "హనాదీ..హనాదీ" అంటూ ఆనందంగా భార్యను కేకలేసి పిలిచాడు.

"ఏమిటండీ, ఏమయింది?" అంది మామా ఆదుర్దాగా.

"దీన్ని పోలీసులకు అప్పగిస్తే ఏం లాభం? వాళ్ళు దీన్ని జైల్లో పడేసి కొట్టి చంపుతారు. నరకాన్ని చూపిస్తారు. కానీ మనం దీన్ని ముస్లింగా మార్చామనుకో అల్లా సంతోషిస్తాడు. దీనివల్ల ఇంకో పదిమంది ముస్లింలుగా మారి మంచి కార్యాలు చేస్తారు ఏమంటావు?" అన్నాడు బాబా.

"ఈ కాఫిర్ ముస్లింగా మారి, ఇస్లాం మతాన్ని స్వీకరిస్తే అల్లా ఎంతగానో సంతోషిస్తాడు. మనల్ని కూడా ఆయన దీవిస్తాడు. మంచి ఐడియా ఇచ్చావు" అంది మామా నవ్వుతూ.

వాళ్ళ ప్లాన్ ఏమిటో అర్థం అయాక ఏం చేయాలో తోచలేదు సరోజకు. పెనంలో నుండి పొయ్యిలో పడ్డట్లయింది ఆమె పరిస్థితి. బలవంతంగా మతం మార్చేస్తారా? తను హిందువుగా పుట్టింది. ఇప్పుడు ముస్లింగా మారి ఇస్లాం మతాన్ని స్వీకరించాలా? ఏదీ దారి? ఎలా తప్పించుకోవాలో అర్థంకాక ఏడుస్తూ నిస్తేజంగా వుండిపోయింది సరోజ.

వీళ్ళు ఎంతపని అయినా చెయ్యగల సమర్థులు. వీళ్ళ మాట వినకపోతే దేనికైనా తెగించగల క్రూరులు. అనవసరంగా తను డబ్బు సంపాదించాలనే ఆశతో ఈ కువైటుకు వచ్చింది. ఇప్పుడు ప్రాణాలమీదికి తెచ్చుకుంది. ఏదేమైనా అన్నింటినుండీ తప్పించుకునే మార్గాన్ని ఆలోచించాలి. తెలివిగా ప్రవర్తించాలి అని మనసులో నిశ్చయించుకుంది సరోజ.

మామా, బాబా ఇద్దరూ నవ్వుతూ సరోజ దగ్గరికి వచ్చారు. ఎంతో ప్రేమగా సరోజ చేయి పట్టి పైకి లేపింది మామా.

"అయ్యో ఏడ్వకు. ఎందుకు ఏడుస్తావు? నిన్ను పోలీసులకు అప్పగించవద్దని బాబా చెపుతున్నాడు. కాబట్టి భయపడకు. కానీ అందుకు బదులుగా నీవు నీ హిందూమతాన్ని, విగ్రహారాధనను విడిచి మా ఇస్లాం మతాన్ని స్వీకరించాలి, మా దేవుడైన అల్లానే ఆరాధించాలి. మా మత సాంప్రదాయాల్ని పాటించాలి. ఐదుపూటలా నమాజు చేయాలి. నీ శరీరం పరాయి పురుషులకు కనిపించకుండా బురఖా ధరించాలి. నువు అల్లాయే దేవుడని ఒప్పుకోవాలి ఇపుడు నిన్ను మా ముల్లా దగ్గరికి తీసుకెళతాం. అక్కడ ఆయన 'లా ఇలాహి ఇల్లల్లా' అల్లా తప్ప మరియొక దేవుడు లేడు అని నీ చేత ప్రమాణం చేయిస్తాడు. నీ పేరుని మార్చి ఇస్లాం మతానికి సంబంధించిన మంచి పేరును నీకు పెడతారు. నీవు ముస్లింగా మారావంటే నీకు మా ప్రభుత్వం నుండి కొంత డబ్బును కూడా ఇప్పిస్తాం. అలాగే మా యింట్లో పనిలో ఉంచుకుని మంచి జీతం నీకు ఇస్తాము. మా మతంలో భర్తను వదిలేసిన స్త్రీలు, భర్త చనిపోయిన స్త్రీలు మరలా వివాహం చేసుకుంటారు. అలాగే నువ్వు ఇంకా యవ్వనంలో వున్నావు కాబట్టి ఇండియాకు చెందిన ఒక ముస్లిం అబ్బాయిని చూసి నీకు పెళ్ళి చేస్తాము. మా అమ్మగారింట్లో నలుగురు పనిమనుషులు ఉన్నారు. నువ్వు చూసావు కదా! మా అమ్మ అందరిని ముస్లిం మతంలోకి మార్చేసింది. వాళ్ళు చెప్పిన మాట విన్నారు. అందుకే వారికి రెట్టింపు జీతాలు ఇచ్చి వారి కష్టసుఖాలను గమనిస్తుంది. వాళ్ళు కూడా చాలా సంతోషంగా వున్నారు. నువు కూడా వాళ్ళందరిలాగా మామాట వింటే నిన్ను మేము బాగా చూసుకుంటాము. నీ అవసరాలన్నీ మేము తీరుస్తాము. కాబట్టి కొద్దిసేపు బాగా ఆలోచించుకుని సిద్ధంగా వుండు. సాయంత్రం మనం ములల్లా దగ్గరికి వెళదాం. లేదంటే బాబా పోలీసులకు ఫోను చేసి నిన్ను అప్పగిస్తానంటున్నాడు" చెప్పాల్సింది చెప్పేసి ఇక నువు ఆలోచించుకుని నిర్ణయం తీసుకో అన్నట్లుగా అక్కడనుండి వెళ్ళిపోయింది మామా.

దుఃఖం ముంచుకొచ్చింది సరోజకు. పుట్టిబుద్దెరిగిన తరువాత ఈశ్వరుని పూజిస్తూ వుండే తను ఈనాడు ఇస్లాం మతాన్ని స్వీకరించడమా? మతం మార్చుకుని అల్లాయే దేవుడని ఒప్పుకోవడమా? ఏం చేయాలి? ఇటు పోలీసులు, అటు ఇస్లాం మతం. దేశం కాని దేశంలో ఈ పరాయి దేశంలో ఈ అరబ్బుల ఇంట్లో ఎంతటి క్లిష్ట పరిస్థితి ఎదురయింది? ఎంతోమంది కువైటుకు వచ్చారు. ఎంతో సంతోషంగా పని చేసుకుని డబ్బు సంపాదించుకుని తిరిగి ఇండియాకు వచ్చారు. మరి తన పరిస్థితి ఎందుకు ఇంత అధ్వానంగా మారింది? ఎందుకు తనకు ఇలాంటి శిక్ష? అయ్యో తెలిసి మతం మార్చుకోవడమా? పుట్టినప్పటినుండీ వున్న పేరును మార్చి క్రొత్త పేరును అదీ ముస్లిం పేరును పెట్టుకోవడమా? ఎలా సాధ్యం?

మరి ఇప్పుడు దీనికి ఒప్పుకోకపోతే తన పరిస్థితి ఏమవుతుందో? జాలి, దయ ఏమాత్రం లేకుండా వీళ్ళు నిరంకుశంగా తనను పోలీసులకు అప్పగించేస్తారు.

వాళ్ళు జైల్లో తోసి వేధించి, సాధించి కొట్టి చంపేస్తారు. తన శరీరం కూడా ఇండియాకు వెళ్ళకుండా ఎక్కడో ఎడారిలో పడేస్తారు. జరిగేది అంతే. కాబట్టి మొదట ప్రాణాలు దక్కించుకోవడం ముఖ్యం. తరువాత నెమ్మదిగా పరిస్థితులను ఆధీనంలోకి తెచ్చుకోవచ్చు. ఇప్పుడు వీళ్ళతో మంచిగా వుండటమే ముఖ్యం. బలవంతంగా మతాన్ని, పేరును మార్చినంత మాత్రాన సరిపోతుందా? తన హృదయం మారదు కదా అని పరిపరివిధాలా ఆలోచించుకుని వారికి అనుకూలంగా ప్రవర్తించి ఈ గండం నుండి బయటపడాలని నిర్ణయించుకుంది సరోజ.

మతం మార్చుకోవడానికి సరోజ సమ్మతించడంతో బాబా, మామా చాలా సంతోషించారు వెంటనే ఆ సాయంత్రమే సరోజను వెంట బెట్టుకుని ముల్లా దగ్గరకు వెళ్ళారు. అక్కడ వాళ్ళు చెప్పినట్లుగా చేసింది సరోజ. "ఇకనుండీ నీ పేరు సమీరా, నువు ముస్లింవి. ఇస్లాం మతాన్ని స్వీకరించావు. అల్లాను తప్ప వేరొక దేవుని నీవు ఆరాధించకూడదు" అంటూ అందరూ కలిసి బోధించారు.

"అలాగే" అన్నట్లు తన సమ్మతిని తెలియజేసింది సరోజ. అలా రెండేళ్ళు గడిచిపోయాయి. ఈ కాలంలో వాళ్ళ ప్రార్ధనలు, మతాచారాలు, సాంప్రదాయాలు చాలావరకు సమీరాకు వాళ్ళు నేర్పించారు.

చాలా నమ్మకంగా వుంటూ వాళ్ళ మాటల్ని వింటూ వాళ్ళ పద్ధతుల్ని ఆచరిస్తూ మనసు చంపుకుని ఆ రెండేళ్ళు గడిపింది సరోజ.

దాదాపు మూడేళ్ళు గడిచాక "ఇండియాకు వెళ్ళి బిడ్డను చూసి తిరిగి వస్తానని తనకు శెలవులు ఇమ్మని" అడిగింది సరోజ. ఈ రెండేళ్ళూ సరోజ ప్రవర్తనతో, పద్ధతులతో సంతృప్తి చెంది చాలా సంతోషంగా వున్నారు మామా, బాబా.

"ఓ.. అలాగే సమీరా దానికేం. ఈ మూడేళ్ళు కష్టపడి పనిచేసావు. శెలవు జీతంకాక రెండు నెలల జీతం అదనంగా తీసుకో, రానూ పోనూ ఫ్లయిట్ టిక్కెట్లు బుక్ చేస్తాం. రెండు నెలలు సంతోషంగా మీవాళ్ళతో గడిపి తిరిగి రా. నీకు ఏం కావాలో చెప్పు. షాపింగ్‌కి వెళదాం" అంటూ మామా ఉత్సాహంగా మాట్లాడింది.

అన్నీ సర్దుకుని మరలా రెండు నెలల తరువాత తిరిగి వస్తానని నమ్మబలికి ఇండియా ఫ్లయిట్ ఎక్కింది సరోజ. ఫ్లయిట్‌లో కూర్చుని టేకాఫ్ అయి ఫ్లయిట్ పైకి ఎగిరాక విండోలోనుండి క్రిందకి చూసి "మా సలాం కువైట్" (బై బై కువైట్) అంటూ సంతోషంగా వీడ్కోలు పలికింది. జైలు నుండి విముక్తి పొందిన సంతృప్తి ఆమె ముఖంలో కనిపిస్తోంది.

# "సీత" కథ

**"సీత మనింటికి** వచ్చి రెండేళ్ళు గడిచాయి. ఈ రెండేళ్ళు మనింట్లో వుండి మన బిడ్డల్ని చాలా చక్కగా చూసుకుంది. జీతం కోసం పనిచేసే పనిమనిషిలా కాకుండా బాధ్యతగా, ప్రేమతో పిల్లల బాగోగులు చూడటం వల్ల, మన పిల్లలు కూడా సీతను ఎంతో అభిమానిస్తున్నారు. సీత సంరక్షణలో పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతూ బాగా చదువుకుంటున్నారు. సీతను వాళ్ళు చాలా ఇష్టపడుతున్నారు. వారి సంతోషం కన్నా మనకు వేరే ఏం కావాలి? అందుకే సీతను మనం బాగా చూసుకోవాలి. ఆమె రెండేళ్ళ అక్కామా(వీసా) గడువు కూడా అయిపోయింది. తిరిగి మరో రెండేళ్ళకు అక్కామా వేయిస్తాను. అలాగే ఇండియా వెళ్ళి రావాలనుకుంటుందేమో కనుక్కో, రెండేళ్ళకు ఒకసారి రెండు నెలల శెలవలు, ఫ్లయిట్ టిక్కెట్లు మనం ఇవ్వాలి కదా?" హాల్లో కూర్చుని "గహ్వ" (అరబిక్ కాఫీ) త్రాగుతూ అన్నాడు బాబా.

"నిజమే. సీతలాంటి మంచి మనిషి దొరకడం కష్టం. ముందుకూడా పనికిమాలినవాళ్ళు ఇద్దరు వచ్చి, పని సరిగ్గా చేయకపోతే వారిని తిరిగి ఏజంటు దగ్గరకి పంపేశాం. వారి కోసం చాలా డబ్బు ఖర్చుపెట్టి నష్టపోయాం మన అదృష్టం కొద్దీ సీత మనకు దొరికింది. నమ్మకంగా పనిచేస్తోంది. ముఖ్యంగా పిల్లల్ని బాగా చూసుకుంటోంది. సీతమీద నమ్మకంతో ఆఫీసుకెళ్ళినా నేను పిల్లల గురించి ఎక్కువగా ఆలోచించకుండా నిశ్చింతగా వుంటున్నాను. ఇలాంటి మనిషికి జీతం ఎక్కువ ఇచ్చినా నష్టమేమీ లేదు. అక్కామా మరో రెండేళ్ళు వేయించి జీతం ఇంకో ఇరవై దినార్లు పెంచండి. రెండునెలలు ఇంటికి వెళ్ళి వస్తుందేమో నేను కనుక్కుంటాను."

"మరి సీత ఇక్కడ లేని రెండునెలల కాలం పిల్లల్ని చూసుకోవడం నాకు కష్టమైపోతుంది. కాబట్టి ఆ ఏజంటుకు ఫోన్ చేసి రెండు నెలల కాలానికి ఎవరైనా పార్ట్ టైమ్ పనిమనిషిని పంపిస్తాడేమో కనుక్కోవాలి" అంది మామా. సీత లేకుండా పిల్లల్ని ఎలా చూసుకోవాలా అనే దిగులు ఆమె మాటల్లో కనిపిస్తోంది.

చిన్నపిల్లవాడైన అబ్దుల్లాకు బాటిల్ పాలు పడుతున్న సీత దగ్గరికి వెళ్ళింది మామా. "సీతా ఈ రెండేళ్ళు మా యింట్లో నీవు బాగా పనిచేసావు. బాబా కూడా నిన్ను మెచ్చుకున్నారు. నువు వచ్చినప్పటినుండీ పిల్లలు నీతో కలిసిపోయి చాలా సంతోషంగా వున్నారు. చంటి పిల్లవాడు అబ్దుల్లా అయితే నిన్ను విడిచి వుండలేకపోతున్నాడు. ఇంతగా పిల్లలు నీకు అలవాటు అయ్యారు. అందుకే మరో రెండేళ్ళకు నీకు అక్కామా వేయించి, నీ కష్టానికి తగినట్లుగా ఇంకో ఇరవై దినార్లు జీతం పెంచాలి అనుకుంటున్నాం. మరి రెండేళ్ళ తరువాత నీకు ఇండియా వెళ్ళి రావడానికి శెలవలు, ఫ్లయిట్ టిక్కెట్లు మేము ఇవ్వాలి. అందరూ అలాగే ఇంటికి వెళ్ళి ఇంట్లో సంతోషంగా గడిపి వస్తారు. మరి నువు కూడా ఎపుడు వెళ్ళాలనుకుంటున్నావో చెబితే ఆ తేదీకి మీ బాబా నీకు ఫ్లయిట్ టిక్కెట్లు కొని తెస్తారు. నువు వెళ్ళి వచ్చే రెండు నెలలూ పిల్లల్ని ఎలా సముదాయించాలా అని నేను ఆలోచిస్తున్నాను. ఎందుకంటే పిల్లలు నిన్ను బాగా ఇష్టపడుతున్నారు. బాగా అలవాటు అయ్యారు. అయినా తప్పదు కదా! నువు కూడా నీ దేశం వెళ్ళి నీ వాళ్ళను చూసి రావాలి కదా!" అంది మామా.

మామా మాటలు విని ఒక్క క్షణం ఆలోచిస్తూ మౌనంగా వుండిపోయింది సీత. తరువాత ఏదో నిర్ణయానికి వచ్చినట్లు నీళ్ళు నిండిన కళ్ళతో, రెండు చేతులూ జోడించి "లేదు మామా నేను వెళ్ళను. ఇంకో పదేళ్ళయినా సరే నాకు ఇంటికి వెళ్ళాలని లేదు. ఎందుకంటే అక్కడ నన్ను ప్రేమించేవాళ్ళు ఎవరూ లేరు. మీ ముగ్గురు పిల్లలూ నన్ను చాలా ఇష్టపడుతున్నారు. వీరి ఆలనా పాలనతో నాకు కాలం సంతోషంగా గడిచిపోతోంది. నాకు పిల్లలు లేరనే కొరత ఈ విధంగా తీరిపోయింది. ఇంతగా నన్ను ఇష్టపడి అలవాటయిపోయిన

ఈ చిన్న పిల్లల్ని విడిచి రెండు నెలలు కాదుకదా, రెండు రోజులు కూడా నేను వుండలేను. అయినా అన్ని రోజులు నేను లేకపోతే పిల్లలు నాకోసం బెంగపెట్టుకుంటారు. దయచేసి నన్ను మీ దగ్గరే వుండనివ్వండి. నాకోసం ఆలోచించని ప్రేమించని మనుష్యుల దగ్గరికి వెళ్ళాలని లేదు" అంది సీత బాధగా.

సీత మాటలకి ఆశ్చర్యపోయింది మామా. "ఏంటి సీతా నీ దేశంలోని నీ యింటికి వెళ్ళాలంటే అంత బాధ ఎందుకు? ఎందుకా కన్నీళ్ళు? ఏంటి నీ కథ? అక్కడ నీకు ఎవరూ లేరా?" భుజం మీద చేయి వేసి ఆప్యాయంగా అడిగింది మామా.

"అందరూ వున్నా ఎవరూ లేనట్లే మామా మానవ సంబంధాలన్నీ స్వార్థపూరితాలే. చివరకు కన్నతల్లిదండ్రులు కూడా స్వార్థంగా ప్రవర్తించడంతో, ఆవేదన చెంది వారికందరికీ దూరంగా, ఇక్కడికి, మీ దగ్గరికి నేను రావలసి వచ్చింది" అంది సీత.

"ఏంటి సంగతి ఏమయింది? నీ గురించి వివరంగా చెప్పు" అంది మామ ఆ ప్రక్కనే వున్న కుర్చీని దగ్గరికి లాక్కుని కూర్చుంటూ.

ఎందుకో మనసంతా గుబులుగా వుంది సీతకు. మధ్యాహ్నం నుండీ ఆ ఆసుపత్రిలో మూలన వున్న ఒక కుర్చీలో కూర్చుని ఆలోచన చేస్తోంది సీత. ప్రొద్దున్నే లేచి భర్త సురేష్‌తో కలిసి మొదటి బస్‌కు బయల్దేరి తిరుపతి ఆసుపత్రికి వచ్చారు. వనజాక్షికి నాలుగేళ్ళు బిడ్డలు పుట్టకపోతే ఈ డాక్టరుకాడికి వచ్చి చూపించుకున్నాకే గర్భం నిలబడిందంట. మంచి మగపిల్లోడు పుట్టినాడట. అందుకే అత్తగారు నెలరోజుల్నించీ "ఆ ఆసుపత్రికి పోయి చూపించుకోండి. డాక్టరు చేయి మంచిదంట. ఇప్పటికి మన ఊర్లో బిడ్డలు లేనివాళ్ళు నలుగురు ఆయన దగ్గరికి పోతే బిడ్డలు పుట్టినారు. పోతే పోయింది ఐదువేలు, ఎక్కడో ఒకచోట ఎవరో ఒకరి కాళ్ళు పట్టుకుని రెండు రూపాయల వడ్డీకి అప్పు తెచ్చి ఇస్తా. మీరు ఆసుపత్రికి పోయిరండి, దేవుడు దయతలచి వచ్చే సంవత్సరానికల్లా నాకొక మనవడు పుడితే అంతే చాలు. వెంటనే కాలిదోవన తిరుపతి కొండకు పోయి ఆ ఏడుకొండల వాడికి నా తల వెంట్రుకలు ఇచ్చి వస్తాను. " అని ఒహటే గొడవ చేస్తావుంటే.. తిరుపతి ఆసుపత్రికి వచ్చారు. రక్త పరీక్షలు మూత్రపరీక్షలు చేసారు. ఎక్సరేలు స్కానింగ్‌లు తీసినారు. ఆ రిపోర్టులన్నీ సాయంత్రం ఇస్తారంట. డాక్టరు కూడా మధ్యాహ్నం భోజనానికి వెళ్ళి మరలా తిరిగి సాయంత్రం ఆరుగంటలకి వస్తారంట. మరి అంతవరకూ ఇక్కడ కూచుని కాలం గడపాల్సిందే. సురేష్ బయటికి వెళ్ళి వీధికి ఎదురుగా వున్న టిఫిన్ సెంటర్‌లో నాలుగు ఇడ్లీలు తిని మరో నాలుగు పొట్లం కట్టుకుని తీసుకుని వచ్చాడు. సీత ఆ నాలుగు ఇడ్లీలు తిని నీళ్ళు త్రాగింది.

రిపోర్టులు వచ్చాక డాక్టరు ఏం చెబుతాడో, ఏమో అని ఆమెకు కాస్త భయంగా వుంది. పెళ్ళయి మూడేళ్ళు దాటి నాలుగో సంవత్సరం వచ్చింది. తనతోపాటు పెళ్ళయిన ఎగవీధిలో ఉండే కుమారికి ఒక పిల్లోడు పుట్టి మరలా పురిటికి అమ్మగారింటికి వెళ్ళింది. చిన్నత్త కోడలికి పాపపుట్టి రెండేళ్ళు దాటింది. ఇపుడు మరలా ఆరోనెల గర్భవతి. ఇవన్నీ చూస్తున్న అత్తగారు సుబ్బలక్ష్మమ్మ సంవత్సరం ముందు నుంచీ సణుగుడు మొదలు పెట్టింది. సాయంత్రం పొలం నుంచి వచ్చాక ఆమె తీరుబడిగా వీధిలో అరుగుమీద కూర్చుంటుంది. వక్కాకు సంచి విప్పి, తమలపాకులకు సున్నం రాసుకుంటూ ఎదురింటి రాములమ్మ పిన్నిని, ప్రక్కింటి శేషవ్వను ఇంకా దారిని పోయేవోళ్ళను పిలుస్తుంటుంది. ఊసుపోని కబుర్లన్నీ మాట్లాడుకుంటూ మధ్యలో, తన కోడలు నీళ్ళు ఇంకా పోసుకోలేదనీ, అందరి కోడళ్ళూ రెండోసారి కూడా పిల్లల్ని కనేస్తున్నారనీ, ఎన్ని దేవుళ్ళకి మ్రొక్కినా ఫలితం కనబడలేదనీ వాపోతుంటుంది. ఊర్లో అందరు అత్తలూ కొడుకులకు పెళ్ళిళ్ళు చేసి సంవత్సరం తిరక్కముందే మనవళ్ళను చంకన బెట్టుకుని తిరుగుతుంటే తనకు ఇంకా ఆ ప్రాప్తం లేదనీ చెప్పినమాటే ప్రతిరోజూ చెప్పి కోడలిని ఈసడిస్తూ వుంటుంది. అమ్మలక్కలు కూడా గమ్మునుంటారా సమయం దొరికింది కదా

అని వాళ్ళ నోటికొచ్చినట్లు తలో మాట చెప్పి అగ్నికి ఆజ్యం పోసినట్లుగా ఆమె కడుపు మంటను ఎక్కువ చేస్తుంటారు. ఆమె అవన్నీ తెచ్చి కోడలిమీద తన అయిష్టతను కోపాన్ని ద్వేషాన్ని వెళ్ళగక్కుతుంటుంది.

అత్తగారి ఈసడింపులు విన్నప్పుడల్లా అంతులేని బాధతో కుమిలిపోయేది సీత. తనకు పిల్లలు ఇంకా ఎందుకు పుట్టలేదో అని లోలోపల మధనపడేది. శృతిమించిన అత్తగారి సాధింపులకు జవాబు ఏం చెప్పాలో అర్థంకాక, ఇంటికోడలిగా ఎదురుగా మాట్లాడే ధైర్యమూ చేయలేక తనలో తానే ఏడ్చుకునేది సీత. భర్తకన్నా చెప్పుకుని ఊరట పొందుదాం అనుకుంటే ఆమెకు తోడు సురేష్ కూడా సూటిపోటిమాటలతో హింసిస్తుంటాడు.

''గట్టు కింద పల్లెలో రాజేశ్వరి అనే పిల్ల తెల్లగా భలేవుంది. కట్నం కూడా రెండు లక్షలు ఇస్తాం అన్నారు. ఆ పిల్లకు కొంచెం పళ్ళు ఎత్తుగా వున్నాయని మా అమ్మ వద్దురా అనింది. ఆ పిల్లను చేసుకొని వున్నా ఈ పాటికి ఇద్దరు బిడ్డల తండ్రిని అయివుండేవాడిని. చిన్నారం పాడులో ఒక పిల్లను చూసాం. చేసుకోమని వాళ్ళు బంగపడినారు. చదువు కూడా ఇంటర్ దాకా సదివింది. ఒక్కటే పిల్ల. ఉన్న ఇల్లు ఆస్తులూ అన్నీ అల్లుడికే. అందుకే మాయమ్మ మంచి ఆస్తులురా అన్నీ మనకే వస్తాయి చేసుకో అని మా అమ్మ పోరుపెట్టింది. కానీ ఆ పిల్ల కాకి నలుపు. పుట్టేపిల్లోళ్ళు క్రరిగా పుడతారు ఆ పిల్ల నాకొద్దు అంటిని. ఆ పిల్ల మొన్నా మధ్య కోడూరు బస్టాండ్‌లో కనబడింది. సంకలో తెల్లటి పిల్లోడ్ని బెట్టుకుని పోతావుంది. ఆ పిల్లను చేసుకుని వున్నా బాగుండేది. ఆస్తిని అనుభవించే అదృష్టం లేకపాయె -

'ఈ పిల్ల వద్దురా లక్షరూపాయలు కూడా ఇచ్చేట్టుగా లేరు. పేదోళ్ళుగాని, ఏం పెడతారు కొంచెం పెట్టేకాడ చేసుకోరా బాగుపడతావు. ఊర్లో కూడా గౌరవంగా వుంటాది' అని మాయమ్మ ఎంతజెప్పినా వినకుండా నువు ఎర్రగా బుర్రగా వున్నావని పట్టుబట్టి నిన్ను చేసుకున్నానని ఏం పెట్టినాడు మీ నాయన? యాభైవేలు లెక్క చేతికిచ్చి నీకు ఐదు తులాల బంగారం పెట్టి ఇదిగో ఇంకో ఆడపిల్ల ఎదిగి ఇంట్లో వుండాది. దాని సంగతి కూడా మేము చూడాలి కదా అని కల్లబొల్లి మాటలు చెప్పి నిన్ను కట్టబెట్టినాడు. పోనీలే పిల్ల బాగుంది చూసేదానికి అందరిలో అందంగానూ ఊరిలో గొప్పగానూ వుంటాది అని పెద్దగా పెట్టక పోయినా నిన్ను చేసుకున్నాను. నాతోపాటు పెళ్ళయిన నాతోటి కుర్రాళ్ళకి అందరికీ ఎప్పుడో పిల్లోళ్ళు పుట్టి నాయనా అని పిలుస్తాండారు. పుట్టిన పిల్లోళ్ళను మెడలమీద ఎక్కించుకుని వీధుల్లో గొప్పగా తిరుగతాండారు. తమ మగతనాన్ని నిరూపించుకున్నందుకు విర్రవీగుతూ రొమ్ము విరుచుకుంటున్నారు. నీయమ్మ గొడ్డుదానా.. నా రాత బాగలేక నిన్ను చేసుకుని నేను దేనికీ పనికిరాకుండా పోతినే. వీధుల్లో సిగ్గుపడతా తిరగాల్సి వచ్చేనే. మగోడు పెళ్ళి చేసుకునేది ఎందుకు? కొడుకును కని వంశాన్ని, ఇంటి పేరును నిలబెట్టాలనే కదా! పిల్లోళ్ళు పుట్టకపోతే ఆ పెళ్ళి ఎందుకు? దాన్ని పటంగట్టి గోడకు వేలాడదీసుకోనా? బయటికి పోవాలంటే నాకు సిగ్గుగా వుండాది. నాతోటి కుర్రగాళ్ళు అందరూ నన్ను జూసి నవ్వుతుండారు. ఛీ ఎందుకీ బ్రతుకు? ఎండ్రిను త్రాగి చస్తే బాగుంటాది'' అంటూ ఇంకా రకరకాలుగా అనరాని మాటలన్నీ నోటికొచ్చినట్లు సులభంగా అనేసి సీతను క్రుంగదీసేవాడు. మాటలా ఇవి గుండెల్లో దించిన గునపాలా అనిపించి ఏడ్చుకునేది సీత.

బిడ్డలు పుట్టకపోవడం తన తప్పు అయినట్లుగా వాళ్ళు సాధించడం, మాటలతో వేధించడం ఎంతో ఆవేదనకు గురిచేసేది. దేవుడా దయతలచి నాకొక్క బిడ్డనివ్వు అంటూ అన్ని దేవుళ్ళకూ మొక్కుకునేది సీత. అత్తగారైతే అస్తమానం అన్ని గుళ్ళకూ తీసుకెళ్ళేది. అత్తగారు చెప్పినట్లు తడి బట్టలతో, ఉపవాసాలతో పూజలు, వ్రతాలు చేసి అలసిపోయింది సీత దీనికి తోడు ఆడపడుచు రాజికి ముగ్గురూ కొడుకులే పుట్టారు. సీత పెళ్ళయినప్పటినుండీ ఇప్పటికి రెండుసార్లు పుట్టింటికి వచ్చి మగపిల్లల్ని కని గర్వంగా పిల్లోడ్ని సంకలో బెట్టుకుని వెళ్ళిపోయేది. వెళుతూ వెళుతూ మగ పిల్లోళ్ళను కంటున్నందుకు మురిసిపోతూ సీతవైపు చూసి ''వదినా నీ అందం తరిగిపోతుందని పిల్లోళ్ళు పుట్టకుండా మందులు మింగుతున్నావా ఏంటి? స్త్రీకి పిల్లల్ని కనడం దేవుడిచ్చిన వరం. మాతృత్వం అనేది ఎంతో

మధురమైనది. పిల్లలు లేకపోతే స్త్రీ బ్రతుకు వ్యర్థం తెలుసుకో. నీ తోటి వాళ్ళందరూ రెండోసారి కంటున్నారు. తొందరగా నువు కూడా ఒక కొడుకుని కని మా యింటి పేరును నిలబెట్టలేకపోతే మా అన్నకు ఇంకో పెళ్ళి చేయాల్సివుంటుంది. జాగ్రత్త'' అంటూ బెదిరిస్తుంది. అదేదో అంతా సీత చేతిలో వున్నట్లు మీట నొక్కితే పిల్లలు పుట్టేటట్లు, అలా నొక్కకపోవడం సీత తప్పయినట్లుగా హేళన చేసేది ఆడపడుచు. దేవుడా నన్నెందుకు పుట్టించావు? పుట్టించి ఇలా ఎందుకు హింసిస్తున్నావు అని దేవుడ్ని ప్రార్థిస్తూ, ప్రశ్నిస్తూ కుమిలిపోయేది సీత. రోజులు గడిచేకొద్దీ అన్నివైపుల నుండి వత్తిడి ఎక్కువైంది సీతకు.

ఇప్పుడు ఈ ఆసుపత్రిలో రిపోర్ట్సు వచ్చాక డాక్టరు ఏమని చెపుతాడో అని భయంగావుంది. ఏవైనా మందులు ఇచ్చి కొన్ని రోజులు వాడండి ఫలితం వుంటాది అని చెబితే బాగుంటుంది. పిల్లలు లేకపోవడం తనకు కూడా సిగ్గుగానూ, అవమానంగానూ వుంది. ఆలోచనలు ఎంతకీ తెగడం లేదు.

ఇంతలో అటెండరు వచ్చి డాక్టరుగారు పిలుస్తున్నారు అని చెప్పడంతో ఇద్దరూ లోపలికి వెళ్ళారు. డాక్టరు ఇద్దరివైపు చూసి ''మీ పెద్దవాళ్ళెవరూ రాలేదా?'' అని అడిగాడు.

''లేదు డాక్టర్'' అన్నారిద్దరూ ఒకేసారి.

''ముఖ్యమైన విషయం చెప్పాలి పెద్దవాళ్ళకు చెబితే బాగుంటుంది. సరే ఫరవాలేదు. మీరు ఎవరి బిడ్డనైనా తెచ్చి పెంచుకోండి. మీకు పిల్లలు పుట్టే యోగ్యత లేదు'' అన్నాడు డాక్టరు.

''ఎందుకు డాక్టర్? మాతో ఎవరికైనా ప్రాబ్లెమ్ వుందా?'' అని సురేష్ అడిగితే ఆయన

''ఎవరికుంటే ఏం? మీరు తల్లిదండ్రులులేని బిడ్డని దత్తత చేసుకోండి బాగుంటుంది'' అని తేల్చేశారాయన. ఇంకేం అడగలేక ఉసూరుమంటూ ఆఖరి బస్ ఎక్కి ఇంటికి తిరిగి వచ్చారు ఇద్దరూ.

డాక్టరు చెప్పిన జవాబుతో అత్తగారు తృప్తిపడలేదు. రాత్రంతా అత్త, మామ, కొడుకు తర్జన భర్జనలతో కాలం గడిపి, మరలా ప్రొద్దుటే లేచి ముగ్గురూ ఆసుపత్రికి వెళ్ళిపోయారు. వాళ్ళు తిరిగి వచ్చేవరకూ ఇంట్లోకీ, బయటికీ తిరుగుతూ ఊర్లోకి వచ్చే ఎర్రబస్సు కోసం ఎదురు చూస్తూ కంగారుగా కాలం గడిపింది సీత.

రాత్రి పదిగంటలకు ఆఖరి బస్ దిగి నీరసంగా ఇంట్లోకి వచ్చారు ముగ్గురు. ఎందుకో వారి ముఖాలు చూడాలంటేనే భయం కలిగింది సీతకు. పిల్లలు కలగకపోతే తన పరిస్థితి ఏమిటి? వీళ్ళ మాటలు వింటూ ఎన్నాళ్ళు జీవించగలదు? వీళ్ళ సాధింపులు భరిస్తూ ఎన్నేళ్ళు కాపురం చెయ్యగలదు. అసంభవం. అంతకన్నా ఏ నుయ్యో గొయ్యో చూసుకుని అందులోకి దూకి చావడం మంచిదేమో. ముగ్గురు మౌనంగా భోంచేసారు. పడకలు బయట వేయమని చెప్పి ముగ్గురూ బయటచేరి మంతనాలు ప్రారంభించారు. వాళ్ళు ఏం మాట్లాడుకుంటున్నారో వినాలని కాస్త తాపత్రయపడింది. కానీ వాళ్ళు ఆమెను లోపలే వుండమని చెప్పడంతో రూములోనే పడుకుండిపోయింది. ఎపుడో మధ్య రాత్రిలో మంతనాలు ముగించిన మొగుడు రూములోకి వచ్చి 'సీతా సీతా' అంటూ సీతను నిద్రలేపాడు. ఆమె నిద్రపోతే కదా లేవడానికి. ఆ పరిస్థితిలో ఎలా నిద్రపడుతుంది?

''సీతా నీకు పిల్లలు పుట్టే యోగ్యత లేదని రిపోర్టులలో తేలింది. డాక్టరు చేత ఆ విషయం బయటకి చెప్పించడం కోసం ఈ రోజంతా అక్కడ పడిగాపులు కాసాం. ఆయన చెప్పకపోతే మా మేనమామ భార్య తమ్ముడు అక్కడే డాక్టరుగా చేస్తుంటే వెళ్ళి వాళ్ళను పట్టుకుని రిపోర్టులు చూపించి నిజం బయటకి చెప్పించాల్సి వచ్చింది. లోపం నీలోనే వుందంట. మరేం చేద్దాం చెప్పు. ఈ విషయం తెలిసినప్పటినుండీ ఇంత బ్రతుకూ బ్రతికి ఎవరికో పుట్టిన అనాధ బిడ్డని తెచ్చి మనం పెంచుకోవడమా? మన రక్తం, వంశం, ఇంటిపేరు

ఏంగాను? అందుకే నువు రెండో పెళ్ళి చేసుకోరా అని మా అమ్మ పోరు పెడుతోంది. నువ్వంటే నాకు చాలా ఇష్టం. అందుకే కట్నం తక్కువయినా నిన్ను కావాలని మరీ పెళ్ళి చేసుకున్నాను. కానీ ఇప్పటికే నాలుగేళ్ళయింది. మనకు పిల్లలు కలగలేదు. ఇక నీవల్ల పిల్లలు పుట్టరని తెలిసిపోయింది. కాబట్టి నువు కాస్త పెద్దమనసు చేసుకుని నేను మరో పెళ్ళి చేసుకోవడానికి నీ అభ్యంతరం లేదని చిన్న పేపర్లో రాసి నీ సంతకం పెడితే, నేను పిల్లల కోసం ఎవరో వొకర్ని చూసి పెళ్ళి చేసుకుంటాను. దేవుడు దయతలచి ఇద్దరు పిల్లలు పుడితే అంతేచాలు. నిన్ను నేను వదిలి పెట్టను. ఇక్కడే నువు వుండచ్చు. నీకేం తక్కువ కాకుండా నిన్ను బాగా చూసుకుంటాము'' నచ్చచెబుతున్నట్లుగా ప్రేమగా మీద చేయి వేసాడు సురేష్. అతని చేయి తీసి ప్రక్కన పెట్టి నిద్రనటించింది సీత.

''సరే నీకు నిద్రవస్తున్నట్లుంది పడుకో ప్రొద్దున్నే మాట్లాడుకుందాం'' అంటూ ప్రక్కనే పడుకున్నాడు సురేష్. ఏదో జంతువు వచ్చి తన ప్రక్కన పడుకున్నట్లుగా వళ్ళు జలదరించింది సీతకు. తప్పదు కాబట్టి అలాగే కదలకుండా ఒక ప్రక్కకు ఒదిగి పడుకుండిపోయింది.

ఇక అప్పటినుండీ ఇంట్లోని వారందరూ సీత ప్రక్కన చేరి సంతకం చేయమని ఒత్తిడి చేయసాగారు. వారి మాటలను భరిస్తూ ఆ అనకుండా ఊహూ అనకుండా మౌనంగా ఉండిపోయింది సీత. వారి మాటలూ ప్రవర్తనా ఆమెకేమీ తేడా అనిపించడంలేదు. నాలుగేళ్ళనుండీ వాళ్ళ మనస్థత్వాలు బాగా తెలిసి వుండటంతో ఇవన్నీ ముందే ఊహించినట్లుగా నిమ్మళంగా ఉండిపోయింది. కానీ ప్రతిరోజూ ఆమె చెవిలో ఇల్లుకట్టుకుని పోరుపెడుతున్నారు ముగ్గురూ. దీనికి తోడు అత్తగారు ఇరుగుపొరుగమ్మలకు పిల్లలు పుట్టకపోవడానికి కారణం మా కోడలే. తప్పంతా తనదే మా కొడుకుది ఏమాత్రం లేదు అని విషయాన్ని చెప్పినట్లున్నారు. ఈ మధ్య వారి తాకిడి ఎక్కువయిపోయింది.

''అయ్యో గొడ్రాలి జన్మ ఎంత పాపిష్టి జన్మకదా? నీ ఆడబ్రతుక్కి అర్థమే లేకుండా పాయనే. మనిషివి చూస్తే చక్కగా వున్నావు. మోడైన చెట్టులా మిగిలిపోతివే'' శూలాల్లాంటి సానుభూతి మాటలతో సీతను పొడిచేవారు. ఆడపడుచు కూడా ప్రతిరోజూ ఫోను చేసి పదినిముషాలు హితబోధ చేసేది.

ఇక ఆ ఇంట్లో బ్రతకడం ఎంతో దుర్లభం అనిపించింది. ఇలాంటి మనుషుల మధ్య ఏ విధంగా బ్రతకగలదు? ఎందుకో చాలా సిగ్గుగా అనిపించింది సీతకు. తనమీద తనకే జాలిగా అనిపించింది. వాళ్ళు కోరినట్లుగా ఆ పేపర్పై సంతకం చేసేసి పుట్టింటికి వెళ్ళి తలదాచుకుందాం అని నిర్ణయించుకుంది. కానీ అపుడే ఆమె ఊహించని సంఘటన జరిగింది. దాంతో ఆమె మానసికంగా షాక్కు గురయింది. ఆమెకు మనుషుల మీదే నమ్మకం పోయింది. అందువల్ల ఆమె వాళ్ళందరికీ బుద్ధి చెప్పాలని తనకు తగిన నిర్ణయాన్ని తీసుకుని అమలు పరిచింది. జరిగిన ఆ సంఘటన ఏంటంటే..

నాల్రోజుల తరువాత ప్రొద్దున్నే పదిగంటలప్పుడు సీత అమ్మా నాన్నలు తమ చిన్న కూతురైన గీతను వెంటబెట్టుకుని బస్ దిగారు. చెప్పా పెట్టకుండా సడన్గా వాళ్ళు రావడంతో కాస్త ఆశ్చర్యానికి, మరో విధంగా తమ వాళ్ళను చూసి ఆనందానికి లోనయింది సీత. వాళ్ళను చూడగానే తనలోని బాధ కాస్త తగ్గినట్లయింది సీతకు. ఆప్యాయంగా పలకరించింది. తన వేదనను వాళ్ళతో చెప్పుకుని ఊరట పొందాలని అనుకుంది సీత.

ఆ రోజు అత్తమామలు కూడా పొలం పనులకు వెళ్ళకుండా ఇంట్లోనే వుండిపోయారు. అందరూ హాల్లో కూచుని సంతోషంగా మాట్లాడుకోసాగారు ''అమ్మా సీతా నువు వంట చెయ్యి. మేము కూర్చుని కబుర్లు చెప్పుకుంటాం'' అంటూ అత్తగారు ఆర్డర్ వెయ్యడంతో సీత వంటింట్లోకి వెళ్ళిపోయింది. సురేష్ కూడా నవ్వుకుంటూ వాళ్ళతో చేరిపోయాడు. తన అమ్మా నాన్నలు ఎప్పుడూ వచ్చినా ముఖం

ముటముటలాడించే అత్తగారు ఈ రోజు సంతోషంగా నవ్వుతూ వాళ్ళతో కబుర్లు చెప్పడం సీతకు ఆశ్చర్యాన్ని కలిగించింది. డాక్టరు ఇచ్చిన రిపోర్ట్సు విషయం తెలిస్తే అమ్మా నాన్నలు ఎంతగా బాధపడతారో అని ఆలోచిస్తూ వంట చేయసాగింది సీత. ఈ లోపల వాళ్ళకు కాఫీలు పట్టుకొచ్చిన సీతకు సురేష్ గీత ప్రక్కన కూర్చుని పరాచికాలు ఆడుతూ కనిపించాడు.

"ఏంటే మరదలా ఈ మధ్య తెల్లబడ్డావే. ఏం సోపు వాడుతున్నావేంటి?" అంటూ బుగ్గ పట్టి లాగుతున్నాడు. బదులుగా అది "అక్కకు పిల్లలు పుట్టరటకదా అందుకే నిన్ను చేసుకోమని అమ్మా నాన్న చెపుతుంటే నాల్రోజుల్నుంచీ ఫెయిర్ అండ్ లవ్లీ ఫేస్ క్రీమ్ వాడుతున్నాను బావా" అంటూ మెలికలు తిరిగిపోతోంది చెల్లెలు గీత. ఇంతలో సీత నాన్నగారు కలగజేసుకుని "సురేష్‌కు గీతనిచ్చి పెళ్ళి చేస్తే అంతా ఒకచోటే వుంటారు చెల్లెమ్మా. మరలా పరాయి సంబంధం ఎందుకు? అన్నింటికీ ఇబ్బంది అవుతుంది" అంటున్నారు అతి వినయాన్ని ఒలకబోస్తూ అత్తగారితో. వాళ్ళ మాటలకి నిశ్చేష్టురాలయింది సీత. భూమి రెండుగా చీలితే అందులో తాను దిగబడిపోయి అక్కడ దాక్కోడం బాగుంటుంది అనిపించింది సీతకు.

మనుషులు తల్లిదండ్రులైనా, అక్క చెల్లెళ్ళైనా సరే ఎంత స్వార్థంగా ఆలోచిస్తారో మానవ సంబంధాలు ఎంత స్వార్థమైనవో అపుడే అర్థమయింది సీతకు.

మధ్యాహ్నం భోజనాలు కాగానే అందరూ సీత చుట్టూ కూర్చున్నారు.

"నీకు పిల్లలు పుట్టకపోతే ఏమయిందే సీతా నువు బాధపడాల్సిన పనేలేదు. సురేష్‌కు మన గీతను ఇచ్చి పెళ్ళి చేస్తే పదినెలలు తిరిగేలోపల బిడ్డ పుడతాడు. మీరందరూ ఒకటే చోట వుంటారు. నువు కళ్ళు మూసుకుని ఒక్క సంతకం పెట్టు చాలు" అంటూ వూకుమ్మడిగా చెప్పసాగారు. సురేష్ అయితే ఏకంగా బెడ్‌రూమ్‌లో చేరి గీతతో సరసాలు కూడా మొదలుపెట్టాడు.

అదికూడా సిగ్గులేకుండా నవ్వుతూ బావప్రక్కనే అతుక్కుని కూచుంది. ఛీ.. ఈ మనుషులకు సిగ్గులేదా? నీతి లేదా? వీళ్ళకన్నా జంతువులు నయమేమో. ఆ క్షణాన జీవితం మీదే విరక్తి కలిగింది సీతకు. వాళ్ళందరి పోరు భరించలేక సరే, నాక్కొంచెం టైమివ్వండి. అలాగే చేద్దాం అంది సీత. దాంతో అందరి ముఖాల్లోకి ఆనందం పాక్కుంటూ వచ్చింది. అలాగే సీతా నువ్వు కాస్త టైమ్ తీసుకో. ఈలోపల మేము మంచి ముహూర్తాలు చూసుకుని పెళ్ళి ఏర్పాట్లు చేసుకుంటాం అన్నారు అమ్మానాన్నలు. ఎదిగిన రెండో కూతురు గీత చెప్పిన మాట వినకుండా చెడు స్నేహాలతో లోకం పోకడలతో గుండెల మీద కుంపటిలా మండుతుంటే దీన్నెలా వదిలించుకోవాలా అని ఆలోచిస్తున్నారు గీత తల్లిదండ్రులు. ఇదీ మానవత్వం, మనిషితత్వం అనుకుంటూ నిట్టూర్చింది సీత. అప్పటికే ఒక నిర్ణయానికి వచ్చింది ఆమె. అది అమలులో పెట్టటమే మిగిలింది. అందుకే వాళ్ళని కాస్త టైమ్ అడిగింది ఆమె. అనుకున్నవన్నీ సక్రమంగా జరిగితే రెండు నెలల్లో పని ముగిసిపోతుంది.

తన స్నేహితురాలు క్లాస్‌మేట్ అయిన పద్మ భర్తతోపాటు కువైట్‌లో వుండి జాబ్ చేస్తోంది. వెంటనే ఇంట్లో వాళ్ళకు ఎవరికీ తెలియకుండా పద్మకు ఫోను చేసింది సీత. తొందరగా తనకు వీసా పంపించమని, ఇక ఇక్కడ వుండటం కుదరదనీ, ఇదొక నరకమనీ తన బాధను చెప్పుకుంది. "అయ్యో అలాగా బాధపడకు. అలాగే తొందరగా నువు పాస్‌పోర్టు తయారు చేయించుకుని కాపీలు పంపించు. నేను వీలయినంత తొందరగా నీకు వీసా తీసి పంపిస్తాను" అని భరోసా ఇచ్చింది పద్మ. దాంతో కాస్త ఊపిరి పీల్చుకుని కొంత ఊరట చెందింది సీత.

రెండు నెలల లోపలే పద్మ పంపించిన వీసా సీత చేతిలో కొచ్చింది. ఫ్లైట్ టిక్కెట్లు, ప్రయాణపు పనులు చూడటానికి పద్మే ఒక ఏజంటును సంప్రదించి సీతకు సహాయం చెయ్యమంది. అన్ని ఖర్చులకు గానూ తన చేతిలో వున్న నాలుగు గాజులూ అమ్మేసి వచ్చిన డబ్బు ఆ ఏజంటు చేతికిచ్చింది సీత.

వారికందరికీ దూరంగా పరిగెత్తి పారిపోవాలనిపించింది. అమ్మా నాన్నలతో సహా ఎవరిముఖాలూ చూడాలనిపించలేదు సీతకు. వాళ్ళందరూ శత్రువుల్లా కనిపిస్తున్నారు.

కువైట్‌లో మామా బాబాకు ముగ్గురు చిన్న పిల్లలంట. వారి సంరక్షణ చూడటానికి ఒక మనిషి కావాలంటే పద్మకు తెలిసి వెంటనే ఆ వీసా తీసి సీతకు పంపించింది. తన కడుపున పిల్లలు పుట్టకపోయినా కనీసం పరాయి పిల్లల్ని సంరక్షించడం కోసం కువైట్ వెళ్ళడం ఎంతో సంతోషంగా అనిపించింది సీతకు. ప్రేమను పంచడానికి కడుపునే పుట్టాలా ఎవరి పిల్లలయితేనేం, పిల్లలంతా దేవుని స్వరూపాలేకదా అని తృప్తి పడింది సీత. తరువాత రోజుల్లో ఊర్లోని వారిద్వారా తెలిసిందేమిటంటే, సీత సంతకం పెట్టకపోయినా చెల్లి గీతను సురేష్ పెళ్ళి చేసుకున్నాడు. సీత పోతే పోయిందిలే ఎక్కడికి పోతుంది. కువైట్ నుండి తిరిగి వస్తుంది. సంపాదించిన డబ్బంతా ఇంటికే పంపిస్తుంది అంతా మనమంచికే అనుకున్నారు వాళ్ళు. కానీ సీత రెండేళ్ళు దాటినా వారితో మాట్లాడలేదు. ఒక్క రూపాయి కూడా వాళ్ళకు పంపించలేదు. వాళ్ళు సీతతో మాట్లాడాలని ప్రయత్నించినా ఆమె విముఖత చూపించింది. ముఖ్యమైన విషయం ఏంటంటే ఇప్పటికి రెండేళ్ళు గడిచినా గీతకు కూడా ఇంకా పిల్లలు పుట్టలేదంట. మరి వాళ్ళు ఇప్పుడేం చేస్తారో

– అంటూ సుదీర్ఘమైన తన కథను ముగించింది సీత.

కథ విన్న మామా "అయ్యో అలాగా నీకేం ఫరవాలేదు. నువు ఇక్కడే మా దగ్గరే వుండు. నీకు ఇష్టమొచ్చినప్పుడే ఇండియాకు వెళ్ళచ్చు. నీకేం కావాలన్నా నన్ను అడుగు నీకే కొరతలేకుండా మేము చూసుకుంటాము ఎవరూ లేరని దిగులు పడకు నువు కూడా మా యింట్లో మనిషివే. నువ్వింకా చిన్న వయసులోనే ఉన్నావు ఇలా వంటరిగా ఎలా బతుకుతావు. నిన్ను నేను డాక్టర్ దగ్గరకి తీసుకువెళ్ళి ట్రీట్‌మెంట్ ఇప్పిస్తాను. మంచి అబ్బాయిని చూసి పెళ్ళిచేసుకోవాలి. తప్పకుండా నీకు పిల్లలు పుడతారు. ఇలా ఎండిన మోడులా ఎందుకు మిగిలిపోవాలి? నీ జీవితం మళ్ళీ చిగురించాలి. అందుకు సహాయం నేను చేస్తాను." అంది మామా సీతకు ధైర్యం చెబుతూ.

కారణాలు ఏవైతేనేం ఎందరో స్త్రీలు స్వదేశాన్ని తమవారిని విడిచి పరాయి దేశం వెళ్ళి ఏళ్ళకు ఏళ్ళు అక్కడ గడుపుతున్నారు. సీతలాంటి స్త్రీలు గల్ఫ్ దేశాల్లో మరెందరో వున్నారు. పరాయి దేశంలో పనిమనుషుల్లా కాలం గడిపే వారి వెనుక ఎన్నో కథలూ వున్నాయి.

## *రాజ్యలక్ష్మి కథ*

**ఆగకుండా మోగుతున్న ఫోను** శబ్దంతో మధ్యాహ్నపు నిద్రలో వున్న నేను ఉలిక్కిపడి లేచి, ప్రక్కనే వున్న ఫోను చేతిలోకి తీసుకున్నాను. స్క్రీన్‌పై సుజాత అనే పేరును చూడగానే 'అమ్మో ' అనుకున్నాను. ఇప్పుడు కనుక కాల్ ఆన్సర్ చేస్తే కనీసం గంటయినా మాట్లాడి నా మెదడు తినేస్తుంది. ఊర్లోని కబుర్లు, కువైట్‌లోని కబుర్లు అన్నీ చెప్పిందాకా వదలదు. అదీకాకపోతే 'వంద దినార్లు అప్పు ఇవ్వు అక్కా! నాలుగునెలల్లో తిరిగి ఇచ్చేస్తాను ' అంటుంది. ఫోను తీయనా వద్దా అనుకుంటూ రెండు క్షణాలు సందిగ్ధంలో పడి ఇక తప్పదని ఎట్టకేలకు ఆఖరి రింగ్‌కు గ్రీన్ బటన్ నొక్కాను. రెండు నిముషాలు క్లుప్తంగా మాట్లాడి పెట్టేయాలి, చెప్పే రామాయణం అంతా వినకూడదు అనుకున్నాను మనసులో.

అక్కా.. అక్కా "ఈ సంగతి విన్నావా?" అంది గాభరాగా

"ఏ సంగతి?" అన్నాను నేను నిదానంగా. 'ఈ పిల్ల ఎపుడూ ఏదో ఒకటి వాళ్ళ గురించో వీళ్ళ గురించో పనికిమాలిన విషయాలే చెపుతుంది కదా? ' అనుకుంటూ.

"ఎంత ఘోరం జరిగిపోయింది అక్కా. వాడు వినోద్ తగిన పనే చేసాడు ఎంతైనా మగపిల్లవాడు కదా చెవులతో వింటూ కంటితో చూస్తూ ఎంతకాలం స్థిమితంగా వుండగలడు? ఆడది మరీ బరితెగించి అంత విచ్చలవిడిగా వుండకూడదు కదా? కొంచమైనా పరువు మర్యాద కాపాడుకోవాలి కదా? కాస్తయినా గుట్టుమట్టు లేకుండా ఒళ్ళు కొవ్వెక్కి కన్నబిడ్డల ఎదురుగానే ఇష్టమొచ్చినట్లుగా తిరిగితే చివరికి ఇదే గతి పడుతుంది. ఎవరు ఒప్పుకుంటారు చెప్పు? ఎంత అవమానం?

ఏదో బిడ్డల కోసం, వారి భవిష్యత్తుకోసం కుటుంబాన్ని వదిలిపెట్టి కువైట్ పోతా, డబ్బు సంపాదిస్తా అని ఒహటే పోరు పెడుతుంటే విధిలేక సరే అని మొగుడు ఒప్పుకున్నాడు. రెండేళ్ళు మాత్రమే అక్కడ వుండి తిరిగి వచ్చేయాలని ఖచ్చితంగా చెప్పాడు.

మొదట్లో బిడ్డలకోసమే, కష్టపడి డబ్బు సంపాదించాలి అనే ఉద్దేశంతోనే వుండేది. ఇక్కడికి వచ్చాక ఈ తిండి తిని, ఈ నీళ్ళు తాగాక పూర్తిగా చెడిపోయింది. డేవిడ్ అనే క్రిష్టియన్ అతన్ని పట్టుకుని ఏకంగా అక్కడ కాపురం పెట్టేసిందట.

పెదాలకి ఎర్రగా లిప్‌స్టిక్ ఏసుకుని తలనిండా మల్లెపూలు పెట్టుకుని, మెడ తిరక్కుండా నెక్లెస్ వేసుకుని వాడి చెయ్యి వదలకుండా పట్టుకుని మాలియాలో తిరగుతా వుండేదంట.

ఇక్కడ మాలియాలో మన ఊరివాళ్ళు ఎప్పుడూ తిరుగుతూనే వుంటారు కదా. ఏదో ఒకరోజు ఎవరో ఒకరి కంట్లో పడకుండా పోతుందా? అక్కడ ఇంటిని, మొగుణ్ణి బిడ్డల్ని మరిచిపోయి అబ్బబ్బ అవేమి సోకులో? అవేమి ఒగలో? పరాయి మగవాడితో అవేమి తిరుగుళ్ళో.

ఇండియానుండి వచ్చేటప్పుడు దీనంగా తలదించుకుని దిక్కులేని వాళ్ళమనుకుంటూ.. ఇక్కడ కువైట్‌లో కష్టపడి పనిచేసుకుని బ్రతుకుదామని వస్తారు చేసిన అప్పులు తీర్చుకుని బిడ్డల్ని పోషించుకుంటే చాలనుకుంటారు. కానీ ఇక్కడికి వచ్చాక నాలుగు దినార్లు కళ్ళజూడంగనే కళ్ళు నెత్తిమీదికి ఎక్కి గర్వంతో కళ్ళు కనిపించవు. తమ స్థితి, గతి అన్నీ మరిచిపోతారు. మగాళ్ళని మరిగి ఇదే లోకం అనుకుని బిడ్డల్ని కూడా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఏం బ్రతుకులో ఏమో? పరాయి మగాడితో, మొగుడుకాని వాడితో సంబంధాలేమిటో? ఈ బ్రతుకులేమిటో? కలిసిమెలిసి వుండటమేమిటో? ఇక్కడ కువైట్‌లో అడిగేవాళ్ళు లేరని హద్దూ అదుపూ లేదని ఈ కాపురాలు పెట్టడం ఎందుకో? కొంచెమైనా సిగ్గుండక్కర్లా. మనిషి జన్మ ఎత్తితే సరిపోతుందా? ఈ విషయం తెలిసి ఆ డేవిడ్ భార్య పాపం ఇండియాలో ఒకటే ఏడుపు - 'ఓ - జీసస్ నన్నూ పిల్లల్ని కాపాడు కనికరించు. ఆ రాజ్యలక్ష్మి చేతిలోనుండి నా భర్తను విడిపించు ' అంటూ ఒకటే ప్రార్థనలు. చివరికి ఇప్పటికి దాని ప్రార్థనలే ఫలించి దీని పాపం పండినట్లుంది. ఏదో ఒకనాడు చేసిన పాపానికి శిక్షను అనుభవించక తప్పదు కదా? దాదాపు పదేళ్ళు ఇది ఆ డేవిడ్‌ని వశపరచుకుని వదలకుండా చేతిలో పట్టుకుని వాడి డబ్బంతా తినేసింది. పెళ్ళాం పిల్లల్ని అక్కడ పస్తులుంచి భార్యకు భర్తను దూరం చేసింది. సాటి స్త్రీని వేదనకు గురిచేస్తే పుట్టగతులుంటాయా?

చివరికి ఆ డేవిడ్ భార్య గోడంతా ఆ దేవుడు విన్నట్లున్నాడు. దీనికి తగిన శాస్తి జరిగింది. కాదంటే పాపం అనవసరంగా ఈ పిల్లోడు వినయ్‌కి ఎంత శిక్ష పడుతుందో ఏమో? తల్లి చేష్టలు కళ్ళారా చూసి వాడికి పాపం రక్తం మరిగిపోయింది. కంటినిండా నిద్రపోలేకపోయాడు, కడుపునిండా తిండితినలేకపోయాడు. అందునా ఈ లోకం తల్లిని గురించి కోడై కూస్తుంటే మగపిల్లాడు వింటూ ఎలా వుండగలడు? మగపుట్టుక పుట్టాక పౌరుషం వుంటుంది కదా? అప్పటికి ఎన్నోసార్లు ఎంతో మర్యాదగా చెప్పాడంట. వాళ్ళమ్మ కాళ్ళు పట్టుకుని 'అమ్మా పదేళ్ళు గడిచిపోయాయి. ఇంటిని మమ్మల్ని వదిలేసి కువైట్‌కి వెళ్ళిపోయావు. అపుడు మేము చిన్న పిల్లలం

కానీ ఇపుడు మేము పెద్దవాళ్ళం అయ్యాం. నీ గురించి అందరూ వ్యంగ్యంగానూ చెడుగానూ మాట్లాడుతుంటే నా హృదయం బాధతో చచ్చిపోతోంది. అలాంటి మాటలు చెవులతో వింటూ బ్రతకలేకపోతున్నాను. జరిగిందేదో జరిగిపోయింది. అయిందేదో అయింది. ఇకనైనా ఆ డేవిడ్‌తో సంబంధాన్ని విడిచి ఇంటికి వచ్చెయ్యి. ఆ కువైటూ వద్దూ, ఆ డబ్బూ మనకొద్దు. ఇప్పుడు నేను పద్దెనిమిదేళ్ళ పిల్లోడ్ని అయ్యాను. కావాలంటే ఏదో ఒక పనిచేసి నేను సంపాదించగలను. మన కుటుంబాన్ని పోషించగలను.' అని ఎంతో బ్రతిమలాడుకున్నాడంట. కానీ ఇది ఈ భ్రష్టురాలు ఎంత చెప్పినా, ఏం చేసినా ఈ భూమి ఆ ఆకాశం తలక్రిందులైనా సరే ఆ డేవిడ్‌ని మాత్రం వదిలేది లేదంట. వాడే నాకు ప్రాణం వాడిని విడిచి క్షణం కూడా బ్రతకలేను అందంట. కన్నకొడుకు ఇలాంటి మాటలు విని ఎలా సహించగలడు? ఆవేశం పొంగుకొచ్చి, అలవిమాలిన కోపంతో తనను తాను మరిచిపోయాడు. ఇంకేం చేస్తాడు? వాడికి ఇంక వేరే మార్గం కనబడలేదు. ఇండియాకు శెలవలకు వస్తే కొన్ని రోజులైనా ఇంటి పట్టున వుండకుండా ఆ డేవిడ్‌తోనే షికార్లట. ఎదిగిన బిడ్డల ముందే తల్లి తన తండ్రితో కాకుండా పరాయి మగవాడితో తిరుగుతుంటే ఎవరు భరించగలరు? అయినా పౌరుషం పొంగి పొరలే వయసు వీడిది. రేపోమాపో పెళ్ళి చేసుకోవాల్సిన వాడు తల్లి గురించి తన స్నేహితుల ముందు తలదించుకోవాల్సిన పరిస్థితి. ఎలా సహించగలడు?

అయినా ఆడదానికి మగాడి భయం కాస్తయినా వుండాలి. తండ్రో మొగుడో కొడుకో, చివరికి అన్నదమ్ములో ఆడదాన్ని కాస్త కనిపెట్టి వుండాలి. లేకపోతే దీనిలాగే విచ్చలవిడిగా పరాయి మగవాడితో తిరిగితే కుటుంబాలు పిల్లలు ఏంగాను? ఆ చెర్లోపల్లి బేబి కూడా అంతే. ఇప్పటికి ఇరవై ఏళ్ళుగా ఆ క్రిష్ణతో కువైట్‌లో కాపురం పెట్టింది. ఇద్దరికీ పెళ్ళి అయినట్లుగా అక్కడ డూప్లికేట్ సర్టిఫికెట్లు సృష్టించారట. ఇరవైవేలు డబ్బు లంచంగా ఇస్తే అలాంటి పెళ్ళి పేపర్లు తయారు చేసి స్టాంపు కొట్టి ఇచ్చేస్తారంట. వాటిని పట్టుకుని కలిసి కాపురం చేస్తే అక్కడి పోలీసులు ఏమీ అనరంట.

అది ఇక్కడ ఇద్దరు పిల్లల్ని కన్నాక మొగుడ్ని వదిలేసి కువైట్‌కి పోయింది. అక్కడ ఆ క్రిష్ణకి వీసాల వ్యాపారం అంట. సంపాదించిన డబ్బంతా దీని చేతిలో పెడతాడంట. ఆ డబ్బంతా పెట్టి చెర్లోపల్లిలో నాలుగంతస్తుల ఇల్లు కట్టేసింది. టౌనులో స్థలం కొనుక్కుంది. కొడుకు ఇంటర్మీడియెట్ చదవగానే కువైట్ పిలిపించి వాడికి అక్కడ ఉద్యోగం చూపించింది. తరువాత మంచి పిల్లను చూసి పెళ్ళి చేసింది. ఆ పిల్లకు గానీ, వాళ్ళ వాళ్ళకు గానీ ఇక్కడ ఇదిచేసే భాగోతాలు ఏవీ తెలియవట. అందుకే మోసపోయి పిల్లను ఇచ్చారు. తరువాత కోడల్ని కూడా కువైట్‌కి పిలిపించింది. కొడుకు కోడళ్ళముందే ఆ భర్తకాని భర్త క్రిష్ణతో కలిసి జీవిస్తోంది. ఈ కువైట్‌కి వచ్చి మన ఆడవాళ్ళు మన పద్దతుల్ని, సంస్కారాన్ని మరిచిపోయి హద్దుల్ని ఎంతగా దాటుతున్నారో చూసావా? ఆ కొడుకు రాజేష్ మాత్రం తన తల్లి చేష్టల్ని పట్టించుకోడంటగానీ ఆ కోడలు మాత్రం గొణుగుతూ ఇది పద్దతికాదని గోల పెడుతుందంట. 'మీరు ఇలాంటి వాళ్ళని తెలియక పరాయి మగవాడితో ఈ కువైట్‌లో కలిసి వుంటున్నారని అందునా ఆయనకు పెళ్ళాం పిల్లలు ఇండియాలో వుండగా మీరు ఈ పని చేస్తున్నారని మాకు తెలియలేదు. ముందే తెలిసివుంటే మావాళ్ళు నన్ను ఇస్తామన్నా నేను మాత్రం మీ కొడుకుని అస్సలు చేసుకునేదాన్ని కాదు. ఆయన పెళ్ళాం పిల్లలు ఈ సంగతి తెలిసి ఎంత బాధపడుతున్నారో? వాళ్ళ ఉసురు మీకెందుకు? వాళ్ళ బాధ కన్నీళ్ళూ వూరికే పోవు. మీకు శాపంగా తగలకుండా పోదు. మీ పాపం మాకు, మా బిడ్డలకికూడా శాపమై తగిలితే నేను ఏం చేయాలి? అత్తగారు, అందులో వయసులో పెద్దవారు కాబట్టి మిమ్మల్ని బ్రతిమాలుకుంటున్నాను. అదే నా తల్లి అయితే కాళ్ళూ చేతులు కట్టిపడేసి ఫ్లయిట్ ఎక్కించి ఇంటికి పంపేదాన్ని. మీకు వయసా అయిపోయింది. కొడుక్కి పెళ్ళికూడా చేసారు. కన్నకొడుకు కోడలి ముందు ఇలా పరాయి మగవాడితో కలిసి వుండటం సమంజసమా? ఇక ఇంటికి వెళ్ళి క్రిష్ణా రామా అనుకుంటూ ఇంట్లో కూచుని కాలక్షేపం చేయకుండా ఏం పోగాలం దాపురించింది మీకు? ' అని దులిపేసిందట. అయినా దానికి సిగ్గువుంటే కదా? మనవళ్ళు

పుడుతున్నా బ్రతుకుల్ని మార్చుకోవడంలేదు. మరి మనవళ్ళకు ఏం జవాబు చెపుతారో. ఛీఛీ ఇలాంటి వాళ్ళు ఆడజన్మ ఎత్తి ఎలా పుడతారో ఏమో? వీళ్ళ మొహం చూస్తే మనకు కూడా పాపమే. ఎంతమంది నవ్వుతున్నా హేళన చేస్తున్నా వీటికి సిగ్గు కలగడంలేదు. బరితెగించి వీధుల్లో తిరుగుతున్నాయి. వీటిని కిరసనాయిలు పోసి తగలబెట్టాలి."

ఎక్కడా ఆపకుండా ఆవేశంగా చెప్పుకుపోతోంది సుజాత. ఇవతల వింటున్న నా చెవి గింగురుమంటోంది.

అసలు విషయం చెప్పకుండా వెనుక ముందు వున్న కథ మాత్రమే కనీసం గంటసేపు ఆపకుండా చెప్పడం సుజాతకున్న ప్రత్యేకత. ఏది ఏమయినా తన ఆవేశానికి ఒక అర్ధం వుందనిపించింది. 'నిజమే కదా? పొట్ట చేతపట్టుకుని దేశాన్ని ఇంటిని, బిడ్డలను వదిలి విమానం ఎక్కి ఇక్కడికి వచ్చి అన్నీ మరిచిపోయి మన దేశానికి, కుటుంబానికి, బిడ్డలకు తలవంపులు తెచ్చే పనులు చేస్తే ఎలా? ఆడది చేసిన తప్పులు తల్లిదండ్రులకు, తోడబుట్టినవారికి, బంధువులకి, బయటివారికి తెలిసినా పరవాలేదేమోకానీ కన్నబిడ్డలకి మాత్రం ఎట్టి పరిస్థితుల్లో కూడా తెలియకూడదు. ఆ తల్లి పిల్లల ఎదుట జాగ్రత్తగా ప్రవర్తించాలి. తల్లి తప్పు చేస్తోందంటే తెలిసిన పిల్లలు భరించలేరు. వారి హృదయం ఎంతగానో క్షోభిస్తుంది. ఆ ప్రభావం వారి మీద పడి వాళ్ళు దొంగలగానో, హంతకులగానో శాడిస్టులగానో తయారవుతున్నారు. శారీరక సుఖాలకో, డబ్బుకో లొంగిపోయిన తల్లులు చేతులారా తమ పిల్లల భవిష్యత్తును తామే నాశనం చేస్తున్నారు. తమ స్వార్ధానికి వారిని బలి చేస్తున్నారు. ఇలాంటి పిల్లలవల్ల కుటుంబాలు సమాజం పాడైపోతోంది. కువైటు వాళ్ళు కూడా విస్తుపోయేలా ఇక్కడ లంచగొండితనం, వ్యభిచారం విస్తరించి పోయింది. మద్యపానమే లేని ఈ దేశంలో మనవాళ్ళేకదా అక్రమంగా సారా కాచి ఇక్కడ అమ్ముకుని లక్షలు సంపాదిస్తూ ఈ దేశాన్ని భ్రష్టుపట్టిస్తున్నారు. పేరుకు మాత్రం ఇంట్లో పనిచేసే మనుషులు, కానీ అక్రమంగా వీసాలు కొనుక్కుని బయట వుంటూ విచ్చలవిడిగా తిరిగి ఇష్టప్రకారం జీవించి ఈ దేశ చట్టాల్నే మభ్యపెడుతున్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తూ అక్రమంగా బ్రతుకుతున్నారు.

అక్రమ వీసాలు, వడ్డీలకి అప్పులు ఇచ్చే వ్యాపారాలు విస్తరించి పోయి అన్యాయంగా పేదలను దోచుకుంటూ కోట్లు సంపాదిస్తున్నారు. క్లిష్టమైన కష్టమైన కువైటు చట్టాన్నే మసిపూసి మారేడుకాయ చేస్తూ డబ్బే పరమావధిగా భావిస్తూ తప్పుడు పనులు చేస్తున్నారు. ఇలాంటి వాళ్ళు మన భారత దేశాన్నే కాదు ఈ కువైటును కూడా పాడుచేస్తున్నారు.

వీసా గడువు అయిపోయాక మరలా క్రొత్త వీసాను కొనుక్కోకుండా ఏళ్ళ తరబడి ఈ కువైటులో వుంటూ చాటుమాటుగా తిరుగుతూ పోలీసుల కంటబడకుండా ఏళ్ళతరబడి తప్పించుకుని తిరిగేవాళ్ళు వేలమంది వున్నారు. నిజంగా ఈ కువైటు వాళ్ళు ఎంత మంచివాళ్ళు. దయా జాలి కలవాళ్ళు కాబట్టే ఈ అక్రమాలన్నీ తెలిసికూడా దేశానికి, వాళ్ళకు జరిగే అన్యాయాలు గ్రహించి కూడా సహిస్తూ చూసీ చూడనట్లుగా కళ్ళుమూసుకుని పోతున్నారు. పోనీలే పరదేశస్తులు, పేదవారు పనికోసం మనదేశానికి వచ్చారు. బ్రతకనీలే అని ఊరికే వుంటున్నారు. వాళ్ళేకనుక చట్టాన్ని కఠినపరిచి అక్రమంగానూ అన్యాయంగానూ తిరిగే వారిని దేశంలో నివసించేవారిని వెదకి పట్టుకుంటే సగానికి సగం పైగా జైల్లో కూర్చుని శిక్షల్ని అనుభవిస్తారు. ఈ మధ్య మనవాళ్ళు మరీ బరితెగించిపోతున్నారు. చట్టాలను అధిగమించి పోలీసుల కన్నుగప్పి తమ ఇష్టారాజ్యంగా జీవిస్తున్నారు. మనవాళ్ళు ఇలాగే యధావిధిగా మరికొన్ని సంవత్సరాలు తమ ధోరణిని కొనసాగిస్తే ఈ దేశం కూడా మన దేశంలాగే తయారవడం తధ్యం. ఆ రోజు ఎంతో దూరంలో లేదనిపిస్తోంది.

ఇక్కడ ఎడారి నేలలోంచి నిరంతరం ఊటలా పెట్రోలు బావుల్లోంచి ఉబికి వస్తోంది కాబట్టి, ఆ పెట్రోలు ప్రపంచదేశాల్లో అత్యధికమైన ధనాన్ని ఆర్జించి పెట్టి కువైటును ధనిక దేశంగా నిలబెడుతోంది కాబట్టి వీళ్ళు ఇంకా ఇక్కడ బ్రతికిపోతున్నారు. లేకపోతే వీళ్ళేకాదు. ఇక్కడ వుంటున్న పరదేశులు కూడా ఎన్నాళ్ళు జీవించగలరు? పెట్రోలు తప్ప ఇంకో వేరే వనరులు లేవు. ఇంకో ఆదాయమూ వీరికి లేదు. ' నా ఆలోచనల్లోంచి తెప్పరిల్లేసరికి అరనిముషం పట్టింది. ఈ లోపల అవతల నుండి సుజాత ఏమాత్రం ఆగకుండా

మాట్లాడుతూనే వుంది. కువైట్‌లో అడ్డు అదుపూ లేకుండా సాగిస్తున్న అక్రమ సంబంధాల గురించి, వ్యభిచారం గురించీ వ్యాపారాల గురించీ, నశించి పోతున్న మానవత్వపు విలువల గురించి చెప్పుకుపోతోంది. ఇన్ని చెబుతోంది కానీ ఇంతకీ అసలు విషయం చెప్పలేదే అనుకుంటూ "హలో ఏమే సుజాతా ఇంతకీ జరిగిందేమిటో చెప్పు. అసలు విషయం చెప్పకుండా ఏదేదో చెపుతావే?" అన్నాను. మాటలకి అడ్డుపడుతూ.

"హుమ్. ఏం చెప్పాలక్కా? ఎలా చెప్పాలో తెలియడం లేదు. చెప్పడానికి మాటలు రావడం లేదు. పరాయి మగవాడిని మరిగిన ఇలాంటి ఆడవాళ్ళ గతి ఆఖరికి ఇంతే. తప్పదు. వాళ్ళు పాడయిపోయేది కాక కుటుంబాన్ని బిడ్డల్ని. వాళ్ళ బ్రతుకుల్ని కూడా నాశనం చేసేస్తున్నారు. ఈ లోకంలో దేవుని తరువాత పూజింపదగినది తల్లి. తల్లిని మించిన దైవం తల్లిని మించిన గురువు లేరంటారు. బిడ్డలు తల్లిని తమ ప్రపంచంగా భావిస్తారు. తల్లిలో పవిత్రతను, మంచితనాన్ని, గొప్పతనాన్ని చూడాలనుకుంటారు. తల్లికంటే మంచివాళ్ళు, గొప్పవాళ్ళు ఈ లోకంలో మరొకరు లేరనుకుంటారు. తల్లిని గురించి ఎవరైనా చెడుగా మాట్లాడితే భరించలేరు. తల్లిని గురించి చెడుగా విన్నప్పుడు భరించలేక ప్రాణం విలవిలలాడుతుంది. అలాంటి తల్లే తప్పు చేస్తే అదీ బిడ్డలకి తెలిసేలా ప్రవర్తిస్తే వాళ్ళ కంటిముందే విచ్చలవిడిగా తిరిగితే ఏ బిడ్డ హృదయం తల్లడిల్లకుండా వుండగలదు? తల్లిప్రేమ, తనకు చెందాల్సిన ప్రేమను తండ్రికాని పరాయి మగవాడు అన్యాయంగా అక్రమంగా తల్లినుండి దోచుకుంటుంటే చూసే ఆ పసిహృదయం బాధను ఎలా ఓర్చుగలదు? అందుకే రాజ్యలక్ష్మిలాంటి తల్లులకి వినయ్‌లాంటి కొడుకులు పుట్టాలి. కత్తికి ఒక కండగా చేసి ఇలాంటి ఆడచీడ పురుగుల్ని నరికి కాకులకు గద్దలకు పారేయాలి. అప్పటికైనా ఇలాంటి ఆడవారికి కనువిప్పుగలుగుతుంది. భర్త బ్రతికి వుండగానే బిడ్డలు ప్రక్కన వుండగానే వంటికి క్రొవ్వెక్కి శరీరానికి మదమెక్కి ఇవి అడవి మృగాల్లా ప్రవర్తిస్తున్నాయి. సమాజాన్ని భ్రష్టుపట్టిస్తున్నాయి."

"సరే .. సరే ఇక ఉపోద్ఘాతం ఆపు. గంట దాటిపోయింది. ఛార్జింగ్ అయిపోతే నా ఫోను ఆఫ్ అయిపోతుంది. ఇపుడైనా ఇక అసలు విషయం చెప్పు." ఇటువైపు నుండి అరిచాను విసుగ్గా.

నా కోపాన్ని గమనించి అపుడు ఈ లోకంలోకి వచ్చింది సుజాత. తనని తాను సర్దుకుని తన ఆవేశాన్ని తగ్గించుకుంది. మాటను మృదువుగా మార్చి గొంతు తగ్గించి "వినయ్ తన తల్లిని కత్తితో పొడిచేసాడు. ఇరవై కత్తిపోట్లట. ప్రస్తుతం రాజ్యలక్ష్మి సీరియస్ కండిషనుతో ఐ.సి.యులో వుంది. వాడేమో పొడిచేసి రక్తపు కత్తితోపాటుగా పోలీసు స్టేషనుకు వెళ్ళి జరిగిందంతా చెప్పి లొంగిపోయాడట. అందరూ వాడు చేసిన పనికి ఆశ్చర్యపోయారట. కొందరు అభినందించారట. దాదాపు ఆరేళ్ళనుండీ వాడికి విషయం బాగా అర్థమయినప్పటినుండీ తల్లి సంపాదన ముట్టుకోలేదట వాడు అమ్మా నువ్వు కువైట్‌కి వెళ్ళి చెడిపోయావు. మాకు దూరమైపోయావు. నువు అక్కడ సంపాదించే పాపిష్టి డబ్బు మాకు అక్కరలేదు. కావాలంటే ఇక్కడ మాకు అవసరమైతే అడుక్కుని అయినా తింటాం అని తిరస్కరించేవాడట.

తల్లిని, తల్లి సంపాదనను అసహ్యించుకునే వాడంట. నువు తల్లివైతే అక్కడ ఆ డేవిడ్‌ని వదిలేసి ఇంటికి వచ్చి మాతో వుండు. మనకు వున్నదే తిని బ్రతుకుదాం అని ఎన్నిసార్లు చెప్పినా ఆ తల్లి వినకపోయేసరికి వాడికి జీవితం మీదే విరక్తి కలిగింది. అందరూ తల్లిని గురించి చెడుగా మాట్లాడుకుంటుంటే విని సహించలేక ఎన్నోసార్లు ఆత్మహత్య చేసుకుని చనిపోదామనుకున్నాడుట. చివరకి తల్లినే పొడిచి చంపేసాడట. పోలీసులు కూడా వాడినే అభినందించి శిక్ష తక్కువ పడేలా చేస్తాం. మహా అయితే నాలుగయిదేళ్ళు. తరువాత బయటకి వచ్చి పెళ్ళి చేసుకొని సుఖంగా వుందువు అన్నారంట.

ఇలాంటి కథలు ఎన్నో. కళ్ళముందే ఇలాంటి ఆడవారినెంత మందినో చూస్తున్నాం. ఏం చేయగలం?" అంటూ ఆగింది సుజాత. నిజమే ఏం చేయగలం? ఏమీ చేయలేం.

తప్పు ఎక్కడ ఎవరిలో వుంది? తప్పు పేదరికానిదా? భార్య, పిల్లల్ని పోషించలేని భర్తలదా? బిడ్డల్ని పోషించుకోవడానికి కువైటుకు వచ్చి ఆ విషయాన్ని మరిచిపోయి తరువాత ప్రక్కదారుల్లో పయనించే ఆడవాళ్ళదా?

పనులకోసం పరదేశాలకు వెళ్ళడానికి అనుమతించే మనదేశానిదా? ఆలోచిస్తూ వుండిపోయాను నేను.

## *ఏజంటు విజయ కథ*

**"ఏంటే బుజ్జీ** నీకు నిద్రపట్టడం లేదా? అటూ ఇటూ పొర్లుతూ నసుగుతున్నావు? చాలా రాత్రయిపోయింది ఇక పడుకో. మేడమ్ చూసిందంటే కేకలేస్తాది" చెవిలో చిన్నగా గుసగుసగా చెప్పింది రత్న.

"ఎంత ప్రయత్నించినా నిద్ర రావడం లేదక్కా. ఎందుకో చాలా భయంగా వుంది. ఇక్కడి వాతావరణం, ఈ పద్ధతులు నాకస్సలు నచ్చుడంలేదు. కష్టపడి పనిచేసుకుని డబ్బు సంపాదించాలని ఇక్కడికి వచ్చాను కానీ, ఇక్కడ మనసు చంపుకుని బానిసకంటే హీనంగా బ్రతికే పరిస్థితి ఇలా ఈ కువైట్‌లో కలుగుతుందని ఊహించి వుంటే అస్సలు ఇక్కడికి వచ్చేదాన్నే కాదు. ఈ నరకంలో వుండటం కంటే చావడం మేలు. ఇక్కడ గడిచే ఒక్కోరోజు. ఒక్కో సంవత్సరంలా అనిపిస్తోంది. ఏదో విధంగా ఇక్కడనుండి బయటపడి ఇల్లు చేరుకుని హాయిగా గుండెల నిండా మన గాలి పీల్చుకోవాలనిపిస్తోంది. ఎపుడొస్తుందో ఆరోజు. ఎంతకాలం పడుతుందో? " నిట్టూర్చింది బుజ్జి.

"అందమైన లోకమని రంగు రంగులుంటాయని అందరూ అంటూంటారు. బుజ్జెమ్మా ఇది అందమైంది కానేకాదు బుజ్జెమ్మ.. బుజ్జెమ్మా" అంటూ చిన్నగా పాటందుకుంది. అటు కిచెన్ తలుపుకు దగ్గరలో చాపలేసుకుని పడుకుని వున్న పద్మ.

"ఓహో నువ్వు కూడా మేలుకునే వున్నావా? ఇంతవరకూ గురకపెట్టి నిద్రపోతున్నావు కదా" అడిగింది రత్న.

"మీ గుసగుసలకి నా గురకపోయి మెలుకువ వచ్చిందిలే రత్నమ్మా" అంది పద్మ నవ్వుతూ.

"ష్ చిన్నగా. ఆ ఏజంట్ మేడమ్ లేచిందంటే మనల్ని ఎడమకాలితో తన్ని అందరినీ కలిపి బాత్ రూములోకి తోసేసి బయటకి రాకుండా తాళం వేస్తాది. రాత్రంతా బాత్‌రూములో తడినేలపైన పడుకోలేక చచ్చిపోతాం. ఇక మాటలు పాటలు ఆపి నిద్రపోండి" కసురుకుంది బాత్‌రూమ్ గుమ్మం దగ్గర ముడుచుకుని పడుకుని వున్న గౌరి.

"ఈసారి తన్నమని చెప్పుదాన్ని. తన్నిన ఆ కాలును పట్టుకుని లాగి క్రింద పడవేసి కుమ్ముతాను. దెబ్బకు దాని నాయున్ను తలచుకోవాల. మూతికున్న ముప్పై నాలుగు పండ్లు రాలిపోవాల" ఆవేశంగా బదులిచ్చింది పద్మ.

"అయ్యబాబోయ్ ఇపుడు అంత గట్టిగా అరవకు. ధైర్యముంటే రేపు ప్రొద్దుటే దాన్ని పట్టుకుని తన్ని చూపించు. మేము కూడా తలా ఒక కాలు వేస్తాం తన్నడానికి. మనలాంటి వాళ్ళ వుసురు పోసుకుని కోట్లు సంపాదించి కులుకుతోంది ల..." తిట్టింది గౌరి.

"వీసాల వ్యాపారం చేసి దిక్కు తెలియకుండా సంపాదించి, బాగా తిని గొడ్డులాగా బలిసిపోయింది ఇది. నీలాంటి బక్కది పట్టుకుని తన్నినా దానికి చీమ కుట్టినంత నొప్పి కూడా వుండదు. దాని సర్వీసులో అది మనలాంటి వాళ్ళని ఎంత మందిని చూసిందో? ఎంతమంది కద్దామా (పనిమనుషులు)లను కష్టపెట్టి కంటినీరు తాగించిందో? ఇలాంటి నరరూప రాక్షసికి తగిన బుద్ధి చెప్పాలంటే ఆ దేవుడే స్వయంగా భూమిపైకి దిగిరావాలి. దుష్ట శిక్షణ చేయాలి" అంది బుజ్జి కలుగజేసుకుని.

"ఇంతకీ మనల్ని ఎన్ని రోజులు ఇలా ఇక్కడ బంధించి వుంచుతుందో? ఏమో? ఈ రోజంతా నా చేత దాని వంటికి ఆలివ్ ఆయిల్ రాయించుకుని మసాజ్ చేయించుకుంది. ఏనుగులా తెగ బలిసిపోయిన దాని వళ్ళు మసాజ్ చేసేసరికి నా రెండు చేతులు సచ్చు పడిపోయాయి" అయ్యో అనవసరంగా దీని చేతిలో పడితిమే అంటూ వాపోయింది రత్న.

"నా సంగతి కూడా వినక్కా. నిన్న వంటగది, బాత్‌రూములు క్లోరెక్సు వేసి కడిగించింది. రుద్దిన చోటే రుద్ది కడిగిన చోటే కడిగించింది. ఆ క్లోరెక్స్ పవర్‌ఫుల్ కెమికల్ కదా నా అరచేతులు పుచ్చిపోయి చర్మం అంతా బొబ్బలు పోయింది. చేత్తో అన్నం కూడా తినలేక పోయాను. దీని బారినుండి తప్పించుకుని ఎపుడు బయట పడతామో ఆ దేవునికే ఎరుక కనీసం ఇంటికి ఫోను కూడా చేయనివ్వదు. ఇంట్లో వాళ్ళతో మాట్లాడి ఎన్ని రోజులయిందో ఏమో? జైల్లో వేసి బంధించినట్లయింది మన పరిస్థితి" బాధపడింది గౌరి.

"అందరం కలిసి దీన్ని పట్టుకుని గొంతు పిసికి చంపేసామంటే పీడా విరగడవుతుంది మనకే కాదు మనలాగా వీసాలు కొనుక్కుని ఎంతో ఆశతో కువైట్‌కి వచ్చే వందలమంది ఆడవాళ్ళకి ఎంతో మేలు జరుగుతుంది. ఇది చేస్తే ఎంతోమంది బాగుపడతారు. ప్రాణాలు దక్కించుకుంటారు" చెప్పింది పద్మ.

"చిన్నగా మాట్లాడండి. దానికి మెలకువ వచ్చి లేచి వచ్చిందంటే మనకి ఈ రాత్రి శివరాత్రే" అంది కిసుక్కున నవ్వుతూ గౌరి.

"ఈ రోజు సాయంత్రం రెండో ప్రియుడు వచ్చాడుగదా! కడుపునిండా బిరియాని మెక్కి మంచమెక్కి వున్నారు. తెల్లారే దాకా గదిలోంచి బయటికి రాదు. ఆ భయమేమి లేదు" భరోసా ఇచ్చింది బుజ్జి.

"దీన్ని ఇక్కడ కాదు గానీ ఇండియాలో కనిపించిందంటే మాత్రం ఇది ఇక్కడ చేసిన దుర్మార్గాలన్నీ చెప్పి పోలీసులకు పట్టించి వళ్ళు వాయగొట్టించాలి. జీవితాంతం జైల్లో పెట్టించాలి" కసిగా చెప్పింది రత్న.

"ఇంతకీ ఇది మనల్ని కువైటీ ఇండ్లలో పని చేయడానికి పంపిస్తుందా లేక ఇలాగే తన ఇంట్లోనే వుంచుకుని తనకు పరిచర్యలు చేయించుకుంటుందో? ఇప్పటికి ముగ్గురు ఏజంట్లు చేతులు మారి వాళ్ళ ఆగడాలన్నీ భరించాము. ఇక వీరి దౌర్జన్యాలు భరించే శక్తి అస్సలు లేదబ్బా. ఈ ఏజంట్లు మన ఇండియా వాళ్ళే కదా కాస్త జాలి, దయ, మానవత్వం వుంటాయి అనుకున్నాం కానీ వీళ్ళలో ఎంత క్రూరమైన మనస్తత్వం ఉందో? పాడు డబ్బు కోసం మనుషుల్ని వేధించి, వేపుకు తింటున్నారు. మిడిమిడి జ్ఞానమో, అక్రమంగా సంపాదించిన డబ్బుతో వీళ్ళ కళ్ళు నెత్తికెక్కి పోతున్నాయి. ఏదో ఒకరోజు దేవుడు వీళ్ళని నేలమీదకి దించుతాడనుకో. మనవాళ్ళకంటే కువైట్ వాళ్ళే ఎంతో మేలు కనీసం మానవత్వం వారిలో వుంది. " ఆవేదనగా పలికింది పద్మ.

"అది కాదే పద్మా! నాకొక విషయం అర్థం కావడంలేదు. మన నలుగుర్నీ ఏదైనా వ్యభిచార గృహానికి అమ్మేయాలనుకుంటోందేమో. లేకపోతే తనే బిజినెస్ చేయాలనుకుంటుందేమో? లేదంటే మనల్ని ఎందుకు ఇన్నిరోజులు ఇలా ఇంట్లోనే వుంచుతుంది? జీవితం ఏమవుతుందో ఏమో? జీవితం నాశనం అయిపోతే తరువాత బ్రతికి ప్రయోజనం లేదు" కంట్లో నీళ్ళు తిరిగాయేమో బేలగా మారింది బుజ్జి.

"ఊరుకో బుజ్జీ ఏడిస్తే ఏమీ సాధించలేం. ధైర్యంగా నిలబడిపోరాడాలి. ధైర్యే సాహసే లక్ష్మీ అంటారు పెద్దలు తెలియదా" అనునయించింది గౌరి.

"మీకో విషయం తెలుసా? దీనిది మా ఊరే. ఒక్కరోజు కూడా బడికెళ్ళి ఓనమాలు నేర్చుకోలేదు. కూలిపనులకి వెళ్ళి కుటుంబాన్ని పోషించుకునేది. అలాంటిది ఇపుడు చూడు ఇంగ్లీషులో తప్ప తెలుగులో అస్సలు మాట్లాడదు. డబ్బును లక్షల్లో తప్ప వేలల్లో అస్సలు లెక్కించదు.

ఎంత అహం? ఎంత గర్వం? మా ఊర్లో పెద్ద షాపింగ్ కాంప్లెక్స్ కట్టించేసింది. ఆస్తులన్నీ బాగా సంపాదించింది. ఆ మేకప్, ఆ స్టైలు! అబ్బ పోయేకాలం దగ్గరికి వచ్చిన వాళ్ళకి ఈ వైభోగాలు మధ్యలో వస్తాయి అనుకుంటా, చిన్నప్పటినుండీ ఒకే ఊర్లో కలిసి పెరిగాం. అదికూడా గమనించకుండా నిన్న కూరలో తిరగమాత మాడిందని చెంపపై లాగి కొట్టింది. పక్షవాతం వచ్చి దీని కాళ్ళూ చేతులు పడిపోతాయి. నన్ను కొట్టినందుకు ఇది తప్పక సర్వనాశనమై పోతాది." శాపనార్థాలు పెట్టింది రత్న.

"ఊరుకో అక్కా బాధ పడగాకు. నిన్నొక్కదాన్నేకాదు మా అందరినీ కూడా కొడుతోంది. కాలితో తన్నుతోంది. అంతేకాదు మొన్న గౌరి అక్కమీదికి కాలి చెప్పు తీసుకుని కొడతా అని వచ్చింది. దానికి పోయేకాలం వచ్చింది. నిన్న నా చేతిలో గ్లాసు క్రిందపడి శబ్ధం వచ్చింది. అంతే ... నిద్రపోతున్నదల్లా లేచి వచ్చి జుట్టు పట్టుకుంది. నా నిద్రను డిస్టబ్ చేస్తావా? శబ్ధం రాకుండా పని చెయ్యడం రాదా అంటూ కొట్టబోయింది. ఎలాగో సారీ చెప్పి దెబ్బ నుదుటిమీద పడకుండా తప్పించుకోగలిగాను" అంది బుజ్జి.

"హా దాని ఇంగ్లిపీసు ముక్కలు నువ్వే వింటున్నావు రత్నా. జనాలు దాని బట్లరు ఇంగ్లీషు వినలేక చెవులు మూసుకుంటున్నారు. కొజ్జా దానికి మేకప్ వేసినట్లుండే దాని వేషం చూసి జనాలు కళ్ళు మూసుకుంటున్నారు. అక్కడ ఊర్లో కూడా ఇది రౌడీ చేష్టలు చేస్తుందట. మొగుడ్ని లెక్క చేయకుండా విచ్చలవిడిగా తిరుగుతుందట. అన్యాయంగా, అక్రమంగా వీసాలు అమ్మి కద్దామాలను పిలిపించి జలగలా మనుషుల రక్తం పీల్చి త్రాగుతోంది ఇది" కోపంగా చెప్పింది గౌరి.

"నిజమే కదా! సరేగానీ ఏమే బుజ్జీ నువు మాత్రం జాగ్రత్తగా వుండు. మేమంటే పెళ్ళయిపోయి పిల్లల్ని కని జీవితాన్ని అనుభవించేసాం. నువు ఇంకా పెళ్ళికాని కుర్రదానివి. ఈ ఏజంటు దెయ్యం నిన్ను ఎక్కువ రేటుకి కువైటువాళ్ళకి అమ్ముకుంటుంది. ఇంకేదైనా పరిస్థితులు నీకు ఎదురైతే అస్సలు ఒప్పుకోబాకు. ధైర్యంగా నిలబడి ఎదిరించు. డబ్బు ఆశ చూపిస్తుంది లొంగబాకు. తప్పుడు పనులు చేసే ఆడది ఇది. దీనికి పరువు మర్యాద, నీతి న్యాయం అంటూ ఏమీ లేవు. ఎలాగయినా, ఏం చేసి అయినా సరే డబ్బు సంపాదించడమే దీని ధ్యేయం. అందుకోసం ఎంతపని అయినా చేస్తుంది. ఎంత పాపానికి అయినా ఒడికడుతుంది. నీలాంటి అందమైన వయసులో వున్న అమ్మాయిని చెడగొట్టి జీవితాన్ని నాశనం చేసి ఆనందించడం దీనికి అలవాటు. దీనికి భయపడిపోయి, దీని మాటలకి లొంగిపోయి జీవితాన్ని పాడుచేసుకోబాక. డబ్బు సంగతి దేవుడెరుగు. ఇంటికైనా తిరిగి వెళ్ళిపోగానీ చెడుపనులకు తలవంచగాకు. ఇంటికాడ కూలిపనులు చేసుకున్నా కడుపు నింపుకోవచ్చు" సరేనా హెచ్చరించింది పద్మ.

"ఏందక్కా అలా అంటావు దాని మాయమాటలకి లోబడతాననుకుంటున్నావా? ఏదో కష్టపడి పనిచేసుకుని కొంచెం డబ్బు సంపాదించాలని ఈ కువైటుకి వచ్చానుగానీ దానిలాగా కిలాడి పనులు చేసి సంపాదించాలని ఇక్కడికి రాలేదు కదా? పరువుపోయాక ప్రాణం ఎందుకు? ఈ డబ్బు ఎందుకు? ఫ్లయిట్ ఎక్కి తిరిగి ఇంటికైనా వెళ్ళిపోతానుగానీ దీనికి లొంగే ప్రసక్తే లేదు" తేల్చి చెప్పింది బుజ్జి.

"సరే మంచిది. ఇక పడుకోండి. మనం తెల్లవారు ఝామున నాలుగుగంటలకే లేచి ఇంటి పనులు మొదలు పెట్టాలి. ఆరయ్యేసరికి దానికి టీలు, టిఫన్లు రెడీ చేసి అందించాలి. లేకపోతే చంపేస్తుంది" చెప్పింది గౌరి.

అప్పటికే పద్మ, రత్న నిద్రలోకి జారుకున్నట్లున్నారు. చిన్నగా వారిద్దరి గురక శబ్దం వినబడుతోంది. రోజంతా కష్టపడిన శరీరాలకు విశ్రాంతి అవసరమే కదా!

బాత్ రూము ముందర వున్న కాస్తంత జాగాలో చాపలు వేసుకుని వరుసగా పడుకుని వున్నారు వాళ్ళ నలుగురూ. ఆ ప్రక్కనే వున్న ఎ.సి బెడ్ రూములో డబుల్ కాట్ పైన రజాయి కప్పుకుని ప్రియుడైన రాజును హత్తుకుని హాయిగా నిద్రపోతోంది ఆ ఏజంటు విజయ.

మరుసటిరోజు మధ్యాహ్నం అందరూ భోజనాలు ముగించాక హాల్లోకి రమ్మని పిలిచింది ఏజంటు విజయ. తలోపని చేస్తున్న వారందరూ వెంటనే వచ్చి తలవంచుకుని, చేతులు కట్టుకుని వరుసగా ఆమె ముందు నిలబడ్డారు. రాత్రి ఆమె గురించి అన్నిమాటలు

అంత ధైర్యంగా మాట్లాడుకున్నారుగానీ ఇప్పుడు అడ్డంగా బలిసిన విజయ మహంకాళిలా ఎదురుగా నిలబడేసరికి అందరికీ వంట్లో వణుకు మొదలయింది. అందరినీ ఒక్కసారే ఎందుకు పిలిచిందో, ఏమి చేస్తుందో అనే భయం వారికి మొదలయింది.

"పది నిముషాలు టైమిస్తున్నాను. మీ అందరూ మీ బ్యాగులు సర్దుకుని రెడీగా వుండండి. నేను పిలిచినప్పుడు నాతోపాటు బయటికి రండి" అంది ఏజంటు విజయ శాసిస్తున్నట్లుగా.

కీ ఇచ్చిన మరబొమ్మల్లా అందరూ కదిలి వెళ్ళి తమ బట్టలు, వస్తువులు సర్దుకోవడం మొదలుపెట్టారు. ఎక్కడికి పంపిస్తుందో, ఏం చేస్తుందో అనే సందేహం వారిలో కదలాడుతోంది కానీ నిశ్శబ్దంగా, మాట్లాడకుండా పదినిముషాల్లో బ్యాగులు చేతపట్టుకుని హాల్లోకి వచ్చేసారు.

కొంతసేపటికి హడావిడిగా వచ్చిన విజయ "రండి తొందరగా నాతోపాటు బయటికి రండి" అంది బయలుదేరుతూ.

అందరూ ఆమెను అనుసరించి ఆ బిల్డింగ్ బయటకు వచ్చారు. అక్కడ చిన్న వ్యాను ఒకటి ఆ బిల్డింగ్ ముందు ఆగివుంది.

విజయను చూడగానే అందులోని డ్రైవరు కిందకి దిగి "సలాం విజయా" అన్నాడు వెకిలిగా నవ్వుతూ.

"సలాం భాషా.. అంతా ఒకే నా? అంది బొటనవేలు పైకెత్తి చూపిస్తూ అంతా ఓకె. ఈ భాషా పనిలోకి దిగితే ఓకె కాక ఏమవుతుంది? ఇదిగో నీకు ఇవ్వాల్సిన డబ్బు బాగా లెక్కపెట్టుకో. మంచి లాభం నీకు" అంటూ నోట్ల కట్టను విజయ చేతికి అందించాడు వాడు.

రెండు చేతుల్తో ఆ నోట్లకట్టను అందుకుని వాడికి థ్యాంక్స్ చెపుతూ భక్తిగా ఆ కట్టను కళ్ళకు అద్దుకుంది విజయ.

"సరేకానీ ఇక మేం బయలుదేరతాం. దాదాపు ఆరుగంటల ప్రయాణం. సౌదీ బార్డర్‌లో సెక్యూరిటీ టైట్‌గా వుంటే కష్టమవుతుంది. ఆ పోలీసు నాకొడుకులు ఈ ఆడవారిని చూస్తే అడ్డమైన ప్రశ్నలన్నీ వేస్తారు. కావాలనే ఆపి ఆడవాళ్ళని వళ్ళంతా చెక్ చేస్తారు. బార్డర్ దాటడం ఎంతో కష్టమైన పని. ఒకసారి బండి అవతలి చేరి సౌదీలో పడ్డామంటే తరువాత ఏ భయమూ లేదు" చెప్పాడు భాషా బండిని స్టార్ట్ చేస్తూ.

"నీకు క్రొత్తేమీ కాదుకదా. తెలిసిన పనే కాబట్టి పెద్ద కష్టమేమీ కాదులే. అంతగా ఇబ్బంది అయితే అదిగో వయసులో వున్న ఆ పిల్ల బుజ్జి వుందిగా. ఓ గంటసేపు ఆ పోలీసులకు అప్పగించు. అన్ని పనులూ పూర్తయిపోతాయి" చెప్పింది కన్నుగీటుతూ విజయ.

"– అహ్హహ.. " అని బిగ్గరగా నవ్వుతూ తలతిప్పి బుజ్జివైపు చూసాడు భాషా. భయంతో ముడుచుకుపోయింది బుజ్జి.

"చూపులకు పిల్ల బానే వుంది. తిండి తింటే బాగా పనికి వస్తాది. ఆ పోలీసులకంటే ముందు నేనే దీన్ని ఒక చూపు చూస్తే బాగుంటాది" ఒంకర నవ్వు నవ్వాడు వాడు. వాళ్ళ మాటలు వింటున్న బుజ్జి భయపడిపోయింది.

"సరే టైమవుతోంది బయల్దేరు. రాత్రికి మీరు బార్డర్ దాటిపోవాలి" హెచ్చరించింది విజయ.

"అలాగే నూట అరవై స్పీడు నాది నీకు తెలుసుగదా" అంటూ బండిని కదిలించాడు వాడు.

అందరిలోకి కాస్త ధైర్యవంతురాలైన పద్మ నోరు మెదిపి కిటికీలోంచి తల బయటకు పెట్టి "మేడమ్ మమ్మల్ని ఎక్కడికి తీసుకెళ్తున్నారు?" అని అడిగింది గాభరాగా.

"ఎంతో దూరం కాదు ప్రక్కనే వున్న సౌదీ. మహా అంటే 200 కిలోమీటర్లు. అంతే. రెండు గంటలు ప్రయాణిస్తే వస్తుంది. అక్కడ షేకులు ఈ కువైటీవాళ్ళకన్నా డబ్బులు బాగా వెదజల్లుతారు. మీ అదృష్టం బాగుంటే నాలాగా కోట్లు సంపాదించవచ్చు. పోయి తెలివిగా ప్రవర్తించి డబ్బు బాగా సంపాదించుకోండి" అంది విజయ డబ్బును లెక్కపెట్టుకుంటూ.

దాని మాటలు విని అందరి హృదయాలు భారమైపోయాయి. కన్నీళ్ళు పొంగుకు వచ్చాయి. బండి కదిలి ముందుకు వెళ్ళిపోయింది.

సౌదీ బార్డర్‌లో సులభంగానే పని జరిగిపోయింది. బార్డర్ తలుపులు తెరుచుకోగానే అవతలికి వెళ్ళిపోయారు.

సౌదీ అరేబియాలో కువైటులో వున్నట్లుగా వుంటే కుదరదు. అక్కడ స్త్రీలకు చాలా కట్టుబాట్లు పద్ధతులు వుంటాయి. వాటిని తప్పనిసరిగా పాటించాలి. ఆ దేశపు నియమాలను అనుసరించకపోతే శిక్షలు కఠినంగా వుంటాయి.

అప్పటికే ప్రొద్దుగ్రుంకడంతో సూర్యుడు పడమటి కొండల్లోకి జారుకుంటున్నాడు. కువైట్ దేశం నుండి వేరే దేశమైన సౌదీకి వచ్చామన్న భావనతో అందరి హృదయాలు భయంతో నిండిపోయాయి. మరో రెండు గంటలు ప్రయాణం చేసిన వారు 'దమ్మాం' సిటీని చేరుకున్నారు. అక్కడ ఇద్దరు సౌదీ షేకులు వీరికి ఎదురుగా వచ్చి వాళ్ళని రిసీవ్ చేసుకున్నారు.

భాషా వారిని చూడగానే ఓవర్ యాక్షన్ చేస్తూ వంగి "సలామా లేకుం" అంటూ వినయ విధేయతల్ని చూపించాడు. వాళ్ళు ఎదురుగా వచ్చి "ఆలేకుం సలాం" అంటూ భాషాను కౌగిలించుకుని వాళ్ళ సాంప్రదాయం ప్రకారం ముద్దులు పెట్టారు.

భాషా బండి దగ్గరికి వచ్చి నలుగురు ఆడవాళ్ళని క్రిందకు దిగమన్నాడు. గత్యంతరంలేక నలుగురూ బండి దిగి నిలబడ్డారు. క్రిందకీ పైకీ పరిశీలనగా చూసిన షేకులు సంతృప్తిగా తలవూపి "వెరీగుడ్ భాషా ఉర్మ జేన్ (ఆడవాళ్ళు బాగున్నారు) " అంటూ డబ్బు వున్న కవర్‌ను భాషా చేతికి అందించారు.

వాడికి డబ్బును చూడగానే ఎక్కడ లేని హుషారు వచ్చేసింది. వెకిలిగా నవ్వుతూ "ఏయ్. మీ బ్యాగులు తీసుకుని షేకుల కార్లు ఎక్కండి. బుద్దిగా వాళ్ళు చెప్పినట్లు విని పని చేసుకుని డబ్బు సంపాదించుకోండి. మాట వినకపోతే చంపేసి ఎడారిలో పాతి పెట్టేస్తారు. తరువాత మీ శవం కూడా దొరకదు" అన్నాడు వాడు.

అందరిలోకి కాస్త ధైర్యంగా వుండే పద్మ నోరు తెరిచి "ఏయ్ భాషా ఏంటిది? మమ్మల్ని సౌదీ షేకులకు అమ్మేసావా? లేక పనిలోకి పంపిస్తున్నావా?" అని అడిగింది.

అంతే ఫట్‌మని పడింది దెబ్బ. "ముయ్యవే నోరు. అమ్మితే ఏంటి? పని చేస్తే ఏంటి? ఇల్లూ వాకిలి విడిచిపెట్టి భర్తను పిల్లల్ని గాలి కొదిలి ఎగురుకుంటూ డబ్బు సంపాదించాలని ఇంతదూరం వచ్చారు కదా! మరి ఏదయితేనేం? ఏ రాయి అయితేనేం పళ్ళు ఊడగొట్టుకోవడానికి? ఇదిగో ఈ బురఖాలు వేసుకోండి. వెళ్ళండి. మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి. మీ బ్రతుకులు ఇప్పుడు ఈ సౌదీ షేకుల దయాదాక్షిణ్యాలపైన ఆధారపడివున్నాయి. ఎదురు చెప్పకుండా ఎక్కువ మాట్లాడకుండా వాళ్ళు చెప్పింది విని, చెయ్యమన్న పనిచేసి వాళ్ళని సంతోషపెట్టండి. ఆ ఏజంటు విజయలాగా డబ్బు బాగా సంపాదించుకోండి. ఓ.కె. బై బై" అని చెప్పి వాడు బండి ఎక్కాడు.

"తాలే సురా (రండి తొందరగా) గాదె (కూర్చోండి)" అంటూ షేకులు కారు డోర్లు తెరిచారు. ఇక చేసేదేమీ లేదు. నిండా మునిగిన వాళ్ళకి చలేవుండదు కదా? వాళ్ళు కూర్చున్నాక కార్లు కదిలి "రియాద్" పట్టణం వైపు పరుగులు తీసాయి. వాళ్ళ కన్నీళ్ళను చూడలేని సూర్యడు అప్పటికే పడమటి కొండల్లోకి దిగిపోయి అదృశ్యమైపోయాడు. చీకటి జగతిని చిక్కగా కమ్ముకుంది.

## శోభ జీవితకథ

**ఇండియన్** హెరిటేజ్‌లో శారీస్ క్రొత్త కలెక్షను వచ్చాయని తెలిసి ఆరోజు సాయంత్రం వీలు చూసుకుని వెళ్ళాను. సూక్ వతనియా (వతనియా షాపింగ్ మాల్)లోకి ఎంటరయి వరుసగా వున్న షాపులను చూసుకుంటూ లోపలికి వెళుతున్నాను. ఇంతలో

వెనకనుండి ఎవరో "ఏయ్ లలితా ఎలా వున్నావే? ఎన్నేళ్ళయింది నిన్ను చూసి? సడన్‌గా ఇక్కడ నిన్ను చూసేసరికి చాలా సంతోషించి నీ వెనకే పరిగెత్తుకుని వచ్చాను." ఆప్యాయంగా నా భుజాన్ని పట్టుకుని ఆనందంగా మాట్లాడుతున్న శోభను చూసి ఒక్కసారిగా ఆశ్చర్యపోయాను.

"ఏయ్ శోభా నువ్వు.. నువ్వేనా? గుర్తుపట్టలేనంతగా మారిపోయావే? ఎలా వున్నావు?" అంటూ ఎదురు ప్రశ్నించాను.

"కాలం మనుషుల్ని మార్చేస్తుంది. తప్పదు మనం కూడా కాలంతోపాటు మారిపోవాలి." నవ్వింది శోభ.

"ఎలాంటి మనిషివి ఎలా అయిపోయావో. దాదాపు ఏడేళ్ళయిందనుకుంటా నిన్ను చూసి" అన్నాను.

"అవును. నేను ఇండియా వెళ్ళిపోయి అక్కడ రెండేళ్ళు వుండి తిరిగి మరలా ఈ కువైట్‌కి వచ్చేసాను. నాలుగేళ్ళు నరకయాతన అనుభవించాననుకో. పగవారికి కూడా ఆ బాధ వద్దు దేవుని దయవలన ఇపుడు బానే వున్నాను" ఏదో తెలియని బాధ ధ్వనించింది ఆమె గొంతులో.

"ఏంటి ఏమయింది? పెళ్ళి చేసుకున్నావా? పిల్లలెంతమంది?" ఆదుర్దాగా ప్రశ్నించాను. ఎంతో అందంగా వుండే శోభ అలా ఎందుకు తయారయిందో నాకర్థంకాలేదు.

"హ.. పెళ్ళా? ఈ జన్మకి అది జరిగేపని కాదు. ఇక ఆ ఆశకూడా లేదు. ఎపుడో వదిలేసాను. మగాళ్ళంటేనే అసహ్యం కలుగుతోంది. ఛీ.ఛీ అంతా మోసం. అది ఒక నరకం" చిరాకుగా ముఖం పెట్టింది శోభ.

"అది నిజమేలే. మగాడిని నమ్మి బాగుపడిన ఆడవాళ్ళని ఎక్కడో వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. ముఖ్యంగా ఈ కువైట్‌లో ఎంతమంది స్త్రీలు అమాయకంగా మగాడ్ని నమ్మి తమ జీవితాల్ని, డబ్బును నాశనం చేసుకుంటున్నారో" ఆవేదనతో పలికాను.

"సరేకానీ అదిగో ఎదురుగా వున్న ఆ బట్టల షాపులోనే నేను పనిచేస్తున్నాను. కొద్దిసేపు కూర్చుని టీ తాగి వెళుదువుగాని రా.. వెళదాం" అంది శోభ నా చేతిని గట్టిగా పట్టుకుని.

"సరే పద నువు ఖాళీగా వుంటే కాసేపు కూర్చుని మాట్లాడి వెళతాను" అంటూ తనని అనుసరించాను.

టీ బాయ్‌ని పిలిచి రెండు టీలు తెమ్మని చెప్పి, "ఇదిగో లలితా నీకంటే ఆప్తురాలు నాకు ఎవరున్నారు? నీతో మాట్లాడాలని, నీతో నా బాధ చెప్పుకోవాలని ఎంతగానో ఆశపడ్డాను నీ ఫోను నంబరు కోసం మన ఊరివారినందరినీ అడిగాను కానీ అందరూ 'మా దగ్గర నంబరు లేదు' అనేవాళ్ళే. చివరికి ఈరోజు అదృష్టం బాగుండి నువ్వే కనిపించావు" మెరిసేకళ్ళతో చెప్పింది శోభ.

"అవును. నువు కూడా అప్పుడప్పుడూ గుర్తువచ్చి ఎక్కడుందో ఏమయిందో అని నీ గురించి ఆలోచించేదాన్ని. అప్పట్లో ఎంతందంగా వుండేదానివి. వత్తుగా నడుం క్రిందికి వుండే నీ జుట్టు ఏమయింది? ఎవర్నో ప్రేమిస్తున్నానని, చాలా మంచివాడని అతన్నే చేసుకుంటానని అంటుండేదానివి. మరి పెళ్ళి ఎందుకు చేసుకోలేదు?" ప్రశ్నలన్నింటినీ ఒకేసారి సంధించాను నేను.

"ఎంత ప్రేమించినా ఎంత ఆరాటపడినా చివరికి జీవితాన్ని పణంగా పెట్టినా వ్యర్థమే. ఆఖరికి ఆడదానికి మిగిలేది అంతా శూన్యమే. యుగాలు మారినా మగాడి బుద్ధిమారదు. ఆడదాని రాత మారదు. స్త్రీని, ఆమె హృదయాన్ని అర్థం చేసుకోవడం మగాడికి ఎప్పటికీ సాధ్యమయేపనికాదు. మగాడు ఆడదాని శరీరాన్ని తప్ప హృదయాన్ని ప్రేమించలేడు. నా ప్రేమ అతడికి కాలక్షేపం అయింది. నా శరీరం అతనికి ఆటబొమ్మలా అనిపించింది. అతని జీవితాన్ని మాత్రం పెళ్ళాం బిడ్డలతో నందనవనంలా మలచుకుని నా జీవితాన్ని, నన్నూ ఎండిన మోడులా మిగిల్చేసాడు. ఏమని ప్రశ్నిస్తే కఠినమైన మాటలతో మనస్సును నొప్పించాడు.

పెళ్ళి గురించి, పిల్లలగురించీ, జీవితం గురించి మాట్లాడనంతవరకు మగవాడు బానే వుంటాడు. అంతవరకు ఎన్నేళ్ళు గడిచిపోయినా సరే ఆడదాని శరీరంతో ఆటలాడుకుంటూ కాలాన్ని ఆనందంగా గడిపేస్తుంటాడు.

ఎపుడైతే నోరు తెరిచి పెళ్ళి గురించి అడుగుతామో అపుడు రివర్స్ అయిపోతారు. అపుడే వాళ్ళలోని రాక్షసుడు నిద్రలేస్తాడు. శాడిజం బయటికి వచ్చి ఆడదాన్ని హింస పెడతాడు. దాని జీవితం గురించి ఆలోచించకుండా, దాని అవసరాలు గ్రహించకుండా, తన జీవితం తన కుటుంబం పైనే దృష్టి వుంచి తనవారి అవసరాలు తీర్చుకుంటూ అందుకోసమే తను జీవిస్తాడు. తనని తాను ఒక మగాడిగా నిరూపించుకోవడానికి ఇక్కడ కువైట్‌లో ఒక ఆడది అవసరం అవుతుంది. కోరికలు తీరేదాకా కల్లబొల్లి మాటలెన్నో చెబుతాడు. అవసరం తీరేదాకా ఎన్నో ఆశలను కల్పిస్తాడు. ఎంతగానో నటిస్తాడు. అదేంటో మరి ఈ మగాళ్ళకి వాళ్ళ పెళ్ళాలు ఎపుడూ మహా పతివ్రతలుగా, సాధ్వీమణులుగా, భర్తమాట జవదాటని సతీ అనసూయల్లాగా అనిపిస్తారు. మొదట్లో వారి గురించి చెడుగా చెప్పి మనల్ని ఆకట్టుకుని తమ బుట్టలో వేసుకుంటారు. ఏళ్ళు గడిచి మనపైన మోజు తీరిపోయాక పెళ్ళామే బెల్లంగా మనం అల్లంగా కనిపిస్తాం. పెళ్ళాం చాలా చెడ్డదని, తనకు తగదని, ఎప్పుడూ పోట్లాడుతూ ఇంట్లో అశాంతిని రేకెత్తిస్తుందని, తనపైన అస్సలు ప్రేమలేదని చెపుతాడు. 'నువ్వే నా కలలరాణివి, నా ప్రేమరూపానివి. నువు లేకపోతే నా జీవితం శూన్యం. నా హృదయం ఎడారి' అంటూ దీనంగా మాట్లాడతాడు. నచ్చని ఆ భార్యను విడిపించుకుని వదిలించుకుని, విడాకులిచ్చి నిన్నే పెళ్ళాడతా. ఆ నరకం నుండి విడుదల పొంది నీతో స్వర్గసుఖాల్ని అనుభవిస్తా' అంటూ మాయమాటలు చెప్పి ఆశలు కల్పిస్తాడు. కానీ కాలం గడిచేకొద్దీ స్త్రీకున్న సున్నితమైన హృదయాన్ని, అందులో వున్న ప్రేమను ఒక బలహీనతగా వాడుకుంటూ అవసరం తీరిపోయాక నిర్దాక్షిణ్యంగా వదిలించుకోవాలని చూస్తారు. ముందు నా పెళ్ళాం రాక్షసి, నువ్వే నా దేవతవి అన్న మగవాడు తరువాత పెళ్ళాం అమాయకురాలని, చాలా పవిత్రమైనదని భార్య పదవికి తనే అర్హురాలని పిల్లలకు తనే తగిన తల్లని చెప్పి మాటలు మార్చేస్తారు.

మనం ఎవరయినా పరాయి మగవాడితో మాట్లాడితే చాలు అపనమ్మకంతో నిందలు వేసేసి కొట్టి తిట్టి దూషించి వ్యక్తిత్వాన్ని అవమానించి నీ కేరక్టరు మంచిదికాదని నిర్ధారించేస్తారు. ఇదంతా మోజు తీరాక స్త్రీని వదిలించుకోవడానికి ఆడే ఒక డ్రామా.

అక్కడ భార్యలకు మాత్రం ఎంతకాలం భర్తకు దూరంగా వున్నా పతియే ప్రత్యక్షదైవం అన్నట్లుగా జీవిస్తారని వారికేమాత్రం శరీర కోరికలు లేకుండా, వున్నా అనుభవించడం వారికి తెలియదన్నట్లుగా వారు సంసారినికీ, పిల్లలను కనడానికీ తప్ప కోరికలు తీర్చడానికి ఏమాత్రం పనికిరారు అన్నట్లుగా మాట్లాడతారు. ఏళ్ళ తరబడి భర్తలకు దూరంగా వున్నా వాళ్ళు అక్కడ ఎంతో పవిత్రంగా జీవించేస్తున్నట్లు కలలో కూడా పరాయి మగవాడి మొహం తెలియని పవిత్రమూర్తులైనట్లుగా నమ్ముతారు. వారి గురుంచి గొప్పగా చెపుతారు. ఆ నమ్మకాలతోనే 80% కాపురాలు ఈ ప్రపంచంలో ముఖ్యంగా మన భారత దేశంలో నిలబడుతున్నాయేమో. ఆ గుడ్డి నమ్మకమే కాపురాల్ని గుట్టుగా నడిపిస్తోందేమో. అంతవరకు మంచిదే. భార్య పట్ల ఆపాటి నమ్మకం గౌరవం ఉండాల్సిందే. కానీ తనతోపాటు ఏళ్ళ తరబడి సహజీవనం చేసి, శారీరక కోరికలు తీర్చి, అవసరాలకు ఆదుకుని, పరిచర్యలు చేసి, కష్టంలో సుఖంలో తోడుండి, స్నేహాన్ని పంచిన ఆడదాన్ని ఎంతో అవమానించడం ఒక బజారు దాన్నిగా భావించి త్రోసివేయడంతోనే వస్తోంది సమస్య. ఏరు దాటాక తెప్ప తగలేసినట్లుగా కొంతకాలం గడిచాక మగాళ్ళు తమ నిజస్వరూపం చూపిస్తారు. అపుడు అయ్యగారి అసలు రంగు బయటపడుతుంది. వాళ్ళేమో మెలుకువగానే వుంటారు. ఎందుకంటే వారి దృష్టి శరీరం పైనే కాబట్టి. కానీ స్త్రీ అలా కాదు. మనస్ఫూర్తిగా ప్రేమిస్తుంది. అతన్ని నమ్మి తన సర్వస్వాన్ని అర్పిస్తుంది. నిండా మునిగి పోతుంది. చివరికి చెల్లించే మూల్యం తన జీవితం. సమాజంలో తన గౌరవం. మిగిలేది ఒంటరితనంతో కూడిన నిరాశా నిస్పృహలు.

నోరు తెరిచి ఇదేమిటి అని ప్రశ్నిస్తేచాలు. స్త్రీని కించపరిచే విధంగా మాట్లాడతారు. 'ఏదో నీతో ఇక్కడ కువైట్‌లో కాలక్షేపం చేసాను. ఒంటరిదానివని స్నేహం పంచాను. నన్నంటావు గానీ నీవు మాత్రం నాతో శారీరక కోర్కెలు తీర్చుకోలేదా? నిన్ను పెళ్ళిచేసుకోవడానికి నువ్వేం కన్నెపిల్లవా? కాలేజీకి వెళ్ళేటప్పుడు ఆ కిరణ్‌ని ప్రేమించానన్నావు. వాడితో షికార్లు తిరిగానని నీ కథంతా

చెప్పావు. వేరే మగవాడితో తిరిగిన నిన్ను పెళ్ళి చేసుకోవడమా? ఎలా ఆశిస్తున్నావు' అని ప్రశ్నించాడు. 'మరి నీ పెళ్ళాం కన్నెపిల్లని ఎలా చెప్పగలవు? ' అని ఎదురు ప్రశ్నించాను.

'నా పెళ్ళాన్ని అంటావా అది నిప్పులాంటిది. నీలాగా కాదు అంటూ చెంప ఛెళ్ళుమనిపించాడు. నాకెందుకో ఆ క్షణంలో అతనికన్నా మృగం నయమేమో అనిపించింది. కొద్దికాలం కలిసి గడిపితే మృగాలు సైతం సాటి మృగంపైన ప్రేమను చూపిస్తాయి. తోడుగా వున్న పక్షి చనిపోతే సాటి పక్షి కన్నీరు కార్చడం మనం చూస్తాము. కానీ ఏళ్ళ తరబడి శరీరాన్ని పంచుకుని కలిసి జీవించిన మగాడు మాత్రం ప్రేమను చూపలేకపోతున్నాడు. ఎందుకంటే మగవాడు చాలా స్వార్థపరుడు. శరీరంలోని వేడిని దింపుకోవడానికి ఆడది కావాలి, సమాజం కోసం, పిల్లల కోసం పెళ్ళాం కావాలి. అతడి హృదయంలో కాస్తంత మానవత్వపు తడిని నేను చూడలేక పోయాను. సిగిరెట్‌ను త్రాగి పారేసి కాలికింద చెప్పుతో నులిమేసినట్లుగా నన్ను త్రోసి పారేయడాన్ని నేను భరించలేకపోయాను.

దుర్మార్గుడా, దుష్టుడా, మోసగాడా నమ్మించి నాతో కాలం గడిపి నా బ్రతుకును నాశనం చేస్తావా? నీ పెళ్ళాంతో ఎలా కాపురం చేసుకుంటావో చూస్తాను నన్ను నాశనం చేసిన నిన్ను ఊరికే వదలను. నేను చచ్చినా పరవాలేదు కానీ నీమీద మాత్రం కక్ష్య సాధిస్తాను అంటూ ఉద్రేకపడిపోయి గొంతు పగిలేలా దిక్కులు పిక్కటిల్లేలా అరిచాను. కన్నీళ్ళు రాలి గుండెల్ని తడిపేస్తుంటే ఏడ్చాను. మొత్తుకున్నాను. వాడి హృదయం కరగలేదు. అలా అరుస్తుండగానే నా ఎడమచేయి చచ్చుబడిపోయింది. ఎడమ చెంప, మూతి ఒక ప్రక్కకు వంకర తిరిగిపోయాయి. అందమైన నా ముఖం ఆకారాన్ని కోల్పోయింది. ఏం చెయ్యాలో తెలియలేదు. గుండెలో సన్నగా నొప్పి మొదలైంది. ఆ దుర్మార్గుడు నన్ను అస్సలు పట్టించుకోలేదు. కనీసం నాపట్ల జాలి చూపించి హాస్పిటల్‌కి కూడా తీసికెళ్ళలేదు. అన్నేళ్ళు అతనికి పంచిన నా శరీరం మీద అతన్ని ప్రేమించిన నా హృదయం మీదా క్షణంలో నాకు నాకే కోపం వచ్చింది. నా శరీరాన్ని నాకు నేనుగా తగలబెట్టుకోవాలనిపించింది. ఎలాగో ప్రక్కనే వున్నవారి సాయంతో హాస్పిటల్‌కి చేరుకున్నాను. డాక్టర్లు పక్షవాతమని చెప్పి ట్రీట్‌మెంటు ఇచ్చారు. ఒక సంవత్సరం గడిచినా నయం కాలేదు. ఏ దిక్కూలేకుండా కువైట్‌లోని హాస్పిటల్‌లో ఎంతకాలం పడివుండగలం?

" పెళ్ళి చేసుకోవచ్చు కానీ అందుకు నా మనసు అంగీకరించడంలేదు. అతనే నా హృదయంలో నిలిచిపోయాడు. ఒకటా రెండా ... పదేళ్ళు అతనితో గడిపిన కాలం, జీవితం పంచుకున్న క్షణాలు, జ్ఞాపకాలు అతన్ని మరచిపోనీయకుండా చేస్తున్నాయి. మగవాడు ఎంత దుర్మార్గుడైనా, మోసగాడైనా ఒకసారి మనసిచ్చి ప్రేమను పంచుకున్నాక అతన్ని మరచిపోవడం అసంభవం. అదే స్త్రీ యొక్క ఔన్నత్యం. ఇక ఇంతే. ఈ జీవితం ఇంతే. ఇలా కాలం గడిపేస్తాను. ఒకవేళ ఎవడైనా వచ్చి చేసుకున్నా వాడు 'ఆ మహేష్‌గాడితో పదేళ్ళు గడిపావు కదా' అని జీవితాంతం వేధించడని గ్యారంటీ ఏమిటి?

ప్రేమలో ఓడిపోతే జీవితాన్ని కోల్పోతే ఎంతటి నరకయాతన? ప్రాణపదంగా చూసుకోవాల్సిన ప్రియురాలిని కాలితో తన్ని అవతలికి తోస్తే పదేళ్ళ బంధాన్ని క్షణంలో తెంచిపారేస్తే స్వార్థం నిలువెల్లా విషంలా నిండిపోయి సర్పంలా మారి కాటువేస్తే ఏం చెయ్యాలి? ఎవర్ని నమ్మాలి? ఎలా నమ్మాలి? మగాడ్ని ప్రేమించడంకంటే ఒక కుక్కను తెచ్చి పెంచుకుని ప్రేమిస్తే అది ఎంతో విశ్వాసంతో విడవక వెంబడిస్తుంది. ప్రేమతో కనిపెట్టి వుంటుంది. కానీ మగాడు అలాకాదు. వాడి కన్ను ఆడదాని శరీరం మీద మాత్రమే. ఎంత ప్రేమించినా ఎన్ని పంచుకున్నా చివరికి వాడికి మోజుతీరాక పువ్వులా నలిపి విసిరిపారేస్తాడు. అయినా జీవితానికి పెళ్ళే పరమార్థం కాదు లలితా. మనదేశంలో ఎంతమంది భార్యాభర్తలు నిజాయితీగా, ప్రేమతో కాపురం చేస్తున్నారంటావు? వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు.

మహేష్ నాతో ప్రేమలో పడిన మరుసటి సంవత్సరం పెళ్ళిచేసుకున్నాడు. తల్లిదండ్రుల బలవంతం మీద చేసుకోవాల్సి వచ్చిందని ఆ అమ్మాయి అంటే తనకు ఏమాత్రం ఆసక్తి, ఇష్టంలేదని చెప్పాడు. తల్లిదండ్రుల మాట ప్రకారం మనసు చంపుకుని

చేసుకోవాల్సివచ్చిందని అందుకు చాలా బాధపడుతున్నానని, ఈ సమయంలో నా ప్రేమ చాలా అవసరమని చెప్పాడు. ఈ స్థితిలో నేను కూడా కోపగించుకుంటే, అర్థం చేసుకోకుండా అపార్థం చేసుకుని తోసివేస్తే చావే శరణ్యమని, బ్రతకడం కంటే చావే మేలని చెప్పి ఏడ్చాడు. నిదానంగా తనని విడిపించుకుని నిన్నే పెళ్ళిచేసుకుంటాను నన్ను నమ్ము అంటూ నమ్మ బలికాడు. అయ్యో పాపం అనిపించి ఎంతగానో ఓదార్చి ఊరడించాను. ఇంకా ఎక్కువగా అతనిపట్ల శ్రద్ధ చూపించాను.

సంవత్సరంలో పదకొండు నెలలు నాతో వుండేవాడు. ఒక నెల శెలవలకి ఇంటికి వెళ్ళి వచ్చేవాడు. వెళ్ళినప్పుడల్లా నాకు చెప్పకుండా తన భార్యతో బాగా సంతోషంగా గడిపి వచ్చేవాడు. ఇక్కడ నాకేమో పెళ్ళాంతో విడాకులకి ప్రయత్నిస్తున్నాను అని చెప్పేవాడు. ఈలోపల తన భార్య గర్భవతి అయింది. అదెలా అయింది? ఎలా సాధ్యం అని ఆశ్చర్యంగా అడిగాను నేను. 'పెళ్ళాం అన్నాక పడుకోకుండా ఎలా వుంటాను? పెద్దవాళ్ళు ఒప్పుకుంటారా? అయినా సాటి ఆడదాని జీవితం పాడుచేసి నీ బ్రతుకును నిర్మించుకోవాలనుకుంటున్నావంటే నీ వెంత దుష్టురాలివో అర్థం అవుతుంది' అని కఠినంగా జవాబు చెప్పాడు. నాకేం చెయ్యాలో తోచలేదు. కట్టుకున్న కలల హర్మ్యాలు కళ్ళ ఎదుటే కుప్పకూలి పోతుంటే కళ్ళలో నీళ్ళు కాలువలై ప్రవహించాయి.

'అయినా తనకి తండ్రి లేడు తెలుసా? నేను ఇపుడు విడాకులిచ్చి వదిలేస్తే ఏమయిపోతుంది? ఎలా బ్రతుకుతుంది? అసలే అమాయకురాలు పాపం. తను ఎం నీలాగా కాదు. ఎంతో మంచిది.నేనంటే ఎంతో గౌరవం. నా మాటకి అసలు ఎదురు చెప్పదు తెలుసా!'

'నాక్కూడా తండ్రి లేడుగా మరి నా సంగతి ఏంటి? ఎన్నో ఆశలు కల్పించావు. నేనెలా బ్రతకాలి?' అంటూ దీనంగా ప్రశ్నించాను.

'నీకేం తక్కువ? బ్రతక నేర్చినదానవు. ఎక్కడైనా సరే ఏదో ఒక పని చేసుకుని బ్రతకగలవు. లేకపోతే నీ అందాన్ని చూసి పదిమంది మగాళ్ళు క్యూలో నిలబడతారు. ఎవర్నన్నా చేసుకుని కాపురం చేసుకో' అంటూ తను ఉచిత సలహా ఇచ్చాడు.

నా గుండె బ్రద్దలయింది. నా జీవితం నాశనం చేయవద్దని తనని విడిచి వుండలేనని చెప్పి ఎంతగ ఏడ్చానో. తప్పు తనదయినా సరే ఆఖరికి నన్నే నిందించడం మొదలుపెట్టాడు. ఏదన్నా అడిగితే, ఎదురు తిరిగితే చాలు అన్ని విధాల హింసించడం మొదలు పెట్టాడు.

ఆఖరికి ఒకరోజు పెద్ద గొడవ జరిగింది. ఇంట్లోంచి బయటకి తోసేసాడు. ఆవేదన, పొంగిపొరిలే కోపాన్ని అణచుకోలేక ఉద్రేకంతో అరిచాను. ఏడ్చాను. తిట్టాను. అంతే నా మూతి వంకరపోయింది. చెయ్యి చచ్చు పడిపోయింది. ఇక చేసేదేమి వుంది? ముల్లు వచ్చి అరిటాకు మీద పడినా ఆకు వెళ్ళి ముల్లుమీద పడినా జరిగేది ఒక్కటే. నష్టం ఆడదానికే. ఇది తరతరాలకి యుగయుగాలకి కూడా చెరిగిపోని సత్యం. "

తరువాత ఇండియా వెళ్ళిపోయాను. అక్కడకూడా ఇంట్లో నన్ను గూర్చి ఎవరూ సరిగ్గా పట్టించుకోలేదు. దీనికి తగిన శాస్తి జరిగిందిలే అనుకుంటూ అంటీ ముట్టనట్లుగా నన్ను నా ఖర్మకు వదిలేసారు. జీవితం అంటేనే విరక్తి కలిగింది. నేను బాగున్నప్పుడు కువైటులో వుండి సంపాదించి డబ్బు పంపిస్తుంటే తమ అవసరాలు తీర్చుకున్న కుటుంబం ఇపుడు అసహాయస్థితిలో అనారోగ్యంతో వున్న నన్ను భారంగా భావించారు. అతనితో ఇంతకాలం వుండి నా బ్రతుకును నాశనం చేసుకున్నానని చులకనగా మాట్లాడి నొప్పించారు. దిక్కు తోచలేదు. చూడు మగవాడిని నమ్మినందుకు ఎంతపని జరిగిందో! నా ఆరోగ్యం, జీవితం నా డబ్బు అన్నీ నాశనమయిపోయాయి. వంటిమీదవున్న బంగారాన్ని అమ్మి ట్రీట్‌మెంటు తీసుకుని దాదాపు రెండేళ్ళకు కాస్త కోలుకున్నాను. ఇంటిదగ్గర వుండలేక మరలా కువైటుకే వచ్చేసాను. నా గోడు ఆ దేవుడు ఆలకించినట్లున్నాడు. నా బ్రతుకుని నాశనం చేసిన వాడికి తగిన విధంగా దేవుడు బుద్ధి చెప్పాడు. వాడి

భార్యకు తన మేనమామ కొడుకుతో వున్న అక్రమ సంబంధం బయటపడి కళ్ళారా చూసి పట్టుకున్నాడట. భార్యను చావగొట్టడంతో అది ఆత్మహత్య చేసుకుని చచ్చిందట. వీడు కేసుల్లో ఇరుక్కుని కోర్టుచుట్టూ తిరుగుతున్నాడు.

సంవత్సరం ముందు నాకు ఫోను చేసాడు. 'శోభా నీ శాపమే నాకు తగిలింది. నీ కన్నీరు నన్ను శిక్షించింది. నా బ్రతుకును పోలీసుస్టేషన్ల పాలుచేసింది. నిన్నూ నీ ప్రేమను అర్థం చేసుకోలేకపోయాను. నీకు చేసిన ద్రోహానికి నాకు తగిన శిక్షను ఆ దేవుడు వేసాడు. దయచేసి నన్ను క్షమించు' అంటూ ఏడ్చాడు.

'నిన్ను క్షమించడానికి నేనెవర్ని? నువు చేసిన పాపాలకు ఆ దేవుడ్ని క్షమాపణ అడుగు. ఆయనే నిన్ను క్షమించగలడు'అన్నాను.

ఒక స్త్రీని మోసం చేసి దాని జీవితాన్ని పాడుచేస్తే దేవుడైనా క్షమిస్తాడంటావా? అని ప్రశ్నిస్తూ నా ముఖంలోకి చూసింది శోభ. గతాన్ని చేసుకున్నందుకు తన కళ్ళనిండా నీళ్ళు పొంగుతున్నాయి. తన కథ వింటున్న నాకే చాలా బాధగా అనిపించింది. "అయ్యో.. ఎంత పని జరిగింది? ఇప్పటికైనా సమయం మించిపోలేదు. ఎవరో ఒక మంచివాడు నీకు కనిపించకపోడు నువు పెళ్ళి చేసుకుని సంతోషంగా వుండచ్చు శోభా" చెప్పాను నోరు పెగల్చుకుని.

మనసు తొణికినట్లుంది ఏడ్వడం మొదలు పెట్టింది శోభ. ఎలా ఓదార్చాలో తన గుండె భారాన్ని ఎలా తీర్చాలో నాకు అర్థంకాక తనని చూస్తూ శిలలా కూర్చుండిపోయాను.

## కువైట్ సిటీ



**వర్షం..** మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తోంది.

ఈ ఎడారిలో కువైటు దేశంలో వర్షం కురవడం చాలా అరుదు. అప్పుడప్పుడూ గాలివాటుగా వచ్చి పడే నాలుగు చినుకులు తప్ప కుండపోతగా కువైటులో వర్షం కురవడం నిజంగా వింతే. ఇది కువైట్ చరిత్రలో నిలిచిపోయే వార్తే.

రోడ్లల్లో, వీధుల్లో ఎక్కడ చూసినా నీళ్ళే. కాలువలు పొంగి పొరలుతున్నాయి. పార్కింగ్ ప్లేస్‌లో వున్న కార్లు నిండుకున్న నీటి ఉధృతికి పైకి తేలి బొమ్మ కార్లల్లా కొట్టుకుని పోతున్నాయి. ప్రవహించే నీటి ఒరవడిలో పడి కొట్టుకుపోయే కారును పట్టి ఆపగలిగే శక్తి మనిషికి వుందా? కిటికీలు తెరుచుకుని ప్రకృతి బీభత్సాన్ని పరికిస్తూ కొట్టుకు పోయే కార్లను చూసి కంగారు పడుతూ కాలాన్ని గడిపారు కువైటీవాళ్ళు.

ఎంత డబ్బువున్నా ఏమిలాభం? ప్రకృతి కన్నెర్ర చేస్తే ఎంత ధనవంతుడైనా దాని పర్యవసానాన్ని ఎదుర్కోవాల్సిందే

బి.ఎం.డబ్ల్యు, ఆడి, డాడ్జ్, ఫోర్డ్, టయోటా బ్రాండ్ ఏదైతేనేం ఎంత విలువైనదైతేనేం ఉప్పొంగిన నీటిలో తేలిపోయాయి.

ఆకాశానికి భూమికి నీళ్ళతో నిచ్చెనలు వేసినట్లుగా మేఘాలు నీటిని వర్షించేసి తమలోని భారాన్ని దింపుకున్నాయి. డ్రైనేజ్ సిస్టమ్ మూసుకొనిపోవడంతో కువైట్ ఎయిర్‌పోర్టు నిండా మోకాళ్ళ లోతు నీళ్ళు నిలిచిపోయి విమాన రాకపోకలకు అంతరాయం కలిగింది. రెండురోజులు అన్ని ఫ్లైయిట్స్ కాన్సిల్ అవడంతో ప్రయాణికులంతా ఎక్కడివాళ్ళక్కడ నిలిచిపోయి ఇబ్బందుల పాలయ్యారు. జనజీవితం

అస్తవ్యస్తమైంది. ఈ ఎడారి నేలపై దయదలచి అప్పుడపుడూ నాలుగు చినుకుల్ని రాల్చి పోయే మేఘాలు ఈసారి బలాన్ని నింపుకుని విజృంభించాయి. మెరుపులు ఉరుములతో ఆకాశం సందడి చేసింది.

కువైట్‌లో కుంభవృష్టి ఏంటి? విపరీతంగా ఈ వరదలేమిటి? మా నలభై ఏళ్ళ సర్వీస్‌లో ఇంతటి వింతను చూడలేదు. భూమ్మీద ముఖ్యంగా కువైట్‌లో పాపం పెరిగినట్లుంది అందుకే ఇలాంటి సూచనలు అంటూ నిట్టూర్చారు కొందరు పెద్దవాళ్ళు.

గవర్నమెంటు రెండు రోజులు సెలవుల్ని ప్రకటించడంతో సంబరపడిపోయారు ఉద్యోగులు. వారి సంతోషాన్ని చూసి మాకు సెలవులు ఇవ్వలేదే, ఎండయినా, వానైనా, వరదలైన మేము పనిచేయాల్సిందే తప్పదు కదా అంటూ బాధపడిపోయారు ప్రవేటు కంపెనీ వర్కర్స్.

ప్రకృతి వైపరీత్యం అంటే ఇదే ఇలాంటివి ఈ ఎడారి దేశాల్లో ఎన్నడైనా చూసామా? నాలుగు చినుకులు రాలితే ఈ అరబ్బులు సంతోషపడిపోయి కేరింతలు కొట్టేవాళ్ళు. ఏళ్ళకు తరబడి చూడని వర్షాన్ని చూసి సంతోషించేవాళ్ళు. కాస్త వర్షం వచ్చిందంటే ఏసిలు ఆఫ్ చేసేసి కిటికీలు తెరుచుకుని చల్లటిగాలిని ఆస్వాదిస్తూ నేలపైకి రాలిపడే వర్షపు చినుకుల్ని చూస్తూ పరవశించేవాళ్ళు. కానీ ఈసారి మాత్రం చాలా భయపడిపోయారు. ఆగని వర్షంతో రోడ్ల వెంబడి ప్రవహించే వరదనీటితో ఏం చేయాలో అర్థంకాలేదు. ఈ వరదలు ఎక్కువైపోయి ఇళ్ళను కూడా ముంచేస్తాయేమో అని భయపడ్డారు. కరెంటు పోతుందేమో అనికూడా కంగారుపడ్డారు. కానీ దానికి అంతరాయం కలగలేదు. ఫోన్లు మాత్రం సరిగా పనిచేయలేదు. కొన్ని ప్రాంతాల్లో కొన్ని గంటలపాటు సిగ్నల్స్ అందలేదు. నెట్ కూడా నిలిచిపోయింది. తప్పని సరై డ్యూటీలకు వెళ్ళాల్సినవాళ్ళు. నీళ్ళు నిలబడని రోడ్లను చూసుకుని ఆ దారిలో ప్రయాణించి పనుల్లోకి చేరుకున్నారు అందరూ. కాసేపు కూర్చుని వర్షం గురించి అది సృష్టించిన భీభత్సం గురించి కథలుగా చెప్పుకుని తమకు శెలవు ఇవ్వని యాజమాన్యాన్ని తిట్టుకున్నారు.

"ప్రపంచం తొందరలో మునిగిపోతుంది. తప్పదు. పోగాలం దాపురించింది చూసారా? ఈ అరబ్బు ఆడవాళ్ళు పరాయి మగాడికి ఒళ్ళు చూపించకుండా బురఖాలు వేసుకుని తిరగాలి. అది సంప్రదాయంకదా! కానీ వీళ్ళు మరీ బరితెగించిపోయారు. కట్టుబాట్లు, సంప్రదాయాలు, మతాచారాలు వదిలేసి డబ్బు ఎక్కువయ్యేసరికి కన్నూ మిన్నూ కానకుండా కురచదుస్తులు వేసుకుని తిరగడం మొదలు పెట్టారు. మగాళ్ళకి వళ్ళుచూపించి ఆకర్షించడం ఎంత తప్పు? అందుకే ఇలాంటి వైపరీత్యాలు ఎదురవుతున్నాయి. దేవుడు చూస్తూ వూరికే వుండడు కదా?" చేతులు త్రిప్పుతూ వరదలు రావడానికి కల కారణాలన్నీ తనకే తెలిసినట్లు వివరించింది ఆపరేటరు డోనా.

"అబ్బ ఇంతకంటే ఘోరమైన విషయం ఇంకోటుంది విను. ఇంకా మీసాలు రాని మగపిల్లలు, మిడ్డీలు వేసుకునే ఆడపిల్లలు ఐఫోన్లలో అశ్లీల దృశ్యాలు చూసి చెడిపోతున్నారంట. డబ్బు ఎక్కువైపోవడంతో చిన్నపిల్లలకి కూడా ప్రతి ఒక్కరికీ చేతిలో ఫోను, అందులో నెట్టు. ఆ నెట్టులో పడిపోయి వలలో చిక్కిన చేపపిల్లల్లా గిలగిలలాడుతున్నారు పిల్లలు. అందుకే ఈ బీభత్సాలు" తేల్చేసింది సలిమా.

"ఉండు బయట వర్షాన్ని చూద్దాం" అంటూ కిటికీలనకున్న కర్టెను పక్కకు లాగింది జేనీ. అప్పటికి మూడో రోజు కాబట్టి వర్షం కాస్త ఆగిపోయి తెరిపినిచ్చినట్లుంది. బయట రోడ్డు వెంట నాటిన ఖర్జూరపు చెట్లు వర్షపు నీటితో తలారా స్నానం చేసినట్లు తడిసిపోయివున్నాయి. వీచేగాలికి తలలూపుతూ పులకించిపోతున్నాయి. మేఘాలన్నీ గుంపులు గుంపులుగా క్రిందికి దిగివచ్చి ఎత్తైన భవనాలను తాకి పరామర్శిస్తున్నాయి. ఎడమవైపున వున్న అరేబియా సముద్రం ఆనందంగా అలలతో ఉవ్వెత్తున ఎగిసిపడుతోంది. తడితడిగా వున్న భవనాలు క్రొత్తగా కంటికి కనిపిస్తున్నాయి. వర్షం కాస్త వెలిసిపోవడంతో పక్షులు తమ గూళ్ళనుండి బయటకు వచ్చి

ఆహారం కోసం వెతుకులాడుకుంటున్నాయి. "అబ్బ ఎంత బాగుందో బయట వాతావరణం. తడితడిగా, పొడిపొడిగా చల్లగాలితో పరవశాన్ని కలిగిస్తోంది కదా" తదేకంగా బయటికి చూస్తూ చెప్పింది జేనీ.

"అవును. ఈ వాతావరణంలో కిటికీ దగ్గర కూర్చుని కాఫీ తాగుతూ కబుర్లు చెప్పుకుంటే ఇంకా బావుంటుంది నవ్వుతూ చెప్పింది" డోనా.

"ఇలాంటి వాతావరణం నాకెంతో ఇష్టమైంది. ఐ లవ్ దిస్ కైండ్ ఆఫ్ వెదర్" చెప్పింది జేనీ నుదుటిమీది ముంగురులు చేత్తో సవరించుకుంటూ.

"నిజమే కానీ ఇలాంటి వాతావరణంలో నాకెందుకో దిగులుగా అనిపిస్తుంది. నా మూడ్ ఆఫ్ అయిపోతుంది. బహుశా నా ఒంటరితనం అందుకు కారణం కావచ్చేమో" దిగులుగా చెప్పింది సలీమా.

"అదీ నిజమే ఈ వాతావరణాన్ని వంటరిగా ఎలా ఎంజాయ్ చెయ్యగలం? ప్రక్కన భర్తో, ప్రియుడో వుంటే ఎంత రొమాంటిగ్గా వుంటుందో" ఆ సీన్‌ను ఊహించుకుంటూ బుగ్గలపై చేతులు అనించుకుంది జేనీ.

"అవునబ్బా ఇలాంటప్పుడు డ్యూటీకి రావాలంటే దిగులుగానే వుంటుంది. ఇంట్లో కూర్చుని పకోడీలు తింటూ, టీ తాగుతూ రగ్గు కప్పుకుని వెచ్చగా పడుకుంటే అద్భుతంగా వుంటుంది" అంది అంతలో అక్కడికి వచ్చిన సంధ్య.

"ఒక్కదానివే పడుకుంటే ఏం బాగుంటుంది? జేనీ చెప్పినట్లు బాయ్ ఫ్రెండ్ ప్రక్కన వుంటే మన రూము కూడా స్వర్గంలా వుంటుంది" చెపుతూ కిలకిలా నవ్వింది డోనా.

"మనం కువైట్ సిటీలో మన ఆఫీసులో క్షేమంగా వున్నాం కాబట్టి ఫరవాలేదు. కానీ సముద్రానికి దగ్గరగా ఆ లోతట్టు ప్రాంతాలన్నీ వర్షపు నీటితో మునిగిపోయాయంట. అక్కడ నివశించే వాళ్ళందరూ ఎన్నో ఇబ్బందులు పడుతున్నారట. ఈ వరదల ప్రభావం కువైట్ ఆర్థిక వ్యవస్థపై పడి మన అందరిపైనా ప్రభావం చూపిస్తుందని అంటున్నారు తెలుసా?" చెప్పింది సంధ్య.

"ఇప్పటికే ఇక్కడ మన దేశాల్లోలాగా అన్ని ధరలూ పెంచేసారు. మన జీతాలు మాత్రం పెరగడంలేదు. ఇక మొదలు టాక్సులు కూడా వేస్తారేమో. ఇక కువైట్‌లో ఉండటం వ్యర్థం. సంపాదనంతా ఖర్చులకే సరిపోతోంది. మునుపటిలా ఏమీ మిగలడంలేదు. అప్పట్లోనే మేలు కనీసం కాస్త మిగుల్చుకుని వెనకేసుకునేవాళ్ళం" దిగులు పడింది డోనా.

"అవును మన దేశంలోనే మేలు. ఏదో ఒక పని చేసి మనకంటే ఎక్కువగా డబ్బు సంపాదించి లగ్జరీగా బ్రతుకుతున్నారు. మనమే, మన దేశాల్ని వదిలి వచ్చి ఏళ్ళ తరబడి ఇక్కడ వుండిపోయి అటూ ఇటూ కాకుండా పోయాం. మన దేశాలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్నాయి. ఇక్కడేం వుంది? ఎడారి ఇసుక తప్ప? ఈ పెట్రోలు అంటూ లేకపోతే ఈ కువైటు దేశం ఎందుకూ పనికిరాదు. వీళ్ళు వీధుల్లో అడుక్కు తినాల్సిందే అవును ఇక మన దేశంలోనే స్థిరపడటం మేలు.  మనలాగా పరాయి దేశాలకు వెళ్ళి పనులు చేసుకుని బ్రతకాల్సిందే" ఆవేశంగా చెప్పింది జేనీ.

"సరే ఇక పదండి పనుల్లోకి వెళదాం. ఫ్లైయిట్లన్నీ కేన్సిల్ అవడం వల్ల గెస్ట్‌లందరూ ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళి నిరాశగా తిరిగి వచ్చారు. బయట దేశాలనుండి రావాల్సినవాళ్ళు రాలేక ఎక్కడివాళ్ళక్కడ నిలిచిపోయారు. ఎయిర్‌పోర్టులో నిలబడిపోయిన నీటిని తోడిపోస్తున్నారంట" తన సీట్లోకి వెళ్ళిపోతూ చెప్పింది సంధ్య.

"సరే పదండి. కబుర్లాపి పని చేసుకుందాం" అంటూ అక్కడినుండి కదిలివెళ్ళింది డోనా.

ఇంతలో "ఏం జరిగిందో తెలుసా" అంటూ ఆయాసపడుతూ అక్కడికి వచ్చాడు శ్యామ్.

"ఏం జరిగింది? ఎందుకంత టెన్షన్‌గా వున్నావు?" అని ప్రశ్నించింది సంధ్య.

"నేను సాల్మియా నుండి ఉదయం 8 గంటలకి బయలుదేరాను. రోడ్లన్నీ నీళ్ళతో నిండిపోయి నా కారు మధ్యలో చిక్కుబడిపోయింది. కానీ దేవుని దయవలన పోలీసులు, మిలటరీ స్క్వాడ్ సహకరించి సహాయపడటంతో నేను బయటపడి ఈ టైమ్‌కి డ్యూటీకి రాగలిగాను. అబ్బా.. రోడ్డంతా బురద, కారంతా బురద. నా బట్టలకి కూడా అంటుకుంది బురద. మినిస్ట్రీ వాళ్ళు సెలవు ఇచ్చినట్లు మనకు కూడా మనవాళ్ళు కనీసం ఈ రోజు సెలవు ఇచ్చివుంటే బాగుండు. కారు నీటిలో చిక్కుబడి ఊగిసలాడి పోయింది. కొట్టుకు పోతుందేమో అని కంగారుపడి దాన్ని నీటిలో వదిలేసి దిగిపోదామనుకున్నాను. ఇంతలో ఆపద్భాంధవుల్లా మిలటరీ స్క్వాడ్ వచ్చి రక్షించింది. లేకపోతే నా గతి అంతే. ఇద్దరు ముగ్గురు కువైటీస్ ఇక తట్టుకోలేక ఆ ఒత్తిడి భరించలేక తమ కార్లను అలా వదిలేసి బ్రతుకు జీవుడా అనుకుంటూ నీటిలో ఈదుతూ గట్టుకు చేరారు.

ఎంత ఖరీదైన కార్లో అవి. ఏం లాభం? ఎక్కడికి కొట్టుకుని పోతాయో? ఎప్పుడు దొరుకుతాయో? రిపేరుకైనా పనికొస్తాయో లేదో? నా పదిహేనేళ్ళ సర్వీసులో ఈ కువైట్‌లో ఇంత పెద్దగా వర్షాలు, వరదలు ఎప్పుడూ చూడలేదనుకో" గట్టిగా ఊపిరి పీల్చుతూ చెప్పసాగాడు శ్యామ్. అతడి మాటలు విని వెళ్ళిపోయిన వాళ్ళంతా తిరిగి అక్కడికి వచ్చి ఆసక్తిగా వింటున్నారు.

"అబ్బ వినడానికే భయంగా వుంది. నువు ఈ రోజు డ్యూటీకి రాకుండా వుండాల్సింది" అంది సంధ్య గుండెల మీద చేతులు వేసుకుంటూ.

"నిజమే. ఇలా ఇంత ఎక్కువగా ప్రమాదకరంగా నీరు రోడ్లపై నిండుకుని వున్నాయని ముందే తెలిసి వుంటే ఒక ఫోను చేసి మన మేనేజరుకు సంగతి చెప్పివుండేవాడిని. కానీ మధ్య దారిలోకి వచ్చాక మొత్తం రోడ్డంతా బ్లాక్ అయిపోయింది. అన్ని కార్లు వరసగా ఆగిపోయాయి. ఎటూ వెళ్ళడానికి వీలుకాని స్థితి. అన్ని మార్గాలూ మూసుకుని పోయాయి. దిక్కుతోచని స్థితి. నా షూ, ప్యాంటు అన్నీ తడిసిపోయాయి. వాష్‌రూమ్‌కి వెళ్ళి కడుక్కొని రావాలి" అన్నాడు శ్యామ్ చీదరగా ముఖం పెట్టి.

అతడి మాటలన్నీ వింటున్న జేనీ "హేయ్ శ్యామ్! నువ్వు ఆ ట్రాఫిక్‌ను, వరదను, ఫోటోలు తీసి ఫేస్‌బుక్‌లో పెట్టాల్సింది. వీలైతే లైవ్ వీడియో కవరేజ్ ఇవ్వాల్సింది. మేం కూడా చూసి ఎంజాయ్ చేసేవాళ్ళం కదా! ఇలాంటి సంఘటనలు మళ్ళీ మళ్ళీ జరగవు కదా" అంది.

"అమ్మా జేనీ ఆపు నీ ఫేస్‌బుక్ గోల. ఈ మధ్య జనాలకి అన్నీ ఫోటోలు ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చెయ్యడం పెద్ద వ్యసనంగా మారిపోయింది. ఆ స్థితిలో నేనైతే భయంతో అక్కడినుండి ఎలా బయటపడాలా అని ఆలోచించాను కానీ ఆ కంగారులో ఫోను ఎక్కడ వుందో కూడా అర్థం కాలేదు నాకు. అక్కడ నీలాంటి వాళ్ళు కూడా వున్నారు. చచ్చేవాళ్ళు చస్తుంటే వీళ్ళు గట్టున నిలబడి ఫోటోలు, వీడియోలు, లైవ్ కవరేజ్‌లు ఇస్తూనే వున్నారు. అలాంటి వాళ్ళని చూస్తే కంపరం కలుగుతుందనుకో. యాక్సిడెంట్లు అయి కొనప్రాణంతో గింజుకులాడేవాళ్ళని తొందరగా హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి కానీ ఫోటోలు, వీడియోలు తీసి ఫేస్‌బుక్‌లో పెట్టడం, వెంటనే వాట్సప్ గ్రూపుల్లో ఫార్వార్డ్ చేయడం ఎంత అమానుషం? ఈ ఫేస్‌బుక్‌లు వాట్సప్ గ్రూపులు మొదలయ్యాక ఈ మధ్య ఆడవాళ్ళు మొగుళ్ళని కూడా పట్టించుకోవడం లేదు. పదేళ్ళ క్రితం ఓణీల్లో ఇలా వున్నాను. ఇరవై యేళ్ళ క్రితం గౌనుల్లో అలా వున్నాను అంటూ పనీపాటా లేకుండా పాత ఫోటోలు పెట్టి మనుషుల్ని భయపెట్టడం. వండిన వంటకాలన్నీ దేవుడికి నైవేద్యం సమర్పించినట్లు ప్లేటల్లో పరిచి పెట్టి ముందుగా ఫేస్‌బుక్‌లో పెట్టి అందరికీ చూపించి వాటి గురించి వివరించడం. అందరి లైకులు, కామెంట్లు వచ్చాక వాటిని చూసుకుని



మురిసిపోయి ఆ వంటకాల్ని కడుపులోకి తోసెయ్యడం. ఆ ఫుడ్‌కి ఎంత దిష్టి తగులుతుందో ఏమో? ఆలోచించే జ్ఞానం కూడా నశించిపోతోంది ఈ మనుషులకి. అబ్బబ్బ ఎక్కడికి పయనిస్తున్నామో? ఏమో? వరదల్లో చిక్కుకుని కొట్టుకునిపోయినట్లు ఆ నెట్‌లో పడి కొట్టుకుపోతున్నాం మనం. ఇలా వినియోగించే కాలాన్ని మనం మంచి కోసం ఉపయోగించుకోవచ్చు కదా. నెట్‌ను సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచికోసం వినియోగిస్తే అందరికీ మంచిది. ఆరోగ్యానికి కూడా మేలు" అసలే టెన్షన్‌లో వున్నాడేమో మండిపడ్డాడు శ్యామ్ జేనీ మీద.

"అయ్యయ్యో ఇట్స్ ఓకె. నీకు కుదరకపోతే పోనీలే. నెట్‌ను, ఫేస్‌బుక్‌ను, వాట్సప్‌ను తిట్టకు. అప్పట్లో ఆడవాళ్ళు గడప ముంగిట్లోనో, గోడ ప్రక్కనో చేరి కబుర్లాడుకునేవాళ్ళు. వారి గురించీ వీరి గురించీ లేనిపోనివి చెప్పుకుని కాలక్షేపం చేసేవాళ్ళు. కానీ ఇప్పుడు ఆడవాళ్ళు అలాకాదు. వాట్సప్ గ్రూపుల్లోనే అన్ని కబుర్లు. చీరల గురించి, నగల గురించి, వంటల గురించి, సాటి ఆడవారి గురించీ ఆఖరికి కట్టుకున్న మొగుడి గురించి కూడా. ఎంత సౌలభ్యం. అందులో ఎంత ఆనందం" అంది జేనీ వాట్సప్ గురించి మాట్లాడటానికి ఇదే అవకాశం అనుకుంటూ.

"చాల్లేమ్మా ఆపు నీ వాట్సప్ పిచ్చి. ప్రస్తుతం కువైట్‌లో కురిసే వర్షాలు, పొరలుతున్న వరదల గురించి వాటి సమస్యల గురించి మనం మాట్లాడుకుంటున్నాం. ఆ విషయాలు చర్చించండి" అంది డోనా.

"అలా బుద్ధి చెప్పు డోనా" అన్నాడు శ్యామ్ కోపంగా జేనీకేసి చూస్తూ.

"ఇండియాలో కూడా ఇక్కడి వరదల గురించి తెలిసిపోయింది. అందరూ ఫోన్లు చేసి తమ వాళ్ళని పరామర్శించడమే. కొందరైతే ఇక్కడ మనం ఏ ప్రమాదంలో చిక్కుకున్నామో అని కంగారు పడిపోతున్నారు. ఇండియా నుండి మా అమ్మా నాన్నా, చెల్లెళ్ళు ఫోన్లుచేసి టీవీలోని వార్తల్లో కువైట్ వరదల గురించి చెపుతున్నారు. మీకేం కాలేదుకదా? జాగ్రత్తగా వుండండి అంటూ వర్రీ అయిపోయారు. అంత ప్రమాదం ఏమీలేదు మేముండేది సిటీలో కదా అంటూ వాళ్ళకి నేను ధైర్యం చెప్పాను" అంది సంధ్య నవ్వుతూ.

"అవును మా ఫ్రెండ్స్ కూడా అమెరికానుండి ఫోన్లు చేసి, మెసేజ్‌లు పెట్టి పరామర్శిస్తున్నారు" అంది జేనీ.

"నిజమే ఈ విషయం ప్రపంచమంతా తెలిసిపోయింది. శ్యామ్ నీ భార్య ఫోను చేసిందా?" ఆరా తీసింది డోనా ఊరికే వుండకుండా.

"హుమ్.." అంటూ ఒక నిట్టూర్పు విడిచాడు శ్యామ్. "అంత అదృష్టమా నా జీవితానికి" అన్నాడు బాధగా.

"ఏంటి శ్యామ్ ఎందుకంత బాధ?" ప్రశ్నించింది సంధ్య తెలుసుకోవాలనే కుతూహలంతో.

"నా భార్యకి నా గురించి ధ్యాసే వుండదు. ఇక్కడ కువైట్‌లో భర్త ఏం తింటున్నాడు? ఎలా వుంటున్నాడు? ఎంత కష్టపడుతున్నాడు అనే సంగతులు ఆవిడకి అవసరంలేదు. నెలనెలా నేను పంపించే డబ్బుల మీదే తన ధ్యాస. ఆ డబ్బుతో ఏ చీరలు కొనుక్కోవాలా, ఎలాంటి నగలు చేయించుకోవాలా అనే కోరికలు తప్ప భర్త ఇక్కడ ఒంటరిగా ఎలా కాలం గడుపుతున్నాడు? మగవాడైవుండి తన కోసం వంట చేసుకుని, బట్టలు ఉతుక్కుంటున్నాడు, అంట్లు తోముకుంటున్నాడు కదా ఆయనకి కాస్తంత ప్రేమ, ఓదార్పు మాటలు చెప్పాలి. ఆయన గురించి ఆలోచించాలి అనే కనీస జ్ఞానం ఆ స్త్రీకి దేవుడు ఇవ్వలేదు. ఏం చేస్తాం? అంతా నా ఖర్మ" అని వగచాడు శ్యామ్.

"అప్పుడెప్పుడో నీ భార్యని పిలిపించావని ఇక్కడికి వచ్చిందని చెప్పావు కదా? మరి ఎందుకు తిరిగి ఇండియా వెళ్ళిపోయింది" కారణం చెప్పు అంటూ ఆసక్తి చూపించింది డోనా.

"అదేమి విచిత్రమో దానికి తన తల్లి అంటే అమితమైన ప్రేమ. తల్లిని చూడకుండా నాల్రోజులు వుండలేదు. పెళ్ళయ్యాక ఇక్కడ నాకు వంట చేసిపెట్టి నాతోపాటు వుంటుందని తన ప్రేమను పంచుకోవాలని, కువైట్ అంతా తిరిగి జీవితాన్ని ఎంజాయ్ చెయ్యాలని

ఎంతో ఆశపడి లక్షరూపాయలు పెట్టి వీసాకొని పిలిపించాను. కానీ రెండు నెలలు కూడా వుండలేదు. తన అమ్మనే కలవరిస్తూ తల్లిని చూడకుండా వుండలేనని, తలనొప్పని ఏడుపు మొదలుపెట్టింది. ఇక్కడ భర్త వంటరిగా ఎలా వుంటాడో, ఎలా తింటాడో అనే ఆలోచన లేకపోయింది. ఇక భరించలేక ఇండియాకు పంపించేసాను. భర్త మీద ప్రేమలేని ఇలాంటి భార్య దొరకడం నా దురదృష్టం" అన్నాడు శ్యామ్ బాధగా.

"అయ్యో భర్తను విడవకుండా అంటిపెట్టుకుని వుండే భార్యల్ని చూసాం కానీ ఇలా తల్లిని ప్రేమించి తల్లితోపాటు వుండాలనుకునే భార్యని ఇక్కడే చూస్తున్నాం. అలాంటప్పుడు ఇలాంటి స్త్రీలు పెళ్ళెందుకు చేసుకోవాలో, భర్తని ఎందుకు బాధపెట్టాలో? పెళ్ళి చేసుకోకుండా తల్లితోపాటు అక్కడే వుండిపోవచ్చుగా. అయినా నీకేం తక్కువ? నువ్వంటే ఏమాత్రం విలువ, ప్రేమలేని అలాంటి భార్య వున్నా ఒకటే లేకపోయినా ఒకటే, తనవలన ఏ సుఖమూ లేకుండా నువు ఇంత కష్టపడటం ఎందుకు? ఎవరికోసం? తనకి విడాకులిచ్చేసి మంచి అమ్మాయిని చూసి పెళ్ళి చేసుకుని జీవితాన్ని ఎంజా చెయ్యి. తన తిక్క కుదురుతుంది" సలహా ఇచ్చింది సంధ్య.

"తను మారుతుందేమో, భర్త విలువ తెలుసుకుని ప్రేమిస్తుందేమోనని ఇన్నాళ్ళూ వెయిట్ చేసాను. కానీ మారే ధోరణేమీ కనపడటం లేదు. అదే నేను కూడా ఆలోచించాలి" అన్నాడు శ్యామ్.

"పెళ్ళిచేసుకున్న ఖర్మానికి నీకిక్కడ గొడ్డుచాకిరీ తప్పడంలేదన్నమాట. ఇక్కడ కష్టపడి సంపాదించడం, అక్కడ భార్యను మహారాణిలా పోషించడం. భార్యంటే ఇంట్లో భర్తకి అన్ని విధాలా అవసరాలు చూడాలి, అర్థం చేసుకుని, సహకరించాలి, ప్రేమించాలి. ఆఫీసులో పనేకాక ఇంట్లో అంట్లు తోముకునే పనికూడా నీకేనా? ఎన్నేళ్ళు ఇలా? తన చేతితో వండుకున్న వంటనే ఏళ్ళ తరబడి తినడం మగవాడికి ఎంత కష్టమో తెలుసా? నువ్వు పెళ్ళిచేసుకుని ఏం లాభం? నీ ప్రాణానికి సుఖం లేదు కదా? వేడి వెచ్చలేని జీవితం వ్యర్థ కదా! ఈ కాలం భార్యలు ఇంట్లో పనేకాక బయట ఉద్యోగాలు కూడా చేసి సంపాదిస్తున్నారు. పిల్లల్ని కనిపెంచుతున్నారు. ఇన్ని విధాలగా స్త్రీ కష్టపడుతూ భర్తకు సహకరిస్తూ కుటుంబాన్ని ఆదుకుంటోంది. అభివృద్ధికి సహాయపడుతోంది. కానీ ఇప్పుడే వింటున్నాను ఇలాంటి పనికిరాని భార్యలు కూడా వుంటారని" ఈసడించింది జేనీ.

"అయితే పెళ్ళి చేసుకున్నావే కానీ నీ జీవితానికి ఏ సుఖమూ లేదన్నమాట" నిట్టూర్చి జాలిగా శ్యామ్ వైపు చూసింది సంధ్య.

"ఇంతగా వరదలు పొంగి పొరలి కువైట్‌ను ముంచేస్తుంటే, అందరూ కంగారు పడి ఫోన్లు చేసి తమ వాళ్ళని పలకరిస్తుంటే ఈవిడ మాత్రం భర్త ఎలా వున్నాడో అని ఆలోచించకుండా ఫోను చేసి పలకరించకుండా వుందంటే ఎంత కఠినమైన హృదయం కల స్త్రీనో అర్థం అవుతోంది. అందుకే పాపం శ్యామ్ ఎప్పుడూ దిగులుగా కనిపిస్తాడు" చెపుతూ కన్నీళ్ళు నింపుకుంది జాలిగల డోనా.

"ఏయ్ ఇక కబుర్లు ఆపి పనుల్లోకి పదండి. ఇప్పటికే చాలా టైమయింది. బాస్ చూస్తే తిడతాడు అంది భయంగా " గేటు వైపు చూస్తూ జేనీ.

జేనీ భయం చూసి అక్కడ వున్న వారందరూ ఫక్కున నవ్వేసారు.

"ఇంకేం బాసు? ఎలా వస్తాడు? ఆఫీసుకు వస్తూ దారిలో వరద నీటిలో ఇరుక్కుపోయి, ముందుకు వచ్చేదారిలేక ఈ నీటిలో ఈతకొట్టలేక ఎలాగో తిప్పలుపడి తిరిగి ఇంటికే వెళ్ళిపోయాడట. ఫోను చేసి ఆ విషయం తెలియజేసాడు. మాకందరికీ తెలుసు ఆయన ఈరోజు ఆఫీసుకు రాడని. అందుకే మేం అందరం కబుర్లు చెప్పుకుంటున్నాం" అంది సంధ్య నవ్వుతూ.

"ఇండియాలో కూడా తమిళనాడులో 'గజ' తుఫాను తీరప్రాంతాల్ని కల్లోలం చేస్తోందట. అందరం కలిసి కువైట్‌కు వచ్చిన వరదల గురించీ మన ఇండియాలో వున్న తుఫాను గురించీ ప్రార్థన చెయ్యాలి అంది" జేనీ.

"అలాగే తప్పకుండా. అందరూ బాగుండాలి. అందులో మనముండాలి" అంది బదులుగా డోనా.

## గల్ఫ్ యుద్ధం చెప్పిన కథ

**1990 - సెప్టెంబరు నెల**

ఉదయం పదిగంటల వేళ - సూర్యుడు తూరుపు ఆకాశంలో పైకి ఎగ్రబాకి కువైట్ సిటీని ఒక్కసారి చూసాడు. తన తీక్షణమైన చూపులతో వెలుగును, వేడిని కువైట్ పట్టణంలో నింపాలనుకున్నాడు. కానీ ఆయన ప్రయత్నం వ్యర్థమైపోయింది. ఆశ అడియాసే అయింది.

దాదాపు నెల రోజులుగా ఇదే ప్రయత్నం. అదే భంగపాటు.

ఆకాశంలో అలా అలవోకగా తేలిపోయే మేఘాలు అపుడపుడూ తనకు అడ్డం వస్తాయి. తన ధాటికి తట్టుకోలేక కొద్దిసేపటికే తప్పుకుని దారి తొలిగిపోతాయి. ఎడారి దేశమయిన కువైట్ అంటే తనకు ఎంతో ఇష్టం. అందుకే వేసవికాలంలో తన ప్రభావాన్ని, ప్రేమను మరీ ఎక్కువగా కువైట్ దేశంపైన చూపిస్తుంటాడు సూర్యుడు.

ఇప్పుడు పరిస్థితి చాలా కఠినంగా వుంది. దాదాపు నెలరోజులుగా ఆకాశమంతా దట్టమైన పొగ అలుముకుని వుంది. కళ్ళు చిట్లించుకుని క్రిందవున్న భూమిని ఒక్కసారి చూసి ఆనందించాలి అనుకున్నా కుదరటం లేదు. అయ్యో ఏమయిందో ఈ కువైట్ దేశానికి? ఎలా వుందో ఎందుకిలా తయారయిందో ఒకసారి ఎవరినైనా అడిగి కనుక్కోవాలి. హా.. ఐడియా... అడ్డు అదుపూ లేకుండా అన్నిచోట్లా స్వేచ్ఛగా తిరిగే గాలిని అడిగి కనుక్కుంటే. అవును ఇప్పుడే అడిగితే సరి. గాలికైతే అన్ని విషయాలు తెలుస్తాయి.

"హలో. హాయ్.. ఓ గాలీ.. బావున్నావా? ఒకసారి ఆగవా! ఒక సంగతి నిన్ను అడగాలబ్బా"

"ఆ ఎవరది? ఎవరు నన్ను పిలుస్తున్నారు? ఓహో అయ్యబాబోయ్ సూర్యభగవానులు గారా? ఈ లోకంలో మీకు తెలియని విషయాలు ఏమున్నాయండీ. మహద్భాగ్యం తప్పకుండా అడగండి."

"హు.. ఇంతవరకూ నేను కూడా అలాగే అనుకున్నాను. భూమి మీద జరిగే ప్రతి విషయం నా కంటికి మరుగై వుండదని. కానీ ఇపుడు మాత్రం అది నిజంకాదని ఒప్పుకోవాల్సి వస్తోంది"

"సరే కానీ క్రిందవున్న ఆ కువైట్ దేశానికి ఏమయింది? దాదాపు నెలరోజులుగా అక్కడ ఏం జరుగుతోందో చూడాలని తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నాను. కానీ అస్సలు కుదరటంలేదు. ఏవో భయంకరమైన శబ్దాలు ఢాం.. ఢాం అంటూ చెవులకు వినబడుతున్నాయి. కేకలు ఏడుపులు కూడా ప్రతిరోజూ వింటున్నాను. ఇంతకీ ఏం జరుగుతోందక్కడ? మరినేనేమో ఆకాశాన్ని విడిచిపెట్టి క్రిందకి భూమిపైకి రాలేనుగా"

ఆసక్తిగా అడిగాడు సూర్యుడు.

హు - "ఏం చెప్పమంటారు సూర్యుడుగారూ. ఘోరం జరుగుతోందక్కడ. కళ్ళతో చూసి భరించలేకపోతున్నాం. చెవులతో విని సహించలేక పోతున్నాం. మీ పనే మేలు. ఆకాశంలో పైన హాయిగా కూర్చుని అక్కడే తిరుగుతున్నారు. అంతటా అన్నిచోట్లా తిరిగి అన్నీ చూడలేక వినలేక నేను చచ్చిపోతున్నాను" వగచింది గాలి.

"సోది ఆపి అసలు విషయం చెప్పు" కోపగించుకున్నాడు సూర్యుడు.

"చెప్పడానికి నోరు రావడంలేదు మహానుభావా. ఏమని చెప్పమంటారు ఎన్నన్ని చెప్పమంటారు? ఆ సద్దాం హుస్సేన్ ఇరాక్ దేశం నుండి సైన్యంతో వచ్చిపడి కువైట్ దేశాన్ని ఆక్రమించుకున్నాడు. అంతటితో ఆగితే మంచిదేకానీ దుర్మార్గం మితిమీరిపోయి కనిపించిన కువైట్ వాళ్ళనందరినీ చంపడం, స్త్రీలను పట్టి వారిని బలాత్కరించి హింసించడం చేస్తున్నారు. అంతేకాదు దాదాపు 700 పెట్రోలు బావులను తగలపెట్టేసారు. నేలలోనుండి ఉబికి ఉబికి వచ్చే జలలాంటి పెట్రోలు బావులు నింగికెగసిన మంటలతో నుండి పోతున్నాయి. కువైట్ దేశమంతా దట్టమైన పొగ అలుముకుంది. పగలే ఏమీ కనిపించడం లేదు అక్కడ మిగిలిన ప్రజలకు శ్వాస పీల్చుకోవడం కష్టమైపోతోంది.

అటువైపునుండి సద్దాం హుస్సేన్ వచ్చి పడగానే. ఇటువైపు నుండి కువైట్ వాళ్ళు దేశం విడిచి పొరుగుదేశాలకు పారిపోయారు. ప్రక్కనే వున్న సౌదీ అరేబియాకు నాలుగంటల కారు ప్రయాణం.



మెలుకువగా వున్న ప్రతి కువైటీ పౌరుడు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని అటువైపు సరిహద్దులు దాటి పారిపోయారు. మిగిలిన వారిని, కనిపించిన వారిని నిర్దాక్షిణ్యంగా అక్కడికక్కడే ఇరాకీ సైన్యం చంపేస్తోంది. పిల్లలను, స్త్రీలను బంధించి అకృత్యాలు కొనసాగిస్తున్నారు.

పొట్టకూటికోసం పరదేశాలనుండి వచ్చినవారు కూడా ఎడారి మార్గాల్లో ప్రయాణించి జోర్డాన్ దేశం చేరుకుని అక్కడికి తమ దేశం పంపించిన విమానాల్లో కూర్చుని స్వదేశాలను చేరుకున్నారు.

కానీ ఎటూ వెళ్ళడానికి వీలులేని కొందరు కువైట్‌లోనే వుండిపోయారు. కొందరు డాక్టర్లు, నర్సులు, హాస్పిటల్లో రోగులను విడిచిపెట్టి వెళ్ళలేక ప్రాణాలకు తెగించి వుండిపోయారు.

కొద్దిమంది పరదేశులు సేవాభావంతో కువైట్‌లోనే వుండిపోయి అవసరం వున్నవారికి ఆహారం, మందులు అందిస్తూ వాలంటీర్లుగా నిలబడ్డారు. అదిగో ఆ కువైట్ సిటీలోని సాల్మియా ప్రాంతాన్ని ఒకసారి చూస్తే అక్కడ ఇండియన్ స్కూలు కనబడుతుంది. అక్కడ ఇండియన్స్ కొంతమంది వాలంటీర్లుగా ఏర్పడి సహాయక చర్యలు చేపట్టారు. ఇరాకీ సైన్యం కువైటీ వారి మీదే దృష్టి పెట్టింది కానీ పరాయిదేశాల వాళ్ళకు మాత్రం ఏ హానీ చేయలేదు. కాబట్టి మిగిలిన పరదేశులు అందరూ ఒక్కటై ఒకరిని ఒకరు ఆదుకున్నారు. బట్టలను ఆహార పదార్థాలను రొట్టెలను, త్రాగునీటిని, మందులను సేకరించి అవసరమైన వారికి అందిస్తున్నారు. మానవత్వం ఇంకా మనుషుల్లో మిగిలేవుంది అని చెప్పడానికి వీళ్ళని మాదిరిగా మనం చూపించవచ్చు. కువైట్ దేశం విడిచి స్వదేశానికి వెళ్ళడానికి అవకాశం కలిగినా కూడా కొంత మంది వెళ్ళకుండా పరిస్థితులను చూసి చలించిపోయి స్వచ్ఛందంగా సేవచేయడానికి నిలబడ్డారు.

గాయపడిన వారిని, జబ్బుతో వున్నవారిని, తమ వారిని కోల్పోయి దుఃఖిస్తున్న వారిని వీళ్ళే ఆదుకుంటున్నారు. అండగా నిలబడి మేమున్నాం అని ధైర్యం చెబుతున్నారు. అందులో కరెంటు లేదు నీళ్ళు లేవు ఆహారం లేదు. పెట్రోలు బావులు తగలబడుతున్న పొగ క్రమ్ముకోవడంతో పగలే చీకటిగా వుంది.



ఆ పొగే దట్టంగా ఆకాశమంతా క్రమ్ముకోవడంతో మీ చూపులు క్రిందికి వెళ్ళడం లేదు సూర్యుడుగారూ. అదీ సంగతి వివరించింది గాలి.

"అయ్యో నాకు తెలియకుండా ఇంత పని జరిగిందా? ఆశ్చర్యంగా వుందే నా కంటికి అడ్డుపడేటంత ధైర్యమా ఆ పొగకి. సరే అటువైపు పడమటి వైపుకు వెళ్ళి కొండల్లోకి వాలిపోయి కువైట్‌ని పరిశీలిస్తాను. ఇన్ని విషయాలు నాకు తెలియజేసినందుకు నిన్ను మేము అభినందిస్తున్నాము 'గాలి'గారు "

"అయ్యో ఎంతమాట మహాప్రభూ. మీతో మాట్లాడటం మా అదృష్టం సూర్యులుగారూ"

కువైట్ దేశంలో యుద్ధమా? అతిచిన్న ఎడారి దేశం అది. సద్దాం హుస్సేన్ క్రౌర్యానికి పాపం బలయిపోయి ఉంటుంది. అయ్యోపాపం అనుకుంటూ సూర్యుడు నడిమింటికి వచ్చి నక్కి క్రిందికి చూసాడు. అహా... ఏమీ కనబడటంలేదు. అలా పడమటి వైపు సాగిపోతూ ఆ వైపు నుంచి తొంగి చూసాడు ప్రక్కనుండి కొద్దిగా కనబడుతోంది. నిజమే సంపదతో తులతూగుతూ కళకళలాడిపోయే కువైట్ ఎంత కళాహీనమైపోయింది. బారులు తీరిన కార్లతో రోడ్లన్నీ చాలా సందడిగా కనువిందు చేసేవి. ఇపుడు నిర్మానుష్యంగా ఎంతో స్థబ్దంగా వుంది.

యుద్ధం చేసిన గాయాలు తడుముకుంటూ విషాదంలో మునిగిపోతుంది.

సాయంత్రం ఐదుగంటల సమయం. 'జాబ్రియా'లోని ముబారక్ హాస్పిటల్ నుండి బయటికి వచ్చింది ప్రియదర్శిని. ఎపుడు చూసినా అపుడే విరబూసిన గులాబిపువ్వులా వుండే ఆమె ముఖం ఆ రోజు ఎంతో అలసటగా వుంది. ప్రొద్దుట వేసుకున్న తెల్లటి యూనిఫామ్ మసిబారిపోయి రంగుమారింది. అసలే ఆమె ఒట్టి మనిషి కూడాకాదు. ఏడవనెల గర్భంతో భారంగా అడుగులు వేస్తోంది ప్రియ. ఈ గల్ఫ్ యుద్ధం మొదలయినప్పటి నుండి ట్రాన్స్‌పోర్టు సౌకర్యం కూడా లేదు. దాదాపు రెండు మైళ్ళ దూరంలో వున్న 'సాల్మియా'లోని తన ఇంటికి కాలి నడకనే వెళ్ళాలి. సద్దాం హుస్సేన్ వచ్చి కువైట్‌ని ఆక్రమించగానే హాస్పిటల్‌లో పని చేసే డాక్టర్లు, నర్సులు, పనివాళ్ళు అందరూ కువైట్ విడిచిపెట్టి వారికి వీలైన మార్గాల ద్వారా వారి స్వదేశాలకు వెళ్ళిపోయారు. ఇప్పుడు హాస్పిటల్‌లో మిగిలింది ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు నర్సులు, ముగ్గురు ఆయాలు మాత్రమే. వార్డులన్నీ పేషెంట్లతో నిండిపోవడంతో దిక్కుతోచడం లేదు. కరెంటు లేదు, మందులు లేవు. సదుపాయాలు కూడా అంతంత మాత్రమే బాత్‌రూముల్ని శుభ్రం చేసే వాళ్ళు కూడా లేరు. ఉన్న ఇద్దరు అన్ని వార్డుల్లోని అంతపని చెయ్యడం కష్టం. అత్యవసరమైన వైద్యాన్ని అందించడం తప్ప ఇక ఏ విధంగాను వసతుల్ని, సమకూర్చడం అసంభవం.

ఎన్నో హింసలకు గురై గాయాలపాలై హాస్పిటల్‌కు చేర్చబడిన రోగుల దుస్థితి ఎంతో ఆవేదనను కలగజేస్తోంది. సరైన వైద్యం చేయలేకపోవడంతో బాధగా వుంది. తన ఎంతోమందికి సేవలు చేయాలనే ఉన్నతమైన ఆశయంతో తన తండ్రి నర్సింగ్ కోర్సు చేయమని తనని ప్రోత్సహించాడు.

మరి ఇలాంటి సమయంలోనే కదా తను నిలబడాల్సింది. ఒక నర్సుగా ఎంతవరకు సేవ చేయగలదో సహాయపడగలదో అంతవరకూ చేయాలని పారిపోకుండా నిలబడాలని ఆమె నిశ్చయించుకుంది.

ప్రస్తుతం కువైటు ప్రభుత్వాన్ని కూలద్రోసిన ఇరాక్ ఆధ్వర్యంలోనే పాలన కొనసాగించబడుతోంది. ప్రపంచంలోనే అత్యంత విలువైన కువైట్ దినారు. సద్దాం ఆక్రమించగానే ఒక చిత్తు కాగితంలా మారిపోయింది. అన్ని విధాలా కొనుగోళ్ళకు వస్తుమారకాలకు ఇపుడు ఇరాకీ దినార్లు చలామణిలోనికి వచ్చాయి. పని చేసే వర్కర్స్‌కి రెండు నెలలుగా జీతాలు లేవు. మరి ఇంకెన్ని నెలలు జీతం లేకుండా పని చేయాలో? ఎప్పటికి ఇస్తారో? ఎవరు ఇస్తారో? అసలు ఇస్తారో ఇవ్వరో తెలియని పరిస్థితి. ఇలాంటి పరిస్థితిలో సమస్యలను ఎదుర్కొంటూ నిలబడి వుండటం ఎంతో కష్టమైన విషయం. బ్రతుకుంటే బలుసాకు తిని బ్రతకవచ్చు అని ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని పారిపోయిన వాళ్ళే ఎక్కువ. అక్కడక్కడా మిగిలిన వాళ్ళు స్వచ్ఛందంగా సేవాభావంతో మిగిలిపోయిన వాళ్ళే.

యుద్ధం మొదలయినప్పటి నుండీ తన భర్త శంకర్ ఒకటే పోరు పెడుతున్నాడు "నువ్వు అసలే ఒట్టిమనిషివికూడా కాదు. కువైట్ దేశమంతా నిండుకున్న పొగను పీల్చడం నీకు నీ కడుపులో వున్న బిడ్డ ఆరోగ్యానికి అసలు మంచిదికాదు. కనీసం చిన్నపాటి సదుపాయాలు కూడా లేకుండా ఎంతో కష్టానికి ఓర్చి నువు డ్యూటీ చేస్తాననడం సబబుకాదు. నా మాట విను. మనం ఏదో ఒక విధంగా ప్రక్కదేశమైన జోర్డాన్‌కు చేరుకుని అక్కడి కాంప్‌లో కొన్ని రోజులు తల దాచుకుందాం. తరువాత మన భారతదేశం పంపించే విమానంలో మన ఇంటికి చేరుకుందాం. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితుల్లో ఇక్కడే వుంటే నీ డెలవరీకి కూడా భయపడాలి" అంటూ ప్రతిరోజూ చెప్పినమాటే మరలా చెపుతున్నాడు. కానీ హాస్పిటల్‌లోని రోగుల దుస్థితి కంటనీటిని తెప్పిస్తోంది. గాయాలపాలై కదలలేని స్థితిలో బెడ్‌పై పడి, తమనే దిక్కుగా భావించిన వాళ్ళను విడిచి పెట్టి వెళ్ళాలంటే మనస్సు ఒప్పుకోవడంలేదు. ఇందుకేనా తను నర్సుగా కోర్సులు చదివింది? మరి తన చదువువల్ల ఎవరికి ప్రయోజనం? ఆలోచిస్తూ వడివడిగా నడుస్తోంది ప్రియదర్శిని. రోడ్లన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. పట్టణమంతా పాడుబడిన దిబ్బలా వుంది. ఉండుండి వినిపించే ఇరాక్ ఆర్మీ ట్రక్కులు తిరిగే శబ్దం తప్ప నిశ్శబ్దంగా వున్నాయి పరిసరాలు. మనుషుల అలికిడి వినిపించడంలేదు. ఒంటరిగా అంతదూరం నడిచి వెళ్ళడం రిస్క్‌తో కూడినదే అయినా తప్పదు. ఆలోచనలోపడి ఎదురు పడిన ఇరాక్ సైనికుల్ని కాస్త ఆలస్యంగా గమనించింది ప్రియదర్శిని. అప్పటికే ఆమెకు అడ్డంగా నిలబడ్డారు వాళ్ళు. "ఏయ్ ఎవరు నువ్వు? ఎక్కడికి వెళుతున్నావు? ప్రశ్నించాడొకడు దర్పంగా.

ఒకసారి తను వేసుకున్న యూనిఫామ్‌ని చూసుకుంది ప్రియ. ధైర్యం ఆమెలో ప్రవేశించింది. డ్యూటీచేసి హాస్పిటల్ నుండి వస్తున్నాను. సాల్మియాలో వుంటుంది మా ఇల్లు. అక్కడికి వెళుతున్నాను. గబగబా అప్పచెప్పింది ప్రియ. ముందే కోతి. ఆపై కల్లు తాగింది అన్నట్లుగా వుంది ఇరాకీ సైనికుల పరిస్థితి. కువైట్‌లోని సంపదలు చూడగానే వీరికి చాలా సంతోషం కలిగింది. అన్నీ దోచుకుని దాచుకున్నారు. అందమైన కువైట్ స్త్రీలను ఇష్టమొచ్చినట్లు అనుభవించారు. హింసించి ఆనందించారు. అడ్డూ అదుపూ లేకుండా పోయింది వీరికి. పాపభీతి నశించి పోయింది మానవత్వం మరుగైపోయింది.

కానీ ఒక్కటి మాత్రం మంచిపని చేస్తున్నారు వీళ్ళు. ఒక్క కువైటీ వాళ్ళను తప్ప పరదేశస్తుల జోలికి వెళ్ళడంలేదు. వారిని బాధించడం లేదు. ముఖ్యంగా మన భారతీయులంటే ఎంతో గౌరవాన్ని కనబరుస్తున్నారు.

"ఓహో డ్యూటీనుండా. సరే. ఇంతె హిందీవాలె సిలానీ?" ప్రశ్నించాడొకడు నవ్వుతూ. "ఆన హిందీ." జవాబు చెప్పింది ప్రియ.

''ఏయ్ అది హిందీ అంట. సరే వదిలెయ్ అన్నాడొకడు.

''సరే.. నువు వెళ్ళు'' అంటూ దారి తొలిగాడు ఎదురుగా నిలిచిన సైనికుడు. హమ్మయ్య అనుకుంటూ రోడ్డు దాటి అవతల వున్న సాల్మియాలోకి ప్రవేశించింది ప్రియ.

''ఐదుగంటలకే చీకటి పడిపోతోంది. పొగకమ్మిన ఆకాశంలో దాదాపు నెలరోజులుగా సూర్యుని జాడేలేదు'' అనుకుంటూ పడమటి వైపు చూసింది ప్రియ. పడమటి కొండల్లో పైన అరేబియా సముద్రానికి గూటికి చేరుకుంటూ కాస్త కంటికి కనిపించాడు సూర్యుడు.

ఆయన కూడా పొగ కమ్మిన కువైట్‌లో ఏం జరుగుతోందో తెలుసుకోవాలని చాటుగా మాటుగా ఏటవాలుగా తొంగి చూస్తున్నాడనిపించింది ప్రియకి. అబ్బ ఎన్నిరోజులైంది సూర్యుడ్ని చూసి యుద్ధమంటే సూర్యుడికి కూడా భయమేమో అందుకే నెలరోజులుగా సూటిగా, ధాటిగా రాలేకపోతున్నాడు. చిన్నగా నవ్వుకుంది ప్రియ తన ఆలోచనకి.

ప్రస్తుతం ఇంట్లో తినడానికి ఏమీ లేవు. గతవారం రోజుల్నుండీ కడుపు నింపుకోవాల్సి వస్తోంది. రొట్టెలు తింటే కడుపు నిండినట్లు తృప్తిగా వుండదు, కంటినిండా నిద్రరాదు ఈ ఇరాకీయులు దోచుకోవడమే తప్ప మరేదీ ఆలోచించడం లేదు. మనవారి కోసం ఇండియా ప్రభుత్వం కొన్ని ఆహారపదార్థాలను పంపిస్తోందని అంటున్నారు. అవి తొందరగా వస్తే బాగుండు. వాటిని ఇక్కడవున్న వారందరికీ పంచిపెడితే కనీసం నాల్రోజులన్నా కడుపు నింపుకోవచ్చు.

ఉన్న కొద్దిపాటి ఆహారపదార్థాలనే అందరూ కలిసి పంచుకుని కడుపు నింపుకుంటున్నారు. లేనివారికి, ఆకలి అన్నవారికి వున్నవాటిల్లో కాస్త పంచిపెట్టి సంతోషించి సంతృప్తి చెందుతున్నారు.

నిజంగా యుద్ధాలు, భూకంపాలు, విపత్తులు సంభవించినప్పుడు, సమస్తం స్థంభించిపోయినపుడు మనిషిలోని మానవత్వం బయటికి వస్తుంది. అపుడే సాటిమనిషి విలువ తెలుస్తుంది. సమానత్వం అందరిలో నెలకొని, న్యాయం ధర్మం సమపాళ్ళలో నిలబడుతుంది.

అన్నీ వున్నప్పుడు మనిషి గర్వంతో అహంతో విచ్చలవిడితనంతో నీతో నాకేం పని అన్నట్లుగా ప్రవర్తిస్తాడు. ఎపుడైతే సమస్తాన్ని కోల్పోయి ఒడ్డున పడ్డ చేపలా ప్రాణభయంతో గిలగిలలాడతాడో అపుడే మానవతా విలువలు పెల్లుబికి వస్తాయి.

అన్నీ బాగా ఉన్నపుడు ఎదురింట్లో వున్న కువైటీ మామ్మగారు పనిమనిషిని ప్రతిరోజూ రాచి రంపాన పెట్టేది. నెలంతా కాసేపు కూడా నిలబడనివ్వకుండా పని చేయించుకుని నెలజీతాలు సరిగ్గా ఇచ్చేదికాదు. గ్లాసుపగల గొట్టావనో, పాలు పొంగపెట్టావనో, తలుపుపై దుమ్ము సరిగాతుడవలేదనో సవాలక్ష కారణాలు చెప్పి జీతాన్ని సగం కూడా ఇచ్చేది కాదు. కడుపునిండా తిండి కూడా పెట్టేది కాదు. అస్తమానం కాళ్ళు ఒత్తుకుని ఒంటికి మసాజ్ చేయమని చెప్పి సతాయించేది. ఆ పని చేయలేక ఆ కష్టాలు భరించలేక పనిమనుషులందరూ నాలుగునెలలు చూసి ఇల్లు వదిలిపెట్టి పారిపోయేవాళ్ళు. కానీ ప్రస్తుతం పనిచేస్తున్న మన తెలుగమ్మాయి రాజేశ్వరి మాత్రం అన్నింటినీ భరించి, సహించి గట్టిగా రెండేళ్ళ కాలం అక్కడే నిలబడింది. రెండేళ్ళు కాంట్రాక్టు పూర్తి చేసుకుని ఇంటికి వెళ్ళిపోతాను గానీ భయపడి పారిపోవడం నాకు నచ్చదు అంటూ అక్కడే వుండిపోయింది. ఇంకొక నెలకి ఇంటికి వెళ్ళిపోతుంది అనుకునేంతలో ఇరాక్ వచ్చి కువైట్ మీద పడటంతో అనుకున్నట్లుగా వెళ్ళలేకపోయింది.

మామ్మగారు ముసలిది కావటంతో ఉంటే వుండనీ చస్తే చావనీ అనుకుని పనిమనిషిని ఆమెకు తోడుగా వుంచి కొడుకు కోడలు తమ పిల్లల్ని తీసుకుని బార్డరు దాటి సౌదీ అరేబియాకు వెళ్ళిపోయి తలదాచుకున్నారు.

ఇపుడు అంత పెద్ద ఇంట్లో ఆ ముసలి మామ్మగారికి అండగా రాజేశ్వరి నిలబడింది. "నీకేం భయం లేదులే మామ్మా. నేనున్నాకదా! ఇరాకీ వాడు ఇటువేపు వస్తే నిన్ను దాచిపెట్టి నేను బయట నిలబడతాను. అంతగా వాడు ఇంట్లోకి చొచ్చుకుని వస్తే నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డుగా వేసి నిన్ను కాపాడతాను" అంటూ మామ్మగారికి ధైర్యం చెప్పింది రాజేశ్వరి. తను ఎంతగా హింసించినా జీతం సరిగ్గా ఇవ్వకపోయినా, తిండి పెట్టకుండా వేధించినా చివరికి తనకు ఆసరాగా నిలిచి ధైర్యం చెపుతున్న రాజేశ్వరి అంటే చాలా గౌరవం కలిగింది ఆ మామ్మకు. వెంటనే చేతులెత్తి దణ్ణం పెట్టింది ఆ మామ్మ తన తప్పులన్నీ క్షమించమని వేడుకుంది. బాధతో పశ్చాత్తాపంతో కన్నీరు ఆమె చెంపలపై ప్రవహించింది.

కన్నతల్లిని బరువుగా, భారంగా ఎంచి, ఇంట్లో వదిలేసి నీ చావు నువు చావు అంటూ నిర్దయగా వెళ్ళిపోయిన కొడుకు కోడలికంటే పనిమనిషి అయిన రాజేశ్వరి ఎంతో ఆప్తురాలిగా అనిపించింది ఆమెకు. అలా యుద్ధం నేర్పిన పాఠాలు ఎన్నో వున్నాయి. అది మనుషుల జీవితాల్లో తెచ్చిన పరివర్తన మరెంతో వుంది.

యుద్ధం గురించి జన జీవితం మీద అది చూపిన ప్రభావం గురించి ఆలోచిస్తూ ఇంటికి చేరుకోవడానికి ఆఖరి సందు మలుపు తిరుగుతోంది ప్రియ. ఇంతలో ఆ ప్రక్కనే వున్న ఇండియన్ స్కూల్‌లో నుండి హడావిడిగా బయటికి వచ్చాడు రవి. "అక్కా నీ దగ్గర మందులేమైనా వున్నాయా? ఎవరో పాపం చిన్నవాడు కువైటీ పిల్లవాడు అనుకుంటా. జ్వరంతో బాధపడుతున్నాడు. ఇంట్లోవున్నవాళ్ళందరూ పారిపోయారంట. వీడు మాత్రం పనిమనిషితోపాటు ఎలాగో మిగిలిపోయాడు. చూస్తుంటే జాలి కలుగుతోంది చెప్పుకొచ్చాడు రవి.

ఇంట్లో కొన్ని అత్యవసర వైద్యానికి మందులు వున్నాయి తమ్ముడూ. మొదట ఆ పిల్లవాడిని చూడనీ అంటూ స్కూల్‌లోపలికి నడిచింది ప్రియ. ఆరేళ్ళ పిల్లవాడు ముద్దుగా వున్నాడు. తల్లిని, తండ్రిని కలవరిస్తున్నాడు. ముట్టుకుంటే వళ్ళు జ్వరంతో కాలిపోతోంది. పిల్లవాడికి తడిబట్టవేసి తుడిచి ఇంట్లోనుండి మందులు తెప్పించి వేసింది ప్రియ. వాడికి జ్వరం తగ్గుముఖం పట్టేంతవరకూ అక్కడే కూర్చుంది. ఆమె భర్త శంకర్ కూడా ఆమెను వెతుక్కుంటూ అక్కడికే వచ్చేసాడు. ఆ సాయంత్రం అక్కడే తలదాచుకున్న వారందరికీ ఉన్న ఆహారపదార్థాలతో వంట చేసి అందరికీ తలాకాస్త వడ్డించారు వాలంటీర్లు.

ఇలాగే ఆరునెలలు గడిచాయి. యుద్ధం కలిగించిన ఎన్నో అనుభవాల్ని మిగిల్చిన జ్ఞాపకాల్ని మనుష్యులు హృదయంలో మూటగట్టుకున్నారు. అమెరికా జోక్యం చేసుకుని సద్దాం దౌష్ట్యాన్ని ఖండించి కువైట్ తరపున యుద్ధాన్ని ప్రకటించింది. దాంతో సద్దాం కాస్త తగ్గాడు. ప్రపంచదేశాలు కూడా సద్దాంకు వ్యతిరేకత చూపించాయి. దాంతో తట్టాబుట్టా సర్దుకుని కువైట్ వదిలి తన దేశమైన ఇరాక్‌కి పారిపోయాడు సద్దాం.

దాదాపు ఆరునెలల తరువాత అందరూ కుదుటపడి కాస్త ఊపిరి పీల్చుకున్నారు.

పారిపోయిన కువైట్ వాళ్ళు ఒక్కొక్కరు మరలా తిరిగి రావడం మొదలు పెట్టారు. పాడైపోయిన ఇళ్ళను, పట్టణాన్ని తిరిగి నిర్మించుకోవడం ప్రారంభించారు.

కువైట్ ప్రభుత్వం దేశంలో వుండిపోయిన పనివాళ్ళందరికీ ఏడునెలల జీతాలను ఇచ్చింది. ఐక్యరాజ్య సమితి సర్వే నిర్వహించి బాధితుల అందరి దగ్గరా వారు కోల్పోయిన ఆస్తులు, కార్లు సంపదను లెక్కకట్టి వారికి తగిన విధంగా డబ్బు ఇచ్చి వారికి కలిగిన నష్టాన్ని తీర్చింది.

కొందరైతే లేనివి కూడా ఉన్నట్లుగా కోల్పోయినట్లుగా అబద్ధాలు చెప్పి లిస్ట్ తయారు చేసి వారి దగ్గర డబ్బును పొందారు.

తిరిగి కువైట్ దేశం కుదుట పడటానికి దాదాపు ఒక సంవత్సరకాలం పట్టింది. కానీ యుద్ధం మిగిల్చిన గాయాల్ని మాత్రం ఇంకా వీళ్ళు తడుముకుంటూనే వున్నారు. వాటిని మరిచిపోవడం ఈ తరానికి అంత సులభం కాదు. ప్రియకు, శంకర్‌కు జీతాలతోపాటు నష్టపరిహారం కూడా కొంత ఇవ్వబడింది. ప్రియకు నెలలు నిండాక కొడుకు పుట్టాడు. సుఖప్రసవం కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కొసమెరుపు ఏమిటంటే ముందు పిల్లికి బిచ్చం పెట్టకుండా పనిమనుషులను సాధించి వేధించిన మామ్మగారు చాలా మారిపోయారు. రాజేశ్వరినే కాదు ప్రతి ఒక్కరినీ ప్రేమతో పలకరించడం, మర్యాదగా నడుచుకోవడం నేర్చుకున్నారు. తనని ఎన్ని బాధలు పెట్టినప్పటికీ, వాటిని క్షమించి తనని విడువక, కనిపెట్టుకుని వుండి కాపాడిన రాజేశ్వరికి కువైట్ మామ్మగారు ఇరవైవేల దినార్లు (దాదాపు యాభై లక్షల రూపాయలు) బహుమతిగా ఇచ్చారు. యుద్ధం మిగిల్చిన కథలు ఎంత చెప్పినా తరగవు. మనుషులకు ఆ జ్ఞాపకాలు జీవితకాలం కూడా చెరగవు.

## ఎడారి ప్రేమ

**ప్రేమ.** *ఎంత మధురమయినది. ఎంత ఉన్నతమైనది.*

*మనిషి జీవితాన్ని శాసించేది, నడిపించేది ప్రేమేకదా? జీవితాల్ని ప్రభావితం చేసేది ఫలభరితం చేసేది ప్రేమేకదా?*

*ప్రేమ... అది ఎంత లోతయినదో, ఎంత ఎత్తు కలిగినదో ఎవరూ నిర్వచించలేకపోయారు. దానికోసం ఎంతమంది ప్రాణాలు కోల్పోయారో? ఎంతమంది భగ్నప్రేమికులుగా మారారో? ఎంతమంది వైరాగ్యాన్ని జీవితంలోకి ఒంపుకున్నారో? ప్రేమలో విఫలమయి ఎన్ని హృదయాలు క్షోభించాయో? ఎందరి కన్నీళ్ళు నేలజారాయో? ఎవ్వరూ చెప్పలేకపోయారు. అనుమతి లేకుండానే అమాంతంగా మనుషుల హృదయాల్లోకి ప్రవేశించి ఆటబొమ్మల్లా చేసి ఆడించేది ప్రేమేకదా? కాలాన్ని మరిపించేది కనికట్టు చేసేది ప్రేమే కదా?*

*ఏ పార్కుల్లో చూసినా బీచ్‌ల వెంబడి నడిచినా కనిపించేది ప్రేమ జంటలే. చుట్టూ వున్న ప్రపంచాన్నే మరిచిపోయి తన ఎదుటవున్న ప్రేయసినీ, ప్రియుడ్నే తమ ప్రపంచంగా భావించి కాలం గడిపే వీళ్ళను చూస్తుంటే ప్రేమకున్న శక్తి ఎంతో అర్థమవుతుంది. ఆశ్చర్యమూ కలుగుతుంది. ప్రపంచంలోని అందాలన్నింటినీ ప్రేయసి ముఖంలో చూసుకుని మురిసిపోయే ప్రియుడు. తన హృదయాన్ని గెలుచుకున్న ప్రియుణ్ణే ప్రపంచాన్ని గెలిచిన ధీరునిలా భావించి అతడి భుజంపైన తలవాల్చి కబుర్లు చెప్పే ప్రేయసి, ఆమె ముసి ముసి నవ్వులూ సిగ్గులతో ఎరబడే బుగ్గలూ. అబ్బ ప్రేమకున్న శక్తి. ప్రేమకున్న ఆకర్షణ, ఎంతని చెప్పగలం. అది చేసే అద్భుతాలను, ఆవిష్కరించే అందాలను ఎన్నెన్ని చూపించగలం. దానికి కులం లేదు మతం లేదు. పేదా గొప్పా తేడాలు లేవు. భాషాభేదాలు తెలియవు. దేశాలు వేరయినా ప్రాంతాలు దూరమయినా దానికి అడ్డేలేదు. ఎవరి హృదయాల్లోకి ఎపుడు దూరుతుందో.. ఏం మాయచేస్తుందో ఎవరికీ తెలియదు. గొప్పవాళ్ళు సైతం దాని ధాటికి తలఒగ్గి నమస్కారం చేసారు. బలవంతులు సైతం దానికి దాసోహమై ప్రణమిల్లారు. సమస్తాన్నీ ప్రేమకోసం అర్పించుకున్నవాళ్ళు సర్వస్వాన్ని అందుకోసం త్యాగం చేసినవాళ్ళు కోకొల్లలు.*

*ఎన్ని హృదయాలు ప్రేమాగ్ని జ్వాలల్లో పడి కాలి మసి అయిపొయ్యాయో? ఎన్ని జీవితాలు ప్రేమకోసం తమ సమాధుల్ని నిర్మించుకున్నాయో? నాణానికి మరోవైపు బొరుసు కూడా వున్నట్లు ప్రేమనే ఆకర్షణలో పడి ఎంతమంది జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారో మరెంతమంది కాలాన్ని వ్యర్థం చేసుకుంటున్నారో*

*ప్రతి మనిషీ తన జీవితంలో ప్రేమకు సరైన నిర్వచనం చెప్పడం అసాధ్యం.*

వాలెంటైన్స్‌డే స్పెషల్. ప్రేమగురించి రాసిన వ్యాసాన్ని చదువుతున్న మృదుల ఒక్కసారిగా నిట్టూర్చింది. నిజమేకదా! ప్రేమ ప్రతిమనిషి జీవితంలోనూ ఎంతో కొంత ప్రభావాన్ని చూపిస్తుంది. జీవితంలోని మలుపులకు కారణమవుతుంది. కొందరి హృదయాల్లో మధురానుభూతుల్ని నింపితే మరికొందరికి మానని గాయాల్ని కలగజేస్తుంది. జీవితమంతా వాటిని తలచుకుని తడుముకుని కన్నీళ్ళు కార్చమని, అందులోనే ఆనందించమని శాసిస్తుంది.

ప్రేమలో విఫలమైన హృదయం రంపంతో కోసినట్లుగా విలవిలలాడిపోతుంది. ఆ బాధ వర్ణనాతీతం.

ఒకరు నిజంగా నిస్వార్థంగా ప్రేమిస్తే మరొకరు స్వార్థంతోను మోసపూరితంగానూ ప్రేమిస్తున్నట్లుగా నటిస్తారు. అపుడే వస్తుంది తంటా. వీరు హృదయానికి మానని గాయం చేస్తారు. హృదయాల్ని పరిశోధించగల పరికరం ఏదైనా వుంటే ఎంత బాగుండు. కనీసం మోసపోకుండా జీవితాల్ని కాపాడుకోగలమేమో.

ఎడారి దేశమైన కువైట్‌లో తాను గడిపిన రోజుల్ని ఒకసారి గుర్తుచేసుకుంది మృదుల. రోజులు కాదు. తన జీవితకాలంలో సగంపైగా ఎడారి దేశంలో గడిపిన భారమైన సంవత్సరాలు.

"హాయ్, మృదులా ఇలారా ఈ టేబుల్ దగ్గర కూర్చుందాం" ప్రపోజ్ చేసింది జేనీ.

"సరే పద" అంటూ ఫుడ్ వున్న ట్రేని చేత్తో పట్టుకుని జేనీ వెంట నడిచింది మృదుల. అప్పటికే టైము రెండు గంటలు దాటిపోవడంతో కెఫిటేరియాలో స్టాఫ్ పలచగా వున్నారు.

"ఏంటీ నీకు కూడా లేటయ్యిందే ఈ రోజు?" అడిగింది జేనీ.

"అవును కొద్దిగా పని ఎక్కువయింది" చెప్పింది మృదుల.

"శ్యామ్‌తో మాట్లాడుతుంటే టైం తెలియలేదేమో మరి" నవ్వింది జేనీ.

"అబ్బే అదేం లేదు. క్రొత్తగా మన డిపార్టుమెంటుకి వచ్చాడు కదా! ఏవో డౌట్సు వుంటే క్లియర్ చేస్తున్నా అంతే" చెప్పింది మృదుల.

"మనిషేంటి ఎప్పుడూ దిగులుగా కనిపిస్తాడు" ఆరాగా అడిగింది జేనీ.

"అదుగో లంచ్‌కి వస్తున్నాడు. నువ్వే అన్ని విషయాలు అడిగి కనుక్కో" చెప్పింది మృదుల.

"తప్పకుండా అడుగుతాను చూడు" అంది తలెగరేస్తూ జేనీ.

ఇంతలో ఫుడ్ ట్రే చేత పట్టుకుని అవతలి టేబుల్‌వైపు పోబోయాడు శ్యామ్.

"హలో శ్యామ్ ఎక్కడికెళుతున్నావ్? మాతోపాటు కూర్చుని తినవోయ్" అంది జేనీ చనువుగా.

మొహమాటపడుతూ వచ్చి మృదుల ఎదురుగా వున్న కుర్చీలో కుర్చున్నాడు శ్యామ్.

"ఏంటీ ఎపుడూ మూడీగా ఏదో పోగొట్టుకుంటున్నట్లుగా వుంటావు. ఏంటి సంగతి? సమస్య ఏంటో మాతో పంచుకుంటే సలహాలు ఇస్తాం కదా? అడిగేసింది జేనీ.

"అబ్బే అదేం లేదండీ" నసిగాడు శ్యామ్

"చెప్పవోయ్. మనసులోది స్నేహితులతో పంచుకుంటే హృదయం తేలికవుతుంది" బలవంతం చేసింది జేనీ.

"ఏం లేదండీ. ఓ నెలరోజులు ఇంటికెళ్ళాలి. డిపార్టుమెంటు మారాను కదా శెలవు దొరుకుతుందో లేదో అని ఆలోచిస్తున్నాను.

"ఓహో అంత అర్జంటుగా సెలవులకు వెళ్ళాల్సిన అవసరం ఏమిటో? ఇంకో మూడునెలల తర్వాత వెళుదువులే " అంది జేనీ.

"అర్జంటుగానే వెళ్ళాలి. కనీసం పదిరోజులయినా - పట్టుదలగా చెప్పాడు శ్యామ్.

"అయితే ఏంటో సంగతి చెప్పు తరువాత సెలవు సంగతి చూద్దాం" చెప్పింది జేనీ. ఎందుకంటే శ్యామ్ సెలవులకి వెళితే అతడి పనంతా మృదుల, జేనీ పంచుకుని పనిచేయాలి.

"ఎలా చెప్పాలో అర్థంకావడంలేదండీ. నా భార్యకు డెలవరీ అయింది. విడాకులు ఇవ్వాలి అనుకుంటున్నాను" చెప్పాడు.

"డెలవరీ అయితే విడాకులిస్తావా? విడ్డూరంగా వుందే" వింతగా చూసింది మృదుల.

"అవును. నేను తనని పెళ్ళి చేసుకున్నానే కానీ ఇంతవరకూ ముట్టుకోలేదు. కానీ ఆమె గర్భవతియై బిడ్డను కూడా కనేసింది. అందుకే" అన్నాడు శ్యామ్ బాధగా.

"వ్వాట్" గట్టిగా అరిచింది జేనీ. "నువ్వు తగలక పోయినా ఆమె గర్భవతి అయిందా! హౌ పాసిబుల్?" అంది.

"వైనాట్. ఆమెకు పెళ్ళికి ముందే ఆమె బావతో ఎఫైర్ వుంది. అలా అయి వుండవచ్చు" చెప్పాడు శ్యామ్.

"మైగాడ్ నిజమా. అయితే వెంటనే వెళ్ళి డైవోర్స్ ఇవ్వు" కోపంగా చెప్పింది జేనీ.

"మరి అక్కడి వాళ్ళందరికీ ఈ విషయం తెలియదా?" అడిగింది మృదుల.

"మా తల్లిదండ్రులకే తెలుసు. ఎందుకంటే నాకిష్టం లేకపోయినా తన స్నేహితుడి కూతురని వాళ్ళకి మాట ఇచ్చేసి పెళ్ళి జరిపించాడు మా నాన్న. మా నాన్న మాట కోసం నేను చేసుకోవాల్సి వచ్చింది. అలాగే వాళ్ళ నాన్న ఇచ్చిన మాటకోసం తను పెళ్ళి చేసుకుంది. అలా నాటకీయంగా మా పెళ్ళి జరిగిపోయింది. పెళ్ళి జరిగి ఇప్పటికి ఎనిమిది నెలలు కూడా కాలేదు. పెళ్ళి అయ్యాక నేను తనని ముట్టుకోలేదు. నా ఊహ ప్రకారం పెళ్ళయ్యేటప్పటికే తను మూడోనెల గర్భవతి. ఇపుడు ఆరునెలలకే డెలవరీ అయిందని అందరినీ నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారనుకుంటా" చెప్పాడు శ్యామ్.

"మరి ప్రేమించిన బావనే పెళ్ళి చేసుకోవచ్చుకదా. నిన్నెందుకు మోసం చేయడం?" ప్రశ్నించింది జేనీ.

"అతడు పెద్దత్రాగుబోతు. ఇంట్లో వాళ్ళకి అతడంటే ఇష్టంలేక అప్పటికప్పుడు మా నాన్నతో మాట్లాడేసి తెలివిగా ముహూర్తాలు పెట్టేసారు. "

"హూ. ఇంత మోసమా? నువు వెంటనే బయలుదేరి వెళ్ళి వాళ్ళ కుట్రలన్నీ బయటపెట్టి బిడ్డ నీది కాదని చెప్పి విడాకులకు అప్లై చేసిరా. నువు వచ్చేంతవరకు నీ పని మేమిద్దరం చేస్తాం" చెప్పింది జేనీ.

పదిహేను రోజులు సెలవుపెట్టి ఇంటికి వెళ్ళి వచ్చాడు శ్యామ్.

తిరిగివచ్చిన వెంటనే ఏమయింది అంతా ఓకేనా అని ఆదుర్దాగా ప్రశ్నించారు జేనీ, మృదుల.

"హు. సమాజం కుటుంబం గౌరవం జరిగిందేదో జరిగిపోయింది విడాకులు వద్దు అంటూ అందరూ కలిసి నా గొంతు నొక్కడానికి ప్రయత్నిస్తున్నారు.

మా అమ్మా నాన్నలు కూడా వాళ్ళతో కలిసిపోయి, తప్పు జరిగిపోయిందిరా క్షమించు. ఒక్క ఆడబిడ్డ. వాళ్ళ ఆస్తిపాస్తులన్నీ నీకే కదా! విడాకులిస్తే మళ్ళీ నీకు పిల్లనెవరు ఇస్తారు అంటూ నా తలకాయ తినేసారు. తల్లిదండ్రులు కూడా ఆస్తికి ఆశపడి అటువైపే మాట్లాడేసరికి నేను ఏం చెయ్యాలో తెలియక తిరిగి వచ్చేసాను." దిగులుగా చెప్పాడు శ్యామ్.

"సరే నువ్వు బాధపడకు. మేమున్నాం కదా! ఇక్కడే ఎవరినైనా చేసుకుని సెటిల్ అయిపో. ఇండియాకు వెళ్ళకు. అందరి తిక్కా కుదురుతుంది" సలహా ఇచ్చింది జేనీ.

"ఎవరో ఎందుకు మన మృదుల వుంది కదా. భర్త చనిపోయాడని కువైట్‌కి వచ్చింది. వయసులో ఒంటరిగా వుంది. మనమందరం కలిసి శ్యామ్‌కు మృదులకు పెళ్ళి చేస్తే సరి" ఉత్సాహంగా చెప్పింది అక్కడే వున్న డోనా.

వింటున్న మృదుల ఉలిక్కిపడింది. శ్యామ్ కంగారు పడ్డాడు.

"అంతే.. అంతే.. ఒకరికొకరు తోడు మనం మృదులకు సరైన వాడ్ని వెదకాలి అనుకుంటున్నాం కదా. శ్యామ్‌తో పెళ్ళి జరిపించేస్తే సరి" (కువైట్‌లో ఇలాంటి పెళ్ళిళ్ళే అన్నీ) వత్తాసు పలికింది జేనీ.

శ్యామ్ పరిస్థితి చూసి జాలిపడింది మృదుల. పాపం పెళ్ళి అయిందేకాని భార్యని ముట్టుకోలేదు. తల్లిదండ్రుల బలవంతం మీద ఇష్టంలేకపోయినా పెళ్ళి చేసుకున్నాడు. పూర్ ఫెలో అనుకుంది మృదుల.

అలా ఇద్దరి మధ్యా స్నేహం అనురాగంగా రూపుదిద్దుకుంది. కువైట్‌లోనే అందరి సమక్షంలో పెళ్ళికూడా చేసుకున్నారు.

స్వతహాగా అందరినీ ప్రేమించే స్వభావం గల మృదుల శ్యామ్‌కు కూడా ఎంతో ప్రేమను పంచింది. శ్యామ్‌కూడా మృదుల తోడిదే లోకం అన్నట్లుగా కాలం గడిపాడు. సాయంత్రం పూట అరేబియా సముద్రపు బీచ్ వీళ్ళ కబుర్లతో నిండిపోయేది. రెస్టారెంట్లన్నీ వీళ్ళ రాకతో సందడి నింపుకునేవి. ప్రేమకే అర్థం చెప్పేటంత గాఢంగా ఇద్దరూ జీవితాన్నీ, సుఖాన్నీ ఆస్వాదించడంలో మునిగిపోయారు. వీళ్ళ అన్యోన్యత చూసి కొందరు ఈర్ష్య పడేవాళ్ళు. జేనీ, డోనా మాత్రం ఒక మంచి పని చేసాం అని చాలా సంతోషించారు.

అలా నాలుగేళ్ళు గడిచాయి. ఈ నాలుగేళ్ళలో శ్యామ్ కానీ మృదుల కానీ ఇండియాకు వెళ్ళలేదు. కువైట్‌లోనే ఆనందంగా కాలం గడిపేయసాగారు.

ఈ లోపల ఆ నోటా ఈ నోటా వీరిద్దరి విషయం ఇంటివద్ద శ్యామ్ తల్లిదండ్రులకి తెలిసింది.

ఆస్తికోసం కొడుకు సంతోషాన్ని కాలరాచిన వాళ్ళు ఇపుడు కొడుకు కువైట్‌లోనే వుంటే ఇక తమకు దక్కడని, కోడలి ఆస్తిరాదని భావించి కంగారుపడిపోయారు.

ఒకరోజు శ్యామ్ తల్లికి బాలేదని సీరియస్ కండిషన్‌తో హాస్పిటల్లో వుందని తండ్రి ఫోను చేసాడు. తల్లి కొడుకునే కలవరిస్తోందని, చూడకపోతే బ్రతకదని తొందరగా బయలుదేరి రమ్మని చెప్పి భోరున ఏడ్చాడు. తల్లి ప్రాణం నిలబెట్టమని చెప్పి ప్రాధేయపడ్డాడు. ఎంతైనా జన్మనిచ్చిన తల్లిదండ్రులు. శ్యామ్ కూడా తల్లి ఆరోగ్యం గురించి వర్రీ అయి వెంటనే టిక్కెట్టు కొని పదిరోజులు శెలవు పెట్టి ఇండియాకు బయలుదేరి వెళ్ళాడు.

పదిరోజులే కదా, తొందరగా వచ్చేస్తాడు అని మృదుల ధీమాగా వుంది. కానీ.. పదిరోజుల శెలవును నెలరోజులకు పొడిగించాడు శ్యామ్. తల్లి కండిషను అలాగే వుందని చెప్పాడు.

నెలరోజులు కూడా అలాగే గడిచిపోయాయి. ఇంకో నెలరోజులు వుండాలి తప్పదు అంటూ మరో నెలరోజులు శెలవు తీసుకున్నాడు శ్యామ్. పదిరోజులు అతడు బానే వున్నాడని ఆ తరువాతే అతడి ధోరణిలో మాట తీరులో ఏదో మార్పు వచ్చిందని గ్రహించింది మృదుల. ఈ మధ్య అతడు ఫోను కూడా సరిగ్గా చేయడం లేదు.

ఒకరోజు ఫోను చేస్తే అదే అడిగేసింది.

"అబ్బే అదేం లేదు. ఇక్కడ అమ్మకు బాలేదు కదా. హాస్పిటల్ చుట్టూ తిరగడంతో బిజీగా వున్నాను అంతే" అని చెప్పాడు శ్యామ్.

రెండు నెలలు కూడా గడిచాయి. జాబ్‌కి రిజిగ్నేషన్ లెటర్ అక్కడినుండే పంపించాడు శ్యామ్. ఇక కువైట్‌కి రావడం లేదని బాస్‌కి ఫోను చేసి చెప్పాడు. శ్యామ్ ప్రవర్తనకి అందరూ ఆశ్చర్యపోయారు.

ఈ విషయం ఆఫీసులో బాస్ చెప్పగా విన్న మృదుల షాక్ తింది. వెంటనే శ్యామ్‌కు ఫోను చేసింది. అతడి నంబరు స్విచ్చాఫ్‌లో వుంది. ఎన్నో విధాలుగా అతడితో మాట్లాడాలని ప్రయత్నించింది కానీ కుదరలేదు.

ఎక్కడో రాసిపెట్టి వున్న శ్యామ్ నాన్నగారి నంబరు వెతికి దానికి ఫోను చేసింది. ఆయన ఎత్తారు. "మామయ్యగారూ దయచేసి శ్యామ్‌ను ఒకసారి పిలవండి మాట్లాడాలి" అని ప్రాధేయపడింది మృదుల.

"అసలు ఎవరు నువ్వు? ఎందుకు శ్యామ్ కుటుంబ జీవితాన్ని పాడుచేయాలనుకుంటున్నావ్? శ్యామ్‌కు పెళ్ళయిందని, భార్యాబిడ్డా వున్నారని నీకు తెలియదా? నోరు మూసుకుని నీ దారిన నువు వెళ్ళు. నా కొడుకు జోలికి వస్తే మర్యాద వుండదు.

అయినా ఇక్కడ అగ్నిసాక్షిగా అందరిలో పెళ్ళిచేసుకున్న పెళ్ళాన్ని విడిచి, అంత ఆస్తిని వదిలి నిన్ను వుంచుకుంటాడని, నీతో వుంటాడని ఎలా అనుకున్నావ్? అక్కడ కువైట్‌లో నీ హొయలన్నీ చూపించి నా కొడుకును బుట్టలో వేసుకుని ఇక్కడ తల్లిదండ్రులకి, భార్యాబిడ్డకి దూరం చేయాలని ప్రయత్నిస్తావా? నీ బుద్ధి గడ్డితిందా? ఏం బ్రతుకు బ్రతుకుతున్నావు. సాటి ఆడదానికి అన్యాయం చేసి దాని భర్తని నీతో వుంచుకోవాలనుకునే నువ్వూ ఒక ఆడదానివేనా?" ఇష్టం వచ్చినట్లు తిట్టాడు శ్యామ్ నాన్నగారు.

మృదుల మ్రాన్పడిపోయింది. నిశ్చేష్టురాలై ఇవతల నిలబడిపోయింది. ఇన్నిమాటలు వినవలసి వుంటుందని ఆమె ఊహించలేదు. కన్నీరు చెంపలపై ప్రవహిస్తోంది. అయినా కూడా ఆశ చావక "మామయ్యా ఒక్కసారి శ్యామ్‌తో మాట్లాడనివ్వండి ప్లీజ్" అని అర్థించింది. ఎంత జరిగినా స్త్రీ హృదయం పురుషుని కోసమే పరితపిస్తుంది. అతడికోసమే ఆరాటపడుతుంది.

"శ్యామ్ ఇక నీతో మాట్లాడడు. వాడికి కూడా నీ సంగతి అర్థం అయింది. కట్టుకున్న పెళ్ళాం శాశ్వతం కానీ దారిన పోయే నీలాంటి బజారు స్త్రీలు అశాశ్వతమని వాడు కూడా తెలుసుకున్నాడు. పెళ్ళాం బిడ్డతో వాడు సంతోషంగా వున్నాడు. నువు మరలా ఇంకొకసారి వాడి జోలికి రావద్దు." వార్నింగ్ ఇచ్చాడు ఆయన.

తుపాకి తూటాల్లా వెలువడుతున్న ఆ మాటలు వినలేక, నిందలు భరించలేక అక్కడే కూలబడిపోయింది మృదుల. తరువాత ఆమె మానసికంగా చాలా కృంగిపోయింది. శ్యామ్ చేసిన మోసం, నమ్మక ద్రోహం ఆమెకు జీవితం మీదే విరక్తి కలిగేలా చేసాయి. అతడిమీద పెంచుకున్న ప్రేమను త్రుంచుకోలేక నరకాన్ని అనుభవించింది. అతడ్ని మరిచిపోవడం అసాధ్యం అయింది. జీవితమంతా తోడుంటాడనుకుంటే వదిలేసి వెళ్ళిపోయాడు. ప్రేమించాడు అనుకుంటే ఇదంతా జస్ట్ కాలక్షేపం అని నిరూపించాడు. కనీసం శారీరక సంబంధం కూడా అతడ్ని పట్టి వుంచలేకపోయింది. గడిపిన కాలమన్నా కాస్త తడిని అతడి హృదయంలో నింపలేకపోయింది. చేసిన వాగ్దానాలు మరిచిపోయాడు. పెంచిన ఆశల్ని నిరంకుశంగా త్రుంచేసాడు. నమ్మిన ఆడదాన్ని నట్టేట్లో ముంచేసాడు. ఎడారి దేశంలో పంచుకునే ప్రేమ ఇంత అల్పమయినదా దానికి విలువ లేదా? శారీరక సుఖం, డబ్బు, కాలక్షేపమే దాని ధ్యేయాలా? పంచుకున్న ప్రేమ, అనురాగం, ఆప్యాయతలన్నీ ఎడారి పాలేనా? ఇలాంటి స్త్రీలు ఇక్కడ గల్ఫ్‌లో ఎందరో? అందరి పరిస్థితీ ఇదే చివరికి మిగిలేది ఒంటరితనమే, తీరని దుఃఖమే, హృదయం నిండిన చేదు జ్ఞాపకాలే. తడుముకుంటే గాయాల బాధలే.

అబ్బ. ఎలా బ్రతకాలి? శ్యామ్‌లేని జీవితాన్ని ఊహించలేదే? జీవించాలని కోరుకోలేదే? మరెలా? ఇంత మోసమా? ఇంత నమ్మక ద్రోహమా? తల్లడిల్లిపోయింది మృదుల.

జేనీ, డోనా ఆమెను ఓదార్చకపోతే, తోడుగా వుండి ధైర్యం చెప్పకపోతే ఆమె బ్రతకడం కష్టమే అయ్యేది.

జేనీ అయితే చాలా ఆవేశపడింది. ఉండు నేను ఇండియా వెళ్ళి వాడు అంతు చూస్తాను. దుష్టుడు, దుర్మార్గుడు ఒక ఆడదాని జీవితంతో, హృదయంతో ఇంతగా ఆడుకుంటాడా? మంచివాడని నమ్మితే ఇంతగా నమ్మక ద్రోహం చేస్తాడా? వెధవ ఆస్తికోసం ఇంత కక్కుర్తి పడతాడా అంటూ శ్యామ్‌ని బాగా తిట్టింది.

ఎన్ని తిట్టి ఏం లాభం?

కోల్పోయిన కాలం తిరిగి రాదుగా. మిగిలిన ఒంటరితనం ఓదార్చదుగా. శరీరానికి గాయాలయితే కాలంతోపాటు మానిపోతాయిగానీ హృదయానికి అయిన గాయాలు జీవితాంతం వెంటాడి వేధించి బాధిస్తాయి కదా? కన్నీళ్ళతో కలవరపెడతాయి కదా?

"ఏయ్ ఏడుస్తున్నావా? ఊరుకో మృదులా. నీ కన్నీళ్ళే శాపాలుగా మారి వాడిని నాశనం చేస్తాయి బాధపడకు. ధైర్యంగా వుండు. నీకు మేమంతా లేమా?" హృదయానికి హత్తుకుంది డోనా.

"వద్దు అతడు ఎక్కడవున్నా సంతోషంగా, సుఖంగా వుండనీ. అతడు బాధపడితే నేను చూడలేను" డోనా మాటలకి కలవరపడుతూ చెప్పింది మృదుల.

"ఇదీ ప్రేమంటే. ఇంత జరిగినా ప్రేమించినందుకు, నాలుగేళ్ళకాలం గడిపినందుకు వాడికి మంచే జరగాలని మృదుల కోరుకుంటోంది. ఇదీ స్త్రీ హృదయం. ఆమె ఔన్నత్యం. స్త్రీయే ప్రేమకు మరో రూపం" చెప్పింది జేనీ.

*చెంచులక్ష్మి కథ*

**"చెట్టులెక్కగలవా ఓ నరహరి పుట్టలెక్కగలవా..**

**చెట్టులెక్కి ఆ చిటారు కొమ్మల చిగురు కోయగలవా. ఓ నరహరి చిగురు కోయగలవా?**

**చెట్టు లెక్కగలనే ఓ చెంచిత పుట్టలెక్కగలనే...**

**చెట్టులెక్కి ఆ చిటారు కొమ్మల చిగురు కోయగలనే.**

**ఓ చెంచిత చిగురు కోయగలనే"**

మోకాల్లోతు బురదలో నిలబడి వరిపైరును నాటుతూ కమ్మని కంఠంతో రాగాలు తీస్తోంది చెంచులక్ష్మి.

ఆమె పాట ఆ పరిసరాల్లో ప్రతిధ్వనిస్తోంది. ఆ పాటలోని మాధుర్యానికి ప్రకృతి కూడా పరవశిస్తోంది. తోటి కూలీలు కూడా తమ స్వరాల్ని జతకలుపుతూ వరిపైరును నాటుతున్నారు. అలసట లేకుండా పనిచేయడానికి వారికి పాటే ఒక ఔషధంగా పనిచేస్తోంది.

కట్టుకున్న బులుగు చీరను మోకాళ్ళవరకు మడిచి కచ్చాపోసి వెనుక దోపింది. పైట చెంగును నడుం చుట్టూ తిప్పి ముందుకు తీసికొచ్చి బొడ్డులో దోపింది. పొడవైన వెంట్రుకల్ని జడ అల్లి ముడిలా బిగించి కొప్పు చుట్టుకుంది. చేతులకు వేసుకున్న ఎర్రటి మట్టి గాజులు నాట్లు వేసే కొద్దీ లయబద్ధంగా కదులుతూ ఆమె పాటకి తాళం వేస్తుంటే బురద మడిలోని ఆమె రూపం చూడముచ్చటగా వుంది. చెమటతో తడిసిన ఆమె పచ్చ రవికె ఒంటిపై బిగుసుకుని ఆమె ఒంపుసొంపుల్ని బహిర్గతం చేస్తుంటే ఆ దారినపోయే పిలగాళ్ళు ఆమె పైనుండి చూపు తిప్పుకోలేకపోతున్నారు. పరువానికొచ్చిన చెంచులక్ష్మి నిండుగా విరబూసిన పూలకొమ్మలా కంటికి కనిపిస్తుంటే

''అబ్బ దీన్ని ఎవడు చేసుకుంటాడో గానీ అదృష్టం అంటే వాడిదేరా! పిల్ల రంభలాగా పిటపిటలాడుతోందిరా'' అనుకుంటూ వయసొచ్చిన పిల్లకాయలు సొల్లుకార్చుకునేవారు.

అత్త వరసయ్యే ఆడోళ్ళు ''ఏమే లచ్చిమి ఎవడో ఒకడ్ని చూసుకుని తొందరగా పెళ్ళి చేసుకోయే. లేకపోతే పాపం మగపిలకాయలు నిన్ను చూసి నిద్రపోలేరే'' అని పరాచికాలు ఆడేవాళ్ళు. సుబ్బమ్మత్త అయితే చెంచులక్ష్మిని చూసినపుడల్లా తలచుట్టూ చేతులు తిప్పి మెటికలు విరిచి ''నీకు నా దిష్టే తగిలేటట్లుందే కోడలా. నిన్ను చూస్తుంటే దసరాబుల్లోడులో హీరోయిను వాణిశ్రీనే గుర్తొస్తోందే నా కొడుకు శీనుగాడు నీకంటే రెండేళ్ళు చిన్నోడు కాబట్టి నిన్ను వదిలేసానుగానీ లేకపోతే ఈ పాటికి వాడి చేత నీ మెళ్ళో తాళి గట్టించేసి వుందునే'' అని ఎగతాళి మాటలు మాట్లాడేది.

''అంత కష్టం నీకెందుకులే వదినా! దానికి మేనత్త కొడుకు రడీగా వున్నాడు కదా? '' అనేది ఆ ప్రక్కనే వున్న వెంకటమ్మ.

''కొడుకు నరేష్ మంచోడే కానీ తల్లి నరసమ్మ గయ్యాళిది కదా? కట్నం లేకుండా చెంచులక్ష్మిని చేసుకుంటుందా?'' సందేహం వెలిబుచ్చేది సుబ్బమ్మ.

ఎవరు ఎన్ని మాట్లాడుకున్నా పట్టించుకునేది కాదుగానీ బావ నరేష్ మాట చెవిన బడగానే కళ్ళలో మెరుపులు మెరిసేవి. బుగ్గలు ఎర్రబడిపోయేవి చెంచులక్ష్మికి.

''ఏంటే పిల్లా నరేష్ మాట ఎత్తితేనే సిగ్గుపడిపోతున్నావు. ఏంటి సంగతి? నరేష్‌ను పెళ్ళి చేసుకుంటావా ఏంది?'' ఆరా తీసింది వెంకటమ్మ.

బావ నరేష్ రూపాన్ని గుర్తుతెచ్చుకుని మరలా సిగ్గుపడుతూ ''అబ్బే అదేం లేదత్తా. మా నాయన ఎక్కడ చేస్తే అక్కడే చేసుకుంటాను'' అంది చెంచులక్ష్మి తడబడిపోతూ.

అప్పటికే టెన్త్‌క్లాస్ పరీక్షలు మూడుసార్లు రాసి, లెక్కల్లో పాసవలేక చదివింది ఇక చాల్లే అనుకుని సేద్యపు పనులు చూసుకుంటున్నాడు నరేష్.

వయసుకు వచ్చినవాడుకదా చెంచులక్ష్మిని చూసినప్పుడల్లా ''అబ్బ ఎంత బాగుందో ఇది. దీనెమ్మ ఏమి అందం, ఏమి స్వరం. దీన్ని చూస్తుంటే మనసు నిండి పోతాందే! దీని పాట వింటుంటే ప్రాణం గాల్లో తేలిపోతాంది. చేసుకుంటే దీన్నే చేసుకోవాలి'' అనుకునేవాడు. నరేష్.

కానీ వాళ్ళమ్మ నరసమ్మకి మాత్రం ఆడబిడ్డ కూతుర్ని చేసుకోవడానికి ఎంతమాత్రం ఇష్టం వుండేదికాదు. దానికి కారణం వాళ్ళ పేదరికం. కొడుక్కి కనీసం నాలుగు లక్షల కట్నమిచ్చే పిల్లను చూసి పెళ్ళి చేయాలని, ఆ కట్నపు డబ్బుతో తన కూతురి పెళ్ళి ఘనంగా చేయాలని ఆమె ఆశపడుతుండేది. అందుకే కట్నం దండిగా ఇచ్చే సంబంధాల్ని చూడటం మొదలు పెట్టిందామె. కానీ నరేష్ అందుకు ఒప్పుకోలేదు. పెళ్ళంటూ చేసుకుంటే చెంచులక్ష్మినే చేసుకుంటానని లేకపోతే పెళ్ళే చేసుకోనని ఖచ్చితంగా తల్లికి చెప్పేసాడు. కానీ నరేష్ వాళ్ళ అమ్మ మాత్రం చెంచులక్ష్మిని ఏ మాత్రం ఇష్టపడలేదు. ''వద్దురా నా కొడకా. ఆ పిల్లను చేసుకుంటే కానీ కట్నం రాదురా, కనీసం చెవుల్లోకి కమ్మలు కూడా పెట్టలేని పేదవాళ్ళురా వాళ్ళు. నా మాట విను. నేను మంచి సంబంధం చూస్తాను. నాలుగులక్షలు కట్నం ఇచ్చి పిల్లనిచ్చేవాళ్ళు నీకోసం క్యూలో నిలబడతారు. ఎందుకొచ్చిన దరిద్రం ఈ చెంచులక్ష్మి? అందులో నీకొచ్చే కట్నం డబ్బుతో నీ చెల్లెలి పెళ్ళి చేయాలని అనుకుంటున్నాం. మరి నువ్వు కట్నం తీసుకోకపోతే దానికి పెళ్ళి చెయ్యలేం. అంతగా ఈ పిల్లే కావాలి అనుకుంటే కనీసం రెండు లక్షలన్నా కట్నం ఇమ్మని వాళ్ళ నాయనను అడుగు'' అంటూ ఒకటే పోరు పెట్టింది.

రెండు లక్షలు కాదుకదా రెండువేలు కూడా ఇచ్చుకోలేని పేదవాళ్ళు వాళ్ళు అని నరేష్‌కి బాగా తెలుసు. అందుకే "నేను ఏదో ఒక ఉద్యోగమో, వ్యాపారమో చేసి డబ్బు సంపాదిస్తానులే అమ్మా! లేకపోతే కొయేటికి పోయి రెండేళ్ళు అక్కడ వుండి బాగా డబ్బు సంపాదించుకుని వస్తాలే" అంటూ ఎన్నో విధాలుగా ఆమెకు నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు.

ఏదో విధంగా కొడుకు డబ్బు సంపాదించి అమ్మ చేతుల్లో పోస్తాననడంతో ఆమె ఆఖరికి కొయేటికి వెళ్ళమని షరతులు పెట్టి అతి కష్టంతో ఆ పెళ్ళికి అంగీకరించింది.

నరేష్‌తో పాటు టెన్త్ క్లాస్ వరకు చదువుకున్న స్నేహితుడు సుధాకర్. అతడు ఈ మధ్యనే కువైట్‌కి వెళ్ళాడు. టెన్త్‌క్లాస్ ఫెయిల్ అయి నాలుగుసార్లు కట్టి అప్పటికీ పాస్ కాలేని అబ్బాయిలందరూ డ్రైవింగ్ నేర్చుకుని కువైట్‌కి వెళ్ళాలని ఆశపడటం కడప జిల్లాలోని గ్రామాల్లో సాధారణమైన విషయమే. ఆ సుధాకర్ కువైట్‌కి వెళ్ళాక అపుడపుడూ నరేష్‌కి ఫోను చేసి మాట్లాడుతుంటాడు. కువైట్‌లో జీవితం చాలా బాగుందని తాను సంతోషంగా సుఖంగా వున్నానని, నరేష్ కూడా కువైట్‌కి వస్తే బాగా డబ్బు సంపాదించవచ్చని రావాలనుకుంటే వీసా పంపిస్తానన్నాడు. కానీ నరేష్ చెంచులక్ష్మి ప్రేమలో పడిపోయి ప్రపంచాన్నే మర్చిపోయాడు. ఎలాగైనా తల్లిని ఒప్పించి చెంచులక్ష్మిని పెళ్ళి చేసుకుంటే చాలనుకున్నాడు. కానీ తరువాత వచ్చే కష్టాల్ని ఊహించలేకపోయాడు నరేష్.

తల్లి సణుగుతున్నా గొణుగుతున్నా పట్టించుకోకుండా చెంచులక్ష్మి నాయనతో మాట్లాడి పెళ్ళికి ముహూర్తం పెట్టించాడు నరేష్. వాళ్ళుకూడా ఇంతకంటే మంచి అల్లుడు దొరకడని భావించి పెళ్ళికి తొందరపడ్డారు.

సింపుల్‌గా పెళ్ళి జరిగిపోయింది. నరేష్ మాత్రం దేవకన్యలా ఆమె కళ్ళెదుట తిరుగుతుంటే చూసి మురిసిపోయేవాడు. ఆమె పాట వింటూ పరవశించిపోయేవాడు. కానీ నరేష్ తల్లి మాత్రం చెంచులక్ష్మిని చూస్తూ స్థిమితంగా వుండలేకపోతోంది. కోడలిని చూస్తుంటే ఆమెకు కోల్పోయిన కట్నమే గుర్తొస్తోంది. కోడలు తెచ్చే డబ్బుతో ఘనంగా కట్నం ఇచ్చి మంచివాడిని చూసి కూతురి పెళ్ళి చేయాలనుకుంటే దరిద్రదేవత ఇంట్లోకి నడిచివచ్చిందని అందరికీ చెపుతూ ఈసడించుకునేది ఆమె. అత్త సూటిపోటి మాటలు చెంచులక్ష్మికి ఎంతో బాధను కలిగిస్తున్నప్పటికీ నరేష్‌ను చూసి బాధంతా దిగమింగుకునేది. నచ్చిన పెళ్ళాం దొరికేటప్పటికి అతడి ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. కొడుకు ఆనందం కూడా తల్లి నరసమ్మకి కోపాన్ని తెప్పించింది.

కొడుకూ, కోడలి అన్యోన్యతను చూసి ఆమె హృదయం రగిలిపోయింది. "పెళ్ళాం వచ్చాక తల్లి కనబడుతుందా? పెళ్ళాం బెల్లమవుతుంది, తల్లి అల్లమవుతుందమ్మా. ఏం చేయను? అంతా నా ఖర్మ" అంటూ ఇరుగమ్మకి పొరుగమ్మకి చెప్పి నోటి దురద తీర్చుకునేది. అలా నాలుగునెలలు గడిచాయి.

రోజూ తల్లి ఈసడింపు మాటలు వింటున్న నరేష్ ఒకరోజు భరించలేక "అమ్మా ఎందుకు అలా నోరు పారేసుకుంటావు? ఏమయిందిప్పుడు?" అని అడిగాడు.

అంతే.. గయ్యాళిలా అంతెత్తున లేచింది నరసమ్మ. "అవున్రాయనా నేను నోరు పారేసుకుంటున్నాను. నిజమే. ఎదిగిన చెల్లెలిని ఇంట్లో వుంచుకుని నువు పెళ్ళాంతో సరసాలు ఆడుతుంటే చూడలేక నోరు పారేసుకుంటున్నా. బాధ్యత తెలియని కొడుకుని కన్నందుకు నోరుపారేసుకుంటున్నా. అంతకంటే మరి ఏం చేయను? చెప్పు" అంది పోట్లాటకు సిద్ధపడుతూ.

"పొలంలోని పంటను అమ్మి చెల్లి పెళ్ళిచేద్దాంలే. మంచి సంబంధం రావాలి కదా" అన్నాడు నరేష్ శాంతంగా.

"పంట అమ్మితే ముష్టి ముప్పై వేలు కూడా చేతికి రావు. ఆ డబ్బుతో నీ పెళ్ళికి చేసిన అప్పులు తీర్చాలా? ఇంట్లో తిండి, ఖర్చులకు పెట్టుకోవాలా? నువ్వే చెప్పు. పైసా చేతిలో లేకుండా నీ చెల్లిని దారినపోయే ముష్టివాడికిచ్చి పెళ్ళి చేస్తావా?" గట్టిగా నిలదీసింది నరసమ్మ.

"ఏదో ఒకటి చేద్దాంలే అమ్మా. నువు కోపం తగ్గించుకో ముందు" అన్నాడు నరేష్.

"అదేం కుదరదు. ఈ రోజు అటో ఇటో తేలిపోవాల్సిందే. ఇప్పటికే పెళ్ళయి నాలుగు నెలలు దాటింది. కోడల్ని పుట్టింటికి వెళ్ళి రెండులక్షల కట్నం తెమ్మని చెప్పు.. లేదంటే నాకు పెళ్ళికి ముందు మాట ఇచ్చిన ప్రకారం కొయేటికి పోయి డబ్బు సంపాదించు. ఈ రెండిటిలో ఏదో ఒకటి చెయ్యి లేదంటే నీ చెల్లెలు నేను ఏదో ఒక బావిలో దూకి చచ్చిపోతాం అంతే" అంటూ ఏడుపు మొదలుపెట్టింది ఆమె.

"కొయేటికా? " ఉలిక్కిపడ్డాడు నరేష్. చెంచులక్ష్మిని వదిలి అంత దూరం వెళ్ళి అన్ని రోజులు వుండడమా? జరిగేపనా? అది. ఇక రోజూ తల్లి మాటలు, తిట్లు భరించలేక ఏదైతే అయిందని సుధాకర్‌కు ఫోను చేసి విషయం చెప్పి తొందరగా వీసా పంపించమని చెప్పాడు నరేష్.

"ఓస్ అదెంత పని. ఒక నెలరోజుల్లో పంపించేస్తాను. అన్నీ సర్దుకో" అన్నాడు వాడు.

కొడుకుని వల్లో వేసుకుందనీ ఇంటికి దరిద్రమని ప్రతిరోజూ చెంచులక్ష్మిని సాధించే నరసమ్మ కొడుకు కొయేటికి పోతాను అనగానే తన సాధింపులు మానేసి కొడుకును కోడలిని ప్రేమగా చూడసాగింది. "నాయనా మీకోసమే కదా నేను చెప్పేది. అంతో ఇంతో సంపాదించుకుంటే మీరే కదా బాగుపడతారు. అందులో కొంత పెట్టి నీ చెల్లెలి పెళ్ళి చేసి పంపించేస్తే మిగిలిందంతా మీకే కదా?" అంటూ మంచిమాటలు చెప్పనారంభించింది.

తల్లి పోరుభరించలేక కొయేటికి వెళ్ళాలి అనుకుంటున్నాడే కానీ చెంచులక్ష్మిని విడిచి వెళ్ళగలడా అనే సందేహం మాత్రం అతడి మనసులో తొలుస్తూనేవుంది. ఇటు భర్త "కువైట్ వెళతాను" అనగానే చెంచులక్ష్మి ముఖంలో కళ తగ్గిపోయింది. మనసులోని బాధ బయటపడకుండా కంట్లో నీళ్ళు కనబడకుండా ముఖం దిగేసుకుని తిరుగుతోంది ఆమె. నరేష్‌కు కూడా చాలా బాధగా వుంది. కానీ ఏమీ చేయలేని అశక్తుడైపోయాడు.

అనుకున్నట్లుగానే వీసా వచ్చేసింది. ప్రయాణానికి ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. అతడి ప్రమేయంలేకుండానే మెడికల్ అయిపోయింది. అన్ని పనులూ యాంత్రికంగా చేస్తున్నాడే కానీ మనసు మాత్రం కువైట్‌కి వెళ్ళడానికి ఒప్పుకోవడంలేదు.

ఒక్కరోజు కూడా చెంచులక్ష్మిని విడిచి వుండలేని బలహీనత అతనిది బలహీనత అనేకంటే గాఢమైన ప్రేమ అని చెప్పవచ్చు.

అతడి మాటలకి, చేష్టలకు కిలకిలా నువ్వే చెంచులక్ష్మి పెదవులపైన ఇపుడు నవ్వే కరువైపోయింది. వచ్చే కన్నీళ్ళను బలవంతంగా బిగపట్టుకుంటోంది. నరేష్ లేకుండా ఒక్కరోజు కాదు, రెండురోజులు కాదు. పోనీ నెలరోజులైనా కాదు. రెండేళ్ళు... రెండేళ్ళ కాలాన్ని ఎలా గడపగలదు? అతడిని చూడకుండా, మాట్లాడకుండా అన్నిరోజులు ఎలా బ్రతకగలదు? ఏంటీ శిక్ష తనకు? బాధతొ ప్రశ్నించుకుంటోంది చెంచులక్ష్మి.

ఇక వేరే పరిష్కారం ఏమీలేదా? పరిపరివిధాలుగా ఆమె ఆలోచిస్తోంది. ఎంతగానో దుఃఖిస్తోంది. నరేష్ పరిస్థితి కూడా అలాగే వుంది. అంతా అయోమయంగా వుంది. డబ్బులేకపోతే పేదరికం మనిషిని ఇలా శాసిస్తుందా? జీవితాల్ని ఆడిస్తుందా? కువైట్‌కి వెళ్ళకుండా ఇక్కడే వుండి సంపాదించే మార్గమే లేదా? బాధపడుతున్నాడు. గుండెలోని బాధను బయటికి చెప్పుకోలేక కుమిలిపోతున్నాడు.

చెంచులక్ష్మిని విడిచి వెళ్ళాలి అనే భావనతో అతడికి నిద్రపట్టడంలేదు. అన్నం సహించడంలేదు. అప్పటికీ చెంచులక్ష్మి అతడికి ధైర్యం చెప్పింది. కౌగిలించుకుని ఓదార్చింది. గోరుముద్దలు కలిపి నోటికందించింది. ఉండేది కొద్దిరోజులే కాబట్టి తన గుండలపై వాలి నిద్రపొమ్మంది. పెళ్ళానికి తనపై వున్న ప్రేమకు సంతోషించి కాస్త ధైర్యాన్ని తెచ్చుకున్నాడు నరేష్.

ఇరుగు పొరుగువారు వచ్చి "ఒరే నరేషా అదృష్టం అంటే నీదే నెల తిరక్కముందే కొయేటి వీసా వచ్చేసింది. మావాడికి వీసా కావాలని రెండేడ్లుగా ప్రయత్నించినా రావడంలేదు. నువు పోయి బాగా దుడ్డు సంపాదించుకురా. చెల్లెలి పెళ్ళి చేసి ఒక మిద్దె కట్టుకుందువు. ఎన్నాళ్ళు ఈ పెంకుటింట్లో వుంటారు?" అని కబుర్లు చెప్పి పోతున్నారు.

నరేష్ స్నేహితులైతే "ఏరా! నరేషూ ఒక కొడుకుని కని తరువాత కొయేటికి పోకూడదా? అంత తొందర ఏమొచ్చింది" నీకు అంటూ తమాషా చేస్తున్నారు. అందరి మాటలూ మౌనంగా వింటున్నాడు నరేష్. కానీ కువైట్‌కి వెళ్ళకుండా తప్పించుకునే మార్గమేదీ కనిపించడం లేదు. కన్నతల్లే తమ ఇద్దరినీ విడదీసే భూతంలా అతడి కంటికి కనిపిస్తోంది.

ప్రయాణం ఇంకో ఐదురోజుల్లోకి వచ్చింది అనగానే ఒకరోజు చెంచులక్ష్మి కళ్ళు తిరిగిపడిపోయింది. మొగుడు కువైట్‌కి వెళుతున్నాడనే దిగులుతో నీరసం వచ్చి వుంటుంది అని అందరూ అనుకున్నారు కానీ తనకు రెండోనెల వచ్చినట్లుగా అసలు విషయం చిన్నగా చెప్పింది చెంచులక్ష్మి. ఇంక నరేష్ సంతోషానికి అవధులు లేవు. ఇక కువైట్‌కి పోనంటే పోనని వీసాను, టిక్కట్లను చించి పడేస్తానని చెప్పేసాడు. అంతే నరేష్ మాటలు విన్న నరసమ్మకు కోపం అవధులు దాటింది గయ్‌మని అంతెత్తున లేచింది. ఆవేశంగా పైకి లేచి కూతురి రెక్కపట్టుకుని "పదవే పద ఇంకా ఎందుకు బ్రతికి వుండటం. ఇద్దరం ఆ కోమటోళ్ళ బావిలో దూకి చచ్చిపోదాం పద. వాళ్ళనే బ్రతకనీ. పిల్లాపాపలతో సంతోషంగా వుండనీ నీ బ్రతుకు ఏమయిపోయినా నీకు పెళ్ళి కాకపోయినా వాళ్ళకేం? ఈ దరిద్రపుది వాడికి ఏమందో పెట్టి వశపరచుకుంది. అందుకే తల్లిమాట కూడా లెక్కచేయకుండా, చెల్లెలి పెళ్ళి చేయాలనే బాధ్యత తెలియకుండా పెళ్ళాం ప్రక్కన వుంటే చాలనుకుంటున్నాడు. కనిపెంచి ఇంతటి మగవాణ్ణి చేస్తే ఇది ఈరోజు వచ్చి మొగుణ్ణి చేతిలో పెట్టుకుని ఇష్టం వచ్చినట్లు ఆడిస్తోంది. అదే ముఖ్యం వాడికి. అది వుంటే చాలు వాడికి. మనం అక్కరలేదు. బ్రతికినా చచ్చినా వాడికి లెక్కేలేదు. పద" అంటూ శోకాలు తీస్తూ కూతురుతో సహా ఇంట్లోంచి బయటికి పరిగెత్తింది నరసమ్మ.

తల్లి చేష్టలకి బిత్తరపోయిన నరేష్ తేరుకునే లోపల, కేకలు వేస్తూ ఏడుస్తూ వీధిలో పడి బావి దగ్గరకి పరిగెత్తింది నరసమ్మ.

ఈ గోలకి వాళ్ళూ వీళ్ళూ పోగయి నరసమ్మ అన్నంత పనీ చేస్తుందని భయపడి తల్లీ కూతుళ్ళిద్దరికీ అడ్డుపడి ఇద్దరినీ ఇంట్లోకి తీసుకొచ్చారు.

అందరూ ఇంట్లో చేరి నరేష్‌ను తిట్టి బుద్ధి చెప్పారు.

"ఊళ్ళో వాళ్ళందరూ కొయేటికి పోవాలని ఆశపడుతూ వుంటే నీకు ఏం పోయేకాలం నరేషా? నువ్వొక్కడివే పెళ్ళి చేసుకున్నావా? నీ కొక్కడికే పెళ్ళాం వుందా? రెండేళ్ళు కళ్ళు మూసుకుంటే ఎంతలో తిరిగివస్తాయి రోజులు? ఆ సుధాకర్ పోలేదా? గొల్లోళ్ళ సుబ్బిగాడు పోలేదా? వాళ్ళంతా పెళ్ళాన్ని వదిలేకదా పోయారు. నీదే పెద్ద విచిత్రంగా వుందే పెళ్ళాం మోజులోపడి ఊరికే తల్లిని చెల్లిని చంపమాకు. తల్లి చెప్పేమాట కాస్తవిను" అంటూ తలోరకంగా నీతులు చెప్పనారంభించారు.

అందరూ చేరి ఒకోరకంగా మాట్లాడుతూంటే పాపం నరేష్ సిగ్గుతో అవమానంతో తలదించుకున్నాడు. తల్లి గయ్యాళిది, డబ్బు ఆశకలది అని అతడికి తెలుసుకానీ కొడుకు బాధను అర్థం చేసుకోలేనిది అని అతడు అనుకోలేదు. తల్లి పట్టుదలంతా కోడలిమీద ద్వేషంతోనూ అసూయతోనూ అని అర్థం అవుతోంది. ఆమెకు నచ్చని పెళ్ళి చేసుకోవడం ఒక కారణం అయితే చెంచులక్ష్మినుండి కొడుకుని విడదీయాలనేది రెండో కారణం. అందుకే అంత బలంగా తల్లి తనని కొయేటికి పంపించాలని పట్టుపడుతోంది అని గ్రహించాడు నరేష్. ఏమీ మాట్లాడకుండా తలదించుకుని లోపలి గదిలోకి పోయి తలుపు వేసుకున్నాడు. మరోవైపు జరిగే సంఘటనలతో చెంచులక్ష్మి కుమిలిపోతోంది. కన్నీరు మున్నీరవుతోంది. కానీ తాను ఏడిస్తే భర్త భరించలేడని దుఃఖాన్ని గొంతులోనే దాచుకుంటోంది ఆమె.

ఉన్న నాలుగురోజులు ఎవరు పిలిచినా ఉలకలేదు పలకలేదు తన పనులన్నీ పూర్తిచేసుకున్నాడు. బ్యాగ్ కూడా తానే సర్దుకున్నాడు. వెళ్ళేముందు చెంచులక్ష్మిని ఒక్కసారి కౌగిలించుకున్నాడు. కన్నీటి చుక్కలు రాలుతుండగా "మన బిడ్డ జాగ్రత్త" అని ఒకే ఒక్కమాట ఆమెకు చెప్పాడు. తనతోపాటు ఎవర్నీ రావద్దని మద్రాసులో తాను ఒక్కడే ఫ్లయిట్ ఎక్కగలనని చెప్పి భారంగా, బలిపశువులా వెనక్కి తిరిగి చూడకుండా కాళ్ళీడ్చుకుంటూ కడపలో రైలెక్కి మద్రాసుకు వెళ్ళిపోయాడు నరేష్.

కొడుకు వెళ్ళగానే నరసమ్మ చాలా సంబరపడింది. ముఖమంతా నవ్వుపులుముకుంది. హుషారుగా ఇల్లంతా తిరిగింది. వీధిలోకి వెళ్ళి ఇరుగుపొరుగు వారితో మాట్లాడి వచ్చింది. ఏదో జయించిన సంతోషంతో ఆమె పొంగిపోతోంది. కోడలికి కొడుకును దూరం చేసానన్న తృప్తితో, సంతోషంతో ఆమె ఆ రాత్రి కంటినిండా నిద్రపోయింది.

కానీ చెంచులక్ష్మి మాత్రం ఆ రాత్రి కంటిమీద కునుకులేకుండా గడిపింది. ఏదో భయం ఆమెను పట్టి పీడించింది. ఏదో జరగరానిది జరుగుతున్నట్లుగా భావించి కీడును శంకించింది ఆమె మనస్సు. ఎంత ప్రయత్నించినా హృదయాన్ని నిగ్రహించుకోవడం ఆమెకు సాధ్యం కాలేదు. నరేష్ ఎదురుగా నిలబడి రెండుచేతులూ సాచి రా..రమ్మని పిలుస్తున్నట్లే అనిపించింది ఆమెకు.

తెల్లగా తెల్లవారింది. బారెడు ప్రొద్దెక్కింది, అందరూ మొహాలు కడుక్కుని చద్దెన్నం తిని పొలానికి బయలుదేరారు. ఆ సమయంలో గట్టిగా హారను కొట్టుకుంటూ వచ్చి ఇంటి ముందు ఆగింది ఒక జీపు. జీపు శబ్దం విని మనింటికి ఎవరొచ్చారా అని నరసమ్మ, కూతురు చూస్తూ బయటికి వచ్చారు. చెంచులక్ష్మి అలా నిర్లిప్తంగా వచ్చి అడుగులువేస్తూ గుమ్మానికి ఆనుకుని నిలబడింది.

ఆమె చూపులు పైకి శూన్యంలోకి చూస్తున్నాయి. ఒక్కరోజు కూడా తనని విడిచి నరేష్ వుండలేడని ఆమెకు తెలుసు. ఇంతలో జీపులోనుండి ఇద్దరు మనుషులు దిగి "నరేష్ ఇల్లు ఇదే కదా" అంటూ తెల్లటి బట్టను కప్పిన శరీరాన్ని క్రిందికి దించి దాన్ని వసారాలో పడుకోబెట్టారు. ఎవరో వచ్చి ఆ శరీరం మీద ముసుగు తొలగించారు. అంతే.. కొడుకు ఇంతపని చేస్తాడని ఊహించని నరసమ్మ నిలువు గుడ్లేసుకుని వాకిట్లో కూలబడిపోయింది. సుబ్బమ్మత్త లోపలికి వచ్చి "ఏమే చెంచులచ్చిమీ ఎంత ఘోరం జరిగిందే ఇంక నువ్వెలా బ్రతుకుతావే తల్లీ. కొయేటికి పోకపోతే పోనీ బిడ్డ ఇక్కడే వుండి వుంటే లక్షణంగా బ్రతికి వుండునుగదే" అంటూ ఏడుస్తూ ఓదార్పుగా పొదవి పట్టుకుంది.

ఇంకెక్కడి చెంచులచ్చిమి? ఆమె ప్రాణం ఎపుడో గాల్లో కలిసిపోయింది. ఆమెకూడా నరేష్‌తో కలిసి ఆకాశం అంచులవైపు సాగుతూ పైపైకి అనంతలోకాలవైపు ప్రయాణం చేస్తోంది.

## *ధనలక్ష్మి కథ*

**బట్టలన్నీ** మడతపెట్టి సూట్‌కేసులో సర్దుకుంటోంది ధనలక్ష్మి. ముఖంలో ఏ దిగులూ బాధా భయమూ అస్సలు కనబడటం లేదు. ఎందుకుంటాయి? భర్తమీదకాస్త ప్రేమా, ఇష్టమూ ఉండి వుంటే కాస్త దిగులు వుంటుంది.

అవేవీ లేని ఒక జడపదార్ధం ఈ స్త్రీ. తన ఖర్మకాలి తన పాలబడింది. ఎంతగానో అడ్జస్ట్ అయిపోయి సంసారాన్ని సరిదిద్దుకోవాలని సరదాలు తీర్చుకోవాలని ఆశించాడు. కానీ ఆమెలో ఏ మాత్రం స్త్రీతత్వం కనిపించలేదు. తాళి కట్టిన భర్తపట్ల కాస్త అనురాగం ఆప్యాయత మచ్చుకైనా కనబడలేదు. మొదట్లో సిగ్గు పడుతోంది అనుకుని తానే చొరవగా మాట్లాడి దగ్గర చేరేవాడు. కానీ తనలో ఏదో అయిష్టత చలనం లేని జడత్వం, రాయిలా నిలబడే వైనం ఆఖరికి విసుగు తెప్పించింది. చివరికి తెలిసింది ఏమంటే కువైట్‌లో పని చేసుకునే భర్తంటే తనకి చులకన భావమని తనంటే ఇష్టంలేదని. ఏదో తల్లిదండ్రుల బలవంతం మీద పెళ్ళి చేసుకుంది. సరే కనీసం సమాజం కోసమైనా కాపురం చెయ్యాలి కదా?

సరే, పెళ్ళి అయ్యాక తనని కూడా కువైట్‌కి పిలిపిస్తే దగ్గర వుంటుంది. అలవాటవుతుంది. అనురాగం పుడుతుంది అనుకుని ఆశ కలిగింది రాజేష్‌కి. "కువైట్‌కి వస్తావా?" అని అడిగితే అపుడు సరే అంది. సరే అనడం ఆలశ్యం లక్షరూపాయలు అప్పుచేసి వీసా కొని పంపించాడు. ఇంకో యాభైవేలు పైన ఖర్చులకి ఫ్లయిట్ టిక్కెట్లకి కూడా అప్పే చేయాల్సి వచ్చింది. డబ్బు పోతే పోయింది. ఇక్కడికి వస్తే తనకి ఆసరాగా వుంటుంది. తన వంట తానే వండుకుని తినడం ఎంతో కష్టంగా వుంది. కనీసం ఇంట్లో వుండి తనకు వంట చేసి పెడితే చాలు అనుకున్నాడు రాజేష్.

కువైట్‌లో ఫ్లయిట్ దిగి భర్తను చూడగానే ఆమెలో ఏ భావమూ లేదు. కొంచెమైనా సంతోషిస్తుందని రాజేష్ భావించాడు. కానీ తను ఎప్పటిలా ముభావంగానే వుంది. వచ్చిందేగానీ తనవల్ల ఏ సుఖమూ లేదు. ముద్దూ ముచ్చటా అస్సలే లేదు. తనపని తను చూసుకునేది. అస్సలు భర్త అనేవాడు వున్నాడు అనే భావమే తనలో కనిపించేది కాదు. ఏదో తిరస్కారం అసహ్యమైన భావం ఆమెలో కనిపించేవి. చాలా కృంగిపోయాడు రాజేష్. అప్పటికీ ఎన్నోసార్లు ప్రేమగా దగ్గరికి తీసుకున్నాడు. తన ప్రేమతో ఆమెలో మార్పు వస్తుందని ఆశపడ్డాడు కానీ అది అడియాసే అయింది. దగ్గరికి వెళితే రాయిలా బిగుసుకుపోయేది.

దాదాపు నెలరోజులు గడిచిపోయాయి. ప్రతిరోజూ "మా అమ్మను చూడాలి. మా అమ్మను చూడకుండా నేను వుండలేను నేను ఇండియా వెళ్ళిపోతాను" అని మొండికేసింది. నయానా భయానా నచ్చచెప్పడానికి ఎంతగానో ప్రయత్నించాడు రాజేష్. అస్సలు ఒప్పుకోలేదు ధనలక్ష్మి.

తనమీద తనకే అసహ్యమేసింది రాజేష్‌కి. తనతోపాటు పెళ్ళి అయినవాళ్ళు అందరూ హాయిగా సంతోషంగా కాపురాలు చేసుకుంటుంటే తనకి ఆ సుఖం ఎడారిలో ఎండమావిలా ఎదురుగా కనిపించి వెక్కిరిస్తోంది.

"ఇంత ఖర్చుపెట్టి, శ్రమపడి వీసాకొని నీకు పంపించి ఇక్కడికి పిలిపించాను. కనీసం ఒక సంవత్సరమయినా వుండు" అని ప్రాధేయపడ్డాడు రాజేష్.

"తన తల్లిని చూడకపోతే, ఆమె దగ్గర లేకపోతే తను బ్రతకలేనని" తేల్చి చెప్పేసింది ధనలక్ష్మి. తల్లిమీద ఆమెకున్న ప్రేమకు, తనపట్ల వున్న అయిష్టతకు పొందిక కుదరక తల్లడిల్లిపోయాడు రాజేష్.

"నన్ను వెంటనే ఇండియాకు పంపిస్తావా? లేదా?" అని మొండికేసింది ఆమె. తలనొప్పి అంటూ మంచంపై పడుకుని మూలుగుతూ ఏడుస్తూ నానా హంగామా చేసింది. ఆమె గోల భరించలేకపోయాడు రాజేష్. పెళ్ళి గురించి ఎన్ని కలలు కన్నాడు? కువైట్‌లో తను ఒంటరిగా గడిపిన రోజులకు స్వస్తి పలకాలని భార్యతో ముద్దూ ముచ్చటా తీర్చుకోవాలనీ అరేబియా సంద్రపు ఒడ్డున అలలతో ఆడుకోవాలని ఇసుకలో కలిసి నడుస్తూ కబుర్లెన్నో చెప్పుకోవాలని ఆశపడ్డాడు.

కానీ ఈ జన్మకు ఆ యోగం లేనట్లుంది. దగ్గరికి వెళితే పురుగును చూసినట్లుగా చూస్తోంది ఆమె.

ఇదేం ఖర్మ తనకి? చిన్న స్పర్శకి, చిరు ముద్దుకి, కాస్తంత ఆప్యాయతకి తాను అర్హుడు కాడా? తాళి కట్టిన భర్తని ప్రేమించి, లాలించి కాపురం చేయాల్సిన బాధ్యత స్త్రీకి లేదా? తనిష్టమేనా? మరి తన తల్లిని అంతగా ప్రేమిస్తోందే, భర్తని ప్రేమించడానికి ఏం రోగం? తనని కువైట్‌కి తీసుకు వచ్చి దగ్గరగా వుంచుకుంటే కనీసం తనలో మార్పు వస్తుందని ఆశపడ్డాడు కానీ తనవల్ల ఇంకా పీకల్లోతు అప్పుల్లోకి కూరుకుపోయాడు. ఆ అప్పులు వాటికి వడ్డీలు తీర్చడానికి ఇంకెన్ని రోజులు కష్టపడాలో?

పదిరోజులు ఓపికగా ఆమెను మార్చాలని, కువైట్‌లో వుండేలా చేయాలని ప్రయత్నించాడు రాజేష్. ఎన్నో మంచి మాటలు చెప్పాడు. ఎంతో ప్రేమను చూపించాడు. కానీ ఏం లాభం లేకపోయింది. తన ధోరణిలో ఏ మార్పూ లేదు. ఇండియాకు వెళ్ళిపోతాను అంటుందే తప్ప కనీసం నాలుగునెలలయినా వుంటాను అని అనడంలేదు. కోపంతో జుట్టు పీక్కోవాలనిపించింది రాజేష్‌కి. ఇది భార్యా? లేక మెడకు తగిలించుకున్న బండరాయా? అనిపించింది.

ఇక పోరు భరించలేక, ప్రతిరోజూ ఆ తలనొప్పిని చూడలేక "సరే వెళ్ళిపో. సంతోషంగా నీ తల్లిదగ్గరకి పో" అనేసాడు రాజేష్. ఆమె ఇక్కడ వుండి తనకు కూడా తలనొప్పిని తెచ్చిపెడుతోందే తప్ప ఏ సుఖమూ సంతోషమూ కలిగించడంలేదు. ఇవికాక ముందున్న అప్పును తలుచుకుంటుంటే గుండెలోని భయం పెరిగిపోతోంది. ఈ పెళ్ళి తన ముప్పుకే అనిపించింది రాజేష్‌కి.

వెళ్ళిపో అనగానే హుషారుగా మంచంపైనుండి లేచి బట్టలు సర్దుకోవడం మొదలుపెట్టింది ధనలక్ష్మి.

భర్త ఎలా వంటచేసుకుంటాడు. ఏం తింటాడు? ఇక్కడ ఒంటరిగా ఎలా వుండాడు? అనే ఆలోచన, ఇంగిత జ్ఞానం స్త్రీకి కాస్తయినా లేకపోయినందుకు చింతించాడు రాజేష్. ఆమె కఠిన హృదయాన్ని చూసి ఆశ్చర్యపడ్డాడు.

నాలుగు నెలల క్రితం పెళ్ళికాకముందు తన బ్రతుకు సంతోషంగా వుండేది. దేశాన్ని విడిచి వచ్చినా ఒంటరిగా ఈ ఎడారి దేశంలో కష్టపడి పని చేసుకుంటున్నా ఏదో ఆశ తనలో వుండేది. భవిష్యత్తు ఆనందంగా వుంటుంది. మంచి భార్య దొరుకుతుంది అనే భావం సంతోషాన్ని నింపేవి.

ఒకరోజు అమ్మా నాన్నలు "ఒరేయ్ రాజేష్ నీకోసం ఒక పిల్లను చూసాం. పిల్ల చక్కగా పేరుకు తగినట్లు లక్ష్మీదేవిలా వుంది. కట్నం ఇచ్చుకోలేరు గానీ పిల్ల నీ ప్రక్కన జోడుగా బావుంటుంది. వచ్చి ఒకసారి చూసావంటే ముహూర్తాలు పెట్టుకుందాం" అని ఫోనులో చెప్పారు.

సరే ఎప్పటికైనా పెళ్ళంటూ చేసుకుని జీవితంలో సెటిల్ అవ్వాల్సిందే కదా? అందులో ఇక్కడ నాలుగేళ్ళుగా ఒంటరిగా వుండటం చాలా కష్టంగా వుంది. పెళ్ళి చేసుకుని భార్యను ఇక్కడికి తీసుకొచ్చి స్వర్గాన్ని ఇక్కడే సృష్టించుకోవచ్చు. పిల్ల బావుంది అంటున్నారు కాబట్టి వెళ్ళి చూద్దాం అనుకుని వెంటనే ప్రయాణమై వెళ్ళాడు. పిల్ల ముభావంగా వుంటే అదంతా సిగ్గులే అని అందరూ సర్ది చెప్పుకున్నారు. కానీ తను తన తల్లిని, చెల్లెళ్ళనూ వదిలి వుండలేదని, పెళ్ళి విలువ తెలియని మూర్ఖురాలని అర్థం చేసుకోలేకపోయారు. కనీసం దగ్గరగా వుంటే భర్తను ప్రేమిస్తుంది అనుకుని ఎన్నో కష్టాలు భరించి వీసాకొని పంపిస్తే ఇపుడు నెలరోజులు కూడా వుండకుండా వెళ్ళిపోతానని మొండికేస్తోంది ధనలక్ష్మి. తన జీవితమంతా ఎడారిలా మారిపోయినట్లు భావించాడు రాజేష్. తన బాధనంతా హృదయంలో దాచుకోలేక ఫ్రెండ్‌కు చెప్పుకుంటే వాడు అంటాడు. "తన తల్లికోసం వెళుతోందో లేక అక్కడ తనకు వున్న తన ప్రేమికుడికోసం వెళుతోందో కనుక్కో. లేకపోతే భర్తతో కాపురం చేయడానికి దగ్గర వుండటానికి ఏ స్త్రీ అయినా ఎంతో అదృష్టంగా భావిస్తుంది" అంటూ లేనిపోని సందేహాలు కలిగించాడు.

మరి పెళ్ళయిన పిల్ల తల్లిని వదిలి వుండలేకపోవడం ఏమిటి? విచిత్రం కాదా?

మరి ఎవరో ప్రియుడే వుంటే తనని పెళ్ళి చేసుకోవడానికి ఎందుకు ఒప్పుకుంది? తన జీవితం ఎందుకు నాశనం చేసింది? ఆలోచించి బుర్ర పగిలిపోతోంది రాజేష్‌కి. తను హుషారుగా, సంతోషంగా తిరుగు ప్రయాణానికి బట్టలు సర్దుకుంటుంటే కోపంతో వళ్ళుమండిపోతోంది రాజేష్‌కి. ఏమీ చేయలేని నిస్సహాయతతో నిస్తత్తువ ఆవహించింది.

రాజేష్ బాధను లెక్కపెట్టకుండా వెళ్ళిపోయింది ధనలక్ష్మి. గట్టి మనసు చేసుకుని జీవించడానికి, చేసిన అప్పులు తీర్చడానికి సంవత్సరకాలం పట్టింది అతడికి.

ఇంటికి వెళ్ళిన ధనలక్ష్మి అమ్మగారింట్లోనే వుంటోందని, కనీసం అత్తమామలను చూడటానికయినా తమ ఇంటికి రావడం లేదని చెప్పి బాధపడింది రాజేష్ వాళ్ళమ్మ. ఫోను చేసినప్పుడల్లా కొడుకు జీవితం చేజేతులా పాడుచేసామని చెప్పి వాపోయేది. ధనలక్ష్మితో విడాకులు ఇప్పించేసి కొడుక్కు ఇంకో పెళ్ళి చేయాలనికూడా రాజేష్ తల్లిదండ్రులు నిశ్చయించుకున్నారు. ఆ విషయమే కొడుకుతో చెపితే గయ్‌మని అంతెత్తున లేచాడు రాజేష్.

"జరిగింది చాలు. ఇక నాకు ఓపిక లేదు. నన్నిలా ఇక్కడ కువైట్‌లో ప్రశాంతంగా బ్రతకనివ్వండి" అనేవాడు అతడు.

ఏం చెయ్యాలో కొడుకు కాపురం మూడ్నాళ్ళ ముచ్చటగా ఎందుకు ముగిసిపోయిందో అర్ధం కాలేదు వారికి. వాళ్ళు కూడా కొడుకు పరిస్థితికి దిగులుపడ్డారు. అలా మరో రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. ఈలోపల చేసిన అప్పులన్నీ తీర్చేసి కొంచెం వెనకేసుకున్నాడు రాజేష్.

తనకు పెళ్ళయిందని భార్య అనేది ఒకటి ఇండియాలో వుందనే సంగతి కూడా మరిచిపోయాడు అతడు. పెళ్ళనేది ఒక పీడకలగా అతడి జీవితంలో మిగిలిపోయింది. కాలం అలా గడిచిపోతోంది.

ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించిన ధనలక్ష్మి తల్లి అనారోగ్యంతో మరణించింది. చెల్లెళ్ళు ఇద్దరూ పెళ్ళిచేసుకుని భర్తలే తమపాలిట దైవాలుగా భావించి సంతోషంగా కాపురాలకు వెళ్ళిపోయారు. ఇక ఇంట్లో మిగిలింది అన్నా వదినలు, వారి పిల్లలు. తల్లి మరణం ఆమెను ఎంతో కృంగదీసింది. చెల్లెళ్ళు కూడా పెళ్ళయి వాళ్ళ ఇళ్ళకు వెళ్ళిపోవడంతో ఒంటరితనం క్రమ్ముకుంది.

వదిన ఎప్పటికీ పరాయిదే కదా! అన్న ఆమె చేతిలో ఆటబొమ్మ అయ్యాడు. మొగుడ్ని వదిలేసిన ఆడది అంటూ హేళనగా మాట్లాడేది వదిన. తను దర్జాగా కుర్చీలో కూర్చుని అన్ని పనులూ ధనలక్ష్మి చేతే చేయించేది. ఇంటి పనేకాక పిల్లల పనికూడా ఆమే చేయాల్సి వచ్చేది.

వీటికి తోడు ఇరుగుపొరుగువాళ్ళు "బంగారంలాంటి మొగుడ్ని విడిచి పుట్టింటికి వచ్చేసావు. ఏం సాధిస్తావు? మొగుడు లేకుండా, పిల్లా పాపా లేకుండా అన్నా వదినలకు చాకిరీ చేసి చస్తావా? నీ మొగుడు ఎంతో ప్రేమతో నిన్ను కువైట్‌కి తీసుకెళితే భర్తను కాదని వచ్చేసావు. ఇప్పుడు ఒంటరిగా ఎలా బ్రతుకుతావు? ఇప్పుడైనా భర్త విలువ తెలుసుకో. వెళ్ళి అతడి కాళ్ళమీద పడు. కనీసం అతడి మనసు కరుగుతుంది" అని సలహాలు ఇచ్చేవారు.

వదిన హేళన మాటలతో ఇంట్లోని చాకిరీతో ధనలక్ష్మి పొగరంతా అణిగిపోయింది. జీవితం మీద విరక్తి చెందే స్థితికి వచ్చింది దాదాపు నలుగేళ్ళు గడిచిపోయాయి. భర్తను ఎంతో బాధపెట్టి కువైట్ నుండి తిరిగి వచ్చేసింది. అతడ్ని, అతడి బాధను తాను అస్సలు లక్ష్యపెట్టలేదు. ఎంతో అహంకారంతో బాధ్యతలేని స్త్రీగా ప్రవర్తించింది. అందుకే దేవుడు తనకి తగిన శిక్ష వేసాడు. తల్లీ చెల్లెళ్ళూ శాశ్వతం అనుకుంది కానీ కట్టుకున్న భర్తతో గౌరవం వస్తుందని, కుటుంబం లభిస్తుందని తెలుసుకోలేకపోయింది. ఇపుడు ఏ మొహం

పెట్టుకుని తిరిగి ఆయింటికి వెళ్ళగలదు? తన ప్రవర్తనతో వాళ్ళు కూడా విసిగిపోయినట్లున్నారు. ఈ నాలుగేళ్ళలో ఒకసారి కూడా ఎవరూ వచ్చి పలకరించలేదు. తన గురించి అసలు పట్టించుకోలేదు. అయినా తప్పు చేసింది తను. ఇప్పుడు ఎలా తిరిగి వాళ్ళ దగ్గరికి వెళ్ళగలదు? రాజేష్ మగవాడు. అందులో కువైట్‌లో వుంటున్నాడు. ఈ మధ్యకాలంలో ఎవరినైనా అమ్మాయిని చూసుకుని అక్కడే పెళ్ళి చేసుకున్నాడో ఏమో? ఊహూ అలా జరిగి వుండదు. అతడు అలాంటి వాడు కాదు. తనకు విడాకులు ఇవ్వనిదే మరో పెళ్ళి చేసుకోడు ఇలా ఆలోచిస్తూ ఏం చెయ్యాలో అర్ధంకాక వదిన సాధింపులు భరించలేక ఏడుస్తూ కాలం గడపసాగింది ధనలక్ష్మి.

ఒకరోజు ఎదురింటి రాజ్యం నాలుగేళ్ళ తరువాత కువైట్ నుండి ఇంటికి తిరిగి వచ్చింది. ఆమె తెచ్చిన సామాన్లు, వేసుకున్న నగలు చూసి ధనలక్ష్మి వాళ్ళ వదిన చాలా ఈర్ష్య పడింది. "అవేం గొప్ప? ధనలక్ష్మిని కూడా కువైట్‌కి పంపిస్తే బాగా డబ్బు సంపాదించుకుని వస్తుంది. మరి మొగుడ్ని వదిలేసి వచ్చి ఇంట్లో కూర్చుని తింటే ఎలా? వయసులో వున్న ఆడది ఒంటరిగా వుంటే నలుగురూ నాలుగు మాటలు అంటారు. అలా అందరి దగ్గరా అనిపించుకోవడం ఎందుకు? నువు కువైట్‌కి వెళ్ళమ్మా" అంటూ వీసా కోసం ఏజెంటుని సంప్రదించి ధనలక్ష్మి ప్రయాణపు ఏర్పాట్లు చేయసాగింది.

ఇక ఏం చెప్పాలో అర్ధం కాలేదు ధనలక్ష్మికి. వదిన మాటలకి ఎదురు చెప్పే ధైర్యం ఆమెకు లేదు. వెళ్ళను అనడానికి ఏ కారణమూ కనబడలేదు. ఇక్కడ వుండి వదిన సాధింపులు భరించి ఆమెకు చాకిరీ చేసేకంటే అలా వెళ్ళిపోవడమే మంచిది అనుకుంది ధనలక్ష్మి. వెళ్ళే ముందు పక్కింటి పిన్నిగారు పిలిచి "ఏమే ధనలక్ష్మి అపుడంటే నీకు తెలివిలేక భర్త విలువ తెలియక కట్టుకున్న మొగుడ్ని వదిలేసి పుట్టింటికి వచ్చేసావు. అందుకు తగ్గ శిక్ష అనుభవించావు. ఇప్పుడైనా బుద్ధి తెచ్చుకుని అక్కడ కువైట్‌లో నీ మొగుడ్ని కలిసి వాడి కాళ్ళమీద పడు. లేకపోతే నీ సంపాదనంతా నీ వదిన తిని నిన్ను వీధిలో పడేస్తుంది. నీ గతి అధ్వానమే. జాగ్రత్త. భర్తా, పిల్లలూ లేకపోతే ఆడదాని బ్రతుకు వ్యర్ధమే. ఆడదానికి మగవాడి తోడు వుండాలి" గుర్తుపెట్టుకో అంటూ హితబోధ చేసింది.

ఆమె మాటలు విన్నాక మనసులో ఏదో తెలియని ఆశ కదలాడింది. కువైట్‌కి వెళ్ళిన వెంటనే రాజేష్‌ను కలవాలని నిశ్చయించుకుంది ధనలక్ష్మి. అతడు తన తప్పును క్షమిస్తాడని మరలా జీవితంలోకి ఆహ్వానిస్తాడనే నమ్మకంతో కువైట్‌లో ఫ్లయిట్ దిగింది ఆమె.

## *ధనలక్ష్మి కథ*

**బట్టలన్నీ** మడతపెట్టి సూట్‌కేసులో సర్దుకుంటోంది ధనలక్ష్మి. ముఖంలో ఏ దిగులూ బాధా భయమూ అస్సలు కనబడటం లేదు. ఎందుకుంటాయి? భర్తమీదకాస్త ప్రేమా, ఇష్టమూ ఉండి వుంటే కాస్త దిగులు వుంటుంది.

అవేవీ లేని ఒక జడపదార్థం ఈ స్త్రీ. తన ఖర్మకాలి తన పాలబడింది. ఎంతగానో అడ్జస్ట్ అయిపోయి సంసారాన్ని సరిదిద్దుకోవాలని సరదాలు తీర్చుకోవాలని ఆశించాడు. కానీ ఆమెలో ఏ మాత్రం స్త్రీతత్వం కనిపించలేదు. తాళి కట్టిన భర్తపట్ల కాస్త అనురాగం ఆప్యాయత మచ్చుకైనా కనబడలేదు. మొదట్లో సిగ్గు పడుతోంది అనుకుని తానే చొరవగా మాట్లాడి దగ్గర చేరేవాడు. కానీ తనలో ఏదో అయిష్టత చలనం లేని జడత్వం, రాయిలా నిలబడే వైనం ఆఖరికి విసుగు తెప్పించింది. చివరికి తెలిసింది ఏమంటే కువైట్‌లో పని చేసుకునే భర్తంటే తనకి చులకన భావమని తనంటే ఇష్టంలేదని. ఏదో తల్లిదండ్రుల బలవంతం మీద పెళ్ళి చేసుకుంది. సరే కనీసం సమాజం కోసమైనా కాపురం చెయ్యాలి కదా?

సరే, పెళ్ళి అయ్యాక తనని కూడా కువైట్‌కి పిలిపిస్తే దగ్గర వుంటుంది. అలవాటవుతుంది. అనురాగం పుడుతుంది అనుకుని ఆశ కలిగింది రాజేష్‌కి. "కువైట్‌కి వస్తావా?" అని అడిగితే అపుడు సరే అంది. సరే అనడం ఆలశ్యం లక్షరూపాయలు అప్పుచేసి వీసా కొని పంపించాడు. ఇంకో యాభైవేలు పైన ఖర్చులకి ఫ్లయిట్ టిక్కెట్లకి కూడా అప్పే చేయాల్సి వచ్చింది. డబ్బు పోతే పోయింది. ఇక్కడికి వస్తే తనకి ఆసరాగా వుంటుంది. తన వంట తానే వండుకుని తినడం ఎంతో కష్టంగా వుంది. కనీసం ఇంట్లో వుండి తనకు వంట చేసి పెడితే చాలు అనుకున్నాడు రాజేష్.

కువైట్‌లో ఫ్లయిట్ దిగి భర్తను చూడగానే ఆమెలో ఏ భావమూ లేదు. కొంచెమైనా సంతోషిస్తుందని రాజేష్ భావించాడు. కానీ తను ఎప్పటిలా ముభావంగానే వుంది. వచ్చిందేగానీ తనవల్ల ఏ సుఖమూ లేదు. ముద్దూ ముచ్చటా అస్సలే లేదు. తనపని తను చూసుకునేది. అస్సలు భర్త అనేవాడు వున్నాడు అనే భావమే తనలో కనిపించేది కాదు. ఏదో తిరస్కారం అసహ్యామైన భావం ఆమెలో కనిపించేవి. చాలా కృంగిపోయాడు రాజేష్. అప్పటికీ ఎన్నోసార్లు ప్రేమగా దగ్గరికి తీసుకున్నాడు. తన ప్రేమతో ఆమెలో మార్పు వస్తుందని ఆశపడ్డాడు కానీ అది అడియాసే అయింది. దగ్గరికి వెళితే రాయిలా బిగుసుకుపోయేది.

దాదాపు నెలరోజులు గడిచిపోయాయి. ప్రతిరోజూ "మా అమ్మను చూడాలి. మా అమ్మను చూడకుండా నేను వుండలేను నేను ఇండియా వెళ్ళిపోతాను" అని మొండికేసింది. నయానా భయానా నచ్చచెప్పడానికి ఎంతగానో ప్రయత్నించాడు రాజేష్. అస్సలు ఒప్పుకోలేదు ధనలక్ష్మి.

తనమీద తనకే అసహ్యమేసింది రాజేష్‌కి. తనతోపాటు పెళ్ళి అయినవాళ్ళు అందరూ హాయిగా సంతోషంగా కాపురాలు చేసుకుంటుంటే తనకి ఆ సుఖం ఎడారిలో ఎండమావిలా ఎదురుగా కనిపించి వెక్కిరిస్తోంది.

"ఇంత ఖర్చుపెట్టి, శ్రమపడి వీసాకొని నీకు పంపించి ఇక్కడికి పిలిపించాను. కనీసం ఒక సంవత్సరమయినా వుండు" అని ప్రాధేయపడ్డాడు రాజేష్.

"తన తల్లిని చూడకపోతే, ఆమె దగ్గర లేకపోతే తను బ్రతకలేనని" తేల్చి చెప్పేసింది ధనలక్ష్మి. తల్లిమీద ఆమెకున్న ప్రేమకు, తనపట్ల వున్న అయిష్టతకు పొందిక కుదరక తల్లడిల్లిపోయాడు రాజేష్.

"నన్ను వెంటనే ఇండియాకు పంపిస్తావా? లేదా?" అని మొండికేసింది ఆమె. తలనొప్పి అంటూ మంచంపై పడుకుని మూలుగుతూ ఏడుస్తూ నానా హంగామా చేసింది. ఆమె గోల భరించలేకపోయాడు రాజేష్. పెళ్ళి గురించి ఎన్ని కలలు కన్నాడు? కువైట్‌లో తను ఒంటరిగా గడిపిన రోజులకు స్వస్తి పలకాలని భార్యతో ముద్దూ ముచ్చటా తీర్చుకోవాలనీ అరేబియా సంద్రపు ఒడ్డున అలలతో ఆడుకోవాలని ఇసుకలో కలిసి నడుస్తూ కబుర్లెన్నో చెప్పుకోవాలని ఆశపడ్డాడు.

కానీ ఈ జన్మకు ఆ యోగం లేనట్లుంది. దగ్గరికి వెళితే పురుగును చూసినట్లుగా చూస్తోంది ఆమె.

ఇదేం ఖర్మ తనకి? చిన్న స్పర్శకి, చిరు ముద్దుకి, కాస్తంత ఆప్యాయతకి తాను అర్హుడు కాడా? తాళి కట్టిన భర్తని ప్రేమించి, లాలించి కాపురం చేయాల్సిన బాధ్యత స్త్రీకి లేదా? తనిష్టమేనా? మరి తన తల్లిని అంతగా ప్రేమిస్తోందే, భర్తని ప్రేమించడానికి ఏం రోగం? తనని కువైట్‌కి తీసుకు వచ్చి దగ్గరగా వుంచుకుంటే కనీసం తనలో మార్పు వస్తుందని ఆశపడ్డాడు కానీ తనవల్ల ఇంకా పీకల్లోతు అప్పుల్లోకి కూరుకుపోయాడు. ఆ అప్పులు వాటికి వడ్డీలు తీర్చడానికి ఇంకెన్ని రోజులు కష్టపడాలో?

పదిరోజులు ఓపికగా ఆమెను మార్చాలని, కువైట్‌లో వుండేలా చేయాలని ప్రయత్నించాడు రాజేష్. ఎన్నో మంచి మాటలు చెప్పాడు. ఎంతో ప్రేమను చూపించాడు. కానీ ఏం లాభం లేకపోయింది. తన ధోరణిలో ఏ మార్పూ లేదు. ఇండియాకు వెళ్ళిపోతాను

అంటుందే తప్ప కనీసం నాలుగునెలలయినా వుంటాను అని అనడంలేదు. కోపంతో జుట్టు పీక్కోవాలనిపించింది రాజేష్‌కి. ఇది భార్యా? లేక మెడకు తగిలించుకున్న బండరాయా? అనిపించింది.

ఇక పోరు భరించలేక, ప్రతిరోజూ ఆ తలనొప్పిని చూడలేక "సరే వెళ్ళిపో. సంతోషంగా నీ తల్లిదగ్గరకి పో" అనేసాడు రాజేష్. ఆమె ఇక్కడ వుండి తనకు కూడా తలనొప్పిని తెచ్చిపెడుతోందే తప్ప ఏ సుఖమూ సంతోషమూ కలిగించడంలేదు. ఇవికాక ముందున్న అప్పును తలుచుకుంటుంటే గుండెలోని భయం పెరిగిపోతోంది. ఈ పెళ్ళి తన ముప్పుకే అనిపించింది రాజేష్‌కి.

వెళ్ళిపో అనగానే హుషారుగా మంచంపైనుండి లేచి బట్టలు సర్దుకోవడం మొదలుపెట్టింది ధనలక్ష్మి.

భర్త ఎలా వంటచేసుకుంటాడు. ఏం తింటాడు? ఇక్కడ ఒంటరిగా ఎలా వుండాడు? అనే ఆలోచన, ఇంగిత జ్ఞానం స్త్రీకి కాస్తయినా లేకపోయినందుకు చింతించాడు రాజేష్. ఆమె కఠిన హృదయాన్ని చూసి ఆశ్చర్యపడ్డాడు.

నాలుగు నెలల క్రితం పెళ్ళికాకముందు తన బ్రతుకు సంతోషంగా వుండేది. దేశాన్ని విడిచి వచ్చినా ఒంటరిగా ఈ ఎడారి దేశంలో కష్టపడి పని చేసుకుంటున్నా ఏదో ఆశ తనలో వుండేది. భవిష్యత్తు ఆనందంగా వుంటుంది. మంచి భార్య దొరుకుతుంది అనే భావం సంతోషాన్ని నింపేవి.

ఒకరోజు అమ్మా నాన్నలు "ఒరేయ్ రాజేష్ నీకోసం ఒక పిల్లను చూసాం. పిల్ల చక్కగా పేరుకు తగినట్లు లక్ష్మీదేవిలా వుంది. కట్నం ఇచ్చుకోలేరు గానీ పిల్ల నీ ప్రక్కన జోడుగా బావుంటుంది. వచ్చి ఒకసారి చూసావంటే ముహూర్తాలు పెట్టుకుందాం" అని ఫోనులో చెప్పారు.

సరే ఎప్పటికైనా పెళ్ళంటూ చేసుకుని జీవితంలో సెటిల్ అవ్వాల్సిందే కదా? అందులో ఇక్కడ నాలుగేళ్ళుగా ఒంటరిగా వుండటం చాలా కష్టంగా వుంది. పెళ్ళి చేసుకుని భార్యను ఇక్కడికి తీసుకొచ్చి స్వర్గాన్ని ఇక్కడే సృష్టించుకోవచ్చు. పిల్ల బావుంది అంటున్నారు కాబట్టి వెళ్ళి చూద్దాం అనుకుని వెంటనే ప్రయాణమై వెళ్ళాడు. పిల్ల ముభావంగా వుంటే అదంతా సిగ్గులే అని అందరూ సర్ది చెప్పుకున్నారు. కానీ తను తన తల్లిని, చెల్లెళ్ళనూ వదిలి వుండలేదని, పెళ్ళి విలువ తెలియని మూర్ఖురాలని అర్థం చేసుకోలేకపోయారు. కనీసం దగ్గరగా వుంటే భర్తను ప్రేమిస్తుంది అనుకుని ఎన్నో కష్టాలు భరించి వీసాకొని పంపిస్తే ఇపుడు నెలరోజులు కూడా వుండకుండా వెళ్ళిపోతానని మొండికేస్తోంది ధనలక్ష్మి. తన జీవితమంతా ఎడారిలా మారిపోయినట్లు భావించాడు రాజేష్. తన బాధనంతా హృదయంలో దాచుకోలేక ఫ్రెండ్‌కు చెప్పుకుంటే వాడు అంటాడు. "తన తల్లికోసం వెళుతోందో లేక అక్కడ తనకు వున్న తన ప్రేమికుడికోసం వెళుతోందో కనుక్కో. లేకపోతే భర్తతో కాపురం చేయడానికి దగ్గర వుండటానికి ఏ స్త్రీ అయినా ఎంతో అదృష్టంగా భావిస్తుంది" అంటూ లేనిపోని సందేహాలు కలిగించాడు.

మరి పెళ్ళయిన పిల్ల తల్లిని వదిలి వుండలేకపోవడం ఏమిటి? విచిత్రం కాదా?

మరి ఎవరో ప్రియుడే వుంటే తనని పెళ్ళి చేసుకోవడానికి ఎందుకు ఒప్పుకుంది? తన జీవితం ఎందుకు నాశనం చేసింది? ఆలోచించి బుర్ర పగిలిపోతోంది రాజేష్‌కి. తను హుషారుగా, సంతోషంగా తిరుగు ప్రయాణానికి బట్టలు సర్దుకుంటుంటే కోపంతో వళ్ళుమండిపోతోంది రాజేష్‌కి. ఏమీ చేయలేని నిస్సహాయతతో నిస్సత్తువ ఆవహించింది.

రాజేష్ బాధను లెక్కపెట్టకుండా వెళ్ళిపోయింది ధనలక్ష్మి. గట్టి మనసు చేసుకుని జీవించడానికి, చేసిన అప్పులు తీర్చడానికి సంవత్సరకాలం పట్టింది అతడికి.

ఇంటికి వెళ్ళిన ధనలక్ష్మి అమ్మగారింట్లోనే వుంటోందని, కనీసం అత్తమామలను చూడటానికయినా తమ ఇంటికి రావడం లేదని చెప్పి బాధపడింది రాజేష్ వాళ్ళమ్మ. ఫోను చేసినప్పుడల్లా కొడుకు జీవితం చేజేతులా పాడుచేసామని చెప్పి వాపోయేది. ధనలక్ష్మితో విడాకులు ఇప్పించేసి కొడుక్కు ఇంకో పెళ్ళి చేయాలనికూడా రాజేష్ తల్లిదండ్రులు నిశ్చయించుకున్నారు. ఆ విషయమే కొడుకుతో చెపితే గయ్‌మని అంతెత్తున లేచాడు రాజేష్.

''జరిగింది చాలు. ఇక నాకు ఓపిక లేదు. నన్నిలా ఇక్కడ కువైట్‌లో ప్రశాంతంగా బ్రతకనివ్వండి'' అనేవాడు అతడు.

ఏం చెయ్యాలో కొడుకు కాపురం మూడ్నాళ్ళ ముచ్చటగా ఎందుకు ముగిసిపోయిందో అర్థం కాలేదు వారికి. వాళ్ళు కూడా కొడుకు పరిస్థితికి దిగులుపడ్డారు. అలా మరో రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. ఈలోపల చేసిన అప్పులన్నీ తీర్చేసి కొంచెం వెనకేసుకున్నాడు రాజేష్.

తనకు పెళ్ళయిందని భార్య అనేది ఒకటి ఇండియాలో వుందనే సంగతి కూడా మరిచిపోయాడు అతడు. పెళ్ళనేది ఒక పీడకలగా అతడి జీవితంలో మిగిలిపోయింది. కాలం అలా గడిచిపోతోంది.

ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించిన ధనలక్ష్మి తల్లి అనారోగ్యంతో మరణించింది. చెల్లెళ్ళు ఇద్దరూ పెళ్ళిచేసుకుని భర్తలే తమపాలిట దైవాలుగా భావించి సంతోషంగా కాపురాలకు వెళ్ళిపోయారు. ఇక ఇంట్లో మిగిలింది అన్నా వదినలు, వారి పిల్లలు. తల్లి మరణం ఆమెను ఎంతో కృంగదీసింది. చెల్లెళ్ళు కూడా పెళ్ళయి వాళ్ళ ఇళ్ళకు వెళ్ళిపోవడంతో ఒంటరితనం క్రమ్ముకుంది.

వదిన ఎప్పటికీ పరాయిదే కదా! అన్న ఆమె చేతిలో ఆటబొమ్మ అయ్యాడు. మొగుడ్ని వదిలేసిన ఆడది అంటూ హేళనగా మాట్లాడేది వదిన. తను దర్జాగా కుర్చీలో కూర్చుని అన్ని పనులూ ధనలక్ష్మి చేతే చేయించేది. ఇంటి పనేకాక పిల్లల పనికూడా ఆమే చేయాల్సి వచ్చేది.

వీటికి తోడు ఇరుగుపొరుగువాళ్ళు ''బంగారంలాంటి మొగుడ్ని విడిచి పుట్టింటికి వచ్చేసావు. ఏం సాధిస్తావు? మొగుడు లేకుండా, పిల్లా పాపా లేకుండా అన్నా వదినలకు చాకిరీ చేసి చస్తావా? నీ మొగుడు ఎంతో ప్రేమతో నిన్ను కువైట్‌కి తీసుకెళితే భర్తను కాదని వచ్చేసావు. ఇప్పుడు ఒంటరిగా ఎలా బ్రతుకుతావు? ఇప్పుడైనా భర్త విలువ తెలుసుకో. వెళ్ళి అతడి కాళ్ళమీద పడు. కనీసం అతడి మనసు కరుగుతుంది'' అని సలహాలు ఇచ్చేవారు.

వదిన హేళన మాటలతో ఇంట్లోని చాకిరీతో ధనలక్ష్మి పొగరంతా అణిగిపోయింది. జీవితం మీద విరక్తి చెందే స్థితికి వచ్చింది దాదాపు నలుగేళ్ళు గడిచిపోయాయి. భర్తను ఎంతో బాధపెట్టి కువైట్ నుండి తిరిగి వచ్చేసింది. అతడ్ని, అతడి బాధను తాను అస్సలు లక్ష్యపెట్టలేదు. ఎంతో అహంకారంతో బాధ్యతలేని స్త్రీగా ప్రవర్తించింది. అందుకే దేవుడు తనకి తగిన శిక్ష వేసాడు. తల్లీ చెల్లెళ్ళూ శాశ్వతం అనుకుంది కానీ కట్టుకున్న భర్తతో గౌరవం వస్తుందని, కుటుంబం లభిస్తుందని తెలుసుకోలేకపోయింది. ఇపుడు ఏ మొహం పెట్టుకుని తిరిగి  ఆయింటికి వెళ్ళగలదు? తన ప్రవర్తనతో వాళ్ళు కూడా విసిగిపోయినట్లున్నారు. ఈ నాలుగేళ్ళలో ఒకసారి కూడా ఎవరూ వచ్చి పలకరించలేదు. తన గురించి అసలు పట్టించుకోలేదు. అయినా తప్పు చేసింది తను. ఇప్పుడు ఎలా తిరిగి వాళ్ళ దగ్గరికి వెళ్ళగలదు? రాజేష్ మగవాడు. అందులో కువైట్‌లో వుంటున్నాడు. ఈ మధ్యకాలంలో  ఎవరినైనా అమ్మాయిని చూసుకుని అక్కడే పెళ్ళి చేసుకున్నాడో ఏమో? ఊహూ అలా జరిగి వుండదు. అతడు అలాంటి వాడు కాదు. తనకు విడాకులు ఇవ్వనిదే మరో పెళ్ళి చేసుకోడు ఇలా ఆలోచిస్తూ ఏం చెయ్యాలో అర్థంకాక వదిన సాధింపులు భరించలేక ఏడుస్తూ కాలం గడపసాగింది ధనలక్ష్మి.

ఒకరోజు ఎదురింటి రాజ్యం నాలుగేళ్ళ తరువాత కువైట్ నుండి ఇంటికి తిరిగి వచ్చింది. ఆమె తెచ్చిన సామాన్లు, వేసుకున్న నగలు చూసి ధనలక్ష్మి వాళ్ళ వదిన చాలా ఈర్ష్య పడింది. "అవేం గొప్ప? ధనలక్ష్మిని కూడా కువైట్‌కి పంపిస్తే బాగా డబ్బు సంపాదించుకుని వస్తుంది. మరి మొగుడ్ని వదిలేసి వచ్చి ఇంట్లో కూర్చుని తింటే ఎలా? వయసులో వున్న ఆడది ఒంటరిగా వుంటే నలుగురూ నాలుగు మాటలు అంటారు. అలా అందరి దగ్గరా అనిపించుకోవడం ఎందుకు? నువు కువైట్‌కి వెళ్ళమ్మా" అంటూ వీసా కోసం ఏజెంటుని సంప్రదించి ధనలక్ష్మి ప్రయాణపు ఏర్పాట్లు చేయసాగింది.

ఇక ఏం చెప్పాలో అర్థం కాలేదు ధనలక్ష్మికి. వదిన మాటలకి ఎదురు చెప్పే ధైర్యం ఆమెకు లేదు. వెళ్ళను అనడానికి ఏ కారణమూ కనబడలేదు. ఇక్కడ వుండి వదిన సాధింపులు భరించి ఆమెకు చాకిరీ చేసేకంటే అలా వెళ్ళిపోవడమే మంచిది అనుకుంది ధనలక్ష్మి. వెళ్ళే ముందు పక్కింటి పిన్నిగారు పిలిచి "ఏమే ధనలక్ష్మి అపుడంటే నీకు తెలివిలేక భర్త విలువ తెలియక కట్టుకున్న మొగుడ్ని వదిలేసి పుట్టింటికి వచ్చేసావు. అందుకు తగ్గ శిక్ష అనుభవించావు. ఇప్పుడైనా బుద్ధి తెచ్చుకుని అక్కడ కువైట్‌లో నీ మొగుడ్ని కలిసి వాడి కాళ్ళమీద పడు. లేకపోతే నీ సంపాదనంతా నీ వదిన తిని నిన్ను వీధిలో పడేస్తుంది. నీ గతి అధ్వానమే. జాగ్రత్త. భర్తా, పిల్లలూ లేకపోతే ఆడదాని బ్రతుకు వ్యర్థమే. ఆడదానికి మగవాడి తోడు వుండాలి" గుర్తుపెట్టుకో అంటూ హితబోధ చేసింది.

ఆమె మాటలు విన్నాక మనసులో ఏదో తెలియని ఆశ కదలాడింది. కువైట్‌కి వెళ్ళిన వెంటనే రాజేష్‌ను కలవాలని నిశ్చయించుకుంది ధనలక్ష్మి. అతడు తన తప్పును క్షమిస్తాడని మరలా జీవితంలోకి ఆహ్వానిస్తాడనే నమ్మకంతో కువైట్‌లో ఫ్లయిట్ దిగింది ఆమె.

## *నిషా చెప్పిన కథ*

**"హాయ్ దీదీ** ఈ శారీలో మీరు చాలా అందంగా వున్నారు. అచ్చం మా అక్కలాగే కనిపిస్తున్నారు. అందుకే దీదీ అంటున్నాను ఏమీ అనుకోరు కదా?" మెరిసే కళ్ళతో నన్ను పలకరించింది నిషా.

"అనుకోడానికి ఏముంది? అలాగే పిలువు. నాక్కూడా నీలాంటి చెల్లెళ్ళు ఇండియాలో వున్నారులే" అన్నాను చిన్నగా నవ్వుతూ.

"థాంక్యూ. నేను ఈ ప్రక్క రూములోనే వుంటున్నాను భూటాన్ నుండి మొన్నే వచ్చాను. రేపు డ్యూటీలో జాయిన్ అవ్వాలి. ఈ కువైట్ దేశం, అకామిడేషను ఇక్కడ అంతా క్రొత్తగా వుంది. ప్రొద్దుటినుండీ ఒక్కదాన్నే రూములో కూర్చుని బోరుగా కూడా వుంది. మీరు కనిపించడం మీతో మాట్లాడటం సంతోషంగా వుంది. గలగలా మాట్లాడుతోంది తను.

"ఓహో నువ్వు భూటాన్ నుంచి వచ్చావా? మంచిది. ఇక్కడ హోటల్‌లో ఏ డిపార్ట్‌మెంట్‌లో పని?" అడిగాను తనకి కూడా ఓ కప్పు టీ అందిస్తూ.

"బాంక్వెట్ డిపార్ట్‌మెంట్లో పని దీదీ. మీటింగులు, పెళ్ళిళ్ళూ, పార్టీలతో అక్కడ సందడే సందడి. అయితే రాత్రిళ్ళు పార్టీలువుంటాయి కాబట్టి నిద్ర తక్కువగా వుంటుంది."

"అలాగా! క్రొత్తగా వచ్చావు కదా నీకు ఏమైనా అవసరం అయితే నాకు చెప్పు. కిచెన్‌లో నీకు ఏదన్నా కావాలంటే నా సామాన్లు ఇదిగో ఇటువైపు అలమారాలో వున్నాయి. వండుకోవటానికి పాత్రలన్నీ ఈ క్రిందివైపు వుంచాను. నిరభ్యంతరంగా తీసుకుని వాడుకో. మరలా వాటిని కడిగి యధావిధిగా అదే స్థానంలో వుంచితే అంతే చాలు" అన్నాను.

"అలాగే. నీక్కూడా ఏదైనా సహాయం అవసరం అయితే చెప్పు. నేను చేస్తాను. ప్రక్కనే ఈ చెల్లి వుందనే సంగతి మరిచిపోవద్దు" చెప్పింది నేనిచ్చిన టీ త్రాగుతూ.

గుండ్రటి మొహం, వత్తుగా నుదిటిపైకి పడుతున్న జుట్టు. తెల్లటి వళ్ళు, కాస్త పొట్టిగా వున్నా అందంగా అంతకు మించిన ఏదో ఆకర్షణతో కళ్ళను ఆకట్టుకుంటోంది ఆ అమ్మాయి.

ఈ అమ్మాయి ముఖంలో ఏదో కళవుంది అనుకున్నాను నేను మనసులో.

కొంచెం రిజర్వుడుగా వుండే నేను తక్కువమందితోనే మాట్లాడటం జరుగుతుంది. నా పనేదో నేను చూసుకుంటుంటాను. పనికట్టుకుని మనుషుల్ని పలకరించడం, కబుర్లు చెప్పడం నాకు చేతకాని పని. అందుకే నాకు స్నేహితులు తక్కువే వుంటారు. గుంపులు, గ్రూపులు మనకు అక్కరలేదు కానీ మంచివాళ్ళు పదిమంది వున్నా చాలు అనుకుంటుంటాను. భావాలు కలవకుండా, అలవాట్లు నచ్చకుండా, అభిరుచులు సరిపడకుండా స్నేహం చెయ్యడం నాకు అసాధ్యం. అందుకే ఆ అమ్మాయే వచ్చి ప్రత్యేకంగా దీదీ అంటూ పలకరించి కలుపుగోరుగా మాట్లాడటం ఒక విధంగా నాకు కూడా సంతోషంగానే అనిపించింది. ప్రక్కనే రూములో వుంటోంది కాబట్టి నాక్కూడా పలుకుతోడు అనుకున్నాను. వెంటనే వార్డు రోబ్ తెరిచి తనకి సరిపడే బట్టలన్నీ ఎంచి బయటకి తీసి. "ఇవిగో ఇవన్నీ నీకే తీసుకో" అన్నాను.

నా వార్డు రోబ్‌లు, బట్టలు పరికించి చూసి "అబ్బ దీదీ ఎన్ని చీరలు, ఎన్ని డ్రస్సులు? ఎంత కలెక్షన్ వుందో మీ దగ్గర. అన్నీ చాలా బాగున్నాయి. షాపింగ్ అంటే మీకిష్టమా?"

"అది ఇష్టం కాదుకానీ ఒక విధమైన పిచ్చి అని చెప్పాలి. షాపింగుల్లో కూడా రకాలుంటాయి. టైమ్ పాస్ షాపింగు, డిప్రెషను షాపింగులాంటివి. ఒక్కోసారి అలా వెళ్ళడం బోలెడు బట్టలు చెప్పులు కొనుక్కొచ్చి ఇలా వార్డ్‌రోబ్ నింపెయ్యడం. ప్రతిసారీ అనవసరంగా షాపింగ్ చెయ్యకూడదు, డబ్బు వేస్ట్ చెయ్యకూడదు అని గట్టిగా నిశ్చయించుకోవడం, మరలా రెండు రోజులకి మర్చిపోయి షాపింగ్‌కి వెళ్ళి నచ్చినవన్నీ కొనేయడం. అలా గడుస్తోంది జీవితం" అన్నాను నవ్వుతూ.

"అదొక రిలాక్సేషను. అందులో ఎంతో ఆనందం దాగి వుంది కదా" అంది తనూ వంతపాడుతూ.

"ఇదిగో ఇవన్నీ ఇంకా లేబుల్స్ తీయలేదు. క్రొత్తవే. అపుడెపుడో నాలుగేళ్ళ క్రితం కొన్నవి. ఈ నాలుగేళ్ళలో బాగా లావయ్యాను కదా. అవి చిన్న సైజు అయిపోయాయి అందుకే వాడలేదు. నువు తీసుకుని వేసుకో " అన్నాను బట్టలన్నీ మడిచి షాపింగ్ బాగ్‌లో పెట్టి చేతికి అందిస్తూ.

"థాంక్స్ దీదీ. కొనడం గొప్ప విషయంకాదు కానీ వేరేవాళ్ళకి ఇవ్వడం గొప్ప విషయం" అంది బట్టల్ని ఇష్టంగా చూసుకుంటూ.

"మీ భూటాన్‌ని రాజు పరిపాలిస్తాడు కదా! ఎలా వుంటుంది అక్కడి వాతావరణం, మీ జీవిత విధానం?" ఆసక్తిగా అడిగాను.

"అవును దీదీ. రాజరికమే మమ్మల్ని పాలిస్తోంది. మా దేశం హిమాలయ పర్వత సానువుల్లో వుంటుంది కాబట్టి వేసవి కాలం బహు తక్కువ. చలి ఎక్కువగా వుంటుంది. భూటాన్ కొండలతో, లోయలతో పచ్చటి చెట్లతో అందంగా వుంటుంది. ఒకసారి మా దేశం చూడటానికి రండి. భూటాన్ వచ్చే భారతీయులకి వీసా అక్కరలేదు" చెప్పింది.

"అక్కడ బౌద్ధమతాన్ని ఎక్కువగా అనుసరిస్తున్నారనుకుంటా"

"అవును దీదీ తొంభైశాతం ప్రజలు బౌద్ధమతస్తులే."

"సరే నాకు క్రొత్త ప్రదేశాల్ని చూడటమంటే చాలా ఇష్టం. తప్పకుండా తరువాత సెలవల్లో చూడాలనుకుంటున్నాను" చెప్పాను ఆసక్తిగా.

"అలాగే దీదీ తప్పకుండా.  ఈ రోజు నేను మెడికల్‌కి వెళ్ళాలి. టైమయింది. నేను ఇక వెళతాను. మరలా కలుద్దాం" అంటూ వెళ్ళిపోయింది.

రెండు రోజుల తరువాత అనుకుంటాను సాయంత్రప్పూట చల్లగాలి కోసం కిటికీ తలుపు తెరిచి బయటకి చూస్తూ నిలబడ్డాను. క్రింద గార్డెన్‌లో కనిపించిన దృశ్యం నాకు చాలా బాధను కలిగించింది. మూడో అంతస్తులో వున్న నేను కిందకి చూసి నా కళ్ళను నేనే నమ్మలేక మరలా ఒకసారి పరీక్షగా పరిశీలించి క్రిందకి చూసాను.

అక్కడ గార్డెన్‌లో వున్న బెంచీలపై నలుగురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు కూచుని ఉన్నారు. ఇదంతా రోజూ అక్కడ కనిపించే విషయమే. ఇందులో ఆశ్చర్యం ఏమీలేదు.

వాళ్ళు నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటూ సిగరెట్లు కాలుస్తున్నారు. ఇదికూడా అక్కడ మామూలుగా జరిగే సంగతే క్రొత్త వింతేమీ కాదు ఈ మధ్యే సంవత్సరం క్రితం మా అకామిడేషను లోపల స్మోక్ చేయడం నిషేధించాక పొగ త్రాగేవాళ్ళందరూ బయట రోడ్డులో నిలబడో, కారు పార్కింగులోనో క్రింద వున్న గార్డెన్‌లోనో సిగరెట్లు కాల్చుకుంటున్నారు. ఈ తంతు రోజూ జరిగేదే కానీ నన్ను ఆశ్చర్యానికి, అసహనానికి గురిచేసిన సంగతి ఏంటంటే నన్ను 'దీదీ' అని పిలిచిన నిషా అక్కడ వుండటం. వుంటే వుంది. ఏదో కాలక్షేపానికి అనుకుంటాను కానీ తన చేతిలో ఎర్రగ కాలుతున్న సిగరెట్టు, ఎంతో అలవాటున్నదానిలా వేళ్ళతో పట్టుకుని పెదాల మధ్య చేర్చి తన్మయత్వంతో పొగను పీల్చి రింగులుగా గాల్లోకి వదులుతోంది. ఒక్కసారిగా ఆ అమ్మాయిని అలా చూసి నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. ఈ మధ్య అమ్మాయిలు కూడా పొగ త్రాగడం, డ్రింక్ చేయడం మామూలైపోయిందిట. అది కల్చర్ అట. సొసైటీలో సోషల్‌గా వుండటం అంట. దరిద్రమేం గాదూ పోయేకాలం కాకపోతే. తిట్టుకున్నాను మనసులో.

కానీ నిషాకు కూడా ఈ పాడు అలవాటు వుందా? అయ్యో సిగరెట్ వాసన అస్సలు పడదు నాకు. ఆమడ దూరంలో సిగరెట్ కాల్చుతున్నా ఆ పొగ ఎంతో ఘాటుగా వచ్చి చేరి తలనొప్పిని తెప్పిస్తుంది. స్మోక్ చేసే వాళ్ళంటే అసహ్యం నాకు. గాలిని కలుషితం చేస్తూ వారి ఆరోగ్యాన్నే కాక చుట్టూ వున్న వారి ఆరోగ్యానికి కూడా హాని కలుగజేసే స్మోకర్స్‌ని ఊర్లో వుండనివ్వకుండా ఎడారుల్లో త్రోసెయ్యాలి అనేది నా కోరిక.

గార్డెన్‌లోని బెంచ్‌పై చేరగిలబడి కూర్చుని అనుభవం కలిగిన దానిలా సిగరెట్ పొగపీలుస్తూ అరమోడ్పు కనులతో గాల్లోకి రింగులు వదులుతూ అంతులేని ఆనందాన్ని అనుభవిస్తోంది నిషా. ఆ స్థితిలో ఆ పిల్లను చూసి నాకు చాలాకోపం వచ్చింది. ఛీ..ఛీ బుద్ధిలేదు ఈ పిల్లకి. కనిపిస్తే కాస్త గడ్డిపెట్టాలి. దీదీ అని ఆప్యాయంగా పిలిస్తే మంచి పిల్ల అనుకున్నాను. కానీ చెడు అలవాట్లు గల పిల్ల అని ఇపుడే తెలుస్తోంది.

అబ్బ సిగరెట్ త్రాగే వాళ్ళతో మాట్లాడటం. ఇష్టం వుండదు నాకు. స్నేహం చెయ్యడం కూడానా? కిటికీని మూసేస్తూ.. ఇంకోసారి ఆ పిల్లను నా రూంలోకి కూడా రానివ్వకూడదని గట్టిగా నిశ్చయించుకున్నాను నేను.

ఆ సమయంలో థియేటర్లలో సినిమాకు ముందుగా వేసే ముఖేష్ యాడ్ గుర్తొచ్చింది నాకు.

మరుసటిరోజు సాయంత్రం డ్యూటీ ముగించుకుని బయటికి వచ్చేసరికి స్మోకింగ్ ఏరియాలో కనిపించింది నిషా. ఒక్కటే అక్కడ వున్న సిమెంటు చప్టాకు చేరగిలబడి ఆకాశంలోకి చూస్తూ సిగరెట్ కాలుస్తోంది. ఏదో ఆలోచనలో వున్నట్లుంది. ఆ ప్రక్కనే నేను వెళుతుంటే కూడా నన్ను గమనించలేదు. ఒకవేళ ఆ పిల్ల నన్ను పలకరించినా నాకు ఆ పిల్లతో మాట్లాడాలని లేదు. ఎందుకంటే సిగరెట్ తాగే పిల్లతో ఏం మాటలుంటాయి? మాట్లాడాలన్నా ఇబ్బందిగా ఉంటుంది.

ఈ పిల్లకు అంత ఆలోచన ఏంటో? ఇష్టంగా సిగరెట్ తాగుతోంది కదా? ఆ ఆనందాన్ని అనుభవించవచ్చుకదా అనుకున్నాను నేను.

ఒకరోజు తెల్లవారు ఝామున నాలుగుగంటలకి మంచి నిద్రలో వున్నాను నేను. ఎవరో వెక్కి వెక్కి ఏడుస్తున్న శబ్దానికి హఠాత్తుగా మెలుకువ వచ్చింది. ఎవరు ఏడుస్తున్నారో ఏమిటో? కలో నిజమో అరనిముషం నాకు అర్థంకాలేదు. ఈ టైమ్‌లో ఏడుపు ఎవరిది? ఎక్కడినుంచి అనుకుంటూ కళ్ళు నులుముకుంటూ మంచంపై లేచి కూర్చున్నాను. నిజం చెప్పద్దూ తలుపు తీసి బాత్‌రూమ్‌కి వెళ్ళాలన్నా భయం కలిగి రెండు నిముషాలు అలాగే కూర్చుండిపోయాను. ఈ లోపల ఏడుపు ఇంకాస్త ఎక్కువై వినిపించడంతో ధైర్యం తెచ్చుకుని నా రూమ్ తలుపు తీసి హాల్లోకి వచ్చాను. అక్కడ సోఫాలో పడుకున్న నిషా 'ఊ..ఊ' అంటూ ఏడుస్తూ చేతులతో కన్నీళ్ళు తుడుచుకుంటోంది.

దగ్గరికి వెళ్ళాలన్నా భయవేసింది. దూరంగా నా తలుపు దగ్గరే నిలబడిపోయి "ఏయ్ నిషా ఏమయింది నీకు ఎందుకు ఏడుస్తున్నావు?" ప్రశ్నించాను గాభరాగా. నన్ను చూసి పడుకున్నదల్లా లేచి సోఫాలో కూర్చుంది.

"దీదీ ఇంతపని జరుగుతుందని అనుకోలేదు. నేను అనుకున్నది ఒక్కటి జరిగింది మరొకటి. ఇపుడు నాకేం చెయ్యాలో తెలియని స్థితి. దిక్కుతోచని పరిస్థితిలో ఇక్కడ చిక్కుకు పోయాను. ఈ కష్టం నుండి నన్ను దేవుడే కాపాడాలి దీదీ. ఏమయిపోతానో అని భయంగా వుంది" నా చేతులు పట్టుకుని ఏడుస్తోంది నిషా.

"ఏయ్ ఎందుకు ఏడుస్తున్నావు? ఏం జరిగిందో చెప్పు"

"దీదీ న్నాలోజులు క్రితం మెడికల్ చెకప్‌కి వెళ్ళాను కదా? ఆ రిజల్ట్స్ వచ్చాయి. అందులో నాకు టి.బి వుందని తెలిసింది. ఇప్పుడు నన్ను ఇక్కడ టి.బి హాస్పిటల్‌లో వుంచుతారంట. తరువాత మా దేశం భూటాన్‌కి పంపేస్తారంట. నేనేమో ఎన్నో ఆశలతో, ఎంతో భవిష్యత్తు ఇక్కడ వుందని ఈ కువైట్‌కి వచ్చాను. కానీ ఈ రోగం వుందని బయట పడింది. ఇపుడు వీళ్ళు నన్నేం చేస్తారో ఏమో?"

"ఆ ఇది నిజమా? నీకు టి.బి వుందని చెప్పారా?" ఒక్కసారిగా మ్రాన్పడిపోయాను నేను. నోటమాటరాలేదు నాకు.

బొద్దుగా, ముద్దుగా, చలాకీగా కనిపించే నిషాకు టి.బినా? నిండా ఇరవై నాలుగేళ్ళు లేవు. ఇంత చిన్న వయసులో ఇంత పెద్ద జబ్బా? ఒక్క నిముషం గుర్తొచ్చింది నిషా గార్డెన్‌లో కూర్చుని సిగరెట్ పీలుస్తున్న సంగతి.

"హేయ్ న్నాలోజుల్నుండీ అడుగుదామనుకుంటున్నాను. నువు బాగా సిగరెట్లు తాగుతావనుకుంటా కదా? హుమ్... అందుకే ఈ టి.బి అటాక్ అయి వుంటుంది. సిగరెట్లు త్రాగడం ఆరోగ్యానికి మంచిదికాదు కదా? మరి ఆ పాడు అలవాటు నీకెలా అబ్బింది. ఇప్పుడు చూసావా ఎంత పని జరిగిందో? ఇంత పెద్ద జబ్బు వచ్చేసింది కదా! ఇక నువ్వు ఉద్యోగం చెయ్యలేవు. ఇప్పుడు హాస్పిటల్‌లో ఎన్ని రోజులు వుండాలో తెలియదు? ఇదంతా నువుచేతులారా చేసుకున్న నష్టం కదా? ఎంత బాధ, ఎంత తలనొప్పి నీ జీవితం ఏమవుతుంది? " అది సమయం కాకపోయినా బాధతో కోపంతో అనాల్సిన నాలుగు మాటలు వెళ్ళగక్కాను నేను. ఒక వేదాంతిలా నవ్వింది నిషా. దీదీ ప్రతి ఒక్క పనికీ వెనుక ఒక కారణం వుంటుంది. ఆ కారణాలే జీవితాన్ని శాసిస్తాయి. నడిపిస్తాయి. ఒక బౌద్ధ గురువులా నాకు జీవితసత్యాన్ని బోధిస్తోంది నిషా.

సిగరెట్ త్రాగడానికి కారణాలుంటాయా? దురలవాటుకు లోనవడానికి ఎన్నో కారణాలుండచ్చు కానీ వాటికి లోబడకూడదు కదా? ఆ పాడు అలవాటువల్ల ఇప్పుడెంత మూల్యం చెల్లించాలో చూడు అన్నాను ఇంకా నా వాదన వినిపిస్తూ.

నాతో మాటల్లో పడి తన ఏడుపు మరిచిపోయింది నిషా.

"దీదీ నాకీ అలవాటు ఎలా మొదలయిందో తెలియాలంటే నీకు నా కథ మొత్తం చెప్పాలి. అప్పుడే నీకు అన్ని విషయాలూ అర్థం అవుతాయి. నీకు వినే ఓపిక వుంటే చెపుతాను" అంది కాళ్ళు మడిచి పైన సోఫాలో పెట్టుకుని కూర్చుంటూ.



కథ వినడం నాకెంతో ఇష్టం. అందునా జీవితంలో జరిగే కథలు చాలా ఆసక్తికరంగా వుంటాయి. "చెప్పు వింటాను" అన్నాను నేనూ ఎదురుగా వున్నా సోఫా కోచ్‌లో కూర్చుంటూ.

"మా భూటాన్ చాలా చిన్నదేశం, మీ భారత దేశంలోని ఒక రాష్ట్రం ఎంత వుంటుందో మా దేశం అంతే వుంటుంది. మాప్ చూస్తే భూటాన్ కూడా భారతదేశంలో అంతర్భాగంగా కలిసిపోయి కనిపిస్తుంది. అది వేరే దేశమని అనిపించదు.

హిమాలయ పర్వత సానువుల్లో వున్న మా భూటాన్ ఎంతో సుందరమైనది. ప్రకృతి ఒడిలో పెరిగిన వాళ్ళం మేము. కొండలు లోయలతో కూడిన ప్రదేశాల్లో మేము నివసిస్తుంటాము. పేద కుటుంబం మాది. మా తండ్రి గొర్రెల వ్యాపారం చేస్తారు. నేను నాలుగునెలల బిడ్డగా వున్నప్పుడు కొండచరియలు విరిగి మా యింటిపై పడటంతో మా అమ్మ చనిపోయింది. అద్భుతం ఏంటంటే ఆ సమయంలో మా అమ్మ ఒడిలో పడుకుని పాలుత్రాగుతున్న నేను బ్రతికిపోయాను.

మా అమ్మతన గుండెలకి నన్ను హత్తుకుని నేలమీదకి ఒరిగిపోయి నా ప్రాణాలు కాపాడి తన ప్రాణాలని వదిలేసింది. ఆమె ఒడిలో వున్న నేను బ్రతికిపోయాను.

తరువాత మా నాన్న ఇంకో పెళ్ళి చేసుకున్నాడు. సవితి తల్లి నన్ను ఎన్నో కష్టాలకు గురిచేసింది. స్కూలుకు కూడా సరిగ్గా వెళ్ళనివ్వకుండా గొర్రెలు కాయడానికి పంపించేది. అపుడపుడూ స్కూలుకు వెళ్ళి అలా చదివి టెన్త్‌క్లాస్ పాసయ్యాను నేను. మేము నివసించే ప్రాంతంలో నీళ్ళు కూడా గడ్డకట్టిపోయేంతటి చలివుంటుంది. ఇంట్లో ఎపుడూ హీటర్లు, లేదా చలిమంటలు వుండాల్సిందే బయటికి వెళితే స్వెట్టర్లు వేసుకోవాల్సిందే చేతులూ కాళ్ళూ ఒంకర్లు పోతాయి. ప్రతిరోజూ ఉదయాన్నే లేచి మాకున్న గొర్రెలను తోలుకుని కొండపైకి వెళ్ళిపోవాలి. కడుపుకు ఇంత చద్దన్నం కానీ చలికి వేసుకోడానికి స్వెట్టరుకానీ వుండేవికావు. ఉన్నా మా పిన్ని నాకు ఇచ్చేది కాదు. ఏదో ఒక విధంగా నన్ను చంపడమే తన కర్తవ్యం అన్నట్లు ఆమె ప్రవర్తించేది. నా మీద ఆమెకు అంత ద్వేషం ఎందుకో అర్థం అయేది కాదు. మా నాన్నకూడా నన్ను సరిగా పట్టించుకునేవాడు కాదు. నాతోపాటు ఐదారుమంది పిల్లలు గొర్రెలను మేపడానికి కొండలపైకి వచ్చేవారు. వాళ్ళు దయతలచి పెట్టే అన్నంతో, రొట్టెలతో నేను కడుపునింపుకునేదాన్ని. మధ్యాహ్నం పూట ఆ హిమాలయ పర్వతాల్లో వాళ్ళు తెచ్చుకున్న చద్దన్నం మూటలు విప్పి వాళ్ళు తింటూ నాక్కూడా తలా గుప్పెడు అన్నం పెట్టేవాళ్ళు. వాళ్ళల్లో క్రిష్ణ అనే పిల్లగాడు నా పట్ల ప్రత్యేకమైన అభిమానం కలిగివుండేవాడు. 'నీ గొర్రెలకు నేను కాపలా వుంటాను. నువ్వు బడికి వెళ్ళి చదువుకుని

సాయంత్రం వచ్చి గొఱ్ఱెల్ని ఇంటికి తోలుకునిపో' అని చెప్పేవాడు. నాకోసం రకరకాల చిరుతిళ్ళు తీసుకుని వచ్చేవాడు. ఏవేవో కబుర్లు చెపుతూ కథలు వినిపిస్తూ నన్ను నవ్వించేవాడు.

ఇంట్లో నాకు తిండితోపాటు కాస్త ఆప్యాయత కూడా దొరికేది కాదు. నేను బ్రతికానంటే ఆ అబ్బాయి పెట్టిన తిండి వల్లనే. నేను పదవతరగతి వరకు చదివానంటే ఆ అబ్బాయి నా గొఱ్ఱెలను మేపడం వల్లనే. అంత చలిని కూడా తట్టుకుని భరించి తిరగగలిగానంటే ఆ అబ్బాయి ఇచ్చిన స్వెట్టర్ల వల్లనే.

ఆ కొండలు, కోనలు, లోయల్లో తిరిగినట్లే చిన్నవయసులోనే జీవితంలోని ఎత్తుపల్లాలను ఎన్నో దాటగలిగాను.

ఒకరోజు ఉదయాన్నే భయంకరమైన మంచు వర్షం మొదలయింది. వర్షానికి తోడు విపరీతమైన గాలి తోడయింది. ఆ గాలికి మనుషులే ఎగిరెళ్ళిపోయే పరిస్థితి. కొండలపైన గొఱ్ఱెలను మేపుకోడానికి వెళ్ళిన మేము ఆ తుఫానులో చిక్కుకుపోయాము. ఎటుచూసినా కళ్ళముందు తెల్లటి మంచు వర్షం. కళ్ళకు ఏమీ కనిపించడంలేదు. చలికి శరీరం తట్టుకోవడంలేదు. అందరం అక్కడవున్న ఒక కొండచరియ క్రిందకి చేరాం. కానీ ఆ చరియలు విరిగిమీద పడతాయని మరో భయం మనసులో మెదులుతోంది. చలికి తట్టుకోలేక నేను మెలికలు తిరిగిపోతున్నాను. నా శరీరంలో శక్తి సన్నగిల్లింది. అందులో సరైన ఆహారం లేక బలహీనంగా వున్నాను. మొహాన విసిరికొట్టే మంచు దెబ్బకి తట్టుకోలేక క్రింద కూలబడిపోయాను. అంతవరకూ నా ప్రక్కనే నిలబడివున్న క్రిష్ణ నా పరిస్థితి గమనించి తల్లడిల్లిపోయాడు. వెంటనే నన్ను చేతుల్లోకి తీసుకుని అక్కడే ప్రక్కన గుహలాగా వున్న ప్రదేశానికి లాక్కెళ్ళాడు. నాకు శ్వాస పీల్చుకోవడం కూడా కష్టమైపోతోంది. నా పరిస్థితి చాలా దిగజారి పోతోంది. ఏం చేయాలో తోచని క్రిష్ణ గట్టిగా నన్ను కౌగిలించుకున్నాడు. నాలో వేడిని నింపడానికి ప్రయత్నించాడు. అప్పుడు అతను తన జేబులన్నీ వెతికి ఒక లైటర్‌ని సిగరెట్ పెట్టెని బయటకి తీసాడు. అదికూడా మంచుకు గడ్డకట్టుకుని పోయి వెలగడంలేదు. దాన్ని చేతులతో రుద్ది ఎట్టకేలకు వెలిగించాడు. సిగరెట్‌ను ముట్టించాడు. నా పెదాల మధ్య చేర్చి 'ఊ... పీల్చు గట్టిగా పీల్చు. గుండెలో వేడి కలుగుతుంది' అంటూ నా చేత సిగరెట్టును కాల్పించాడు. నిజమే ఆ పొగ లోపల చేరడంతో కాస్త తేరుకోగలిగాను. అప్పుడర్థమైంది నాకు చల్లటి ప్రదేశాల్లో నివసించే ప్రజలు చలిని తట్టుకోలేక పొగత్రాడం అలవాటు చేసుకుంటారని.

ఏదైతేనేం ఆ రోజు అందరం కూడా ఆ మంచు తుఫానునుండి బయటపడి క్షేమంగా ప్రాణాలతో ఇల్లు చేరుకోగలిగాం. అప్పటినుండీ చలిని భరించడానికి వాళ్ళతో కలిసి అపుడపుడు సిగరెట్, బీడీలు త్రాగుతుండేదాన్ని. తరువాత అదొక అలవాటుగా ఆనందంగా మారిపోయింది. అంతేకాదు ఆ సంఘటన జరిగిన తరువాత క్రిష్ణతో నేను పీకల్లోతు ప్రేమలో పడిపోయాను.

ఆ కొండ గుహలో ఆ రోజు అతడు కౌగిలింతలతో ముద్దులతో నాలో వేడిని రగిలించడానికి చేసిన ప్రయత్నం నా శరీరంలో నిండిపోయింది. తొలిసారిగా నన్ను తాకిన పురుషస్పర్శ నన్ను అతడి ప్రేమలో పడవేసింది. నా జీవితంలో నేను సంతోషంగా గడిపిన రోజులు ఏవైనా వున్నాయంటే క్రిష్ణతో నేను గడిపిన ఆ రెండు సంవత్సరాలే. నా జీవితానికి ఒక ఆలంబన దొరికింది అనే ధైర్యం కలిగింది. నాక్కూడా భవిష్యత్తు వుంది అనే ధీమా వచ్చింది. అతడు అతడి ప్రేమ అభిమానం లేకపోయివుంటే నేను అనేదాన్ని మిగిలి వుండేదాన్ని కాదేమో. నాకంటికి క్రిష్ణ ఎవరెస్ట్ శిఖరం అంత ఎత్తుగా కనిపించేవాడు. ప్రపంచం అంతా అతడిలో నిండివున్నట్లు అనిపించేది.

ప్రకృతి ఒడిలో మేము పసిపాపలైపోయి పాటలు పాడుకునేవాళ్ళం. ఎన్నో ఆటలు ఆడుకునేవాళ్ళం. హిమాలయ పర్వతాలన్నీ మా స్వంతం అయినట్లు వాటికి అతడు రాజు నేను రాణి అన్నట్లుగా ఆ కొండల్లో తిరిగి ఆనందించేవాళ్ళం. రాధాకృష్ణుల్లా ప్రేమను కలబోసుకుని కబుర్లు చెప్పుకునేవాళ్ళం.

కానీ మనం అనుకున్నట్లుగానే అన్నీ జరగవు. సంతోషం అనేది జీవితంలో కలకాలం వుండదు. కష్టాలు కన్నీళ్ళుకూడా ఆ వెనుకే మేమున్నాం మాక్కూడా కాస్త చోటివ్వండి అంటూ తోసుకుని వచ్చేస్తాయి.

కువైట్‌కి పనివాళ్ళను సరఫరా చేసే ఏజంటు మా ఊరికి వచ్చాడు. మా పిన్నిని పరిచయం చేసుకుని నన్ను కువైట్‌కి పంపిస్తే బాగా డబ్బు సంపాదించవచ్చని ఆశపెట్టాడు. ముందే నన్ను ఎలా వదిలించుకోవాలా అనే ఆలోచనతో వున్న ఆవిడ ఆ మాటవిని ఎగిరి గంతేసింది. వెంటనే మా నాన్నను ఒప్పించి నన్ను బలవంతంగా కువైట్‌కి పంపించింది. మా పిన్ని కువైట్‌కి పంపించాలని ప్లాన్ చేయగానే నేను క్రిష్ణతో వెళ్ళిపోయి అతన్ని పెళ్ళి చేసుకోవాలి అనుకున్నాను. క్రిష్ణను వదిలి కువైట్‌కి రావడం నాకస్సలు ఇష్టంలేదు.

కానీ నా స్నేహితులు నువు కువైట్‌కి వెళ్ళి తరువాత క్రిష్ణను కూడా అక్కడికి పిలిపించి అక్కడే పెళ్ళిచేసుకో అని సలహా ఇవ్వడంతో బాగుంది అనుకుని నేను ఇక్కడికి వచ్చాను. కానీ ఇక్కడ మెడికల్‌లో ఫెయిల్ అయ్యాను" అంటూ తన కథను చెప్పడం ముగించింది నిషా.

అయ్యో ఇంత చిన్న వయసులో ఈ పిల్లకు ఇన్ని కష్టాలా? ఏదో ఒకటి చేసి ఈ పిల్లను ఈ కష్టాలనుండీ బయటపడేస్తే బాగుండు అనుకున్నాను నేను.

"సరే జీవితం అన్నాక మనం అనుకున్నవి అనుకున్నట్లుగా జరగవు. టి.బిలో కూడా చాలా రకాలు వున్నాయి. నిన్ను చూస్తుంటే అది అంత పెద్ద స్టేజిలో వున్నట్లు కనపడటంలేదు. మొదట నువు ఇప్పుడయినా వెంటనే ఆ సిగరెట్టు త్రాగే అలవాటు మానెయ్యి. తరువాత డాక్టర్లు ఏం డిసైడ్ చేస్తారో చూద్దాం. నాకు తెలిసి ఇది ఇప్పుడు పెద్ద జబ్బేమీ కాదు. కొద్దిరోజులు ట్రీట్‌మెంటు ఇస్తే తగ్గిపోతుంది. నువ్వు భయపడకుండా ధైర్యంగా వుండు" అంటూ నిషాకి ధైర్యం చెప్పాను. ఇంతలో తెల్లగా తెల్లవారిపోయింది. నేను తొందరగా కాస్త ఉప్మా తయారుచేసాను. ముఖాలు కడుక్కుని ఇద్దరం హాల్లో కూర్చున్నాం. నేను ప్లేటులో పెట్టిన ఉప్మా, అల్లం పచ్చడితో కలిపి తింటుంటే నిషా కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"దీదీ క్రిష్ణ తరువాత ఇంత ఆప్యాయంగా నాకు తిండి పెట్టింది నువ్వే. నిన్ను నేను ఎప్పటికీ మర్చిపోలేను" అంది.

"పిచ్చిపిల్లా ఇందులో గొప్పతనం ఏముంది? సాటిమనిషిగా కాస్త మానవత్వం అంతే" అన్నాను.

మరుసటి రోజే మా వీసా ఆఫీసర్ నిషాని తీసుకెళ్ళి "సబ హాస్పిటల్"లో టి.బి సెక్షన్‌లో జాయిన్ చేసాడు. "దీదీ నాకు భయమేస్తోంది" అంటూ దిగులుగా హాస్పిటల్‌కి వెళ్ళింది నిషా.

"నీకేం కాదులే వారం రోజుల్లో నయమయిపోతుంది, తిరిగి చక్కగా ఇంటికి వస్తావు" భయపడొద్దు అంటూ ధైర్యం చెప్పాను నేను.

వారంకాదు పదిరోజులు కూడా అలా గడిచిపోయాయి. మధ్యలో ఒక్కసారి మాత్రం ఫోన్ చేసి మాట్లాడింది నిషా. అక్కడ హాస్పిటల్‌లో ఫోను చెయ్యనివ్వరని చెప్పింది. ఒక నర్సు దగ్గర మొబైల్ ఫోన్ తీసుకుని ఒక నిముషం మాత్రమే చేసానని చెప్పింది.

"సరే రెండురోజుల్లో వీలు చూసుకుని నిన్ను చూడటానికి హాస్పిటల్‌కి వస్తానులే డాక్టర్‌తో వివరంగా మాట్లాడి అన్ని విషయాలు తెలుసుకుంటాను. నువ్వు వర్రీ కావద్దు" అని చెప్పాను.

చెప్పినట్లుగానే మూడ్రోజుల తరువాత టాక్సీ తీసుకుని సబ హాస్పిటల్ కాంపౌండ్‌లోని టి.బి హాస్పిటల్ వింగ్‌ను వెదుక్కుంటూ వెళ్ళాను.

అక్కడ టి.బి పేషంటును చూడటానికి అనుమతించడంలేదు. ఎంతో ప్రాధేయపడితే ఒక్క నిముషం గ్రిల్స్‌వున్న తలుపుకు అవతల దూరంగా నిలబడి చూడమని చెప్పారు. సరే ఇంతదూరం వచ్చినందుకు ఆ మాత్రం కనికరించారు చాలు అనుకున్నాను. అక్కడి

నర్సులు మూతికి, ముక్కుకు మాస్క్ వేసుకోమని ఇచ్చి పది అడుగుల దూరంలో గ్రిల్స్‌కి అవతల నిలబడి చూసి పలకరించమన్నారు ఈ పదిరోజుల్లో చాలా చిక్కిపోయింది నిషా. కళ్ళక్రింద నల్లచారలు వచ్చేసాయి. హాస్పిటల్ వాతావరణమో లేకపోతే మందుల ప్రభావమో తెలియదు. వీటికి తోడు దిగులు కూడా తోడయినట్లుంది. కొద్ది మాటలతో, సైగలతో కాసేపు మాట్లాడి భారమైన హృదయంతో ఇవతలకి వచ్చాం మేము.

"ఎప్పుడు డిశ్చార్జి చేస్తారు? టి.బి ఏ కండిషనులో వుంది" అని అడిగితే నర్సులు "మేము కేసు డిటయిల్స్ చెప్పకూడదు. సారీ" అనేసారు.

ఇక దేవుడ్ని ప్రార్థించడమే మిగిలింది అనుకుంటూ ఇంటిదారి పట్టాను నేను. ప్రతిరోజూ నిషా ఫోను కోసం ఎదురుచూడటం ఎలా వుందో అని తలచుకుని బాధపడటంతో మరో పదిరోజులు గడిచిపోయాయి.

ఎదురు చూసినట్లుగానే ఒకరోజు నిషా ఫోను చేసింది. అయితే హాస్పిటల్‌నుండి కాదు. కువైట్ ఎయిర్‌పోర్టునుండి ఫ్లయిట్‌లో కూర్చుని, ఎవరి దగ్గరో ఫోను తీసుకుని చేసింది.

"బై దీదీ. ట్రీట్‌మెంటుతో జబ్బు నయమయింది కానీ కువైట్‌లో వుండి పనిచెయ్యడానికి వీళ్ళ రూల్స్ వప్పుకోవంట. టి.బి, పచ్చకామెర్లులాంటి జబ్బులున్న వాళ్ళని అనుమతించరంట. టి.బి మళ్ళీ తిరగబెట్టే ఛాన్సులు వుంటాయంట. ఏది ఏమయినా నేను సంతోషంగానే వున్నాను. ఎందుకంటే అక్కడ భూటాన్‌లో నాకోసం నా క్రిష్ణ ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తున్నాడు. నేను ఇపుడు మా యింటికి వెళ్ళడం లేదు. డైరెక్టుగా క్రిష్ణ దగ్గరికే వెళతాను. తొందరలో మేం పెళ్ళి చేసుకుని మా వాళ్ళకి దూరంగా పారో సిటీలో కాపురం పెడతాం. అది హిమాలయాలకు దగ్గరగా వుంది. ప్రకృతి ఒడిలో ఒదిగిపోయిన పారో సిటీలో చూడవలసిన ప్రదేశాలు, బౌద్ధారామాలు ఎన్నో వున్నాయి. తొందరలో మీరు భూటాన్ వస్తారని ఆశిస్తూ ఎదురు చూస్తుంటాను. 'కీప్ ఇన్ టచ్ విత్ ఫేస్‌బుక్" అంటూ గబగబా నాలుగు మాటలు మాట్లాడి ఫోను పెట్టేసింది. నిషా కువైట్ వదిలి వెళ్ళిపోతోందని బాధపడాలో లేక పెళ్ళి చేసుకుని స్థిరపడుతుందని సంతోషించాలో నాకు అర్థంకాలేదు. కాసేపు మౌనంగా బాధగా అలాగే వుండిపోయాను.

ఈసారి సెలవల్లో ఇండియాకు వెళ్ళినప్పుడు తప్పకుండా భూటాన్ వెళ్ళి నిషాను కలిసి రావాలని నిశ్చయించుకున్నాను.

వీడ్కోలు ఎంతో బాధాకరమైనప్పటికీ మరలా ఎపుడో ఒకరోజు కలుస్తాం అనే భావం మదికి కాస్త ఊరటను అందిస్తుంది. తప్పదు. జీవితమనే ప్రయాణంలో ఇవన్నీ మామూలే.

## *ఎడారి బ్రతుకులు*

**"ఇక చేసేదేముంది.** మన చేతిలో ఏమీ లేదు. పిల్లను నువ్వు తీసుకునిపో. పిల్లాడ్ని నేను తీసుకుపోతాను. ఎందుకంటే ఆడపిల్ల తల్లిదగ్గర పెరగడమే మంచిది. మగపిల్లాడ్ని నేను ఏదో ఒక విధంగా పెంచి పెద్ద చేయగలను. జీవితంలో మరలా మనల్ని దేవుడు కలిపితే మనం కలుసుకోవచ్చు. లేదంటే ఇదే మన ఆఖరి కలయిక" చెప్పాడు కరీమ్ భారమైన హృదయంతో.

"వద్దు .. అలా వద్దు. పిల్లలిద్దర్నీ నేనే తీసుకుపోతాను. పిల్లోడ్ని విడిచి నేను వుండలేను. అందులో వాడు ఇంకా పాలు త్రాగే పసివాడు. నన్ను విడిచి వుండలేడు" కన్నీళ్ళు చెక్కిళ్ళపై జారిపడుతుండగా పిల్లాడ్ని గుండెలకు హత్తుకుంది.

"ఇద్దరు పిల్లల్ని పోషించి పెద్ద చేయాలంటే చాలా కష్టం. నువు నీ దేశం వెళ్ళి అక్కడ మంచివాడిని చూసి పెళ్ళిచేసుకో. చెరొకర్ని పంచుకుని ఇద్దరం సగం భారాన్ని మోయడం న్యాయం" మరలా చెప్పాడు కరీమ్.

"ఊహూ. ఇద్దరిలో ఏ ఒక్కరిని కూడా విడిచి నేను వుండలేను. వాళ్ళు కూడా తల్లిని విడిచి ఒక్క క్షణం కూడా వుండలేరు. పిల్ల నీతో వుంటే చాలా ఇబ్బంది పడతావు. పెళ్ళిచేసుకోవడానికి కూడా ఇబ్బంది అవుతుంది. కాబట్టి నువ్వు సంతోషంగా నీ దేశానికి వెళ్ళిపో" గట్టిగా చెప్పింది లోరా.

"పెళ్ళా? నేనా? హు. నిన్ను మరిచిపోవడం సాధ్యమా? అది ఈ జన్మలో జరిగేపని కాదు. అలాగే ఇద్దరినీ నువ్వే తీసుకో నీ యిష్టం. నీకు ఏ అవసరం అయినా, ఏ కష్టం వచ్చినా నాకు ఫోను చేయడం మాత్రం మరచిపోకు" చెప్పాడు కరీమ్.

లోరా కరీమ్ చేతిని బిగించి పట్టుకుంటూ ఇక తట్టుకోలేక అతనిపై వాలిపోయి భోరుమని ఏడ్చింది. "విధి అనుకూలించి మరలా మనల్ని కలిపి ఒక చోట చేర్చుతుందని ఆశ పడుతున్నాను. ఆ విధంగా నేను ప్రతిరోజూ అల్లాకు ప్రార్థన చేస్తాను." ఈసారి కారే కన్నీళ్ళను ఆపుకోవడం సాధ్యం కాలేదు కరీమ్‌కి. అప్పటికే లోరా గుండెనిండా పేరుకున్న దుఃఖం కళ్ళలోనుండి కాలువగా ప్రవహిస్తోంది.

"ఇదిగో ఒక్కటి గుర్తుపెట్టుకో లోరా. మనం ఎక్కడవున్నా, ఏ దేశంలో జీవిస్తున్నా మన హృదయాలు ఒక్కటే. మన ప్రేమ ఎన్నటికీ వాడిపోదు. నువ్వు ఎప్పటికీ నా హృదయంలో నిలిచేవుంటావు. పరిస్థితులు అనుకూలిస్తే నేను ఇంకో పాస్‌పోర్టు తయారు చేయించుకుని మరలా దుబాయ్‌కో, కతార్‌కో పోవడానికి ప్రయత్నిస్తాను. అప్పటికి నువు మరో పెళ్ళి చేసుకోకపోతే నిన్ను అక్కడికి నా దగ్గరకి పిలిపించుకుంటాను. నేను బంగ్లాదేశ్‌కి వెళ్ళిన మరునాటి రోజునుండి అదే పనిమీద వుంటాను. నువు దిగులు పడొద్దు. పిల్లల ముందు అసలు ఏడవవద్దు. నేను ప్రాణంతో ఈ భూమిపై వున్నంతవరకు నువ్వు భయపడవద్దు" అని చెపుతూ లోరా చెక్కిళ్ళపై కారుతున్న కన్నీళ్ళను తుడిచాడు కరీమ్.

"అయ్యో ఇలాంటి రోజు ఒకటి మన జీవితంలో వస్తుందని నేను అస్సలు ఊహించలేదు. నీతో జీవితం, సహవాసం శాశ్వతం అని భ్రమపడ్డాను. ఇవన్నీ ఈ ఎడారిలో ఎండమావులని గ్రహించలేకపోయాను.

ఆరేళ్ళు నీతో గడిపిన ప్రతిక్షణం గుర్తొచ్చి గుండె భారమవుతోంది. ఇకనుండీ నువు లేకుండా ఒంటరిగా ఎలా కాలం గడపను? చచ్చిపోతే బాగుండు అనిపిస్తోంది." వెక్కివెక్కి ఏడుస్తోంది లారా.

"నేనున్నా లేకపోయినా జీవితంలో ఎప్పుడూ నువ్వు ఇలాంటి మాటలు అనకూడదు మన పిల్లల కోసం నువు బ్రతకాలి. మరలా మనం ఎపుడో ఒకరోజు ఎక్కడో ఒకచోట కలుసుకుంటామని హాయిగా జీవితాన్ని గడుపుతామనే నమ్మకంతో నువ్వు ధైర్యం తెచ్చుకోవాలి. అలాగని నిన్ను పెళ్ళి చేసుకోకుండా నాకోసం ఎదురుచూడమని నేను చెప్పడంలేదు. మంచి వ్యక్తి కనబడితే తప్పకుండా నువ్వు పెళ్ళిచేసుకుని క్రొత్త జీవితం ఆరంభించు. కాలాన్ని నాకోసం వ్యర్థం చేయడం అనవసరం. సరేనా?"

"అదెలా కుదురుతుంది కరీమ్? ఇంకా నాకు పెళ్ళెందుకు? ఈ ఇద్దరు బిడ్డలు చాలు నాకు. వాళ్ళలో నిన్ను చూసుకుంటూ కాలం గడిపేస్తాను. ఏది ఏమైనా మరలా మనం తప్పక కలవాలి. ఎడబాటు కొద్దిరోజులే. దేశాలు వేరయినా మన మనసులు ఒక్కటే. వాటికి దూరం లేదు. ప్రాణం పోయేవరకు మన ప్రేమ నిలిచేవుంటుంది. ఒకరికోసం ఒకరుగా నిలిపి మనల్ని బ్రతికిస్తుంది" ఆవేశంగా చెప్పింది లోరా.

"ఏయ్ ఇంకా మీ మాటలు ఏడుపులు అవలేదా? ఇకచాలు పదండి. భయంలేకుండా సిగ్గూ శరం లేకుండా అక్రమంగా కాపురాలు పెట్టేసి పిల్లల్ని కూడా కనేస్తారా? ఇది కువైట్ దేశమనీ మీరు పరదేశస్థులని తెలియలేదా? వళ్ళు మరిచిపోయి కాలం గడిపేసారా? మిమ్మల్ని జైల్లో త్రోసి జీవితమంతా మ్రగ్గపెట్టకుండా మీ దేశాలకి తిరిగి ప్రాణాలతో పంపిస్తున్నాం. సంతోషించండి. అల్లా కరుణామయుడు కాబట్టి మీమీద కనికరంతో వదిలిపెడుతున్నాం. మీ వంట్లోని వేడిని దింపుకోవడానికి మీరు చేసిన తప్పులకి ప్రతిఫలంగా పుట్టిన ఈ పిల్లలను చూసి మిమ్మల్ని వదిలి పెడుతున్నాం. ఏడుపులు మాని వెళ్ళండి" నోటికొచ్చినట్లు తిడుతున్నాడు పోలీసతను.

"దిగ్గిగ సార్, ఒక నిముషం. పిల్లోళ్ళని ఒకసారి ముద్దుపెట్టుకుని వచ్చేస్తా. మళ్ళీ ఎప్పుడు చూస్తానో ఏమో?" దీనంగా చెప్పాడు కరీమ్.

"అరె ఇన్నేళ్ళూ దొంగచాటుగా మీరు వెలగబెట్టిన కాపురాలు చాలవా? ఇప్పుడు మళ్ళీ వీడ్కోలు చెప్పాలా? పిల్లల్ని మీనుండి లాక్కోకుండా మీకే వదిలిపెడుతున్నాం. లేకపోతే పిల్లల్ని అనాధ శరణాలయంలో వదిలి మిమ్మల్ని జీవితాంతం జైల్లో పెట్టాల్సింది. మా అధికారి ఏదో మంచి మూడ్‌లో వుండి మిమ్మల్ని ఫ్లైయిట్ ఎక్కించి మీమీ దేశాలకు పంపించెయ్యమన్నాడు. అందుకు సంతోషించండి. ఈ ఫిలిప్పీన్ దానితో మాకు కూడా కొంచెం పనివుంది. ఇక నువ్వు సరసాలు ఆపి అవతలివైపున్న జైల్లోకి వెళ్ళిపోతే మా పని మొదలు పెడతాం."

"సార్ అలా అనకండి. దయచేసి లోరాను ఏమీ చేయకండి. మీ కాళ్ళు పట్టుకుంటాను" అంటూ కాళ్ళమీద పడిపోయాడు కరీమ్. అతడి వళ్ళు లోరాని ఏం చేస్తారో అనే భయంతో వణికిపోతోంది.

"రేయ్ వీణ్ణి అవతలివైపున్న సెల్లోకి లాగెయ్యండిరా. నా కొడుకు మంచిగా చెపితే వినడంలేదు" కోపంగా కాలితో కరీమ్‌ని గట్టిగా తంతున్నాడు పోలీస్. అప్పటికి సరిగ్గా భోంచేసి రెండురోజులయినట్లుంది. శరీరంలో శక్తిలేకపోవడంతో పైకి లేవలేకపోయాడు కరీమ్. తన తండ్రిని పోలీస్ కాలితో తన్నడం, తండ్రి బాధతో విలవిల్లాడిపోవడం కళ్ళతో చూసిన పిల్ల పరిగెత్తుకుని వచ్చి పోలీసతని కాళ్ళను చేతుల్తో చుట్టుకుంది. "సార్ మా నాన్నను తన్నకండి" అంటూ ఏడవసాగింది.

ఇక లోరా సంగతి అయితే మాటల్లో చెప్పలేము.

"రేయ్ హమదో.. వాళ్ళను ఏమీ అనకురా. మన సార్‌కు తెలిస్తే ఒప్పుకోడు. జాగ్రత్తగా వుండు. ఇలాంటి విషయాల్లో తొందరపడకు. పరదేశులంటే మన సార్‌కు ఎంతో గౌరవం. వాళ్ళను బాధపెడితే మనకి పనిష్మెంటే గతి" హెచ్చరించాడు అవతలి పోలీసతను.

"ఆ... సర్లేరా బాగా చెప్పావు. మన సార్ ఈపాటికి ఇంట్లో 'మసిబూసి' తిని నిద్రపోయుంటాడు. ఇక్కడికి వచ్చి చూస్తాడా ఏమి? " తీసిపారేసాడు హమద్ అనేవాడు.

ఈలోపల ఒక పోలీసతను వచ్చి కరీమ్‌ను అవతలి ప్రక్కనవున్న జైల్లోకి లాక్కెళ్ళాడు. వెనక్కి తిరిగి లోరాని, బిడ్డల్నీ కంటినిండా చూసుకుంటూ కన్నీళ్ళతో కదిలిపోయాడు కరీమ్. తనకే గనక శక్తివుంటే ఆ క్షణంలో ఆ జైలు గోడల్ని పడగొట్టేసి, లోరాను పిల్లల్ని తీసుకుని దూరంగా పారిపోవాలనిపించింది అతనికి. కానీ నిస్సహాయుడు. దేశం కాని దేశంలో అక్రమంగా జీవిస్తూ పోలీసులకు పట్టుబడ్డాక వాళ్ళను ఎదిరించి ప్రాణాలతో జీవించడం కల్ల. ఈ సమయంలో కాపాడమని, దయచూడమని దేవుణ్ణి ప్రార్ధించడమే మిగిలింది.

పిల్లను చేత్తో పట్టుకుని, పిల్లాడ్ని గుండెకు హత్తుకుని గోడకు చేరగిలబడింది లోరా. అప్పటికి రెండురోజులనుండి కడుపుకు సరిగ్గా తిండిలేదు, కంటికి నిద్రలేదు. స్నానం కూడా చేయక వళ్ళంతా చీదరగా వుంది. ఎప్పుడో ప్రొద్దుననగా పోలీసోళ్ళు ఇచ్చిన రెండు రొట్టెలను పిల్లలకు పెట్టింది. మరలా ఇంతవరకూ వాళ్ళు ఏమీ ఇవ్వలేదు. కడుపులో ఏదో బాధ మొదలయింది. నిస్సత్తువ శరీరాన్ని ఆవహించింది. పిల్లాడు పాలకోసం తడుముతున్నాడు ఎప్పటిలా తల్లి రొమ్ముకు నోటికి అందించకపోయేసరికి ఏడుపు అందుకున్నాడు.

"ఏయ్ ఎందుకు పిల్లోడ్ని ఏడిపిస్తున్నావ్? వాడికి పాలు కావాలంటే ఇవ్వు" వెటకారంగా మాట్లాడుతు ఎదురుగా వచ్చి నిలబడ్డాడు హమద్ అనే పోలీసతను. పోలీసతని ముందర పిల్లాడికి పాలివ్వాలంటే భయం కలిగింది లోరాకి. కదలకుండా అలాగే కూర్చుని పిల్లాడ్ని

సముదాయిస్తోంది లోరా. పిల్లాడికేం తెలుసు తల్లి పరిస్థితి. వాడి ఆకలి వాడిది. పోలీసోడి ఆకలి పోలీసోడిది. ఎంతచేసినా పిల్లాడు ఏడుపు ఆపకపోయేసరికి గబుక్కున అటు గోడవైపు తిరిగి పిల్లాడి నోటికి రొమ్మును అందించింది లోరా.

''ఏయ్ ఇటు తిరుగు. చెప్పేది నీకే'' లాఠీ కర్రతో లోరా భుజం మీద కొడుతూ కోపంగా చెప్పాడు హమద్. ఇటు తిరిగిన లోరాని చూడగానే అతని కళ్ళు వింతగా మెరిసాయి. సంతోషం ముఖంలోకి పాక్కుంటూ వచ్చింది. కళ్ళప్పగించి లోరాను చూస్తూ, కళ్ళతోనే శరీరాన్ని తడిమేస్తూ కుర్చీ లాక్కుని ఎదురుగా కూర్చున్నాడు వాడు.

ఇబ్బందిగా కదిలి ఎవరైనా సహాయం చేసి ఈ స్థితి నుండీ రక్షిస్తారేమో అని అటూ ఇటూ చూసింది లోరా. చుట్టూ జైలుగోడలు తప్ప ఏమీలేవు. కాపాడటానికి ఎవరూ లేరు. వీడు చాలా దుర్మార్గునిలా వున్నాడు. వీనిలో మానవత్వం మచ్చుకైనా కనపడటంలేదు. భగవంతుడా ఈ రాత్రి వీడి చేతినుండి నన్ను రక్షించు అంటూ మనసులో ప్రార్థిస్తోంది లోరా.

ఇంతలో పిల్లది ''అమ్మా ఆకలే'' అంటూ చెయ్యిపట్టి లాగింది. నిజమే పరిస్థితులను బట్టి కడుపులో ఆకలి ఆగదు కదా? ఇప్పుడు ఏం చేసి పిల్ల ఆకలి తీర్చగలదు? నిస్సహాయంగా చూసింది లోరా.

''ఏంటి పిల్ల అడుగుతోంది?'' ప్రశ్నించాడు హమద్.

''ఆకలంటోంది సర్. ప్రొద్దుటినుండీ ఏమీ తినలేదు పిల్ల'' అంది దీనంగా లోరా.

''పిల్లకు ఆకలా? నిజమే. నువు కూడా ప్రొద్దుటినుండీ ఏమీ తినలేదు కదా నీకు కూడా ఆకలిగానే వుంది కదా?'' ప్రశ్నించాడు హమద్. వాడి మాటల్లో ఏదో గూఢార్థం దాగివుందని గ్రహించిన లోరా బదులు పలకకుండా మౌనంగా కూర్చుంది.

''ఏయ్ జవాబు చెప్పు. నువు ఆకలి అంటే ఇప్పుడే బయటనుండి ఫుడ్ తెప్పిస్తాను. నువ్వు బదులు చెప్పకపోతే పిల్ల కడుపుతోపాటు నీ కడుపుకూడా మాడుతుంది'' వాడిలోని శాడిజం మెల్లగా బయటపడుతోంది.

ఆకలి తాళలేని పిల్లది లోరా కాళ్ళపైన తలపెట్టుకుని ముడుచుకుని పడుకుంది. పిల్లాడంటే పాలు త్రాగుతాడు కాబట్టి వాడికి పరవాలేదు. పిల్ల స్థితిని చూసిన లోరా హృదయం ద్రవించింది. ఆకలని చెపితే పోలా? ఎందుకు భయం అనుకుని నోరు పెగుల్చుకుని ''నిజమే ఆకలిగానే వుంది సార్'' అంది.

''వెరీ గుడ్ చెప్పావు కదా. ఇప్పుడే అన్ని రకాల పదార్థాలు తెప్పిస్తాను వుండు'' అంటూ బయటికి వెళ్ళి ఆర్డర్ చేసాడు. ఇరవై నిముషాల్లో బర్గర్లు, పిజ్జాలు, బిరియానీలు వచ్చేసాయి.

''తినండి'' అంటూ తెచ్చి లోరా ముందర పెట్టాడు. అవన్నీ చూసిన పిల్లదాని ముఖంలో సంతోషం కనిపించింది. నోట్లో నీళ్ళూరాయి. తల్లి తీసుకో అని చెప్పకముందే పిజ్జా ముక్కను చేత్తో అందుకుని నోట్లో పెట్టుకుంది.

''తినండి. బాగా తినండి. తిన్న తరువాత పిల్లను, పిల్లోడ్నీ పడుకోబెట్టెయ్యి. నేను ఇపుడే పదినిముషాల్లో వస్తా'' అంటూ బయటికి వెళ్ళిపోయాడు వాడు.

అనవసరంగా భయపడినట్లున్నాను. వీడు మంచివాడేనేమో అనుకుంటూ పిల్లాడికి తినిపించసాగింది లోరా. పిల్లది బాగా ఆకలితో వుంది కాబట్టి తనే తీసుకుని ఆత్రంగా తినసాగింది.

తను కూడా కాస్త తిన్నాననిపించింది లోరా. ఎంతసేపూ కరీమ్ ఆలోచనలే ఆమెను చుట్టుముట్టి కలవరపెడుతున్నాయి. ఏం తిన్నాడో ఏమో? ఏదన్నా తినడానికి ఇచ్చారో లేదో అనుకుంటుంటేనే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఇక తినబుద్ధికాలేదు.

ఇప్పటికి ఇప్పుడు ఇలా విడిపోయినా, విధిలేక తమదేశాలకు వెళ్ళిపోయినా ఎప్పటికైనా ఏదో ఒకరోజు జీవితంలో మరలా కరీమ్‌ని కలవాలి. కలిసి కుటుంబంగా జీవించాలి. నిరాశతో క్రుంగిపోకుండా ఆవిధంగా కలవడానికి ప్రయత్నం చేయాలి. అలా ఆలోచిస్తుంటే, మరలా జీవితంలో కలుస్తాము అనుకుంటుంటే ఊరటగా అనిపించింది లోరాకి.

పిల్లలిద్దరు తలా కాస్త తిని చెరోవైపు పడుకుని నిద్రపోయారు. లోరాకూడా అలసటతో అలా కళ్ళు మూసుకుంది. మొదటినుండీ తమ జీవితంలో జరిగిన విషయాలన్నీ ఒక్కొక్కటిగా గుర్తురాసాగాయి లోరాకి.

ఆరేళ్ళ క్రితం తనుకూడా అందరిలాగే కువైటి ఇంట్లోకి పనిమనిషిగా వచ్చి చేరింది. కానీ తన దురదృష్టం కొద్దీ ఆ ఇంట్లోని మామా, బాబా మంచివాళ్ళు కాదు. నెలకు జీతం ఇచ్చేవాళ్ళు కాదు. కడుపుకు తిండికూడా పెట్టేవాళ్ళు కాదు. ఏం చెయ్యాలో అర్థంకాని స్థితి. వాళ్ళు తినగా మిగిలితే చాటుగా కాస్త తిని కడుపు నింపుకోవాలి. పనిలో పొరపాటు జరిగితే ముందు కొట్టి తరువాత మాట్లాడేవాళ్ళు. చాలా కఠినమైన వాళ్ళు. వాళ్ళ మనస్తత్వం చూసి చిన్న పొరపాటుకి ఏదో ఒకరోజు చంపేస్తారేమో అని భయమేసేది.

ఏజంటు ద్వారా అదే ఇంట్లో డ్రైవర్‌గా వచ్చి చేరాడు కరీమ్. అతనిది కూడా అదే పరిస్థితి. ఆ యింట్లో ఆ విధంగా కష్టాలు అనుభవిస్తూ ఇద్దరూ దాదాపు ఆర్నెల్ల కాలం ఓపికతో గడిపారు. కానీ ఎన్నిరోజులో ఎన్నేళ్ళో ఈ బాధలు అర్థం కాలేదు. ఒకరోజు కరీమ్ వచ్చి "లోరా ఈ ఇంట్లోంచి పారిపోదాం. బయట ఎక్కడైనా తెలిసిన వాళ్ళ దగ్గర తలదాచుకుని ఎంబసీకి పోయి మన పరిస్థితి వివరిద్దాం" అని చెప్పాడు. తనకి ముందు కాస్త భయమేసినా తరువాత గత్యంతరం ఏమీలేదనిపించి ఒప్పుకుంది.

ఒకరోజు రాత్రి ఇద్దరూ ఆ ఇంట్లోంచి పారిపోయారు. కువైటు పట్టణానికి వెలుపల వున్న జహ్రా అనే ప్రాంతంలోని తన బంధువుల ఇంటికి తీసుకెళ్ళాడు కరీమ్. అక్కడే కొన్ని రోజులు తలదాచుకున్నారు. పరదేశంలో ఎన్ని రోజులు బంధువులు తిండిపెట్టగలరు? ఎన్ని రోజులు వీరికి ఆశ్రయం ఇవ్వగలరు? అందుకే అక్కడే ఆ ప్రాంతంలో చిన్న పనికి వెళ్ళసాగాడు కరీమ్. ఇద్దరూ చిన్న రూమ్ అద్దెకి తీసుకుని జీవించసాగారు. అలా ఇద్దరి సహజీవనం సంబంధంగా మారింది. ఆఖరికి అది ప్రేమను నింపుకుని అనుబంధమై నిలిచింది. ఈ లోపల లోరా గర్భవతి కావడం, అక్కడే చాటుగా ప్రైవేటు ఆసుపత్రుల్లో పురుడు పోసుకోవడం ఆ తరువాత పిల్లాడు పుట్టడం జరిగిపోయాయి.

కానీ ఇద్దరి పాస్‌పోర్టులు ఆ కువైటు ఇంట్లోనే వుండిపోయాయి. కాబట్టి ఏ విధంగా చూసినా అక్రమంగా కువైట్‌లో నివసించి కాపురం చేసినట్లే.

ఎన్నో ఏళ్ళు చట్టం కళ్ళుగప్పిఎవ్వరు కూడా తిరగలేరు. జీవించలేరు.

ఒకరోజు కువైటు పోలీసులు జరిపిన రైడింగ్‌లో వీళ్ళిద్దరూ పట్టుబట్టారు. అధికారిత పత్రాలు కానీ కనీసం పాస్ పోర్టులు కానీ లేకపోవడంతో ఇద్దర్నీ వీరితోపాటు పిల్లల్ని కూడా తీసికొచ్చి జైల్లో పెట్టారు. పరదేశంలో పరిస్థితులు తారుమారైతే కష్టాలు కన్నీళ్ళు తప్పవు. నిట్టూర్చింది లోరా.

పదినిముషాలు కూడా గడవనేలేదు. ఇంతలో రానేవచ్చాడు హమద్. వెకిలిగా నవ్వుతూ దగ్గరికి వచ్చి "పిల్లల్ని ఆ ప్రక్కన పడుకోబెట్టి నువ్వు ఇలా నా దగ్గరికిరా, నీ ఆకలి తీర్చానుకదా మరి నా ఆకలి సంగతి ఏంటి?" అంటున్నాడు.

భయంతో వణికిపోయింది లోరా. అప్పటికే రాత్రికావడంతో అందరూ నిద్రపోతున్నారు. ఎక్కడా అలికిడి లేదు. పిలిచినా వచ్చి సహాయం చేసే పరిస్థితి కనబడటంలేదు. ఈ రాత్రి గడిచి తెల్లవారడం కష్టం అనిపించింది లోరాకి.

లోరా కదలకపోవడం, బదులు పలకకపోవడం వాడిలో అసహనాన్ని కలిగించింది. వాడే ముందుకు వచ్చి పిల్లల్ని ఆమెపైనుండి ప్రక్కకి లాగాడు. మంచి నిద్రలో వున్న పిల్లాడు లేచి కెవ్వుమన్నాడు. కోపంతో పిల్లాడి చెంపపైన ఒక్కటిచ్చాడు వాడు. పిల్లాడ్ని కొట్టడంతో తల్లి హృదయం విలవిల్లాడిపోయింది. "సార్ పిల్లాడ్ని కొట్టకండి" అంది చేతులు జోడించి.

"నువ్వు మర్యాదగా చెప్పినట్లు విను. లేదంటే పిల్లల్ని కొట్టి నాకోపం తీర్చుకుంటాను" బెదిరించాడు వాడు.

అసహాయురాలైపోయింది లోరా.

ఆమె భుజాన్ని పట్టి తనవైపు తిప్పుకున్నాడు హమద్. వాడికంటికి బిరియానీ పొట్లంలాగా కనిపిస్తోంది ఆమె.

ఆమెకేమో తిన్న బిరియాని వాంతిరూపంలో బయటికి వస్తోంది. రాక్షసుడిలా లోరా చేయి పట్టి మీదకి లాక్కున్నాడు. "అయిపోయింది. అంతా అయిపోయింది." గట్టిగా కళ్ళు మూసుకుంది లోరా. కన్నీళ్ళు వెచ్చగా బుగ్గలపైన ప్రవహించాయి. ఇంతలో లోరా మొర ఆలకించి దేవుడు పంపినట్లుగా ఒక పోలీసతను అక్కడికి పరిగెత్తుకొచ్చాడు.

"హమద్ మన సార్ సడన్‌గా విజిట్‌కి వచ్చాడు. నువు తొందరగా బయటికిరా. ఆయనకి ఈ విషయాలు తెలిస్తే చంపేస్తాడు" చెప్పేసి వచ్చినంత వేగంగా ఆ రూములోనుండి వెళ్ళిపోయాడు వాడు.

పై అధికారి వచ్చాడనగానే షాక్ కొట్టినట్లుగా తన చేతుల్ని వెనక్కి తీసుకున్నాడు హమద్. వెంటనే లోరాను వదిలేసి జుట్టు సర్దుకుంటూ హడావిడిగా బయటికి పరిగెత్తాడు.

కాసేపటికి ఆ పై అధికారి లోపలికి వచ్చి లోరాను పిల్లని చూసాడు. పిల్లల్ని చూడటంతో మంచివాడైన ఆయన మనస్సు ద్రవించింది.

"ఏయ్ ఎవరు ఈమెను, పిల్లల్ని ఇక్కడ వుంచారు? " అని వివరాలు అడిగి తెలుసుకున్నాడు.

వెంటనే కరీమ్‌ని పిలిపించమని ఆజ్ఞాపించాడు. అవతల మగవాళ్ళ జైల్లో వున్న కరీమ్‌ని తీసుకురావడానికి ఒక పోలీసు పరిగెత్తాడు. కరీమ్ రాగానే "మీ అందరినీ కలిపి ఒకే దేశానికి పంపిచేస్తాను. ఏ దేశానికి వెళతారు? బంగ్లాదేశ్‌కా? ఫిలిప్పీన్స్‌కా?" అని అడిగాడు.

కరీమ్‌కి ఆనందంతో నోటంట మాట రాలేదు. కలా నిజమా అనుకుంటూ "బంగ్లాదేశ్‌కే వెళతాం సార్" అన్నాడు.

లోరా కూడా "కరీమ్ ఎక్కడికి వెళితే అక్కడికే మేమూ వెళతాం సార్. ఆ అల్లా మిమ్మల్ని మా కోసమే పంపించినట్లున్నాడు. మీకు కృతజ్ఞతలు సార్" అంటూ ఏడుస్తూ కాళ్ళమీద పడిపోయింది.

కువైట్ దేశంలో పెళ్ళిచేసుకుని అక్రమంగా కాపురం చేసి పిల్లల్ని కని పోలీసుల చేతిలో చిక్కితే ఎలాంటి శిక్షలు వుంటాయో వారికి తెలియదుకానీ ఇప్పుడూ మాత్రం వాళ్ళ జీవితాల్లో ఇదొక అద్భుతంగా భావించి ఊపిరి పీల్చుకున్నారు.

*బాబా 'మలాల ' కథ*

**రంజాన్ మాసం** ముస్లిములకు ఎంతో పవిత్రమైనది. అటు ఇస్లామిక్ దేశాలు, ఇటు గల్ఫ్ రాజ్యాలు రంజాన్ మాసాన్ని భక్తిశ్రద్ధలతో ఉపవాసాలతో గడుపుతాయి. ఈ నెలరోజులు ముస్లిమ్‌లు అందరూ సూర్యోదయం నుండి సూర్యాస్తమయందాకా పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టుకోకుండా ఉపవాసం చేస్తారు. ప్రార్థనలతోనూ ఖురాను పఠనంతోనూ కాలాన్ని గడుపుతారు. అన్నార్తులు, ఆకలిగొన్నవారు, పేదవారు ప్రపంచంలో ఎంతోమంది ఆహారంలేక డబ్బులేక ఎంతగా బాధపడుతున్నారో? ఆ బాధను స్వయంగా

అనుభవించి తెలుసుకోవడానికి ఈ రంజాన్ మాసం ఉపయోగపడుతుందని మనిషిలోని మానవత్వాన్ని పెంపొదిస్తుందని వీళ్ళు చెపుతూ ఉపవాసాన్ని కొనసాగిస్తారు.

చెడు అలవాట్లకు దూరంగా వుండి కోపతాపాలు విడిచి పరుషమైన మాటలు లేకుండా ప్రార్ధనలతో వీరు కాలాన్ని గడుపుతారు.

అంతేకాదు ఈ మాసమంతా దానధర్మాలు విరివిగా చేసి తమ దయాగుణాన్ని చాటుకుంటారు. పేదవారికి సహాయం చేయడం, ఆపదలో వున్నవారిని ఆదుకోవడం అల్లాకు ఇష్టమైన కార్యాలుగా ఎంచి తమ సంపాదనలో కొంతభాగాన్ని పేదవారికోసం దానంచేసి, సంతృప్తి పొందుతారు. ఇక్కడ మా కువైట్ దేశంలో అయితే రంజాన్ మాసం వచ్చిందంటేచాలు పరిసరాలు, ప్రదేశాలు అన్నీ ప్రశాంతతను నింపుకుంటాయి ప్రతివీధికి ఒకటో రెండో మసీదులు వుండటం వలన నిర్ణీత సమయాల్లో ముల్లాగారు మైకులో వినిపించే ప్రార్ధనలతో ఖురాన్ ప్రవచనాలతో వీధులన్నీ భక్తి భావాన్ని నింపుకుంటాయి.

చిన్నాపెద్దా తేడా లేకుండా అందరికీ మతపరమైన పద్ధతులను, మంచి అలవాట్లను, సాంప్రదాయాలను నేర్పించే పండుగ రంజాన్. సూర్యాస్తమయంలో ఉపవాసాన్ని విరమించే సమయంలో ప్రతి ఇల్లూ కూడా రకరకాల పిండి వంటలతో ఘుమ ఘుమలాడిపోతుంది. అన్ని రకాల వంటలు తయారు చేయడానికి, సమయానికి యజమానులకు వడ్డించడానికి పనివారు ఈ మాసమంతా చాలా కష్టపడతారు. కానీ ముప్పైరోజుల తరువాత వచ్చే రంజాన్ పండుగ రోజున తమ సేఠాని ఇచ్చే బహుమతులు, దినారాలు చూసి నెలరోజులు తాము పడ్డ శ్రమనంతా వీళ్ళు క్షణంలో మరచిపోతారు.



పరదేశులు కదా తమ కుటుంబాల్ని విడిచి ఇంతదూరం వచ్చారు. పగలనక రేయనక మనకు చాకిరీ చేస్తున్నారు అనే జాలితో కువైటీవాళ్ళు తమ పనివారికి ఈ పండుగ సందర్భంగా ఘనంగా దినారాలు కానుకగా అందిస్తారు. కొందరైతే బంగారం, బట్టలను కూడా బహుమతిగా పనివారికి ఇస్తారు.

షేకుల కుటుంబాల్లో పనిచేసే పనివాళ్ళయితే సంవత్సరమంతా పొందే జీతాన్ని ఈ ఒక్క నెలలోనే కానుకల రూపంలో పొందుతారట. అందుకే పనివాళ్ళు పని కాస్త ఎక్కువయినా నాలుగు దినారాలు చేతిలో పడతాయని రంజాన్ పండుగ కోసం ఆశగా ఎదురు చూస్తారు.

కువైటి ఇళ్ళల్లోనే కాదు, బయట కంపెనీల్లో పనిచేసేవారికి కూడా వారి యజమానులు ఈ పండుగ సందర్భంగా జీతాన్ని బోనస్‌గా ఇస్తారు. నేను పనిచేసేది ఫైవ్ స్టార్ హోటల్ కాబట్టి హోటల్‌లో బసచేయడానికి వచ్చే గెస్ట్‌లు కొందరు టిప్స్ రూపంలో మాకు కానుకలు ఇస్తుంటారు. ఈ రంజాన్ నెలలో మాత్రం అరబ్బులు మరీ ఎక్కువగా టిప్స్ మాకు అందించి సంతోషిస్తారు. ఇదంతా బానేవుంది కానీ ఈ రంజాన్ సందర్భంగా బాబా యాకూబ్ మలాల గురించి చెప్పకపోతే నా పరదేశీ కథలు అసంపూర్తిగా మిగిలిపోతాయి.

బాబా మలాలకు దాదాపు డెబ్బై సంవత్సరాల వయసు వుంటుంది. సాయంత్రం అయిదుగంటలకల్లా వచ్చేసి మా హోటల్ లాబీలో అటు షాపింగ్ మాల్‌కి ఇటు రెసెప్షన్‌కి మధ్య వున్న సోఫాలో కూర్చుంటారు. ఆయన బి.యమ్ డబ్ల్యూ కారు మా హోటల్

బయట ఆగగానే మా స్టాఫ్ అందరూ అలర్ట్ అయిపోయి ఆయన్ను 'సలామాలేకుం బాబా' అంటూ వంగి సలాములు చేస్తూ సాదరంగా ఆహ్వానించి లోపలికి తీసుకుని వచ్చి సోఫాలో కూర్చోబెడతారు. ఒకడు పరిగెత్తికెళ్ళి కారు డోర్ తీస్తే, మరొకడు తలుపు తీస్తే ఇంకొకడు సోఫాలోని కుషన్ దిండ్లను సరిచేస్తాడు.

ఆయన వచ్చి అక్కడ కూర్చోగానే కొంతమంది ఆ దారినపోయే కువైటీలు కూడా వచ్చి కూర్చుని కాలక్షేపం కబుర్లు చెపుతుంటారు. ఆయన వారందరికీ కాఫీ, టీ, బిస్కట్లు తెప్పించి ఇస్తాడు. ఇక ఆ దారిన షాపింగ్ మాల్‌లోకి పోయేవాళ్ళు, లాబీలో వచ్చేవాళ్ళు కూడా చాలామంది 'సలామాలేకుం బాబా' అని ఆప్యాయంగా పలకరిస్తుంటారు. ప్రతిరోజూ సాయంకాలం ఆయన అదే స్థానంలో కూర్చోవడంతో అందరికీ ఆయన్ని అక్కడ చూడగానే పలకరిం చడం అలవాటయిపోయింది.

ఆయన చాలా డబ్బున్నవాడు కాబట్టి ఆ కారణం చేత ఆయనను పలకరించే వాళ్ళే ఎక్కువ అని చెప్పవచ్చు. ధనం ఉండటం ఏం గొప్పకాదు కానీ దాన్ని పేదవారికి దానం చేయడం చాలా గొప్పతనం. ఆయన దానధర్మాలు విరివిగా చేతికి ఎముకలేనంతగా చేస్తాడు కాబట్టే అందరూ పరుగున వెళ్ళి పలకరిస్తారు. వంగివంగి సలాములు చేస్తారు. ఆయన వచ్చేటప్పుడు అందరూ పరుగులు పెట్టడం, వినయంగా వంగి సలాములు చెయ్యడం చూస్తే నాకు నవ్వు వస్తుంటుంది. నోట్లకట్టను జేబులో పెట్టుకుని వస్తాడు. సలాం చెప్పిన వాళ్ళకందరికీ ఒక్కొక్క నోటు అందిస్తాడు ఆయన. ఆ దారిన పోయేవాళ్ళు దగ్గరికి వచ్చి కూర్చుని పలకరించి కష్టసుఖాలు చెప్పుకుంటే వారికి తగినమట్టుకు సహాయం చేసి పంపిస్తాడు. మూడేళ్ళ క్రితం మొదట ఆయన గురించి విన్నప్పుడు ఇంకా ఇలాంటి వాళ్ళు ఈ భూమ్మీద వున్నారా అని నేను ఆశ్చర్యపోయాను.

ఈ రంజాన్ పండుగకు కూడా ఆయన యధావిధిగా మా అందరి పేర్లతో ఒక లిస్ట్ తయారు చేయించాడు. పెద్ద నోట్ల కట్టను తెచ్చిపెట్టుకుని మా అందరినీ పేరు పేరునా పిలిచి తలా ముప్పై దినార్లు (దాదాపు ఆరువేల ఐదువందలు ఇండియా రూపాయలు) పంచి పెట్టాడు. కనిపించి సలాం చెపితే అపుడపుడూ ఇచ్చే డబ్బు కాక రంజాన్ పండుగ సందర్భంగా అదనంగా లభించే పండుగ బహుమతి అన్నమాట. మరి ఇంత మందికి ఇంతింత డబ్బు పంచి పెట్టడానికి ఆయన ఎంత ధనవంతుడో కదా?

సరిగ్గా మూడేళ్ళ క్రితం 2016లో అనుకుంటా ఆయనను నేను గమనించాను. సోఫాలో మలాలాగారు కూర్చుని వుంటే ఆయన చుట్టూ మనుషులు చేరడం, మాట్లాడటం ఆయన ప్రాముఖ్యతను తెలియజేసాయి. ఆయన ముఖం చూడగానే నాకే కాదు అందరికీ గౌరవభావం కలుగుతుంది.

అందుకే నా ప్రమేయం లేకుండానే ప్రతిరోజూ సాయంత్రం నేను డిన్నర్‌కి వెళ్ళేటప్పుడు 'సలామా లేకుం' అని విష్ చేసి కెఫిటేరియాకు వెళ్ళిపోయేదాన్ని. ఆయన కూడా బదులుగా చేయి పైకెత్తి పలకరించేవాడు. అలా నెలరోజులు జరిగిపోయాయి. అంతవరకూ ఆయన ఎవరో నాకు తెలియదు. ఇంతలో రంజాన్ మాసం వచ్చింది. ఆరోజు నేను యథాప్రకారం ఆరుగంటలకి నా బ్రేక్ టైమ్‌లో లాబీలోనుండి కెఫిటేరియాకు వెళుతున్నాను.

'సలామా లేకుం' అని నేను చెప్పగానే 'ఇలా రా' అని చేత్తో పిలిచాడు బాబా మలాల. నేను ఆశ్చర్యపోయాను. నన్నెందుకు పిలుస్తున్నారో అనుకుంటూ దగ్గరకి వెళ్ళాను. 'ఒక కవరు నా చేతిలో పెట్టి రంజాన్ పండుగకి ఏదైనా గిఫ్ట్ కొనుక్కోమ్మా' అన్నాడు.

ఒక క్షణం నాకేమీ అర్థం కాలేదు. నాకెందుకు ఆ కవరు ఇస్తున్నారో అందులో ఏముందో అనే సందేహం కలిగింది. తీసుకోవడానికి కొంచెం వెనుకాడాను. 'నువు నా కూతురులాంటిదానివమ్మా పండుగ కానుక తండ్రిలాగ ఇస్తున్నాను సందేహించకుండా తీసుకో' అన్నారు. అలాగే అంటూ తీసుకుని వెళ్ళిపోయాను.

ఆ కవరు పైన "బెంతి" అని అరబిక్‌లో రాసి వుంది. బెంతి అంటే కుమార్తె అని అర్థం. నాకు వచ్చిన అరబిక్‌లో ఆ పదాన్ని కూడబలుక్కుని చదవగానే చాలా సంతోషం కలిగింది. కవరు విప్పి చూద్దును గదా అందులో పది దినార్ల నోట్లు పది వున్నాయి. మొత్తం వంద దినార్లు. మన ఇండియా కరెన్సీలో దాదాపు ఇరవై రెండువేల రూపాయలు. నెలరోజులుగా ఆ దారిన పోతూ సలాం చెప్పినందుకు ఇంత పెద్ద బహుమతా! ఆయనకు నా పట్లగల అభిమానం చూసి ఆశ్చర్యపోయాను.

తరువాత ఆయన ఎవరో తెలుసుకోవాలనిపించి ఆయన గురించి కొందరిని అడిగాను. వాళ్ళు చిన్నగా నవ్వి "ఆయన బాబా మలాల యాకూబ్. చాలా ధనవంతుడు. ఆయన నీకే కాదు మా అందరికీ కూడా డబ్బు ఇస్తుంటాడు. ఆయన గురించీ, ఆయన దయా గుణం గురించీ చాలామందికి బాగా తెలుసు. దారినపోయే వాళ్ళు కూడా ఆగిపోయి ఆయన దగ్గరకి వచ్చి కూర్చుని సలాం చెప్పి తమ కష్టాన్ని చెప్పుకుంటే ఎంతో కొంత సహాయం చేసి పంపిస్తాడు. కువైట్‌లో ఆయనకు చాలా కంపెనీలు వున్నాయి. అందులోనుండి చాలా ఆదాయం వస్తుంది.

పాపం ఆయనకు ఎవరూ లేరు. అందుకే వచ్చిన డబ్బంతా దానధర్మాలకే వినియోగిస్తుంటాడు బాబా. అందరూ తనవాళ్ళే అనుకుంటాడు. అందరి కష్టం తనదే అని భావిస్తాడు. ఈయన ప్రతిరోజూ సాయంత్రం మన హోటల్‌కి వచ్చి టీ తాగి వెళ్ళడం మన అందరికీ డబ్బులు పంచడం మన అదృష్టం" అని చెప్పారు వాళ్ళు.

అంత మంచి మనిషిని గురించి వినడం, ఈ కాలంలో ఇంకా ఇలాంటివాళ్ళు వుండటం ఆయన్ని ప్రత్యక్షంగా చూసి ఆయన గురించి తెలుసుకోవడం చాలా సంతోషంగా అనిపించింది.

"ఆయనకు ఎవరూ లేరా? ఏమయ్యారు? ఎందుకు ఆయన ఒంటరిగా ఉన్నారు? " ఆయన గురించి ఇంకా తెలుసుకోవాలనే తాపత్రయంతో అడిగాను నేను.

"ఆ బాబా గురించి ఇంతవరకే మాకు తెలుసు. ఇంకా పూర్తి వివరాలు కావాలంటే, ఆయన కథ కావాలంటే సెక్యూరిటీ ఆఫీసరు సన్నీని అడుగు చెబుతాడు. అతడు బాబాతో ఎక్కువగా మాట్లాడుతుంటాడు" అన్నారు వాళ్ళు.

"సరే" అన్నాను నేను.

వారం రోజుల తరువాత గానీ సన్నీ నాకు కనబడలేదు. కనబడగానే మొదట బాబాగురించి చెప్పమని అడిగాను.

"ఓ.. బాబా గురించి చెప్పాలంటే చాలా టైం పడుతుంది. ఆయన జీవితమే ఒక కథ. పాపం 1990 ఇరాక్ యుద్ధంలో బాబా తనవారినందరినీ కోల్పోయాడు. ఇరాక్ సైనికులు బాబా ఇంటిమీద పడి బాబాను బాగా కొట్టి కాళ్ళూ చేతులు కట్టేసారు. భార్యను తన కళ్ళముందే పాడు చేసారు. ఇద్దరు కొడుకుల్ని పట్టుకుని వెళ్ళిపోయారు. వాళ్ళు బ్రతికి వున్నారో చనిపోయారో ఇప్పటికీ తెలియదు. కొన ఊపిరితో బ్రతికి బట్ట కట్టాడు బాబా. భార్య ఇరాక్ సైనికుల చేతిలో చిత్రహింసలు పెట్టబడి, పాడు చేయబడటంతో పిచ్చిదైపోయి కొద్దికాలానికి చనిపోయింది.

తరువాత రోజుల్లో సద్దాం వెళ్ళిపోయాక కువైట్ గవర్నమెంటు బాబాకు చాలా డబ్బును ఇచ్చింది. అందరూ పోయాక ఆస్తులు ఏం చేసుకుంటాడు బాబా. అందుకే అందరిలో తనవారిని చూసుకుంటున్నాడు. ఇలా తనకు వచ్చిన రాబడిలో పేదలకు దానధర్మాలు

చేస్తూ కాలం గడిపేస్తున్నాడు. ముఖ్యమైన విషయం ఏంటంటే యుద్ధానికి ముందు బాబా పిల్లికి కూడా బిచ్చం పెట్టేవాడు కాదు. పనివారిని వేధించేవాడట. సరిగా జీతాలు ఇవ్వకుండా వారి కడుపుకి సరైన తిండి పెట్టకుండా బాధపెట్టేవాడంట కూడా. 'అలా అందరినీ బాధించాను కాబట్టే నేను నావారందరినీ కోల్పోయాను. అందరినీ తిట్టి కొట్టాను కాబట్టే ఇరాక్ సైనికులు నన్ను బూటు కాళ్ళతో తన్నారు. ఇష్టమొచ్చినట్లు కొట్టారు. నన్ను కట్టిపడేసి నా కళ్ళముందే నా భార్యను ఇష్టమొచ్చినట్లు అనుభవించారు. నా కొడుకుల్ని కొట్టి బంధించి పట్టుకుని పోయారు. కట్టుకున్న ఇంటిని పాడు చేసి పెట్రోలు పోసి తగలబెట్టారు. ఇంటిలోని వస్తువుల్ని దోచుకునిపోయారు. కళ్ళముందే కట్టుకున్నవన్నీ కూలిపోతుంటే ఇష్టమైనవన్నీ కాలిపోతుంటే ఆనాడే ఏదీ శాశ్వతం కాదు అనే భావం నాలో కలిగింది. కళ్ళముందే నా వాళ్ళందరినీ చిత్రహింసలు పెడుతుంటే అవన్నీ చూసిన నా హృదయం బాధను భరించలేక తల్లడిల్లిపోయింది. ఏ పాపం చేసానో ఇంత ఘోరం చూడాల్సి వచ్చింది. ప్రాణంతో మిగిలితే ఇంకెప్పుడూ ఎవరినీ వేధించకూడదు, ఎవరినీ బాధపెట్టకూడదు అని ఆ క్షణంలో నిర్ణయించుకున్నాను' అని ఆయన తన గురించి అందరికీ చెపుతుంటాడు" నిట్టూర్చాడు సన్నీ.

అందరినీ కోల్పోయాక తన పద్ధతిని మార్చుకుని పరివర్తన కలిగిన బాబా పదిమందికి సహాయం చేస్తూ అందరినీ ఆదుకుంటూ అందరూ నావాళ్ళే అనుకుంటూ జీవిస్తున్నాడు. ఆ అల్లా బాబా యాకూబ్ మలాలకు మంచి ఆరోగ్యాన్నీ మనశ్శాంతిని ఇవ్వాలని కోరుకుంటున్నాను. ఇంతకీ అసలు విషయం చెప్పడం మరిచిపోయాను. గతనెల రంజాన్ మాసంలో కూడా బాబా నోట్లకట్టలు తెచ్చి మా అందరికీ డబ్బులు పంచి పెట్టారు. ఇవి రంజాన్ సందర్భంగా అదనంగా లభించిన పండుగ బహుమతి.

మరి నాకెంతిచ్చారనే కదా మీరడగబోయే ప్రశ్న. ష్... ఎవరికీ చెప్పకండి దాదాపు ఎనభై దినార్లవరకు ఇచ్చారు ఇది ఎంతో మీ కరెన్సీలో లెక్కవేసుకోండి మరి.

*దుర్గ కథ*

**సెంటర్ పాయింట్‌లో** 50శాతం సేల్ అనే మెసేజ్‌ను ఫేస్‌బుక్‌లో చూడగానే రేపు సెలవే కదా వెళదాం అని నిర్ణయించుకున్నాను. అక్కడ స్ప్లాష్ కంపెనీ బ్యాగులు, పర్సులు బాగుంటాయి. ఆ బ్రాండులే నేను ఎప్పుడు వాడుతుంటాను. అలాగే పౌడరు, ఫౌండేషను వగైరా మేకప్ సామాన్లు కూడా కొన్ని కొనాలి. చిన్నపిల్లల డ్రెస్సులు కూడా అక్కడే కొంటుంటాను నేను. అనుకున్నట్లుగానే సాయంత్రం కాస్త తొందరగా బయలుదేరి వెళ్ళాను. బట్టలు, చెప్పులు, బ్యాగులు చూస్తుండగానే సమయం ఏడయిపోయింది. సరే ఇక తిరిగి ఇంటికి వెళ్ళిపోదాం అనుకుని ట్రాలీతో కౌంటర్ దగ్గరికి వచ్చాను. సేల్ కాబట్టి అక్కడ క్యూ బాగానే ఉంది. వరుసలో నిలబడుంటే వెనుకనుండి ఎవరో భుజం మీద చేయి వేసి "ఏయ్ లలితా ఎలా వున్నావు?" అంటూ నన్ను పలకరించారు. ఎవరా? అనుకుంటూ తిరిగి చూద్దును కదా తలకు నిండుగా హిజాబ్ (స్కార్ఫ్) అరబిక్ పంథాలో చుట్టుకుని నా వయసే వున్న ఒక అమ్మాయి ఎదురుగా నిలబడి వుంది. అరబిక్ స్త్రీలా వున్న ఆమెను పోల్చుకోవడానికి కాస్త సమయం పట్టింది నాకు. "ఓ... నువ్వు... దుర్గవి కదా... ఏంటి నువ్వా? నీ అరబిక్ స్టైలూ? చాలా మారిపోయావే" అన్నాను ఆశ్చర్యంగా చూస్తూ.

"అవును నిజమే చాలా మారిపోయాను. కానీ నువు మాత్రం అస్సలు మారలేదు. అలాగే వున్నావు. అబ్బ ఎన్ని ఏళ్ళయిందో నిన్ను చూసి? నువ్వు కూడా కువైట్‌లోనే వున్నావని తెలిసి నీకోసం, నీ ఫోను నంబరు కోసం తెలిసిన వాళ్ళందరినీ అడుగుతూనే వున్నాను. ఇన్నేళ్ళకు ఇక్కడ నువ్వు కనిపించావు. చాలా సంతోషంగా వుంది" నన్ను చూసిన సంతోషంతో గబగబా మాట్లాడేస్తోంది దుర్గ.

"నిజమే నేను కూడా నీ గురించి వింటున్నాను. మన ఊళ్ళో నాలుగు మిద్దెలు కట్టేసావనీ అవి కువైటులోని షేకుల ఇళ్ళలాగా పాలరాతితో మెరిసిపోతున్నాయని మన ఊరివాళ్ళు చెప్పారు. పొలాలు కూడా బాగానే కొన్నావంటకదా? కువైటుకొచ్చి దుర్గ సంపాదించినట్లుగా మన ఊళ్ళో ఇంకెవరూ డబ్బు సంపాదించలేనని జనాలు నీగురించి గొప్పగా చెప్పుకుంటున్నారులే" చిన్నగా అడుగుతూ "ఇంతకీ ఏం ఉద్యోగం చేస్తున్నావు దుర్గా?"

"ఉద్యోగమా? పాడా? నాకంత చదువు ఎక్కడ ఏడ్చింది? ఏదో వానాకాలం చదువు. ఏడో తరగతివరకూ చదివాను అంతే నా రాత మారింది ఇక్కడికి వచ్చాక నా బ్రతుకు మారింది అంతే. నేను కూడా అందరిలాగే పనిమనిషిలాగా ఈ కువైట్‌కి వచ్చాను కానీ కలలో కూడా ఊహించని విధంగా దేవుడు నా జీవితాన్ని మార్చేసాడు. మంచిదే అనుకున్నాను. ఒక్క పైసా తీసుకోకుండా దాదాపు 50 వీసాలవరకు పంపించి మన ఊళ్ళో వాళ్ళకి నాకు చేతనయిన సహాయం చేసాను. దుర్గ వలన మేము సంపాదించుకుని బాగుపడినాము అని వాళ్ళు అనుకుంటే నాకంతే చాలు. అదే నాకు తృప్తి అంటూ తన వంతు రావడంతో కౌంటరు దగ్గరకి వెళ్ళింది దుర్గ.

నా చిన్నప్పుడు చింపిరి జుట్టుతో, చీమిడి ముక్కుతో చిరిగిన బట్టలతో కనిపించిన దుర్గ ఈరోజు ఏదో క్రొత్త కళతో, మెరిసే ఒళ్ళుతో, ఒక విధమైన దర్పంతో కనబడుతోంది. కళ్ళనిండా ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. మాటల్లో ఒక ధీమా, సంతోషం వినబడుతోంది. ఎంత మార్పు? ఎవరి జీవితాలు ఎలా మారతాయో? ఏ విధంగా నడిపించబడతాయో ఎవరికి తెలుసు, ఒక్క దేవుడికి తప్ప? మరి ఇంతకీ ఉద్యోగం ఏమీ చేయకుండా ఇంత డబ్బు ఎలా సంపాదిస్తోంది? ఎలాగబ్బా? అనుకుంటూ విషయం తెలుసుకుందామని ఆ మాటే తనని అడిగేసాను.

నా ప్రశ్నలకి గలగలా నవ్వేసింది దుర్గ. నాతోరా.. అని విషయాలూ వివరంగా చెపుతాను అంటూ నా చెయ్యి పట్టుకుని తీసుకెళ్ళి బి.యమ్ డబ్ల్యూ కారులో కూర్చోపెట్టింది. డ్రైవింగ్ సీట్‌లో కూర్చుని దుర్గే స్వయంగా డ్రైవ్ చేస్తుంటే మరింతగా ఆశ్చర్యపోయాను నేను.

దాదాపు పదినిమిషాల తరువాత 'సుర్రా' ఏరియాలోకి తీసుకెళ్ళి పెద్ద బంగళా ముందు కారు ఆపి దిగమంది. ఇంట్లోకి తీసికెళ్ళి "కూర్చో అని టీ తాగుతావా, కాఫీనా" అంటూ పనిమనిషిని కేకేసింది. నాకేమీ అర్థంకాలేదు.

"ఏదో ఒకటి తాగుతాను కానీ తొందరగా నీ కథ చెప్పవే. సస్పెన్స్‌తో చచ్చిపోతున్నా" అన్నాను పనిమనిషి అందించిన టీ అందుకుంటూ ఆ ఇంటిని పరిశీలించి చూస్తూ.

"సరే చెపుతానులే ఓపిగ్గా విను.. అంటూ తన కథను చెప్పడం మొదలుపెట్టింది దుర్గ.

"ఇమ్మా.. ఓ ఇమ్మా.. కళ్ళు తెరిచి చూడు. నీకోసం కద్దామాని (పనిమనిషిని) తీసుకొచ్చాను. ఇకనుంచీ నువ్వు కష్టపడనక్కరలేదు. నీకు ఏ అవసరం వచ్చినా ఇదిగో ఈ ప్రక్కనే వున్న బెల్లు నొక్కావనుకో, వెంటనే ఈ పనిపిల్ల పరిగెత్తుకొస్తుంది. నీకు వేళకు అన్నీ అమర్చి పెట్టి సపర్యలు చేస్తుంది. మేము దూరంగా వున్నామని నువు ఏమీ దిగులుపడవద్దు. చూడాలనుకున్నప్పుడు ఒక్క ఫోను కాల్ చేస్తేచాలు పదినిముషాల్లో నీ ముందువుంటాం. నీ కోడలుకి నీకు పడకపోవడం చేత నేను దూరంగా వేరే వుండాల్సి వచ్చింది. లేకపోతే ఇక్కడే మన ఇంట్లోనే వుండేవాళ్ళం. నీకు బాబాకు మా డ్రైవరు చేత వేళకు భోజనాలు పంపిస్తాను. మాకయితే శ్రీలంక తబ్బాక్(వంటమనిషి) వుంది. అన్ని అరబ్బీ వంటలూ బాగా రుచిగా వండుతుంది. మళ్ళీ మీ ఇద్దరి కోసం ఇక్కడ వేరే వంట ఎందుకు? ఈ పనిపిల్ల ఇల్లు శుభ్రం చేసి నిన్నూ బాబాను చూసుకుంటే చాలు.

టైము బాలేక నీకు పక్షవాతం వచ్చి కాలూ చెయ్యిపడిపోవడం మన దురదృష్టం. మూతివంకర పోవడంతో నువు సరిగా మాట్లాడలేకపోవడం చాలా బాధ కలిగించే విషయం. మన డాక్టరు మంచి ట్రీట్‌మెంటే ఇస్తున్నాడు. తొందరలో నీకు కాలూ చేయి బాగవుతుందనీ మాట కూడా వస్తుందని ఆయన చెపుతున్నాడు. ఇన్షా అల్లా. అంతా అల్లా దయ. మన చేతుల్లో ఏముంది? నువ్వు ఏమీ దిగులుపడకు. ధైర్యంగా వుండు సంవత్సరం తిరిగేసరికల్లా నువు లేచి చక్కగా తిరుగుతావు. అలాగే నీకాలూ చేయి మసాజ్ చేయడానికి ఒక మసాజ్ చేసే అమ్మాయిని కూడా ఒక గంట ఇంటికి రమ్మని చెప్పాము. రోజుకో గంట మసాజ్ చేస్తే నీ శరీరంలో చలనం వస్తుందని డాక్టరు చెప్పాడు. ఎంత డబ్బు ఖర్చయినా పరవాలేదు. నీ ఆరోగ్యం బాగుపడితే అంతే చాలు. ఇదిగో ఈ పనిపిల్ల పేరు దుర్గ. నిన్ను కంటికి రెప్పలా చూసుకుంటుంది. నువు ధైర్యంగా వుండు చాలు. బాబాకు కూడా ఈ సంగతి చెప్పేసాను." పనిపిల్లను మామాకు, మామాను పనిపిల్లకు అప్పగించి తమ బాధ్యత తీరిందంటూ వెళ్ళిపోయాడు కొడుకు అహ్మద్.

మాట్లాడటానికి నోరు సహకరించకపోవడంతో అలా కళ్ళప్పగించి చూస్తుండిపోయింది మామా. పడకమీద నుండి లేచి కనీసం బాత్‌రూముకు కూడా వెళ్ళలేని పరిస్థితి ఆమెది. భర్త వున్నా కూడా అవసరానికి పిలిస్తే పలుకుతాడు కానీ ఆయన అన్ని పనులూ చేయలేడు కదా. అందులో ఆయన బయట పనులు కూడా చూడాలి. పోనీలే ఇప్పుడు పనిపిల్ల వుంది కదా కష్టపడనవసరం లేదు అనుకుంటూ నిట్టూర్చింది మామా.

ఇంతలో బాబా ఖాలిద్ బయటనుండి వచ్చాడు. పనిపిల్ల దుర్గను చూసి సంతోషించాడు. నువ్వు మామాను బాగా చూసుకున్నావనుకో రెండు నెలలు నీ పని చూసిన తరువాత పది దినార్లు జీతం పెంచుతాను. మామాను బాగా చూసుకోకపోతే మాత్రం నిన్ను తీసుకెళ్ళి, మరలా ఆ ఏజంటుకే అప్పగించి వస్తాను. నీ యిష్టం. బెదిరిస్తున్నట్లుగా చెప్పాడు బాబా - "అలాగే బాబా మామాను బాగా చూసుకుంటా" అంటూ సైగలతో చెప్పింది దుర్గ.

అప్పటికి దుర్గ కువైట్‌లో అడుగుపెట్టి నెలరోజులే కావడంతో అరబిక్ భాష ఇంకా పట్టుబడలేదు. వచ్చీ రాని ఇంగ్లీషులోనూ సైగలతోనూ వాళ్ళతో మాట్లాడాల్సి వస్తోంది. వచ్చి నెలరోజులు అయింది కనుక వాళ్ళ మాటల్లోని భావాన్ని కాస్త గ్రహించగలుగుతోంది దుర్గ.

అలా దాదాపు నాలుగునెలలు గడిచిపోయాయి. మామా ఆరోగ్యం కొంచెం కూడా కుదుటపడలేదు. డాక్టరు మందులు కూడా మార్చి చూసాడు. కొడుకు అహ్మద్ వారానికి ఒకసారి వచ్చి చూసి వెళుతున్నాడు. నెలజీతం దుర్గకి అహ్మదే ఇస్తున్నాడు. రోజు రోజుకీ మామా ఆరోగ్యం దిగజారిపోతోందే తప్ప కొంచెమైనా ఆవిడ కోలుకోవడంలేదు. అలా మంచంలో పడి వుండటంతో అన్ని సేవలూ దుర్గే చేస్తోంది. ఒకరోజు పడకంతా తడిపేసింది మామా. ఆమెను ప్రక్కమీదినుండి లేపి మరొక చోట పడుకోబెట్టడం దుర్గకు సాధ్యం కాలేదు. బాబాకు పరిస్థితి వివరించి సహాయాన్ని కోరింది దుర్గ. ఇద్దరూ కలిసి మామాను ప్రక్కదుప్పట్లు తీసి పడకను ఉతికిన దుప్పట్లతో సర్దారు.

విసుగులేకుండా, రోత అనుకోకుండా అన్ని పనులూ చేస్తున్న దుర్గను చూసి బాబాకు దయకలిగింది. ఆ రోజు శాలలో (హాల్లో) కూర్చుని టీ తాగుతూ. "దుర్గా నీకు పెళ్ళయిందా? " అడిగాడు బాబా.

"అయింది బాబా ఇద్దరు పిల్లలు కూడా వున్నారు. కానీ నా మొగుడు బాగాతాగి వళ్ళు చెడిపోయి పెళ్ళయిన ఆరేళ్ళకే చచ్చిపోయాడు. ఇంక అమ్మగారింట్లో పడి కూర్చుని తింటే గౌరవం వుండదని పిల్లోళ్ళని మా అమ్మకు అప్పగించి నేను ఇలా వచ్చాను" వివరించింది దుర్గ.

"అయ్యో ఇంత చిన్న వయసులోనే నీకు మొగుడు చచ్చిపోయాడా? ఇంత చిన్న జీతంతో ఇద్దరు పిల్లల్ని పోషించి చదువు సంధ్యా చెప్పించాలంటే కష్టమే కదా. సరే ఈ నెలనుండి నీకు పది దినార్లు జీతం పెంచుతున్నాను. నీకు ఏ కష్టం వచ్చినా మొహమాటం లేకుండా నాకు చెప్పు. సహాయం చేస్తాను" ఒకసారి పైనుండి క్రిందకి దుర్గను పరిశీలించి చూస్తూ చెప్పాడు బాబా ఖాలిద్.

బాబాకు పెద్ద వయసు వుండదు. మహా అంటే యాభై ఉంటుంది. అందువల్ల బాబాకు ఏ సుఖమూ లేకుండా పోయింది అనుకుంటూ "అలాగే బాబా" అంది దుర్గ తలవూపుతూ.

"మీ హిందీ వాళ్ళు (ఇండియన్స్) ప్రతిమాటకీ తల భలే ఊగిస్తారు" అంటూ చిన్నగా నవ్వాడు బాబా.

బదులుగా చిరునవ్వు నవ్వి లోపలికి మామా దగ్గరికి వెళ్ళిపోయింది దుర్గ.

నాల్రోజుల తరువాత "దుర్గా తాల్ మిన్ని" (ఇలారా) అంటూ హాల్లోకి పిలిచాడు బాబా.

ఆ సమయంలో మామా గదిని సర్దుతున్న దుర్గ బాబా పిలవడంతో "మామా ఇపుడే వస్తాను" అంటూ హాల్లోకి వచ్చింది. చేతిలో వున్న కవర్‌ను దుర్గ చేతిలో వుంచి "నీకోసం జపాన్ శారీ కొన్నాను. మీ హిందూ స్త్రీలు చీరకట్టుకుంటే చాలా అందంగా కనిపిస్తారు. ఈ రోజు సాయంత్రం ఈ చీర కట్టుకుని నాకు కనిపించు" అన్నాడు బాబా.

"బాబా మాటకు కాదని చెప్పే ధైర్యమా? ఎంతైనా పనిమనిషి" అలాగే బాబా అంటూ కవరును తీసుకొని తన గదిలోకి వెళ్ళి చీర విప్పి చూసిన దుర్గ ఆశ్చర్యపోయింది.

ఏ షాపులో కొన్నాడో, ఎంత శ్రద్ధగా ఎంపిక చేసాడో ఎన్ని దినార్లు పెట్టికొన్నాడో తెలియదుగానీ ఆకాశం రంగులోని చీర పట్టుకుంటే మాసిపోయేలా మెత్తగా వుంది.

సాయంత్రం స్నానం చేసాక బాబా కోరిక మేరకు ఆ చీర కట్టుకుని హాల్లోకి వచ్చింది దుర్గ. ఆమె కోసమే ఎదురు చూస్తున్నట్లుగా హాల్లో కూర్చుని ప్రొద్దుటి పేపరును మరలా తిరగేస్తున్నాడు బాబా.

బాబాను చూడగానే బిడియంగా తలుపుకు ఆనుకుని నిలబడిపోయింది దుర్గ. పచ్చటి పసిమి ఛాయగల దుర్గ ఆ నీలిరంగు చీరలో మెరిసిపోతోంది. కళ్ళార్పకుండా ఆమెనే చూస్తున్నాడు బాబా. కొద్దిసేపటికి ఆమె ఇబ్బందిగా కదిలి అక్కడనుండి లోపలికి పోబోయింది. తటాలున లేచి వచ్చిన బాబా ఆమెకు అడ్డంగా నిలబడ్డాడు. 'హలువ' (అందంగా వున్నావు) వాజిద్ హలువ (చాలా అందంగా వున్నావు) ఈ చీరలో చాలా బాగున్నావు. నీకోసం ఇంకో పది చీరలు తీసుకుని రానా? అని అడిగాడు తదేకంగా ఆమెనే చూస్తూ. ఏం చెప్పాలో అర్థంకాక సిగ్గుతో తలవంచుకుంది దుర్గ.

ఒక అడుగు ముందుకు వేసి ఆమె భుజం మీద చేయివేసాడు బాబా. భయపడిపోయింది దుర్గ. ఒక్కడుగు వెనక్కు వేసింది. ఇంతలో ట్రింగ్...ట్రింగ్‌మంటూ మామా గదిలోని బెల్లుమ్రోగింది. ఆ శబ్దానికి ఉలిక్కిపడి దూరంగా జరిగారు ఇద్దరూ.

వెంటనే తేరుకుని మామాగదిలోకి పరిగెత్తింది దుర్గ. ప్రత్యేకంగా చీరకట్టులో మెరిసిపోతున్న దుర్గను రెండు కళ్ళు విప్పార్చి చూసింది మామా. ఏదో సంశయం, సందేహం ఆ కళ్ళలో ప్రస్ఫుటంగా కనిపించాయి దుర్గకు.

ఏదో ప్రశ్నించాలని మామా పెదవులు కదిలాయి కానీ మాట స్పష్టంగా బయటకి రాలేదు.

కొన్ని ప్రశ్నలకి జవాబులు కాలమే చెబుతుంది. మనం ఎదురు చూడాలి అంతే.

అన్నట్లుగానే మరుసటి రోజు రకరకాల రంగుల్లో పదిచీరలు కొని పట్టుకొచ్చాడు బాబా ఖాలిద్. ఇవన్నీ నీకే తీసుకో దుర్గ చేతికి అందించాడు బాబా.

బాబాకు తనపట్ల గల దయకు సంతోషించింది దుర్గ. ఇంతకీ బాబాకు తనపట్ల వున్నది దయా? లేక అంతకు మించిన ఏదో భావమా? ప్రశ్నించుకుంటోంది దుర్గ.

ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో బాబా హాల్లో కూర్చుని టివి చూడటంతో కాలం గడిపేవాడు.

"రోజంతా మామాకు పరిచర్యలు చేసి అలసిపోతున్నావు. సాయంత్రం పూట వచ్చి హాల్లో కూర్చుని నాతోపాటు కాసేపు టి.వి చూడు" అనేవాడు బాబా. అలాగే అంటూ సాయంత్రం పూట హాల్లోకి చేరిపోయేది దుర్గ. బాబా కళ్ళు టివి వైపు కాక దుర్గ ముఖం వైపే ఎక్కువగా చూసేవి.

ఎవరూ లేని లంకంత ఇంట్లో మామా కాకుండా వీళ్ళిద్దరే తిరుగాడుతున్నారు. ప్రక్కమీదనుండి లేవలేని పరిస్థితి మామాది. లేవలేని పరిస్థితి. ఏకాంతం, కలిసి వచ్చిన సమయం కలగలిసి ఇద్దరూ ఒక్కటైపోవడానికి ఎక్కువరోజులు పట్టలేదు. వీళ్ళ మాటలూ, నవ్వులూ హాల్లోంచి వినబడుతూంటే గదిలోని మామా కళ్ళల్లో ఎన్నో ప్రశ్నలు కదలాడేవి. కానీ ఆ ప్రశ్నలు పెదవిదాటి బయటికి వచ్చేవి కావు. మరి అవి ఎప్పటికీ బయటికి రానేలేదు. ఒకరోజు మామా చనిపోవడంతో శాశ్వతంగా ఆ ప్రశ్నలన్నీ ఆమెతోపాటు సమాధి అయిపోయాయి.

భార్య మరణం బాబాను కాస్త కృంగదీసినప్పటికీ దుర్గ సాహచర్యంతో ఆమె స్నేహంతో తొందరగానే ఆయన కోలుకున్నాడు. ఇపుడు అంత ఇంట్లో వాళ్ళిద్దరే కాలం గడుపుతున్నారు. బాబాకు దుర్గే తన లోకమయిపోయింది. దుర్గతో గడిపే రోజులన్నీ ఆయనకు జీవితంలో క్రొత్తగా ఎంతో అద్భుతంగానూ కనబడుతున్నాయి. ఆయనకేకాదు దుర్గ పరిస్థితి కూడా అలాగే వుంది. అపుడెపుడో తాగుబోతు భర్తతో ఏం సుఖపడిందో గుర్తులేదు కానీ ఇప్పుడు సిరిసంపదలతో తులతూగే కువైటి బాబాతో సహజీవనం ఆమెను ఆకాశపు అంచుల్లోకి తీసికెళుతున్నాయి.

ప్రస్తుతం ఆ యింటికి ఆమే యజమానురాలిగా మారినట్లయింది. ఏదీ కొదువలేకుండా బాబా తెచ్చిపెడుతున్నాడు. బంగారపు బహుమతులతో ఆమెను ముంచేస్తున్నాడు. అదృష్టం అంటే తనదే అనుకుంటూ మురిసిపోయింది దుర్గ.

ఒకరోజు కొడుకు అహ్మద్‌ను కోడలిని తన ఇంటికి భోజనానికి పిలిచాడు బాబా.

అందరూ తింటున్న సమయంలో బాబా సంచలనమైన తన నిర్ణయాన్ని వారికి వినిపించాడు. మీ అమ్మ అనారోగ్యంతో తొందరగా నన్ను విడిచిపోయింది.

ఈ సమయంలో నా ఆలనాపాలనా చూసుకునేందుకు ఒక మనిషి కావాలి. అంతేకాదు. నాకు అన్ని సమయాల్లో తోడుగా ఆ మనిషి ఉండగలగాలి. ఈ వయసులో పెళ్ళిచేసుకోవడానికి కువైటీ అమ్మాయి నాకు దొరకదు. అందుకే దుర్గను పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను. ఆమెకు కూడా భర్త చనిపోయాడు. ఇలా ఆమెను, ఆమె పిల్లలను కూడా నేను ఆదుకోవచ్చు. ఇలా మోడుగా మిగిలిన ఒక స్త్రీకి జీవితాన్ని ఇచ్చినట్లవుతుంది" గబగబా వారికి అప్పచెప్పేసాడు బాబా.

బాబా మాటలు విన్న కొడుకూ కోడలూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు కళ్ళతోటే ఏవో మాట్లాడుకున్నారు. కోడలు నచ్చనట్లుగా మొహం చిట్లించింది. కొడుకు అహ్మద్‌కే కాక బాబాకు కూడా ఆమెకు ఇష్టంలేదని అర్థమయింది. అయితేనేం బాబాకు ఇష్టమయ్యాక ఎవరూ ఏమీ చెయ్యలేరు. ఆ సంగతి అహ్మదుకు బాగా తెలుసు. అందుకే నోరు పెగల్చుకుని "ఇబ్బా..నువు చెప్పేది నిజమే.

మంచిదే. కానీ పనిమనిషిని, అందులో హిందీ దాన్ని నువ్వు పెళ్ళిచేసుకుంటే ఏం బాగుంటుంది. మన వాళ్ళందరూ ఏమనుకుంటారు'' తన అభిప్రాయాన్ని కాస్త బాధగా వెలిబుచ్చాడు.

''హిందీ వాళ్ళయితే మనుషులు కారా? మన అరబ్బీ వాళ్ళే మనుషులా? అసలు మన సంస్కృతి, సాంప్రదాయాలు, పద్ధతులు, పరిపాలనా విధానంలాంటివన్నీ మనం భారతదేశం నుండి నేర్చుకున్నవే. వారినుండి తెచ్చుకున్నవే. ఆ కాలంలో పెట్రోలు మనకు వచ్చినప్పుడు, ధనవంతమైన దేశంగా కువైట్ ఆవిర్భవించినపుడు సమస్తము భారతదేశం నుండే ఎగుమతి చేసుకునేవాళ్ళం. భారత దేశంతో మనకు మంచి సంబంధాలు వున్నాయి. ఏదైతేనేం ఇంత ఇంట్లో ఒక్కడ్నే పడివుండటం, తోడు లేకుండా వుండటం నాకు అసాధ్యం. మీరు ఒప్పుకున్నా లేకపోయినా దుర్గను పెళ్ళి చేసుకోవడం ఖాయం.

జస్ట్ మీకు ఈ విషయం తెలియపరుస్తున్నాను అంతే అని ఖచ్చితంగా చెప్పేసాడు బాబా ఖలిద్.

సరే నీ యిష్టం బాబా అని చెప్పి కాస్త అయిష్టంగానే లేచి వెళ్ళిపోయారు వాళ్ళు.

తలుపు చాటునుండి వారి సంభాషణంతా వింటున్న దుర్గ బాబా పట్టుదలకు ఆశ్చర్యపోయింది. ఏదో తాత్కాలికంగా బాబా తనతో కాలక్షేపం చేస్తాడు అనుకుంది గానీ. ఇలా పెళ్ళి చేసుకోవాలనే నిర్ణయం తీసుకుంటాడని ఆమె ఊహించలేదు. ఏ జన్మలో పుణ్యం చేసుకుందో గానీ ఇలాంటి అదృష్టం కోరి వచ్చి మరీ తలుపు తడుతోంది. పనిమనిషి అయిన తనెక్కడ? ధనవంతుడు కువైటీ అయిన బాబా ఎక్కడ? నమ్మలేకపోతోంది దుర్గ. ఆడది వయసులో దొరికిందని కాలక్షేపం చేయకుండా పెళ్ళిచేసుకుని గౌరవాన్ని, భార్య హోదాను, కువైటీ దేశ పౌరసత్వాన్ని అందిస్తున్న బాబా గొప్పతనానికి చేతులెత్తి నమస్కరించాలనిపించింది దుర్గకు. కృతజ్ఞతతో అమాంతం వెళ్ళి బాబా కాళ్ళమీద పడిపోయింది.

కాళ్ళమీద పడిన దుర్గను పైకి లేవనెత్తాడు బాబా.

''ఇందులో నా గొప్పతనమేమీ లేదు. నా అవసరం అంతే. నాకు తోడుగా వుండి సపర్యలు చేయడానికి ఒక స్త్రీ అవసరం. అందుకు నీకంటే సమర్దురాలు ఇంకొకరు దొరకరు. నీకు కూడా నేను సహాయం చేసినట్లు అవుతుంది'' అన్నాడు బాబా చిరునవ్వు నవ్వుతూ.

అన్నట్లుగానే బాబా అదేవారంలో చట్టపరంగా దుర్గను పెళ్ళి చేసుకున్నాడు. కానీ అందుకోసం దుర్గ ఇస్లాం మతాన్ని స్వీకరించి తన పేరును 'దువా'గా మార్చుకోవాల్సి వచ్చింది. కష్టపడకుండానే సిరిసంపదలు దుర్గ కాళ్ళ దగ్గరికి వచ్చాయి. బాబా కారు డ్రైవింగ్ నేర్పించాడు. మంచి కారు కొనిచ్చాడు. అది తన అదృష్టం. ఇద్దరు బిడ్డలు కూడా ఇంటి దగ్గర ఏ కొరతా లేకుండా బాగా చదువుకుంటున్నారు. ఒక స్త్రీకి ఇంతకన్నా వేరే ఇంకేం కావాలి. ఇంతకన్నా మంచి జీవితం ఎవరికైనా లభిస్తుందా? పనిమనిషిగా చాకిరీ చేస్తూ వుండాల్సిన నేను కువైటీ మామాను అయ్యాను. నాలుగు ఇళ్ళు కట్టాను. పొలాలు కొన్నాను. అందుకు ఆ దేవునికి కృతజ్ఞతలు''. అంటూ తన కథను ముగించింది దుర్గ.

కథ విన్న నేను కూడా బాబా గొప్పతనానికి, ఔదార్యానికి ఆశ్చర్యపోయాను. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా దుర్గ జీవితంలో గొప్ప మార్పు సంభవించింది. ఆమె జీవితం కొత్త మలుపు తిరిగింది. ఇలాంటి మంచి విషయాలు అపుడపుడూ అక్కడక్కడా మనుషుల జీవితాల్లో జరుగుతూ ఉంటాయి.

# ఎడారిలో వెంకటలక్ష్మి కథ

**"అమ్మా నిన్ను** ఒకమాట అడుగుతాను. నిజం చెపుతావా?" తల్లి ప్రక్కనే సోఫాలో కూర్చుంటూ అడిగాడు కొడుకు సుధీర్.

"ఏంటిరా నాన్నా? అంతగా అడగాలా నన్ను? ఏనాడైనా ఏ విషయమైనా నీకు అబద్ధం చెప్పానా? నిన్ను అడక్కుండా, నీకు చెప్పకుండా ఏ పనయినా చేసానా? ప్రేమగా కొడుకు జుట్టు నిమురుతూ చెప్పింది వెంకటలక్ష్మి. "చాలా ఏళ్ళుగా నిన్ను ఈ మాట అడగాలి అనుకుంటున్నానమ్మా కానీ ఏదో భయం, ఆందోళన గొంతుకు అడ్డుపడి నిన్ను అడక్కుండా ఆపేసాయి. నాకు ఊహ తెలిసినప్పటినుండి ఇప్పటివరకు బయట వీధిలో నేను ముందు వెళుతుంటే నా వెనుక కొంతమంది చెప్పుకునే మాటలు వారి నవ్వులు నన్ను అనుక్షణం వెంబడిస్తున్నాయి. నన్ను ఎంతగానో కలవరపెడుతున్నాయి. స్కూల్లోని పిల్లలు కూడా మేము పోట్లాడుకున్న సందర్భాల్లో నన్ను ఒరే తురకోడా, అరబ్బోడా అంటూ హేళన చేసేవాళ్ళు. వాళ్ళు ఎందుకలా అంటున్నారో, నన్ను చూసి నవ్వుతున్నారో అప్పట్లో అర్థమయ్యేదికాదు. ఏళ్ళు గడిచేకొద్దీ నాలోని సందేహం పెరిగి పెద్దయి కొండలా మారిపోయింది. నాలోని ప్రశ్నలు భూతాల్లా నన్ను వెంటాడి వేధించేవి. ఒక్కోసారి ఏదో తెలియని బాధతో సరిగ్గా నిద్రపట్టదు. అందరిలో వున్నప్పుడు నా రూపం వేరేగా, ఎంతో ప్రత్యేకంగా కనిపిస్తోంది. నన్ను నేను అద్దంలో చూసుకుంటే నాకు నేనే ఎబ్బెట్టుగా కనిపిస్తున్నాను.

ఈ మధ్య నీ ఆరోగ్యం కూడా బాలేదు. నీకేమయినా అయితే నా ఈ ప్రశ్నలకి జవాబు చెప్పేవాళ్ళు ఈ ప్రపంచంలో ఎవ్వరూ వుండరు. నాయన బ్రతికి వున్నప్పుడు 'నాయనా నా గురించి ఏదో పెద్ద విషయం మీరు దాచిపెడుతున్నారు. నాకు జరిగిందేమిటో నిజం చెప్పు' అని అడిగాను.

కానీ నాయన "ఏమీ లేదురా సుధీరూ.. నీ గురించి చెప్పడానికి ఏముందిరా?" అంటూ కాలం గడిపేసాడు.

ఇక నిన్ను ఈ మాట ఎలా అడగాలో తెలియక, అడగటానికి మనసొప్పక ఇన్నాళ్ళుగా నా బాధను నేనే గుండెలో దాచుకుంటూ, అణుచుకుంటూ ఎంతో వేదన అనుభవించాను.

"ఇంతకీ నేను ఎవరి కొడుకునమ్మా? నా తండ్రి ఎవరు? నిజంగా నీ కడుపులోనే నేను పుట్టానా? లేక నన్ను ఎక్కడైనా తెచ్చి పెంచుకున్నావా? ఇప్పటికైనా నిజం చెప్పమ్మా?" దుఃఖం గొంతుకు అడ్డుపడటంతో మాటలు ఆపేసాడు సుధీర్.

ఇన్నేళ్ళుగా కొడుకు ఏదైతే అడగకూడదని కోరుకుందో అదే విషయాన్ని ఈరోజు అడిగేసరికి కలవరపడిపోయింది వెంకటలక్ష్మి. కొడుకు చేతిని గట్టిగా పట్టుకుని "నాయనా ఏదో ఒకరోజు నువ్వు ఈ మాట అడుగుతావని నాకు తెలుసు. నేను ఇంకెన్నాళ్ళు బ్రతుకుతానో తెలియదు. అందుకే ఈ రోజు నీకు చెప్పేస్తాను.

ఇన్నాళ్ళు నా హృదయంలో భద్రంగా దాచిపెట్టుకున్న నీ జన్మరహస్యాన్ని విప్పి చెప్పి నా గుండె బరువును దించుకుంటాను. " కన్నీళ్ళు చెంపలపైనుండి జారుతుంటే గతాన్ని గుర్తుచేసుకుంటోంది వెంకటలక్ష్మి. కువైట్‌లో వున్న కొన్ని నెలల కాలం తాను అనుభవించిన నరకాన్ని కొడుకుకు వివరించి చెప్పడానికి సిద్ధమయింది వెంకటలక్ష్మి.

"అమ్మా నీకంత బాధను కలిగించే విషయమైతే చెప్పొద్దులే అవన్నీ గుర్తుచేసుకుని నువ్వు ఏడవొద్దు" అన్నాడు సుధీరు తల్లి కన్నీళ్ళను తుడుస్తూ.

"లేదు నాన్న నీకు అన్నీ చెప్పాలి. తల్లిగా నువ్వు అనుభవిస్తున్న బాధను నేను గ్రహించగలనయ్యా. మనమంటే గిట్టనివాళ్ళు కొందరు నిన్నుచూసి హేళన చేస్తుంటే ఏమీ చేయలేని, నోరువిప్పి మాట్లాడలేని అశక్తురాలినై పోయానయ్యా. ఆనాడు కువైట్‌లో ఆ ఎడారి దేశంలో నాకు జరిగిన అన్యాయానికి, ప్రతిగా నువ్వు అనుభవించే శిక్ష ఎంత పెద్దదో నాకు తెలుసు.

లేదు నాన్నా.. నీ తల్లి జీవితంలోని విషాదగాథను నువ్వు వినితీరాలి. దాచిన సత్యాన్ని నువ్వు తెలుసుకోవాలి అనేదే నా కోరిక. కానీ ఎలా చెప్పాలో అర్థంకాక దాదాపు ఇరవైయేళ్ళు నాలో నేను చాలా మధనపడ్డాను.

మీ నాయన 'ఏమే వెంకటలక్ష్మి బిడ్డకు నిజం చెప్పమాకు. వాడు బాధపడుతూ జీవితాన్ని గడపడం నాకిష్టంలేదు. ఈ రహస్యాన్ని మన కడుపులోనే దాచుకుందాం. వాడు మన బిడ్డగానే ప్రపంచంలో బ్రతకనీ' అని ఎన్నోసార్లు నాకు చెప్పినాడు. అలాగే ఆయన చివరివరకూ ఆ రహస్యాన్ని తనలోనే దాచుకుని చనిపోయాడు. ఇపుడు నా చివరిరోజుల్లో నీకు నిజం చెప్పకుండా నేనుకూడా చచ్చిపోతే అ పై లోకాల్లో  నా ఆత్మకు శాంతి కలగదేమో. నీ తల్లి జీవితంలో జరిగిన కథ వివరంగా చెపుతాను" విను నాన్న.

ఇరవై రెండేళ్ళ క్రితం మా పెళ్ళయిన క్రొత్తలో ఆ సంవత్సరం వానచినుకు నేలపైన రాలక పెట్టిన పైర్లన్నీ ఎండిపోయి నష్టాన్ని మాకు మిగిల్చాయి. మరుసటి సంవత్సరంకూడా అదే పరిస్థితి ఎదురవ్వడంతో అప్పులు తడిపిమోపెడయ్యాయి.

అప్పులవాళ్ళు ఇంటిమీదకి వచ్చి అప్పు తీర్చకుండా కడుపుకు కూడు తినడానికి మీకు సిగ్గులేదా అని ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం మొదలుపెట్టారు. మాకు దిక్కుతోచలేదు. ఎప్పుడూ ఎవరి దగ్గరా ఒకమాట పడని మీ నాయన అప్పుల బాధతో అవమానంతో ఏం చేయాలో తోచని స్థితిలో వాళ్ళమాటలకి విలవిల్లాడిపోయాడు. ఇద్దరం కలిసి పురుగుల మందు త్రాగి చనిపోదాం అని నిశ్చయించుకున్నాం.

అదే రోజు మధ్యాహ్నం మన ఊళ్ళోకి ఒక ఏజంటు వచ్చాడు. అతడు కువైటులో పనులున్నాయనీ, మంచి జీతాలు ఇస్తారని పాస్‌పోర్టు తయారు చేయించుకుంటే నెల తిరగకముందే వీసా తెప్పిస్తానని ఆశపెట్టాడు. ఇదేదో బాగుంది మా ప్రాణాల్ని కాపాడే దేవుడిలా ఈ ఏజంటు వచ్చాడని మేము భావించి ఇద్దరం వెళ్ళి తనని కలిసాం. ఆడవాళ్ళకైతే అక్కడ పనులు ఎక్కువ వున్నాయని నెలరోజుల్లోనే వీస్తా వస్తుందనీ, అదే మగవాళ్ళకైతే దాదాపు నాలుగైదు నెలలు పడుతుందనీ చెప్పి నాకు ఒక్కదానికే పాస్‌పోర్టు తయారు చేయించాడు. 'అదేంటే నువ్వు వెళ్ళిపోతే ఇక్కడ నేను ఒక్కడ్నే ఎలా బ్రతకనే లక్ష్మి పోతే ఇద్దరం పోదామే' అంటూ మీ నాయన ఏడుపు మొదలుపెట్టాడు.

'మొదట వెంకటలక్ష్మి పోతే మూడునెలల్లో నీకు వీసా పంపిస్తాదిలే సుబ్రమణీ నువు ఏడవమాకు' అంటూ ఆ ఏజంటు మీ నాయనకు ధైర్యం చెప్పాడు. అలా అయితే మంచిదే అని మేము సరే అన్నాము.

అనుకున్నట్లుగా నెలరోజుల్లో వీసా వచ్చేసింది. ఆ ఏజంటే నన్ను నాతోపాటు ఇంకా పదిమంది వయసులో వున్న ఆడవాళ్ళని ముంబాయికి తీసుకెళ్ళి విమానం ఎక్కించాడు. అక్కడ కువైటులో విమానం దిగగానే మరలా అక్కడవున్న ఒక ఏజంటు వచ్చి మమ్మల్ని ఏర్‌పోర్టునుండి ఆఫీసుకు తీసికెళ్ళాడు. తొందరగా పనుల్లో చేరిపోయి డబ్బు సంపాదించాలనే ఆశతో ఉషారుగా వున్నాము మేము. నేనయితే పనిలో చేరిన వెంటనే మీ నాయనను కువైటుకు పిలిపించెయ్యాలని కలలు కంటున్నాను.

మరుసటి రోజు పనిమనుషులకోసం ఆఫీసుకు వచ్చిన కువైటీ బాబాలకు ఒక్కొక్క ఆడమనిషిని అమ్మేసాడు. వాళ్ళందరి సంగతీ నాకు తెలియదుగానీ నేను మాత్రం ఒక దుర్మార్గుడి చేతిలో పడ్డాను. ఆ కువైటీవాడు నన్ను తీసుకెళ్ళి ఊరికి అవతల ఎడారిలో వున్న వాడి గెస్ట్ హౌస్‌లో వుంచాడు. ఇక అప్పటినుండీ మొదలయింది నరకయాతన. ఒక విధంగా ఆ గెస్ట్‌హౌస్‌లో నన్ను బంధించేసాడు వాడు. నేను ఎక్కడికీ తప్పించుకుని పోకుండా అన్ని తలుపులకీ తాళాలు వేసి బయట ఒక బెంగాలీ వాచ్‌మెన్‌ని కాపలా ఉంచాడు. మొదటి రెండురోజులూ అన్నం పెట్టకుండా కనీసం నీళ్ళివ్వకుండా గదిలోనే వుంచేసారు. మూడవరోజు ఆ కువైటీ వాడు వచ్చి గది తలుపు తీసాడు.

వాడు నన్ను ఎందుకు అలా బంధించాడో అర్థంకాని అయోమయంతోనూ ఆకలి బాధతోనూ నాలోని శక్తి అప్పటికే హరించుకుపోయింది. లోపలికి వచ్చిన వాడి చేతిలో అన్నం పేకెట్లు వున్నాయి. వెకిలి నవ్వుతో నావైపు చూస్తూ 'బాగా ఆకలిగా వుందికదూ నీకు?' ప్రశ్నించాడు.

వాడినవ్వు చూపులు కంపరాన్ని కలిగించడంతో జవాబు చెప్పలేదు నేను.

'ఏయ్ అంత పొగరా నీకు? అడుగుతుంటే జవాబు చెప్పవే? ఇది నీదేశం కాదు. నీ ఇల్లూ కాదు. ప్రస్తుతం నా ఇంట్లో నా ఆధీనంలో బందీగా వున్నావు. నేను చెప్పినట్లు నువు వినాల్సిందే. నిన్ను ఏం చేసినా భరించాల్సిందే. లేకపోతే నిన్ను చంపడానికయినా వెనుకాడను నేను. నా మాట వినని ఆడదంటే నాకు అసహ్యం. అంతకు మించిన కోపం. కోపం వచ్చిందంటే నేను మనిషినే కాదు. ఆ సమయంలో ఏం చేస్తానో నాకే తెలియదు. కాబట్టి మర్యాదగా నేను చెప్పినట్లుగా విన్నావంటే బ్రతికిపోతావు. అందుకు ప్రతిఫలంగా ఎంతో కొంత డబ్బుకూడా నీకు ముట్టచెపుతాను. నాకూ లాభం.. నీకూ లాభం ఏమంటావు?' దగ్గరికి వచ్చి చేయి పట్టుకుని దగ్గరికి లాక్కున్నాడు ఆ నీచుడు. నా శాయశక్తులా ఎంతగానో ప్రతిఘటించాను నేను. కానీ వాడి పశుబలం ముందు నేను ఓడిపోయాను.

ఆ గెస్ట్‌హౌస్‌లో నేను బందీగా మారిపోయాను. వాడి కామానికి వికృత చేష్టలకి, అకృత్యాలకు బలిపశువునై పోయాను. రెండుమూడురోజులకి ఒకసారి వాడు అక్కడికి వచ్చేవాడు. వాడు వచ్చినప్పుడే నాకు తిండి దొరికేది. మిగతా రోజుల్లో బెంగాలీవాడు దయదలచి ఇచ్చే కొన్ని రొట్టెముక్కలే నాకు గతి. ఆ యింట్లోంచి బయటపడాలని ఎన్నో విధాలుగా నేను ప్రయత్నించాను. కానీ కిటికీలు కూడా తెరవడానికి వీల్లేని గదిలో నన్ను బంధించి ఉంచారు.

ఇక తప్పించుకునే మార్గం కనబడక, వాడు పెట్టే హింసలు భరించలేక చనిపోదామని కూడా ప్రయత్నించాను. కానీ ఏవిధంగా చనిపోవాలో అర్థంకాని విధంగా, ఏ అవకాశమూ లేకుండా చిక్కుబడిపోయివుంది నా పరిస్థితి. ఇంటిదగ్గర వున్న మీ నాయన గుర్తొస్తే నా గుండె చెరువైపోయేది. ఏం చేస్తున్నాడో, ఎలా వున్నాడో నా జాబుకోసం ఎంతగా ఎదురు చూస్తున్నాడో తలుచుకుంటే ప్రాణం గిలగిలా కొట్టుకునేది. పాపం నా ఆచూకీ తెలియక ఎంతగా అలమటించి పోతున్నాడో అనుకుంటేనే నాలోని శక్తి నిర్వీర్యమైపోయేది. కానీ ఏదో మూల ఏదో ఆశ కొట్టుకులాడేది. నా ప్రాణం ఆ ఎడారిలో కాకుండా మనదేశంలో మన నేలపైనే పోవాలని దేవుణ్ణి కోరుకునేదాన్ని.

ఒకరోజు ఎలాగైనా అక్కడినుంచి తప్పించుకుని పారిపోవాలని గట్టిగా నిశ్చయించుకున్నాను నేను. సమయంకోసం కనిపెట్టుకుని వున్నాను. ఆ రోజు ఉదయాన్నే బెంగాలీవాడు వచ్చి నా గది తలుపులు తెరిచి కాలకృత్యాల కోసమని బయట వరండాలో వున్న బాత్ రూములోకి పంపించాడు. వాడు ఆ రోజు ఎవరితోనో ఫోనులో మాట్లాడుతూ కాస్త ఏమరుపాటుగా వున్నాడు చిన్నగా బాత్‌రూము తలుపు తీసి చూసిన నేను వాడు అటు తిరిగి వుండగా ప్రక్కనే వున్న గోడ దూకి పారిపోయాను. అలా కొద్ది దూరం పరిగెత్తాక అర్థమయ్యింది నాకు అదంతా పెద్ద ఎడారి ప్రాంతమని.. చుట్టూ ఎటు చూసినా ఇసుక దిబ్బలే. ఏవైపు వెళ్ళాలో ఎటు వెళితే ఊరొస్తుందో అర్థంకాలేదు. ఏదయితే అది అయిందనుకుని ఆ బాబా చేతిలో నరకయాతన పడటం కంటే ప్రాణం పోయినా మేలే అనుకుని ముందుకు పరిగెత్తాను. అలా ఎంతసేపు పరిగెత్తానో నాకే తెలియదు. నా కాళ్ళలోని శక్తి హరించుకునిపోయేంతవరకూ పరిగెడుతూనే వున్నాను. సూర్యుడు తూర్పు ఆకాశంలో పైపైకి ఎగబ్రాకుతూ నట్టనడిమికి రావాలని ఆశపడుతున్నాడు. తీక్షణమైన సూర్యుడి కిరణాల్ని ఆ ఎడారిలో భరించగలిగే మానవుడు ఎవరు? క్రింద కాళ్ళు వేడి ఇసుకలో కూరుకుపోయి అడుగుతీసి అడుగువేయలేని స్థితి. పైన సూర్యుడు భగభగమండుతూ అగ్నిని నెత్తిపై క్రుమ్మరిస్తున్నాడు. మధ్యలో గాలికూడా వేడిని నింపుకుని ఈదురు గాలులతో శరీరాన్ని తాకి ఈడ్చి కొడుతోంది. ఎలా భరించగలను? నరకం కూడా ఇంతకంటే ఘోరంగా వుండదేమో..

అనుకుంటూ దేవుణ్ణి ప్రార్థించడం మొదలుపెట్టాను. నీడన చేరదామనుకుంటే ఎక్కడా కనుచూపు మేరలో చిన్న చెట్టుకూడా కనబడటంలేదు. దాహంతో గొంతు పిడచకట్టుకుపోతోంది. నీరసంతో వళ్ళు తేలిపోతోంది. ఇక శక్తి కోల్పోయి క్రింద పడిపోతానేమో, ఈ ఎడారిలో శాశ్వతంగా ఇసుకలో కలిసిపోతానేమో అనుకుంటుండగా ఏదో ఒక జీపులాంటిది అటువైపు రావడం గమనించాను. పోయే ప్రాణం లేచి వచ్చి లేని ఓపిక తెచ్చుకుని రక్షించమని కేకలు వేస్తూ ఆ జీపుకు ఎదురుగా పరిగెత్తాను. నన్ను చూడకుండా అటువైపుగా వెళ్ళిపోతున్న ఆ జీపు నేను కేకలు వేస్తూ ఎదురుగా పరిగెత్తడం గమనించి ఇటు తిరిగి నావైపుగా వచ్చింది. హమ్మయ్య నిర్మానుష్యంగా వున్న ఈ ఎడారిలో ఎవరో నన్ను కాపాడటానికే ఇక్కడికి వచ్చినట్లుంది. చచ్చి బ్రతికాను. ఇంకాసేపు ఇక్కడే వుంటే ప్రాణాలు గాల్లో కలిసిపోయేవి అనుకుంటూ సంతోషంగా జీపు దగ్గరకి చేరుకున్నాను.

అక్కడ.. జీపులో వున్న వ్యక్తిని చూడగానే నా ప్రాణం కడగంటిపోయింది. ఊపిరి ఆగిపోయింది. భయంతో స్పృహ తప్పి అక్కడే కుప్పకూలిపోయాను. కళ్ళు తెరిచి చూసేసరికి యధావిధిగా అదే గెస్ట్‌హౌస్‌లో, అదే రూములో కాళ్ళూ చేతులు బంధించబడి వున్నాను.

ఉన్నట్లుండి ఒకరోజు వాంతులు, తలతిరగటం మొదలయ్యాయి. నెలకు ఖచ్చితంగా వచ్చేనెలసరి కూడా గతనెలనుండీ రాలేదు. ఏదో భయం నాలో మొదలయింది. ఏమయిందో అర్ధమయ్యేసరికి దిగులు పడిపోయాను.

నా వాంతులు చూసిన వాడికి కూడా నా పరిస్థితి అర్ధమైనట్లుంది నచ్చనట్లుగా కఠినంగా ముఖం చిట్లించాడు వాడు. కొద్దిసేపు ఆలోచించి నా దగ్గరికి వచ్చి బూటుకాలితో నా కడుపుపై బలంగా తన్నాడు. ఒకసారి కాదు రెండుసార్లు కాదు వాడి శక్తి వున్నంతవరకూ ఫుట్‌బాల్‌లాగా నన్ను కాళ్ళతో తన్నాడు. 'ఏమే నిన్ను ఆ ఏజంటు దగ్గర ఎన్ని దినార్లు ఖర్చుపెట్టి కొనుక్కున్నానో తెలుసా? కాస్త అందంగా వున్నావని, పనికొస్తావని నాన్రోజులు వాడుకోవచ్చని కొనుక్కున్నాను. కానీ మూడునెలలు తిరక్కముందే కడుపు తెచ్చుకుంటే నా మోజు ఎవరు తీరుస్తారే?' అంటూ కోపంగా తిడుతున్నాడు. వాడి పాపాన్ని నా కడుపులో మోయడం ఇష్టంలేక వాడి తన్నులకి గర్భస్రావం కావాలని నేను ఎంతగానో కోరుకున్నాను. కానీ నేను అనుకున్నట్లుగా జరగలేదు. అప్పటినుండి వాడు ఇద్దరు స్నేహితులను కూడా ఆ గెస్ట్‌హౌస్‌కి తీసుకురావడం మొదలుపెట్టాడు. గర్భవతిననికూడా చూడకుండా, దయలేకుండా అందరూ కలిసి అమానుషంగా నా శరీరాన్ని అనుభవించేవాళ్ళు.

'ఇది ఇంకో రెండునెలలు 'పనికి' వస్తుంది యూసెఫ్. తరువాత కడుపు పైకి వస్తే ఎందుకూ పనికిరాదు "దీన్ని చంపి ఎడారిలో పడేసి ఇంకో క్రొత్త ఆడదాన్ని కొనుక్కుందామా?" అంటున్నాడు బాబా అహ్మదు. వారి క్రూరమైన మాటలు విని వళ్ళు జలదరించింది నాకు. ఏం చెయ్యాలో తోచలేదు. ఏం చెయ్యాలన్నా ఒంట్లో శక్తికూడా లేదు. ఆ రోజు వాళ్ళు వెళ్ళిపోయాక ఓపిక తెచ్చుకుని వెళ్ళి బెంగాలీ వాడి కాళ్ళమీద పడ్డాను 'భయ్యా నీ చెల్లెలిలాంటిదాన్ని నన్ను కాపాడు. తొందరలో వీళ్ళు నన్ను చంపేస్తారు. నువ్వే జాలితో నన్ను కాపాడాలి. అల్లా నిన్ను చల్లగా చూస్తాడు' అంటూ బ్రతిమిలాడాను. ఏ దేవుడు దయతలచాడో తెలియదు కానీ వాడికి ఆ రోజు కాస్త మంచి బుద్ధి కలిగినట్లుంది. 'నీ మెడలో ఉన్న గొలుసు, చెవికి ఉన్న కమ్మలు, వేలికి ఉన్న ఉంగరం నాకిస్తే నిన్ను బయటికి పంపించే మార్గం 1లోచిస్తాను. నాకు కూడా ఏదో ఒక లాభం ఉండాలిగా"

'అంతకన్నానా భయ్యా అన్నీ తీసుకో' అంటూ వంటిపైనున్న బంగారమంతా వలిచి ఇచ్చేసాను నేను.

'సరే నువ్వు కాసేపు వుండు. నేను ఆలోచిస్తాను' అంటూ వెళ్ళిపోయాడు. సాయంకాలానికి ఒక వ్యక్తితో తిరిగివచ్చి, ఇతనితో వెళ్ళిపో సామాన్లు మోసే లారీలో కూచోబెట్టుకుని నిన్ను ఇండియా ఎంబసీకి చేరుస్తాడు. పో బ్రతుకు పో' అంటూ అతనికి నన్ను అప్పగించాడు. నాకు కలా నిజమా అనేది అర్ధంకాలేదు. నిజంగా ఆ యింట్లోంచి ప్రాణాలతో నేను బయట పడగలుగుతున్నాను అంటే

నమ్మలేకపోయాను. ఆ బెంగాలీ వాడికి చేతులెత్తి నమస్కరించి లారీ ఎక్కి అందులోని సామాన్ల మధ్యలో ఒదిగి కూర్చున్నాను. అంతులేని ఆ ఎడారిలోనుండి ఆ లారీ జనవాసానికి బయలుదేరింది. అలా రెండుగంటలపైగా ప్రయాణించిన మేము ఆ రాత్రికి ఇండియా ఎంబసీకి చేరుకున్నాము. అతడు నన్ను ఇండియా ఎంబసీ గేటు దగ్గర వదిలేసి వెళ్ళిపోయాడు. మాటలురాక కృతజ్ఞతగా అతనికేసి చూసి నమస్కరించాను నేను.

అందంగా ఠీవిగా ఎర్రటి రాళ్ళతో కట్టబడిన కట్టడం నా ఎదురుగా వుంది. అభాగ్యులను ఆదరించే తల్లిలా నాకు కనబడింది. దానిపైన మూడురంగుల ముచ్చటైన జండా గాలికి ఎగురుతూ నన్ను రా రమ్మని పిలుస్తోంది. మన జాతీయ పతాకాన్ని చూడగానే ఈ పరదేశంలో మన ఎంబసీలో ప్రాణం పోయినా పరవాలేదనిపించింది. నాకెంతగానో ధైర్యమొచ్చింది. ఇక నాకు భయంలేదనిపించింది. మరలా మీ నాయనను కళ్ళతో చూస్తాను అని నమ్మకం కలిగింది. అక్కడ మన ఎంబసీలో దాదాపు పదిరోజులు వున్న తరువాత నా పరిస్థితి తెలిసి జాలిపడిన ఎవరో దాతలు సహాయం చేస్తే, టిక్కెట్ కొని పెడితే నన్ను ఫ్లయిట్ ఎక్కించి మనదేశానికి పంపించేసారు.

ఎలాగో ప్రాణాలు దక్కించుకుని కొన ఊపిరితో ఇంట్లోకి వచ్చి పడ్డాను నేను. ఇక్కడ మీ నాయన పరిస్థితి నాకంటే దయనీయంగా వుంది. నా జాడ తెలియక, ఏమయ్యానో అర్థంకాక, జవాబులేక చెప్పేవాళ్ళెవరూ దొరకక అల్లాడిపోయి ఆరోగ్యాన్ని పాడుచేసుకున్నాడు. నన్ను చూడగానే ఆయన కళ్ళలోకి వెలుగు వచ్చింది. వంట్లోకి శక్తి వచ్చింది. ఒకర్నొకరం కౌగిలించుకుని బావురుమని ఏడ్చాం. అది ఏడుపో, ఆనందభాష్పాలో మాకే అర్థంకాలేదు. ప్రాణంతో మళ్ళీ మన దేశానికి తిరిగి వస్తానని మన ఇంటినీ మీ నాయనను కళ్ళతో చూస్తానని అనుకోలేదు. దేవుడు నామీద ఎంతో దయవుంచి నన్ను క్షేమంగా ఇంటికి చేర్చాడు. చిత్రహింసలనుండి ఎడారిలోని ఆ జైలు నుండి విడిపించబడతానని కలలో కూడా ఊహించలేదు. నా పరిస్థితిని, నేను అనుభవించిన కష్టాల్ని మీ నాయనకు చెప్పుకుని ఏడ్చాను. మీ నాయన నన్ను ఓదార్చి ధైర్యం చెప్పాడు. అప్పటికే నాకు అయిదోనెల వచ్చేసింది. ఈ పాపాన్ని కడుపులో మోయలేనని అబార్షన్ చేయించుకుంటానని పట్టుబట్టాను నేను. కానీ మీ నాయన మహానుభావుడు. అందుకు ఒప్పుకోలేదు. బిడ్డపుట్టనీ మన బిడ్డగానే పెంచిపెద్ద చేద్దాం అని నచ్చచెప్పాడు. అలా నేను నీకు జన్మను ఇవ్వడం జరిగింది. నీ రూపం అచ్చమైన అరబ్బులాగా, బాబా అహ్మదులాగా వుండటంతో నిన్ను చూసిన వారందరూ గుసగుసలాడుకోవడం చెవులు కొరుక్కోవడం నవ్వుకోవడం జరిగేది. మనుషుల నైజం అంతే. వారికి ఏం జరిగిందో నిజం తెలియదు. మీ నాయన నేను నిన్ను కళ్ళల్లో పెట్టుకుని చూసుకున్నాం. ఇక నీకు మంచి పిల్లను చూసి పెళ్ళి చేసేస్తే నా బాధ్యత తీరిపోతుంది. తరువాత నా ప్రాణం పోయినా ఫరవాలేదు" అంటూ కువైటులో తనకు జరిగిన అన్యాయాన్ని కొడుకుకి వివరించింది వెంకటలక్ష్మి.

తన పుట్టుకకు గల కారణాన్ని ఆ కథను తెలుసుకున్న వెంటనే తల్లి కాళ్ళకు నమస్కరించాడు సుధీర్. "అమ్మా నువ్వు నాయన ఎంత గొప్పవాళ్ళమ్మా. నీ కడుపులో పుట్టడం నేను చేసుకున్న అదృష్టం అమ్మా. అలాగే నాయన నాకు కన్న తండ్రి కాకపోయినా ఆయన నన్ను తన బిడ్డలానే చూసుకున్నారు. ఆయన ఎంతో గొప్పవాడమ్మా! ఆయన కొడుకుగా పెరగడం ఆయన పేరు చెప్పుకోవడం ఆయన వంశానికి వారసుడినవడం నా పూర్వజన్మ సుకృతం. కాముకుడయిన నా అసలు తండ్రి ఎవడో నాకు తెలియదు. కానీ వాడు కనిపిస్తే నిజంగా నీకు జరిగిన అన్యాయానికి వాడ్ని చంపి పాతేయాలని వుంది. ఆ దుర్మార్గుడి రక్తం నాలో ప్రవహిస్తున్నందుకు సిగ్గుగా వుందమ్మా" అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నాడు సుధీర్.

''ఇందులో నీ తప్పేం వుంది నాయనా? అంతా విధిరాత. అంతే. మనుషుల జీవితాలతో ఆ దేవుడు అపుడపుడూ సరదాగా ఆడుకుంటాడు. మన రాత ఎలా వుంటే అలా అనుభవించాల్సిందే తప్పదు మరి'' అంటూ నిట్టూర్చింది వెంకటలక్ష్మి.

## *రాజుగారి పాలెస్*

**కువైటు పట్టణానికి** కాస్త దూరంలో అరేబియా సముద్రపు ఒడ్డున పదెకరాల స్థలంలో కట్టబడి వుంది ఆ రాజ భవనం. పరిపాలనతోనూ, రాజకీయ వ్యవహారాలతోనూ అలసిపోయినప్పుడు కువైటు రాజుగారు అక్కడికి వచ్చి విడిది చేసే విశ్రాంతి భవనం అది. ఒక విధంగా చెప్పాలంటే అది విశ్రాంతి భవనమే కాదు. అన్ని రకాల సదుపాయాలతోనూ హంగులతోనూ ఆడంబరంగా నిర్మించబడిన విలాస భవనం కూడా.

తన ఒత్తిడిని అలసటను మరిచిపోవడానికి నెలకో, రెండు నెలలకో ఒకసారి వచ్చి మూడు నాలుగురోజులు అక్కడ వుండి తనకు నచ్చిన విధంగా గడిపి తిరిగి పట్టణంలో వున్న తన ప్యాలెస్‌కి పోతుంటాడాయన. రాజుగారు అన్ని రోజులూ అక్కడ లేకపోయినా ఆయన ప్రతిరోజూ అక్కడ వున్నట్లుగానే భావించి అన్ని పనులూ యధావిధిగా శ్రద్ధగా భయంతో చేసుకుని పోతుంటారు అక్కడి పనివారు.

వంటశాల, వ్యాయామశాల, ఆటస్థలం, చుట్టూ వున్నతోట అన్నీ కూడా అన్నివేళల్లోనూ అందంగా, క్రమంగా శుభ్రంగా వుంచుతారు. ఇక రాజుగారు అక్కడ నాలుగురోజులు వుండటానికి వస్తున్నారు అని తెలియగానే నాలుగురోజుల ముందే సందడి మొదలవుతుంది. ప్రత్యేక అలంకరణతో పర్యవేక్షణతో ఆ భవనం కళకళలాడిపోతుంటుంది.

అత్యంత సంపన్న దేశమైన కువైట్ రాజుకు ఏమి కొదువ? నీటి జల నిరంతరం భూమిలోనుండి ఉబికి వస్తున్నట్లుగా పెట్రోలు ఆ ఎడారి నేలలోనుండి నిరంతరం పైకి వచ్చి దినార్లను క్రుమ్మరిస్తుంటే రాజేకాదు అక్కడి ప్రజలు కూడా విలాసవంతమైన జీవితానికి అలవాటు పడినవారే. రాజుగారి విశ్రాంతి భవనం కాబట్టి అక్కడ కాపలా భద్రత కూడా చాలా పటిష్టంగా ఏర్పరచబడివుంటాయి. అనుమతి లేకుండా సరైన కారణం లేకుండా ఎవరూ ఆ భవనపు దరిదాపుల్లోకి కూడా రాలేరు. దాదాపు వందమంది అక్కడేవుండి పనిచేసేవారు మరోవందమంది రోజూ బయటనుండి వచ్చి ఆఫీసు పనులు చూసి తిరిగివెళ్ళేవాళ్ళు వున్నారు. బయటనుండి ప్రతిరోజూ వచ్చిపోయే ఉద్యోగులను ఏ భేదమూ లేకుండా కాపలావాళ్ళు క్షుణ్ణంగా తనిఖీ చేస్తుంటారు. వారి సామాగ్రిని, హ్యాండ్ బాగులను మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని బయట గదిలోనే భద్రపరుస్తారు. అవసరమైనంతవరకే విధిలో భాగంగా వారి సామానును లోపలికి తీసుకెళ్ళటానికి అనుమతిస్తారు. అలాగే ప్యాలెస్‌లో పని ముగించుకుని బయటికి వెళ్ళేవారిని ఎయిర్‌పోర్టులో కంటే ఎక్కువగా తడిమి మరీ పరిశీలించి చూసి ఏమీలేవని నిర్ధారణ చేసుకుని బయటకి పంపిస్తారు. ఈ తనిఖీలు అన్నీ ముగించుకుని, సంతకాలు చేసి అన్నీ యధావిధిగా సర్దుకుని లోపలికి రావడానికే అర్ధగంట గడిచిపోతుంది.

సుశిక్షుతులైన, బలిష్టమైన, కాపలావాళ్ళు భవనపు ద్వారం దగ్గర కాపలాకొరకు, తనిఖీల కొరకు నియమించబడతారు. బయటినుండే కాదు ఆ భవనంలోపలినుండి కూడా ఒక్క పూచికపుల్లను కూడా తీసుకుని పోకుండా కట్టుదిట్టమైన కాపలా అక్కడ వుంది. మరి రాజమహల్ అన్నాక ఎంతో విలువైన వస్తువులు అక్కడ వుంటాయి కదా.

పనివారు ఏ కాస్త అశ్రద్ధ చూపించినా పనిలో అలక్ష్యం చేసినా వెంటనే వారు పనిలోనుండి తొలిగించబడతారు. ఇక పొరపాట్లు తప్పులు చేస్తేవారి శిక్షల గురించి చెప్పనవసరంలేదు.

జీతాలు ఎక్కువగా వుంటాయని, హోదా వుంటుందని పనులు చేయటానికి ఆశపడతారు కానీ ప్రతిదినం వారి జీవితం కత్తిమీద సాముచేయడం లాంటిదే విధుల్లో భాగంగా చిన్నపొరపాటు జరిగినా పెద్ద శిక్షకు లోనవ్వాలి అనే విషయం అక్కడ పనిచేసే వారందరికీ బాగా తెలుసు. వీటన్నింటికీ సిద్దపడే వస్తారు వీళ్ళు. పనిలో చేరే ముందే కాంట్రాక్టు పేపర్లపై అన్ని విషయాలు తెలియజేయబడతాయి. వాటిని చదివి ఆ నిబంధనలన్నింటిని అంగీకరించి సంతకాలు చేసిన తరవాతే అక్కడి విధుల్లో నియమింపబడతారు. మరి కువైటు రాజుగారి కొలువు అంటే చిన్నమాటలా? వళ్ళు దగ్గరపెట్టుకుని పనిచేయాలి మరి. రక్తసంబంధీకులు, బంధువులు, స్నేహితులులాంటి ఏ ఇద్దరుకూడా అక్కడ ఆ ప్యాలెస్‌లో పనిచేయకూడదు. దగ్గరవాళ్ళు ఇద్దరు కలిసి కుట్రలు కుతంత్రాలు దొంగతనాలు చేస్తారేమో అనివారి అభిప్రాయం.

ఆ రోజు ఉదయాన్నే 8గంటలకి జరిగిన సమావేశంలో మానవ వనరుల విభాగపు అధికారి (HR మేనేజర్) కూడా పాల్గొన్నాడు. ''రాజుగారు ఈనెల పదవతేదీనుండి పధ్నాలుగో తేదీవరకు వారాంతంలో మన ప్యాలెస్‌లో గడుపుతారు. కావున అందరూ వారిని ఆహ్వానించడానికి, పరిచర్యలు చేయడానికి సిద్ధంగా వుండండి. వంట గదిలోని పాత ఫర్నిచరు వెండి గిన్నెలు, బంగారు స్పూనులు, కట్లెరీస్, వంట పాత్రలు అన్నీ స్టోరు రూమ్‌లో పడేసి ఈ మధ్యే జర్మనీ నుండి తెప్పించినవన్నీ అమర్చి వుంచండి. అలాగే డైనింగ్ టేబుల్స్ నీ, రాజుగారిగదిని ప్రత్యేకంగా అలంకరించండి. రాజుగారికి ఏ లోపం రాకుండా చూసుకోవాలి. చిన్నపొరపాటునుగానీ, నిర్లక్ష్య ధోరణిగానీ క్షమించి వదిలి పెట్టేది లేదు'' అంటూ ఆజ్ఞలు జారీ చేసి జాగ్రత్తలు చెప్పాడు. చేతులు కట్టుకుని నిలబడివున్న పనివారందరూ అలాగే అంటూ శ్రద్ధగా భయంగా తమ అంగీకారాన్ని తెలిపారు. ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈసారి ఆయనతో పాటు మహారాణిగారే కాదు వారి ముద్దుల కుమార్తె యువరాణి అయేషా కూడా వస్తున్నారు. రాజుగారు వచ్చారు నాల్రోజులు గడిపి వెళ్ళిపోయారు. ఆయన అక్కడ వున్నన్ని రోజులూ కంటిమీద కునుకు లేకుండా కాపలావాళ్ళు, అధికారులు అందరూ అలర్ట్‌గా వున్నారు. ఆయన కనిపించినప్పుడల్లా పనివారందరూ ''సలామా లేకుం'' అంటూ ఎంతో వినయంతో భక్తితో వంగి వంగి సలాములు చేసి తమ విధేయతను చాటుకున్నారు. పట్టణానికి మరోవైపున ఇంకో రెండు విలాస భవనాలు వున్నప్పటికీ రాజుగారికి సముద్రపు ఒడ్డున వున్న ఈ ప్యాలెస్ అంటేనే ఎంతో మక్కువ. కాబట్టి రాణీ సమేతంగా వచ్చి ఆయన ఇక్కడ విడిది చేస్తుంటారు.

''ఏంటీ క్రొత్తగా పనికి చేరావా?'' పలకరించింది. తన బ్యాగులన్నింటినీ పరీక్షించి చూస్తున్న సెక్యూరిటీ వాడిని రూములు శుభ్రంచేసే జయ.

ఆమె పలకరింపుతో తలెత్తి ఆమె ముఖంలోకి పరిశీలనగా చూసాడు వాడు. పలకరింపుగా నవ్వింది జయ. అందమైన ఆమె ముఖం, అరవిచ్చిన పెదాలు, ఆకట్టుకునే ఆమె నవ్వును చూసి ఒక క్షణం తడబాటుకు లోనయ్యాడు వాడు. కానీ వెంటనే తెప్పరిల్లి ఆమె ప్రశ్నకు జవాబు చెప్పకుండా తన విధిని నిర్వహించి ఆమెను పంపించేసాడు. వెళుతూ వెళుతూ వెనక్కి తిరిగి చూసి మరో నవ్వును విసిరింది జయ. మరుసటి రోజు వాడే పలకరించాడు ''నీ పేరేంటి?'' అంటూ...

''నా పేరు జయ. మరి నీ పేరేంటి?'' తిరిగి ప్రశ్నించింది నవ్వుతూ.

''మోహన్. క్రొత్తగా ఇక్కడ చేరాను. ఇక్కడ పని చేయడం కాస్త భయంగానే వుంది.'' చెప్పాడు కంగారుగా.

"ఏం ఫర్వాలేదు. అలవాటయితే అంతా బాగుంటుంది భయపడకు" అంది ఆమె.

"సరే ఇక వెళ్ళు. ఎక్కువగా మాట్లాడితే బాగుండదు. ఎవరన్నా చూస్తే ప్రమాదం" అంటూ ఆమెను చెక్ చేసి పంపించేసాడు మోహన్.

నవ్వుతూ తిరిగి అతనికేసి చూస్తూ లోపలికి వెళ్ళిపోయింది జయ.

అలా ప్రతిరోజూ వాళ్ళిద్దరూ జయ ఆ ప్యాలెస్‌లోకి వెళ్ళేముందు తిరిగి వెళ్ళిపోయేప్పుడు చిన్నగా ఎవరికీ తెలియకుండా రెండు మాటలు మాట్లాడుకునేవాళ్ళు. తన విధి నిర్వహణలో అక్కడ పనిచేసే వారితో స్నేహాన్ని, సంబంధాన్ని నెలకొల్పడం తప్పని తెలిసినా రోజురోజుకూ జయతో స్నేహాన్ని పెంచుకుంటూ పోయాడు మోహన్. ఆ స్నేహం నెలరోజుల తరువాత పిచ్చి వ్యామోహంగా మారిపోయింది. ప్రతిరోజూ జయను చూడకుండా, మాట్లాడకుండా వుండలేని స్థితికి వచ్చేసాడు మోహన్.

"నేను వచ్చి రెండేళ్ళు పూర్తి అయింది. సెలవులకి నన్ను ఇంటికి పంపిస్తే బాగుంటుంది" చెప్పింది జయ తన అధికారితో.

"సరే నెలరోజులు సెలవు ఇస్తాను వెళ్ళిరా, కానీ ఇప్పుడేకాదు. ఈ నెలలో మరలా మన రాజుగారు నాల్రోజులు ఇక్కడ వుండటానికి వస్తారంట. వాళ్ళు వచ్చి వెళ్ళిన తరువాత నువు వెళుదువుగాని" చెప్పాడు అధికారి.

"అలాగే. నా పాస్‌పోర్టు కూడా ముందుగానే ఆఫీసులోనుండి నాకు ఇప్పించాలి" చెప్పింది జయ.

"వారం రోజుల ముందుగా నాకు గుర్తు చెయ్యి. ఆఫీసునుండి తెచ్చి ఇస్తాను" చెప్పాడు ఆ అధికారి.

ఆ రోజు రౌండ్స్‌కి భవనంలోపలికి వచ్చాడు మోహన్. అతని కళ్ళు జయకోసం అదేపనిగా ఆ ప్రాంగణమంతా వెతుకుతున్నాయి. ఎక్కడైనా జయ కనిపిస్తుందేమో అని ఆశగా కిటికీలగుండా లోనికి తన చూపుల్ని మళ్ళిస్తున్నాడు. జయ మీది ధ్యాసతో తన కర్తవ్యాన్ని, బాధ్యతను కూడా మరిచిపోతున్నాడు. కనులముందు ఎల్లప్పుడూ సమ్మోహనమైన జయ చిరునవ్వే కదలాడుతోంది. ఆ నవ్వుకోసం మెరిసే అందమైన ఆమె ముఖాన్ని చూడటం కోసం తన పనిని ప్రక్కకు నెట్టేసి, లోపలికి వెళ్ళిపోయి ప్రతిగదినీ వెతకాలనిపిస్తోంది. తమ ఇద్దరిమధ్యా వున్న స్నేహాన్ని గురించి అక్కడ పనిచేసే ఏ ఒక్కరికి తెలిసినా వెంటనే ఉద్యోగాలు ఊడిపోతాయని అతనికి బాగా తెలుసు. అయినా కూడా పరిస్థితులు, పద్దతులను లెక్కచేసే స్థితిలో లేడతడు. ప్రేమ ముదిరిపోయి పిచ్చిగా మారితే కంటికి ఏదీ కనిపించదు. చెవికి ఏదీ వినిపించదు.

విధినిర్వహణలో భాగంగా రౌండ్స్‌కి వెళ్ళినట్లుగాలేదు మోహన్ ప్రవర్తన. జయ ఎక్కడుందో, ఏం చేస్తోందో ఒకసారి చూస్తే బాగుండు అనే భావనే అతనిలో నిండిపోయి వుంది. భవనం చుట్టూ తిరుగుతూ అన్ని గదులూ దాటి జయ కనిపించలేదని నిరాశగా తోటలోకి ప్రవేశిస్తుండగా ఆఖరి గది కిటికీలోనుండి 'మోహన్ ఇటురా' అంటూ వినిపించింది జయ స్వరం.

జయ గొంతు వినగానే ఉత్సాహం ఉప్పొంగింది మోహన్‌లో. నిరాశ మటుమాయం అయిపోయి ఒక్కంగలో పరిగెత్తుకుంటూ జయ నిలబడివున్న కిటికీ దగ్గరికి పరిగెత్తుకొచ్చాడు. మోహన్ ఆత్రం చూసి నవ్వింది జయ. ఆ నవ్వే అతడికి కావలిసింది. ప్రపంచాన్ని కనులముందు ఆవిష్కరిస్తోంది. ప్రపంచాన్ని ఎడమచేత్తో అవతలికి నెట్టేసి ఆ నవ్వును చూస్తూ తరించిపోవాలని వుంది. ఒక్క నిముషం తనను తానే మరిచిపోయాడు మోహన్. "ఇదిగో ఈ బాక్స్‌లో బిరియాని వుంది నీకోసమే తీసి వుంచాను. తోటలోకి వెళ్ళి కూర్చుని తినేయ్" అంటూ ఒక బాక్స్ అతని చేతికి అందించింది జయ.

జయకు తనమీదగల ప్రేమకు పొంగిపోతూ ఆ బాక్స్‌ను అపురూపంగా అందుకున్నాడు మోహన్. అలా అపుడపుడూ అతడు రౌండ్స్‌కి వచ్చినప్పుడల్లా కిటికీలోనుండి అతనికి ఏదో ఒక ఆహారాన్ని అందిస్తుండేది.

ఆ నెలలో అనుకున్నట్లుగానే రాజుగారు రాణీ సమేతంగా న్నాల్రోజులు వుండటానికి విచ్చేసారు. పనివారందరూ హుషారుగా ఉత్సాహంగా పనిలో మునిగిపోయారు. యువరాణిగారికైతే ప్రత్యేకంగా పదిమంది పనికత్తెలు వున్నారు. ఆమె గదిని శుభ్రం చేయడం మొదలుకొని ఆమెకు వళ్ళు మసాజ్ చేయడం వరకూ అందరూ ప్రత్యేకంగా విధుల్లో నియమింపబడ్డారు. వారందరిలోనూ జయ పని ముఖ్యమైనది. అందరికీ పనులు, బాధ్యతలు అప్పగించి అన్నీ క్రమంగా సక్రమంగా జరుగుతున్నాయో లేదో పర్యవేక్షించడం ఆమె పని. యువరాణికైతే జయమీద చాలా నమ్మకం. అన్ని పనులనూ ఆమె సమర్ధవంతంగా నిర్వహిస్తుంది అనే ఉద్దేశంతో అందరిపైనా పర్యవేక్షణకు ఆమెను నియమించారు.

అన్నట్లుగానే జయ పై అధికారి పాస్‌పోర్టును, టిక్కెట్‌ను జయకు అందించాడు. ఇంకో మూడురోజుల్లో రాజుగారు అక్కడినుండి వెళ్ళిపోగానే జయ ప్రయాణం. అన్నీ సర్దుకుని ప్రయాణానికి సిద్ధపడింది జయ.

ఆ రోజు రాజుగారు ఆయన కుటుంబం పట్టణంలోనికి తిరిగి వెళ్ళిపోతున్నారు. జయ దగ్గరుండి మరీ పెట్టెలు, బట్టలు సర్ది కార్లల్లోకి ఎక్కించింది. యువరాణి అయితే జయ సమర్ధతకు చాలా సంతోషించింది. సెలవులకు ఇంటికి వెళుతోందని తెలిసి రెండువందల దినార్లు కానుకగా జయకు అందించింది. నెలరోజులు సెలవులను గడిపేసి తిరిగి వచ్చెయ్యమని చెప్పింది. ప్రేమగా కరచాలనం చేసి కారెక్కింది యువరాణి. "మా సలాం, షుక్రాన్" అని వంగి సలాం చేసి విధేయతను చూపించి యువరాణిని కారెక్కించి ప్యాలెస్‌లోనికి తిరిగి వచ్చింది జయ.

రాజుగారు వున్న న్నాల్రోజులూ పనివారందరూ పనుల ఒత్తిడితో సతమతమైపోయారు. ఎవరికీ ఒక నిముషం మాట్లాడుకోవడానికి కూడా కుదరలేదు.

యువరాణి పరిచర్యకోసం ప్రత్యేకంగా నియమించబడటంతో జయకు ఆ న్నాల్రోజులూ ఊపిరి పీల్చుకోవడానికి కూడా సమయం దొరకలేదు. హమ్మయ్య ఏ పొరపాటు లేకుండా పనిచేసాం రాజుగారిని మెప్పించాం అనుకుంటూ అందరూ హాయిగా నిట్టూర్చారు.

జయకూడా నవ్వుకుంటూ భవనంలోకి వెళుతుండగా మోహన్ ఎదురొచ్చాడు. ఈ న్నాల్రోజులూ జయతో మాట్లాడక, జయను చూడక చిన్నబోయి వుంది అతని మొహం. అతన్ని చూసిన జయ మొహం కూడా సంతోషంతో వెలిగిపోయింది.

"ఏయ్ ఏంటి దిగులుగా కనిపిస్తున్నావ్?" అని అడిగింది.

"దేవిగారి దర్శనం దొరకకపోతే ఈ భక్తుడు దిగులు పడతాడు మరి" అన్నాడు ఆమె నవ్వులో తనని తాను మరిచిపోతూ.

"సరే తొందరగా ఆ కిటికీ దగ్గరికి వచ్చెయ్ నీతో పనుంది" అంటూ లోపలికి వెళ్ళిపోయింది జయ.

తొందరగా రౌండు తిరిగేసి జయ చెప్పిన ఆ కిటికీ దగ్గరికి చేరుకున్నాడు మోహన్. అక్కడ మోహన్ కోసమే ఎదురుచూస్తున్నట్లుగా నిలబడి వుంది జయ. అతడు అక్కడికి రాగానే యధావిధిగా ఆహారం వున్న బాక్స్‌ను ఇచ్చి "నువు తోటలో కూర్చుని తిని మరలా ఇక్కడికిరా" చెప్పింది చిన్నగా నవ్వుతూ.

"అలాగే" అంటూ వడిగా ఆ తోటలోకి వెళ్ళిపోయాడు మోహన్. పదినిముషాల్లో తినేసి తిరిగి ఆ కిటికీ దగ్గరికి వచ్చేసాడు. ఆ బాక్స్‌లో జయ ఇచ్చే తినుబండారాలకన్నా జయను చూడటమే ముఖ్యంగా అనిపిస్తోంది మోహన్‌కి. తిన్న బాక్స్‌ని ఆమె చేతికి అందించాడు.

"ఇదిగో ఇంకొక బాక్స్. ఇది నాకోసం. నాకు బాగా ఆకలేస్తోంది కానీ ఇక్కడ కూర్చుని నేను తినాలంటే కుదరదు. అలాగని దీన్ని బయటికి నేను తీసికెళ్ళలేను. అందుకే నువు ఈ బాక్స్‌ని తీసుకుని గేటు దగ్గర వుండు. నేను పని ముగించుకుని వెళ్ళేటప్పుడు నాకివ్వు ఇంటికెళ్ళి తీరికగా నేను తింటాను. నువు సెక్యూరిటీ ఆఫీసర్‌ని కాబట్టి నువ్వు ఈ బాక్స్‌ని నీతోపాటు తీసికెళ్ళినా ఎవరూ ఏమీ ఏమీ అనరు. సరేనా" అడిగింది జయ. అతని కళ్ళలోకి చూస్తూ

"అయ్యో ఆకలిగా ఉన్నావా? అయితే తొందరగా బయటకు రా. నీ బాక్స్‌ని జాగ్రత్తగా పట్టుకుని నీకందిస్తాను" అంటూ ఆమె అందించిన సంచిని అందుకున్నాడు మోహన్. అతడి మాటలకి నవ్వింది జయ. ఆమెను ఆమె నవ్వునే చూస్తూ గాలిలో తేలిపోతూ సంతోషంగా బయటికి వెళ్ళిపోయాడు మోహన్.

అర్ధగంటలో పనిముగించుకుని బయటికొచ్చింది జయ. అనుకున్నట్లుగానే గేటు దగ్గర మోహన్ ఆమెను కలిసి సంచిని పదిలంగా చేతికి అందించాడు. "ఆకలిగా వుందంటున్నావు. నాల్రోజులనుండీ పనిచేసి అలసిపోయినట్లున్నావు. తొందరగా ఇంటికి వెళ్ళి బాక్స్‌లో వున్న ఫుడ్ తిని నిద్రపో" అన్నాడు మోహన్.

"బాగా అలసిపోయాను ఇంటికి వెళ్ళి వంట చేసుకునే ఓపిక అసలు లేదు అందుకే నీతో ఈ ఆహారం పంపించాను. మోసుకొచ్చి తెచ్చి ఇచ్చినందుకు థాంక్స్" అంది అతని చేతిని పట్టుకుంటూ.

"అయ్యో అదెంత పని. నీకోసం ఏమైనా చేస్తాను నేను" అన్నాడు ఆమె వంక చూస్తూ.

"సరే రేపు కలుద్దాం బై" అంటూ వెళ్ళిపోయిందామె.

ఆ రాత్రికే ఆమె ఫ్లయిట్. కొద్దిగంటల్లో ప్రయాణం. సిద్ధంగా వుంది జయ. ఇంటికెళ్ళి సామాను కార్లో వేసుకుని ఎయిర్‌పోర్టుకు వెళ్ళడమే మిగిలింది. ఆమె సెలవులకి ఇంటికి వెళుతున్నట్లు మోహన్‌కి తెలియదు. ఆమె కూడా చెప్పలేదు. రూముకు చేరుకోగానే మోహన్ తనకు అందించిన సంచిని ఆమె తన బ్యాగులో భద్రంగా సర్దుకుంది. దీంతో జీవితాంతం కాలుమీద కాలు వేసుకుని బ్రతకొచ్చు అనుకుంటూ తొందరగా తన డ్రెస్ మార్చుకుని కారులో ఎయిర్ పోర్టుకు బయలుదేరింది జయ. అంతవరకూ ఎంతో ఆందోళనగా వున్న జయ ఫ్లయిట్‌లోని సీట్‌లో కూర్చున్నాక స్థిమితపడింది. ఒకసారి గట్టిగా గుండెనిండా ఊపిరి పీల్చుకుంది. ఏదో సాధించినట్లుగా చిన్న నవ్వు ఆమె పెదవులపైన కదలలాడింది. ఫ్లయిట్ కదిలి గాలిలోకి లేచింది. క్రింద బొమ్మరిల్లులా కనిపిస్తున్న కువైటు దేశాన్ని చూసి 'బై బై కువైట్' ఇంక మరోసారి నిన్ను కలవడం జరగదు అంటూ సీటుకి జారగిలపడి కళ్ళు మూసుకుంది జయ.

రెండురోజులు గడిచిపోయాయి. ఈ రెండురోజులుగా జయ కనిపించకపోవడంతో పిచ్చిపట్టినట్లుంది మోహన్‌కి. ఆమె ఏమయిందో అంతుబట్టటంలేదు. ఏదన్నా జబ్బు చేసి వుంటుందా? ముఖ్యమైన పనిబడి సెలవు పెట్టి వుంటుందా? ఏమయి వుంటుంది? జయ గురించిన ఆలోచనతో సతమతమైపోతున్నాడు మోహన్. కలవరపడిపోతోంది అతడి మనస్సు. ఆకలికావడంలేదు. కంటికి నిద్రరావడంలేదు. నిద్రలేక ఎర్రబారిన కళ్ళతో మూడోరోజు డ్యూటీకి వచ్చాడు అతడు. ఆ రోజైనా జయ కనిపిస్తుందేమో అనే ఆశ అతడిని అక్కడికి నడిపించింది.

ఎంతో ప్రశాంతంగా వుండే రాజుగారి ప్యాలెస్ ఆ రోజు అతడు వచ్చేసరికి అల్లకల్లోలంగా వుంది. అక్కడ పనివాళ్ళ ముఖాలు రక్తం లేనట్లుగా పాలిపోయి ఉన్నాయి. సెక్యూరిటీ అధికారి రూము హడావిడిగా వుంది. అక్కడ ఏదో విచారణ సీరియస్‌గా జరుగుతోంది. మోహన్ వెళ్ళగానే నువ్వు మొదట అధికారి గదిలోకి వెళ్ళాలి. నిన్ను ప్రత్యేకంగా ఒక విషయం మీద విచారించాలట. తొందరగా వెళ్ళు

అన్నాడు గేటు దగ్గర డ్యూటీలో వున్న సెక్యూరిటీ వాడు. జయ ధ్యాసలో నిండా మునిగిపోయి వున్న మోహన్ నిర్వేదంగా లోపలికి వెళ్ళి అధికారి ముందు నిలుచున్నాడు.

"గది కిటికీలోనుండి జయ నీకు అందించిన బాక్స్ ఎక్కడ వుంది? మర్యాదగా చెప్పు" మోహన్ చొక్కా కాలర్‌ను బిగించి పట్టుకుంటూ ఆవేశంగా అడిగాడు ఆ అధికారి.

నిర్ఘాంతపోయాడు మోహన్. అంతవరకూ జయ ఆలోచనలతో నిండిపోయి వున్న అతడికి అధికారి ప్రశ్నతో, ప్రవర్తనతో ఈ లోకంలోకి వచ్చిపడ్డాడు. అధికారి ప్రశ్నలోని అర్థం అవగతమయ్యేసరికి నిలువుగుడ్లు పడి కాళ్ళలో సత్తువ లేనట్లు నిలుచోలేక ముందుకు తూలబోయాడు.

"అన్నీ పరిశీలించాం. అందరినీ ప్రశ్నించాం. అన్ని కెమెరాల రికార్డులను క్షుణ్ణంగా చూసాం. ఇది చిన్న విషయం కాదు. ఎందుకు చేసావీ పని? మర్యాదగా చెప్పు. యువరాణిగారికి ఇష్టమైన నలభైవేల దినార్ల డైమండ్ నెక్లెస్ నువ్వూ జయా కలిసి ఎక్కడ దాచి పెట్టావో చెప్పు" అంటూ చెంపపై బలంగా కొట్టాడు ఆ అధికారి.

"బాక్స్ ... జయ... అందులో ఫుడ్. తోటలో కూర్చుని తినేశాను కదా" అధికారి కొట్టిన దెబ్బకు మొద్దుబారిపోయిన మెదడుతో తడబడిపోతూ జవాబు చెప్పాడు మోహన్.

"అది కాదు. ఆఖరుగా జయ అందించిన సంచి. నువు గేటు బయట తనకి భద్రంగా అప్పగించిన సంచి. దాని గురించి అడుగుతున్నాం" హుంకరించాడు అధికారి.

"అది.. .అది.. ఏంటి తినే ఫుడ్డే కదా అందులో వుంది" అమాయకంగా చూసాడు మోహన్.

"నలభైవేల దినార్ల డైమండ్ నెక్లెస్ దొంగతనం చేసి ఓహో ఏమీ తెలియనట్లుగా నాటకం ఆడుతున్నావా? పద నిన్ను పోలీసులకు అప్పగిస్తేగానీ బుద్ధి రాదు. రాజుగారి ప్యాలెస్‌లోనే దొంగతనం చేయడానికి మీకెంత ధైర్యం? ఇంతపని చేసి ప్రాణాలతో బ్రతికి కువైటు దేశాన్ని విడిచి నీ దేశాన్ని మరలా చేరగలవనే ధైర్యం వుందా? పద" అంటూ బయటకి లాక్కుని వచ్చి అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులకు మోహన్‌ని అప్పగించాడు ఆ అధికారి.

పదేళ్ళు కువైటు జైల్లో మగ్గిపోయాడు మోహన్. కువైటు పోలీసులు ఎన్నో విచారణలు జరిగించారు. మోహన్ చేసినది పెద్ద నేరంకాకపోయినా తెలియక నేరస్తురాలికి సహకరించినందుకు, విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు అతనికి శిక్ష తప్పదు మరి.

పదేళ్ళ తరువాత జైలు జీవితం ముగిసి ఇండియా ఎంబసీ సహాయంతో ఇంటికి చేరుకున్నాడు అతను. అంతవరకూ అతని అడ్రస్ తెలియక ఏమైపోయాడో అర్థంకాక అతడి తల్లిదండ్రులు అల్లాడిపోయారు. పెళ్ళికి ఎదిగిన కొడుకును కువైటు పొట్టన పెట్టుకుందేమో. డబ్బు ఆశతో ఎడారి దేశానికి పంపిస్తే ఆ ఎడారి కొడుకు ప్రాణాల్ని బలి తీసుకుందేమో అని వాళ్ళు కుమిలిపోయి క్రుంగి పోయారు. ఏ రోజైనా కొడుకు తిరిగి వస్తాడేమో అని ఆ ముసలి తల్లిదండ్రులు కళ్ళల్లో వత్తులు వేసుకుని కొడుకు కోసం ఎదురుచూస్తున్నారు. ఏదైతేనేం గ్రుడ్డిగా ఆ జయ ప్రేమలో పడి వ్యామోహాన్ని పెంచుకున్నందుకు తగిన శిక్షను అనుభవించాడు మోహన్.

ఈ ప్రపంచంలో దొరికిన వాళ్ళు దొంగలు - దొరక్కుండా తెలివిగా తప్పించుకునిపోయిన వాళ్ళు దొరలు. ప్రపంచం పోకడే అంత.

ఉమ కథ

**ఒళ్ళంతా ఆవరించిన** అలసటతో అమ్మా.. అబ్బా అనుకుంటూ పడకమీద నడుం వాల్చింది ఉమ.

అప్పటికే రాత్రి పన్నెండు గంటలు దాటిపోయింది. అన్ని పనులూ చక్కబెట్టుకుని బయట ఒక మూలగా వున్న రూములోకి వచ్చి పడేటప్పటికి ప్రతిరోజూ దాదాపు అదే టైం అవుతుంది. కానీ ఈ రోజెందుకో చాలా అలసటగా ఉంది. కళ్ళు మూసుకుని అలాగే శాశ్వతంగా నిద్రపోవాలనేంత భారంగా వుంది వళ్ళు. ఎప్పటికో విముక్తి ఈ గొడ్డు చాకిరీ నుండి.

ప్రొద్దున్నే నాలుగుగంటలకు నిద్రలేచింది మొదలు రోజంతా ఆగకుండా, ఆపకుండా పరిగెత్తి పనులు చేయాల్సిందే ఇండియానుండి వచ్చిన రోజునుండీ ఈ నాలుగేళ్ళూ ప్రతిరోజూ విశ్రాంతి లేకుండా ప్రతి నిమిషమూ పనే. యాసిడ్, ఫినాయిల్, డెట్టాల్, వేసి గదులన్నీ తుడిచి, బాత్ రూములు శుభ్రపరచి చేతులన్నీ అరిగిపోయాయి. యాసిడ్ వాడేటప్పుడు అది చేతుల్ని కొరికేయడంతో అరచేతుల్లో మానని పుళ్ళు ఏర్పడ్డాయి. వాటిని మాన్పడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తోంది.

ప్రతిరోజూ రాత్రిపూట పడకమీద నడుం వాల్చిన తరువాత అరచేతుల్లోని పుళ్ళను తడిమి తడిమి చూసుకుంటూ కన్నీళ్ళతో చేతుల్ని తడుపుకుంటూ నొప్పితో నిద్రరాక ఎంత బాధపడుతోందో ఉమ.! అంత కష్టపడుతున్నా కడుపుకు సరిపోయేంత తిండి దొరికితే సంతోషంగా పనిచేయవచ్చు. కానీ కువైటీ మామా మనస్సు చాలా కఠినమైనది. మధ్యాహ్నం ఒక పూట మాత్రం వాళ్ళంతా తినగా మిగిలితే కాస్త అన్నం పెడుతుంది. అదికూడా లేకపోతే చిన్న రొట్టెముక్కే దిక్కు.

ఆ ఎండిన రొట్టెముక్కలు తిని కడుపునింపుకోవడం వల్ల వంటిమీది కండలన్నీ కరిగిపోయి కట్టెలాగా తయారయింది ఉమ.

ఒంట్లో శక్తి వుంటే కదా రోజంతా కష్టపడి పనిచేయగలదు!? కడుపునిండా తృప్తిగా అన్నం తిని ఎన్ని రోజులయిందో ఏమో? తలచుకుంటేనే దుఃఖం వస్తోంది ఉమకి.

సాయంత్రం ఏడుగంటలకి కొరుక్కుని తిన్న చిన్న రొట్టెముక్క ఎప్పుడో అరిగిపోయింది. ఆకలితో కడుపులో ఎలుకలు పరిగెత్తుతున్నాయి. ఆకలు బాధను భరించలేక డొక్కలకి అంటుకుపోయిన కడుపును రెండుచేతులతో అదిమి పట్టుకుంది ఉమ.

ఎందుకింత ఖర్మ? దేనికోసం ఇంత బాధ? ఎందుకోసం ఇంత కష్టం? ఈ ఎడారిలో పరదేశంలో దినార్ల సంపాదన కోసం ప్రాణాన్ని కళ్ళల్లో నింపుకుని కాలం గడపాల్సి వస్తోంది.

ఏదో ఒకరోజు ఈ ఇంటినుండి విడుదల కలుగుతుందనీ, ఈ జీవితానికి విముక్తి లభిస్తుందనే ఆశతో జీవిస్తోంది ఆమె.

ఎన్ని కష్టాలైనా ఓర్చుకుని, ఎంత ప్రయాసైనా భరించి ప్రాణాన్ని నిలుపుకుని ఈ ఎడారి దేశం నుండి బయటపడాలి. శ్వాసంటూ ఆగితే అది మన గాలిలోనే కలవాలి. ప్రాణమంటూ పోతే అది మన దేశంలో పోవాలి. ఈ శరీరాన్ని మన మట్టిలోనే కలపాలి. వద్దు ఈ పాపిష్టి డబ్బు వద్దుగాక వద్దు. రేపే మామాను ఇంటికి పంపించమని గట్టిగా అడగాలి. కువైట్‌కి వచ్చి నాలుగేళ్ళు గడిచిపోయాయి. ఇప్పుడైనా ఇల్లు చేరుకుని పిల్లోడి మొహం చూడాలి. ఇకచాలు ఇక్కడ. నాలుగేళ్ళు చేసిన ఈ గొడ్డుచాకిరీ సరిపోతుంది. ఇప్పటివరకు ఇంటికి పంపించిన డబ్బు కనీసం పదిలక్షలైనా వుంటుంది. అందులో సగం పిల్లోడికోసం ఖర్చుపెట్టినా కనీసం ఇంకో ఐదులక్షలయినా మిగిలివుంటాయి. ఆ డబ్బుతో ఊర్లోనే ఇంటిదగ్గరే ఏదో ఒక పని చేసుకుంటూ పిల్లోడ్ని బాగా చదివించుకోవాలి. అబ్బ.. స్వేచ్ఛగా గాలి పీల్చుకుని ఎన్నిరోజులయింది? కడుపునిండా అన్నం తిని ఎన్నేండ్లయింది? పుళ్ళు పడిన చేతుల్ని చూస్తుంటేనే అసహ్యంగా వుంది.

ఒకప్పుడు పెండ్లి కాకముందు తన చేతులు, వ్రేళ్ళు ఎంతందంగా వుండేవి. వారానికి, పదిరోజులకు ఇంటివెనుక వున్న గోరింటాకు చెట్టు ఆకును తెంపి రోట్లో వేసి బాగా మెత్తగా రుబ్బి శ్రద్ధగా రెండు చేతులకు పెట్టుకునేది. తెల్లవారాక లేచి చూస్తే ఎర్రటి ఎరుపుతో, చేతులు మందారపువ్వుల్లా విరబూసి వుండేవి. చూస్తుంటే ఎంత ముద్దొచ్చేవో. సరిగా పండని తన చేతుల్ని చూసుకుంటూ వదిన కోపంతో మూతి తిప్పుతూ "మందారంలా పూస్తే... మంచి మొగుడొస్తాడు. గన్నేరంలా పూస్తే కలవాడొస్తాడు" అంటూ వెటకారంగా పాట పాడేది.

ఆ పాటలో ఏమాత్రం నిజం లేదని కొద్దికాలానికే తేలిపోయింది. "కట్టుకున్న మొగుడు మంచివాడయితే ఆడవాళ్ళకు ఎందుకొస్తాయి కష్టాలు? వారి కళ్ళల్లో కలలకు బదులు కన్నీళ్ళెందుకు కాపురం చేస్తాయి? అంతా ఖర్మ. నుదిటి రాత అంతే అని ఆడది సరిపెట్టుకుంటూ బ్రతుకు ఈడవాల్సిందేనా? కాదు వద్దు అనుకుంది ఉమ. చిత్రహింసలు పెట్టే ఆ మగవాడితో కాపురం చెయ్యనంటే చెయ్యనని తెగేసి చెప్పేసింది. ఇక చేసేదేం లేక పెద్దవాళ్ళందరూ చేరి తెగతెంపులు చేసేసారు. పెళ్ళయి ఆర్నెల్లు తిరగక ముందే పెళ్ళి పెటాకులయిపోయింది. హమ్మయ్య అనుకుంది.

అంతవరకూ బాగానే వుంది. పీడా విరగడయింది. బ్రతికిపోయానురా భగవంతుడా అనుకుంటూ ఊపిరి పీల్చుకుంటుండగా ముంచుకొచ్చింది ఉప్పెనలాంటి ఉపద్రవం. పెనంలోనుండి పొయ్యిలో పడినట్లయింది ఆమె పరిస్థితి.

ఆ దేవుడికెందుకో ఆడదానిపై అంత కక్ష? పరీక్షించడానికా అన్నట్లుగా పడేవారికే ఇంకా ఇంకా కష్టాల్ని, కన్నీళ్ళను కానుకగా ఇస్తుంటాడు. పనికిరాని మొగుడ్ని వదిలించుకున్న సంతోషం అంతా నాల్రోజుల్లో ఆవిరైపోయింది. తను మూడోనెల గర్భవతినని తెలిసాక మిన్ను విరిగి మీద పడినట్లయింది.

అష్టకష్టాలు పడి అసలును వదిలించుకుంటే కొసరు నిన్ను విడవనంటూ కడుపులో కదలాడుతోందే? అయ్యో ఆడదానికేనా ఈ కష్టాలు? ఏం చెయ్యాలి? ఈ బరువును ఎలా వదిలించుకోవాలి?

ప్రకృతికి కూడా ఆడదంటేనే అలుసా? తమ ప్రమేయం లేకుండా జరిగిన తప్పులకు కూడా ఆడదే మూల్యం చెల్లించాలా? చేయని నేరానికి ఆడదే బాధ్యత వహించి శిక్షను భరించాలా?

ఎవరో తను చేయని అన్యాయాలన్నింటినీ మూటగా కట్టితెచ్చి కడుపులో వేసినట్లయింది పరిస్థితి. ఇప్పుడు ఏం చేస్తావో ఎలా తప్పించుకుంటావో అంటూ విధి వికటాట్టహాసం చేసింది. ఆడదానిగా పుట్టినందుకు తలవంచక తప్పలేదు ఉమకి.

"ఈ దరిద్రం మనకెందుకు? వెంటనే వెళ్ళి అబార్షన్ చేయించుకో" అంటూ ఈసడించుకుంది వదిన. అన్నకూడా వదినకు వంతపాడాడు.

ఎందుకో కడుపులో వున్న చిన్న నలుసును నలిపేసి ప్రాణం తీయడానికి మనసొప్పలేదు. ఆ చిన్ని ప్రాణి తనలో భాగమని తనకే స్వంతమని తన కోసమే ఏర్పడిందని అనిపించింది. అందుకే అన్నా వదినలు ఎంతగా బలవంతపెట్టినా కోపగించుకున్నా అబార్షన్ చేయించుకోనని తేల్చి చెప్పింది. భర్తకూడా లేని పరిస్థితిలో కడుపులోని బిడ్డను మోయడం, కనడం, పెంచి పెద్ద చేయడం ఒక ఆడదానికి చాలా కష్టమని, భారమని ఉమకు బాగా తెలుసు. కానీ కడుపులోని తన బిడ్డను ముక్కలు చేసి ప్రాణం తీయడానికి మనసొప్పలేదు. అంతే. అది తల్లి మనస్సు. స్త్రీ మనస్సు కాబట్టి ఒప్పుకోలేదు. అదంతే. ఆడదానికి కొన్ని వద్దనుకున్నా కాదనుకున్నా భరించక తప్పదు.

అలా ఎవరికీ ఇష్టంలేకపోయినా వద్దని అసహ్యించుకున్నా, తిట్టినా నెలలు నిండగానే భూమిమీదకి వచ్చేసాడు భరత్ బాబు. మన దేశంపైన వున్న ప్రేమతో తన కొడుక్కి భరత్ అనే పేరు పెట్టుకుంది ఉమ.

భర్తను వదిలేసిన ఆడది పుట్టినింటికి ఎప్పుడూ భారమే. "కూర్చుని తింటే కొండలైనా ఆగుతయా? కరగకుండా వుంటాయా? రామేశ్వరం పోయినా శనేశ్వరం వదల్లేదమ్మా మాకు" అంటూ వదిన సూటిపోటి మాటలు మొదలు పెట్టేసింది. వదినకు తోడుగా తోడబుట్టిన అన్నకూడా జత కలవడంతో కలవరపడిపోయింది ఉమ.

పిల్లవాడ్ని తీసుకుని ఎక్కడికైనా పారిపోదాం అనిపించింది. కానీ ఎక్కడికి వెళ్ళాలో అర్థం కాలేదు. ఆ సమయంలోనే వదినకు బాగా డబ్బు సంపాదించే మార్గం ఒకటి కనిపించింది.

"అందరమూ ఊరికే కొంపలో కూర్చుని తింటుంటే తిండికి డబ్బెలా వస్తుంది? తిండి పైనుండి ఊడిపడదు కదా? అందుకే ఉమను కువైట్‌కి పంపిద్దాం. నాలుగేళ్ళు అక్కడ వుండి బాగా డబ్బు సంపాదించుకుని వస్తుంది. మనకోసమైతే కాదు కానీ తనకోసం తనబిడ్డకోసం సంపాదించుకోవాలి కదా? " అంటూ తన ఆలోచన చెప్పి ఉమ అనుమతికోసం ఎదురుచూడకుండా పాస్‌పోర్ట్‌కు కూడా అప్లై చేయించింది.

ఏం చేయగలదు ఉమ. కాదని, వెళ్ళనని చెప్పలేని పరిస్థితి. కానీ అప్పటికీ నోరు తెరిచి "నేను వెళ్ళిపోతే పిల్లోడు వుండగలడా వదినా?" అని మాత్రం అనగలిగింది.

"ఏమ్మా మేమున్నాం కదా? నేను కూడా పిల్లల్ని కన్నదాన్నే కదా? నీ పిల్లోడ్ని రోడ్డున వదిలేస్తామా? నువ్వు కువైట్ నుండి పంపించే డబ్బుతో వాడిని బాగా చదివించి పెద్ద చేస్తాం. నువ్వు వాడిగురించి దిగులు పెట్టుకోకుండా ప్రయాణానికి సిద్ధపడు" తేల్చేసింది వదిన.

మూడ్నెల్లు తిరక్కముందే ఏజంటు ద్వారా వీసా తెప్పించడం, ఉమను కువైట్‌కి ఫ్లయిట్ ఎక్కించడం జరిగిపోయాయి.

నెలల పిల్లవాడ్ని, పాలుత్రాగే పసివాడ్ని విడిచి అంతదూరం దేశంకాని పరదేశం వెళ్ళాలంటే విలవిలలాడిపోయింది ఉమ. నిస్సహాయంగా హృదయాన్ని మాత్రం పిల్లవాడి దగ్గర వదిలేసి శరీరాన్ని మాత్రం భారంగా ఈడ్చుకుంటూ వెళ్ళి విమానం ఎక్కింది ఆమె.

గతమంతా గడిచిన చేదు సంఘటనలు ఒక ఎత్తైతే కువైట్ వచ్చాక ఈ కష్టాల కొలిమిలో పడి మాడిపోవడం మరొక ఎత్తు. కువైటు ఇంట్లో పనిచేయడం, డబ్బు సంపాదించడం ఇక్కడ ఈ బాధల్ని భరించడం అంత సులభం కాదని తెలిసిపోయింది. ఎప్పటికో విముక్తి. తెలియకనే నరకానికి జానెడు దూరంలో వున్నట్లుగా రోజుల్ని, కాలాన్ని కష్టంగా గడపడం అసాధ్యంగా వుంది.

ఎంత వేడుకున్నా, ఎంత ప్రార్థించినా విడిపించడానికి ఏ దేవుడూ రాడా? వచ్చి ఓదార్చి కష్టాల్ని తీర్చి కన్నీళ్ళను తుడవడా? ఇప్పటివరకు ప్రాణం బిగపట్టుకుని నాలుగేళ్ళూ క్షణమొక యుగంగా గడిపేసింది. ఇక ఏమాత్రం ఓపికలేదు. ధైర్యం చేసి రేపే మామాను అడిగెయ్యాలి. ఓ రెండు నెలలు సెలవులకి ఇంటికి వెళ్ళి బాబును చూసి మరలా తిరిగి వచ్చేస్తానని నమ్మకంగా చెప్పాలి. మరలా తిరిగి రానని చెపితే చచ్చినా పంపించరు. మెల్లగా మెత్తగా చెప్పి వప్పించాలని నిశ్చయించుకుంది ఉమ. నిద్రపోవడానికి గట్టిగా కళ్ళు మూసుకుంది. ఊహూ నిద్రరావడంలేదు.

కడుపులో ఆకలి పేగుల్ని మెలిపెడుతోంది. రోజంతా చేసిన కష్టంతో వళ్ళు నొప్పులుగా వుంది. అందుకే నిద్రరావడంలేదు. లాభం లేదు. ఏదో ఒకటి కడుపులో పడాల్సిందే ఎలా? ఈ రాత్రి సమయంలో రొట్టెముక్క కూడా దొరకడం కష్టమే మరి. కానీ వెంటనే ఏదో ఒకటి తినకపోతే ఆకలి శాంతించేటట్లుగా లేదు.

వంటింట్లోకెళ్ళి కనీసం పళ్ళయినా వుంటాయేమో చూడాలి అనే ఆ ఆలోచనతో ఇక ఆగలేక మెల్లగా పైకి లేచింది. అడుగులో అడుగు వేసుకుంటూ బయటకి వచ్చింది. ఆకలికి ఆగలేక అర్ధరాత్రిపూట దొంగలాగా వంటింట్లోకి జొరబడి తిండిని దొంగలించడం సిగ్గనిపించింది. కానీ తప్పదు ప్రాణం నిలబడాలంటే ఏదో ఒకటి వెంటనే కడుపులో పడాలి. పెద్ద గుమ్మం తలుపును మెల్లిగా తీసి పిల్లిలా లోపలికి దూరింది ఉమ.

అక్కడున్న నడవా మెట్లెక్కి బెడ్ రూములు దాటింది. ఇంకో నాలుగడుగులు వేస్తే వంటిల్లు వస్తుంది. అక్కడ ఏదో ఒకటి తినడానికి దొరక్కపోదు. ఒక అరటిపండో ఆపిల్ పండో దొరికినా చాలు ఈ పూట గడిచి కడుపు చల్లబడుతుంది. అంతా గాఢనిద్రలో

వున్నట్లున్నారు. అలికిడయితే బెడ్‌రూముల్లో పడుకున్న మామా బాబా లేస్తారేమోనని భయపడుతూ ఊపిరి బిగబట్టి అడుగులు వేసింది ఉమ.

ఇంకో రెండడుగులు అంతే... ఇంతలో ఉన్నట్లుండి వెనకనుండి ఆమె భుజం మీద పడింది ఒక చెయ్యి.

ఉలిక్కిపడి భయంతో అరవబోయింది ఆమె. వెనుకే వచ్చిన ఒక ఆకారం ఆమె అరుస్తుందని ముందే గ్రహించినట్లుగా అరవకుండా శబ్దం బయటకి రాకుండా నోటిమీద మరో చెయ్యి వేసి గట్టిగా అదిమింది. ఎవరో అర్థంకాక తనని అర్థరాత్రిపూట అక్కడ గమనించినందుకు ఇప్పుడు ఏమవుతుందో, మామా, బాబాకు తెలిస్తే చంపేస్తారు అనే భయంతో బిగుసుకుపోయింది ఉమ.

"భయపడకు. నేనే అహ్మద్‌ని. వంటింట్లోకి వెళ్ళి తినడమెందుకు నన్నడిగితే నేను తీసుకొచ్చి పెడతాను కదా?" గుసగుసగా చెవిలో చిన్నగా చెపుతూ ఇదే అవకాశం చిక్కింది చేతిలో అన్నట్లుగా ఆ చీకట్లో ఆమెను గట్టిగా హత్తుకున్నాడు. వాడు ఆ ఇంట్లో డ్రైవర్‌గా పనిచేసే బెంగాలివాడతను.

ఒక్కసారిగా పాములు, తేళ్ళు ఒంటిపై పారాడినట్లుగా జలదరించింది ఉమ ఒళ్ళు. వాడిని వదిలించుకోవాలనే తాపత్రయంతో గట్టిగా విదిలించుకుంది ఆమె. కానీ వాడికి ముందే తెలుసు ఆమె అలా చేస్తుందని. కదలకుండా ఆమెని రెండుచేతులతో బిగించి పట్టుకున్నాడు.

అసలే బక్కచిక్కి ఉన్న శరీరం. ఆకలి బాధతో అలసటతో వున్న ప్రాణం. వాడి ఉడుం పట్టునుండి తప్పించుకోవడం ఆమెకు ఎలా సాధ్యమవుతుంది? తన శక్తి సరిపోదని ఉమ గ్రహించింది.

అర్థరాత్రిపూట అనవసరంగా ఇటు వచ్చి వీడి చేతిలో చిక్కిపోయాను అనుకుంటూ తనను తానే తిట్టుకుంది. పనిచేసేటప్పుడు కంటబడితే తన శరీరాన్ని ఆబగా, ఆశగా ఎలా చూస్తాడో గుర్తొచ్చింది ఉమకు. ఎప్పుడు అవకాశం దొరుకుతుందా? ఎలా మీద పడదామా? అనే ఆలోచన వాడి కళ్ళలో స్పష్టంగా కనిపించేది.

ఏదైనా వస్తువులు, సామానులు అందించేటప్పుడు కావాలని తన చేతుల్ని తడిమే వాడి మృగత్వం ఆమెకు బాగా తెలుసు. ఈ నాలుగేళ్ళుగా ఈ ఇంట్లో పనిచేయడం ఒక యుద్ధమయితే వీడినుండి తనని, తన శరీరాన్ని కాపాడుకోవటం మరొక పోరాటమే అయింది.

మరి ఆడదానికే కదా ఈ బాధలన్నీ. ఆవేశంగా ఆమె చెంపపై వాడి పెదాలను ఆనించడంతో సిగరెట్ కంపు గుప్పుమని తగిలి కడుపులో త్రిప్పింది. ఇక అలాగే వుంటే ఈరోజు వీడు తనని నాశనం చేయందే వదలడు అనుకుంటూ శక్తినంతా వంట్లోకి తెచ్చుకుని మోచేత్తో వెనక్కి ఒక్కపోటు పొడిచింది ఉమ.

దెబ్బ ఎక్కడ తగిలిందో తెలియదుకానీ అబ్బా అంటూ పట్టుకాస్త సడలించాడు వాడు. ఇదే అదను అనుకుని పరిగెత్తి మెట్లు దిగబోయింది. కోపంగా ఆమె వెనుకే పరిగెత్తి చేతికి అందిన ఆమె జుట్టును పట్టుకుని గట్టిగా వెనక్కిలాగాడు వాడు. అంతే మెట్లమీద వున్న కాళ్ళు జారి దబ్బున వెల్లకిలా వెనక్కి పడిపోయింది ఉమ.

ఒంట్లోని ఎముకలన్నీ విరిగినట్లయింది. తిరిగి లేవలేక నిస్సహాయంగా మెట్లమీద పడిన తనను విడిచిపెట్టమన్నట్లుగా రెండు చేతులూ జోడించి దీనంగా నమస్కరించింది ఉమ.

దుర్మార్గుడైన వాడి హృదయం కన్నీళ్ళకు, దండానికి కరుగుతుందా? ఇక కదల్లేదు, పైకి లేవలేదు అనే ధీమాతో అక్కడే మెట్లమీద అడ్డంగా ఆమె మీద పడిపోయాడు వాడు.

ఒళ్ళంతా కామం క్రమ్మిన కాలనాగులా వాడు ఆమెను ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. శక్తినంతా కూడగట్టుకుని ఎంతగా ప్రతిఘటిస్తున్నాకూడా ఆమె ప్రయత్నమంతా వ్యర్థమే అవుతోంది. తనలోని బలాన్నంతా కూడగట్టుకుని మోకాల్లోకి తెచ్చుకుని వాడిని ఎగిసి ఒక తన్ను తన్నింది.

"మర్ గయారే... ముజే మార్ డాలారే" అంటూ గట్టిగా వెర్రి కేకలు పెడుతూ కడుపు పట్టుకుని ప్రక్కకి వాలిపోయాడు వాడు.

టకటకా బెడ్ రూము తలుపులన్నీ తెరుచుకున్నాయి. టపటపా లైట్లన్నీ వెలిగాయి. మామా, బాబాలతోపాటు వారి పిల్లలు కూడా బయటికి వచ్చేసారు.

వెల్లకిలా మెట్లమీద పడివున్న ఉమకు వారందరినీ చూడగానే పై ప్రాణాలు పైనే పోయాయి. ఇప్పటి వరకు జరిగింది కాదు. ఇక ముందు జరిగేది తలచుకుంటే వళ్ళంతా చల్లబడిపోయింది ఆమెకు.

"ఏం జరుగుతోంది ఇక్కడ? మీ ఇద్దరూ ఈ సమయంలో ఇక్కడ ఎందుకున్నారు?" అరిచాడు బాబా.

"ఇది దొంగది బాబా. అర్ధరాత్రి పూట లోపలికి వచ్చి మీ బెడ్‌రూములో దూరి దొంగతనం చేయబోతుంటే నేను పట్టుకున్నాను. పరిగెత్తుతూ మెట్లమీద పడిపోయింది" వినయంగా చేతులు కట్టుకుని తలవంచుకుని నమ్మకంగా చెప్పాడు వాడు.

వాడు ముస్లిమ్ కాబట్టి వాడిమాటలపై వాళ్ళకి నమ్మకం ఎక్కువ. "ఏమే రాత్రిపూట నీ రూమ్‌లో పడుకోకుండా ఎందుకొచ్చావు లోపలికి" ప్రశ్నించింది మామా.

జవాబు చెప్పలేక వెర్రిచూపులు చూసింది ఉమ.

"నిజం చెప్పు" దగ్గరకొచ్చి మూతిమీద పొడిచింది మామ.

"మామా అదీ. ఆకలి.. వంటింట్లో పండ్లకోసం వచ్చాను. తడబడుతూ నోరు పెగల్చుకుని భయంగా జవాబు చెప్పింది ఉమ.

"ఓహో నువ్వు చెప్పే కట్టుకథలన్నీ మేము నమ్మాలా? మమ్మల్నందరినీ నిద్రపుచ్చి దొంగతనం చేయడానికే రాత్రిపూట నువ్వు ఇంట్లోకి వచ్చివుంటావు. నిన్ను ఊరికే వదలకూడదు. అహ్మద్ దీన్ని చూడబట్టి సరిపోయింది లేకపోతే ఇది ఈపాటికి అన్నీ చక్కబెట్టి వుండేది. అప్పుడప్పుడూ నా బ్యాగులో డబ్బులు మాయమవుతుంటే ఎవరు తీసారో అనుకునేదాన్ని. అయితే అవన్నీ తీసింది ఇదే అన్నమాట. దీన్ని పట్టుకుని పోలీసులకు ఫోను చెయ్యండి. వాళ్ళే చూసుకుంటారు దీని సంగతి" అని తేల్చి చెప్పింది మామ.

గుండె ఆగిపోయింది ఉమకు. అయిపోయింది తనపని. ఇక ఈ కువైట్ జైల్లో మిగిలిన జీవితాన్ని గడపాల్సిందే. ఇండియావెళ్ళి బిడ్డను కళ్ళారా చూసుకోవాలనే ఆశను చంపుకోవాల్సిందే. ఆకలికి తాళలేకపోయినందువల్ల ఇంట్లోకి వచ్చి చేతులారా కొరివితో తలగోక్కున్నట్లయింది తన పరిస్థితి.

ఇక ఇప్పుడు ఏడ్చి లాభంలేదు వాడి కామాన్ని తీర్చలేదని దొంగతనాన్ని అంటగట్టి కక్షతీర్చుకున్నాడు వెధవ. ఛీ ..నీదీ మనిషి బ్రతుకేనా అన్నట్లుగా అసహ్యంతో వాడివైపు చూసింది ఉమ.

ఏం లాభం? మృగాలకు సిగ్గూ ఎగ్గూ వుండవు కదా! నా మాట వినకపోతే ఎంత నష్టపోయావో చూడు, నా మాట విని నా కోరిక తీర్చి వుంటే ఇంత కష్టం నీకు వుండేది కాదుకదా అన్నట్లుగా గర్వంగా నవ్వాడు వాడు.

దొంగతనానికి పాల్పడింది కానీ ఆ ఇంట్లో దొంగతనం జరగలేదు కాబట్టి నాలుగేళ్ళు జైలు శిక్ష వేసారు ఉమకు.

ఆ కువైటు ఇంట్లో తిండిలేకుండా చేసిన కష్టానికంటే, పడిన బాధలకంటే కువైటులోని జైలు జీవితమే బాగుందనిపించింది ఆమెకు. తప్పేమీ చేయకపోయినా ఒక్కోసారి నిరపరాధులు కూడా శిక్ష అనుభవిస్తుంటారు మరి.

నాలుగేళ్ళ శిక్షను పూర్తిచేసుకుని ఫ్లయిట్ ఎక్కి ఎపుడెపుడు ఇండియా చేరదామా? మన నేలపై కాలుపెట్టి మన గాలిని గుండెలనిండా పీల్చుకుందామా? అని ఆరాటంగా ఆశగా ఎదురుచూస్తూ కువైట్‌లో మరో నాలుగేళ్ళకాలాన్ని ముగించడానికి రోజుల్ని లెక్కబెడుతోంది ఉమ.

## యుద్ధం చేసిన గాయం

**బ్రహ్మాండం** బ్రద్దలయినట్లుగా ఉన్నట్లుండి సంభవించింది పెద్ద విస్ఫోటనం అంతవరకు అక్కడ ప్రాణాలతో తిరుగాడుతున్న మనుషులు మరు నిముషంలో శవాల గుట్టలుగా మారిపోయారు. తెగిన కాళ్ళూ చేతులూ చెల్లాచెదురుగా పడిపోయాయి. రక్తం కాలువలై వీధిలోకి ప్రవహించింది. కొనప్రాణాలతో మిగిలిన వారి ఆర్తనాదాలతో రోదనలతో నిండిపోయింది ఆ ప్రదేశం. దట్టమైన పొగ ఆ ప్రదేశాన్ని క్రమ్ముకున్నది. ఏం జరిగిందో తెలిసే లోపల వందల శరీరాలు శ్వాస ఆగిపోయి నిర్జీవంగా నేలవాలిపోయాయి. ఆ ప్రదేశానికి కాస్త దూరంగా వున్నవారందరికీ జరిగిందేమిటో అర్థమయ్యింది.

"కారు బాంబు బ్రద్దలయింది. పరిగెత్తండి. దూరంగా పారిపొండి. ప్రాణాలు కాపాడుకోండి" అని గట్టిగా అరుస్తూ వారందరూ అక్కడికి దూరంగా ప్రక్కగా వున్న సందుల్లోకి పరిగెత్తి పారిపోయారు.

మనిషికి ప్రాణం కంటే తీపి అయినది ఈ ప్రపంచంలో మరొకటి వేరే ఏమున్నది?

1990 నవంబరు మాసం. కువైట్ పట్టణంలోని ఫర్వానియా ప్రాంతం. గల్ఫ్ యుద్ధం బారిన పడి గాయాలతో బాధలతో బిక్కుబిక్కుమంటూ వెక్కి వెక్కి ఏడుస్తోంది పట్టణం. భయాందోళనలతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని జీవిస్తున్నారు మిగిలి వున్న కొద్దిమంది ప్రజలు. మాములుగా నిశ్శబ్ధంగా వుండే ఆ ప్రాంతం సాయంత్రం పూట కాస్త సందడిగా వుంటోంది.

నాలుగో వీధిలోని కూడలిలో వుంది పాలరాతితో కట్టబడిన ఒక మసీదు. ప్రస్తుతం అక్కడ నమాజులు చేయడం లేదు. జరుగుతున్న యుద్ధానికి ఘోరకృత్యాలకు ప్రత్యక్ష సాక్షిగా దుఃఖాన్ని దిగమ్రింగుకుంటూ నిస్తేజంగా నిర్వేదంగా నిలబడి వుంది ఆ మసీదు.

కువైటును ఆక్రమించుకున్న ఇరాక్ సైనికులు ఆ మసీదును కూడా తమ ఆధీనంలోనికి తీసుకుని అక్కడే స్థావరాన్ని ఏర్పరచుకున్నారు. ప్రతిరోజూ సాయంత్రంపూట ఇరాకీ వ్యాపారస్థులు తమ పొలాల్లో పండిన కూరగాయల్ని ట్రక్కుల్లో వేసుకుని కువైటుకు తీసుకువస్తున్నారు. ఆ మసీదు ప్రాంగణంలో గోనెపట్టాలు పరచుకుని తమతోపాటు తెచ్చిన కూరగాయల్ని ఆహారపదార్థాల్ని, వస్తువులను కుప్పలుగా పేర్చి క్రయవిక్రయాల్ని కొనసాగిస్తున్నారు.

సాయంత్రం ఐదుగంటలనుండి ఏడు గంటలవరకు ఆ ప్రాంతంలో అమ్మేవాళ్ళ పిలుపులు, కొనేవాళ్ళ బేరసారాలతో కాస్త అలికిడి వినిపిస్తోంది.

యుద్ధం మొదలైనప్పటినుండీ పట్టణంలో కరెంటు లేనందున దీపాల వెలుగే దిక్కు. అందుకే చీకటి పూర్తిగా క్రమ్ముకోక ముందే తమ కూరగాయల్ని మంచిధరలకు విక్రయించి రాత్రికి తిరిగి సరిహద్దుల్లోని తమగ్రామాలకు చేరుకోవాలని వారు తాపత్రయపడుతున్నారు.

ఒకవైపు బేరసారాలు బాగానే జరుగుతున్నా అమ్మేవాళ్ళ మనసులు కలవరంగా, కొనేవాళ్ళ గుండెలు గుబులుగానే వున్నాయి. తలా రెండు రొట్టెల పాకెట్లు, కాసిన్ని కూరగాయలు కొనుక్కుంటే ఒక్కరోజు తిండికి గడుస్తుందని ఆశపడి ఆ చుట్టుపక్కల తలదాచుకున్నవారందరూ పుట్టల్లోని చీమల్లా బయటికి వస్తున్నారు. ఆ సాయంత్రం పూట ఆ మసీదులోనికి వెళ్ళి కూరగాయలతో

అవసరమైన ఆహారపదార్థాలతో సంచులు నింపుకుంటున్నారు. మళ్ళీ మరుసటి రోజు దొరుకుతాయో లేదో అనే భయం వారిలో కనబడుతోంది. డిమాండు బాగానే వుంది కాబట్టి ఇరాకీ వ్యాపారులు ధరల్ని పెంచేసారు.

అసలే యుద్ధం. అందుమూలంగా ఉద్యోగాలు పోయాయి. జీతాలు లేవు. మరి కువైటులో జీవించడానికి, తినడానికి డబ్బెలా వస్తుంది? అందుకే మిగిలినవాళ్ళు ఇక ఏ దారీ కనబడక తమ దగ్గరవున్న బంగారం, విలువైన వస్తువులన్నీ అమ్మేసి డబ్బు చేసుకున్నారు. ఆ డబ్బుతో ఆహారపదార్థాల్ని కొనుక్కుంటూ ఏదో విధంగా అక్కడనుండి బయటపడి తమ దేశాలు చేరుకునే దారి దొరుకుతుందనే ఆశతో భారంగా కాలం గడుపుతున్నారు. ఎంత ప్రయత్నం చేసినా తమదేశాలకు వెళ్ళిపోవడానికి కొందరికి కుదరడం లేదు. పోయినవాళ్ళు పోగా రోగాలతో మంచాన పడినవారు, గాయాలతో కదలలేనివారు, గర్భిణీ స్త్రీలు వెళ్ళడానికి కుదరక నిస్సహాయంగా అక్కడే నిలిచిపోయారు. వారిని విడిచిపోలేక వారిని కనిపెట్టుకుని వుండిపోయిన వారి బంధువులు, స్వచ్ఛంద సేవకులులాంటి వాళ్ళందరూ కువైట్‌లో మిగిలిపోయారు.

అయినా తమదేశం వెళ్ళాలంటే, సరిహద్దులు దాటాలి. ఇరాక్‌గానీ జోర్డాన్‌గానీ చేరుకోవాలి. అక్కడ కాంప్‌లో కొద్దిరోజులు తలదాచుకుని విమానాల్లో వెళ్ళేందుకు తమ వంతు వచ్చేంతవరకు వేచి చూడాలి.

అలా ఒకటికి రెండుసార్లు వెళ్ళి విమానాల్లో చోటులేక కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళిన దారినే తిరిగి కువైటుకు వచ్చినవాళ్ళు కూడా అక్కడే వున్నారు. పరిస్థితులు చక్కబడతాయి. కొద్దిరోజులు ఓపిక పడదాం అనుకుంటూ కాలం గడిపే వాళ్ళు కూడా వారిలో వున్నారు.

అప్పటికే యుద్ధం మొదలైన నెలరోజుల్లోపు దాదాపు డెబ్తైశాతంమంది తమకు దొరికిన మార్గాల్లో కష్టపడి ప్రయాసపడి ప్రయాణాలు చేసి వారి దేశాలు చేరుకుని హమ్మయ్య ప్రాణం దక్కించుకున్నాం అనుకుంటూ ఊపిరి పీల్చుకున్నారు.

ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో కూడా డబ్బు ఆశ కొంతమంది మనుషులను ముందుకు నడిపించడం వలన ప్రాణాలకు తెగించి వాళ్ళంతా అక్కడ చేరి అమ్మకాలను కొనసాగిస్తున్నారు. కాలేకడుపుతో ఆకలి తీర్చుకోవడానికి వేరే మార్గం కనబడక గత్యంతరం లేక కొనేవాళ్ళు అక్కడికి చేరుకుంటున్నారు.

డబ్బు బాగా సంపాదించడానికి ఇదే మంచి అవకాశం అని భావిస్తూ అమ్మేవాళ్ళు "రండి బాబూ రండి. తొందరగా వచ్చి కొనండి. మా దగ్గర వంకాయలు - బెండకాయలు, టమాటాలు తాజాగా వున్నాయి. ఆకు కూరలు ఈరోజే పొలం నుండి కోసి కట్టలు కట్టి తెచ్చాము. తొందరగా రాకపోతే మరలా మీకు దొరకవు. రండి ఇటువైపు వచ్చి చూడండి" అంటూ చిన్న స్వరాలతో కొనేవాళ్ళందరినీ పిలుస్తున్నారు. ఎక్కడ తక్కువ ధరకు ఎక్కువ కూరగాయలు దొరుకుతాయా అని కొనేవాళ్ళు అందరి దగ్గరా ధరలు పరిశీలించి చూస్తున్నారు. కానీ కొద్దిసేపటిలో ఏం జరుగుతుందో వారికి తెలియదు. కనీసం ఊహకు కూడా అందలేదు. తెలిస్తే కనుక అక్కడ ఒక్కరు కూడా స్థిమితంగా నిలబడి వుండరుగాక వుండరు.

ఆ మసీదుకు మరోవైపు అవతలి వీధిలో వుంది ఒక ఇండియన్ స్కూలు. కువైటీ వాళ్ళంతా ఇళ్ళు వదిలి దేశం వదిలి పారిపోవడంతో వారి ఇళ్ళల్లో పనిచేసే పనివాళ్ళు నిరాశ్రయులైపోయారు. అలాంటి వాళ్ళందరూ దాదాపు వందమందికి పైగా ఈ ఇండియన్ స్కూల్లో చేరి తలదాచుకున్నారు. కంపెనీలు, ఆసుపత్రులు మూతపడిపోవడంతో కొందరు ఉద్యోగస్తులు, నర్సులు, డాక్టర్లు కూడా వారితో చేరిపోయారు. స్కూల్లోని తరగతి గదులను తమకు నివాసంగా వారు మార్చుకున్నారు. ఆ రోజే ఇండియా ఎంబసీ వాళ్ళు

వచ్చి యాభై బస్తాల బియ్యాన్ని తెచ్చి అక్కడ వున్న భారతీయులందరికీ పంచిపెట్టి వెళ్ళారు. రెడ్‌క్రాస్ సొసైటీ వాళ్ళు వచ్చి అందరికీ అవసరమైన, మందులు ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఇచ్చి వెళ్ళారు.

స్కూల్లో ఒక మూలగా వున్న గదిని వాళ్ళు వంట గదిగా మార్చుకున్నారు. పారిపోయిన కువైటీ ఇళ్ళలోనుండి ఇరాకీ సైనికులు దోచుకుని పోగా మిగిలిన వంట పాత్రలు, దొరికిన సామాన్లు, దుప్పట్లు పరుపులులాంటివన్నీ నిరాశ్రయులైన వీళ్ళు తమతోపాటు తీసుకొచ్చి స్కూల్లో అమర్చుకున్నారు. వంటవాళ్ళు, డ్రైవర్లు, నర్సులు, టీచర్లు, డాక్టర్లులాంటి వారందరూ ఎవరికి వచ్చిన పని వాళ్ళు అక్కడ చేస్తూ ఒకరికొకరు సహాయపడుతున్నారు. అక్కడి మనుషులు ఆ సమయంలో మతాలను మరిచిపోయారు. కులభేదాలను తుడిచిపెట్టేసారు. మనమంతా భారతీయులం అనే భావం ఒక్కటే వారికి గుర్తుంది.

యుద్ధంలో గాయపడిన వాళ్ళు పడకల మీద పడి మూలుగుతున్నారు. మరికొందరు భయపడిపోయి జ్వరం తెచ్చుకుని ఏడుస్తున్నారు. వైద్యం తెలిసిన డాక్టర్లు, నర్సులు వీరందరి గాయాలకు కట్లు కట్టి మందులిచ్చి పరిచర్యలు చేస్తున్నారు. మంచి మాటలు చెప్పి వారికి ఓదార్పునిస్తున్నారు. కొంతమంది వాలంటీర్లుగా ఏర్పడి స్వచ్ఛంద సేవలు అందిస్తున్నారు. వంట తెలిసిన వాళ్ళు వంటగదిలో చేరిపోయి అక్కడ చేరివున్న వాళ్ళందరికీ సరిపడా పెద్ద పాత్రల్లో అన్నాన్ని, కూరలను వండుతున్నారు. ఆ స్కూలు ప్రాంగణమంతా హడావిడిగా వుంది.

ఆ సమయంలో అటుగా వచ్చిన ఇరాకీ సైనికులు వాసనలు పీల్చుతూ తమకు కూడా భోజనాలు పెట్టమని చెప్పి వీళ్ళతో కలిసి తినడానికి కూర్చుండిపోయారు.

ఎప్పటికి యుద్ధం ముగుస్తుందో ఎప్పుడు పరిస్థితి అదుపులోకి వస్తుందో ఎవరికీ అంతుపట్టని స్థితి.

వంట చేసిన వాళ్ళు అన్నం పప్పు గిన్నెల్లో వేసి తీసికొని వచ్చి మధ్య గదిలోని మంచంపై పడుకుని కిట్టయ్య నారాయణలకు తినమని ఇచ్చారు. కిట్టయ్య కాలికి కట్టు వుంది. నారాయణ జ్వరంతో మూలుగుతున్నాడు.

అన్నంగిన్నె చేతిలో పట్టుకుని భోరుమని ఏడ్చాడు కిట్టయ్య. "ఏడవకు కిట్టయ్య ఏడవగాకు. భయపడగాకు - ధైర్యం తెచ్చుకుని అన్నం తిను"అంటూ ఓదార్చాడు నారాయణ. అదికాదు నారయణా. ప్రతిరోజు బాంబులు బ్రద్దలయి మనుషుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. శరీరాల్లోని అవయవాలు తెగిపడిపోతున్నాయి. రక్తం ఏరులై ప్రవహిస్తోంది. చిన్నా పెద్దా తేడాలేదు. ఆడ మగ భేదం లేదు. పిల్లలనే కనికరము లేదు. ఈ యుద్ధానికి అందరిమీదా కక్షే.

ఎక్కడ చూసినా రోగాలు, గాయాలు, ఏడుపులు రోదనలే. భయాందోళనలతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని మనుషులు బ్రతుకుతున్నారు. ఇవన్నీ తప్పించుకుని మనం మన దేశాన్ని చేరి అమ్మానాన్నలను, భార్యాబిడ్డల్ని చూడగలమంటావా?" బేలగా ప్రశ్నించాడు కిట్టయ్య.

"నిజమే కిట్టయ్యా అందరి పరిస్థితి అలాగే వుంది. మా ఇంట్లో వాళ్ళకి కూడా నేను బ్రతికి వున్నానో చచ్చిపోయానో తెలియదు. నా సమాచారం అందక ఎంతగా అల్లాడిపోతున్నారో ఏమో? ఇక్కడ చూస్తే కరెంటులేదు, ఫోన్లు లేవు. వెళదామంటే దారీ కనబడటంలేదు. ఇక దేవుడే మనల్ని కాపాడాలి. అంతవరకు ఓపికగా ఎదురు చూడాల్సిందే" చెప్పాడు నారాయణ నిట్టూర్చుతూ.

"నా కాలు బాగుంటే నేను ఎప్పుడో జోర్డాన్ చేరుకునేవాడిని. అక్కడ మన భారతదేశం పంపించే విమానంలో ఎక్కి ఇంటికి వెళ్ళిపోయేవాడినే. ఇంతకీ నా కాలు బాగవుతుందంటావా నారాయణా" కట్టుకట్టిన కాలిని చూసుకుంటూ కన్నీళ్ళు కార్చాడు కిట్టయ్య.

"బాగవుతుందిలే దిగులు పడగాకు" ధైర్యం చెప్పాడు నారాయణ.

"ఆ రోజు సాయంత్రం కొన్ని కూరగాయలు కొందామని ఆ మసీదువైపు వెళ్ళాను. అంతే. చెవులు చిల్లులు పడేటట్లు పెద్ద శబ్దం. కళ్ళు బెదిరిపోయేట్లు వెలుతురు. ఏం జరిగిందో తెలిసేటప్పటికి రక్తంతో తడిసిపోయి కాలు తెగిపోయి శవాల గుట్టల్లో పడిపోయి వున్నాను. అంతా నా ఖర్మ నారాయణా" నోట్లో అన్నం ముద్ద పెట్టుకుని ఏడుపు మొదలెట్టాడు కిట్టయ్య.

"నువ్వు ఎంతో అదృష్టవంతుడివి కిట్టయ్యా. కనీసం కాలు మాత్రమే తెగిపోయింది. అక్కడ జరిగిన మారణహోమంలో వందలమంది ప్రాణాలు కోల్పోయారు. నామరూపాలు లేకుండా ఎంతోమంది శరీరాలు ఛిద్రమైపోయాయి. భూమిమీద నూకలు వుండబట్టే మరలా మన భారతదేశం వెళ్ళి పిల్లా పాపల్ని కళ్ళతో చూసుకునే రాత నీకుండబట్టే ప్రాణంతో బ్రతికి బయటికి వచ్చావు. చెర్లోపల్లి నారిగాడు అయితే గుర్తుపట్టడానికి కూడా లేకుండా తునకలుగా మారి శవాల గుట్టకింద పడిపోయాడు. వీళ్ళందరి కంటే నువు అదృష్టవంతుడివి కాదా? ప్రాణంతో భూమ్మీద మిగిలినందుకు నువ్వు సంతోషించు కిట్టయ్యా" ఓపికగా చెపుతున్నాడు నారాయణ.

"నిజమే నారాయణా పాపం కువైటు వాళ్ళ పరిస్థితి చూస్తే గుండె తరుక్కుపోతోంది. మనం పరదేశులమని దయతలచి ఈ ఇరాకీవాళ్ళు వదిలిపెడుతున్నారు గానీ అదే కువైటీ వాళ్ళు కనబడితే కాల్చి సంపేత్తున్నారు. మరీ ఘోరం ఏంటంటే కువైటీ ఆడవాళ్ళను హింసలు పెట్టి పాడుచేస్తున్నారు. వీళ్ళకేం పోయేకాలమో వయసుకు రాని ఆడపిల్లల్ని కూడా వదలడం లేదు." తన బాధను మరిచిపోయి మాటల్లో పడ్డాడు కిట్టయ్య.

"సైనికులు వ్యాపారస్థులు ఎక్కువగా కూడుకుని వున్న ఆ మసీదును తమ లక్ష్యంగా ఎంచుకున్నారు కువైట వాళ్ళు. మంచి సమయం చూసి సాయంత్రం పూట జనాలు వున్న సమయంలో కారు బాంబులను పేల్చేశారు. అలా తమ కక్షను తీర్చుకున్నారు. కానీ ఇందులో చాలామంది అమాయకులు కూడా ప్రాణాలు కోల్పోయ్యారు మరి. నీలాంటి వాళ్ళు ఎందరో గాయాలపాలైనారు. ఏదైతేనేం సద్దాం మంచి పనే చేసినాడు. పెట్రోలు డబ్బు ఎక్కువైపోయి గర్వం తలకెక్కిన కువైటు వాళ్ళ క్రొవ్వు అణచడానికే యుద్ధానికి వచ్చాడు. కువైటు వాళ్ళు ఎంతమంది పనిమనుషులను తిండిపెట్టకుండా జీతాలు ఇవ్వకుండా కొట్టి తిట్టీ వేధిస్తున్నారో? ఈ కువైటువాళ్ళ పాపం పండిపోయింది. అందుకే దేశం సర్వనాశనం అయిపోయి ఇల్లూ వాకిలీ వదిలిపెట్టి పారిపోయారు" తనకు తెలిసినదంతా చెప్పుకుపోతున్నాడు నారాయణ.

ఇంతలో ఇండియా ఎంబసీ వాళ్ళు తమ చేతిలో ఒక లిస్ట్ పట్టుకుని అక్కడికి వచ్చారు. ఒక వారం రోజుల్లో జోర్డానుకు మన విమానాలు రాబోతున్నాయి. ఈ లిస్ట్‌లో పేర్లు వున్నవాళ్ళందరూ వెంటనే బయలుదేరి నాల్రోజుల్లో జోర్డాన్ చేరుకోవాలి అంటూ పేర్లను చదివారు.

తమ పేర్లు ఆ లిస్ట్‌లో వున్న వారందరూ చాలా సంతోషించి జోర్డాన్ వెళ్ళడానికి సిద్ధపడసాగారు. నారాయణ పేరుకూడా అందులో వుంది.

కానీ కిట్టయ్య మాత్రం ఆ లిస్ట్‌లో తన పేరు లేకపోవడంతో వెక్కి వెక్కి ఏడవసాగాడు.

కిట్టయ్య దణ్ణం పెడుతూ "అయ్యా నా కాలు తెగిపోయింది నేను నడవలేను. మీరు నన్ను తొందరగా మన దేశం చేర్చి పుణ్యం కట్టుకోండి. నా భార్యాబిడ్డల్ని ఒక్కసారి చూడాలని వుంది. లేకపోతే నా ప్రాణం ఇక్కడే గాల్లో కలిసిపోతుంది. మీకు దణ్ణం పెడతాను. మీ కాళ్ళు పట్టుకుంటాను. నన్ను కూడా లిస్ట్‌లో వుంచి జోర్డానుకు పంపించండి అంటూ దీనాతిదీనంగా రోదిస్తూ వారిని అర్థించసాగాడు. కానీ ఎంబసీ అధికారులు "కిట్టయ్యా మరోసారి వచ్చే లిస్ట్‌లో నీ పేరు వచ్చేటట్లు మేము చూస్తాం. ఇప్పటికి వదిలెయ్ నీ పేరుని చేర్చలేం ఎవరైనా ఈ లిస్ట్‌లోనుంచి తొలిగిపోతే తప్ప నీ పేరుని చేర్చటం సాధ్యంకాదు" అంటూ నచ్చ చెప్పసాగారు.

కిట్టయ్య కన్నీళ్ళు తుడిచిన నారాయణ ఎంబసీవాళ్ళతో "సార్ నా బదులు ఈ కిట్టయ్యను పంపించండి. ఇతడు మసీదులో జరిగిన బాంబు దాడిలో కాలును పోగొట్టుకుని గాయాలపాలైనాడు. ఇలాంటి వాళ్ళను మీరు ముందుగా మనదేశం చేర్చి పుణ్యం కట్టుకోండి" అంటూ అర్థించాడు. ఎంబసీ అధికారులు అందుకు ఒప్పుకుని లిస్ట్‌లో నారాయణ పేరున్న స్థానంలో కిట్టయ్య పేరును చేర్చారు.

మాటలు రాని కిట్టయ్య కృతజ్ఞతగా నారాయణను కౌగిలించుకున్నాడు.

నారాయణ చేసిన త్యాగాన్ని అక్కడ వున్న వారందరూ మెచ్చుకున్నారు. ఒక్కోసారి యుద్ధంకూడా మనుషుల్లో మానవత్వాన్ని పెంచుతుంది. యుద్ధం చేసిన గాయాన్ని తడుముకుంటూ ఇంటికి వెళ్ళి తనవారిని చూస్తాననగానే ఆనందంతో ప్రయాణానికి సిద్ధపడసాగాడు కిట్టయ్య.

## ఎడారి పయనం

**ప్రొద్దుటే నాలుగున్నరకు** గుయ్‌మంటూ అలారం మోగేటప్పటికి మెలుకువ వచ్చేసింది. అబ్బ అప్పుడే తెల్లారిందా? అంత తొందరగా రాత్రి గడిచిపోయిందా? ఇంకో రెండు గంటలు కాలం అలాగే నిలిచిపోతే బాగుండును. కళ్ళు విప్పాలనిపించడంలేదు. మంచం మీదనుండి కదలాలనిపించడంలేదు. అసలే చలికాలం. వెచ్చటి రగ్గును వంటినిండా కప్పుకుని ఇంకాసేపు ముడుచుకుని పడుకోవాలనిపిస్తోంది. ఇలాంటి సమయంలోనే జీవితం మీద విరక్తి కలిగి ఎన్నాళ్ళు గడపాలో ఈ ఎడారి జీవితం. ఎన్నేళ్ళు చేయాలో ఈ దిక్కుమాలిన ఉద్యోగం? తెలిస్తే బాగుండు. దీనికొక లిమిట్ ఉంటే బాగుండు. కువైట్‌కి వచ్చి ఇరవై ఒక్క సంవత్సరాలు దాటిపోయాయి. కాళ్ళకు చక్రాలున్నట్లు కాలం పరుగులు పెట్టింది. నిస్సందేహంగా సగం జీవితం ఇక్కడే పరుగులు, ప్రయాసలతో గడిచిపోయింది. అందమైన యవ్వనం. విలువైన జీవితం ఎడారిపాలైపోయింది.

మన ఊరిలో మన నేలలో జీవిస్తే వున్న ఆనందం ప్రపంచంలో వేరొకచోట ఎక్కడైనా ఉంటుందా? అసంభవం. రోజుకొక్కపూట పచ్చడి మెతుకులతో భోజనం తిన్నాచాలు. ఇక ఈ కువైటూ వద్దూ, ఫైవ్ స్టార్ హోటల్‌లోని కొలువూ వద్దు. ఇరవై ఏళ్ళకు పైగా పడిన కష్టం చాలు. వీలయినంత తొందరగా ఈ కువైటు వదిలేసి ఇండియా వెళ్ళిపోవాలి. మన గాలిని గుండెలనిండా పీల్చుకోవాలి. కలత లేకుండా మన నేలపై పడుకుని హాయిగా నిద్రపోవాలి. ప్రొద్దున్నే నిద్రలేవాల్సిన బాధ టెన్షనూ ఉండదు. ఇంకో సంవత్సరం అంతే. తప్పకుండా ఉద్యోగానికి రిజైన్ చేసి వెళ్ళిపోవాలి అనుకుంటూ టైమయింది. తప్పదు ఇంక లేవాలి. నాకు నేను చెప్పుకుంటూ ఒకసారి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని మంచం దిగాను.

పేరుకు ఫైవ్ స్టార్ హోటల్‌లో ఉద్యోగం. కానీ ఏం లాభం? ఇన్నేళ్ళు కువైట్‌లో వుండి ఉద్యోగం వెలగబెట్టి ఇండియాలో కనీసం ఒక ఇల్లైనా కట్టుకున్నానా? మరి వెళితే ఎక్కడ వుండను? ఏం చేయను? అన్నీ ప్రశ్నలే. గాలివాటుకి కొట్టుకుపోయే గమ్యం లేని జీవితం అయిపోయింది. నిట్టూరుస్తూ ఆఫీస్‌లో అడుగుపెట్టాను.

వి.ఐ.పి లాంజ్‌లో రిసెప్షనిస్ట్ ఉద్యోగం నాది. రకరకాల గెస్ట్‌లు వివిధ దేశాల నుండి వచ్చిన వారు ఉద్యోగరీత్యా, వ్యాపారపరంగా మా హోటల్‌లో విడిది చేస్తుంటారు. వారితో మాట్లాడుతున్నప్పుడు వారి సంస్కృతి సంప్రదాయాలు పద్ధతులేకాక ఎన్నో ఆసక్తికరమైన విషయాలు కూడా తెలుస్తుంటాయి.

ఫైవ్ స్టార్ హోటల్ అనగానే చాలామంది అక్కడ ఆల్కాహాల్, బార్‌లు, క్లబ్బులు అందులో డాన్సులు ఉంటాయని అనుకుంటారు. కానీ మా కువైట్ దేశంలో ఇంకా ఇస్లాం మత సాంప్రదాయాల్ని కాస్త పాటిస్తున్నారు కాబట్టి ఆల్కహాల్‌ను అంటే మద్యపాన నిషేధం అమలులో వుంది. హమ్మయ్య బ్రతికించారు అనుకుంటూ నిశ్చింతగా నా ఉద్యోగాన్ని కొనసాగిస్తున్నాను నేను.

ఇస్లాం మత సాంప్రదాయాల్ని పాటించే గల్ఫ్ దేశాల్లో ముందు మద్యపానం అసలు ఉండేదికాదు. కానీ ప్రపంచంలోనే గొప్ప పర్యాటక దేశంగా ఆవిర్భవించిన దుబాయిని చూసి బహరైన్, దోహా ఖతార్‌లాంటివి మద్యాన్ని అందించడం మొదలు పెట్టాయి. అరబ్ దేశాలకు కేంద్రమైన మక్కాలాంటి పవిత్రమైన పుణ్యక్షేత్రం వున్న సౌదీ అరేబియాలో కూడా తొందరలో మద్యపానాన్ని చట్టబద్ధం చేస్తారనే వార్తలు వస్తున్నాయి. మరి అందుకు ఇస్లాం మత ఛాందసవాదులు ఒప్పుకుంటారో లేదో? మనదేశంలో మన ముఖ్యపట్టణంలో గతనెలలో జరిగిన "దిశ" ఉదంతం హృదయాన్ని కలిచివేశాక జరిగే ఘోరాలకు మనుషులు చేసే అకృత్యాలకు చాలావరకు మద్యమే కారణం అని తేటతెల్లంగా తెలిసిపోయింది. ఒకప్పుడు మా ఊర్లో త్రాగుబోతులు ఏదైనా తప్పుచేసి త్రాగిన మత్తులో చేసాం అని సర్దిచెప్పుకోడానికి ప్రయత్నించేవాళ్ళు. మా నాన్నలాంటి పెద్దమనుషులు "ఏరా తాగినంత మాత్రాన నీకు కళ్ళు కనిపించవా? తల్లికీ పెళ్ళానికీ తేడా తెలియకుండా పోతుందా" అని అడిగేవారు. అంటే ఆ కాలంలో కనీసం తల్లికి పెళ్ళానికి తేడా తెలిసేటంతగా వంట్లో స్పృహ వుండేది తాగుబోతులకి. ఆ మాటతో సిగ్గుపడి కొందరు మరలా తాగడానికి వెనుకాడేవారు. కానీ ఇపుడు ఈకాలంలో తాగడానికి తప్పులు చేయడానికి ఏ కారణాలు అవసరంలేదు. అట్టడుగు వర్గాల వాళ్ళు కష్టం చేసి ఒళ్ళు అలసిపోయి సారా, కల్లు తాగడం అలవాటు చేసుకుంటే సంపన్న వర్గాలవారు స్టేటస్ మెయిన్‌టెయిన్ చేయడానికి ఫారిన్ బ్రాండ్స్ బుడ్డీలలో లిక్కర్లు పార్టీల్లో తాగడం, సోషల్ సొసైటీ ఏ రకంగానైతేనేం మద్యపానాన్ని ఏదో ఒకవిధంగా వీళ్ళంతా ప్రోత్సహిస్తూనే వున్నారు.

"నువు దుబాయ్‌లో పని చేయకూడదా? మంచి ఫన్, కాలక్షేపం ఎంటర్‌టెయిన్‌మెంట్ వుంటాయి" అంటూంటారు కొంతమంది నాతో.

"నో.. నాకిష్టంలేదు దుబాయికి వెళ్ళిన వారి పరిస్థితి ఏమిటో నాకు బాగా తెలుసు. చాలామంది చెబుతూ వుంటారు. అక్కడ ఫన్ కోసం, కాలక్షేపం కోసం తాగుడు, క్లబ్బులు కోసం తమ జీతాలన్నీ ఖర్చుపెట్టేసి అది చాలక ఇంకా అప్పులు చేసేవాళ్ళు వున్నారట. తాము ఎందుకు తమ కుటుంబాల్ని వదిలి అప్పులు చేసి వీసాలు కొని గల్ఫ్ దేశాలకు వచ్చామో మర్చిపోయి తాము సంపాదించిందంతా త్రాగుడుకు జల్సాలకు ఖర్చుపెట్టేస్తున్నారంట వీళ్ళు ఇంటికి కుటుంబాలకు కూడా డబ్బు పంపించడం లేదంట.

కువైటు దేశంలో ఆల్కహాల్ లేదు గనుకే ఇక్కడ పనిచేసేవాళ్ళు నాలుగురాళ్ళు వెనకేసుకోగలుగుతున్నారు. ఇక్కడ చట్టంకూడా కఠినంగా వుంటుంది కాబట్టి నేరాలు చెయ్యాలంటే భయపడిపోతారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏవిధంగా కూడా తప్పించుకుని బ్రతకలేమని అందరికీ తెలుసు. అందుకే నేరాల సంఖ్య ఇక్కడ తక్కువ. ప్రశాంతత, నిలకడ కలిగిన జీవితాన్ని కోరుకునేవాళ్ళకి నాకు తెలిసి గల్ఫ్ దేశాల్లో కల్లా కువైటు దేశమే బెస్ట్. "

గత నెలలో మన హైదరాబాద్ నగరంలో "దిశ" దుర్ఘటన జరిగినప్పటినుండీ మన దేశంలోనే ఎందుకిలాంటి అమానుష కార్యాలు జరుగుతున్నాయి. దీనికి మూలకారణం ఏమిటి? ఎక్కడుంది లోపం? పురుషాధిక్య సమాజం వల్లనా? చదువు సంస్కారం తక్కువైనందునా? మద్యపానంలాంటి దుర్వ్యసనాలు ప్రజల్లో ఎక్కువైనందునా? ఎందువల్ల మనదేశంలో నేరాలు పెరిగిపోతున్నాయి.

ముఖ్యంగా స్త్రీలమీద దౌర్జన్యాలు ఎక్కువైపోతున్నాయి. ఒంటరిగా పట్టపగలు కూడా ఎక్కడికైనా వెళ్ళాలంటే స్త్రీగా భయపడాల్సి వస్తోంది. దేవుడా మా దేశాన్ని, స్త్రీలను, చిన్నపాపాయిలను కాపాడు అని అనుదినం ప్రార్థించాల్సి వస్తోంది.

ఆవేదనతో ఆలోచిస్తూ అలవాటైన పనిని కంప్యూటర్‌లో చేసుకుపోతున్నాను.

ఇంతలో వచ్చాడు ఒక గెస్ట్.

మామూలుగా "గుడ్ ఆఫ్టర్‌నూన్ "అంటూ విష్ చేసి చిరునవ్వు నవ్వాను.

అతను వచ్చి టేబుల్ దగ్గర కూర్చుని "నువ్వు ఇండియన్‌వా?" అని ప్రశ్నించాడు.

"అవును సర్" అని బదులిచ్చాను.

"ఏ సిటీనుండి వచ్చావు?"

"హైదరాబాద్ నుండి సర్"

"ఓ..గుడ్ మా అమ్మది కూడా హైదరాబాదే నేను రెండుసార్లు హైదరాబాద్ వెళ్ళాను" సంతోషంగా చెప్పాడు మా అతిథి. చూస్తుంటే కువైటీలా కనిపిస్తున్నాడు. వాళ్ళమ్మ హైదరాబాదునుండి వచ్చింది అని చెపుతున్నాడు. ఏంటో అని మనసులో అనుకుంటూ "సర్ మీరు కువైటీనే కదా!?" అని అడిగాను.

"నిస్సందేహంగా నేను మా నాన్న కువైటీస్‌మే. కానీ మా అమ్మ హైదరాబాదీ. మా అమ్మ బ్రతికున్నంతవరకూ హైదరాబాద్ బిరియానీ చాలా రుచిగా మాకు వండిపెట్టేది. మేమే కాదు మా బంధువులంతా ఆమె చేసిన బిరియానీ తిని ఆ వంటను మెచ్చుకునేవారు. గత సంవత్సరమే మా అమ్మ చనిపోయింది. మేము మా అమ్మను, బిరియానీని మిస్ అవుతున్నాం" అంటూ నిట్టూర్చాడు.

"చాలా సంతోషం సర్. మీ అమ్మగారు కూడా మా హైదరాబాదీ కావడం నిజంగా గొప్ప విషయం. మరి ఇది ఎలా జరిగింది?" ప్రశ్నించాను కుతూహలంగా.

అదొక ప్రేమకథ. మా అమ్మానాన్నల ప్రేమగాథ. నీకు టైము వుంటే చెపుతాను విను అంటూ మొదలు పెట్టాడు.

"తెలుసుకోవాలని చాలా ఆసక్తిగా వుంది దయచేసి చెప్పండి సర్ అన్నాను."

అది ఇండియాను బ్రిటిష్ వాళ్ళు పాలించే కాలం. 1930కాలంలో బ్రిటిష్ వాళ్ళు ఇండియానే కాక ఇటువైపు వున్న గల్ఫ్ దేశాల్ని కూడా ఆక్రమించుకున్నారు. ఇండియాను కేంద్రంగా చేసుకుని చుట్టుపక్కల వున్న దేశాల్ని కూడా భారతదేశపు ఆధీనంలోకి తెచ్చి పాలించారు. ఇక మా కందరికీ ఇండియా కరెన్సీ, చట్టం, పద్ధతులు, విధానాలు అనివార్యమయ్యాయి. ఇప్పుడు మీరు ఇండియానుండి కువైటుకు ఉద్యోగాల కోసం వచ్చినట్లుగా అప్పట్లో బ్రిటిష్ వాళ్ళు మమ్మల్ని ఉద్యోగాల నిమిత్తం ఇండియాకు తీసుకుని వెళ్ళేవారు.

బ్రిటిష్ వారి హయాంలో ఇక్కడ గల్ఫ్ దేశాలు చాలా పేదరికాన్ని అనుభవిస్తుండేవి. అరేబియా సముద్రంలో ముత్యాలు సేకరించడం, పడవలు తయారు చేయడం మా వృత్తులు. అవే అప్పట్లో జీవనాధారం. ఆ తరువాత బ్రిటిష్ వారే గల్ఫ్ ప్రాంతాల్లో పెట్రోలు బావులను కనుక్కొని పెట్రోలును భూమిలోనుండి పైకి తీయడం మొదలుపెట్టారు. బ్రిటిష్ వాళ్ళ పుణ్యమా అని ఈ రోజు మేము ప్రపంచంలో ధనికులముగా విలాసవంతమైన జీవితాల్ని గడుపుతున్నాము. అప్పట్లో ఈ ప్రాంతాల్లో కాలేజీలు సంస్థలు కంపెనీలు పెద్ద ఆసుపత్రులు లాంటివి వుండేవి కావు. పై చదువులు చదవాలన్నా వ్యాపారం నిర్వహించాలన్నా పెద్ద ఆసుపత్రులకు పోవాలన్నా మాకు ఇండియానే గతి. మా తాతగారు పడవలు, ఓడలు తయారు చేయడంలో నిపుణుడు. అందువలన బ్రిటిష్ జనరల్ ఒకాయన మా తాతగారిని కుటుంబంతో సహా ఇండియాకు తీసుకెళ్ళిపోయాడు. అపుడు మా నాన్నగారికి పదిహేనేళ్ళ వయసు వుండవచ్చు. పెద్ద

చదువులు చదివించాలనీ అందులో ఉర్దూ నేర్పించాలనే ఉద్దేశ్యంతో మా తాతగారు మా నాన్నగారిని హైదరాబాద్‌లోని కాలేజ్‌లో చేర్పించారు. అక్కడ ఖురాన్ పఠనానికి మదర్సాలు వుండేవి. అక్కడే ఉర్దూభాషను బోధించే అధ్యాపకులు కూడా వుండేవారు. అలా మా నాన్నగారు కొన్నేళ్ళు హైదరాబాద్‌లో వుండి సివిల్ ఇంజినీర్ చదువు చదివారు. అప్పట్లో ఇంజనీరు చదువంటే చాలా గొప్ప. అందరికీ అవి చదవడం సాధ్యంకాని పని. మదరసాల్లో ఖురాన్ పఠించే సమయంలో మా నాన్నగారు అక్కడ ఒకమ్మాయిని చూసారు. అప్పట్లో ముస్లిం అమ్మాయిలు నిండైన బురఖాని ధరించి ఎన్నో కట్టుబాట్ల మధ్య వుండేవారు. మరి ఎలా సాధ్యమైందో ఎక్కడ కుదిరిందో కానీ ఇద్దరి మనసులు కలిసాయి. ఇద్దరూ ప్రత్యేకంగా ఎక్కడా కలవకపోయినా, ఒక్కమాటకూడా మాట్లాడలేకపోయినా చూపులతోనే మౌనంగా మాట్లాడుకునేవాళ్ళు. సంవత్సరాలు గడిచేకొద్దీ గాఢమైన అనుబంధంగా వారి ప్రేమ రూపుదిద్దుకుంది. ఒకరోజు ఉత్తరం ద్వారా ఆమెకి వాళ్ళ ఇంట్లో సంబంధాలు చూస్తున్నారని మా నాన్నకి తెలియజేసింది.

దాంతో మా నాన్న 'తను ఒకమ్మాయిని ప్రేమిస్తున్నానని ఆమెనే పెళ్ళి చేసుకుంటానని' మా తాతగారితో చెప్పేసారు. మా తాతగారు కుదరదని ఖచ్చితంగా చెప్పేసి వెంటనే కుటుంబంతో సహా కువైటుకు వచ్చేసారు. ఇక్కడ తన చెల్లి కూతుర్ని ఇచ్చి బలవంతంగా మా నాన్న పెళ్ళి చేసేసారు. మా నాన్నకు ఏం చేయాలో అర్థంకాలేదు. ఆ అమ్మయికి పోస్ట్‌లో ఒక ఉత్తరాన్ని రాసి ఆ మదరసా అడ్రస్‌కు పంపించారు. అందులో తను ఏదో ఒకరోజు తొందరలో హైదరాబాదు వస్తానని, తప్పకుండా ఆమెను వివాహం చేసుకుంటానని కొద్దిరోజులు తనకోసం నిరీక్షించమని రాసారు. అప్పట్లో బహుభార్యత్వం పురుషులకు సహజమే. అప్పటికీ ఇప్పటికీ మా ముస్లిములకు అది చెల్లుతుంది.

తరువాత మా నాన్నగారు ఎలాగో సర్దుకుని ప్రేమను మరిచిపోయి ఇక్కడ సంసారజీవితంలో పడిపోయి కాలాన్ని నెట్టేసారు. అలా దాదాపు పదేళ్ళ కాలం గడిచిపోయింది. పిల్లలు కూడా పుట్టేసారు. ఒకరోజు మా నాన్నకి సడన్‌గా హైదరాబాద్ అమ్మాయి గుర్తొచ్చి కలవరపడిపోయారు. ఎందుకో వెంటనే వెళ్ళి చూడాలి అనిపించి హైదరాబాద్‌కి ప్రయాణమై మదరసాను వెతుక్కుంటూ వెళ్ళారు. అక్కడ బోధకులు చెప్పిన మాటలతో మా నాన్నగారు నిరుత్తరులయ్యారు. ఏమంటే తాను ప్రేమించిన అమ్మాయి తను రాసిన ఉత్తరాన్ని చదివాక తను చెప్పిన మాటమీద నమ్మకం ఉంచిందంట. ఏదో ఒకరోజు మా నాన్నగారు వస్తారని పెళ్ళి చేసుకుంటారని నమ్మి తన తల్లిదండ్రులు ఎంత బలవంత పెట్టినా వేరొకర్ని పెళ్ళిచేసుకోకుండా పదేళ్ళ నుండి మా నాన్నగారికోసం నిరీక్షిస్తూ వుందంట.

ఎంత గొప్ప ప్రేమ? ఆమె ప్రేమకు మా నాన్నగారే ఆశ్చర్యపోయారట. వెంటనే అక్కడే ఆమెను వివాహం చేసుకుని కువైట్‌కి తీసుకొచ్చి ధైర్యంగా అందరికీ చెప్పి కాపురం పెట్టేసారు. ముస్లిం అబ్బాయి ఇంకో పెళ్ళి చేసుకోవడం తప్పుకాదు కనుక ఇంకేమీ అనలేక మా తాతగారు, పెద్దమ్మగారు మిన్నకుండిపోయారు. అలా హైదరాబాద్‌లో పుట్టిన మా అమ్మ కువైట్ దేశపు కోడలు అయ్యింది. తరువాత నేను, మా తమ్ముడు, చెల్లెళ్ళం పుట్టాం. జీవితకాలమంతా ఒకరికొకరుగా బ్రతికిన మా అమ్మా నాన్నలిద్దరూ గత సంవత్సరం ఒకే నెలలో ముందూ వెనుకా చనిపోయారు'' అంటూ వాళ్ళ అమ్మానాన్నల ప్రేమకథని ముగించాడు మా గెస్ట్.

వింటున్న నాకుకూడా చాలా ఆశ్చర్యం కలిగింది. ప్రేమ ఎంత గొప్పది? ప్రేమకున్న శక్తితో మనుషుల హృదయాల్నే కాదు, ఈ ప్రపంచాన్ని సైతం జయించవచ్చు అనిపించింది.

''నిజంగా చాలా గొప్ప కథ విన్నాను సర్. నా హృదయం నిండిపోతోంది. ఆ తల్లి కడుపున పుట్టిన మీరు అదృష్టవంతులు'' అన్నాను.

బదులుగా చిన్నగా నవ్వాడు ఆయన.

''నీకు కూడా బిరియానీ చెయ్యడం వచ్చా?'' అని అడిగాడూ.

"అంతగా రాదు సర్ నాకు. వంట చేసే అవసరం పెద్దగా రాలేదు. ఎందుకంటే మాకు మా హోటల్ మూడు పూట్లా ఆహారాన్ని అందిస్తుంది. ఎప్పుడైనా సెలవురోజున నాకోసం సాంబార్, పచ్చడిలాంటి చిన్న వంటలు చేసుకుంటాను అంతే" అని చెప్పాను.

ఇంతలో ఆఫ్రికా నుండి జాంబియా మినిష్టర్ మా హోటల్‌లో విడిది చేయడానికి వస్తోందని ఇంకో పదినిముషాల్లో ఎయిర్‌పోర్టునుండి మా హోటల్‌కి చేరుకుంటుందని మెసేజ్ వచ్చింది. ఆ మినిష్టర్ ఒక స్త్రీ అని ఆమెను సాటి స్త్రీగా నేను రిసీవ్ చేసుకోవాలని ప్రత్యేకంగా చెప్పారు.

'సరే' అని కువైటీ గెస్ట్‌కి 'ఎక్స్‌క్యూజ్‌మీ' అని చెప్పి ఆ పనిలో పడ్డాను నేను.

అప్పటికే జాంబియా ఎంబసీనుండి అంబాసిడర్, ఆయన పరివారం పుష్పగుచ్చాలతో వచ్చి మా హోటల్ లాబీలో ఆమెకోసం నిరీక్షిస్తున్నారు. నేను పేపర్, రూమ్‌కీలాంటివి ప్రిపేర్ చేసి హోటల్ బయట నిలబడ్డాను. ముందుగా సెక్యూరిటీవాళ్ళు, పోలీసులు, డాగ్ స్క్వాడ్‌తో వచ్చి హోటల్‌ను ఆమె విడిది చేసే రూమ్‌ను కుక్కలతో పరిశీలించి అంతా బాగుందనీ రక్షణకు లోపం లేదని నిర్ధారించుకున్నారు.

సెక్యూరిటీ కార్లు రెండు ముందూ మరో రెండు కార్లు వెనక వెంబడిస్తూరాగా ఠీవిగా మినిష్టర్‌గారు దిగారు. నేను కూడా చిరునవ్వుతో రిసీవ్ చేసుకుని పద్నాలుగో అంతస్తులో ఆమెకు కేటాయించిన రాయల్ స్విట్ రూమ్‌కి తీసుకుని వెళ్ళాను. ఒక నిముషంలో హోటల్‌లో గల సౌకర్యాలను ఆమెకు వివరించి రూమ్ 'కీ' ఆవిడ చేతికి అందించాను.

ఆమె ఎంతో వినయంగా చేతులు జోడించి నవ్వుతూ "థాంక్యూ సోమచ్" లలితా అంది.

అంత పెద్ద మినిష్టర్ అయివుండి కూడా ఆమె చేతులు జోడించి కృతజ్ఞతలు చెప్పడంతో నేను ఎంతో సంతోషించాను.

తరువాత మూడు రోజులకి ఆమె రూమ్ ఖాళీ చేసి వెళుతూ గెస్ట్ శాటిస్‌ఫాక్షన్ సర్వేలో "లలిత చాలా ప్రొఫెషనల్. నన్ను చక్కగా రిసీవ్ చేసుకుని రూమ్‌కి తీసుకెళ్ళింది. అన్ని విషయాలు వివరించి నా విడిదిని సౌకర్యవంతంగా చేసింది. థాంక్స్ టు హర్" అని కామెంట్స్ రాసింది.

అలాగే మా కువైటీ అతిథికూడా మా మేనజర్ల దగ్గరికి వెళ్ళి "లలిత హైదరాబాద్ అమ్మాయి. అలాగే మా అమ్మకూడా హైదరాబాద్ అమ్మాయే. లలితతోపాటు మనందరం హైదరాబాద్ వెళ్ళి రుచికరమైన బిరియానీ తిందాం" అంటూ చెప్పుకొచ్చారు.

ఈ ఎడారిలో నిరాశా నిస్పృహలతో, పనిఒత్తిడితో జీవించే మాకు ఇలాంటి అతిథుల ప్రోత్సాహకరమైన కామెంట్లు ముందుకెళ్ళడానికి, ఇక్కడ ఇంకా పనిచెయ్యడానికి బలాన్ని, శక్తిని అందిస్తాయి.

మరి ఇక్కడ. ఈ ఎడారి దేశంలో ఇంకెన్నాళ్ళు, ఎన్నేళ్ళు కొనసాగుతుందో నా జీవితపయనం. నాకైతే అర్థంకావడం లేదు. మనిషి జీవితాన్ని ఎప్పుడు, ఎలా? ఎక్కడ మలుపులు తిప్పాలో బాగా ఎరిగిన ఆ దేవుడికే తెలియాలి. అంతవరకూ ఇక్కడ ఈ కువైట్‌లో భారమైనా, బరువైనా నేను ముందుకు సాగాల్సిందే, బ్రతుకు బండిని నడిపించాల్సిందే

## ఎడారి సమిధలు



కౌముది

**చెన్నై ఎయిర్‌పోర్టు.** కువైట్ వెళ్ళే ఒమన్ ఎయిర్‌వేస్‌కోసం ప్రయాణికులు పెద్ద క్యూ కట్టి ఉన్నారు. రెండు బ్యాగులనూ ట్రాలీలో వేసుకుని తోసుకుంటూ క్యూలోకి వెళ్ళి నిలబడ్డాను. ఒక బ్యాగును చేతిలో మోసుకుంటూ హడావిడిగా వచ్చి నా వెనుకే వరుసలో నిలబడింది ఒకమ్మాయి. హేండుబాగులోని కర్చీఫ్ తీసుని కన్నీళ్ళను తుడుచుకుంటోంది. ఐదు నిముషాలయినా దుఃఖం ఆగడంలేదు. కన్నీళ్ళను చూస్తే మన కళ్ళు అటువైపే తిరుగుతాయికదా? ఇక మనసును, మాటను ఆపుకోలేక భుజం మీద చెయ్యేసి "ఎందుకు ఏడుస్తున్నావు? మొదటిసారిగా కువైట్‌కి వెళుతున్నావా?" అని అడిగాను అనునయిస్తూ.

"ఇది రెండోసారండి. మూడేళ్ళు వుండి వచ్చి మళ్ళీ వెళుతున్నాను."

"ఓహో. ఇంటిమీద దిగులా? తిరిగి వెళ్ళడం ఎవరికైనా బాధే. స్వేచ్ఛా ప్రపంచంలోనుండి జైల్లోకి బలవంతంగా వెళ్ళినట్లుంది కదా" అన్నాను.

"కాదండీ అదేంకాదు. ఇక్కడకంటే అక్కడే వుండటమే మేలనిపిస్తోంది. కష్టపడి పనిచేసుకున్నామా.. కడుపుకింత తిని కంటినిండా నిద్రపోయామా? అంతే. కానీ ఇక్కడ ఇండియాలో అలా కాదు. అయినవాళ్ళే అనుబంధాలు మరిచి ఆస్తులకోసం అన్యాయం చేస్తున్నారు. వీళ్ళకంటే ఆ అరబ్బువాళ్ళే నయం కదా?" అంటూ ఉబికి వచ్చే కన్నీటిని మళ్ళీ రుమాలుతో తుడుచుకుంది.

ఆ అమ్మాయి మాటలకి మనసు కలుక్కుమంది. నిజమేకదా అనిపించి భారంగా ఒక నిట్టూర్పు బయటికి వచ్చింది.

"ఏడవకు. ఏడుపు సమస్యలకు పరిష్కారం కాదు" అన్నాను.

"కావచ్చు కానీ. మనం కూడా మనుషులమేకదండీ. మృగాలం కాదుకదా. గుండెలో పేరుకుపోయిన బాధ వద్దనుకున్నా కన్నీళ్ళ రూపంలో బయటికి వచ్చేస్తోంది. ఏం చేయను" అంది బేలగా.

చక్కగా ఎంతో తెలివిగా మాట్లాడుతున్న ఆ అమ్మాయిని ఒకసారి పరికించి చూసాను. చామనఛాయ రంగులో వున్నా చాలా కళగా వుంది. తన ముఖం కన్నీళ్ళతో తడిసిన కళ్ళు మెరుస్తున్నాయి. చక్కగా తీర్చిదిద్దినట్లున్న తన మోహాన్నే చూస్తూ ఈ అమ్మాయితో మాట్లాడి తెలుసుకోవాల్సింది చాలా వుంది అనుకున్నాను మనసులో.

"సరే.. ముందుకు వెళదాం పద. మనవంతు వచ్చేసింది. లగేజ్ వేసేసి చెకిన్ అయ్యాక తీరికగా మాట్లాడుకుందాం" అన్నాను ట్రాలీని ముందుకు తోస్తూ.

మేము ఇద్దరం స్నేహితురాళ్ళం అనుకుందో ఏమో కౌంటరులోని అమ్మాయి ఇద్దరికీ కలిపి చెకిన్ చేసేసి పక్క పక్క సీట్లే ఇచ్చింది. పోనీలే ఇదీ ఒకందుకు మంచిదే ప్రయాణంలో తోడు దొరికింది. తన కథ తెలుసుకునే అవకాశం కుదిరింది అని సంతోషించాను నేను. ఇద్దరం వెళ్ళి ఒమన్ ఎయిర్ ఫ్లైయిట్ వచ్చే గేటు దగ్గరవున్న వెయిటింగ్ హాల్లో కూర్చున్నాం. నాతోడు దొరికి నాతో మాట్లాడుతుండటంతో ఏడుపు కాస్త ఆపింది ఆ అమ్మాయి. ఇద్దరం చేతుల్లో వున్న చేతి సంచులను పట్టుకుని ఖాళీగావున్న కుర్చీలు చూసుకుని కూర్చున్నాం.

"మీరు కువైట్‌లో ఏ మంతకాలో (ప్రదేశంలో) వుంటారు? ఏం పని చేస్తున్నారు? ఎన్నేళ్ళయింది కువైట్‌కి వచ్చి? మంచి పనేనా?" ఇప్పుడు కొంచెం తెరిపిన పడి తన బాధను మరిచిపోయిందేమో, నామీద ప్రశ్నల వర్షం కురిపించింది.

అన్ని ప్రశ్నలు ఒక్కసారిగా అడిగేసరికి నవ్వు వచ్చింది నాకు. మామూలుగా ఎడారిదేశాల్లో పనిచేసేవాళ్ళు అందునా తెలుగువాళ్ళు కలుసుకున్నప్పుడు ఇలాంటి ప్రశ్న జవాబుల పర్వమే నడుస్తుంది వారి మాటల్లో. మనుషుల కలయికలో కష్టసుఖాల కలబోతలు ఉండటం సాధారణమైన విషయమే కానీ గల్ఫ్ దేశాల్లో పనిచేసేవారిలో మాత్రం కష్టాల కథలకు కొదవ ఉండదు. ఆ మధ్య ఒకాయన అమెరికా నుండి ఇండియా వెళుతూ కువైట్‌లో బిజినెస్ పనులమీద మా హోటల్లో విడిది చేసాడు. ఆయన చెకిన్ అయి బిజినెస్ (విజిటింగ్)

కార్డు ఇచ్చాక అందరికీ అర్థమయింది ఆయన ఎంత గొప్పవారో, ఎంత పెద్దమనిషో. అంటే వివిఐపి గెస్ట్ అన్నమాట. అందులో ఆయన మన తెలుగువారు విజయవాడ ప్రాంతానికి చెందినవారు కావడంతో విషయం నాదాకా వచ్చింది.

"ఇదిగో లలితా చూసావా? 603లో చెకిన్ అయిన మిష్టర్ వెంకటేశ్వరావు ఎంత గ్రేటో తెలుసా?" కళ్ళు తిప్పుతూ ప్రశ్నించింది షెర్లీ.

"వెంకటేశ్వరావా? అచ్చమైన తెలుగు పేరు. ఏ ఊరో? " అనుకుంటూ "గ్రేటా? ఏంటంట?" ప్రశ్నించాను.

"ఆయన మీ ఇండియావారే కానీ అమెరికాలో సెటిల్ అయి మన మారియట్ హోటల్ లాంటివి నాలుగు కట్టారట. వాటికి ఆయన ఓనరు. ప్రపంచంలోని మన హోటల్ గ్రూపులో మెంబరు కూడా. అబ్బ అమెరికాలో నాలుగు మారియట్ హోటళ్ళకి ఓనరంటే ఎంత అదృష్టం కదా? ఇప్పుడు ఇండియాలో కూడా రెండు హోటళ్ళు ఉన్నాయంట. ఇంకోటి నిర్మాణంలో ఉందంట. ఆ పనిమీదే ఇండియా వెళుతూ ఇక్కడేదో పనిమీద ఆగారంట. అంత గొప్పవాడిని అనే గర్వం మచ్చుకైనా కనపడదు. అందరితో చాలా ఫ్రెండ్లీగా మాట్లాడుతున్నారు. ఇంకాసేపటిలో విఐపి లాంజ్‌కి వస్తారు. అప్పుడు నిన్నుకూడా కలుస్తారులే. బాగా మాట్లాడి నీకు కూడా అమెరికాలోని మారియట్ హోటల్లో జాబ్ అడుగు. సెటిల్ అయి హ్యాపీగా అమెరికా వెళ్ళిపోదువుగాని" చెప్పింది షెర్లీ.

"అలాగా. అలాగే తప్పకుండా" అన్నాను నేను బదులుగా. అన్నట్లుగానే సాయంత్రం స్నాక్స్ టైమ్‌కి వచ్చారు ఒకాయన. సాదాసీదాగా వున్న ఆయన్ని చూసి నిజంగా ఈయన ఆరు హోటళ్ళకి ఓనరా అని ఆశ్చర్యపోయాను.

ఆయన ఫ్రెండ్లీగానే మాట్లాడారు. "ఎన్నేళ్ళయిందమ్మా మీరు ఇక్కడికి వచ్చి ఏ ఊరు మీది?" అని అడిగారు.

"ఇరవై ఏళ్ళయిందండీ" అన్నాను. "మాది తిరుపతి" అన్నాను.

"నేను కూడా ఇరవై ఏళ్ళ క్రితమే అమెరికా వెళ్ళాను. ఆ రోజు నేను అనుకోలేదు. ఈ హోటల్ బిజినెస్‌లోకి వస్తానని ఇన్ని హోటళ్ళు కట్టి దాదాపు పదివేల మందికి ఉపాధి కలిగిస్తానని. అంతా ఆ వెంకటేశ్వరుని దయ, ఆశీర్వాదం. ఇక్కడ గల్ఫ్‌కొచ్చి ఇరవైఏళ్ళయినా అరవై ఏళ్ళయినా జీవితం అంతే. అదే అమెరికా కొస్తే జీవితం మారిపోతుంది. సిటిజన్ షిప్ దొరుకుతుంది. అదే గల్ఫ్ కంట్రీకి అమెరికాకు తేడా. మీరు ఇరవై ఏళ్ళు ఇక్కడ వుండి టైం వేస్ట్ కదా" అన్నారు.

నిజమేనేమో అనుకున్నాను

"దేవుడు నన్ను ఇంతగా ఆశీర్వదించాడు కదా! అందుకే ఎప్పుడు ఇండియా వెళ్ళినా మొదట తిరుపతి వెళ్ళి గుండుగీయించుకుని వెంకన్న దర్శనం చేసుకోందే ఏ పనీ మొదలుపెట్టను" అన్నారు నవ్వుతూ.

"ఒక్కోసారి భక్తి కూడా మంచిదే. మనసుకు ఆహ్లాదాన్ని బ్రతుకుకు నిశ్చింతను కలిగిస్తుంది" అన్నాను నేను.

"మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుంది" అన్నాడు తలగోక్కుంటూ

"కౌముది వెబ్ మాసపత్రికలో 'పరదేశి కథలు' అని రాస్తున్నాను. అమెరికాలో వున్న కిరణ్‌ప్రభగారు, కాంతికిరణ్‌గార్లు ఆ పత్రికను నిర్వహిస్తున్నారు. బహుశా ఆ పత్రికలో చూసారేమో" అన్నాను.

"అబ్బే సాహిత్యంతో నాకస్సలు సంబంధమే లేదు. పత్రికలు చదివే తీరి కా ఓపికా కూడానా నాకు" అన్నాడు.

"మనిషికి సాహిత్యంతో సంబంధం, కాసింత కళాపోషణ లేకపోతే ఆరు హోటళ్ళు కట్టి అంత డబ్బు సంపాదించి లాభం ఏమిటి?" పైకి అనకుండా మనసులో అనుకున్నాను.

నాకొక కార్డు ఇచ్చి "మీకు ఏ అవసరం అయినా కాంటాక్ట్ చెయ్యండి" అని చెప్పి వెళ్ళిపోయారు.

ఎందుకో ఈరోజు ఈ అమ్మాయి అడిగిన ప్రశ్నలకు ఆ వెంకటేశ్వర్రావే గుర్తొచ్చారు నాకు. కువైట్‌కి వచ్చి ఇరవై ఏళ్ళు దాటిపోయాయి. అడిగిన వాళ్ళందరికీ ఇరవై యేళ్ళయింది కువైట్‌కి వచ్చి అని చెప్పాలంటే ఎందుకో మనసు బాధపడుతోంది.

"ఏంటండీ నా ప్రశ్నలకు జవాబు చెప్పకుండా ఏదో ఆలోచనల్లోకి వెళ్ళిపోయారు" చేయిపైన తట్టి మరీ అడిగింది ఆ అమ్మాయి.

"నా పేరు లలిత. నేను ఇరవై ఏళ్ళనుండీ కువైట్‌లో వుంటున్నాను పదిహేడు సంవత్సరాలనుండీ మారియట్ హోటల్లో పనిచేస్తున్నా. కువైట్ సిటీలోనే ఉద్యోగం. డౌన్‌టౌన్ సిటీలోని షరక్‌లో. సిటీకి దగ్గరే. పని అంటావా? పేరుగొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగానే ఉంటాయి మా హోటల్ ఉద్యోగాలు. ఏదో రూము, తిండి, ట్రాన్స్‌పోర్ట్, ఫ్లయిట్ టిక్కెట్లు అన్నీ వాళ్ళే సమకూర్చుతారు కాబట్టి బాధా భయమూ లేకుండా జీవితం అలా సాగిపోతోంది" చెప్పాను నేను నీరసంగా నవ్వుతూ.

"ఓహో. ఫైవ్ స్టార్ హోటల్‌లో ఉద్యోగం కాబట్టి జీతాలు కూడా బానే ఉంటాయి కదా! అందులో ఇరవైయేళ్ళ సర్వీసు" అంది నవ్వుతూ.

"అంతకాదుకానీ. కొంతవరకు ఓకె. సంపాదనకు హద్దులుండవు కదా. సరే ఇప్పుడు నీ గురించి చెప్పు" అన్నాను.

గట్టిగా నిట్టూర్చి "నాదో పెద్ద కథండి. మీకు ఓపిక వుంటే వినండి చెపుతాను" అంటూ ఒక్క క్షణం ఆలోచించి మొదలుపెట్టింది.

"మాది అనంతపురం దగ్గర వున్న చిన్న పల్లెటూరు. మేం లంబాడీవాళ్ళం. చిన్నా చితకా పనులు చేసుకుంటూ దాదాపు యాభై కుటుంబాలవాళ్ళం జీవనం సాగిస్తున్నాం, మా నాయనకు ఇద్దరు భార్యలు. పెద్దామెకు నలుగురు పిల్లోళ్ళు, మా అమ్మకు ముగ్గురం. అందరం కలిసి పదిమందిమి. ఒకే ఇంట్లో కలిసి మెలిసి పెరిగాం. నాకంటే పెద్దవాళ్ళు ఇద్దరు అన్నలు ఉన్నారు. నా వెనుక నలుగురు చిన్నవాళ్ళు. ఒక తమ్ముడు ముగ్గురు చెల్లెళ్ళు.

మా యింట్లో నేనే ఏడో తరగతివరకు చదువుకున్నాను. నాకంటే చిన్నవాళ్ళు అంతో ఇంతో చదువుతూ వున్నారు. మా అమ్మానాన్నలతోపాటు అందరూ కూలి పనులకు వెళ్ళిపోతారు. వచ్చిన డబ్బు వచ్చినట్లు మా నాయన ఇద్దరు అమ్మలు, అన్నలు అందరూ సాయంత్రం సారాయి తాగేసి డబ్బంతా ఖర్చుపెట్టి అది సరిపోక అప్పులు కూడా చేస్తారు. తాగాక ఒకర్నొకరు తిట్టుకోవడం, కొట్టుకోవడం ప్రతిరోజూ జరిగేదే మా నాన్న సారాయి తాగితే పశువులాగా ప్రవర్తించేవాడు. మా అమ్మను పెద్దమ్మను అనుభవించడానికి ఒక చాటు మరో చోటు అంటూ వుండేది కాదు. సారాయి త్రాగాక మా అమ్మల పరిస్థితి కూడా అలాగే వళ్ళు తెలియకుండా వుండేది. ఎందుకిలా అని అడిగితే రోజంతా శరీర కష్టం చేసి అలసిపోయిన శరీరాలను మత్తులో ముంచకపోతే మేం ఒక్కరోజుకే చచ్చిపోతాం అనేవాళ్ళు.

మా కుటుంబాలన్నీ దాదాపుగా అంతే. చిన్నప్పటినుండి వాళ్ళ కష్టం, వాళ్ళ తాగుడు, ఇంట్లో పేదరికం చూసిన నాకు చాలా బాధగా అనిపించేది. కానీ ఏం చేయాలో తెలిసేదికాదు. మా అన్నలకు పెళ్ళయి వదినలు వచ్చారు. వారి పరిస్థితీ అంతే. మార్పులేని జీవితాలు. కానీ వాళ్ళందరిలాగా నేను కావడానికి నా మనసు అంగీకరించలేదు.

ఏదో చెయ్యాలి. జీవితాల్లో మార్పు తేవాలి. అందరూ బాగా చదువుకోవాలి. జీవితాలకు ఒక అర్థం ఏర్పడాలి. ఎప్పుడూ ఇలా ఆలోచించేదాన్ని. ఆ సమయంలో మా ఊళ్ళోకి ఒక ఏజంటు వచ్చేవాడు. కువైటు వెళ్ళాలి అనుకున్న వాళ్ళకి పాస్‌పోర్టులు తయారుచేయించి వీసాలు తెప్పించి, మెడికల్ చేయించి ఫ్లయిట్ ఎక్కించేవాడు. అందుకోసం బాగానే డబ్బులు తీసుకునేవాడు.

పొలం పుట్రా, నగా నట్రా అమ్ముకుని పాస్‌పోర్టులు చేయించుకుని వీసాలు కొనుక్కుని చాలామంది కువైట్‌కి పోయేవాళ్ళు. అక్కడ రెండు మూడేళ్ళు వుండి అంతో ఇంతో సంపాదించుకుని డాబుగా, దర్పంగా ఫ్లయిట్ దిగి తిరిగి వచ్చేవాళ్ళు.

మా చెల్లెళ్ళను, తమ్ముళ్ళని కూడా బలవంతంగా బడికి పంపేదాన్ని. వాళ్ళని బడి మానిపించి కూలికి పంపమని తిడుతుంటే నేనే మా నాయన తిట్లన్నీ భరించేదాన్ని. ఎలాగైనా వాళ్ళను బాగా చదివించలని గట్టిగా నిర్ణయించుకున్నాను. అందుకే కువైట్‌కి పోయి బాగా డబ్బులు సంపాదించి వాళ్ళనైనా ప్రయోజకులుగా చేయాలని ఆశపడ్డాను.

వెంటనే ఏజంటు దగ్గరికి వెళ్ళి నాక్కూడా పాస్‌పోర్ట్ తాయారు చేయించి వీసా తెప్పించమని అడిగాను. అప్పటికి నా వయసు పదహారేళ్ళు. ఆ ఏజంటు ఎగాదిగా నన్ను చూసి 'వయసులో వున్నావు కదా దేనికైనా పనికొస్తావు. అలాగే తయారుచేయిస్తా.. ముందుగా పదివేలు కట్టు' అన్నాడు.

'పదివేల రుపాయలా? నా దగ్గర కనీసం వందరూపాయలు కూడా లేవు. మరి ఎలా? అంత డబ్బు ఎలా వస్తుంది? మా అమ్మకు విషయం చెప్పి డబ్బు ఎక్కడైనా తెచ్చి ఇమ్మని' బ్రతిమలాడాను.

'పదివేలంటే తమాషాగా వుందా నీకు? కువైట్‌కి వెళ్ళాలి అనే పిచ్చి ఆలోచనలు మాని కూలి పనులకు వెళ్ళు. అంతో ఇంతో కూలి వస్తాది. కడుపు నిండుతాది" అని తిట్టింది.

ఏం చెయ్యాలో అర్థంకాక మళ్ళీ ఏజంటు దగ్గరికే వెళ్ళాను. వాడు 'మరి నేను అన్నీ తయారుచేయించి నిన్ను కువైటుకు పంపిస్తా. మరి నాకేంటి లాభం?' అన్నాడు నన్ను చూపులతో తినేస్తూ.

'అక్కడికి వెళ్ళగానే నీ బాకీ తీరేంతవరకూ నా నెల జీతాలన్నీ నీకే పంపిస్తాను అన్నా' అని బ్రతిమలాడాను.

'నేను ఇలాగే చాలామంది ఆడోళ్ళకి సహాయం చేసాను. వాళ్ళు కూడా నీలాగే చెప్పి అక్కడికి వెళ్ళాక నెలజీతాలు నా బాకీ తీరేవరకూ పంపించారు. వాళ్ళు కువైటుకు చేరేంతవరకు వాళ్ళ మంచీ చెడ్డా అన్నీ నేనే చూసుకున్నాను. నువు కూడా నన్ను అన్నా అని పిలవకుండా బావ అని పిలిచి నీ మంచీ చెడ్డా నాకు అప్పగించావనుకో నిన్ను పువ్వులాగా కువైట్ చేర్చే బాధ్యత నాది. కాదంటే పువ్వుల్ని వాసన చూడకుండా వదల్లేను కదా' అన్నాడు కన్ను గీటుతూ. వాడి మాటలకి చేష్టలకి నాకు కంపరమెత్తింది. ఏ సమాధానం చెప్పకుండా అక్కడనుండీ వచ్చేసాను.

నాలుగు నెలలు గడిచిపోయాయి. ఈలోపల మా నాయన ఇద్దరు చెల్లెళ్ళను తమ్ముడిని బడి మానిపించి కూలిపనులకు పంపిస్తున్నాడు. ఏం చెయ్యాలో తోచని నిస్సహాయతతో నేనుకూడా వారితోపాటు కూలిపనులకు వెళ్ళసాగాను. నేను వదిలినా ఆ ఏజంటు నన్ను వదిలిపెట్టలేదు. ఊళ్ళో వాళ్ళనుంచీ నాకు రాయబారం పంపించసాగాడు. అన్ని పనులూ ఫ్రీగా చేసి పెడతానని నమ్మబలికాడు. నాకంటే చిన్నవాళ్ళు బడికి వెళ్ళకుండా కూలిపనులకు వెళ్ళడం నాకు బాధనిపించింది.

వెంటనే ఏజంటు దగ్గరికి వెళ్ళి కాగితాలపై సంతకాలు పెట్టాను. వాడి మనసులో ఏ దురాలోచనా లేకపోతే ఫ్రీగా ఎందుకు అన్ని పనులు చేస్తాడు అని నేను అప్పుడు ఆలోచించలేకపోయాను. నాకు వీసా వచ్చిన వెంటనే పిల్లలను మరలా బడికి పంపించమని ఇంట్లో కావలసిన డబ్బు నేను పంపిస్తానని మా నాయనకు నచ్చచెప్పి బొంబాయి వెళ్ళే రైలు ఎక్కాను. అక్కడికి వెళ్ళాక నాకు అర్థమయింది ఏజంటు చేసిన మోసం. 'నిన్ను ఇక్కడే రెడ్‌లైట్ ఏరియాలో అమ్మెయ్యమంటావా లేక పదిరోజులు నేను చెప్పినట్లు విని నా కోరిక తీర్చి కువైట్ వెళ్ళే విమానం ఎక్కుతావో ఆలోచించుకో' అని బెదిరించాడు.

ఇక నాకు గత్యంతరంలేకపోయింది. వాడి మాటలు విని కువైట్‌కి వెళ్ళే విమానం ఎక్కాను.

నాలుగు నెలల జీతం ఆ ఏజంటు మొహానకొట్టి వాడి బాకీ తీర్చేసాను.

తరువాత నెలనెలా జీతాలన్నీ ఇంటికే పంపించసాగాను. ఇద్దరు తమ్ముళ్ళు, చెల్లి చదువు కోసం ఎంత కష్టమైనా చెయ్యాలనిపించింది. దాదాపు మూడేళ్ళు గడిచాక ఇంటికి సెలవులపై వచ్చాను. అప్పుడు తెలిసింది నిజం. మా నాయన చిన్నవాళ్ళని అసలు బడికి పంపలేదని, నేను పంపిన డబ్బులన్నీ తాగుడుకే ఖర్చుపెట్టాడని. ఆ సంగతి తెలిసిన నాకు కోపం ఆవేశం రెండూ వచ్చాయి.

వీళ్ళ బ్రతుకుల్ని మార్చడం నా తరం కాదనిపించింది. ఒకరోజు మా నాయనకు తెలియకుండా ముగ్గురు చిన్నవాళ్ళనీ తీసుకునిపోయి అనంతపురం టౌన్‌లోని బడిలో చేర్చి హాస్టల్‌లో ఉంచాను. అందుకు మానాయన నన్ను ఎన్ని దెబ్బలు కొట్టాడో లెక్కలేదు. ఇక్కడ కువైట్‌లో నేను సంపాదించిన డబ్బుతో మెళ్ళోకి గొలుసు, చేతులకి రెండు గాజులు నాకోసం కొనుక్కున్నాను. మా నాయన దృష్టి వాటిపైన పడింది. ఆయనకు తోడు మా అమ్మకూడా. మరోవైపు మా అన్నా వదినలు నా బంగారాన్ని ఎలాగైనా లాక్కోవలని నన్ను వేధించారు. బాధించారు. ఈ బంగారాన్ని కూడా అమ్మేసి తాగి తందనాలు ఆడాలని వాళ్ళ ఉద్దేశం. తాగిన మత్తులో అయినవాళ్ళే నా వంటిపైన బంగారం కోసం ప్రాణం తియ్యడానికి కూడా వెనకాడలేదు. ఆ సమయంలో నేను తప్పించుకుని పారిపోయి అనంతపురం చేరుకున్నాను. నాకు తెలిసినవాళ్ళు ఎవరూ లేక గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆ ఏజంటు దగ్గరికి వెళ్ళి పదిరోజులు తలదాచుకున్నాను. అతడే నన్ను ఈరోజు మద్రాసు తీసుకొచ్చి విమానం ఎక్కించాడు. ఇప్పుడు చిన్నవాళ్ళైన నా చెల్లెళ్ళు, తమ్ముళ్ళ భవిష్యత్తు మీదే నా దృష్టి వుంది. వాళ్ళని ఎలాగో హాస్టల్లో ఉంచాను. వాళ్ళని పెద్ద చదువులు చదివించి మంచి ఉద్యోగాల్లో ఉండగా చూడాలనేది నా కోరిక" తన కథను చెప్పి మళ్ళీ కళ్ళు తుడుచుకుంది ఆ లంబాడీ అమ్మాయి.

ఆ అమ్మాయి పడిన కష్టాలకు మా కళ్ళు కూడా చెమర్చాయి. ఆ అమ్మాయికున్న ఆశయానికి నేను భుజం తట్టి తనని అభినందించాను.

"ఇంతకీ నీపేరేమిటమ్మాయ్?" అడిగాను నేను.

"నా పేరు కీర్తన"

"చాలా బాగుంది నీ పేరు. నీ ఫోను నంబరు నాకివ్వు. అపుడపుడూ ఫోనులో మాట్లాడుకుందాం. నీకేమైనా అవసరం అయితే నాకు చెప్పు. సాధ్యమైనంతవరకూ నీకు సహాయపడటానికి ప్రయత్నిస్తాను" అన్నాను నేను.

"చాలా థ్యాంక్సండీ" అంది కీర్తన.

నా ఇరవై ఏళ్ళ ఎడారి ప్రయాణంలో ఇలా అడుగడుగునా కనపడే కన్నీటి కథలు ఎన్నో. ముగింపులేని వేదనాభరితమైన ఎడారి జీవితాలు ఎన్నో.

వీటన్నిటికీ కారణం ఏమిటి? పేదరికమా? డబ్బుపైన ఆశా? మనుషుల్లోని స్వార్థమా? వీటికి అంతం ఎప్పుడు? ఎలా? మరలా ఎడతెగని ఆలోచనలు కమ్ముకున్నాయి నన్ను.

## కువైటు స్వాతంత్ర్య దినోత్సవం

**ఫిబ్రవరి నెల** వచ్చిందంటే చాలు. మా కువైట్‌లో ప్రతి ఇంటా పండుగ సంబరమే. ప్రతి హృదయంలోనూ ఆనందోత్సాహమే.

ఏంటీ ఇవి వేలంటైన్స్‌డే సంబరాలు అనుకుంటున్నారా? కాదు. కొంతవరకు కావచ్చు కానీ అన్నీ అవేకావు. మాకు ఇక్కడ చాలా ముఖ్యమైన పండుగలు రెండున్నాయి. ఒకటి ఫిబ్రవరి 25వ తేదీన జరుపుకునే కువైట్ నేషనల్ డే మరొకటి ఆ మరుసటి రోజున అంటే 26 వ తేదీన ఆనందోత్సాహాలతో సంబరాలు చేసుకునే లిబరేషన్ డే .




మొదటిది బ్రిటిష్ వాళ్ళు కువైట్‌ను విడిచి పెట్టి వెళ్ళిపోయిన రోజైతే రెండవది ఎన్నటికీ ఎప్పటికీ కలలో కూడా మరువలేనిది. అదే సద్దాం హుస్సేన్ 1990లో ఆరునెలల కాలం కువైట్‌ను ఆక్రమించుకుని కువైటు ప్రజలను చిత్రహింసలు పెట్టి చివరికి అమెరికా ప్రమేయంతో కువైట్‌ను విడిచిపెట్టి వెళ్ళిపోయిన రోజు.

గల్ఫ్ చరిత్రలో రక్తాక్షరాలతో లిఖించబడిన ఆ ఆరునెలల కాలాన్ని తలచుకుంటే ఇప్పటికి దాదాపు ముప్పై ఏళ్ళు గడిచిపోయినా కూడా భయంతో వణికిపోతారు ఈ కువైటు ప్రజలు.

ఈ ఫిబ్రవరి నెలంతా కూడా అప్పటి సంఘటనలను తలచుకుని తాము పడిన కష్టాలను గుర్తుచేసుకుని కన్నీరు నింపుకుంటూ కథలుగా తమ పిల్లలకు చెపుతూవుంటారు పెద్దవాళ్ళు.

ఏ పాపమో శాపమో తమ దేశాన్నీ తమను వెంబడించి పట్టి పీడించిందని బాధించిందనీ వీళ్ళు భావిస్తుంటారు.

శుక్ర, శనివారాలనుకూడా కలుపుకుని వారం రోజులు సెలవలను ప్రకటించడంతో పరదేశులందరికీ కూడా ఈ వారమంతా పండుగ సంబరమే.

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కువైటు పట్టణమంతా రంగుల బల్బులతోనూ, బెలూన్లతోనూ, అలంకరించబడింది. జాతీయ పతాకాలను ఇళ్ళమీదా, కార్యాలయాలమీదా, వీధుల్లోనూ ఎగరేసారు. ఆఫీసులు, కంపెనీలు, సంస్థలన్నీకూడా తగిన విధంగా అలంకరింపబడి అందాల్ని సంతరించుకున్నాయి. నాకు కూడా కువైటు జాతీయ పతాకం అంటే చాలా ఇష్టం. ఎందుకంటే దానిని తలక్రిందులుగా చేస్తే ఎరుపు, తెలుపు, ఆకుపచ్చ మూడురంగుల మేళవింపుతో అచ్చం మన భారత జెండాలానే చూడముచ్చటగా ఉంటుంది.



కాకుంటే ఒక మూలన కాస్తంత నలుపు రంగు ఉంటుంది అంతే.

కుర్రకారంతా తమ కార్లు వేసుకుని స్నేహితులతో కలిసి కువైట్ వీధుల్లో సందడి చేయడానికి బయలుదేరుతున్నారు. పెద్దవాళ్ళంతా తమ పిల్లల్ని తీసుకుని గల్ఫ్ రోడ్డులోని ఆ సందడి చూడటానికి బయలుదేరారు.

1990లోని యుద్ధం తమని తుడిచిపెట్టకుండా విడిచిపెట్టినందుకు, ఆ చీకటిరోజులు శాశ్వతం కాకుండా చరిత్రలో నిలిచిపోయినందుకు ప్రతి ఒక్కరూ చాలా సంతోషంగా ఉన్నారు. ఆనాటి గాథల్ని గుర్తుచేసుకుంటూ కథలుగా మలిచి చెప్పుకుంటూ తలపోసుకుంటున్నారు.

మేడం ఫాతిమా మా ఫైనాన్స్ డిపార్టుమెంటులో పనిచేస్తోంది. అప్పుడప్పుడూ ఆమె నాదగ్గరికి వచ్చి నన్ను పలకరించి వి.ఐ.పి లాంజ్‌లో కాఫీ తాగి వెళ్ళడం మామూలుగా జరిగే విషయమే. ఈ రోజుకూడా అలాగే వచ్చి కాఫీ తీసుకుని త్రాగుతూ మాట్లాడుతూ నా ఎదురుగా కూర్చుంది.

పనివాళ్ళందరూ నేషనల్ డే సందర్భంగా మా హోటల్‌ని జెండాలతోనూ రంగుల బల్బులతోనూ అలంకరించడంలో బిజీగా ఉన్నారు.

"కువైట్ చరిత్రలో చీకటి అధ్యాయం ముగిసిపోయి ముప్పైఏళ్ళు గడిపోయాయి కదూ" అన్నాను నేను.

"నిజమే నేను కూడా అప్పుడే పుట్టాను. నాకు కూడా ఈ ఆగస్టు నెలకి 30 ఏళ్ళు నిండుతాయి" బాధగా చెప్పింది ఫాతిమా.

"అయితే యుద్ధం ముగిసాక పుట్టారన్నమాట. వెరీగుడ్" అన్నాను నేను.

"ఇందులో గుడ్ అన్నది ఏమీ లేదు. బాడ్ తప్ప" అంటూ హ...హ..హ.. అని గట్టిగా నవ్వింది మేడం ఫాతిమా.

"అదేంటి మేడం" ఆసక్తిగా ప్రశ్నించాను నేను.

"ఒక యుద్ధం అంటూ జరిగితే దాని ప్రభావం కనీసం వంద సంవత్సరాలయినా ఉంటుంది. నాకయితే లిబరేషన్ డే వస్తుందంటేనే చాలా బాధ కలుగుతుంది. ఇవి నా ఉనికినే ప్రశ్నించే చెడురోజులు" చెపుతూ కళ్ళనిండా నీళ్ళు నింపుకుంది ఫాతిమా.

"అయ్యో బాధపడకండి. బాధల్ని కష్టాల్ని దిగ్రమింగుకుంటూ ముందుకు సాగిపోవడమే మనం చేయాల్సింది" చెప్పాను నాకు తోచిన మాటలు.

మళ్ళీ నవ్వింది ఫాతిమా నా మాటలకి.

నవ్వుతుంటే ఆమె చాలా అందంగా ఉంది. పచ్చని పసిమి ఛాయతో చారడేసి కళ్ళతో, వత్తైన జుట్టుతో, ఎర్రటి పెదాలతో ముట్టుకుంటే మాసిపోయేలా ఉంటుంది ఫాతిమా. ఆమె ఒక్కటేకాదు కువైటు స్త్రీలు(అరబ్ స్త్రీలు) అందర్నీ దేవుడు ప్రత్యేకంగా సృష్టించినట్లు దేవకన్యల్లా అందంగా ఉంటారు.

"ఫాతిమా నవ్వుతుంటే ఎందుకు నవ్వుతోందో అర్థంకాక మెరుస్తున్న ఆమె కళ్ళనే చూస్తుండిపోయాను నేను.

బాధలు కష్టాలు నాకేమీ లేవు కానీ ఉన్నదల్లా ఒక్కటే బాధ. అది ఎన్నటికీ తీరనిది, వీడనిది, నను విడువనిది. ఆ బాధే జీవితాంతం నన్ను వెంబడిస్తోంది కలవరపెడుతోంది. జీవితమంతా ఈ బాధను నేను మోయాల్సిందే గుండెలో దాచుకుని కుమిలిపోతూ కాలాన్ని గడపాల్సిందే చచ్చేంతవరకూ కొన్ని కొన్ని బాధల్ని భరించాల్సిందే తప్పదు. కొన్ని జీవితాలు అంతే" భారమైన హృదయంతో దేన్నో తలుచుకుంటూ నిట్టూర్చింది ఫాతిమా.

"అదేంటి ఫాతిమా మీ కువైటీ వాళ్ళకు బాధలేం ఉంటాయి? అవసరానికి మించిన డబ్బు, కార్లు, భవనాలు, విలాసమైన జీవితం, దేనికీ కొదువలేదు కదా. దేవుడు మిమ్మల్ని ఎంతో అందంగానూ సృష్టించాడు. అవసరాలను తీర్చాడు. ఇదిగో మాలాగా డబ్బుకోసం బ్రతకడంకోసం మా దేశాన్నీ, మావాళ్ళని విడిచి పెట్టి పరదేశానికి వచ్చి పనిమనుషులుగా, డ్రైవర్లుగా, ఆఫీసుల్లో వర్కర్స్‌గా చేయాల్సిన

అవసరం మీకు లేదుగా. దేశాన్ని విడిచిపెట్టి పరదేశానికి వెళ్ళి చాకిరీ చేయడంకంటే మించిన దౌర్భాగ్యం వేరే ఇంకోటి ఉంటుందా?" ఆవేశంగా గుండెనిండిన ఆవేదనతో ప్రశ్నించాను నేను.

నా ఆవేశాన్ని చూసి చిన్నగా నవ్వింది ఫాతిమా.

"నిజమే కాదనను కానీ ఎంత సంపదవున్నా ఎంతటి విలాసవంతమైన జీవితమైనా మనుషుల పాపం ఎక్కువైతే దేవుడు ఏదో ఒక శాపంతో మనుషుల్ని శిక్షిస్తుంటాడు. ఆ శాపాల్ని ఆ మనుషులు కొన్ని తరాలవరకూ మోయాల్సిందే ఈ సంపద, డాబూ, దర్పం అన్నీ పైపైన మెరుగులే. 1990లో జరిగిన యుద్ధం కువైటు ప్రజల జీవితాల్ని శాపగ్రస్తుల్ని చేసింది. ఆ చీకటి రోజుల్ని మరిచిపోకుండా మరో తరం వరకూ దుఃఖించేలా విధి మమ్మల్ని శాసించింది. ఆ యుద్ధంవల్ల ఎంతో మంది చనిపోయారు. మిగిలిన వాళ్ళు తనవారిని కోల్పోయి అనాధలయ్యారు. కొంతమంది ఎదురునిలిచి పోరాడి క్షతగాత్రులయ్యారు. ఇరాకీ సైనికులచే హింసించబడిన వారు మానని గాయాలతో ఇప్పటికీ శారీరకంగా బాధను అనుభవిస్తూనే ఉన్నారు. కాళ్ళూ చేతులూ కోల్పోయిన వారు జీవచ్ఛవాల్లా ఇంకా జీవితాన్ని గడుపుతూనే ఉన్నారు. బిడ్డల్ని కోల్పోయిన తల్లులు వారిని తలచుకుని ఇంకా రోదిస్తూనే ఉన్నారు. భర్తల్ని కోల్పోయిన వాళ్ళు విధవరాళ్ళుగా జీవితాన్ని గడుపుతున్నారు.

బంధింపబడి కొనిపోయిన తమ తండ్రులు బ్రతికివున్నారో చచ్చారో తెలియక, జాడ తెలియకుండా పోయిన వారికోసం ఏడుస్తూ ఏదో ఒకరోజు తిరిగి వస్తారనే ఆశతో ఎదురుచూసే బిడ్డలెంతమందో ఈ గడ్డమీద ఉన్నారు. ఇంకా చెప్పాలంటే ఇరాకీ సైనికుల అకృత్యాలకు ఆగడాలకు అమానుష కాండలకు బలి అయిపోయిన స్త్రీలు ఎందరో చావలేక బ్రతకలేక భారంగా కాలాన్ని గడుపుతున్నారు. వారికి పుట్టిన బిడ్డలు మరో తరానికి కూడా తరగని ఆవేదనను మోస్తున్నారు. యుద్ధం చేసిన గాయాల్ని మరవడం అంత సులభంకాదు. ముప్పై ఏళ్ళు గడిచినా ఇంకా ఆ గాయాలు మానని పచ్చిపుళ్ళలా మమ్మల్ని మా హృదయాల్ని మండింపచేస్తున్నాయి. మా జీవితాలు వెనుక ఎన్నో కథలు దాగి ఉన్నాయి" అంటూ టిష్యూ పేపర్‌తో కళ్ళొత్తుకుంది ఫాతిమా.

నాకు తెలియని ఎన్నో విషయాలు మరో కోణంలో ఆమె చెప్పుతుంటే ఆశ్చర్యంగా ఆసక్తితో విన్నాను నేను. ఎప్పుడూ సంతోషంగా నవ్వుతూ కనిపించే ఫాతిమాలో అంత బాధ హృదయంలో గూడు కట్టుకుని వుందా అనుకుంటూ ఆశ్చర్యపోతూ ఆమె కన్నీళ్ళకు కదిలిపోయాను నేను.

"మేడం మీరు ఏమీ అనుకోకపోతే కాస్త వివరంగా చెబుతారా?" అని అడిగాను.

"నేను పన్నెండేళ్ళ వయసులో ఉన్నప్పుడు మా అమ్మ నా జన్మరహస్యాన్ని నాకు తెలియజేసింది. అప్పటినుండీ మానసికంగా ఎంతో వ్యధను నేను అనుభవిస్తున్నాను. నాలో ప్రాణం ఉన్నంతవరకూ ఈ వ్యధను నేను అనుభవించాల్సిందే తప్పదు. ఈ రహస్యాన్ని నాకు చెప్పి మా అమ్మ పొరపాటు చేసిందని నేను అనుకుంటూ ఉంటాను. ఎందుకంటే ఆమె నాకు చెప్పకుండా తనలోనే దాచుకుని వుంటే ఈరోజు నాకు జీవితకాలమంతా నన్ను వెంబడించే వేదన నాలో ఉండేది కాదు. " బహుశా ఆమెకూడా అంత ఘోరమైన బాధను బరువును ఒక్కటే తన హృదయంలో మోయలేక పోయివుండవచ్చు. ఆ రోజుల్లో ఇరాక్ సైనికుల చేతిలో తాను అనుభవించిన చిత్రహింసలను, ఎదుర్కొన్న దుర్భరమైన పరిస్థితులను తనపై జరిగిన అమానుష కాండను నాకు తెలియజేయాలని తపన పడి ఉండవచ్చు. అందుకే తన బాధను నాతో పంచుకుని తన భారాన్ని తగ్గించిందేమో.

"అది 1990 వ సంవత్సరం ఆగష్టు నెల. సద్దాం హుస్సేన్ కువైట్ దేశాన్ని ఆక్రమించాడు. అదే సంవత్సరం జూన్ నెలలో మా అమ్మకు వివాహం జరిగిందట. మా నాన్న పేరు హమద్. కువైట్ పోలీస్ డిపార్ట్‌మెంటులో పనిచేసేవారట. ఆరడుగుల మనిషి, అందంగా ఉండేవారంట. ఆయన రూపమే కాదు, ధైర్యం, రోషం కలిగిన మనిషంట.

క్రొత్తగా పెళ్ళయిన జంట. ఇంకా హనీమూన్‌కి వెళ్ళనేలేదంట. అచ్చటా ముచ్చటా తీరనేలేదంట. ఇంతలో యుద్ధం మొదలయింది. మా అమ్మ మనం సౌదీ అరేబియాకు పారిపోదాం పద. ప్రాణాలు దక్కించుకుందాం అని ఎంత ప్రాధేయపడినా వినలేదంట. మా నాన్న ముందే పోలీస్ కదా ధైర్యంగా ఇరాకీ సైనికులకు ఎదురు నిలిచి పోరాడంట. అంతమంది కరుడుగట్టిన క్రూరుల ముందు ఈయన ఒక్కడి బలం ఏపాటిది? మా అమ్మ కళ్ళముందే మా నాన్నను నిలువునా కాల్చి చంపేసి, మా అమ్మను పట్టుకుని తమతో తీసుకు వెళ్ళిపోయారంట. కువైటు స్కూల్లో వాళ్ళు ఏర్పరచుకున్న ఒక స్థావరంలోని గదిలో అమ్మని బంధించి ఉంచి వాళ్ళకు ఇష్టం వచ్చినట్లుగా ఆమె శరీరంతో ఆడుకున్నారు. ఒకడు కాదు ఇద్దరు కాదు దాదాపు ఇరవైమంది సైనికులు నాలుగునెలల పాటు ఆమెని అనుభవించారు. మాట వినకపోతే చిత్రహింసలు పెట్టి వేధించారు. కొట్టి తిట్టి బాధలు పెట్టారు. చంపుతామని భయపెట్టారు. సిగరెట్లతో శరీరమంతా కాల్చారు. బూటు కాళ్ళతో వళ్ళంతా ఎముకలు విరిగేట్లుగా తన్నారు. దాదాపు నాలుగు నెలలు సరైన తిండి లేదు. వంటికి స్నానం లేదు. వంటిపైన వున్న బట్టలు చిరిగి పీలికలయ్యాయి. వారి ఆగడాలకు అకృత్యాలకు అంతులేకుండా పోయింది. ప్రాణాలు కళ్ళల్లో పెట్టుకుని జీవచ్ఛవంలా ఆ గదిలో పడివున్నప్పుడు ఆమె గోడు విని వచ్చి రక్షించే వాళ్ళున్నా ధైర్యం చేసి ఇరాకీ సైనికులను ఎదిరించి కాపాడే వాళ్ళు లేకపోయారు. ఆమె రోదన ఎడారి రోదనే అయింది. ప్రాణాలమీద ఆశను వదులుకుంది. ప్రతిరోజూ వారి కామానికి వళ్ళు అప్పగించడం కంటే తొందరగా చనిపోతే బాగుండునని ఆమె అల్లాను ప్రార్థించిందంట.

ఆ ఘోరాన్ని మాటల్లో వర్ణించలేము. ఆమె ఒక్కటేకాదు. ఆ గదిలో ఇంకో ఇద్దరు స్త్రీలు కూడా కొద్ది రోజులు బంధించబడ్డారంట. కానీ వీళ్ళ హింసలకు తట్టుకోలేక కళ్ళు తేలవేసి మా అమ్మ కళ్ళముందే ఒకరి తరువాత ఒకరు ప్రాణాలు వదిలేసారంట. కానీ ఎందుకో తెలియదు దేవుడు మా అమ్మ ప్రాణాన్ని మాత్రం నిలిపే ఉంచాడు. బహుశా నన్ను ఈ భూమ్మీదకి తీసుకురావడానికేమో. దేవుడు చేసే ప్రతి పనికీ కారణం తప్పక ఉంటుంది. ఆ రోజు ఆ స్త్రీలతో పాటుగా మా అమ్మ కూడా ఆ గదిలోనే చనిపోయివుంటే నేను పుట్టి ఉండేదాన్ని కాను. ఈ రోజు నీ ముందు కూర్చుని నీతో మాట్లాడేదాన్ని కాదు. నాకు జన్మను ఇవ్వడానికీ, నన్ను బ్రతికించుకోడానికే మా అమ్మ తన ప్రాణాల్ని నిలుపుకుందేమో? అంతా ఆ భగవంతుడికే తెలియాలి.

గాలీ వెలుతురూ రాకుండా ఆ గదిని చాలా రోజులు మూసివుండటం వల్ల జరగరాని కార్యాలు ప్రతిరోజూ జరుగుతుండటంవల్ల, మలమూత్రాలు అక్కడే ఓ మూలగా విసర్జించడం వల్ల ఆ గదంతా కుళ్ళుపట్టి కంపు కొట్టేదంట. ఆ దుర్వాసనకి వాళ్ళు అప్పుడప్పుడూ ఇచ్చే రొట్టెముక్కలు బలవంతంగా ముక్కుమూసుకుని తిన్నాకూడా కడుపులో ఇమిడేదికాదట. కాసేపటికే వాంతి రూపంలో బయటకొచ్చేవంట. తిండీతిప్పలు లేక నీరసంగా పడివున్న శరీరం మీదకి ఆబగా ఆశగా కామంతో వచ్చి మీదపడి శరీరాన్ని పీక్కుతినే ఇరాకీ కుక్కలు బాధ భరించలేకపోయేదట. శరీరంలో స్పర్శకూడా చచ్చిపోయిందట. ఇక ప్రాణం పోయేస్థితిలో ఉండగా యుద్ధం ఆగిపోయింది.

కువైటు దేశానికి మద్దత్తుగా అమెరికా వచ్చి ఇరాకీయులను తరిమికొట్టి కువైటు ప్రజలకు దేశాన్ని అప్పగించింది. అప్పుడు ఎవరో వచ్చి మా అమ్మను ఆ గదిలోనుండి బయటకు మోసుకొచ్చి ఆసుపత్రిలో బెడ్‌పైన పెట్టారంట. అప్పుడు మా అమ్మ మూడోనెల గర్భవతి అని తెలిసింది. ఆ సమయంలో ఆమె ప్రాణాలు కాపాడటానికే డాక్టర్లు ప్రయాసపడ్డారు కానీ కడుపులోని గర్భం పైన దృష్టిపెట్టలేదు. అలా నేను ఆరునెలల తరువాత బయటపడి బట్టకట్టాను. మా అమ్మ నన్ను కంటికి రెప్పలా కాపాడి ప్రేమతో పెంచి పెద్ద చేసింది. నిజం

చెప్పాలంటే ఆమెకు నామీద ద్వేషం ఉండాలి కానీ మహాతల్లి మంచిది. నన్ను తన ప్రాణంలా చూసుకుంటుంది. ఇవన్నీ నమ్మలేని చేదు నిజాలు. ఎవరికీ బయట ప్రపంచానికి అంతు తెలియని పరమ రహస్యాలు.

యుద్ధం మిగిల్చిన మానని గాయాలు ఇలాంటి అంతు చిక్కని రహస్యాలు ఇంకెందరి జీవితాల్లో దాగి ఉన్నాయో? ఆ అల్లాకే ఎరుక. ఇదీ నా జీవితగాథ. ఒక్కోసారి ఈ విషయాలన్నింటినీ ఎంతగా డైజెస్ట్ చేసుకుందామన్నా నాలో అవి ఎంతకీ ఇమడవు.

ఎంతో విచిత్రంగానూ ఇమడలేనివిగానూ అసహజమైనవి గాను అనిపించి నన్ను ఎంతో అసౌకర్యానికి ఇబ్బందికి గురిచేస్తుంటాయి కానీ తప్పదు. సత్యాన్ని అంగీకరించి జీవితాన్ని ముందుకు నడిపించక తప్పదు. మా అమ్మ తన రహస్యాన్ని నాతో చెప్పి తన భారాన్ని దింపుకుంది. ఇప్పుడు నేను నా కథని నీతో చెప్పుకుని నా భారాన్ని దించుకున్నాను. ఈ విషయం ఇంకెవ్వరికీ తెలియదు నీకూ, నాకూ, మా అమ్మకి తప్ప. ఇది నీలోనే దాచుకో. సరేనా?'' నిట్టూర్చింది మేడం ఫాతిమా. కాసేపు భారమైన హృదయంతో అలాగే మౌనంగా కూర్చుండిపోయింది.

ఎంతో వేదన ఇమిడివున్న ఆమె కథను విని నా మనసు వికలమయి ఓదార్పుగా రెండు కన్నీటి బొట్లను రాల్చింది. ఆమె తల్లి అనుభవించిన దుర్భరమైన స్థితిని తలచి నా హృదయం బాధతో తల్లడిల్లిపోయింది. ఒక స్త్రీగా గౌరవంతో ఆ మాతృమూర్తికి చేతులెత్తి నమస్కరించాలనిపించింది.

నా కళ్ళల్లో ఆగని అశ్రువులను చూసిన ఫాతిమా నన్ను ఆ మూడ్ నుండి బయటకు తేవాలనుకుందేమో ''ఇంతకీ ఆ ఇరవైమంది ఇరాకీ సైనికుల్లో నా జన్మకు కారణమైన ఆ బాస్టర్డ్ ఎవరో? తన కామాన్ని తీర్చుకుని నా తల్లిలో తన బీజాన్ని నాటిన ఆ కామాంధుడు ఎవరో? ఇంకా బ్రతికే వున్నాడా? ఉంటే ఎక్కడ ఉన్నాడో? ఎలా ఉన్నాడో వాడినొక్కసారి చూడాలని ఉంది. వాడేకనుక కంటికి కనిపిస్తే అలాంటి దౌర్భాగ్యుడికి కూతురునైనందుకు వాడి ముఖాన ఒక్కసారి ఉమ్మేయాలని ఉంది'' కోపంగా ఆ మాటల్ని చెప్పి వెంటనే ఫక్కున నవ్వింది.

గుండెలో గూడు కట్టుకున్న కొండంత ఆవేదనను మోస్తూ పైకి నవ్వుతూ మాట్లాడుతున్న ఫాతిమాని చూసి ఏం మాట్లాడాలో నాకు అర్థంకాలేదు. హృదయాన్ని కదిలించే ఆమె కథను విన్న నేను కూడా బాధపడుతూ మౌనంగా కూర్చుండి పోయాను

## *ఎడారి బంధాలు*

''ఇంకో ఆరునెలలు ఓపిక పట్టు. రెండేళ్ళు పూర్తవుతాయి. తరువాత కువైట్ వాళ్ళ కాళ్ళావేళ్ళా పడి, బ్రతిమలాడి తనాకులు (రిలీజ్) అడిగి తీసుకుందాం. ఎలాగో ఒకలాగ బయటికి వచ్చేసావంటే నా అగచాట్లు నేను పడి కాస్త డబ్బు సమకూర్చి నీకు అక్కామా (అనుమతి) రెండేళ్ళకు వేయిస్తాను. ఊరికే కాదులే వయసులో ఉన్నావు కదా బయట ఏదో ఒక పని దొరక్కపోదు. నాలుగునెలల్లో సంపాదించి నా డబ్బు నాకు ఇచ్చేద్దువు. నేను ఇప్పుడు మా బంధువుల రూమ్‌లో ఉంటున్నాను కదా నీకు వీళ్ళు రిలీజ్ ఇవ్వగానే నేను మనకోసం బయట ఒక రూమ్ బాడుగకు తీసుకుంటాను. ఇద్దరం కలిసి ఉండచ్చు. చెరిసగం వేసుకుని రూము బాడుగ కట్టుకోవచ్చు. తిండికంటావా? అంతగా ఆలోచించాల్సిన అవసరంలేదు. దానికోసం డబ్బు ఎక్కువగా ఖర్చుపెట్టాలిసిన అవసరమూ లేదు. మా అక్క కువైట్ ఇంట్లో పనిచేస్తోంది కదా! ఆ కువైటీవాళ్ళు ప్రతినెలా పౌర సరఫరాలు చేసే స్టోరునుంచి తెచ్చే బియ్యం, పాలపొడి, చక్కెర, కందిపప్పు, నూనెలాంటి నిత్యావసరవస్తువులన్ని పేదవాళ్ళకి ఇచ్చెయ్యమని మా అక్కకే ఇచ్చేస్తారు. ఎంత కాదన్నా నెలకి ఇరవై ఐదు కేజీల బియ్యం, ఐదు కేజీల చక్కెర, అయిదు లీటర్ల నూనె, నాలుగు కేజీల కందిపప్పు రెండు డబ్బాల పాలపొడి మనకు ఇస్తుంది. అవన్నీ

తినగా మిగిలినవి మనం మనలాంటి వాళ్ళకి ఎవరికైనా ధర్మం చెయ్యచ్చు. కాబట్టి నువ్వు భయపడవద్దు. ఎక్కువగా ఆలోచించవద్దు. ఎవరూలేరని అనుకోవద్దు. నీకు నేనున్నాను ఆ సంగతి గుర్తుపెట్టుకో సునీతా సరేనా?'' కళ్ళల్లోకి సూటిగా చూస్తూ చిన్నగా చెప్పాడు శ్రీను.

''అబ్బ.. ఇంకా ఆరునెలలా? అంతవరకు ఇక్కడ ఉండి ఈ నరకం భరించాలా? ఇక ఏ మాత్రం ఓపిక లేదబ్బా. రాత్రి, పగలు టైమంటూ లేకుండా ఇంత పని నేను చేయలేను. రాత్రయితే ఒళ్ళు అలిసిపోయి జ్వరం వచ్చేస్తోంది. వళ్ళునొప్పులతో నిద్రకూడా రావడంలేదు. రోజూ ఒక పెనడాల్ మాత్ర వేసుకుని కాసేపు పడుకుంటున్నాను. ఇలా పడుకుంటున్నాను.. బాగా నిద్రపట్టే సమయానికి అలా తెల్లారిపోతోంది. ఏం చెప్పమంటావు నా అగచాట్లు'' వంట గది కిటికీ సందుల్లోంచి టీగ్లాసును శ్రీను చేతికి అందిస్తూ చెప్పింది సునీత.

''కువైట్‌లో ఎంతమంది ఆడవాళ్ళు ఎలాంటి ఘోరమైన పరిస్థితుల్లో చిక్కుకుని ఉన్నారో నీకు తెలుసా? నాకు తెలిసి నీ పరిస్థితి ఎంతో మేలు. మా ఊర్నించి కుమారి అనే పిల్ల కువైట్ ఇంట్లో పనికి వచ్చింది. రెండు నెలలు బానే ఉంది. తరువాత ఆ పిల్ల అడ్రసే లేదు. ఏమయిందో ఎక్కడికి పోయిందో అర్థమే కావడం లేదు. ఇప్పటికి ఆర్నెల్లయింది. ఎక్కడ వుందో అసలు బ్రతికే ఉందో చచ్చిందో ఎవరికీ తెలియలేదు. అక్కడ ఇండియాలోని మా ఊర్లో వాళ్ళ అమ్మా నాయన ఏమయిందో తెలియక ఏడ్చి మొత్తుకుంటున్నారు 'నాయనా శ్రీను నువు ఆ కువైట్ వాళ్ళ ఇంటికి వెళ్ళి ఒక్కసారి వాళ్ళని అడిగి చూడు. అది ఏమయిందో? చచ్చిందో బ్రతికివుందో కనీసం మాకు విషయం చెప్పు. మేము నిద్రాహారాలు మాని దానికోసం బాధపడుతున్నాము అని మొత్తుకుంటే' ఒకరోజు టాక్సీ కట్టించుకుని ఆ పిల్ల పనిచేసే మంతకాకు (ఏరియా) వెళ్ళాను. ఎలాగో తిప్పలు పడి ఇల్లు కనుక్కుని ధైర్యం చేసి కాలింగ్ బెల్ నొక్కాను. ఇక్కడ కువైటీ వాళ్ళ ఇంటికి ఏ పరిచయమూ లేకుండా వెళ్ళి వాళ్ళని డిస్టర్బ్ చేస్తే.. అంతే సంగతులు. పోలీసుల్ని పిలిపించి జైల్లో పెట్టినా ఆశ్చర్యం లేదు. ఈ అరబ్ నా కొడుకులు అసలే తిక్కోళ్ళు నమ్మితే ప్రాణం ఇస్తారు. తేడా వస్తే ప్రాణం తీస్తారు. నేను భయంగానే వెళ్ళాను. మామా వచ్చి తలుపు తీసింది.

'మామా.. మా ఊరిపిల్ల మా చెల్లి కుమారి మీ ఇంట్లో పనిచేస్తోంది కదా? ఒకసారి అర్జంటుగా మాట్లాడాలి. దయచేసి పిలవండి. నేను వాళ్ళ అన్నను' అని చెప్పాను. నమ్మకంగా.

'అది నీ చెల్లా? చెల్లి అని చెప్పడానికి నీకు సిగ్గులేదా? అది కనపడితే చెప్పు. అది చేసిన పనికి పట్టుకుని కాళ్ళూ చేతులూ తీసేసి జైల్లో పెడతాం. రెండు నెలలు బాగా పనిచేసింది. దాన్ని నమ్మి ఇంటినీ పిల్లోళ్ళని అప్పగించి మేము డ్యూటీలకి పోయాము. ఒక రోజు అది ఇంట్లో వున్న నగలూ డబ్బూ దోచుకుని పారిపోయింది. ఎక్కడికి పోయిందో ఎక్కడ దాక్కుందో అని వెతుకుతున్నాం పోలీసులు కూడా దానికోసం వెతుకుతున్నారు. వట్టి దొంగది అది. చెల్లెలు అంటున్నావు కదా అది ఎక్కడ వుందో నీకు తెలిసే వుంటుంది. మా డబ్బూ మా నగలు ఎక్కడ పెట్టిందో తెచ్చిఇవ్వమని చెప్పు. లేకపోతే దాన్ని ఇండియాకి పోనీకుండా ఇక్కడే సమాధి చేస్తాం. ఏదో కష్టపడి పనిచేసుకుంటుంది పిల్లల్ని చూసుకుంటుంది అని మేము వెయ్యి దినార్లు ఖర్చుపెట్టి తెచ్చుకుంటే ఇంట్లో ఉన్నదంతా దోచుకుని పారిపోతుందా? మా కువైట్ చాలా చిన్నదేశం దాన్ని వలవేసి గాలించి పట్టుకుంటాం. జాగ్రత్త. అసలు నువ్వు ఇక్కడికి ఎందుకొచ్చావో చెప్పు'' వీధంతా వినిపించేటట్లుగా గట్టిగా అరుస్తోంది మామా.

ఆమె అరుపులకి భయమేసింది నాకు. ఇక ఏమీ మాట్లాడలేకపోయాను. 'మామా అది ఇంతపని చేసిందా? మాకు ఈ సంగతి తెలియలేదు. తెలిస్తే దాన్ని వెతుక్కుంటూ మీ వాకిట్లోకి ఎందుకొస్తాను? అది ఎక్కడ కనిపించినా పట్టుకొచ్చి మీకు అప్పగిస్తాను. దాన్ని ఊరికే వదలను' అంటూ చేతులు జోడించి వెనుతిరిగి అక్కడినుండి పరుగెత్తుకొచ్చేసాను.

నా వెనుక ఆమె గట్టిగా అరుస్తూనే ఉంది. అవి నిజంగా కడుపులో మండిన అరుపులే. నాకర్ధమైపోయింది. కానీ అది ఆ పిల్ల కుమారి దొంగదైతే కాదు. మరి దానికి ఏం పోగాలం దాపురించిందో, ఏ పాడుబుద్ధి పుట్టిందో? ఎవరి ప్రోద్భలంతో ధైర్యంగా ఈ పని చేసిందో ఎక్కడికి పారిపోయిందో? అన్నీ ప్రశ్నలే. ఇంకా దానికోసం కనపడిన అందరినీ అడుగుతూనే ఉన్నాను. ఎక్కడైన కనిపిస్తుందేమో అని వెతుకుతూనే ఉన్నాను. ఆ పిల్ల అమ్మా నాన్నలకు ఏం జవాబు చెప్పాలో అర్ధం కావడం లేదు. పోనీ ఆ పిల్ల ఎక్కడో ఇక్కడే దాక్కుని ఉంది అనుకున్నా కనీసం ఒక్కసారైనా ఎవరో ఒకరి ఫోను తీసుకుని వాళ్ళ అమ్మా నాన్నకు ఫోను చేసి వాళ్ళు కంగారు పడకుండా బాగున్నాను బ్రతికే ఉన్నాను అని ఒక్కమాట చెప్పచ్చుకదా. ఇలాంటి కేసులు కువైటులో కోకొల్లలు. ఏదో పనిచేసుకుని నాలుగు దినారాలు సంపాదించుకుని బ్రతుకుదాం అని ఆశతో గల్ఫ్‌కి వస్తారు. ఇక్కడికొచ్చాక పరిస్థితులు అనుకున్నట్టుగా ఉండవు. సులభంగా తొందరగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో అత్యాశకు పోతారు. ఇలాంటి చిక్కుల్లో పడి ప్రాణాల మీదకి తెచ్చుకుంటారు. ఇది పరదేశమని ఇక్కడి చట్టాలు కఠినంగా ఉంటాయనీ ఏదైనా తేడా వస్తే తిరిగి మన దేశానికి వెళ్ళలేమనీ మనవాళ్ళని కళ్ళతో చూడలేమనే సంగతి మర్చిపోతారు. క్షణికావేశం వీళ్ళ చేత నేరాలు చేయడానికి ప్రేరేపిస్తుందనుకుంటా. ఆలోచనా విచక్షణా జ్ఞానం వీళ్ళలో నశించి పోతయేమో?" టీ త్రాగుతూ చెప్పుకొచ్చాడు శ్రీను కిటికీ అవతలనుండే

ఇద్దరి మధ్యా కిటికీ అడ్డుగా ఉంది. కిటికీకి ఆవల ఎత్తుగా ఉన్న ప్రహరీగోడ. దానికి ఓ ప్రక్కగా చిన్న గేటు ఉన్నాయి. బయట వరుసగా ఉన్న ఖర్జూరపు చెట్లు కాపుకాలం కావడంతో గుత్తులుగా విరగకాసి ఉన్నాయి.

ఓ ప్రక్కగా ఉన్న ఆ చిన్న గేటును శ్రీను లోపలికి రావడం కోసమే తెరిచింది కుమారి. వీధి చివరగా ఉన్న ఇంట్లో దూరపు బంధువులతో కలిసి ఉంటున్నాడు శ్రీను.

అపుడపుడూ ఆ వీధిలో ఉన్న బకాలా (చిన్న అంగడి)కి రొట్టెలు కొనడానికి సునీత వెళుతూ ఉంటుంది. అలా వీలయినపుడు సునీత కళ్ళలోకి కళ్ళు కలిపి ఎవరూ లేకుండా చూసుకుని మాట కలిపాడు. పేపర్‌లో రాసి వున్న ఫోను నంబరుని చేతికి అందించాడు.

కువైట్‌లోని ఇళ్ళలో పనిచేసే ఆడవాళ్ళు ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడకూడదు. మగవాళ్ళతో అస్సలు మాట్లాడకూడదు. కట్టుబాట్లు ఆంక్షలు అవధులు చాలా ఉంటాయి ఈ పనిమనుషులకి. అలా మాట్లాడినప్పుడు కువైట్ వాళ్ళు చూస్తే చాలా ప్రమాదం. అలా చూస్తే తిడతారు, కొడతారు, హింస పెడతారు.

ఇలా పరిచయం ఏర్పడినప్పటినుండీ కువైటీవాళ్ళు ఇంట్లో లేకుండా ఉన్న సమయాల్లో శ్రీనుకు ఫోను చేసి మాట్లాడేది సునీత. వాళ్ళ పరిచయం కాస్త ముదిరి అలా బయట వున్న చిన్నగేటు తెరిచి అపుడపుడూ లోపలికి రమ్మని చెప్పేది. కిటికీ అవతలే అతన్ని ఉంచి వంటగదిలో నుండి చిన్నగా కాసేపు మాట్లాడి పంపించేస్తుంది. దాదాపు మూడ్నెల్లనుండీ అలా జరుగుతోంది.

శ్రీనుతో మాట్లాడుతున్నంతసేపూ బయటికి వెళ్ళిన తన మామా, బాబా ఎక్కడ తిరిగి వచ్చేస్తారో తమని చూసి తిడతారో అని లోపల వణికిపోయేది సునీత. అలా ఎపుడైనా చూస్తే తన పరిస్థితి ఏంటా? అని ఆలోచించేది. కానీ ఆడ మగ పరిచయాలు మధ్య కలిగే ఆకర్షణని అధిగమించడం సాధారణంగా అసాధ్యమే.

ఇక్కడ పనిమనుషులుగా పనిచేసేవారు జైలులాంటి కువైట్ ఇంట్లో స్వేచ్ఛ లేకుండా కాలం గడుపుతారు కాబట్టి స్నేహం కోసం, తోడుకోసం, మాట్లాడే మనిషి కోసం అలమటించి పోతారు. పలకరించే వాళ్ళు దొరకడం అదృష్టంగా అపురూపంగా భావిస్తారు. ఆ పరిస్థితుల్లోనే ఆడ మగ ఆకర్షణకు లోనయి వ్యామోహాన్ని పెంచుకుని తొందరపాటు చర్యలతో కష్టాల పాలవుతుంటారు.

"అయ్యో పాపం ఆ పిల్ల చాలా పొరపాటు చేసింది. అలా దొంగతనం చేయడం తప్పుకదా ఇప్పుడు ఎక్కడుందో మరి? ఎవరి దగ్గరికెళ్ళి దాక్కుందో?" బదులు చెప్పింది సునీత.

"సరేకానీ రాత్రికి గేటు తెరుస్తావా? అందరూ నిద్రపోయాక నీ రూమ్‌కి వస్తాను" చెప్పాడు శ్రీను కన్నుగీటుతూ.

"అబ్బ... నీకెపుడూ తొందరే. మా మామా బాబా చూస్తే ఇంకేమైనా వుందా? తోలు తీస్తారు. ఈ రోజు వద్దులే వీలు చూసుకుని నేనే చెపుతాను" అంది సునీత సిగ్గుపడుతూ.

"ఇంకెన్ని రోజులు ఎదురు చూడాలబ్బా? కిటికీ అవతలేవుండి మాట్లాడుతూ నన్ను ఊరిస్తున్నావు? ఇది న్యాయమా? " అన్నాడు దీనంగా మొహం పెట్టి.

"నాలుగైదు రోజుల్లో మా బాబా దుబాయ్‌కి వెళుతున్నాడు. అప్పుడు పిలుస్తాలే. అంతవరకూ కాస్త ఆగు" అంది నవ్వుతూ.

"నిన్ను నమ్మితే ఇంకో ఆరునెలలు ఇలాగే మాటలతోటే కాలం గడిపేసేటట్లున్నావు. ఇంత అందాన్ని ఎదురుగా చూస్తూ ఇంక ఎక్కువ రోజులు ఆగలేనే. సరే ఇంకో నాలుగు రోజులు మాత్రమే" అన్నాడు శ్రీను.

ఇంతలో బయట మెయిన్ గేటు దగ్గర కారు వచ్చి ఆగిన శబ్దం వినిపించింది.

భయపడిపోయింది సునీత. "మా బాబా వచ్చినట్లున్నాడు శ్రీను నువ్వు అటువైపుకి కనబడకుండా చిన్నగేటు దగ్గరికివెళ్ళి చెట్ల మాటుగా బయటికి వెళ్ళిపో. తొందరగా వెళ్ళిపో. చూస్తే ప్రమాదం" అంది కంగారుగా.

"అలాగే నువ్వు కంగారు పడకు." అంటూ ఐదు సెకండ్లలో అక్కడినుండి మాయమయిపోయాడు శ్రీను. సునీతకే కాదు అతనికి కూడా భయమే మరి.

హమ్మయ్య బాబా శ్రీనుని చూడలేదు. గండం గడిచింది. లేకపోతే చాలా ప్రమాదం జరిగి ఉండేది అనుకుంటూ గుండెలపై చేతులు వేసుకుంది సునీత.

నాలుగురోజుల తరువాత ఇంట్లో ఎవరూ లేనిది చూసి శ్రీనుకు ఫోను చేసింది సునీత.

"కిటికీ దగ్గరికి వస్తావా? దిజాజ్ మసిబూసి (చికెన్ బిరియానీ) చేసాను. వేడివేడిగా తిందువుగాని తొందరగా రా" అంది.

"లేదు సునీతా. ఈ రోజు రాలేను. నేను బయట ఉన్నాను. అదే మా ఊరి పిల్ల చెప్పానుకదా కుమారి గురించి ఆ పిల్ల పోలీసులకు పట్టుబడింది. డబ్బు నగలు ఎక్కడ పెట్టిందో తెచ్చి ఇమ్మని చితగ్గొట్టారంట. ఆ పిల్ల దగ్గర ఉంటేకదా తెచ్చి వాళ్ళకు ఇవ్వడానికి. వాళ్ళ మేనమామ ఒకతను ఉంటే అతని దగ్గర దాచిపెట్టిందంట. వాడికి అంత డబ్బూ, నగలు చూడగానే ఆశపుట్టి మొత్తం అన్నీ తీసుకుని రాత్రికి రాత్రే విమానమెక్కి ఇండియాకు పోయాడు. తెల్లారినాక చూస్తే మేనమామ లేడు. డబ్బూ, నగలూ రెండు లేవు. నెత్తీ నోరు కొట్టుకుని ఎవరో తెలిసినవాళ్ళు ఉంటే వాళ్ళ దగ్గర కొన్ని రోజులు తలదాచుకుంది. కానీ కువైట్‌లో ఎన్ని రోజులు తప్పించుకుని బ్రతకగలదు? పోలీసుల కంట పడనే పడింది. దొంగతనం చేసిన డబ్బూ నగలు ఎక్కడ పెట్టావో చెప్పమని మక్కెలు విరగతంతున్నారు. ఆ మేనమామ చూడు అయినవాడై వుండి, స్వంతం అమ్మ తమ్ముడయివుండి కూడా ఎంత మోసం చేసాడో? పొయ్యేవాడు ఈ పిల్లను కూడా తీసుకుని పోకుండా ఇక్కడ వదిలేసి నీ చావు నువ్వు చావు అంటూ ఒక్కడే చెప్పాపెట్టకుండా పోయాడు. ఈ కాలంలో ఎవరిని నమ్మగలం చెప్పు? ఈ రోజు మా ఊరి వాళ్ళందరం ఏం జరిగిందో ఆ పిల్ల ఏ ఏరియా పోలీస్ స్టేషన్‌లో వుందో కనుక్కుందామని బయటపడినాము. ఈ దేశంలో పోలీసుల దగ్గరకి పోయి మాట్లాడే ధైర్యం మనకు ఉందా? అందులో తప్పు మనది అయితే ఏమీ చేయలేము. ఏం చెయ్యాలన్నా అందరికీ భయమే. అందరినీ లోపలవేసి ఒళ్ళు నలగ్గొడతారు. ఎందుకొచ్చిన తలనొప్పి చెప్పు దొంగతనం చేయడం ఆ పిల్ల తప్పు. ఇక అంతే సంగతులు. బ్రతికినంతవరకూ ఇక్కడ జైల్లో ఉండాల్సిందే ఇంటి సంగతి మరిచిపోవాల్సిందే, దాని ఖర్మ అది అనుభవించక తప్పదు. ఇక ఉంటాలే బయట అందరం ఆ విషయం మాట్లాడుకుంటూ బిజీగా ఉన్నాం. తొందరలో

కలుస్తాలే." అంటూ తొందరగా విషయం చెప్పి ఫోన్ కట్ చేసాడు శ్రీను. వింటున్న సునీతకు కూడా భయమేసింది. అమ్మో ఎంతపని జరిగింది? ఈ కువైట్ దేశంలో జైలు అంటే ప్రాణం మీద ఆశలు వదులుకోవాల్సిందే ఏదైనా తప్పు జరిగితే శిక్షలు చాలా కఠినంగా ఉంటాయి. ఇక దేవుడే కాపాడాలి ఆ పిల్లను. మనుషుల వల్లకాదు అనుకుంది సునీత.

దాదాపు వారం రోజులు గడిచిపోయాయి ఈ వారం రోజులూ శ్రీనుకు ఫోను చేయడానికి కూడా కుదరలేదు సునీతకి. ఏవో సెలవలు కావడంతో పిల్లలు స్కూలుకు వెళ్ళలేదు. మామా, బాబా ఆఫీసుకూ వెళ్ళలేదు. అందరూ ఇంట్లో ఉండటంతో వారమంతా వాళ్ళకు అన్నీ చేసిపెట్టి టీ, కాఫీలు అందించడంతోనే సరిపోయింది. మనసంతా శ్రీను దగ్గరే ఉంది. మాట్లాడాలని ఎంతగానో ప్రయత్నించింది.

కుదరలేదుకానీ మరో రెండురోజుల్లో మామా, బాబా ఇద్దరూ నాలుగురోజులపాటు ఊరి బయట ఉన్న గెస్ట్‌హౌస్‌కు వెళ్ళొస్తాం అని చెప్పడంతో చాలా సంతోషించింది సునీత.

ఎప్పటినుండో కలవాలని శ్రీను అడుగుతున్నాడు కానీ వీలుకాకపోవటం వల్ల ఎప్పటికప్పుడు కుదరదు అంటూ సర్దిచెప్పుకొస్తోంది సునీత. కానీ ఈసారికి మాత్రం శ్రీను కోరిక తీర్చాలని ఆమె నిర్ణయించుకుంది. మామా, బాబాకు అవసరమైన బట్టలు వస్తువులన్నీ బ్యాగుల్లో సర్ది ఉషారుగా కారులో పెట్టింది. జరగబోయేది తలచుకుంటేనే ఆమెకు చాల సంతోషంగా ఎగ్జైటింగ్‌గా ఉంది.

మామా బాబా అలా వెళ్ళిపోగానే ఇలా శ్రీనుకి ఫోను చేసింది. కాస్త సిగ్గుపడుతూ "రాత్రికి రెడీగా ఉంటాను వచ్చెయ్య"మంది.

మామా, బాబా ఇద్దరూ ఇంట్లో లేరని తెలియగానే ఎగిరి గంతేసాడు శ్రీను.

"అలాగే. ఇప్పుడే 'మాలియా' వెళ్ళి మల్లెపూలు తెల్లచీర, కొనుక్కొస్తాను. నువ్వు తినడానికి చికెన్ బిరియానీ తెస్తాను. స్నానం చేసి రెడీగా ఉండు. ఎనిమిదయ్యేసరికి నేను వచ్చేస్తా. కలిసి భోంచేసి కావలసినన్ని కబుర్లు చెప్పుకుందాం" అన్నాడు ఉత్సాహంగా.

తెల్లచీర మల్లెపూలు అనేసరికి మరింత సిగ్గుపడింది సునీత. అలాగే అంటూ అంగీకారాన్ని తెలిపింది.

చీకటి పడగానే లేచి తలస్నానం చేసి తయారయి శ్రీనుకోసం ఎదురు చూడసాగింది సునీత. నాలుగేళ్ళ క్రితం కట్టుకున్న భర్త చనిపోవడంతో తనకున్న ఇద్దరు పిల్లల్ని పోషించుకోవడానికి కువైట్ వచ్చింది ఆమె.

మగవాడి స్పర్శ తగిలి ఎన్నేళ్ళయిందో? శ్రీనుకు తనంటే చాలా ఇష్టమున్నట్లు తెలుస్తోంది. మరి పెళ్ళి చేసుకోమని అడగాలి. స్త్రీ పెళ్ళిచేసుకోకుండా శరీరాన్ని మగవాడికి అప్పగిస్తే చులకనైపోతుంది. ఇలా ఆలోచిస్తూ అతని రాకకోసం ఎదురు చూస్తోంది సునీత. చెప్పినట్లుగా ఎనిమిదవగానే రానే వచ్చాడు శ్రీను. అతని మొహం సంతోషంతో వెలిగిపోతోంది. తెచ్చిన చీర కట్టుకోమన్నాడు. మల్లెపూలు పెట్టుకోమన్నాడు. అలాగే అని చెప్పి పదినిముషాల్లో అతడు చెప్పినట్లు తయారయింది సునీత. తెల్లచీరలో పెళ్ళికూతురులా మెరిసిపోతున్న ఆమెను చూసి ఆగలేకపోయాడు. అక్కడే హాల్లోనే దగ్గరికి తీసుకోబోతున్న అతడ్ని వారించి "నా రూమ్‌లోకి వెళదాం పద" అంది సునీత.

"ఛీ నీ రూములోకా? ఎందుకు? వద్దు. పండగపూట కూడా పాతబట్టలు వేసుకున్నట్లు మామా బాబా నాల్రోజులు రానని చెప్పారుగా. ఈ నాలుగు రోజులూ మనకే. ఈ ఇల్లంతా మనదే మన ఇష్టం. పద. మామా బాబా పడుకునే బెడ్ రూమ్‌లోకి వెళ్ళి మెత్తటి పరుపులపైన హాయిగా పడుకుందాం. వాళ్ళ బాత్‌టబ్‌లో జలకాలాడదాం. మళ్ళీ ఈ అవకాశం జన్మలో రాదు. ఈ నాలుగురోజులూ మనం స్వర్గంలో విహరిద్దాం" అంటూ ఆమెను చేతుల్లోకి ఎత్తుకుని బాబా మామా పడుకునే బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్ళిపోయాడు.

"అయ్యో వద్దు శ్రీనూ. నాకు భయం. మామా బాబాకు తెలిస్తే చాలా ప్రమాదం" అని ఎంతగా గింజుకున్నా అతను విడిచిపెట్టలేదు. ఎడారిలో వెన్నెల కురిసినట్లు లోకం మరిచి పరవశించిపోయారు ఇద్దరూ. ఆ రాత్రి అలా ఆనందంగా గడిపేసారు.

మరుసటి రోజు మరలా అదే టైముకు వస్తానని చెప్పి ఉదయాన్నే వెళ్ళిపోయాడు శ్రీను. పగలంతా ఇల్లు సర్దుకుంది సునీత. ఈ రాత్రికి ఎలాగైనా పెళ్ళిచేసుకోమని శ్రీనును అడగాలి అని నిశ్చయించుకుంది ఆమె. ఆ రాత్రికూడా బాబా మామా బెడ్‌రూములో మెత్తటి పరుపులపై విలాసంగా పడుకుని సేద తీరుతున్నప్పుడు అడిగింది సునీత పెళ్ళి విషయం.

"అదెలా? ఎలా కుదురుతుంది నీతో పెళ్ళి? నువు భర్త చనిపోయి ఇద్దరు పిల్లలున్న ఆడదానివి. నేను పెళ్ళికాని యువకుడిని. నేను ఒప్పుకున్నా మా అమ్మా నాన్న అసలు వప్పుకోరు. నిన్ను చేసుకుంటే చెప్పుతో కొట్టి ఇంట్లోంచి తరిమేస్తారు. ఏదో నువు ఇక్కడ కువైట్‌లో ఒంటరిగా ఉంటున్నావు. నాలుగేళ్ళు సరదాగా గడిపేద్దాం. అందంగా ఉన్నావుకదా ఇక్కడ కువైట్‌లో ఉన్నంతకాలం నిన్ను వదలనులే. తరువాత నేను ఇంటికి వెళ్ళి పెళ్ళి చేసుకుంటాను. నువు నీ పిల్లల దగ్గరికి వెళ్ళిపోదువు" చెప్పాడు కాంక్షగా ఆమె వైపు చూస్తూ.

ఆడది మనసుతో ప్రేమిస్తుంది. మగవాడు కళ్ళతో కామిస్తాడు. అనుకుంది సునీత తన మనసులో. ఇక అతనకేమీ జవాబు చెప్పలేదు. యాంత్రికంగా అతనికి సహకరించింది. మూడవరోజు ఉత్సాహంగా వచ్చాడు శ్రీను "మన మూడు రాత్రులూ ఎంత అద్భుతంగా గడిచిపోతున్నాయో చూసావా? అదృష్టమంటే మనదే. ఎంత మంచి ఇల్లు. పట్టెమంచం, పరుపు దిండ్లపై పడుకోవటం అంటే మనది ఎంత అదృష్టమో కదా?" అన్నాడు ఆమె తలలో మల్లెపూలు పెడుతూ.

ముభావంగా ఉన్న సునీత 'అవును' అన్నట్లుగా తలవూపింది.

"పద ఇంకా ఆలస్యం ఎందుకు? బెడ్‌రూములోకి పోదాం.." అంటూ ఆమె చేయిపట్టి లాక్కెళ్ళిపోయాడు. అర్థరాత్రి దాటాక అలిసిపోయి నిద్రలోకి జారుకున్నారు. తెల్లవారుఝామున ఎవరో బెడ్‌రూమ్ తలుపుల్ని ధన్‌మని తన్నడంతో మెలుకువ వచ్చింది ఇద్దరికీ. కళ్ళు తెరిచి చూసే సరికి ఎదురుగా నిప్పులు కురుస్తున్న కళ్ళతో మామా బాబా నిలబడి ఉన్నారు. ఒక్క క్షణం ఏమీ అర్థంకాలేదు ఇద్దరికీ. అర్థమయ్యాక గుండె ఆగిపోతుందే అన్నంతగా భయపడి వణికిపోసాగారు. చెప్పుతీసుకుని ఇద్దరి జుట్టుపట్టుకుని ఇష్టమొచ్చినట్లుగా కొట్టారు మామా బాబా.

"ఇడియట్స్ మీ అనైతిక కార్యాలకు విచ్చలవిడితనానికి పడి పొర్లడానికి మా బెడ్‌రూమ్ కావలసి వచ్చిందా? ఉండండి పోలీసులను పిలుస్తాను" అంటూ బాబా చిందులు తొక్కాడు. అదే సమయంలో మామా పోలీసులకు ఫోన్ చేయనే చేసింది. ఈ లోపల వంటిపైన బట్టలు ఎలా కట్టుకున్నారో వారికే తెలియదు.

పోలీసులు వచ్చి ఇద్దరినీ ఈడ్చుకెళ్ళిపోయారు. ఇక చెప్పాల్సింది ఏమీలేదు. నాలుగైదేళ్ళు కువైట్ జైల్లో ఉంచి మరలా కువైట్‌కి తిరిగి రాకుండా పాస్‌పోర్టుల్లో ఎర్రముద్ర వేసి ఇండియా ఫ్లయిట్ ఎక్కించారు.

క్షణికావేశంతోనో, ఆకర్షణలవల్లో, విచక్షణా జ్ఞానం నశించడం వల్లో పొరపాట్లు చేసి మా దేశంలో శిక్షల్ని అనుభవించేవాళ్ళు ఎందరో ఉన్నారు. గల్ఫ్‌లో చట్టానికి విరుద్ధంగా తప్పులు చేసి పద్ధతులకు వ్యతిరేకంగా నడుచుకుని జీవించాలంటే కుదరదు మరి. కొన్ని జీవితాలంతే మరి.

## వరమ్మ కథ

**ఉదయం** పదిగంటలవేళ. ముందు వీధిలో అంబులెన్సుల రొద ఆపకుండా వినబడటంతో ఒక్క ఉదుటున లేచి గవాక్షపు తలుపుల్ని తెరిచి బయటికి చూసాను. ఒకటా రెండా. నాలుగు అంబులెన్సులు ఒకేసారి ఒకదాని వెనుక ఒకటి కంగారుగా వెళ్తున్నాయి. ఒక్క నిముషం గుండె కూడా గుబగుబలాడింది. నా గుండె ఒక్కటేకాదు. ఈ కరోనా వచ్చాక ప్రపంచం గుండే ఒణికిపోతోంది మరి. ఏం జరిగిందో ఏమిటో? మా బిల్డింగ్‌లో ఉన్న వారికి ఏమీ కాలేదు కదా? ఏదన్నా అయితే? జరగబోయే పర్యవసానం ఏమిటో గుర్తొచ్చి శరీరం సన్నగా కంపించింది.

ఒక్కరికి పాజిటివ్ అని తెలిసినా మొత్తం బిల్డింగ్‌లో ఉన్న వారందరినీ తీసుకెళ్ళి దూరంగా ఎక్కడో ఎడారిలో వున్న క్వారన్‌టైన్‌లో పడేస్తున్నారు. ఇప్పటికి కువైట్‌లో మొత్తానికి రెండువేల కేసులు తేలాయి. అందులో 75 శాతం మన భారతీయులే ఉన్నారు. హతవిధీ ఎందుకిలా? ఆలోచిస్తూ చూస్తూంటే అంబులెన్సులన్నీ ఆపై వీధిలోకి వెళ్ళిపోయాయి.

ఇంకా చూద్దామంటే చుట్టూ ఉన్న ఎత్తైన భవనాలు నాకు అడ్డొచ్చాయి. ఏమిటో? ఏం జరిగిందో తెలుసుకోవాలన్న ఆదుర్దా నన్ను నిలవనీయలేదు.. అలాగే కిటికీ దగ్గరే నిలబడ్డాను. ఎదురుగా మసీదుకున్న బురుజుపై కూర్చున్న పావురం కోసం జంటపావురం పరిగెత్తుకొచ్చింది. రెండూ కాసేపు సంతోషంగా కబుర్లు చెప్పుకున్నాయి. తరువాత షికారుకనుకుంటా రెండూ ఒక్కసారిగా ఒకే వైపుకి ఎగిరెళ్ళిపోయాయి.

ఇంతలో ఇదే అదననుకుని ఇంకొక పావురం వచ్చి కూర్చుంది అదే బురుజుపై ఠీవిగా.

వచ్చీ రాగానే అందుకోసమే వచ్చినట్లుగా కాలకృత్యాలన్నీ అక్కడే నా ఎదురుగానే తీర్చేసుకుంది. నాకు నవ్వొచ్చింది.

అది మసీదని, ప్రార్థనా స్థలమని పైన వున్న కొమ్ము అని దానికి తెలియదుకదా. అవి తెలియక చేస్తున్నాయి. కానీ మనుషులు తెలిసీ తల్లిలాంటి భూమిని తమ స్వార్థం కోసం పాడుచేస్తున్నారు. మురికితో నింపుతున్నారు. ఇప్పుడైనా ఈ గడ్డుకాలంలోనైనా మనుషులు తమ తప్పుల్ని తెలుసుకుంటున్నారా? ఆలోచన స్థిమితంగా కొనసాగలేదు. మనసంతా అటువెళ్ళిన అంబులెన్సుల మీదే ఉంది. ఎవరికి ఏమయిందో? అనే ఆలోచన.



ఎవరిని అడగాలో తెలియలేదు. నేనయితే నా రూమును విడిచి బయటికి ఎక్కడికీ వెళ్ళడంలేదు. చాలా ఏళ్ళ తరువాత నా ఒంటరితనాన్ని ఏకాంతంగా నా గదిని అంతఃపురంగా మార్చుకుని దొరికిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాను. కువైట్ కొచ్చిన ఇరవై ఏళ్ళ కాలంలో పనీపాటా లేకుండా రూములో కూర్చోవడం ఇప్పుడే జరుగుతోంది. ఇలాంటి రోజులు వస్తాయని కూడా నేను ఊహించలేదు.

ఈ వైరస్‌ల ప్రభావం ఎక్కువగా విమాన రాకపోకల మీద, మా హోటల్ రంగాల మీద ప్రభావం చూపించింది. చూపిస్తోంది కూడా. మార్చి పదమూడున మా హోటల్‌ని క్లోజ్ చేసేసారు. 40ఏళ్ళ చరిత్రలో మొదటిసారి జరిగిందట ఇలా పూర్తిగా మూసేయడం. ఇంకెప్పుడో మళ్ళీ తెరవడం? ఎవరికీ తెలియదు.

గల్ఫ్ యుద్ధంలో కూడా ఇంతటి కల్లోలం జరగలేదు. ముస్లింల ప్రార్ధనలకు కేంద్రాలయిన మసీదులు మూయబడటం చరిత్రను సృష్టిస్తోంది. మానవ చరిత్రలో ఈ కరోనా అధ్యాయాన్ని ఏ అక్షరాలతో లిఖిస్తారో మరి? సరే తరువాత కువైట్ అప్‌డేట్‌లో న్యూస్ వేస్తాడుగా అక్కడ తెలుస్తుందిలే ఈ అంబులెన్సుల సంగతి. అందులో మా ఏరియాలో మా పై వీధికి అవి వెళ్ళడంతో ఒక విధమైన అలజడి కలుగుతోంది కదా అనుకుంటూ వంటింట్లోకి వెళ్ళి టీ కలుపుకుందాం అని కిచెన్ తలుపు తెరిచాను.

గుప్పుమంది వాసన. ధైర్యం చేసి ఏంటో చూద్దాం అనుకుంటూ రెండడుగులు లోపలికి వేసాను. ఒకవైపు బీఫ్ కుతకుతా ఉడుకుతోంది. మరోవైపు చేపల వేపుడు నూనెలో ముంచి తీస్తున్నారు ఇద్దరు ఫిలిప్పీన్ అమ్మాయిలు.

ఇంతకుముందయితే నేను డ్యూటీలకు షాపింగులకూ వెళ్ళిపోయేదాన్ని. రూమ్‌లో గడపడం చాలా తక్కువ.

కానీ ఇప్పుడలా కాదుగా. ఇరవై నాలుగ్గంటలూ రూమ్‌లోనే ఉండటంతో అటు కిటికీ బయట ప్రపంచాన్ని ఇటు ఇంట్లో (ఫ్లాట్‌లో) పరిస్థితులను కాస్త గమనించి పరిసరాలను కాస్త అవగాహన చేసుకోవడం ప్రారంభించాను. మా హోటల్ వాళ్ళిచ్చిన మా ఫ్లాట్‌లో మూడు రూములుంటాయి. ఒకదానిలో నేను, అవతల వున్న రెండింటిలో ఇద్దరు ఫిలిప్పీన్ అమ్మాయిలు, ఒక ఆఫ్రికన్ అమ్మాయి ఉంటారు.

అందరికీ కలిపి ఒకటే బాత్‌రూమ్. ఒకే కిచెన్. కానీ నేను ఎప్పుడూ వాళ్ళని పట్టించుకోను. మాట్లాడను. నా ప్రపంచం వేరే. అయినా నాకు ఎప్పుడూ మధ్యాహ్నం డ్యూటీలు కాబట్టి నిద్రపోవడానికే నా రూమ్ నాకు ఉపయోగపడుతుండేది.

ప్రొద్దుటే మాంసం, చేప వాసన ఘాటుగా ముక్కుకు తగలడంతో ఉక్కిరి బిక్కిరయిపోయి ఇక టీ కూడా తాగాలనిపించక ఒక్కంగలో బయటకి వచ్చి నా రూమ్‌లో పడ్డాను. గమనిస్తే ఈ ఫిలిప్పీన్ వాళ్ళకి చైనా వాళ్ళకి చాలా పోలికలు ఉన్నాయి.

ఏ మాంసమైనా సంతోషంగా తినగల సమర్థులు వీళ్ళు. ఒక్కోసారి నాకు భయం వేస్తుంటుంది. వీళ్ళు అన్ని మాంసాలనూ మా కామన్ ఫ్రిజ్‌లో నిలవపెట్టి స్టవ్‌పై వండి అందరికీ ఏ రోగాలు తెచ్చిపెడతారో అని. అసలే ఒకసారి జెస్సీ అనే ఫిలిప్పినో ఫ్రెండ్ నాకు వాళ్ళ జీవన విధానం గురించి, ఆహారపు అలవాట్ల గురించి చెప్పింది. మాంసం, సీ పుడ్డే కాక  కుక్కలను, కోతులని కూడా వీళ్ళు వదలరట. పాములను కూడా తింటామని ఆ పిల్ల మెరిసే కళ్ళతో చెపుతుంటే నాకు వళ్ళంతా జుగుప్స కలిగి ఆ పిల్లను తాకడానికి కూడా ఇష్టపడక దూరంగా ఉంచేసాను. అప్పటినుండీ వీళ్ళు దగ్గరగా ఉన్నప్పుడు తగలాలన్నా, పనిచేసేటప్పుడు వీళ్ళకి దగ్గరగా కూర్చోవాలన్నా నా శరీరం ముడుచుకుపోయేది.  వీళ్ళింతకీ చేపలే ఫ్రై చేస్తున్నారా? లేక పాములని కూడానా? నా ఆలోచన నాకే భయం గొలిపింది. మళ్ళీ కువైట్‌లో అన్నీ చెక్ చేస్తారుగా. అన్ని మాంసాలనూ అనుమతించరుకదా? భయపడినట్లుగా ఏమీ ఉండదులే అని నాకు నేను సర్ది చెప్పుకున్నాను. కాస్త ధైర్యం తెచ్చుకున్నాను.

ఈ రోజుల్లో నేను గమనించింది ఏమిటంటే వీళ్ళు పిట్టగుడ్లు అస్పారగస్, రొయ్యలు, బీఫ్ అన్ని రకాల చేపలులాంటివి నాలుగు పూటలా వండుకుని ఆరగిస్తారని. ఇంత ఫుడ్ తిన్నాకూడా, ఇన్ని రకాల మాంసాహారం మింగినాకూడా వీళ్ళ ఒళ్ళు కొంచెం కూడా లావెక్కదు. ఎందుకో మరి? కారణం ఏమిటో నాకు ఎప్పుడూ బోధపడదు. ఇంకొకటి ఏంటంటే వీళ్ళు ఒంటిపైన మైక్రో డ్రస్‌లు వేసుకు తిరుగుతుంటారు. వాళ్ళకెలా ఉంటుందో మనకు తెలియదుకానీ చూసే మనకు మాత్రం వళ్ళంతా సిగ్గుపుట్టి చూడలేక కళ్ళు కిందకి వాల్చుకుంటాము. ఖర్మ రా బాబూ.. అనుకుంటూ మనమే సిగ్గుపడి ప్రక్కకి తొలగి పోవాలి తప్ప వీళ్ళకి కాస్తయినా సిగ్గు అనే చిప్ వంట్లో ఎక్కడా కనబడదు.

వీళ్ళ జీవన విధానం ఆ స్వేచ్ఛ, స్వాతంత్ర్యము, ఆహారపుటలవాట్లు నాకెప్పుడూ అర్థంగావు. అవగాహనకు అందడంలేదు..

ఇక టీ తాగే అవకాశంలేక గోరువెచ్చటి నీళ్ళు గ్లాస్‌లో పోసుకుని తాగుతూ మళ్ళీ నా ప్రపంచపు కిటికీ దగ్గరికి వచ్చాను.

ఎత్తైన భవనాలను వీధిలో తిరిగే మనుషులను, ఎగిరే పక్షులను నీలి ఆకాశాన్ని అల్లనల్లన తేలిపోయే మేఘాలను చూడటం నా అలవాటు. అదే నా కాలక్షేపం, అంతకన్నా మించి ఒక్కమాటలో చెప్పాలంటే ఇహలోకం నుండి బయటికి తెచ్చి ప్రశాంతమైన ప్రకృతిలోకి నడిపించి నన్ను సేదతీర్చే మరో ప్రపంచం నా కిటికీ.

సాయంత్రం ఇక్కడ నిలబడి బయటికి చూస్తే సింగపూర్‌లోనో, న్యూయార్క్ పట్టణంలోనో, దుబాయ్ వీధుల్లోనో ఉన్నట్లుగా అనిపిస్తుంది. దీపాల కాంతుల్లో మెరిసే ఎత్తైన హర్మ్యాలను చూస్తుంటే అప్పుడప్పుడూ నా రూమ్‌కి వచ్చే నా ఫ్రెండ్స్ కూడా అంటుంటారు "నీకు ఈ కిటికీ చాలు రోజులు ఆనందంగా గడిపేయడానికి" అని.

ముందు మా ఫ్లాట్‌లో వున్న బొంబాయి అమ్మాయి 'స్నేహల్'తో ఎప్పుడూ అనేదాన్ని. "నీకు పెళ్ళి అయితే ఎక్కడికో హనీమూన్ వెళ్ళి డబ్బు వేస్ట్ చేయకు. నా రూమ్‌లో నాలుగురోజులు గడపండి. సింగపూరో, దుబాయో వెళ్ళిన ఫీలింగ్ వస్తుంది" అని.

నిజమే అంటూ కిటికీ దగ్గరే బయటికి చూస్తూ నిలబడిపోయేది.

వంటిల్లు కంపుకొట్టినా కిటికీ మాత్రం ఇంపుగా అందంగా వుందికదా చాలు ఈ జీవితానికి అనుకుంటూ మళ్ళీ అంతు చిక్కని కరోనా వైరస్ గురించీ, అడ్రెస్ తెలియకుండా పోయిన అంబులెన్సుల గురించీ ఆలోచిస్తున్నాను.

ఇంతలో ముల్లా వచ్చి అల్లా హు అక్బర్ అంటూ మైకులో "ప్రార్ధనకు రండని" పిలుపునందించాడు.

కానీ ఇది కరోనా కాలం. కువైట్‌లో కర్ఫ్యూ కాలం. గుంపులు కూడి ప్రార్ధనలు చేయడానికి బయట తిరగడానికి లేదు కదా రోజుకు ఐదుసార్లు ఆయా సమయాలకు వచ్చే ఆ ప్రార్ధనా పిలుపులు విని అందరూ వారి ఇళ్ళలో ప్రార్ధనలు చేసుకుంటారనుకుంటా.

ఈ అరబిక్ దేశాల్లో మసీదులకు అందులోని ప్రార్ధనలకు చాలా ప్రాముఖ్యతను ఇస్తారు. ఆ సంప్రదాయానికి పద్ధతికి ఇదే మొదటిసారనుకుంటా బ్రేక్ రావటం. అందుకే ఇదేదో వినాశనానికే వచ్చినట్లుంది ఈ విపత్తు అని అనుకుంటున్నారు వీళ్ళు. ప్రపంచంలోనే వాహనాల రాకపోకలు గణనీయంగా తగ్గిపోవడం చేత అందులో పెట్రోలు కూడా ఎగుమతులు ఆగిపోవడతో వీళ్ళ భవిష్యత్తుతో పాటుగా ఈ అరబిక్ దేశాల్లో పనీపాటా చేసుకుని బ్రతుకులు వెళ్ళదీస్తున్న మా భవిష్యత్తు కూడా ప్రశ్నార్ధకంగా మారుతోంది.

ఇంతలో "ఏమ్మాయ్ లలితమ్మా ఎలా వున్నావు?" అంటూ క్రిందనుండి కేకేసింది వరమ్మ.

మసీదు ప్రాంగణాన్నంతా కడిగేసి అక్కడవున్న నీటిపంపు దగ్గర చేతులు కడుక్కుంటోంది వరమ్మ. కిటికీ వద్ద నిలబడ్డ నన్ను చూసి నోటి నిండుగా నవ్వుతూ ఆనందంగా పలకరించింది. నేనుండేది మూడో అంతస్తులో. కానీ బయట రణగొణధ్వనులు లేకపోవడంతో నాకు బానే వినిపించింది ఆమె గొంతు.

వరమ్మ తెలుగావిడే నరసాపురంనుండి వచ్చింది. ప్రతిరోజూ నా కిటికీకి ఎదురుగా వున్న మసీదు ప్రాంగణాన్ని ఊడ్చి నీళ్ళతో కడుగుతుంది. ప్రార్ధనకు వచ్చే కువైటు షేకులు రోజూ ఇచ్చే ఒకటీ రెండు దినార్లతో తిండి తిని కువైట్‌లో కాలక్షేపం చేస్తోంది. రెండేళ్ళకు ఒకసారి అక్కామా (వీసా) అయిపోగానే షేకులే ఎవరో ఒకరు దయదలచి క్రొత్త అక్కామా వేయిస్తుంటారు. రంజాన్ మాసంలో అయితే దానధర్మాలు చేసే రోజులు కాబట్టి అరబిక్ వాళ్ళు రోజుకు దాదాపు ఇరవై దినార్లవరకూ ఇస్తారంట.

అలా యాభై ఏళ్ళనుండీ కువైట్‌లో జీవితాన్ని గడుపుతోంది వరమ్మ. మొదట్లో వరమ్మ మసీదులో పనిచేయడం చూసి హిందూనో లేక ముస్లిమో అని నేను అనుకున్నాను. కానీ ఆదివారమయితే చాలు చక్కగా తయారయి బైబిల్ పట్టుకుని చర్చ్‌కి వెళుతుంది. నేను ఆశ్చర్యంగా చూస్తే నా ప్రశ్న అర్ధం చేసుకుని నిండుగా నవ్వుతూ

"లలితమ్మా హిందూ అయినా ముస్లిం అయినా క్రిష్టియన్ అయినా అందరు మనుషులే కదా దేవుని సృష్టే కదా. మసీదులో కానీ చర్చిలో కానీ దేవాలయంలో కానీ చేసేది ప్రార్ధనే కదా! మన హృదయాన్నీ ఆవేదనను దేవుడికే కదా నివేదించుకుంటాం. దేవుడొక్కడే

మనుషులే ఆయనను వేరు పరుస్తున్నారు"అంటూ అప్పుడప్పుడూ నాకు తెలియని సత్యాలను సర్వమత సారాంశాన్ని ఆమె నాకు బోధిస్తూంటుంది. అందుకే వరమ్మ అంటే నాకు ఇష్టం.

వరమ్మను చూడగానే నాకు సంతోషం కలిగి " . ఇదిగో ఇలా కిటికీలోంచి పక్షులతో మాట్లాడుతూ నేను బానే వున్నాను. కానీ ఇంతకుముందు ఇటువైపు నాలుగు అంబులెన్సులు వెళ్ళాయి. ఏంటో సంగతి అర్థంకావడంలేదు" అన్నాను. తనకు విషయం తెలిస్తే చెబుతుందని.

"మూడో అంతస్తునుండి మాట సరిగా వినపడడం లేదు వాట్సప్‌లో నుండి ఫోన్ చెయ్యి" అంది వరమ్మ.

"సరే" అని నేను వాట్సప్ కాల్ చేశాను.

"ఇప్పుడే మౌల్వీ చెప్పాడమ్మా. ఆ పై వీధిలో హ్వామా టవర్ దగ్గర నాలుగు కేసులు పాజిటివ్‌గా దొరికాయట. అందుకే ప్రొద్దుటే ఆ హడావిడి. మొత్తం రెండు బిల్డింగులూ ఖాళీ చేయించి జనాలందరినీ ఎడారిలోకి తోలుకెళ్ళారంట. ఏం మాయదారి రోగమో ఏం పాడో? కలికాలం పోయి కరోనా కాలం వచ్చింది. జనాలు అవతల చచ్చిపోతున్నారు. పీనుగుల్ని పూడ్చి పెట్టడానికి తావులేక గుంతలు తవ్వి అందర్నీ ఒకేసారి తోసి పూడుస్తున్నారట. ఏంటో? నువ్వు జాగ్రత్తమ్మోయ్ ఎవర్నీ నీ రూమ్‌లోకి రానివ్వకు. ముందే నానాజాతుల వాళ్ళు ఉంటారు మీ బిల్డింగ్‌లో."

"అదేంలేదులే. ఇక్కడ మా మేనేజ్‌మెంటు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నారు. నేను నా గదిలోనే ఉంటున్నా" అన్నాను.

"సరేకానీ మాలాంటి పనీపాటాలేని వాళ్ళను, అక్కామా లేని వాళ్ళను కువైట్ ప్రభుత్వం ఇంటికి పంపించేస్తోందంట. నిజమేనా?" అని అడిగింది ఆరాగా.

"నిజమే ముఖ్యంగా అక్కామా లేకుండా ఇల్లీగల్‌గా ఉంటున్న వారిని పంపించెయ్యాలనే యోచనలో ఉంది అని న్యూస్. మరి ఈ కరువుకాలంలో పరదేశస్తులని ఎంతమందిని పోషించగలరు వీళ్ళు. భారం దింపుకోవాలి కదా" అన్నాను బదులుగా.

"ఒకవేళ అందరినీ పంపిస్తే నువ్వూ ఇండియాకి పోతావా లలితమ్మా?" అంది దిగులుగా.

"ఎప్పుడెప్పుడా అని నేను ఎదురుచూస్తున్నాను వరమ్మా. కువైట్‌కి వచ్చి చాలా ఏళ్ళయింది కదా. ఇక చాలు వెళ్ళిపోదామనే యోచనలోనే ఉన్నాను నేను. మనదేశంలో, మన నేలపై కష్టమో, నిష్టూరమో కలో గంజో తాగి సంతోషంగా పడి ఉంటాము. ప్రాణం పోయేదేదో అక్కడే మన నేలపైనే పోతే మంచిది కదా" ఆవేశంగా అన్నాను నేను. (ఈ సబ్జెక్టు నాకు ఇష్టంగా ఉండి నాలోని ఆవేశాన్ని బయటకి తెస్తూవుంటుంది.)

"అవునా? నేను మాత్రం కువైట్ వదిలి పోనబ్బా. చస్తే ఇక్కడే చావాలి. నా కట్టెను ఈ మట్టిలోనే పాతిపెట్టాలి. అంత అవసరం అయితే చావనైనా చస్తానుగానీ ఇక్కడినుండి కదలను" ఖచ్చితంగా చెప్పింది వరమ్మ.

ఆమె మాటలకి ఆశ్చర్యపోయాను నేను.

"ఎందుకు వరమ్మా? ఏమయింది? మనదేశం మన కన్నతల్లిలాంటిది కదా! నువ్వు ఎందుకు ఇక్కడే ఉండిపోవాలనుకుంటున్నావు. నీ బాగోగులు చూడటానికి ఎవరున్నారిక్కడ?" బాధగా ప్రశ్నించాను నేను.

"ఇప్పుడు నా మనసు బాలేదు నీ ప్రశ్నలకు జవాబులు తొందరలో చెపుతాను" సరేనా అంటూ ఫోన్ కట్ చేసింది వరమ్మ.

రెండు రోజుల తరువాత ఫోను చేసింది వరమ్మ. "ఆరోజు నా మనసు బాగోలేక ఫోన్ కట్ చేసాను కానీ ఎందుకో నా కథ నీకు చెప్పకపోతే నా మనసు ఆగడంలేదు. నాది చాలా పెద్ద కథ. కానీ క్లుప్తంగా చెపుతాను విను" అంటూ తన కథ చెప్పడం మొదలుపెట్టింది వరమ్మ

"1971లో నా పదహారేళ్ళ వయసులో నేను కువైట్‌కి వచ్చాను. మా మేనత్త ఒకావిడ నాకు వీసా పంపించి నన్ను పిలుచుకుంది. పాస్‌పోర్టులో వయసు ఇరవైరెండు అని వేసారు. అప్పటికి ఇంకా చిన్నపిల్లనే. ఏ పనీ చేతకాదు నాకు. మా మేనత్త పనిచేసే కువైట్ ఇంట్లోనే చిన్నా చితకా పనులు చేసేదాన్ని. చిన్నదాన్ని కావడం వలన మా మామా, బాబా కూడా నాకు పెద్దగా పనులు చెప్పేవారు కాదు.

ఇక్కడికి వచ్చాక ఈ తిండితిని, ఈ నీళ్ళుతాగి నీడపట్టున ఉండేసరికి ఆపిల్ పండులాగా అందంగా తయారయ్యాను.

మా బాబా కన్ను నా మీద పడింది.

కన్నెపిల్లలంటే ఈ కువైటు బాబాలకు చాలామోజు. కానీ మా బాబా మాత్రం నాపట్ల అన్యాయంగా ప్రవర్తించలేదు. నేరుగా విషయాన్ని మా మేనత్తకు చెప్పి 'వరమ్మను నేను పెళ్ళిచేసుకుంటాను. నా రెండో పెళ్ళాంగా నేను ఉంచుకుని బాగా చూసుకుంటాను' అని చెప్పాడు.

మా మేనత్త బాగా ఆలోచించి 'ఏమే వరా! బాబా చాలా మంచివాడు. కాబట్టే నిన్ను లొంగదీసుకుని పాడుచేసే అవకాశం ఉన్నప్పటికీ మర్యాదగా పెళ్ళిచేసుకుంటాను అంటున్నాడు. కాదు కూడదు అంటే ఈ కువైటు బాబాలకు తిక్కరేగుతుంది. ఆ కోపంతో ఏమి చేసినా మనం తప్పించుకోలేం. కాబట్టి బాబాతో పెళ్ళికి ఒప్పుకోవడమే నీకు మంచిది' అని నన్ను ఒప్పించింది.

బాబా చాలా సంతోషించాడు. ఇస్లాం పద్దతి ప్రకారం ముస్లిం మగాళ్ళు నాలుగు పెళ్ళిళ్ళు చేసుకోవచ్చు కదా.

కానీ మొదటి పెళ్ళానికి చెప్పి ఒప్పించాలి. ఆయన వెళ్ళి భార్యకు విషయం చెప్పాడు.మామా అస్సలు ఒప్పుకోలేదు. 'దాన్ని చేసుకుంటే ఆ అరేబియా సముద్రంలో దూకి చస్తాను' అని ఏడ్చింది.

అప్పటికే ఆయన నామీద పిచ్చి ప్రేమను పెంచుకున్నాడు. అపుడపుడూ చాటుగా మాటుగా నాతో మాట్లాడుతుండేవాడు.

నేనుకూడా అప్పటికి చిన్నదాన్ని. పురుషుణ్ణి ఎరుగని దాన్ని కావడంతో ఆయనే నా తొలి పురుషుడు కాబట్టి హృదయాన్ని ఇచ్చేసాను. ఇక పెళ్ళిచేసుకోలేని పరిస్థితుల్లో నన్ను తీసుకెళ్ళి బయట ఒక ఇల్లుచూసి అందులో ఉంచాడు. నన్ను ఇండియాకు పంపేసానని మామాతో అబద్దం చెప్పాడు.

తరువాత ఆయన నన్ను ప్రాణంతో సమానంగా ప్రేమించాడు. నేనుకూడా ఆయనను దేవుడిగా భావించి ఆయనే లోకంగా జీవించాను. ఎపుడు కూడా నాకు దేనికీ కొదవ చేయలేదు. అన్ని విషయాల్లోనూ భార్యలాగే ప్రేమించాడు మహానుభావుడు.

నాకుకూడా ఆయనకు మించి వేరే ప్రపంచం కంటికి కనబడలేదు. అన్నీ మరిచిపోయి ఆయనలోనే మునిగిపోయాను. ఇక ఇండియాను నావాళ్ళని కూడా మరిచిపోయాను. మా అమ్మా నాన్నలు నా చిన్నతనంలోనే చనిపోయారు. ఒక అన్నవుంటే పెళ్ళిచేసుకుని నరసాపురంలోనే ఉన్నాడు. అపుడపుడూ ఫోన్ చేసి పలకరిస్తాడు అంతే.

నాతో పిల్లలు కనాలని చాలా తాపత్రయపడ్డాడు ఆయన. కానీ నాకెందుకో పిల్లలు పుట్టలేదు. అలా దాదాపు ముప్పై సంవత్సరాలు కలిసి జీవించాం. ఇండియాకు పోయి 'మీ అన్నను, బంధువులనూ' చూసి రమ్మని చెప్పేవాడు. కానీ నేనే ఆయనను వదిలి నెలరోజులు ఉండలేక 'వద్దు నేను నిన్ను విడిచి పోలేను' అనేదాన్ని.

చివరిరోజుల్లో ఆయనకు ఎందుకో మతిస్థిమితం కలిగి నన్ను గుర్తుపట్టలేకుండా అయిపోయాడు. భార్య, పిల్లలు మతిలేనివాడిని ఇక బయట తిరగనివ్వకుండా ఇంట్లోనే ఉంచేసారు. ఒక విధంగా బంధించేసారు. అప్పటిలో ఇలా ఫోన్లు ఉండేవి కావు కదా. నేను గుర్తొచ్చినప్పుడు పక్కింట్లో ఉన్న లాండ్ లైన్‌కి ఫోన్ చేసి మాట్లాడేవారు. నన్ను చూడాలని చెప్పి చాలా బాధపడేవారు. అలా నేను ఒంటరిగా మిగిలిపోయి ఉన్న ఇంటికి బాడుగ కట్టుకోలేక ఖాళీచేసి తెలిసిన వాళ్ళుంటే వాళ్ళ దగ్గర ఒక పంచలో మంచం వేసుకునే స్థలాన్ని బాడుగకు తీసుకుని కాలంగడపసాగాను.

అంతవరకూ ఏ పనీ చేయడం నాకు చేతకాదు. సుఖంగా మహరాణిలా బ్రతికాను. సడన్‌గా ఏం చేసి బ్రతకాలో అర్ధంకాలేదు. ఇలా జరుగుతుందని ఎప్పుడూ ఊహించలేదు కాబట్టి ఇక్కడ కానీ ఇండియాలో కానీ ఆస్తులు కూడా సంపాదించుకొలేదు నేను. ఆ ఆలోచనే ఎప్పుడూ రాలేదు. నా ఒంటిపైన ఉన్న కాస్త బంగారాన్ని అమ్ముకుని కొన్నియేళ్ళు తిండి, ఖర్చులకు పెట్టుకుంటూ గడిపేసాను.

ఇలా వున్నా కూడా ఆయనే నా మనసులో మెదులుతుండేవాడు. ఆరాటాన్ని ఆపుకోలేక అప్పుడప్పుడూ వెళ్ళి ఆ యింటి చుట్టూ తిరిగి వచ్చేదాన్ని. కనబడితే ఆయనను ఒకసారి కంటితో చూడాలని ఆశ.

ఇక తట్టుకోలేక ఒకరోజు ధైర్యంగా సరాసరి ఇంటిలోపలికే వెళ్ళిపోయాను. అప్పటికే ఆయన మంచంలో అవసానదశలో ఉన్నాడు. కళ్ళతో నన్ను చూసి సంతోషించాడు. మాట సరిగ్గా రాకపోయినా నన్ను గుర్తుపట్టాడని మెరిసిన ఆ కళ్ళే నాకు చెప్పాయి. అంతే. అదే ఆఖరు. నన్ను చూడటానికే తన ప్రాణాన్ని నిలుపుకుని ఉన్నాడేమో అన్నట్లుగా తరువాత పదిరోజులకే చనిపోయాడు. ఎన్నోరోజులు ఆయననే తలుచుకుంటూ ఏడ్చుకుంటూ అదే ధ్యాసలో గడిపేసాను. ఎవరూ నాకు మిగల్లేదు. ఏదీనాకు లేదు. కానీ ఆయన జ్ఞాపకాలు మాత్రం నాకు ఊపిరి పోస్తున్నాయి.

ఆయన కలిసిపోయిన ఈ మట్టిలోనే నేనూ కలిసిపోవాలని నా కోరిక. అందుకే కష్టమైనా సరే చిన్నా చితకా పనులు చేసుకుంటూ ఇక్కడే జీవితాన్ని గడుపుతున్నాను. కాలాన్ని ముందుకు నెడుతున్నాను. ఎవరో ఒకరు నీలాంటివాళ్ళు దయతలచి ఇచ్చే ఒకటీ అరా దినార్లు నా పోషణకు రోజులు గడవడానికి సరిపోతున్నాయి.

ఇండియాకు ఎందుకు వెళ్ళాలి? నాకోసం ఎవరున్నారక్కడ? నా భర్త ఇక్కడే ఉన్నాడు. నా ప్రాణం ఆయన కోసమే ఉంది. ఆయన నాతో ఎపుడూ మాట్లాడుతూనే ఉంటాడు. నాతోనే ఉన్నాడు. ఒకవేళ ఇండియా వెళ్ళినా ఒకరోజు కూడా అక్కడ బ్రతకనేమో? నా ప్రాణం ఇక్కడే ఈ కువైట్ దేశంలోనే మా ఆయన దగ్గరే కదలాడుతూ ఉంటుంది" ఇప్పుడు చెప్పు నా ఉద్దేశం మంచిదో చెడ్డదో తన కథంతా చెప్పి ప్రశ్నించింది వరమ్మ.

"ఇంత విన్నాక ఏం చెప్పను వరమ్మా? హృదయాన్ని కరిగించే కథ చెప్పావు. నీవెనక ఇంత కథ ఉందని నాకు తెలియలేదు. నీ పట్టుదలకు ఆశయానికి నా అభినందనలు. నిన్ను మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నాను. నీకు ఏ సహాయం అవసరమైనా బిడ్డలాగా నేనున్నానని నువు మరిచిపోకు. నువ్వు జాగ్రత్త" అని చెప్పి భారమైన హృదయంతో ఫోన్ కట్ చేసాను నేను.

ప్రతిరోజూ వరమ్మ జీవితగాథ మదిలో మెదులుతూ నన్ను వెంబడిస్తూనే ఉంది. అందుకే వారానికి ఒకసారైనా ఫోను చేసి నేను పలకరిస్తుంటాను.

ఆమె నేను కిటికీ తెరిచిన ప్రతిసారీ క్రిందనుండి కేకేసి నన్ను పిలుస్తూ ఉంటుంది. ఆమెను నేను, నన్ను ఆమె చూసినప్పుడల్లా తెలియని సంతోషం మా ముఖాల్లో.

ఎడారి అనుబంధాలు మావి. ఒకరికొకరం అలసిన జీవితాల్లో ఆప్యాయతను పంచుకునే ఒయాసిస్సులమే.

## *కరోనా కష్టాలు*

**చిన్న** దగ్గొచ్చినా, తుమ్మొచ్చినా భయపడిపోయే రోజులివి. కాలం కరోనా రూపంలో కక్షకట్టి కాటేస్తోంది. కష్టాల వెల్లువలో మనుషులను ముంచెత్తుతోంది. మనిషికి మనిషి కనీసం ఆరడుగుల దూరంలో ఉండాలట. కానీ అక్కడ మాత్రం అలా లేదు. జనాలు ఒకరిమీద ఒకరుపడి తోసుకుంటున్నారు. అక్కడి పరిస్థితి ఎంతో ఘోరంగా ఉంది.

అది కువైట్‌లోని విదేశీ రాయబార కార్యాలయం.

మిట్టమధ్యాహ్నం. ఎడారి ఎండ మనుషులను మాడ్చేస్తోంది. దానికి తోడు ఊపిరాడకుండా మూతికి బిగించికట్టుకున్న మాస్కులు. సమయం కరిగి మూడవుతోంది. వేడికి చెమటలు కారిపోతున్నాయి. కువైటు ఆకాశంలోని సూర్యుడు వారి వైపు తీక్షణంగా చూస్తున్నాడు. అయినా వాళ్ళు భయపడలేదు. వెనుదిరగలేదు. చావో రేవో తేల్చుకోవాలన్నంత పట్టుదలతో నిలబడివున్నారు. సూర్యుడితో అయినా సరే యుద్ధం చేసి గెలుస్తాం అనే ధీమా వారిలో కనబెడుతోంది.

వాళ్ళకి ఇల్లులేదు. వాకిలీ లేదు. తలదాచుకోవడానికి స్థలమూ లేదు. తమకున్నవన్నీ బ్యాగ్గుల్లో సర్దుకుని సామాన్లన్నీ తమతోపాటు తెచ్చేసుకున్నారు. అక్కడే ఆ రోడ్డుమీదే చైనా గోడంత పొడవున్న క్యూలో బ్యాగులన్నింటినీ పెట్టుకుని తమవంతుకోసం నిరీక్షిస్తూ కూర్చున్నారు.

విదేశీ రాయబార కార్యాలయంలో తమ పేర్లు కన్‌ఫర్మ్ చేసుకుని పాస్‌పోర్ట్‌లో స్టాంపు వేయించుకుంటేనే ఇండియా వెళ్ళడానికి విమానంలో సీటు దొరుకుతుంది. లేకపోతే వీసాలేకుండా అక్రమంగా ఈ కువైటులో పడి చావాల్సిందే ముందే ప్రస్తుతం ఇక్కడ పరిస్థితులు బాలేవు. కరోనా కువైటు దేశాన్ని కూడా కల్లోలం చేస్తోంది. అందుకే కువైటు ప్రభుత్వం అక్రమంగా నివసిస్తున్న పరదేశస్తులందరినీ తొందరగా వారి దేశాలకు వెళ్ళిపొమ్మని నోటీసులు జారీచేసింది.

వెళ్ళేవారికి ఉచితంగా విమానసౌకర్యాన్ని కల్పిస్తామనీ చెప్పడంతో ఆయాదేశాల వాళ్ళు వారి ఎంబసీద్వారా పేర్లు నమోదు చేసుకుని ఏప్రిల్ మాసంలోనే చాలావరకూ వెళ్ళిపోయారు. పిలిప్పీన్స్, ఈజిప్షియన్సు బంగ్లాదేశీలు విమానాలు వారికిచ్చిన గడువులో సక్రమంగా వెళ్ళిపోయాయి. కానీ భారతదేశంలో లాక్ డవున్ ఉండటంతో ఇక్కడి విమానాలకు అనుమతి ఇవ్వకపోవడంతో పాపం ఇండియన్స్ ఇక్కడే చిక్కుకుపోయి ఇబ్బందులు పడుతున్నారు. దానికి తోడు ఇండియన్ ఎంబసీ వీరి లిస్ట్‌ను ఇవ్వడంలో ఆలశ్యం చేసింది. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితిలో వీరందరి బ్రతుకులూ బ్యాగులతో సహా రోడ్డున పడ్డాయి. ఆదుకునే నాథుడు ఒక్కడు కూడా కంటికి కనపడలేదు. క్యూలోనే మూడురోజుల్నుండీ కాలం గడుపుతూ అక్కడే బ్యాగులపైనే తలవాల్చి కునుకుతీస్తున్నారు. సమయం మూడుగంటలు దాటిపోతోంది. అసలే రంజాన్ రోజులు. బయట బహిరంగంగా ఏవీ తినకూడదు. తాగకూడదు. గొంతెండిపోతుంటే ప్రాణాలు ఉగ్గబెట్టుకుని క్యూలో కూర్చుని ఉన్నారు వాళ్ళు.





అంతలో బ్యాగు భుజానికి తగిలించుకుని అక్కడికి వచ్చింది ఒక పిల్ల. అంతా నాదేనన్నట్లుగా చలాకీగా అటూ ఇటూ నాలుగుసార్లు తిరగేసింది. చేతిలోని సెల్‌ఫోనుతో అందరినీ టకటకా నాలుగు ఫోటోలు తీసింది. ఫోను చేసి ఎవరితోనో గట్టిగా మాట్లాడింది. తరువాత వీళ్ళ దగ్గరికి వచ్చి "ఇండియా ఎంబసీ ఏజంటుకి ఫోను చేసి మన ఫోటోలు పంపించాను. కనీసం తిండీ, నీళ్ళయినా అందించమని అడిగాను. ఇక అన్నీ వస్తాయి చూడండి" అంటూ తలెగరేసింది.

నీలాంటి వాళ్ళని చాలామందిని చూసాంలే అన్నట్లుగా ఆ పిల్లమాటలు నమ్మలేదు వాళ్ళు. నోటికి మాస్కులు కట్టుకున్నా కూడా మాటలు ప్రవహిస్తున్నాయి అక్కడ. కష్టసుఖాల కలబోత. ఎడారి బ్రతుకుల వడబోత జరుగుతోంది.

"మన తెలుగువాళ్ళే దాదాపు లక్షమంది అక్రమంగా కువైట్‌లో ఉన్నారంట తెలుసా?" కళ్ళు తిప్పుతూ చెప్పింది ఆ పిల్ల అక్కడే వున్న సుబ్బమ్మతో.

"ఆ..అవునా? లక్షమందే? ఇంతమందిని ఇప్పుడు విమానాల్లో పంపించాలంటే కష్టమే కదా" ఆశ్చర్యంతో ప్రశ్నించింది సుబ్బమ్మ.

"ఇంకా ఎక్కువే ఉండచ్చు. పేర్లు నమోదు చేసుకున్నవాళ్ళు మాత్రమే లక్షమంది. ఇంకా ఎంతమంది బయటికి రాకుండా దాక్కుని ఉన్నారో? మనదేశంలో లాక్ డవున్ ఎత్తేసేంత వరకూ మనకు ఈ బాధ తప్పదు. లేకపోతే ఈపాటికి మనం మనదేశంలో ఉండేవాళ్ళం" చెప్పి నిట్టూర్చింది లక్ష్మి.

"ఇక్కడ ఈ కార్యాలయం రోజుకు మూడు గంటలే తెరుస్తున్నారు. నాలుగు రోజుల్నుండీ ఇక్కడ పడికాపులు పడినా పనిమాత్రం కావడం లేదు. అసలే కర్ఫ్యూ మొదలయింది. వీళ్ళకి రంజాన్ మాసం. ఉపవాసాలు. ఈ ఎండకి గొంతెండిపోతున్నా కూడా మంచినీళ్ళు తాగడానికి కూడా వీల్లేదు" బాధ పడ్డాడు నరసయ్య నుదుటనున్న చెమటను తుడుచుకుంటూ.

"ఓయ్యో నరసయ్యా నువ్వు ఎర్రోడివా ఏంది? నిన్నెవడు నీళ్ళు తాగొద్దన్నాడయ్యా. మన బ్యాగులు అడ్డంపెట్టుకుని మనుష్యుల వెనుక నిలబడి ఇన్ని నీళ్ళూ గటగటా తాగెయ్యబ్బా. రంజాన్ అయితే ఏమి? ఇక్కడకొచ్చి ఏ పోలీసోడు చూస్తాండాడు నిన్ను? కువైటులో పోలీసోళ్ళందరూ కరోనా కర్ఫ్యూలో కాపలాకు బిజీ అయిపోయారు లేబ్బా" అన్నాడు శేఖర్ అనే రాజంపేట పిల్లోడు.

"అబ్బీ నువ్వు చెబుతావుగానీ తాగడానికి నీళ్ళు ఎక్కడున్నాయి? ఇచ్చేదిక్కు ఎవరున్నారు చెప్పు? ప్రొద్దుట్నుంచీ ఇక్కడే క్యూలో కాలబడి ఉన్నాను. ఒళ్ళు ఉడుకెక్కిపోతోంది. ఊరికి చేరకముందే ఇక్కడే చచ్చేట్టుగా ఉండాదిపో అన్నాడు" వేడికి తట్టుకోలేక పేపర్‌తో విసురుకుంటూ నరసయ్య.

"ఓయ్యో నీ దగ్గర నీళ్ళు లేకపోతే ఎవరినైనా అడగాల కదా? మేము ఇస్తాం కదా. ఇంకొద్దిసేపు ఇలాగే వుంటే గొంతుఎండిపోయి చచ్చిపోయేటిగా వుండావు. ఇదిగో" అంటూ ఖాళీ పెప్సీ బాటిల్‌లో నింపిన నీళ్ళు చేతికి అందించాడు శేఖర్.

నీళ్ళు చూసి ప్రాణం లేచి వచ్చింది నరసయ్యకు. అపురూపంగా నీళ్ళ బాటిల్ అందుకున్నాడు.

ఈలోగా ప్రొద్దు గ్రుంకడంతో రంజాన్ ఉపవాసపు వేళ ముగిసినట్లుగా మసీదులోని మైకునుండి అల్లా హు అక్బర్ అంటూ మౌల్వీగారి అజాన్ వినిపించింది.

ఇంతలో చలాకీగా తిరిగే పిల్ల ఈసారి ఆహారం పొట్లాలతో నీళ్ళ బాటిళ్ళతో ఉన్న ట్రాలీని తోసుకుని వచ్చి అందరికీ ఆహారాన్ని పంచిపెట్టసాగింది.

"హమ్మయ్య తినడానికి తిండి దొరికింది. బ్రతికాము. ఈ పిల్ల ఎవరోకానీ అసాధ్యురాలే. ఝాన్సీలక్ష్మీబాయిలా పోరాడి మనకు తిండి, నీళ్ళు తెప్పించిందబ్బా" అన్నాడు నరసయ్య ఆనందంగా.

"ఎంబసీవాళ్ళు ఇక ప్రతిరోజూ రెండుపూటలా మనకు అన్నం పంపిస్తారు. భయంలేదు" అంది ఆ పిల్ల.

ఇంకేముంది? అన్నంతింటూ అందరూ ఆ పిల్లను పొగడటమే. అక్కడ ఆ సమయంలో ఆ అమ్మాయ్ అందరి కళ్ళకి హీరోయిన్‌లాగా కనిపించసాగింది. "ఓ అమ్మాయ్. మగాళ్ళెవరూ చేయలేని పనిని నువ్వు పదినిముషాల్లో చేసావు. ఇంతకీ నీ పేరేంటే పిల్లా?" అని అడిగింది సుబ్బమ్మ ఆప్యాయంగా.

"పేరుదేముందిలే అత్తమ్మా మీ కడుపులు నిండితే అంతే చాలు నాకు. ఈ రాత్రికి మనందరం ఈ ప్రక్కనే వున్న స్కూల్లో ఉండటానికి పర్మిషన్ కూడా సంపాదించాను. నేనున్నాను కదా ఇక మీరు ఏ దిగులుపడకుండా సంతోషంగా ఉండండి" అంది ఆ పిల్ల తనూ తిని చేయి కడుక్కుంటూ.

"ఎవరోగానీ ఈ పిల్ల భలే ఉషారుగా ఉండాది సుబ్బమ్మా అత్తమ్మా అంటూ వరస కూడా కలిపేసిందిగా నీ కొడుక్కి చేసుకో ఊరంతా జయించుకుని వస్తాది" అంటూ సలహా ఇచ్చింది వెంకటమ్మ.

"హా.. ఏం కులమో? ఏం పాడో కులంగాని పిల్లను చేసుకోలేము కదా" అంది సుబ్బమ్మ.

"ప్రపంచమంతా కరోనా వచ్చి అల్లాడుతుంటే ఇంకా ఈ టైములో కూడా నీకు కులమూ మతమూ కావలసి వచ్చాయా? పిల్ల బంగారంలా వుండాది. మళ్ళీ దొరుకుతాదా ఇట్టాటి పిల్ల చెప్పు?" అడిగింది వెంకటమ్మ.

"నీకేమమ్మా చెపుతావు. మాకు పట్టింపులు ఉంటాయి కదా. కరోనా వచ్చినంతమాత్రాన కులాన్నీ, మతాన్నీ మరిచిపోతామా? ప్రాణం పోయినా అన్నీ కరెక్టుగా చూసి పెళ్ళి చెయ్యాల్సిందే పెళ్ళంటే తమాషానా ఏంది? పెళ్ళంటే నూరేళ్ళపంట" అంది సుబ్బమ్మ.

"ఇట్టాంటి కరోనాలు వంద వచ్చినా మనుషులు మారరు. అంతే" అంటూ వెంకటమ్మ లేచి మరో ప్రక్కకి పోయింది నవ్వుకుంటూ.

"ఓమ్మా మాటలు ఆపి మీరు ముందుకు కదలండి. ఈ క్యూలోనే పెళ్ళి సంబంధాలు మాట్లాడి పెళ్ళి చూపులు చూసేసి పెళ్ళిళ్ళు ఇక్కడే చేసేట్టుగా ఉండారే మీరు. బ్రతికితే చాలురా బగమంతుడా అని మేము అల్లాడతావుంటే మీ గోల మీది" అంటూ అరిచాడు వెనకనుండి సుబ్రమణ్యం.

"రాత్రికి ఎక్కడ పడుకోవాలో ఏమో మూడురోజుల్నుండీ రోడ్డుమీదే కాలం గడుపుతున్నాం. స్నానాలు లేవు, పానాలు లేవు. స్నానాలు చెయ్యక అందరిదగ్గరా చెమట కంపు వస్తోంది. ఎన్ని రోజులు ఇట్టా బ్రతకాల? రండిమా అంటే అన్నీ సర్దుకుని వున్నచోటు ఖాళీ చేసి బ్యాగులు ఎత్తుకొని వచ్చేసినాము. ఇప్పుడు మన ఎంబసీవాళ్ళు ఒక్కరూ కనబడలేదు. కష్టం కదా? ఇలా ఎండలో నిలబెట్టి చంపేస్తారా ఏంది? " అని తన గోడును వెళ్ళబోసుకుంది ధనమ్మ.

"నువ్వు ఎంత బాధపడినా ఏమీ చెయ్యలేము. అక్కడ ఇండియాలో లాక్ డవున్ ఎత్తాల. ఇక్కడ కువైట్‌లో విమానాలు కదలాల. అప్పటిదాకా మన బ్రతుకింతే. కువైటోడు అడిగినపుడు మన ఇండియావోడు మర్యాదగా విమానాలకు పర్మిషన్ ఇయ్యాలగదా? మనోళ్ళదే తప్పు. ఇంగ ఎవర్ని అని ఏం లాభం?" సముదాయించింది జయమ్మ.

"ఏమయ్యా శేఖరా పెద్దపెట్టి అడ్డంగా పెట్టి దానిమీద పండుకున్నాడు అక్కడెవరో పెద్దమనిషి. పోయి ఒకసారి లేపు. ఈ క్యూ ముందుకు కదలాలి కదా" కేకలేసాడు సుబ్రమణ్యం.

"ఇంతకీ ఇదంతా చైనావోడి పనేనంటావా అబ్బీ? అందరినీ దెబ్బతీయాలని మంచి ప్లాను వేసాడంట గదా?" ఆరాగ సుబ్రమణ్యంను అడిగాడు నరసయ్య.

"అంతేగదా గబ్బిలాలను తిని రోగాలను ప్రపంచం మీదకి వదిలినారు. నాయాల్ది ఏ మాంసమైనా సరే వదలకుండా తినే వెధవలంటయ్యా వాళ్ళు. ఇష్టమొచ్చిన చోటికి సంతోషంగా తిరుగుతావుంటిమి. ఈ విపత్తు వచ్చి పడినాక అన్నీ బంద్ అయిపోయినాయి. మూతికి కూడా గుడ్డకట్టుకుని నోరుమూసుకోవల ఇంగ. జరిగిన నష్టం కష్టం ఎవరికి చెప్పుకోవాల? ఎవరు బాధ్యులు? చాలామంది ఈ కువైటులో ఉద్యోగాలు పోయి బాధపడతండారు. వాళ్ళంతా ఇంటి బాడుగలు ఎలా కడతారు? కడుపుకు ఏమి తింటారు? కొన్ని కంపెనీలు జీతాలు ఇవ్వకుండా ఎగనామం పెట్టేసినాయి. పాపం ఎక్కడివాళ్ళక్కడ చిక్కుబడిపోయి ఈ వైరస్ భయంతో ఎలా బ్రతుకుతారు? ఆ చైనావోడికి మనందరి ఉసురూ తగిలి నాశనమైపోతాడు చూస్తూవుండు" ఆవేశంగా చెప్పాడు సుబ్రమణ్యం.

"నిజమేనబ్బా ఇండియాలో వలసజీవులకు కష్టాలు ఇక్కడ కువైట్‌లో మనకూ నష్టాలు. అప్పులు చేసుకుని ఇంతదూరం వచ్చినాము. నాలుగు దినార్లు సంపాదించుకోవాలని ఆశపడినాము. కానీ ఇప్పుడు ఉన్నట్టుండి ముంచుకొచ్చింది ఈ ముప్పు. ఇంటికి పోయి అప్పులు ఎలా తీర్చుకోవాల? పెళ్ళాం బిడ్డల్ని ఎట్లా పోషించుకోవాల? ఆలోచనచేస్తే తలకాయ నొప్పి వస్తాంది ఏం చెయ్యమంటావు?" తలపట్టుకున్నాడు నరసయ్య.

"ఏం చేస్తామయ్యా? నిండామునిగాక చలి వుండదు కదా. పెళ్ళాం బిడ్డల సంగతి దేముడెరుగు ఇక భూమ్మీద బ్రతికేది కష్టమే. మనిషిని మనిషే శత్రువులాగ చూస్తుంటే ఎట్టబ్బా బ్రతికేది? ఎందుకులే పాడుజీవితం ఇంట్లో కూర్చుని పంజరంలో సిలకలా బిక్కుబిక్కుమంటూ భయపడతా బ్రతకాలంటే ఎట్టా? ఎన్ని రోజులు ఇట్టా? ఒక్క నెల జూసినాం. రెండు నెలలు ఓపిక పట్టినాం. రోజురోజుకూ పెరుగుతాందేగానీ ఎక్కడా ఆగేటట్టు కనపడలేదే ఈ మాయదారిరోగం? దానికితోడు పెద్దపెద్దోళ్ళు చేతులెత్తేసి దాంతో సహజీవనం చెయ్యాల్సిందే అని తేల్చి చెప్తాండారు. వాళ్ళకేం? ఏసి రూములో కూర్చుని మూడుపూటలా తింటూ ఎన్నైనా చెపుతారు. మధ్యలో అటూ ఇటూ కాకుండా చచ్చేది మనబోటివాళ్ళమే కదా" లోపల దాచుకున్న కోపాన్ని బయటికి వెళ్ళగక్కాడు శేఖర్.

"సరేగానీ ఓ శేఖరా! ఇంతకీ బ్యాగు తగిలించుకుని సెల్‌ఫోను చేతిలో పట్టుకుని ఫోటోలు తీసిందే, మనకు తిండి తెప్పించి పెట్టిందే ఆపిల్ల ఎవురబ్బా? ఏ ఊరంటావు? పిల్ల బలే ఉషారుగా లీడరు మాదిరి మట్లాడతాందిబ్బా" ఆసక్తిగా అడిగాడు అక్కడే వున్న వెంకటయ్య

"ఆ పిల్లది కడప అంటన్నా. కువైటోడు నాలుగునెలలు పనిజేయించుకుని జీతం ఇయ్యకపొయ్యేసరికి తప్పించుకుని బయటపడి వాడిమీదే కేసుపెట్టిందంటన్నా. ఎంత ధైర్యమో చూడు. పిల్ల గుండెలు దీసిన బంటులా ఉంది. వాడు ఊరికే ఉంటాడా? అబద్దపు కేసులు రెండు ఈ పిల్లమీదనే పెట్టి రెండేళ్ళు జైలులో వేస్తే విడుదలయ్యాక మన ఎంబసీకి వెళ్ళింది. ఎంబసీవాళ్ళు కొన్నినెలలు ఏదో చిన్న పని చూపించినారు. అలా కొద్దిరోజులు కాలం గడిపి ఇపుడు ఇక్కడ ఇంక చేసేదేమీలేక ఇంటికి వెళ్ళిపోవాలని అనుకుంటోంది" అని వివరించాడు శేఖర్.

"అయ్యో పాపం అలాగా. ఇక్కడున్న వాళ్ళందరి బ్రతుకులూ అంతేలే. ఏదో ఒక కథ ప్రతిఒక్కరిదీ." ఏం చేస్తాం ఇక్కడికి వచ్చాక తప్పదుగా చెప్పాడు వెంకటయ్య.

ఇంతలో ఇండియా ఎంబసీ ఏజంటును తీసుకుని వచ్చిన ఆ పిల్ల "ఈ రోజు టైమయిపోయింది ఆఫీసు మూసేసారు. అందరూ లేచి మీ బ్యాగులన్నీ తీసుకుని ఈ ప్రక్కనే వున్న స్కూల్లోకి పదండి. విమానాలు ఎగిరేంతవరకూ అదే మనకు నివాసం. ఎలాగో కాలం గడపాలి మనం" అంటూ అందరికీ గట్టిగా అరిచి చెప్పింది.

లేని శక్తిని అరువు తెచ్చుకుని ఇక తప్పదు కాబట్టి అందరూ లేచి సంచులన్నీ చేతపట్టుకుని స్కూలు లోపలికి పోయినారు.

అన్నిపనులూ పూర్తయి ఇండియాలో లాక్ డౌన్ ఎత్తేసాక కువైట్ వాళ్ళు విమానాల్ని కదిలించేవరకూ అందరూ అక్కడే నిలిచిపోయారు. ఆ ఒక్క స్కూలేకాదు చాలా స్కూళ్ళు వీళ్ళందరితో నిండిపోయాయి. వీరికి ఆశ్రయమిచ్చి ఆదుకున్నాయి.

ఇప్పటికి నాలుగు విమానాలు మాత్రమే ఇండియాకు వెళ్ళినాయంట. లిస్ట్‌లో ముందున్న వాళ్ళ పేర్లు చూసి ఆ వరస ప్రకారం ముందుగా ఎక్కించి పంపేసారు. ఇంకా చోటులేక చాలామంది నిలిచిపోయి అక్కడే కష్టంగా కాలం గడుపుతున్నారు.

"ఓ అమ్మాయీ నీ పేరేందో నాకు తెలియదుగానీ మా అందరినీ ఆదుకుని నువ్వు మంచి పనులు చేసావమ్మా. ముందుగా వెళ్ళే విమానంలో నువ్వు వెళ్ళు తల్లీ" అంది లక్ష్మి ఆ పిల్లవైపు కృతజ్ఞతగా చూస్తూ.

"నా పేరు ఝాన్సీ ఆంటీ. పేరుకు తగినట్లే ఉంటాయి నా పనులు కూడా. దేనికీ భయపడటం నాకు తెలియదు. ప్రాణం పోయిందాకా పరిస్థితులతో పోరాడి జయించడమే నాకు తెలుసు.

మీ అందరినీ ముందుగా పంపించినాకే నేను వెళతాను. అంతవరకూ ఇక్కడ అన్ని విషయాలూ మాట్లాడటానికి మీ మంచీ చెడ్డా చూడటానికి నేనుండాలి కదా. నేనైతే ఇండియా ఎంబసీ వాళ్ళతో మాట్లాడి అన్ని పనులూ చెయ్యగలను, మీ అవసరాలను చూడగలను. మీ అందరూ సంతోషంగా ఉంటే అదే నాకు ఆనందం" అంది ఝాన్సీ నవ్వుతూ.

"మా తల్లే ఎంత మంచిదానివి నువ్వు. నువ్వు నిజంగా ఝాన్సీ లక్ష్మీబాయివే. మా లాంటివాళ్ళని కాపాడటానికి నీలాంటివాళ్ళు నూటికి ఒక్కరైనా ఉండాలమ్మా. నిజమే నువ్వు మాతోపాటు వుంటే మాకు కొండంత అండగా వుండి ధైర్యాన్ని కలిగిస్తావు.

ఏ తల్లి నిను కన్నదోగానీ ఆ తల్లికడుపు చల్లగా ఉండాల. మా ఆయుష్షు కూడా పోసుకుని నువ్వు నిండు నూరేళ్ళు పిల్లాపాపలతో సంతోషంగా ఉండాలి తల్లీ" అంటూ ఆనందబాష్పాలతో ఆశీర్వదించారు లక్ష్మి, సుబ్బమ్మ, వెంకటమ్మ.

అక్కడున్న వారందరూ కూడా ఆ పిల్ల మాటలకు మురిసిపోయి ఝాన్సీ లక్ష్మీబాయికీ జై అంటూ జేజేలు పలికారు.

"భయపడకండి. నిరాశ చెందకండి. అందరం ఆశతో వేచి చూద్దాం. ఈ కరోనా కష్టాలు వీడిపోవడానికి అందరి బ్రతుకులూ కుదుటపడటానికి మనందరం కలిసి ఆ దేవుణ్ణి ప్రార్థిద్దాం. మంచి రోజులకోసం మనమందరం ఇండియాలోని మన ఇళ్ళకు క్షేమంగా చేరేవరకు కలిసికట్టుగా ఈ కరోనాతో పోరాడదాం" అంటూ అందరిలో ఉత్సాహాన్ని నింపుతూ పిడికిలి బిగించింది ఝాన్సీ.

## కఠినమైన కరోనా మరణాలు

**అది** కువైటు పట్టణానికి దూరంగా వంద కిలోమీటర్ల దూరంలోని ఎడారి ప్రాంతం. ఎవరి పాపాలను మోయడానికో - ఎవరి శాపాలను భరించడానికో ప్రత్యేకించబడినట్లుగా వుంది ఆ ప్రదేశం.

అక్కడక్కడా మొలిచిన పిచ్చిమొక్కల్ని ఎడారి పొదల్ని తీసేసి ఆ ప్రాంతాన్ని బాగా చదును చేసారు. అక్కడ వరుసగా ఆరడుగుల పొడవున ఐదడుగుల లోతులో గుంతలను త్రవ్వి ఉంచారు. ఆ ప్రాంతమంతా ఎంతో విషాదాన్ని నింపుకుని విలపిస్తున్నటుగా ఉంది. నిశ్శబ్దాన్ని నింపుకుని నిర్మానుష్యంగా ఉంది. అప్పుడప్పుడూ వచ్చిపోయే అంబులెన్సుల శబ్దం తప్ప ఆ పరిసరాలన్నీ ఒక విధమైన శోకంలో మునిగిపోయి ఉన్నాయి. అవును మరి. ముందైతే మరణాలకు పూలతో, కన్నీళ్ళతో మంచి వీడ్కోలు ఉండేది.

కానీ ఇప్పుడు కరోనా మరణాలకు చివరిచూపులూ లేవు. కడసారి వీడ్కోలు సమాగమాలు లేవు. దిక్కులేని అనాధ శవాలకంటే దారుణంగా కుళ్ళిపోయిన జంతువుల కళేబరాల మాదిరి ఆ గోతుల్లో దొర్లించేసి మట్టి పోసేస్తున్నారు. అయినవారికి కూడా చివరి చూపు దక్కడంలేదు. ఎవరూ దగ్గరికి వెళ్ళడానికే లేదు. ఇలాంటి వింతలు విడ్డూరాలూ కళ్ళతో చూస్తామని ఏనాడైనా అనుకున్నామా? కాలం ఇంత కఠినంగా కరాళ నృత్యం చేస్తుందని గ్రహించామా?..



2020 ఫిబ్రవరి నెల.. మొదటివారం

పక్కమీద తెల్లదుప్పటి పరిచి మల్లెపూలు చల్లింది మాధురి. మూరెడు పూలు తలలో తురుముకుంది. తెల్లచీరలో అప్సరసలా కనిపిస్తోంది ఆమె. పెళ్ళయి పదిరోజులే అయింది. భర్త శ్రీను కువైట్‌లో కార్ల కంపెనీ డ్రైవరుగా పనిచేస్తున్నాడు. మూడేళ్ళు అక్కడ వుండి నెలరోజుల శెలవుపై ఇంటికి వచ్చాడు. ఇక వచ్చినప్పటినుండి పెళ్ళి చేసుకుని మరలా కువైట్‌కి తిరిగి వెళ్ళమని అమ్మా నాన్నలు ఒకటేపోరు పెట్టారు. ఇంకో రెండేళ్ళు కువైట్‌లో వుండి తిరిగి వచ్చాక చేసుకుంటానని శ్రీను. కాదూ కూడదు నువు ఇప్పుడే చేసుకోవాలి అని తల్లిదండ్రులూ. చివరికి తల్లిదండ్రుల పంతమే



గెలిచింది. అందంగా వున్న ఒక అమ్మాయిని చూసి పెళ్ళిచేసారు. అమ్మాయి అమ్మ వాళ్ళు

కూడా అబ్బాయి కువైట్ లో జాబ్ చేస్తున్నాడు బాగా సంపాదిస్తున్నాడు. తొందరలో భార్యను కూడా కువైట్‌కి తీసుకెళతానంటున్నాడు కాబట్టి ఈ సంబంధం చేసేద్దాం అని తొందరగా ముహూర్తాలు పెట్టించేసారు. అలా పెళ్ళయిపోయింది. ఉన్న పదిరోజుల సమయంలో ఇద్దరూ అన్ని విషయాలు కలబోసుకున్నారు సమయాన్ని సంతోషంగా గడిపారు.

శ్రీను తిరిగి వెళ్ళాల్సిన రోజు వచ్చేసింది. ముందు రోజు రాత్రి తెల్లచీరలో రతీదేవిలా కనబడుతున్న భార్యను చూసి పొంగిపోయాడు శ్రీను. తెల్లటి పక్కపై చల్లిన మల్లెపూలను చూసి మురిసిపోయాడు. కువైట్‌కి రేపే తిరుగుప్రయాణం.

చాలా దిగులుగా అనిపించింది శ్రీనుకు.

"నిన్ను విడిచి వెళ్ళాలని లేదు మాధురీ. ఎలా? ఏం చేద్దాం? ముందున్న అప్పులు ఇంకా తీరనేలేదు. మరలా పెళ్ళికి చేసిన అప్పులు అదనంగా వచ్చి చేరాయి. అక్కడనుండి పంపించిన డబ్బంతా మా నాయన ఇక్కడ పొలం కొనేసాడు. ఈ అప్పులన్నీ తీర్చే కుటుంబాన్ని ఆదుకోవాలంటే తప్పదు. కువైట్‌కి తిరిగి వెళ్ళాలి." చాలా బాధపడ్డాడు శ్రీను.

"అవునండీ మిమ్మల్ని వదిలి వుండలేను కదా? ఆ ఊహే బాధగా వుంది. మీరు కువైట్ వెళ్ళిపోయాక ఎలా కాలం గడిపాలో ఏమో అర్థంకావడం లేదు" కన్నీళ్ళు నింపుకుంది మాధురి.

"దిగులుపడకు నేను వెళుతూనే నీకు కూడా వీసా పంపించడానికి ప్రయత్నిస్తాను. వీలయినంత తొందరగా నిన్ను నా దగ్గరికి పిలిపిస్తాను. అక్కడ ఇద్దరం సంతోషంగా ఉండచ్చు సరేనా?" అన్నాడు శ్రీను.

అతడి మాటలు విన్నాక కాస్త స్థిమితపడింది మాధురి.

ఫిబ్రవరి నెల చివరిలో శ్రీను కువైట్‌కి వెళ్ళిపోయాడు. అతడికి వీడ్కోలు పలకడం బాధనిపించినా తొందరలో వీసా పంపిస్తాడు. కువైట్‌కి అతని దగ్గరికి వెళ్ళిపోవచ్చు అనే నమ్మకంతో సంతోషంగా నవ్వుతూనే అతన్ని సాగనంపింది మాధురి. అదే ఆఖరి చూపు అవుతుందని ఆ రోజు ఆమె అనుకోలేదు. అతడు అక్కడికి వెళ్ళకుండా ఇక్కడే ఇంటిదగ్గరే ఉండిపోయినా బాగుండేదేమో.

వెళ్ళిన వెంటనే మాధురి కోసం వీసా కొని పంపించాలని లక్షరూపాయలు అప్పుచేసాడు శ్రీను. తెలిసిన వాళ్ళందరినీ అడిగి డబ్బు సమకూర్చుకుని ఒక కువైటీ షేక్ దగ్గరకి వెళ్ళి పాస్‌పోర్టు కాపీలను ఇచ్చాడు. ఇక తొందరలో వీసా వస్తే టిక్కెట్లు కూడా కొని ఇంటికి పంపేద్దాం అక్కడ మెడికల్ చేయించుకుని వచ్చేస్తుంది అని కలలు కనసాగడు శ్రీను.

ఇక్కడ మాధురి కూడా సంతోషంగా వీసాకోసం ఎదురుచూస్తూ బట్టలు, కావలిసిన వస్తువులన్నీ సర్దుకుంటూ ప్రయాణానికి సిద్ధపడసాగింది.

ఇంతలోపల మార్చి వచ్చేసరికి ప్రపంచం మొత్తం కరోనా వైరస్ ప్రాకిపోయింది. విమానాలన్నీ ఎక్కడివక్కడ నిలిచిపోయారు. లాక్ డవున్లతో దేశాలు నిశ్శబ్దాన్ని నింపుకుని మనుషుల్ని ఇండ్లల్లో బంధించేసాయి. పరిస్థితులు తారుమారయ్యాయి. అనుకున్న ప్రణాళికలు అస్తవ్యస్తమై పోయాయి.

అసలే అప్పుల్లో ఉన్నవాడు ఇపుడు మాధురి వీసా కోసం మళ్ళీ తలకుమించిన అప్పులు చేసాడు శ్రీను. ఏం చెయ్యాలో తోచక తలపట్టుకున్నాడు. చాలా కృంగిపోయాడు.

ఇంతలో కువైట్‌లో కూడా లాక్ డవున్ మొదలయింది. కరోనా కేసులు దేశంలో ఎక్కువైపోయాయి. కంపెనీలు మూతపడ్డాయి. ఉద్యోగులందరూ పనులు మానేసి రూముల్లో కూర్చున్నారు. పనిచేయాలన్నా ఎక్కడా పనులు దొరకలేదు. కొన్ని కంపెనీలు జీతాలు ఇచ్చాయి కానీ చాలావరకూ కంపెనీలు జీతాలను ఇవ్వకుండా ఎగనామం పెట్టేసాయి.

చిన్నా చితకా పనులు చేసుకునే వాళ్ళు ఒడ్డున పడిన చేపల్లా విలవిలలాడిపోయారు. ఏం చేయాలో దిక్కుతోచలేదు అందరికీ. అసలే పరదేశం రూములకు బాడుగలు కట్టాలి. తిండికి సమకూర్చుకోవాలి. ఈ సమయంలో అందరి పరిస్థితీ అలానే ఉంది. సహాయం చేసే పరిస్థితి ఎక్కడా కనబడలేదు. ఆదుకునే నాథుడు ఎవరూ లేరు.

ఒక నెలరోజులు గడిచిపోయేసరికి చాలామంది దిగులు పడిపోయారు. కొంతమంది డిప్రెషనులోకి వెళ్ళిపోయారు.

ఇన్నిరోజులూ ఇన్నేళ్ళూ ప్రపంచమంతా బాగున్నప్పుడు పరదేశం నుండి ఎవరైనా వస్తున్నారంటే బంధువులకూ, స్నేహితులకూ ఎంత సంబరమో. ఎంత సంతోషమో. ఇల్లంతా సందడితో నిండిపోయేది. అయినవారినందరినీ ఆప్యాయంగా కౌగిలించుకుని ఎడబాటు బాధను మరిచిపోయి ఆనందంగా సెలవురోజులను గడిపేవారు. బరువైన గుండెలతో బాధగా వీడ్కోలు చెప్పి తిరిగి వెళ్ళేవారు.

కానీ ఇప్పుడు ప్రపంచపు పోకడ మారిపోయింది. తీరుమారి పోయి తల్లక్రిందులైపోయింది. కనీవినీ ఎరుగని కల్లోలం భూమి మీదకి వచ్చి ప్రతిమనిషినీ భయపెడుతోంది.

క్రొత్తగా పెళ్ళయినవాళ్ళు కదా ఇటు ఇండియాలో మాధురి అక్కడ కువైట్‌లో శ్రీను కృంగిపోయి కన్నీళ్ళు నింపుకున్నారు. ఒకరినొకరు ఫోన్లలో ఓదార్చుకోవడం మొదలుపెట్టారు. అయినాకానీ శ్రీను కుదుటపడలేకపోయాడు. వీటన్నిటికీ తోడు అప్పుల బాధలు ఎక్కువయిపోయాయి. అందరి పరిస్థితీ కష్టంగానే ఉంది. కాబట్టి అప్పులిచ్చిన వాళ్ళు గొంతుపట్టుకుని మరీ తీసుకున్న డబ్బులు తిరిగి ఇమ్మని ఒత్తిడి చేయసాగారు. నలిగిపోతున్నాడు శ్రీను. ఏమీ చేయలేని అసహాయతతో జబ్బు పడిపోయాడు. ఇంటిదగ్గర అయితే ఎవరో ఒకరు చూస్తారు. వేళకు అన్నం పెడతారు. ఇక్కడ ఈ ఎడారి దేశంలో ఎవరికెవరు? ఎవరి జీవితాలు వారివి ఎవరి కష్టసుఖాలు వారివి. ఈ కర్ఫ్యూ సమయంలో అందరూ ఎక్కడివాళ్ళక్కడ చిక్కిపోయారు. ఎక్కడికీ వెళ్ళలేని పరిస్థితి బంధువులు స్నేహితులు ఉన్నా కూడా రాలేని విధంగా అన్ని మార్గాలు మూసుకుపోయాయి.

ప్రక్కన రూముల్లో వున్నవాళ్ళు అతనికి అపుడపుడు కాస్త ఆహారం అందించేవాళ్ళు. కానీ పరాయివాళ్ళు ఎంతమాత్రం ఆదుకొనగలరు? ఇంతలో పులిమీద పుట్రలా పక్క రూములో వున్న గిరికి కరోనా పాజిటివ్ వచ్చినట్లుగా తేలడంతో పోలీసులు వచ్చి అక్కడ ఆ ఇంట్లో వున్న వాళ్ళందరినీ టెస్ట్ చేయడానికి తీసుకెళ్ళారు. అప్పటికే నీరసంగా ఉన్నాడు శ్రీను. ఇక జరిగే ఈ విషయాలతో మరింత దిగజారిపోయింది అతడి ఆరోగ్యం. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకుని వెళ్ళి అక్కడ అందరికీ అన్ని పరీక్షలు చేసి చివరాఖరికి ఆ ఇంట్లో వున్న పదిమందిలో ముగ్గురికి కరోనా పాజిటివ్ అని తేల్చి చెప్పి అందరినీ అలాగే వున్న పళంగా కరోనా వార్డుల్లోకి తీసుకెళ్ళిపోయారు. దురదృష్టవశాత్తూ ఈ ముగ్గురిలో శ్రీను కూడా ఉన్నాడు.

మనిషిని కష్టాలు ఎలా ఎప్పుడు ఎంతగా వెంబడిస్తాయో ఎవరికీ తెలియదు. దెబ్బమీద దెబ్బ. కోలుకోలేని విధంగా పడుతుంటే శరీరంలో శక్తి సన్నగిల్లిపోయింది శ్రీనుకు. కరోనా పాజిటివ్ అని చెప్పి వాళ్ళు అంటరానివానిగా దూరంగా నిలబెట్టి ప్రత్యేకమైన అంబులెన్సులో కరోనా రోగులున్న వార్డులకి తరలిస్తుంటే ఆ సమయంలో అక్కడే సగం ప్రాణాలు పోయాయి అతడికి.

ఆ సమయంలో క్రొత్తగా పెళ్ళయి కాళ్ళపారాణి కూడా ఆరని భార్య మాధురి అమాయకమైన ముఖం గుర్తొచ్చి ప్రాణం తల్లడిల్లింది. భయపడితే దిగులు పడితే చిన్న జబ్బయినా మనిషిని కృంగదీసేస్తుంది. శక్తిని పీల్చేసి మనిషిని మృత్యువుకు దగ్గర చేస్తుంది.

ఆశలన్నీ నిరాశలయ్యాయి. జీవితం రేపేమవుతుందో తెలియని అగమ్యగోచరమైపోయింది.

విషయం తెలిసిన మాధురి కుప్పకూలిపోయింది. భర్తకు కరోనా జబ్బు అని తెలియగానే భయపడిపోయింది. మరోవైపు శ్రీను తల్లిదండ్రులు కూడా కొడుకు కోసం బెంగపెట్టుకుని కడుపుకు తిండికూడా సరిగ్గా తినడం మానేసారు.

దాదాపు పదిరోజులు అలా ఆసుపత్రి పడకమీదే ట్రీట్‌మెంట్ తీసుకుంటూ గడిపాడు శ్రీను. ఇతడితోపాటు వున్నవాళ్ళందరూ బాగా కోలుకున్నారు కానీ శ్రీను మాత్రం ఒకరోజు కోమాలోకి వెళ్ళిపోయాడు. ఇక ఇంటిదగ్గర ఏ విషయమూ తెలియక శ్రీను నుండి ఫోను కాల్స్ రాక భయపడిపోయారు. నిద్రకూడా పోకుండా తెలిసిన వాళ్ళందరికీ ఫోను చేసి శ్రీను గురించి వివరాలు కనుక్కుని చెప్పమని అర్థించారు. కానీ బంధువులందరు కూడా ఇక్కడ కువైట్‌లో ప్రస్తుతం కర్ఫ్యూ వుంది. మేము ఎక్కడికీ కదలడానికి బయటికి వెళ్ళడానికీ లేదు. ఒకవేళ వెళ్ళగలిగినా కరోనా పేషెంట్లని కలిసేందుకు వీలుకాదు. ఆ వివరాలు ఇక్కడ ఆసుపత్రివాళ్ళు బయటి వాళ్ళకి చెప్పరు కాబట్టి మాకేం తెలియదు. మేమేం చేయలేము అని చెప్పేసారు. ఏం చెయ్యాలో తోచక చిక్కి శల్యమైపోయారు శ్రీను తల్లిదండ్రులు. మాధురి అయితే ఏకంగా మంచాన పడిపోయింది. అప్పటికే ఆమెకి రెండో నెల గర్భవతిననే అనుమానంగా ఉంది. ఒకవైపు వాంతులు కూడా అవుతున్నాయి. ఇన్ని బాధల్ని తట్టుకోలేకపోతోంది ఆమె.

ఏరోజు ఏ మవుతుందో? ఏ విషాద వార్తను మోసుకొస్తుందో అనే భయంతో గుండెను బిగపట్టుకుని కాలం గడుపుతున్నారు వాళ్ళు.

అనుకున్నట్లుగానే భయపడినట్లుగానే జరగకూడనిదే జరిగింది. ఇరవైఏడేళ్ళ శ్రీను కరోనా వల్ల నూరేళ్ళూ నిండిపోయి అర్థాంతరంగా కన్నుమూసాడు. క్రొత్తగా పెళ్ళిచేసుకుని భార్యతో కలకాలం జీవించాలని అతడు కన్న కలలన్నీ కల్లలైపోయాయి. అతడి ప్రాణం కువైట్‌లోని ఒక ఆసుపత్రిలో గాల్లో కలిసిపోయింది. అతడి చావుకు ఎవరు కారణమో? కారణాలు విశ్లేషించలేము కానీ ప్రపంచానికేం బాధ? అతడి కుటుంబానికే కదా బాధ. వార్త తెలిసిన వెంటనే స్పృహ కోల్పోయారు శ్రీను తల్లిదండ్రులు. కొడుకు కువైట్‌కి వెళ్ళి ఏదో కొంచెం డబ్బు సంపాదించుకుని తిరిగి వస్తాడని ఆశపడ్డారు కానీ ఇలా అక్కడే ప్రాణాలు కోల్పోతాడని అసలు ఊహించలేదు. (ఎవరు ఊహించగలరు మరి. ఊహిస్తే ముందుగా తెలిస్తే ఏం జరుగుతుందో కదా. ఆసుపత్రి వాళ్ళు వాళ్ళ బాధ్యత ప్రకారం ఫార్మాలిటీస్ పూర్తిచేసారు.

శ్రీనుకు కువైట్‌లోనే ఒకే ఊరి వాడైన స్నేహితుడు క్రిష్ణ అనేవాడు ఒకడు ఉన్నాడు. అతడు స్పెషల్ పర్మిషను తీసుకుని హాస్పిటల్ దగ్గరకి వెళ్ళాడు. పేపరు వర్కు అంతా పూర్తయింది. అద్దాల గదిలోనుండి మాత్రమే చూడటానికతనికి అనుమతినిచ్చారు. అలాగే ఆ అద్దాల అవతలనుండే నాలుగు ఫోటోలు తీసి వాళ్ళ తల్లిదండ్రులకి పంపాడు క్రిష్ణ. ఇక్కడ శ్రీను తల్లితండ్రులు ఆ ఫోటోలు చూసి భరించలేక ఒకటే గోల. " మా కొడుకుని ఇండియాకు పంపించండి. మా కళ్ళతో ఒకసారి చూడాలి " అంటూ ఏడుపు మొదలు పెట్టారు. ముందయితే శ్వాస ఆగిన శవాలను మర్యాదగా పద్ధతిగా గౌరవంగా విమానంలో ఇంటికి పంపించేవారు. ఇంటిదగ్గర దహన సంస్కారాలన్నీ పూలతో కన్నీళ్ళతో సక్రమంగా చేసేవాళ్ళు. కానీ ఇప్పుడు ఈ కరోనా మరణాలు వేరు కదా! ఇవి ఎంతో కఠినమైనవి కదా. శవాల బండిలో తీసుకెళ్ళి కువైటు పట్టణానికి దూరంగా వున్న ఆ ఎడారి ప్రాంతంలో ముందుగానే సిద్ధపరచబడివున్న గోతిలో శ్రీను శరీరాన్ని పడేసారు. పైన మట్టిని దొర్లించారు. అయిపోయింది అంతా అయిపోయింది. ఎన్నో ఆశలతో పరదేశం వచ్చిన ఒక ప్రాణం కువైట్ దేశంలో ఈ ఎడారి నేలలోని మట్టిలో కలిసిపోయింది.

ఎవ్వరూ ఇలాంటి చావును అనాధలా దిక్కులేకుండా పోయిన ఇలాంటి ఆఖరి వీడ్కోలును ఊహించరేమో? కాలం కఠినంగా మారిపోయి కల్లోలం సృష్టిస్తోంది. ఎవరూ ఏమీ చేయలేక ఆపలేక నిస్సహాయంగా చూస్తూ వుండిపోతున్నారు.

చుట్టుపక్కల వాళ్ళు బంధువులు వచ్చి శ్రీను తల్లిదండ్రులను, మాధురినీ శక్తి కొలదీ ఓదార్చుతున్నారు. వేళకు కాస్త తిండి తినమని నచ్చచెపుతున్నారు. కానీ పాపం ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవడం ఎవరికైనా ఎంత కష్టం. ఒక్కగానొక్క కొడుకు ఆఖరి చూపుకు

నోచుకోకుండా పాపిష్టి కరోనాకు బలయిపోతే ప్రాణం ఎంతగా కృంగిపోతుంది? మాధురి ఆరోగ్య పరిస్థితి చాలా దిగజారింది. కళ్ళు తెరుచుకుని ఆకాశం వైపు చూస్తూ "ఏమండీ ఎప్పుడు వీసా పంపిస్తారు? నేను మీ దగ్గరకి వచ్చేస్తానండీ. ఇక్కడ ఒక్కదాన్నే ఉండలేనండి. తొందరగా పంపించండి " అంటూ తనలో తానే పిచ్చిగా మాట్లాడుకోసాగింది.

వచ్చిన బంధువులు ఎంతసేపు ఉండగలరు? ఎన్ని రోజులు ఓదార్చగలరు? అలా నాలుగురోజులు గడిచిపోయాయి. శ్రీను తల్లిదండ్రులు కాస్త తేరుకున్నారు కానీ మాధురిలో రోజు రోజుకీ ప్రేతకళ వచ్చేసింది. అందరూ నిద్రపోయే వేళలో ఒకరోజు రాత్రి ఆమె చీరను తీసి ఇంటిదూలానికి కట్టి మెడకి బిగించుకుంది. 'ఏమండీ వీసా వచ్చేసింది. నేను మీ దగ్గరకి వస్తున్నా' అంటూ గాల్లోకి తేలిపోయి ప్రాణాల్ని వదిలేసింది!!

## *ఎడారిస్నేహం*

**సాయంకాలం.** అరేబియా సముద్రం ఉవ్వెత్తున అలలతో ఎగిసిపడుతోంది. ఎవరు పిలుస్తున్నారో తెలియదు కానీ పడమటి ఆకాశంలోని సూర్యుడు సముద్రంలోకి దిగిపోతున్నాడు. సంజె కెంజాయ రంగును పులుముకున్న ఆకాశం చేయి తిరిగిన చిత్రకారుడు గీసిన అద్భుతమైన చిత్రంలా కనబడుతోంది.

జీవితం కూడా ఇంత అందంగా వుంటే ఎంత బాగుండు అనుకుంది రమ్య. ఇంతలో బిలబిలమంటూ వచ్చేసారు కువైటీవాళ్ళు దాదాపు ఇరవైమంది పిల్లా పాపలతో పనిమనుషులతో కలిసి. అక్కడున్న పచ్చికలో చాపలు, కార్పెట్లు వేసుకుని కూర్చున్నారు. పిల్లలు సంతోషంగా ఆడుకోవడం మొదలుపెట్టారు. పనిమనుషులు ఇటు పెద్దవాళ్ళకు అన్నీ అందించి అమర్చి పెట్టలేక, అటు పిల్లల్ని కనిపెట్టుకుని ఉండలేక మధ్యలో అటూ ఇటూ తిరుగుతూ అలసిపోతున్నారు. కువైటీ పిల్లలయితే అల్లరి మరీ ఎక్కువ. డబ్బు తెచ్చిన సౌకర్యాలు, విలాసాలు వీరికి కాస్త పొగరును తెచ్చి పెడతాయి.

కొంతమంది పిల్లలు పనిమనుషులను బాగా వేధించుకుని తింటారు. పిల్లలు చెప్పినట్లు వినకపోతే పెద్దవాళ్ళు ఒప్పుకోరు. ఇక్కడ అరబ్బీవాళ్ళకు పిల్లలంటే ప్రాణం. వాళ్ళకి చిన్న బాధ, నొప్పి కలిగినా తల్లిదండ్రులు ఒప్పుకోరు. పనిమనుషులను కఠినంగా దండిస్తారు. పిల్లలు అల్లరివాళ్ళయితే పనిమనుషులకు ప్రాణ సంకటమే.

జగతిని చీకట్లు అలముకుంటున్నాయి. సముద్రం మీదనుండి చల్లగాలి వచ్చి పరామర్శిస్తోంది. ప్రతిరోజూ సాయంత్రం ఈ సముద్రపు ఒడ్డుకి వచ్చి కూర్చోవడం, కాసేపు పచ్చికలో నడవడం రమ్యకు అలవాటయింది.

ఆమెకు తోడుగా ఈ మధ్య శ్రీధర్ కూడా వచ్చి కాసేపు నడుస్తూ కబుర్లు చెపుతున్నాడు. అదొక కాలక్షేపం. అతను కూడా ప్రతి సాయంత్రం అక్కడికే నడక కోసం వస్తుంటాడు. అనుకోకుండా వారం రోజుల క్రితమే మాట కలిసింది. శ్రీధర్ కూడా తెలుగువాడే అని తెలియడంతో పరిచయం తేలికగా జరిగిపోయింది. ప్రతిరోజూ కలిసి నడవడం, కష్టం సుఖం చెప్పుకోవడం మొదలు పెట్టారు.

ఎడారిలో జీవితాలింతే. మనిషికోసం, స్నేహం కోసం, చిన్న పలకరింపుకోసం ఎదురు చూస్తుంటారు. ఒంటరి జీవితాల్లోని బరువును బాధ్యతలను ఎడారి దేశంలో పడే కష్టాలను మరొకరికి చెప్పుకుంటే మనసుకు కాస్త ఓదార్పు లభిస్తుంది. లేకపోతే ఏళ్ళకు ఏళ్ళు ఎడారిలో బానిసల్లా పనిచేయడం అంత సులభం కాదు.

శ్రీధర్‌తో పరిచయం అయ్యాక ఎందుకో కాస్త సంతోషంగా అనిపించింది రమ్యకు. ఇన్నేళ్ళ తర్వాత మాట్లాడుకోవడానికి కలిసి నడవడానికి ఒక తోడు దొరికినట్లనిపించింది. ఆఫీసులో పని ఉందని ఈ రోజు కాస్త ఆలస్యంగా వస్తానని శ్రీధర్ చెప్పడంతో తీరాన

వున్న బెంచిపై కూర్చుని అతనికోసం ఆ దారి వెంబడి చూస్తూ ఉంది రమ్య. మధ్యలో అప్పుడప్పుడూ పిల్లల ఆటలు, పనిమనుషుల పాట్లు గమనిస్తూ అరబ్బీ ఆడవాళ్ళ సరదా కబుర్లు వింటోంది. వీళ్ళ సంస్కృతి, సాంప్రదాయాలు కాస్త ఆసక్తిగానే ఉంటాయి అందుకే వారి పద్ధతులను, వ్యవహారాలను గమనిస్తూ అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తూంటుంది రమ్య.

ఎదురు చూడటమంటే రమ్యకు చాలా విసుగు. శ్రీధర్ ఇంకా రాలేదేంటీ అనుకుంటూ వచ్చే దారివెంట ఓసారి చూపుల్ని చివరిదాకా పరిచేసి అతను కనిపించకపోవడంతో మరలా చూపుల్ని తిప్పుకుంది. ఇక కాదని బెంచి మీదనుండి పైకి లేచి కొంచెం ముందుకు ఇసుకలోకి వెళ్ళ నడవసాగింది. ఇంతలో ఎవరో వెనకనుండి వచ్చి ఆమె కళ్ళు మూసారు. కాసేపు ఎవరో? ఏమిటో? అర్థంకాలేదు. ఎపుడో చిన్నప్పుడు స్కూల్లో చదువుకునే రోజుల్లో ఇలా వెనకనుండి వెళ్ళి స్నేహితుల కళ్ళని చేతులతో గట్టిగా మూసేవాళ్ళు. మన చేతుల్ని, గాజుల్ని తడిమి మనల్ని వాళ్ళు కనిపెట్టి మన పేరును చెప్పేంతవరకూ చేతుల్ని కళ్ళపై గట్టిగా బిగించి పట్టుకోవడమే. తమాషాగా వుండేది అలా స్నేహితులని ఆట పట్టించడం.

ఇప్పుడు ఇంతకాలానికి ఇక్కడ ఈ కువైట్‌లో అరేబియా సముద్రపు తీరాన కళ్ళు మూసింది ఎవరబ్బా? శ్రీధరా? నిజమా? అతను అపుడే అంత చనువును తీసుకుంటాడనుకోవడంలేదు. గట్టిగా పట్టుకుని కళ్ళపైనుండి చేతుల్ని తొలిగించింది రమ్య.

వెనుక ఒక కువైటీ స్త్రీ నవ్వుతూ నిలబడి ఉంది. ఆమె నవ్వును చూసి రమ్య పలకరింపుగా నవ్వింది. ఎప్పుడొచ్చాడో అక్కడికి వచ్చిన శ్రీధర్ కూడా రమ్య అవస్థను చూసి నవ్వుతున్నాడు.

"నా పేరు ఫాతిమా. నిన్ను ప్రతిరోజూ సాయంత్రం ఇక్కడ గమనిస్తున్నాను. పలకరించాలనిపించి నాలుగురోజులనుండీ ప్రయత్నిస్తున్నాను. కానీ కుదరలేదు. ఈరోజు ఇలా నీతో కాస్త ఆటాడాలనిపించి వెనకనుండి వచ్చి కళ్ళు మూసాను" పకపకా నవ్వుతూ చెపుతోంది ఫాతిమా.

"నా పేరు రమ్య. మీతో పరిచయం కావడం సంతోషంగా ఉంది" చెప్పింది రమ్య.

"సరే మీ భర్త వచ్చారు కదా మీ ఇద్దరినీ డిస్టర్బ్ చేయకుండా వదిలిపెట్టి వెళ్ళిపోతాను. రేపు ఎపుడైనా కలిసినపుడు మనం మాట్లాడుకుందాం" అంటూ వెళ్ళిపోయింది ఫాతిమా.

ఓ.. ఏమంది ఫాతిమా.. భర్తా.. శ్రీధర్ని తన భర్తనుకుందా? శ్రీధర్ వైపు చూడాలంటే కాస్త సిగ్గుగా అనిపించింది రమ్యకు.

శ్రీధర్ పరిస్థితి కూడా అలాగే ఉంది.

దేవుడు ఎక్కడెక్కడి వాళ్ళనో కలుపుతాడు. కానీ మధ్యలో అధిగమించలేని అడ్డంకులెన్నో అడ్డు పెడతాడు. ఉన్న బంధాలను తెంచుకోలేక కొత్తగా కలుపుకున్న బంధాలను శాశ్వతంగా ముడి పెట్టుకోలేక కలిసి ఉండలేక దూరంగా బ్రతకలేక.. కొన్ని జీవితాలు నరక యాతన అనుభవిస్తాయి.

అలా కాకూడదు. జీవితం వ్యర్థం కాకూడదు.

శ్రీధర్ సహృదయుడు. ఉన్నతమైన భావాలు కలిగిన వ్యక్తి. అతని ప్రవర్తన.. మాట తీరు.. పద్ధతి బాగా నచ్చాయి రమ్యకు. కానీ అతన్ని కోరుకోవడం సమంజసమా..? తన పట్ల అతనికున్న ఆరాధనా భావం గమనించక పోలేదు. ఎందుకో కాస్త సంశయం.. ఏదో సందేహం.

ఒకసారి మనసు విప్పి మాట్లాడుకోవడం మంచిదేమో అనిపిస్తోంది. ఇకనైనా ఈ ఒంటరితనానికి వీడ్కోలు పలకాలి. జీవితానికి ఒక తోడు కావాలి.

"ఏంటీ ఇంత ఆలస్యమయింది?" అడిగింది రమ్య శ్రీధర్ వైపు చూస్తూ.

"ఏముంది? ఎప్పుడూ ఉండేదే మా బాస్ ఈ రోజు మీటింగ్ అని చెప్పి రెండు గంటలు ఆఫీస్‌లో ఉంచేసాడు. తప్పదు కదా తప్పించుకోలేం ఆయన బారినుండి. ఆయన చేసే దాడినుండి. అందులో ఈజిప్షియన్ బాస్ కదా మాటలతో భయపెట్టేస్తాడు" నవ్వుతూ చెప్పాడు శ్రీధర్.

"అవునా! నిజమే బాస్ లెప్పుడూ మూర్ఖులే, మెదడు ఉండదు వాళ్ళకి" చెప్పింది రమ్య.

"సారీ నిన్ను చాలాసేపు ఎదురు చూసేటట్లు చేసాను" చెప్పాడు శ్రీధర్. చూసీ చూసీ విసుగొచ్చి అలా లేచి ఈ ఇసుకలో నడుస్తుంటే ఆ అరబిక్ ఆవిడవచ్చి కళ్ళు మూసింది. మీరే అనుకున్నాను" కాస్త సిగ్గుపడుతూ చెప్పింది రమ్య.

"నాకు అంత ధైర్యమా? అంత అదృష్టమా?" చెప్పాడు శ్రీధర్ ఆమె కళ్ళల్లోకి చూస్తు.

కలవరపడింది రమ్య. చూపుల్ని ప్రక్కకి తిప్పుకుంటూ "పదండి అలాకాసేపు నడుద్దాం" అంది సముద్రపు ప్రక్కకి నీటిలో కాళ్ళు తడుపుకుంటూ.

"వాటికెంత అదృష్టమో?" అన్నాడు శ్రీధర్.

"ఎవరిది" ప్రశ్నించింది రమ్య.

"అదే సముద్రపు అలలది" చెప్పి ఆమె ఏమంటుందో అని కంగారుగా చూసాడు ఆమెవైపు.

అర్థమైన రమ్య జవాబు చెప్పకుండా ముందుకు నడవసాగింది.

మరుసటి రోజు అదే సమయానికి ఇద్దరూ అక్కడే కలుసుకున్నారు. మధ్యలో ఫాతిమా వచ్చి మీ జంట చాలా బావుంది. ఇద్దరూ కలిసి సముద్రపు ఒడ్డున ఈ సాయంత్రాన్ని ఎంజాయ్ చెయ్యండి అంటూ ఫిలాఫిల్ ఉండలు ఇచ్చి 'నేనే చేసాను తినండి' అంటూ చెప్పి వెళ్ళింది.

"ఇండియాలో ఏయే ప్రదేశాలు చూసారు మీరు?" ప్రశ్నించింది రమ్య.

"ఇంతవరకూ ఏవీ చూడలేదు. నా కుటుంబ సమస్యలతో బాధ్యతలతో ఇక్కడి పనితో నాకు సరిపోయింది. సంవత్సరానికి ఒకసారి ఇచ్చే నెలరోజుల శెలవు అమ్మానాన్నలతో గడపడానికే సరిపోతుంది. పెళ్ళిచేసుకున్నానేకానీ ఆమెతో ఎప్పుడూ మనస్పర్థలే. తను తన పుట్టింటికి వెళ్ళిపోయింది. నేను ఇంటికి వెళ్ళినప్పుడు కూడా నన్ను చూడటానికి రాదు. తనకవసరమయిన డబ్బు నేను పంపిస్తున్నాను. అంతే చాలు. భర్తకంటే డబ్బే మేలు అనుకుంది ఆమె. నేను ఇక్కడ ఈ ఎడారిలో కాలాన్ని అలా మోడులా గడిపేస్తున్నాను. జీవితంలో పెళ్ళి నాకు సుఖాన్ని ఇవ్వకపోగా దుఃఖాన్ని మిగిల్చింది. ఎవరితో కలిసి వెళ్ళి ఇండియాలోని ప్రదేశాలను చూడగలను. ఎక్కడికి వెళ్ళాలన్నా జీవితాన్ని ఎంజాయ్ చేయాలన్నా ఒక మంచి తోడు ఉండాలి కదా.. ఒంటరిగా వెళ్ళి చూడటం బావుండదు. జీవితంలో మంచి తోడు లేకపోవడం పెద్ద లోటు" బాధగా చెప్పాడు శ్రీధర్.

"అయ్యో అయితే జీవితంలోని మధురిమలను అనుభవించలేదన్నమాట. ఇక్కడ ఎడారికి వచ్చిన వాళ్ళందరి వెనుకా ఏదో ఒక కథ ఉండనే ఉంటుంది. నా భర్త కూడా త్రాగుబోతు. ప్రతిరోజూ త్రాగి నా ఎముకలు విరిగేటట్లు కొట్టేవాడు. ఇక అక్కడ అతని దగ్గర వుంటే కొద్దిరోజులకే చచ్చిపోతానేమో అని భయపడి అతనికి తెలియకుండా అతని బారినుండి తప్పించుకోవటానికి కువైట్‌కి వచ్చేసాను.

నా కథకూడా మీలాంటిదే. ఎన్నో ఆశలతో పెళ్ళి చేసుకుంటాం. కానీ ఎంతో బాధను ఎదుర్కోవాల్సివస్తుంది. ఇది జీవితాంతం తీరని బాధే చెప్పింది" రమ్య బాధగా.

"అవును ఈ బాధలు ఎవరూ తీర్చలేనివి. ఇదంతా ఖర్మ అనుకుంటూ సరిపెట్టుకుని జీవించాల్సిందే" చెప్పాడు శ్రీధర్.

"అంతే మరి. నుదుటి రాతల్ని మార్చలేం కదా. ఒక్కోసారి సంతోషంగా ఈ బీచ్‌లో తిరుగాడే జంటలను చూస్తే జీవితంలో కలిగిన కొరతను తలచుకుని తీరని దుఃఖం కలుగుతుంది" చెప్పింది రమ్య కంట్లో తడి అతనికి కనబడకుండా మొహం ప్రక్కకు తిప్పుకుంటూ.

అతనికి అర్థమయింది ఆమె వేదన.

యధావిధంగా ఆ రోజు కాస్తంత ముందుగానే అక్కడే కలుసుకున్నారు ఇద్దరూ. ఎందుకో ఇద్దరూ మొహాలు చూసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. హృదయం నిండా కలవరం.

నడుస్తుండగా కాలికి రాయేదో తగిలి అబ్బా అంటూ తూలిపడబోయింది రమ్య. వెంటనే పడిపోకుండా చేతులతో పట్టుకున్నాడు శ్రీధర్.

రమ్యబాటన వేలి గోరుకు గాయమయి రక్తం బయటికి వస్తోంది. అది చూసిన శ్రీధర్ వెంటనే జేబులోంచి ఖర్చీఫ్ తీసి ఆమె కాలిని తన చేతుల్తో పట్టుకుని ఉబికి వచ్చే రక్తాన్ని తుడిచాడు. అతడి ఆప్యాయతకు ఆ పరామర్శకు రమ్య కళ్ళలో నీళ్ళు నిండుకున్నాయి.

అతని చేతిని గట్టిగా తన చేతిలో బిగించి పట్టుకుని "శ్రీధర్ మనమిద్దరం ఇక్కడ కలిసి ఉందామా? సహజీవనం చేద్దామా? కలిసి ఇండియాలోని ప్రదేశాలన్నీ చూడొచ్చు. జీవితాన్ని ఆనందంగా గడపొచ్చు. తీరని కోరికలను తీర్చుకోవచ్చు. నీకు నా తోడు - నాకు నీ తోడు అవసరం అనిపిస్తోంది. ఎన్నాళ్ళు ఇలా ఈ ఎడారిలో ఒంటరి జీవితం గడుపుతాం? ఎందుకంత ఖర్మ. ఇద్దరం ఇక్కడే ఈ ఎడారిలో ఒంటరిగా పోరాటం చేస్తున్నాం. కలిసి జంటగా జీవితాన్ని ఎందుకు గడపకూడదు?" చెప్పింది రమ్య.

ఆమె చేతిని బిగించి పట్టుకుని పెదవులకు ఆనించుకున్నాడు శ్రీధర్. "అవును కొన్ని రోజులుగా ఇవే మాటలు నీతో చెప్పాలని నేను ఆరాటపడుతున్నాను. కానీ నువ్వేమంటావో అని భయమేసి ఇంకొన్ని రోజులు వేచి చూద్దాం అనుకున్నాను."

"నీ తోడు నాకుంటే మనదేశమే కాదు. ప్రపంచ దేశాలన్నీ తిరిగి చూద్దాం. రేపు నెలలో శెలవలు తీసుకుని కొన్ని ప్రదేశాలు చూద్దాం. ఇంతకీ మొదట నువ్వు ఏ ప్లేస్ చూడాలి అనుకుంటున్నావు" అడిగాడు శ్రీధర్.

"అదే ఆగ్రాలోని తాజ్‌మహల్‌ని నచ్చిన వాడితో వెన్నెల్లో చూడాలని నా ఆశ" చెప్పింది రమ్య కళ్ళు మెరుస్తుండగా.

"మంచి ఛాయిస్ నీది. అలాగే ఆ అవకాశం నా జీవితంలో ఎప్పుడు వస్తుందా అని నేనూ ఎదురు చూస్తున్నాను. అంతకంటే అదృష్టమా? రేపే నీ గది ఖాళీ చేసి నా గదిలోకి షిఫ్ట్ కాకూడదూ అడిగాడు"శ్రీధర్ అభ్యర్థిస్తూ.

భవిష్యత్తు అందంగా కళ్ళముందు కనబడుతుంటే 'అలాగే' అంది రమ్య అతని చేయిపట్టుకుని అడుగులు వేస్తూ.

# ఎడారి కోయిల

**హైలో హైలెస్సా హంస కదా నా పడవ.**

ఉయ్యాలలూగినదీ - సయ్యాటలాడినదీ..ఓ..ఓ..హై.

మధురమైన గొంతులోంచి తీయని ప్రవాహంలా జాలువారుతున్న పాట. అక్కడ వున్న అందరి హృదయాలనూ పరవశింపజేస్తోంది. ఆమె పాటకు అనుగుణంగా కొందరు అడుగులు కదిపారు. కొందరు దరువేసారు. ఉత్సాహంగా ఉల్లాసంగా కాలాన్ని గడుపుతున్నారు వాళ్ళు.

పైన ఆకాశం వెన్నెలను కురిపిస్తోంది.

క్రింద సముద్రం అనంతమైన జలరాశులతో నిండివుంది.

మధ్యలో పెద్ద ఓడ. పధ్నాలుగు రోజుల ప్రయాణంతో అరేబియా సముద్రంలో కదులుతోంది. అన్ని దేశాలలోనూ ఆగుతూ వెళ్ళాలి కాబట్టి తీర ప్రాంతాలకు దగ్గరగానే ప్రయాణిస్తోంది. ఎక్కేవాళ్ళు ఎక్కుతున్నారు. దిగేవాళ్ళు దిగి వెళ్ళిపోతున్నారు. 1970 సంవత్సర ప్రాంతంలో మన భారత దేశం నుండి గల్ఫ్ దేశాలకు వెళ్ళాలన్నా, అక్కడనుండి తిరిగి మనదేశానికి రావాలన్నా ఈ పెద్ద ఓడలే దిక్కు. రాను పధ్నాలుగు రోజులు. పోను పధ్నాలుగు రోజులు. సుదీర్ఘ ప్రయాణం. ఒక్కోసారి ఆ ఓడకు ఏదన్నా మరమ్మత్తులు అవసరం అయితే ఏదో ఒక తీర ప్రాంతంలో ఒకటో రెండో రోజులు అదనంగా నిలబడిపోయి యంత్రాలను సరిచేసుకుని అక్కడినుండి కదులుతాయి. ఆ సమయంలో ప్రయాణికులు అక్కడ వున్న ప్రాంతంలోకి వెళ్ళి సరదాగా తిరిగేసి ఆ ప్రదేశాలన్నీ చూసేసి వస్తారు.

అపుడపుడే కొన్ని విమానాలు గల్ఫ్‌దేశాల్లోకి తిరుగుతున్నా విమానప్రయాణం చాలా ఖరీదైనది కావడంతో వీళ్ళందరూ చాలావరకూ నౌకలోని ప్రయాణాన్నే కోరుకునేవారు. ఎందుకంటే దీనిలో ప్రయాణించే వారందరూ దాదాపు గల్ఫ్‌లోని అరబ్బు షేకుల ఇండ్లలో పనిచేసే పని మనుషులు, డ్రైవర్లు. అప్పట్లో అదొక సాహసోపేతమైన ప్రయాణం గల్ఫ్‌కెళ్ళి పనులు చేసుకుని సంపాదించుకోవడమైతే ప్రాణాలకు తెగించిన వారికే సాధ్యపడుతుంది. ధైర్యమున్నవారే అంతదూరం వెళ్ళి పరాయిదేశంలో ఏ దిక్కూలేని చోట పనిచేసి సంపాదించుకుని రెండేళ్ళకో మూడేళ్ళకో తిరిగి ఇంటికి రాగలరు.

మరి అప్పట్లో క్షేమ సమాచారాలు తెలపడానికి ఇప్పటిలా నెట్‌లు - ఫోన్లు లేవు. నెలకో రెండు నెలలకో ఒక జాబు రాస్తే మరలా తిరిగి జవాబు రాసేవారు. అక్కడినుండి పంపించే డబ్బుకోసం క్షేమసమాచారాలతో వచ్చే జాబుకోసం ఇక్కడ ఇండియాలో మనవాళ్ళు కనులు కాయలు కాచేలా ఎదురు చూసేవాళ్ళు. డబ్బు అందుకుంటే ఎంత సంతోషమో. జాబులు చదువుతుంటే ఎంత ఆనందమో. ఆ రోజంతా ఇంట్లో వీధిలో అవే కబుర్లు. అక్కడి విషయాలను పంచుకుంటూ వింతగా చెప్పుకుంటూ తలచుకుంటూ కాలం గడిపే వాళ్ళు. అక్కడినుండి వచ్చే ఉత్తరాల కవర్లు కూడా చాలా ప్రత్యేకంగా విమానం బొమ్మ ముద్రించబడి చూడగానే గల్ఫ్ నుండి వచ్చినవని గుర్తుపట్టేలా వుండేవి. ఇక్కడ ఇండియానుండి వచ్చే జాబుకోసం అక్కడవాళ్ళు హృదయం నిండిన ఆశతో ఆరాటంగా ఎదురుచూసేవాళ్ళు. వణికే చేతులతో జాబును అందుకుని తడి కళ్ళతో అక్షరాలను తడుముకుని తనవారి సంగతులను తెలుసుకుని సంబరపడిపోతారు. నిజంగా అది పండుగ సంబరమే. జాబులోని విషయాలను తలపోసుకుంటూ కాలాన్ని ఉత్సాహంగా దొర్లిస్తారు. ఆ రోజులే వేరు కదా. ఆ అనందం ఇపుడెక్కడ వుంది?

ఎవరైనా గల్ఫ్‌కు పనికోసం వెళుతున్నారంటే వారిని ఎంతో మర్యాదగా రాజలాంచనాలతో సాగనంపేవారు. తిరిగి శెలవలకు ఇంటికి వస్తే ఇక్కడ వున్నన్ని రోజులూ క్రొత్త అల్లుడిని మేపినట్లు రోజుకో కోడిని కోసి భోజనాలు పెట్టడమే. బ్యాగుల నిండా తెచ్చే ఆ

రగ్గులూ, రంగుల బట్టలూ, జపాను చీరలు, అత్తరుబుడ్లు ఆహా ఎంత వైభోగం? ఎంత సంబరం? మాటల్లో చెప్పనలవికాని మధురమైన జ్ఞాపకాలవి. కాలగతిలో ఆ ప్రేమలు అంతరించిపోయాయి. ఆ సంతోషాలూ చల్లారి పోయాయి.

''ఏమే మంగా పాటలు పాడటం ఎక్కడ నేర్చుకున్నావే? సినిమాల్లో సావిత్రి కూడా ఇంత బాగా పాడదు కదే'' బుగ్గ గిల్లుతూ అడిగింది సుబ్బమ్మ.

ఆమె మాటలకు ఫక్కున నవ్వింది మంగ. ''సినిమాల్లో సావిత్రి పాటలు పాడదు సుబ్బమ్మత్తా. ఆ సావిత్రి పెదాలు కదులుతాయి అంతే. వెనక పాడేది సుశీల. జిక్కిలాంటి పాటగత్తెలు మాత్రమే'' వివరించి చెప్పింది మంగ.

''ఎవరైతే ఏం గానీ దేవుడు నీకు మంచి గొంతు నిచ్చాడు. రాత్రి పడవ మీద నిలబడి నువ్వు 'హైలో హైలెస్సా అని పాడతావుంటే నా సామి రంగా మన పడవ ఊగిపోయిందనుకో. మన తెలుగు వాళ్ళందరూ ఒకటే చప్పట్లు. ఈ రోజు కూడా పాడితావటే'' ఆశగా అడిగింది సుబ్బమ్మ.

''మన ప్రయాణం ఇంకా పదిరోజులు వుంది. పదిరోజులూ రాత్రిపూట పాట కచ్చేరీలే అత్తా. పాడేవాళ్ళు పాడతారు. ఆడేవాళ్ళు ఆడతారు. ఇంక ఈ పదిరోజులూ పనేముంది. తినడం. తిన్నది అరిగేదాకా ఒకరితో ఒకరం మాట్లాడుకోవడం. అక్కడికి కువైట్‌కి వెళ్ళాక ఎటూ రాత్రింబగళ్ళూ చాకిరీ తప్పదు. కోవేటోడి బూట్సు కాలితో తన్నులూ తప్పవు. ఈ పదిరోజులన్నా ఇష్టమొచ్చినట్లు పాడుకుందాం'' అంది మంగ. ఆ మాటల్లో లేని దిగులు బాధ గూడు కట్టుకుని వున్నాయి.

''మీ బాబా మామా మంచివాళ్ళు కాదా? తంతారా?'' జాలిగా ప్రశ్నించాడు అక్కడే వున్న సూరిగాడు.

''తప్పు చేస్తే తన్నక కువేటోళ్ళు ముద్దు పెట్టుకుంటారా? నాలుగు నెలలపుడు బాబా జిద్దాసా (అంగీ) ఇస్త్రీ చేస్తుంటే కాలిపోయింది. అంతే. ఆయనకు కోపం వచ్చింది. చూడు. కళ్ళు మూసుకుని ఇస్త్రీ చేసావా అని తిడుతూ తన్నేసాడు. ఆ నెల జీతం కూడా ఇవ్వలా. కానీ మహా తల్లి మామా చాలా మంచిది. నన్ను ఎప్పుడూ ఏమీ అనదు. పాపం బాబాకు తెలియకుండా జీతమిచ్చి ఇంటికి నీ బిడ్డకు డబ్బు పంపించుకో అని చెప్పింది. నా కళ్ళలో నీళ్ళు తిరిగి ఆమె కాళ్ళమీదపడి పోయినాను. ఏం చేస్తాం ఒక్కొక్కసారి ఇలాంటివి తప్పదు'' చెప్పి నిటూర్చింది మంగ.

''నిండా ఇరవైయేళ్ళు లేవు నీకు. అపుడే పెళ్ళయిపోయిందా?'' ఆశగా ఆమెవైపు చూస్తూ ప్రశ్నించాడు సూరిగాడు.

''పెళ్ళా? పాడా? నేను పదహారేళ్ళకే కోయేటికి వచ్చినాను. పెళ్ళి అయి బిడ్డవుండాది. మొగుడు మంచోడు కాదు అని చెప్పమని మా ఏజంటు చెప్పినాడులే. అట్టా చెప్పితే దయగా చూసుకుంటారు. జీతం సరిగ్గా ఇస్తారు అంటే నేను అట్టనే చెప్పినాను.

అందుకే మా మేడమ్ బిడ్డకోసం గౌన్లు కొనుక్కో. బంగారం కొనుక్కోమని రంజాన్ పండక్కి ఒక నెలజీతం ఎక్కువే ఇస్తాది. ఆమె మంచిది కాబట్టి నేను అక్కడ పని చేస్తున్నాను. లేకపోతే మా బాబా పెట్టే బాధలకు తిట్టే తిట్లకు ఒక్కరోజు కూడా ఎవరూ పని చెయ్యలేరు'' ఆగి ఊపిరి పీల్చుకుంది మంగ.

''అయితే ఇంకా పెళ్ళికాలేదన్నమాట సంతోషం మంగా'' అన్నాడు మెరిసే కళ్ళతో సూరిగాడు.

''ఏంటీ ఈ పిల్ల మీదకి మనసు పోయిందా? పెళ్ళి చేసుకుంటావా ఏంది?'' వేళాకోళమాడింది అక్కడేవున్న సరస్వతి.

''పిల్ల వప్పుకోవాలేగానీ బంగారంగా పెళ్ళి చేసుకోనా? ఇట్టాంటి పిల్ల మళ్ళీ దొరుకుతుందా. ఈ పిల్ల పాట పాడుతుంటే మనసు గాల్లో విహరిస్తోంది'' ధైర్యం చేసి మనసులో మాట చెప్పసాగాడు సూరిగాడు.

"పిల్ల అందంగా వుంది. చక్కగా పాడుతోంది. నువ్వే ఎదురు కట్నం ఇచ్చి మా పిల్లను పెళ్ళి చేసుకోవాలబ్బాయ్" చెప్పింది సరస్వతి నవ్వుతూ.

"పిల్ల ఊఁ.. అనాలే కానీ పది తులాలు దుబాయ్ బంగారం పెట్టి పెళ్ళి చేసుకోనూ" తేల్చేసాడు సూరిగాడు.

"ఏం పిల్లా ఏమంటావు?" సుబ్బమ్మా మంగను ప్రశ్నించేసరికి సిగ్గుపడింది మంగ.

"నేనేమంటాను. పది తులాల బంగారం సంగతి సరేకానీ. ఆయన వుండేది దుబాయి. నేనేమో కోయేటులో మరి మా యిద్దరికీ ఎట్టా కుదురుతుందబ్బా?" సందేహం బయట పెట్టింది మంగ తనవైపే చూస్తున్న సూరిగాడివైపు ఓరగా చూస్తూ.

"దానికేముండాదిలే ఇప్పుడే ఇక్కడే నిశ్చితార్థం చేసేస్తే మరో రెండేళ్ళకు శెలవలకు ఇండియా వస్తారు కదా అప్పుడు పెళ్ళి చేస్తే సరిపోతుంది" ప్లాన్ చెప్పింది సరస్వతి.

"అలాగే చేద్దాం. ఓడ డెక్ మీదకి వెళ్ళి ఆట పాటల మధ్య ఉంగరాలు మార్పిస్తే సరిపోతుంది" ఉత్సాహపడింది సుబ్బమ్మ.

"దేవుడు ఎక్కడెక్కడి వాళ్ళనో కలిపి ముడేస్తాడు. వీళ్ళను కూడా అంతే. ఈ సముద్రం మధ్యలో ఓడలో మనమధ్య జత కలిపేసాడు" కల్పించుకుని చెప్పింది ఆ ప్రక్కనే వున్న రాణెమ్మ.

"మనదేముంది? ఇద్దరూ ఇష్టపడుతున్నారు. అది ముఖ్యం" అంది సరస్వతి మంగ సూరిబాబుల ఓర చూపులను గమనిస్తూ.

ఆ సాయంత్రం అందరూ ఉత్సాహంగా మంచి బట్టలు వేసుకుని తయారయిపోయారు. ఓడలోని పైభాగంలోకి అందరూ చేరుకుని వారి భోజనాలన్నీ అక్కడికే తెప్పించుకున్నారు. సరదాగా కబుర్లు చెప్పుకుంటూ నవ్వులతో సంతోషంగా కాలం గడుపుతున్నారు. ఇంతలో మంగను తీసుకుని అక్కడికి వచ్చింది సరస్వతి. ఉన్నవాటిల్లోకెల్లా బాగున్న చీరను తీసి మంగకు కట్టి ఉన్న నగలతో అలంకరించారు. పెళ్ళికూతురిలా మెరిసిపోతోంది మంగ. సిగ్గుతో సంతోషంతో ఎర్రబడిన బుగ్గలతో కొత్తగా వింతగా కనబడుతోంది. అపుడపుడూ తలెత్తి సూరిగాడి వైపు చూస్తూ అందంగా చందమామలా వున్నాడు అనుకుంటూ మురిసిపోతోంది.

బులుగు జుబ్బా వేసుకుని నల్లపాంటు తొడుక్కుని ఠీవిగా కూర్చున్నాడు సూరిబాబు. ఆడా మగా అంతా కలిసి పదిమంది దాకా కూడుకున్నారు అక్కడ.

"శ్రీ సీతారాముల కళ్యాణం చూతము రారండీ" అంటూ పాటందుకున్నాడు రాజం పేటనుండి వచ్చిన నరసయ్య. అందరూ ఆయన పాటకు జతగా గొంతు కలిపారు.

తరువాత అందరూ కలిసి మంగను పాటపాడమన్నారు. నిన్నటిలా కాదు కదా ఈ రోజు. ఎంతో సిగ్గుపడిపోయి అందరి దగ్గరా ఒకటికి రెండుసార్లు అడిగించుకుని "బృందావనమది అందరిదీ గోవిందుడు అందరి వాడేలే" అంటూ పాటందుకుని మధురమైన స్వరంతో వినిపించింది మంగ.

"సూరిగా నువ్వు అదృష్టవంతుడివిరా. పిల్ల అందానికి అందం. అణుకువకు అణుకువ. వీటన్నింటికీ తోడూ ఆ గొంతు. అబ్బా సుశీల కూడా పాడలేదు ఈ యమ్మి ముందర. ఈ యమ్మి పాడతావుంటే కడుపుకు ఆకలికూడా వెయ్యదు. రోజూ పాటలు పాడించుకుని వినుకోబ్బా. చల్లగా నిద్రవస్తాది" తమాషాగ మాట్లాడినాడు కడపనుండి వచ్చిన శంకర్.

సూరిబాబు ముఖం సంతోషంతో వెలిగిపోతాంది.

"అంతా విచిత్రంగా ఉండాది. అప్పటికప్పుడు కుదిరిపోయింది వీళ్ళిద్దరికీ. మనమే సాక్ష్యం వీళ్ళ నిశ్చితార్థానికి. దేవుడు దయతలిస్తే మరలా రెండేళ్ళ తరువాత ఇదే నెలలో అందరం ఇండియా వచ్చి తిరుపతిలో వీళ్ళ పెళ్ళి చేద్దాం." హుషారుగా చెప్పింది సుబ్బమ్మ. ఏదో మంచిపని చేసిన తృప్తి ఆమె మాటల్లో కనిపిస్తోంది.

వీళ్ళ కబుర్లన్నీ వింటున్న ఓడ సముద్రం నీటిమీద మెల్లగా సాగిపోతోంది.

"ఇక్కడ దాదాపు పదిమంది వున్నాం. మరలా రెండేళ్ళకు ఇదే మార్చి నెలలో మనలో ఎంతమంది ఇండియాకు వస్తారంటావబ్బా" సందేహంగా అడిగాడు నరసయ్య.

"ఓయ్యా గట్టిగా అనుకుంటే అందరం రావచ్చు. దానికేముందిలే దేవుడు దయదలచాలి అంతే" నమ్మకంగా చెప్పాడు శంకర్.

అందరూ భోజనాలు చేసి పాటలు పాడుతూ ఆనందంగా సూరిబాబుకు మంగకు ఉంగరాలు మార్పించారు. ఒకరినొకరు మరిచిపోమని మరలా రెండేళ్ళకు తిరిగి ఇండియాకు వచ్చి పెళ్ళి చేసుకుంటామని ఇద్దరి చేత ప్రమాణాలు చేయించారు. సూరిబాబు సంతోషంతో పొంగిపోయి తన మెడలో వున్న గొలుసు కూడా మంగ మెడలో వేసేసాడు.

తరువాత మంగను, సూరిబాబును అక్కడే వదిలేసి "ఇద్దరూ మాట్లాడుకోండి. కాసేపు సంతోషంగా గడపండి" అంటూ అందరూ ఒక్కొక్కరుగా వెళ్ళి పోయారు. ఆ డెక్ మీద ఇద్దరే మిగిలిపోయారు. పైన ఆకాశం నుండి పుచ్చపువ్వులా కాస్తున్న వెన్నెల. చుట్టూ సముద్రపు నీళ్ళు. చల్లగా వీసున్న గాలిలో ఒకరినొకరు చూసుకుంటూ కొద్దిసేపు అలా మౌనంగా గడిపేసారు. కాసేపటికి ఇద్దరిలో వున్న బిడియం తొలిగిపోయి మాటకు మాట కలుపుకుని ఎప్పటినుంచో తెలిసిన వాళ్ళలా కబుర్లు చెప్పుకున్నారు. నవ్వుకున్నారు. చేతులు కలుపుకున్నారు. అలా ప్రతిరోజూ సాయంత్రం ఇద్దరు ఓడలోని పైభాగానికెళ్ళి అందరికీ దూరంగా వెళ్ళి కూర్చోవడం, మాట్లాడుకోవడం.

"సరిగ్గా రెండేళ్ళకి మనం ఇండియా వచ్చి పెళ్ళి చేసుకుందాం. ఈలోపల నేను మా బాబాను నీకోసం వీసా అడుగుతాను. మా యింట్లో డ్రైవరు కావాలని చూడమని మా బాబా అడగమన్నాడు. నువ్వు దుబాయ్‌లో పని మానేసి కువైట్‌కి వచ్చేసినావంటే ఇద్దరం సంతోషంగా ఒకే ఇంట్లో పని చేసుకుని బ్రతకొచ్చు. కలిసి వుండొచ్చు" చేతిలో చేయివేసి గట్టిగా పట్టుకుంటూ చెప్పింది మంగ.

"ఇంకో నాలుగురోజుల్లో దుబాయ్ చేరిపోతాను. నిన్ను వదిలి వెళ్ళిపోవాలంటే చాలా బాధగా వుంది. ఒక్క క్షణం కూడా నిన్ను విడిచి ఉండలేకపోతున్నా మంగా" దిగులుగా చెప్పాడు సూరిబాబు.

కిలకిలా నవ్వింది మంగ. "నేనైతే మాత్రం నిన్ను విడిచి వుండగలనా? ఏమి? సంవత్సరం తిరిగేలోగా మా బాబాను వీసా అడిగి నిన్ను తొందరగా కుయేటికి పిలిపిస్తాలే దిగులు పడకు" చెప్పింది మంగ.

"అలాగే వీసాకు ఎంత డబ్బు ఖర్చు అయినా నాతో చెప్పు. దుబాయ్ నుండి పంపిస్తాను" అంటూ అటూ ఇటూ చూసి మంగ బుగ్గమీద ముద్దుపెట్టుకుంటూ చెప్పాడు సూరిబాబు.

అందంగా సిగ్గుపడింది మంగ.

నాలుగురోజులు నాలుగు నిముషాల్లా కరిగిపోయాయి. ఇన్నిరోజులూ ఎంత సంతోషంగా గడిపారో ఆఖరి రోజు సూరిగాడు దుబాయ్‌లో దిగిపోయే రోజు అంతగా బాధపడ్డారు వాళ్ళిద్దరూ. ప్రతినెలా జీతమంతా మంగకు పంపిస్తాననీ ఆ డబ్బుతో వీసాకొని పంపించమని చెప్పి భారమైన హృదయంతో ఓడ దిగి వెళ్ళిపోయాడు సూరిగాడు.

దుబాయ్ నుండీ కువైట్‌కి వెళ్ళే కొద్దిమంది ప్రయాణీకులు ఓడ ఎక్కారు. ఆ రాత్రి అక్కడ వుండి మరుసటి రోజు ఉదయాన్నే భారంగా మెల్లగా కువైట్‌కి బయలుదేరింది ఆ ఓడ. కువైట్ చేరేంతవరకు ఆ ఓడలో వున్న వాళ్ళందరూ వున్న నాలుగురోజులూ మంగతో పాటలు పాడించుకున్నారు. ఎడారి కోయిలవు నువ్వు అంటూ పొగిడారు. కువైట్‌లో ఓడ దిగాక మిగిలిన వాళ్ళందరూ ఒకర్నొకరు కౌగిలించుకుని తప్పకుండా మళ్ళీ కలుసుకోవాలని చెప్పుకుని అడ్రసులు ఫోను నంబర్లు తీసుకున్నారు. వీడ్కోలు తీసుకుని గుండె నిండిన బాధతో ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు.

ఓడరేవునుండి ఆమెను తీసుకుని పోవడానికి డ్రైవరు రఘు కారేసుకుని వచ్చాడు. అతన్ని చూడగానే కౌగిలించుకుంది మంగ. మూణ్నెల్ల ఎడబాటు మరి. తన మెళ్ళో వున్న గొలుసు తీసి అతని మెడలో వేసి కన్ను గీటింది.

"ఎక్కడిది ఇది?" అడిగాడు రఘు సంతోషంగా మెడలోని గొలుసును తడిమి చూసుకుంటూ.

"గొలుసే కాదు. నెలనెలా మనకు దుబాయ్ నుండి డబ్బులు వచ్చి పడతాయి తెలుసా" నవ్వుతూ చెప్పింది మంగ.

"ఎవడికి టోపీ పెట్టావేంటి?" ఆసక్తిగా అడిగాడు రఘు.

"ఎవడో తెలివితక్కువవాడు ఓడలో కనిపించాడు. పాటలతో మాటలతో బోల్తా కొట్టించి ఉన్న బంగారం డబ్బు తీసుకుని వచ్చేసాను. పాపం పిచ్చివాడు వాడిని పెళ్ళిచేసుకుంటానని గుడ్డిగా నమ్మేసాడు. వాడే కాదు ఓడలో వున్నవారందరు కూడా నా మాటలకు మోసపోయారు. జనాలు వెర్రివాళ్ళు. ఓడలో వున్న పదిరోజులూ మంచి కాలక్షేపం అనుకో" కిలకిలా నవ్వింది మంగ అతని బుగ్గపై ముద్దుపెడుతూ.

# వలపుల ఎడారి

**చిక్కటి చీకటి** దుప్పటిలా జగతిని క్రమ్ముకుంది. అంతటా నిశ్శబ్దం. చీమ చిటుక్కుమనడం లేదు. కాలం స్థంభించి పోయింది. బయట చీకటి. హృదయంలో నిండిన చీకటి.

పోరాటం ఎవరితో చెయ్యాలి? కనబడితే సరే. ఎదిరించవచ్చు, చంపచ్చు, కానీ కంటికి కనబడదే. తెలియని కోపంతో పళ్ళు కొరుకుతూ పిడికిళ్ళు బిగించిందామె.

ఎలా? ఇక్కడనుండి బయటపడటం ఎలా? అతన్ని చేరుకోవడం ఎలా? అది సాధ్యమా.?

అనారోగ్యంతో అతను అక్కడ ఒంటరిగా అల్లాడి పోతుంటే..

ఇక్కడ తన హృదయం విలవిల్లాడి పోతోంది. తన ప్రపంచం తలక్రిందులయినట్లుంది. కానీ ఏదో ధైర్యం. చీమకు కూడా అపకారం తలపెట్టని మంచి మనిషి అతను. అతనికి ఏమీ కాదు.

ఈ బందిఖానా నుండి తప్పించుకుని అతన్ని చేరుకునే మార్గమేదైనా ఉందా? ఉంటుందా? సాధ్యమా?

అవసరమయితే, వెళ్ళాలనుకుంటే బస్సో, టాక్సీనో ఎక్కితే అరగంటలో అతన్ని చేరుకోవచ్చు అని ఇన్నిరోజులూ అనుకుంటూ నిశ్చింతగా ఉండేది. కానీ ఈ రోజు అన్నీ ఆగిపోయి పగలు కూడా వాహనాలు తిరగని రోడ్లు బిక్కుమని చూస్తూ వెక్కి వెక్కి ఏడుస్తాయని ఊహించలేదు. హే భగవాన్ కాపాడు. దయచేసి అతని అనారోగ్యాన్ని బాగు చేయి. అతని అసహాయ స్థితిని చూడలేక ఆవేదన కట్టలు తెంచుకుని కన్నీటి రూపంలో పెల్లుబికి బయటికి వచ్చి గుండెలను తడిపేస్తుంటే ఆమె ప్రార్థిస్తోంది ఏదో పిచ్చి నమ్మకంతో.

హాస్పిటల్ కి వెళితే? అమ్మో ఇంకేమైనా ఉందా? అక్కడ డాక్టర్లే లేరట. కొందరున్నా వాళ్లు కూడా భయపడిపోయి రోగిని సరిగా చూడకుండానే అందరికీ అదే జబ్బని తేల్చేసి వాళ్లలో కలిపేసి ఎక్కడికో దూరంగా ఎడారి ప్రాంతానికి తీసుకెళ్ళి పడేస్తున్నారట. ఆ జబ్బు బాగయిపోయి తిరిగి రావడం కల్ల అని. చనిపోతే శవాలను కూడా చూపించకుండా ట్రక్కుతో ఈడ్చుకెళ్ళి అక్కడే ఎడారి గుంతల్లో తోస్తున్నారని చెపుతున్నారు. ఎంత నికృష్టమైన చావు. ఎవ్వరూ తగలకుండా ఆఖరి రోజుల్లో అయినవారు కనీసం కడసారి చూపులు చూడకుండా,

అనాధల్లా నేల జారిపోవడం. మట్టిలో కలిసిపోవడం. అయ్యో ఆ దుస్థితి పగవారికి కూడా రాకూడదు. అందులో ఈ పరాయి దేశంలో ఈ నేలపై అడ్రస్ తెలియకుండా పోవడం అంటే ఏ జన్మలో చేసుకున్న పాపమో? ఎవరి శాపమో? మరి.

అది కువైట్ పట్టణం. అంతటా కర్ఫ్యూ.

బయట కనబడితే పోలీసులు పట్టుకుని జైల్లో తోస్తున్నారు. వీధుల్లో గస్తీ తిరుగుతున్న పోలీస్ కార్లు తప్ప ఇంకెక్కడా అలికిడి కనబడటం లేదు.

కర్ఫ్యూ మొదలుపెట్టక ముందే ఆశపోతులందరూ పొలోమని పోయి అంగళ్ల మీద పడి ఆర్నెళ్లకు సరిపడా సరుకులను దోచుకు తెచ్చుకుని ఇంటిలో దాచుకున్నారు. దోచుకున్న వాళ్ళకి దోచుకున్నంత. ఆలశ్యంగా వెళ్లిన వాళ్లకు, వెనకబడిన వాళ్ళకు ఏమీ దొరకలేదట. కళ్ళకు ఖాళీ షాపులు దర్శనమిచ్చాయట.

బయట పిట్ట కూడా తిరగకుండా స్థంభించిపోయిన రహదారులు. సందడి లేక కాళ్ల పారాణి ఆరకముందే భర్తను కోల్పోయిన వితంతువులా రోదిస్తున్నాయి.

ప్రపంచం కూడా జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకోలేని స్థితిలో ప్రాణ భయంతో కొట్టుమిట్టాడుతోంది. గుండెనిండా గాలి పీల్చుకోవడానికి కూడా భయపడుతూ పంజరంలో చిక్కిన చిలకలా గిజగిజ లాడుతోంది. గజ గజా వణికిపోతోంది.

ఎక్కడి దొంగలక్కడే గప్ చుప్. ప్రస్తుతం ప్రపంచమంతా దొంగా పోలీస్ ఆట ఆడుతోంది. ఇక్కడ ఎవరు దొంగలో? ఎవరు పోలీసులో అస్సలు తెలియడం లేదు. అంతా తలక్రిందులయిపోయిన అయోమయం. దొంగలా ప్రవేశించి దొంగదెబ్బ తీస్తున్న ఈ వైరస్ దెబ్బకు మహా మహులే తలుపులు మూసుకుని ఇంట్లో కూర్చున్నారు. దేశాలను పాలించే రాజులూ, మంత్రులూ బెంబేలెత్తి పోయి దిగాలుపడి దిక్కులు చూస్తున్నారు. పరిష్కారం కనబడక ఆలోచిస్తూ తల బ్రద్దలు కొట్టుకుంటున్నారు.

ఇక జవాబులివ్వడానికి ప్రశ్నలెక్కడ? ప్రశ్నించే వారెక్కడ? కొన్ని రోజులు ప్రాణ భయంతో భూమ్మీద సమానత్వం సంపంగి పూవుల పరిమళాలను వెదజల్లింది. మనుషులు కులమత, పేదా గొప్పా భేదాలు మరచిపోయారు. ఎంత మంచి మార్పు. కానీ అది కొద్ది రోజులే. పరిస్థితి కాస్త అదుపులోకి రాగానే, అవగాహన కలగగానే ఊపిరి కాస్త పీల్చుకున్నాక యథవిధిగానే తయారయింది మనుషుల ప్రవర్తన. హతవిధీ ఈ మనుషుల తీరు ఎప్పటికి మారేను? ఎన్నటికి బుద్ధి వచ్చేను.

అది మే నెల 2020.

పాలకులే ప్రాణాలరచేతుల్లో పెట్టుకుని పరిగెత్తుతుంటే ఈ క్లిష్ట సమయంలో సామాన్యప్రజల మాటేమిటి?

దాని పేరు అదే ఆ కరోనా పేరు వింటేనే కరెంటు షాకులా అందరికీ వెన్నులో జలదరించే వణుకు. కళ్లల్లో పారాడే భయం.

ఇటలీ, ఫ్రాన్సు, అమెరికాలోని మనుషులు వరుసగా తెగులు సోకిన కోళ్ళలా వ్రేలాడబడి పోయారు. ఆసుపత్రులు నిండి పోయాయి. స్థలం లేదు. సదుపాయాలు లేవు.

ఎటు చూసినా రోదనలు, వేదనలు ఆక్రోశాలు, ఆర్త నాదాలూ. అన్నిచోట్లా సామూహిక ఖననాలకు గోతులు త్రవ్వుకుంటున్నారు. ఎంత దౌర్భాగ్యం. రేపేమవుతుందో తెలియని అనిశ్చితిలో తమ సమాధులను తామే తమ చేతులతో త్రవ్వుకుంటున్నారు.

ఏమిటి ఈ వైపరీత్యం? ఎందుకీ విధ్వంసం? ఎవరికింత కక్ష? ఏం సాధించాలని? జవాబు లేని ప్రశ్నలు. అయినా అడిగే సమయం ఆ వెసులుబాటూ ఎవరికీ లేదు. ఎవరిని అడగాలో తెలిస్తే కదా. ఎవరు కాపాడగలరు? ఎవరు రక్షించగలరు? ఏమీ తెలియదు. అవి మనుషుల శరీరాలా? శవాల గుట్టలా? మట్టి దిబ్బలా.

అబ్బ తలచుకుంటుంటేనే, వార్తలు చదువుతుంటేనే భయం. వంట్లో నిలువెల్లా నిండిపోయే నీరసం. ఏం చేయాలి? ఎలా బయట పడాలి? ఎక్కడికి పారిపోవాలి? దాని కబంధ హస్తాలకు అందని చోటికి అది రాని చోటికి. దానికి తెలియని చోటికి దూరంగా పారిపోవాలి. ఎక్కడుందది. కనిపెట్టడం ఎలా?

సరిహద్దులు దాటుతోందది. ప్రపంచ దేశాల్లోకి అవలీలగా ప్రవేశిస్తోంది.

రోజు రోజుకీ పరిస్థితులు దిగజారిపోతున్నాయి. భయంకరమైన కాలం. జన్మలో ఎవ్వరూ ఎప్పుడూ కళ్ళతో చూడని చెవులతో వినని రోజులు.

మనిషికి మనిషే శత్రువట. ఇదొక విచిత్రం. ఎన్నడూ వినని వింత. దీన్నుండి తప్పించుకుని బయటపడే వాళ్లున్నారా? ఉంటారా? కొన్ని నెలల తరువాత ఈ భూమ్మీద మనుషులు ప్రాణాలతో మిగిలి ఉంటారా?

ఇది ఈ భూమిని సమూలంగా తుడిచిపెట్టదు కదా. ఎక్కడినుండి వచ్చిందో కానీ గాయం చేయకుండా రక్తం తాగే రాక్షసి ఇది.

ఇన్ని భయాల మధ్య విషాదం నిండిన వార్తలను వింటూ ప్రపంచ దుస్థితికై విచారిస్తూ బెదిరిపోయే గుండెను కదలకుండా గట్టిగా పట్టుకుంటూ గడిపే కాలంలో పులి మీద పుట్రలా ఇదే సమయంలో అతనికి ఆరోగ్యం బాలేకపోవడం అశాంతిని కలిగిస్తోంది.

కొంపదీసి అదే ఇది కాదుగా. మామూలు జలుబనే కాస్త ధైర్యంగా ఉందామె. ఎందుకంటే అతనికి జ్వరంలేదు మరి.

ఈ సమయంలో ఆసుపత్రికి వెళ్ళాలంటే అంబులెన్సుకు కాల్ చెయ్యాలి. ఇక గత్యంతరం లేదు. గణ గణ గంటలు మ్రోగించుకుంటూ వచ్చే దాన్ని చూస్తూనే పై ప్రాణాలు పైనే పోతాయి. హాస్పిటల్ కి పంపిస్తే భయంతో ప్రాణం పోతే ఏం చేయాలి. ఈ టైంలో వెంట ఎవరూ వెళ్ళడానికీ లేదు. వెళ్ళి చూడటానికీ లేదు. ఏంటో ఈ అగ్ని పరీక్ష. ఏమి చేయడానికి పాలు పోవడం లేదు.

కర్ఫ్యూ ఇంకో పది రోజులు ఉంది. బాగా ఆరోగ్యంగా ఉన్న మనిషికి ఈ జలుబు ఇప్పుడే రావాలా. ఏంటో ఏమీ కాదులే. తగ్గిపోతుంది. రెండ్రోజుల్లో కోలుకుంటాడు. తనకు తానే ధైర్యం చెప్పుకుంది.

అయినా ఆమె మనసు నిలవడం లేదు.

అసలే కిటికీ లేని గది. గాలీ వెలుతురూ ఉండదు. బయట ఎడారి ఎండ. ఈ చిన్న గదికే అద్దె ఇరవయి అయిదు వేలు. అన్యాయం కదా. ఇక్కడ కువైట్ లో అంతే. సంపాదించే సగం జీతాలు ఇంటి అద్దెలకే పోతాయి.

అవును. టివి సౌండ్ కూడా వినబడటం లేదు. అది చూస్తే అయినా కాస్త మైండ్ రిలాక్స్ అవుతుంది కదా. ఈ సమయంలోనే టి వి కూడా చెడిపోయిందట. ఏంటో అన్నీ ఒక్కసారిగా దండెత్తి వచ్చి మీదపడినట్లుంది.

ఆరోగ్యం బాలేని మనిషికి ధైర్యం చెప్పాలి అనుకుంటూ ఆ రోజు ఫోను మాటల్లో "మీకు ఏమీ కాదు. కంగారు పడకండి" అంది ఆమె.

చిన్నగా నవ్వాడతను. అతను నవ్వితే పగలే వెన్నెలలు కురుస్తాయి. చందమామలా చల్లగా పలకరిస్తుంది ఆ నవ్వు.

అందమైన ఆ నవ్వు చూస్తూ మైమరచిపోయిందామె.

అతడొక మైకం.

అతడొక పరవశం.

అతడొక మోహం.

అతడు ఆమె ఒడిలో ఊగే పసిపాపాయి.

జీవిత పాఠాలు బోధించే గురువు.

సముచితమైన సలహాలిచ్చే ఆత్మీయుడు.

ఆమెను శృంగార లోకాల్లో తేలియాడించే పురుషుడు.

అతన్ని చూస్తే చాలు మనసు నిండిపోతుందామెకు.

అతనితో నడుస్తుంటే మరో అందమైన ప్రపంచం వైపు అడుగులు వేస్తున్నట్లుంటుందామెకు.

అతడే ఆమె కంటికి వెలుగు. ఆమె నోట వెలువడే మాట. మనసు నిండి పొంగి పొరలే ప్రేమధార.జీవితాన్ని తీయని అనుభూతుల పరిమళాలతో నింపిన వాడు.

ఎన్నని చెప్పాలి? అతని గురించి..

అతడొక పూల కొమ్మ. పూల వంటి జ్ఞాపకాలతో మదిని నింపినవాడు.

“ఏం చెయ్యగలవు నువ్వు? సతీసావిత్రిలా ఆ యమధర్మరాజుతో పోట్లాడి నా ప్రాణాన్ని వెనక్కి తెచ్చుకోగలవా” అన్నాడతను ఉన్నట్లుండి.

ఉలిక్కిపడిందామె సరిగ్గా అర్థం కాలేదు.

“ఏంటీ? ఏమన్నావ్? మళ్ళీ చెప్పు”

“అహ ఏమీ లేదు” నవ్వాడతడు. ఈసారి పేలవంగా

“సరిగ్గా చెప్పు.”

మరలా అదే మాటను చెప్పాడతను ఆమె ముఖంలోని భావాలను గమనిస్తూ. వినగానే కదిలిపోయిందామె. మనసు వణికింది.

“ఛీ. ఏం మాటలవి? ఎందుకలా మాట్లాడతావ్ అస్సలు ఏమీ కాదు నీకు. రెండ్రోజుల్లో బాగయిపోతుంది. ఇప్పటికే కాస్త తేరుకున్నారు కదా” చెప్పిందామె అనునయంగా.

“ముఖం పీక్కుపోయింది కదూ” అద్దంలో చూసుకుంటూ చెప్పాడు.

“ఎలా ఉన్నా నీ ముఖం నాకు ముద్దుగానే ఉంటుంది. తేడా తెలియదు నా కళ్ళకి. చక్కనయ్య చిక్కినా అందమే” చెప్పింది కళ్ళు విప్పార్చి అతని ముఖాన్ని చూస్తూ.

నిజమే కదా. అతన్ని ఎంత చూసినా ఎంత మాట్లాడినా ఎంత కాలాన్ని గడిపినా తనివి తీరదు సమయం సరిపోదు.

అందుకే అంటుంది ఈ జీవితం సరిపోదు మనకి అని.

అతడంటుంటాడు. “నువ్వు చాలా ఆలశ్యంగా వచ్చావు నా దగ్గరికి. అందుకే ఈ కొద్ది కాలమైనా నిన్ను నా జ్ఞాపకాలతో నింపేస్తాను. నేను లేకపోయినా నువు నా స్మృతులతో కాలం గడపాలి. మరో జన్మలో తప్పకుండా మనం పూర్తి జీవితాన్ని కలిసి గడుపుదాం. ఒకే ప్రాణంగా, ఆత్మగా విడదీయరాని బంధమై జీవిద్దాం” చెప్పాడు నమ్మకంగా.

“అవును. మరో జన్మే కాదు. ఎన్ని జన్మలైనా మనం కలిసే ఉండాలి” చెప్పిందామె స్థిరంగా.

కాసేపు మౌనంగా ఉండిపోయారు ఇద్దరూ.

ఏదో మాట్లాడాలి అన్నట్లుగా.”మనం సరిగ్గా ఎనిమిది నెలల క్రితం ఈ టైం లో హరిద్వార్ లో ఉన్నాము. గంగానది ఒడ్డున కూర్చుని నీళ్ళలో కాళ్ళు పెట్టుకుని ఆ అద్భుతమైన అనుభూతిని కలిసి ఆనందంగా అనుభవిస్తున్నాం. గంగ ప్రాణం ఉన్నట్లే ఉరుకుల పరుగులతో

ప్రవహిస్తోంది. నాకది అద్భుతమైన అనుభవం. అక్కడి గంగా హారతి మదిలో ఎంత గొప్ప భక్తి భావాన్ని కలిగిస్తోందో మాటల్లో చెప్పలేను" ఆ సంగతులన్నీ గుర్తుచేసిందామె సంతోషంగా.

"ఆ అవును అప్పుడే ఎనిమిది నెలలయిందా? ఈ కరోనా లేకపోతే ఇప్పుడు ఇంకో ట్రిప్ ఎక్కడికైనా వెళ్ళే వాళ్ళం అన్నాడు" నిట్టూర్చుతూ.

"ఇది పోయాక కేరళ వెళదాం"ఉత్సాహంగా చెప్పిందామె.

"హు.. ఇది అప్పుడే పోదు. ఎంతమంది ప్రాణాలు తీసుకెళ్ళిపోతుందో" శూన్యంలోకి చూస్తూ చెప్పాడు.

ఎందుకో అతడి మాటలు ఆ చూపులు భయం కలిగించాయి.

"సరే. నాకు కొంచెం నీరసంగా ఉంది. ఇక పడుకుందామా?"

ఇంకా మాట్లాడాలనిపిస్తోంది కానీ ఎన్నడూ అతని మాటకు ఎదురు చెప్పని ఆమె "సరే రెస్ట్ తీసుకోండి ప్రొద్దుటే ఫోన్ చేస్తాను" అంది.

"అలాగే" మంచం మీద పడుకుంటూ చెప్పాడతను.

పడుకుందామని ప్రయత్నించింది కానీ నిద్ర పట్టలేదు. ఏదో దిగులు నిలువెల్లా క్రమ్ముకుంది. ఏం చెయ్యాలి. బాగా నీరసించి పోయాడు. ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగానే ఉంటాడతను. కాబట్టి అంత భయమేమీ అవసరం లేదు అనుకుందామె.

అదే ఆమె చేసిన పొరపాటు.అదే వాళ్ళకి ఆఖరి రాత్రి అవుతుందని ఆమె అనుకుని ఉంటే ఏదో ఆలోచించి జాగ్రత్తలు తీసుకునేదేమో.

దిగ్బంధనంలో చిక్కుబడి పోయినట్లుంది. కదలడానికి లేదు. ఎన్ని రోజులు ఇలా. కాస్త జలుబుకే ఎందుకతడు అలా మాట్లాడుతున్నాడు. కరోనా అని భయపడుతున్నాడా? అపశకునాన్ని సూచిస్తూ ఆకాశంలో ఏదో పక్షి అరిచినట్లనిపించింది. ఎందుకో వళ్ళు జలదరించింది.

సమయం చూస్తే తెల్లవారు ఝామున మూడవుతోంది. ఎడతెగని ఆలోచనలతో అలా పడకపై వాలిందామె. గలగల పారే గంగా నది కళ్ళముందు మెదిలింది. ఆ కదలికల్లో తొణికిసలాడే జీవం పలకరిస్తోంది. రా రమ్మని చేతులు సాచి పిలుస్తోంది.

ఈసారి కాశీ వెళ్ళాలి. అక్కడి గంగ ఎలా ఉంటుందో చూడాలి. భవిష్యత్తు గురించిన అందమైన కలలతో నిద్రలోకి జారుకుందామె.

నిద్రలో అన్నీ పీడకలలే.అతడు పసిపాపాయిలా రెండు చేతులు పైకి సాచి మేఘాలతో ఆడుకుంటూ ఆకాశంలో పైపైకి తేలిపోతున్నాడు. ఎక్కడికో వెళ్ళిపోతున్నాడు. మేఘాలన్నీ దూదిపింజెల్లా గాలిలో తేలిపోతున్నాయి. అతడి మొహం ప్రశాంతంగా చిరునవ్వుతో నిండి ఉంది.

ఉలిక్కిపడి లేచిందామె. మనసంతా కలవరం. వళ్లు వణికి పోతోంది. అంతటి ఏసి లో కూడా మొహమంతా చెమటలు పట్టేసాయి.

ఏమయింది? ఏంటిది? కలా? ఎందుకలాంటి కల వచ్చింది. భయమేసింది. కెటిల్ లోని నీళ్లు గ్లాస్ లో వంపుకుని గటగటా తాగేసింది. ఏమయిందతనికి? ఎందుకలా ఆకాశంలో తేలిపోతున్నాడు? తనను వదిలేసి ఎక్కడికి పోతున్నాడు? భయమేసింది. టైం చూస్తే ఉదయం ఆరయ్యింది.

కాల్ చేద్దామనుకుని ఇపుడే వద్దు నిద్రలో ఉంటాడేమో? ఏడు గంటలకి కదా లేపమన్నాడు అనుకుంటూ కాసేపు అసహనంగా కాలం గడిపింది.

ఇక మనసాగలేక ఆరూ పదిహేనుకు కాల్ చేసింది. ఎత్తలేదు. మళ్ళీ చేసింది. నో ఆన్సర్. ఈసారి వళ్ళు కాదు గుండె వణికిందామెకి.

ఏం చెయ్యాలో తోచడం లేదు. నిన్ననే ఇంటి ఓనర్స్ నంబర్ ఇమ్మని అడిగిందామె.

“ఎందుకు?” అన్నాడతడు.

“ఒక వేళ నువు నా కాల్ లిఫ్ట్ చెయ్యక పోతే” మధ్యలోనే ఆగిపోయిందామె మాట పూర్తి చెయ్యలేక.

అతడి ముఖంలో అసహనం. "సీతా! నీకెందుకు వాళ్ళ నంబర్. నువు కాల్ చేస్తే నేను తీయకుండా ఉంటానా? అది అసంభవం కదా. గాఢ నిద్రలో ఉన్నా కూడా నీ కాల్ తీస్తాను కదా. ఇన్నేళ్ళుగా ఎప్పుడైనా అలా జరిగిందా చెప్పు? నీ సంగతి నాకు బాగా తెలుసులే. నువ్వు కంగారుపడి అనవసరంగా వాళ్లని ఇబ్బంది పెడతావు. అలా చెయ్యడం నాకు నచ్చదు" అతడి మాటల్లో కోపం తొంగి చూసింది.

ఎవరికీ ఇబ్బంది కలిగించని మనస్తత్వం. ఇక మారు మాట్లాడలేదామె. నిజమే. మూడేళ్ళుగా ఏ రోజూ కాల్ తీయకుండా లేదు. అవును ఎందుకు తీయదు? తప్పకుండా తీస్తాడు కదా సర్ది చెప్పుకుంది.

కానీ... ఇప్పుడు తీయడం లేదే. ఏమయింది? అర్ధరాత్రిపూట బాలేక హాస్పిటల్ కి వెళ్లాడా? మధ్య రాత్రి లేపడమెందుకని కాల్ చేసి చెప్పలేదేమో?లేక ముందే లేచి బాత్ రూం కి వెళ్ళాడా?కాసేపు చూద్దాం అనుకుంటూ పది నిముషాలు చూసింది. అతడినుండి కాల్ రాలేదు. ఎప్పుడూ ఇలా కాల్ ఆన్సర్ చెయ్యకుండా ఉండడు. ఏదో కీడును శంకించింది మనసు.ఏమి చెయ్యాలో అర్థం కాక గిజ గిజ లాడి పోయింది.

గుర్తొచ్చిన దేవుళ్ళందరికీ మ్రొక్కనారంభించింది. తెలియరాని సంగతులేవో హృదయానికి తెలిసిపోతున్నాయి. ఆత్మ దుఖంతో రగిలిపోతూ విలపిస్తోంది. ప్రాణం లోపలికీ బయటికీ గింగిరాలు తిరుగుతోంది. అతడి దగ్గరికి వెళ్ళాలని పరిగెడుతోంది.

కాల్ మరలా మరలా చేసింది. మ్రోగుతోంది కానీ.. కానీ ఎత్తడం లేదు.

ప్రియతమా!

మూడేళ్లుగా నా కాల్ నీకు సుప్రభాతమయ్యెనే. కమ్మని నిద్రకు తీయని కలలకు తెర తీసే శుభరాత్రి ఆయెనే. ఎన్నో ముచ్చట్లు ఫోనులో ప్రవాహమై పొంగెనే. ఇప్పుడు ఎందుకు నా ఫోన్ కాల్ లిఫ్ట్ చెయ్యవు? నిద్రలోనైనా తీస్తానని చెప్పావు కదా. మరి ఒక్కసారి తియ్యవా. ఒక్క మాట మాట్లాడవా.

ఫోన్ మ్రోగుతోంది. ఎవరో కాల్ చేసారు. అతనే చేసాడనుకుని సంతోషంగా కన్నీళ్లు తుడుచుకుని చూస్తే. కాదు. అనిత. అతనికి దూరపు బంధువు. వరుసకు చెల్లెలు అవుతుంది. అపుడపుడూ స్నేహంగా మాట్లాడుతుంది.

కానీ ఇద్దరి మధ్య ఉన్న అనుబంధం గురించి తనకు తెలియదు.

"సీతా.. నీకీ సంగతి తెలుసా? మా అన్నయ్యను అమిరి హాస్పిటల్ కి తీసుకెళ్ళారట. రూం లో పడిపోయాడట. ప్రొద్దుటే ఓనర్సు చూసి అంబులెన్సుకు కాల్ చేసారట"

“ఓ హాస్పిటల్ లో ఉన్నాడా?”

హమ్మయ్య. పోనీలే ఆ నీరసానికి డాక్టర్లు ట్రీట్మెంటు ఇస్తారు. అనుకుంటూ గ్లాసులోని నీళ్ళు తాగబోయిందామె..

మళ్ళీ ఫోను. అనితనే చేసింది.

ఈసారి ఫోన్ ఎత్తడం ఆలశ్యం ఏడ్చేస్తోంది.

"మా అన్నయ్య ఇక లేడంట" భోరుమంది.

ఆమెకు ఏడుపు రాలేదు. పెదవులపైకి పాక్కుంటూ నవ్వొచ్చింది. అతడిని తలచుకుని నవ్వింది నవ్వుతూ ఏడ్చింది. వస్తున్నా ఉండు నేను కూడా నీతో వచ్చేస్తున్నా అని దిక్కులు పిక్కటిల్లేలా అరిచింది.

ఏదో విస్ఫోటనం. ఫెటిల్లుమనే చప్పుడు. నరాలన్ని తెగిపోయిన భావం. అక్కడే అలాగే నేల మీదికి ఒరిగి పోయిందామె.

భలే ఉంది విశాలమైన ఆకాశం. తెల్లటి మేఘాలు. అతడి చేతిలో చెయ్యి కలిపి. వాటిపైగా గాలిలో తేలి పోతూ. రెక్కలుకట్టుకుని ఎగురుతూ సంతోషంగా తృప్తిగా అతడి ముఖంలోకి చూస్తూ ఆకాశపు పొరలను దాటుకుని పై పైకి పోతుంటే ఆహా ఎంత హాయి.

అదొక అందాల లోకం అంతులేని పారవశ్యం.

అద్భుతం. చాలు ఇంకేం కావాలి ఈ జన్మకి.

ఇక లాక్ డౌన్ లూ కర్ఫ్యూలు కరోనాలూ  అనారోగ్యాలూ  ఏవీ మనల్ని విడదీయలేవు. మనకిక ఎడబాటనేది లేనే లేదంటూ గట్టిగా అతడ్ని హత్తుకుందామె.

# ఎడారి లేఖ

**ప్రియమైన రెడ్డక్కా..**

మేమిక్కడ అందరమూ బావున్నాము. నువ్వక్కడ క్షేమంగా వున్నావని భావించుచున్నాము. నీ ఆరోగ్యం బాగున్నది కదా. ఎప్పుడూ నీ గురించే మేము తలచుకుంటూ ఉంటాము. నీ మాటే చెప్పుకుని సంతోషపడుతూ వుంటాము.

నాలుగేండ్లలో నువు మొగోడి మాదిరి రెండంతస్తుల మిద్దె గట్టించి నాలుగు కుంట్ల భూమిని కొనుక్కున్నావు. నీ ధైర్యాన్ని మెచ్చుకోవచ్చు. నీ మాదిరి కొయేటికి పొయ్యి ఇంత తొందరగా సంపాదించి మిద్దెలు గట్టిన మొనగాడు మన ఊర్లోనే లేడు.

ఆ దోవన పొయ్యేటప్పుడు రంగులేసిన నీ మిద్దెను చూసి మీసాలున్న మొగోడురా రెడ్డెమ్మ ఎంత బాగా మిద్దె కట్టిందో చూడు అని నీ గురించి ఊళ్లో అందరూ గొప్పగా అనుకుంటున్నారు.

ఈ కాలం డబ్బుంటేనే కదా మనిషికి విలువ. నువ్వక్కడ ఎన్ని కష్టాలు పడినా నీ సంపాదన చూసి ఇక్కడ నీకు గౌరవం ఇస్తారు.

పోయిన సారి నువు ఇక్కడికి వచ్చినప్పుడు ఇచ్చిన కోయేటి సబ్బులు షాంపూలు బలే వాసన ఉన్నాయి.

అప్పటి నుండి నీ పెద్ద కూతురు లచ్చిమి అమ్మా నువ్వు పెద్దమ్మను అడిగి వీసా తెప్పించుకో. నువు కూడా కోయేటికి పోయ్యి మాకోసం సబ్బులు, షాంపూలు, గుడ్డలు, వాచిలు, బొమ్మలు తీసుకురా అని ఒకటే అడుగుతాంది. పెద్ద పిల్ల రేపో మొన్నాడో పెద్ద మనిషి అయ్యేటిగా ఉండాది. నాలుగేండ్లు పోతే పెళ్లి కూడా చెయ్యాల.

నీ మరిది చూస్తేనేమో పొద్దన లేచిన కాడి నుంచీ తాగడం తలకు పోసుకోవడం. పెళ్లాం గురించీ బిడ్డల గురించీ కొంచెమైనా ఆలోచనే లేకపోయె.ఒక్క పని చెయ్యడు. అయినా మూడుపూటలా కోడికూర లేకపోతే ఆ మగోడికి ముద్ద నోట్లోకి దిగదు. ఉన్న రెండు కుంటల భూమిని నేనే సేద్యం చేసి నా రెక్కల కష్టంతో పంటలు పండించి పిల్లోళ్లకు ఇంత తిండి పెట్టగలుగుతున్నాను.

పోనీలే తాగితే తాగినాడు ఎట్టన్నా చావనీ అనుకుంటాను  కానీ తాగినోడు ఇంటికి వచ్చి తిని పడుకోడు కదా. వయసొచ్చిన ఆడపిల్లోళ్ల ముందర నన్ను పట్టుకొని చెడ్డ మాటలు తిడతాడు. ఇష్టమొచ్చినట్లు కొడతాడు. పిల్లోళ్ల ముందు సిగ్గుపోతాంది.

రోజూ ఆయన కొట్టే దెబ్బలకు వళ్లు వాచిపోతోంది. తెల్లారి లేచి చేని కాడికి పోలేక పొలం పనులు చేయించలేక నా ప్రాణం పోతాంది.

ఈ బాధలన్నీ తట్టుకోలేక పోతున్నాను. అందుకే కోయేటికి వద్దామని నేను నిర్ణయించుకున్నాను.

ఏదో పెదనాయన కూతురివని, అక్కవని నోరు తెరిచి వీసా పంపించమని నిన్ను అడుగుతున్నాను. ఆ తాగుబోతోడికి తెలియకుండా పెద్ద కూతిరి చేత ఈ జాబు రాపిస్తున్నాను. నేను కోయేటికి పోతాననే మాట వాడికి తెలిస్తే నా తాట తీసి ఇంటి ముందు ఆరేస్తాడు. పెళ్లాం బిడ్డలను సాకలేకున్నా పౌరుషానికి మాత్రం కొదవ లేదు. మొన్న ఊరికే తమాషకు కోయేటికి అందురూ పోతున్నారు అని ఒక మాట అట్టా అన్నాను.

దానికి, మొగుడ్ని వదిలి పెట్టి కొయేటికి పొయ్యే ఆడది సంసారేనా అది అంత దూరం పొయ్యి సక్కగా తిరుక్కోని వస్తాదంటే ఎవడు నమ్ముతాడు. అక్కడంతా తిరిగి వస్తే ఎవడు ఏలుకుని సంసారం చేస్తాడు. అలాంటి దాన్ని నరికి కాకులకు గద్దలకు వేసినా పాపం లేదని తిట్టినాడు.

నాకయితే భయంగానే ఉండాది కానీ పిల్లోళ్ల ముఖం చూస్తే జాలి కలగతాంది. కట్టుకోను సరైన గుడ్డ పేలికలు కూడా లేవు. కడుపునిండా తినేదానికి కూడు కూడా లేదు. వీడేమో నన్ను కొట్టి సంపుతాండాడు. ఏదో ఒక రోజు నా ప్రాణం పోయిందంటే పిల్లోళ్లు అనాధలై పోతారు. ఇద్దురు పిల్లోళ్లు చాల్లే అంటే వింటాడా.

నాకు నలుగురు పిల్లోళ్లన్నా కావాలి కంటావా నన్ను వదిలేసి నీ అమ్మ గారింటికి పోతావా. ఇంకో దాన్ని పెళ్లి చేసుకుని నలుగర్ని కంటా అని తిట్టినాడు. ఆరేళ్లలో నాకు నాలుగు కడుపులు తెచ్చి పెట్టినాడు.

బిడ్డలను చదివించాలన్నా డబ్బుండాలి సంపాదించాలి కదా. ఆడదాన్ని ఏమి చేసేది. మనూరోళ్లు చానా మంది అక్కడ ఉన్నారు. కానీ పరాయి వాళ్లను అడగలేము కదక్కా. అయినోళ్లకైతే బాద బదనాయమూ ఉంటాయి. మన అనీ, రక్త సంబంధమనీ బాధ్యత ఉంటాది. అందుకే నిన్ను ఇంతగా అడుగతా ఉండాను.

నా కోసం కాదు ఈ నలుగురి పిల్లోళ్ల మొఖం చూసయినా నువ్వు నాకు వీసా పంపియ్యాల. ఇక్కడి పరిస్థితి నీకు తెలియంది ఏముంది. పోయిన సంవత్సరం వచ్చినప్పుడు చూసినావు కదా. మాపులూ పగలూ కష్టం చేసి నా వొళ్లు ఎలా ఉందో.

పెళ్లి కాక ముందు ఊళ్లో వాళ్లందరూ ఎర్రమ్మీ అని పిలిచే వాళ్లు. ఎర్రగా ఇంత లావు ఉండేదాన్ని. తల్లో వెంట్రుకలు మోకాళ్లకాడికి జీరాడేటివి. ఊళ్లో వరసయిన మగపిల్లోళ్లందరూ ఓ ఎర్రమ్మే బలే ఉండావుబ్బా. నన్ను చేసుకుంటావా అని ఎగతాళి చేసేవోళ్లు కదా.

నా రాత బాలేక ఈ మొగోడిని చేసుకుని కులబట్టయిపోతిని. రోజూ దెబ్బలు తిన లేక ప్రాణం అల్లాడి పోతాంది. ఇప్పుడు చూడు ఎలా ఉన్నానో.

వంటి మింద కాలు కేజీ కండ కూడా లేదు. వట్టిపోయిన ఎనుము లాగా ఎమికెలు బయటికి కనపడుతున్నాయి. పిల్లోళ్లను కంటిని, వాళ్లను సాకే విదానం కూడా తెలియాలి కదా. వాళ్లను చూస్తుంటేనే దిగులు. కడుపులో ఏదో బాధ. అందుకే కొయేటికి వస్తే కళ్లు మూసుకొని నాలుగేండ్లు వుంటే నాలుగు రూకలు సంపాదించుకోవచ్చు. తరువాత ఆడపిల్లోళ్లకు నాలుగు తులాలు బంగారు పెట్టి పదివేలు లెక్క ఇచ్చి పెళ్లి చేస్తే వాళ్ల బ్రతుకు వాళ్ళు బ్రతుకుతారు.

నా మింద దయవుంచి నువు ఈ విషయాన్ని సీరియస్ గా ఆలోచన చెయ్యాల. ఈ ఒక్క సహాయం గనుక చేసినావంటే నీ రుణం నేను నేను వుంచుకోను. ఏదో ఒక విధంగా తిరిగి తీర్చుకుంటాను. నీ కాళ్ళు పట్టుకుంటాను. నన్నూ పిల్లల్ని దయచూడు. ఏదో నీ మాదిరి నాలుగేండ్లు కోయేటిలో వుంటే పిల్లోళ్లను చదివించుకుని ఈ పూరిల్లు పడగొట్టి చిన్న మిద్దె కట్టుకుంటాను.

ఈ జాబు చేరిన వెంటనే నువు నాకు ఏ సంగతీ తెలిపితే నేను పాస్ పోర్ట్ తయారు చేయించుకుంటాను. మడో భూమో అమ్మి టిక్కట్టు కొనుక్కుని కువైట్ కి వస్తాను. అక్కా తొందరగా నువు నాకు జాబు రాయి. నీ తిరుగు జాబు కోసం వేయి కండ్లతో ఎదురుచూస్తా ఉంటాను.

**ఇట్లు నీ చెల్లెలు**

**వరమ్మ.**

❦❦❦

**కువైట్**

**ప్రియాతి ప్రియమైన వరమ్మకు,**

రెడ్డెమ్మక్క కువైట్ నుండి రాయునది. నీ జాబు చేరినది. విషయాలు తెలిసినాయి.

నిజమే నువ్వేమో కొయేటికి వస్తా అని ఎగురుతావు. ఇక్కడ పరిస్థితులు కూడా చూడాలి కదా. ముందులాగా ఇక్కడ వీసాలు అంత సులభంగా దొరకడం లేదు. ఒక్కొక్క వీసా కొనుక్కోవాలంటే కనీసం లక్ష రూపాయలన్నా అవుతాది. నీకిష్టమయితే భూమి అమ్మి లక్ష రూపాయలు అక్కడే మీ బావ చేతికి ఇవ్వు.

నెల రోజులలోపల నీకు వీసా పంపిస్తాను. పోయిన నెల ఎగవీధి కర్రెమ్మికి వీసా పంపినాను. నేను చెప్పినట్లు బంగారాన్ని నాల్రోజుల్లో అమ్మేసి లక్ష రూపాయలు డబ్బు మీ బావకు ఖచ్చితంగా కట్టింది.

రేపో మొన్నాడో విమానం టిక్కట్టు కొనుక్కుని కొయేటికి వస్తోంది.

తరువాత మొహమాటం వద్దు. నేను కూడా ఇక్కడ పదిమందికి జవాబు చెప్పుకోవాలి. వీసా వ్యాపారం అంటే అంత సులభం కాదు. అందుకే ముందే చెబుతున్నాను. నాకు అయిన వాళ్లయినా ఒకటే పరాయి వాళ్లయినా ఒకటే. లక్ష రూపాయలు కడితే వెంటనే నువ్వు ఇక్కడికి రావచ్చు. ఆలోచించుకొని ఏ మాటా నాకు చెప్పు.

**ఇట్లు**

**రెడ్డెమ్మ**

రెడ్డెమ్మ జాబు చూసినాక కాళ్లూ చేతులూ ఆడలేదు వరమ్మకు. ఏం చెయ్యాలో కువైట్ కి వెళ్లాలంటే లక్షరూపాయలు ఎలా సంపాదించి ఆ రెడ్డెమ్మకు కట్టాలో అర్థం కాలేదు.

భూమి అమ్మితే మొగుడు వప్పుకోడు. తెలియకుండా అమ్మాలి.

వరుసకు అక్క అవుతాది దగ్గర బంధుత్వం కదా సహాయం చేస్తాది అని అనుకునింది కానీ ఈ విధంగా ఇంత డబ్బు కర్చవుతాదని తెగేసి చెపుతాదని అనుకోలేదు. చివరికి నాల్రోజులు ఆలోచించి కువైట్ కు పోవాలనే ఆశ చావక భూమి అమ్మడానికే నిశ్చయించుకుంది వరమ్మ. మొగుడికి తెలియకుండా ఒక కుంటడు భూమి బేరం పెట్టింది. భూమి అమ్ముకుంటున్నదుకు కళ్లలో నీళ్ళు తిరిగాయి అయినా వచ్చిన కాడికి తక్కువకు అమ్మిపారేసింది.

మొగుడు తాగి పడుకున్నపుడు పేపర్ పైన వేలి ముద్రలు నొక్కింది. లక్ష రూపాయల డబ్బు కట్టలు తీసుకెళ్లి రెడ్డెమ్మ మొగుడి చేతిలో పెట్టింది. ఇల్లు ఇంకొక పోర్షను కట్టాల నీలాంటోళ్లు ఇంకొక నలుగురు వీసాలు కొంటే మేము ఇంకొక మిద్దె కట్టుకుంటాము అంటూ డబ్బు లెక్కపెట్టుకున్నాడు అతడు. అప్పుదర్థమైంది వరమ్మకు వీసాలు అమ్మి నాలుగేళ్ళలో ఇంత పెద్ద మిద్దె ఎలా కట్టారో.

అనుకున్నట్లుగానే వీసా వచ్చేసింది.

ప్రయాణానికి సిద్ధపడాలి. మెడికల్ చేయించుకోవాలి. అందుకు మద్రాస్ పోవాలి. ఈ సంగతి మొగుడికి ఎలా చెప్పాలి. తెలిస్తే చంపేస్తాడు. ఏ అబద్ధము చెప్పి మద్రాసు దాకా పోయి రావాలో తెలియక ఆలోచించి బుర్ర వేడెక్కి పోయింది.

ఎలాగో ఎదురింటి పుల్లమ్మత్త సహాయంతో అట్టా తిరపతి దాకా పోయిస్తానని చెప్పి బయటపడింది. అప్పటికీ తిడుతూనే ఉన్నాడు. నువు సంసారం చేసే దానివేనా. తిరుపతికి బోయి ఎవడితో తిరిగి వస్తావే అంటూ.

గుండె దడ దడలాడుతుంటే పెద్ద కూతురికి ఇంటి బాధ్యత అప్పజెప్పి బస్సెక్కింది వరమ్మ. మద్రాసు పొయ్యి తిరిగి వచ్చేటప్పటికి అర్ధరాత్రి దాటింది. మెడికల్ పాసయినందుకు సంతోషంగా ఉందామెకు. ఏజంటు కూడా వచ్చాడు ఆమెతో పాటు.

నా సర్వీసులో ఇలాంటి కేసులు ఎన్ని చూడలేదు. తాగుబోతు మొగుడికి తెలియకుండా ఎంత మంది ఆడోళ్లను కువైట్ కి ఎక్కించలేదు. "నీకెందుకు. ధైర్యంగా ఉండు. టికెట్ ఓ కె అవుతానే నిన్ను విమానం ఎక్కించేస్తాను" అని ధైర్యం చెప్పాడు.

ఏదయితే అదయిందిలే అని తెగించిన మనసుతో ఇంట్లో అడుగు పెట్టింది వరమ్మ.

అప్పటికే ఫుల్లుగా తాగి ఆమె కోసం ఎదురు చూస్తున్నాడు భర్త. చేతిలో కొడవలి చేతబట్టుకుని.

ఆమె రావడం ఆలశ్యం "ఎవడితో తిరిగొచ్చావే ఇంతసేపు" అంటూ కొడవలితో నాలుగు వేట్లు వంటిపై వేసాడు. శరీరం తెగి గాయాలతో రక్తపు ముద్దలా నేలకు జారిపోయింది. పిల్లోళ్ల అరుపులు ఏడుపులతో వీధిలోని వాళ్లందరూ పరిగెత్తుకొని వచ్చారు.

అప్పటికే స్పృహ తప్పిపోయింది వరమ్మకు. అందరూ ఆమెను ఎడ్ల బండిలో వేసుకుని ఆసుపత్రికి తీసుకెళ్లారు. రక్తం బాగా పోయింది. రెండ్రోజులు గడిస్తేనే కానీ ఏ మాటా చెప్పలేమన్నారు డాక్టర్లు. తల్లీ తండ్రీ తానే అయి ప్రేమిస్తున్న తల్లిని రక్తపుమడుగులో చూసిన పిల్లోళ్లు పాపం విలవిల్లాడి పోయారు.

ఎంతమంది ఓదార్చినా ఏడుపును ఆపడం లేదు. వారం రోజులు గడిచాక కళ్లు తెరిచింది వరమ్మ. ఎలాగో ప్రాణం నిలబడింది.తనపై దాడి చేసినందుకు మొగుడు జైలు పాలయ్యాడని తెలిసి దుఖించింది. ఆమె దగ్గర మిగిలిన డబ్బంతా ఆసుపత్రి బిల్లు కట్టడానికే అయిపోయింది.

ఇంటికొచ్చేసరికి ఇరవై రోజులు పట్టింది. అప్పటికీ లేచి తిరిగే శక్తి ఆమెకు రాలేదు. ఇంకొక నెల రోజులు మంచం లోనే ఉండాలని చెప్పారు డాక్టర్లు. పెద్ద పిల్ల ఇన్ని గంజి నీళ్లు కాంచి నోట్లో పోస్తుంటే ప్రాణం నిలబడింది. పేదోళ్ల ప్రాణాలు ఎవరికి కావాలి. ఎవరికి అవసరం. కన్న బిడ్డలు మాత్రం కన్నీళ్లు పెట్టుకుంటారు.

కాస్త తేరుకున్నాక ఒకరోజు ఏజంటును రమ్మని చెప్పి పిలవనంపించింది వరమ్మ. వాడు వచ్చాడు.

"ఏమన్నా.. ఏమి చేద్దాము నాకు ప్రాణం కొంచెం బాగున్నది. ప్రయాణం పెట్టుకుందామా" అని అడిగింది.

పకపకా నవ్వాడు ఆ ఏజంటు.

"బలే దానివమ్మా. వీసా టైము ఇన్ని రోజులు ఉంటుందా. ఎప్పుడో అయిపోయింది. మళ్లీ కొత్త వీసా కావాలి నువ్వు కోయేటికి పోవాలంటే వచ్చిన వీసా సంవత్సరం ఉంటుందా నీ కోసం" అని చెప్పి చక్కా పోయాడు.

పొలం పోయింది. డబ్బు పోయింది. ఆరోగ్యం నాశనమై పోయింది. మొగుడు జైలు పాలయ్యాడు. అన్నీ పోతే పోనీ. వీసా డేటు అయిపోయిందని వినగానే కళ్ల చుట్టూ చీకటి కమ్ముకున్నట్లు

నిస్సత్తువగా కూలబడిపోయింది వరమ్మ.

“అమ్మా.. అమ్మా బాధ పడకు.. నేను పోతా కోయేటికి బాగా డబ్బు సంపాదించి మిద్దె కట్టిస్తా చెల్లిని తమ్ముడ్ని చదివిస్తా నువు భయపడకు” అంటూ పెద్ద కూతురు ఓదార్చుతుంటే.. భోరుమంది వరమ్మ.

అంతే కొన్ని బ్రతుకులంతే. పేదరికం నట్టింట్లో నిలువు గుంజలాగా పాతుకుపోతుంటే చరిత్ర పునరావృతమే.

# సీమ కరువు - కువైటులో బ్రతుకు తెరువు

లోపలికి వంగి చేతితో పాటూ తలకాయను కూడా కాగులోపలికి పెట్టి అడుగున వడ్లగింజలేమైనా మిగిలి వున్నాయా అని తారికలాడుతోంది రమణమ్మ.

కాగులోని అడుగంతా ఊడ్చి చేటలో పోసి కొలిస్తే ఆ వడ్లన్నీ ముంతడు కూడా లేవు.

"ఓబ్బా.. వున్న వడ్లన్నీ ఊడ్చేసినానబ్బా. ఇంగ కాగులో ఒక్క గింజ కూడా లేదు. రేపట్నించీ ఏమి చెయ్యాలో ఏమి తినాలో. నా వల్లయితే కాదు. ఏమి చేస్తావో అంతా నీ ఇష్టం" చెప్పింది రమణమ్మ.

నులక మంచం మీద పడుకుని పడమటవైపు వాలే పొద్దును చూస్తున్న సోమయ్య తల కూడా తిప్పి ఇటు వైపు చూడలేదు.

రెండేళ్ళనుండీ రాయల సీమలోని నాలుగు జిల్లాలనూ కరువు రక్కసిలా పట్టి పీడిస్తోంది. ఈ కష్టకాలం కన్నీళ్ళను కుమ్మరిస్తోంది. సంవత్సరానికి రెండు పంటలు పండించుకునే రైతులు కూడా కరువు విసిరిన పంజా దెబ్బకు విల విల లాడిపోతున్నారు. పంటలు పండక తిండికి గింజలు కరువైన రైతులందరూ ఆకలితో అల్లాడి పోతున్నారు.

అయితే అతి వృష్టి కాదంటే అనావృష్టి లా వుంది పరిస్థితి. ఒకే ఊరిలో వున్నా వాళ్లందరూ ఒకరి దగ్గర ఒకరు ఎంతకాలం అప్పు తీసుకుని గడపగలరు. పంటలే లేకపోతే అప్పు ఎలా తీర్చగలరు.

చాలా మంది రైతులు వచ్చిన కాడికి చాల్లే అనుకుని వుండే పొలాలను అమ్ముకుని పట్టణాలకు వలస పోతున్నారు.

ఊరొదిలి పోయేదానికి ఇష్టం లేని వాళ్ళు చాలా మంది ఆస్తులు అమ్ముకుని వీసాలు కొనుక్కుని ఎడారి దేశమైన కువైట్ కి బయలుదేరి పోతున్నారు.

ఆడవాళ్ళయితే అరబ్ షేకుల ఇండ్లల్లో వంట పని ఇంటి పని చేయడానికి పని మనుషులుగా వెళతారు. మగ వాళ్ళయితే ఇక్కడే డ్రైవింగ్ నేర్చుకుని అక్కడికి వెళ్ళి షేకులకు డ్రైవర్లుగా పనిచేస్తారు.

ఏదో ఎడతెగని ఆలోచనల్లో పడిన సోమయ్యను చూసి "ఓబ్బా. పిలుస్తాంటే ఇనపడలా నీకు. అడిగిన దానికి జవాబు చెప్పకుండా మొహం అటు పెట్టుకుని కూర్చుంటే ఎట్టా". విసుక్కుంది రమణమ్మ.

"అది కాదే ఈ కరువును మనం భరించలేము. పంటలు పండక చేతిలో డబ్బు లేక తిండికి కూడా కరువై ఏదో ఒక రోజు ఆకలితో చస్తాము. ఊళ్ళో అందురూ కొయేటికి పోతన్నారు. అందుకే

నేను కూడా ఒక మడికయ్య అమ్మేసి కోయేటికి పోతాను."

చెప్పి నిట్టూర్చాడు సోమయ్య.

పక పకా నవ్వింది రమణమ్మ.

"నీ మొహం చూడు. సరి అయిన తిండి లేక ఎలా పీక్కుని పోయిందో. ఆ కోయేటిలో పని నువ్వు చెయ్య గలవా. నువ్వు బడికి పోయి అక్షరం ముక్క చదువుకోలేదు. డ్రైవింగా నీకు రాదు.

మరి ఏం పని మింద నువ్వు అక్కడికి పోతావు. ఎవడు నీకు వీజా పంపిస్తాడు. అది జరిగే పని కాదు గానీ ఇంకొకటి చెప్పు" అంది నోట్లోని వక్కాకును తుపుక్కున గోడ మీదికి ఊస్తూ.

"మరెట్టా బతికేది ఎట్టా?" పిడికిలి బిగించి నుదుటి మీద కొట్టుకుంటూ అడిగాడు సోమయ్య.

"అన్నీ అమ్ముకోని పట్టణం పోదాం పాబ్బా ఆడ ఏదొ ఒక పని చేసుకోని బతుకుదాం."

"నా ప్రాణం పొయినా ఊరొదిలి పెట్టను. పుట్టి పెరిగిన ఊరు ఇది."

"అన్నీ అమ్ముకుని పట్టణం పోతే అక్కడ బతికేదీ కష్టమే. పట్టణం లో అన్నీ మోసాలే. అక్కడి వాళ్లు మనలాంటి పల్లెటూరు వాళ్ళను బాగా మోసం చేస్తారు. అక్కడైనా బతకడం తెలియాల లేకపోతే అక్కడ మనలాంటి పల్లెటూరి వాళ్ళు వుండటం కష్టం" చెప్పి నిట్టూర్చాడు సోమయ్య.

"అయితే నేను పోతా కోయేటికి" బదులుగా ఏం చెపుతాడా అని ఆశగా మొగుడి మొహంలోకి చూసింది రమణమ్మ.

"ఏమన్నావు మళ్ళా చెప్పు?" మంచం మీద పడుకుని వున్నవాడు లేచి కూర్చుని రెట్టించాడు సోమయ్య.

మొగుడి మొహం చూసి భయపడింది రమణమ్మ.

"ఏమీ లేదులే" అంది తడబడుతూ..

"అహ ఇంతకు ముందు ఏదో అన్నావు. మరలా చెప్పు ఆ మాట వినాలి" వదల్లేదు సోమయ్య.

"ఆడోళ్ళకయితే సులువుగా వీజా దొరుకుతుందంటబ్బా అక్కడ వంట పనికి ఇంటి పనికి వాళ్ళకు అవసరమంట. అందుకే కోయేటికి నేను పోతే బాగుంటాదని చెప్పినాను" చిన్నగా భయపడుతూ చెప్పింది రమణమ్మ.

"తలుపు మూలన వుండే రోకలి బండను తెచ్చి కొట్టినానంటే ఒక్కటే ఏటుకు నీ తలకాయ పగిలిపోతాది.

ఇంగొక్క సారి కోయేటి మాట ఎత్తినావంటే నా చేతిలో చస్తావు.

ఆడోళ్లు ఇల్లు వదిలి పోతే చెడిపోకుండా ఇంటికి తిరిగి వస్తారా.

నీకు మొగుడు అవసరం లేదా. నీకు ఎవురు నేర్పిస్తున్నారు ఇలాంటి బుద్దులు" గొడవకు దిగినాడు సోమయ్య.

"అది కాదు బ్బా" సర్ది చెప్పబోయింది రమణమ్మ.

ఎంత చెప్పినా వినలేదు సోమయ్య. అన్నం కూడా తినకుండా అలిగి పడుకున్నాడు.

మరుసటి రోజు పొయ్యి వెలిగించనే లేదు రమణమ్మ. పొద్దున్నే చద్దికి వుంటుందని రాత్రి మిగిలిన అన్నంలో చెంబుడు నీళ్ళు పోసి పెట్టింది. అలిగి పడుకున్న సోమయ్యా తినలేదు మొగుడితో పాటూ రమణమ్మా తినలేదు.

ఇద్దరు పిల్లోళ్ళు ఇంత తిని పడుకున్నారు.

ఏమి చెయ్యాలి సంసారాన్ని ఎలా ఈదాలి. ఇన్నేళ్ళలో పుట్టి బుద్ది ఎరిగిన తరువాత యింత కరువును చూడలేదు.

పక్కింటి సుబ్బమ్మనడిగి ముంతడు బియ్యం బదులు తెద్దామనుకుంటే వాళ్ళు మూడ్రోజులనుండీ గంజి నీళ్ళు తాగి కాలం గడుపుతున్నారంట.

వీధిలో వున్న అందరి పరిస్థితి అలాగే వుంది. దిక్కు తోచడం లేదు. మనుషులే కాదు గొడ్డూ గోదా కూడా బక్క చిక్కిపోయి వున్నాయి. మనుషులు కూడా ముసలీ ముతకా తిండి కరువై ఆకలి తట్టుకోలేక రాలి పోతున్నారు.

రక్షించే నాధుడెవరూ కనబడటం లేరు. ఆకలితో కడుపు నక నక లాడుతోంది రమణమ్మకు.

తినాలంటే బాధ. మొగుడు తినకుండా అలిగి పడుకుంటే తను ఎలా తింటుంది. ఇంకేమైనా వుందా. సోమయ్య అలిగినాడంటే నాల్రోజులైనా వులకడు పలకడు. తలనిండా దుప్పటి కప్పుకొని పడుకుంటాడు. నిద్ర పోతాడో ఆలోచిస్తాడో ఆ దేవుడికే తెలియాలి.

కాళ్ళు డొక్కలో పెట్టుకుని చుట్టింట్లో ఒక మూల చాపేసుకుని ముడుచుకుని పడుకుంది రమణమ్మ.

ఆ రోజంతా అదే పరిస్థితి. చీమ చిటుక్కుమనలేదు. ఎర్రగడ్డ నంజుకొని చట్టిలో వున్న సద్దిని పిల్లోళ్ళు తాగేసినారు.

ఇక ఏమి చెయ్యాలి.

అట్నే ఆ రోజు తెల్లారింది. ఆ రోజు శుక్రవారం. ఇరుగు పొరుగూ ఏమన్నా అనుకుంటారని పొద్దన్నే లేచి ఇంటిముందు ఊడ్చి కళ్ళాపి చల్లి ముగ్గు కర్ర వేసింది రమణమ్మ.

ఇంట్లోకొచ్చి సోమయ్య దిక్కు చూసింది. ఏందో మనిషి కదలను గూడా లేదు. మొన్నట్నించీ పైకి లెయ్యలేదు.

ఇక ఏమైతే అది అయ్యిందని దగ్గరికి వెళ్ళి "ఓబ్బా లెయ్యి. లేచి మొహం కడుక్కో" అనింది.

సోమయ్య పలకనే లేదు. చిన్నగా మొహం మీద దుప్పటి తీసి చూసింది.మనిషి ఏదో తేడాగా వున్నాడు. చెయ్యి పట్టుకుని చూసింది. వళ్లు సలసలా కాగిపోతాంది జ్వరంతో.

ఉలిక్కి పడింది రమణమ్మ. భయమేసింది. గట్టిగా కేకేసి పిల్లోళ్ళను పిలిచింది. ఏమి చెయ్యాలో కాళ్లు చేతులూ ఆడలేదు ఆమెకు. ఆసుపత్రికి పోవాలంటే దుడ్డు కావాలి.

వెంటనే కోమటోళ్ల చంద్రయ్య దగ్గరికి పరిగెత్తింది.

"చంద్రయ్యా నీకు పుణ్యం వుంటాది. రెండు నూర్లు దుడ్డు అప్పు ఇయ్యి. ఒక నెల రోజులకు అంతా ఇస్తాను" బతిమిలాడింది.

"పో పోవే బాగ చెప్పినావు. ఇప్పటికే వడ్డీతో కలిపి ఇరవై వేలు లెక్క బాకీ ఉన్నారు మీరు. పాత అప్పు ఒక్క పైసా కూడా తీర్చకుండా మళ్లీ కొత్త అప్పు ఇమ్మంటే ఎట్ట. ఉన్న అప్పులోకి ఎగవన వున్న మడి కయ్య రాసిస్తే కొత్త అప్పు ఇస్తాను" ఖచ్చితం గా చెప్పాడు చంద్రయ్య.

ఇంక ఏమి చెయ్యాలో అర్థం కాక కాళ్ళకున్న కడియాలు తీసి కుదువపెట్టుకొని దుడ్డు ఇమ్మంది.

ఆ కడియాలను పెళ్ళప్పుడు అమ్మగారు పెట్టినారు. అప్పట్నించీ పెళ్ళయి పదైదేళ్ళయినా ఒక్కసారి కూడా కాళ్ళల్లోంచి తియ్యలేదు.

ఇక వంటి మీద మిగిలింది మెళ్ళో తాళి బొట్టు కాళ్ళకి కడియాలే. తప్పదు. అవసరం అలాంటిది.

"వీటికి రెండు నూర్లు రాదే" అన్నాడు చంద్రయ్య కడియాలను తిప్పి తిప్పి చూస్తూ.

"నా మొగుడికి బాలేదు. ఆసుపత్రికి తొడక పోవాల. ఈ సారికి ఎట్టనో ఇచ్చినావంటే మళ్ళ మాటాడుకుందాం" దీనంగా చేతులు జోడించింది రమణమ్మ. అప్పటికే ఆమె కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి.

"సరే ఇదిగో తీసకపో" అంటూ రెండు వంద నోట్లు చేతిలో పెట్టాడు కోమటి చంద్రయ్య.

ఆ దుడ్డుతోనే ఒక కేజీ బియ్యం కొనుక్కొని పరిగెత్తతా ఇంటికి వచ్చింది. అప్పటికే మాటా పలుకూ లేకుండా వేళ్లాడి పోతున్నాడు సోమయ్య.

వెంటనే ఎద్దల బండి కట్టి పిల్లోడు బండి తోలుతుంటే రాజం పేటకు ఏసుకొని పోయినారు.

అక్కడ నాల్రోజులు వుండి నాలుగు గులుకోసులు ఎక్కిస్తే గానీ కళ్ళు తెరవలేదు సోమయ్య.

చచ్చి బ్రతికినట్లయింది అతని పరిస్థితి. అయిదో రోజు ఇంటికి వచ్చినారు.

తెచ్చిన రెండు నూర్ల దుడ్డు ఆసుపత్రికి అయిపోయింది.మరలా ఏమి చెయ్యాల్నో తిండికి ఎట్ట చెయ్యాల్నో అర్థం కాలేదు.

"నీ కాళ్ళల్లో కడియాలు ఏయే" అడగనే అడిగాడు సోమయ్య.

చెప్పింది రమణమ్మ. కోమటోళ్ళ చంద్రయ్య మాటలను కూడా. ఇప్పుడు ఏమి చెయ్యాలో ఏమి తినాలో కూడా చెప్పమంది.

పెళ్ళాం మొహం పిల్లోళ్ళ మొహం మార్చి మార్చి చూసినాడు సోమయ్య.

"ఏమే నువ్వు కోయేటికి పొయ్యి రెండేళ్ళు వుండి లెక్క బాగా సంపాదించక రాయే. కడుపునిండా తిండి అయినా తిందాం. లేకపోతే ఆకలితో చచ్చిపోతాం" అన్నాడు మొహం అటువైపు తిప్పుకుంటా.

మొగుడి మాటలకు ఆశ్చర్యపోయింది రమణమ్మ. నమ్మలేనట్టు చూసింది.

"నిజమేనే రవణా పంటలు పండేదీ లేదు ఈ కరువు రాయల సీమను వదిలి పోయేదీ లేదు. ఇలా అయితే మనం బతికేది కష్టమే. ఏదో ఒక రోజు అందరం ఆకలితో చచ్చిపోతాము. అందుకే వున్న మడి అమ్మేసి ఆ బాకీ తీర్చేసి మిగిలిందాంతో నిన్ను కోయేటికి పంపిస్తా" చెప్పినాడు సోమయ్య కంట్లో నీళ్ళు భార్యా బిడ్డలకు కనబడకుండా భుజాన వున్న తువ్వాలుతో తుడుచుకుంటూ.

అవును నిజమే  రాయలసీమలోని నాలుగు జిల్లాలోని వాళ్ళూ కుటుంబానికి ఒక్కరైనా కొయేటికి పోయి వున్నారు. నాలుగేండ్లు అక్కడ వుండి సంపాదించిన దుడ్డుతో మిద్దెలు కట్టుకున్నారు. భూమి బుఁ్రా కొనుక్కున్నారు.  కోయేటికి పోయినోడు మారాజే. అక్కడ పరిస్థితి ఏమో ఎవడికీ తెలియదు గానీ కొయేటికి పోతే మాత్రం అదొక గొప్ప.

ఇంగ ఆలశ్యం ఏముంది. కోయేటికి పోవాలంటే చాలు ఏజెంట్ పరిగెత్తుకోని వస్తాడు. వాడి కమీషను వాడికి కావాలి కదా. వాడూ బ్రతకాలి మరి.

అనుకున్న పనులన్ని తొందరగానే అయ్యాయి.

బిడ్డలు ఏడుస్తుంటే "దిగులు పడగాకండి. రెండేళ్ళు ఎంతలో వస్తాయి ఇట్టబొయ్యి అట్ట దుడ్డు బాగా సంపాదించుకొని తిరుక్కోని వస్తా గదా. నెలకొక్క జాబు రాస్తా గదా" అంటూ వీడ్కోలు చెప్పింది.

అక్కడ కష్టం ఎలా వుంటుందో తెలియదు కానీ ఇప్పుడు మాత్రం విమానం ఎక్కుతున్నానని వేరే దేశం వెల్తున్నానని భలే కుశాలగా వుంది రమణమ్మకు.

మనసంతా మబ్బుల్లో తేలుతుంటే తీయనికలలు కంటూ  కోయేటికి పొయ్యే విమానమెక్కింది రమణమ్మ.